# సుందర జానపదం

## జానపద సాహిత్య స్వరూపం

## తెలుగు-కన్నడ జానపద గేయాలు

ఆర్వీయస్.సుందరం

సౌశీల్య

2017

*SUNDARA JAANAPADAM-*
Two books on Folk Literature by Dr.R.V.S.Sundaram

Pages: xii+**315**
పుటలు: xii+315

First impression: April 2017
మొదటి ముద్రణ : ఏప్రిల్ 2017

Price: Rs.200
వెల: రూ. 200

For Copies:
Prof.R.V.S.Sundaram
498,Chitrabhanu Road
Kuvempunagar, Mysore-570023
Ph:09844015759
Email:rvssundaram@gmail.com

అక్షరాలంకరణ : డాక్టర్ కోదండ లక్ష్మణ
ముఖచిత్రం : శ్రీమతి మంజుళా మురళి
Printed at: Keerthana Graphics, Mysore
Email: keerthangraphics@gmail.com





# నా మాట

50 ఏళ్ళకు పైగా రాయటం, చదవటమే జీవన విధానం అయిపోయింది. మా నాన్నగారు, ఇతర బంధువులు చాలా వరకు ఉపాధ్యాయులే. జీవితంలో ఉద్యోగమంటూ చేస్తే బోధించే వృత్తినే చేపట్టాలని చిన్ననాటే నిర్ణయించుకున్నాను. అలాగే 1969 నుండి నేటి వరకు ఏదో విధంగా బోధన, పరిశోధన, ప్రచురణ కొనసాగిస్తూనే ఉన్నాను. ఇవన్నీ 48 ఏళ్ళుగా సాగుతూనే ఉన్నాయి. వందకుపై పుస్తకాలు ప్రచురించినా ఇంకా రాయాలని, ప్రచురించాలని ఆసక్తి మాత్రం అలాగే ఉంది. పదవీ విరమణ చేసిన తర్వాత కూడా పెన్సిల్వేనియా విశ్వవిద్యాలయం వారు సందర్శకాచార్యునిగా నా బోధన కొనసాగేట్లు చేశారు.

నా ఈ ప్రగతికి కారణం గురువర్యులు, స్నేహితులు, ఆత్మీయులైన ప్రతి ఒక్కరూ. నాకు అన్ని విధాలా చేదోడు వాదోడుగా ఉంటూ సహకారం అందిస్తున్న ఆచార్య మాడభూషి సంపత్‌కుమార్ గారికి ధన్యవాదాలు. ఈ పుస్తకం వెలుగు చూడటానికే కాక నాకు అన్ని విధాలా సహాయ సహకారాలు అందించిన వారందరికీ కృతజ్ఞతలు తెలుపుకుంటున్నాను.

మైసూరు — ఆర్వీయస్. సుందరం
మహావీర జయంతి
09. 04. 2017

# ఆర్వీయస్ సుందరం రచనలు

**కవిత**

1.ఆధునిక వేమన శతకము – 1969
2.దిగంబర కవిగళు (కన్నడం) – 1972
3.పిటీలు రాగగళ డజన్ (కన్నడం) – 1976
4.గొరిల్లా (కన్నడం) – 1980
5.నిద్రాపుష్పం – 1985
6.సుందర ప్రభవ – 1987
7.నది – నగరం – 1996
8.అక్షరదల్లి అంతరిక్ష (కన్నడం) – 2000, 2009
9.అనీల ఆరాధనా (కన్నడం) – 2012
10. All Alone in the Sky - 2002
11.చండాల స్వర్గారోహణం – 2002

**నవల – కథ**

1.సంస్కారం
2.ఆకాశగంగ – 1975
3.సంగవిజయ (కన్నడ) – 1986
4.భావన (యాత్రానవల) – 1993
5.విద్యార్థి – 1995
6.చిదంబర రహస్యం – 1996
7.సావిర హెడెగళు (కన్నడం) – 2000
8.బిరుగాళి (కన్నడం) – 2000

**విమర్శ – పరిశోధన**

1.తెలుగు సాహిత్యములో దేశికవిత – 1970
2.కన్నడ సాహిత్య చరిత్ర – 1977
3.తెలుగు భాషె మత్తు సాహిత్య (కన్నడం) – 1981
4.పాల్కురికె సోమనాథ (కన్నడం) – 1983





5.పరిశోధన పద్ధతులు – 1990, 2009
6.దిగంబర కవిగళు (కన్నడం) – 2002
7.దక్షిణ భారతీయ సాహిత్య (కన్నడ) – 2005
8.విశ్వవిద్యాలయగళల్లి కన్నడ సంశోధనె (కన్నడం) – 2006, 2009
9.కన్నడ – తెలుగు సంబంధ (కన్నడం) – 2010
10.గ్రంథ పరిష్కరణ శాస్త్రం – 2011
11.శాస్త్ర సాహిత్య (కన్నడం) – 2012
12.సంశోధనెయ తత్త్వ మత్తు విధాన (కన్నడం) – 2013

**ప్రాచీన విశిష్ట సాహిత్యం**

1.నన్నయ భారతం, వచనం (ఆది సభాపర్వాలు) – 1993
2.క్రీడాభిరామం (కన్నడం) – 2000
3.కాటమరాజన కథె (కన్నడం) – 2000
4.పోతన భాగవతం (తెలుగు – కన్నడం), 8 సంపుటాలు – 2014
5.కవిరాజమార్గం (కన్నడం) – 2014
6.ఉదయాదిత్యాలంకారం (కన్నడం – ఇంగ్లీషు) – 2015
7.ఆంధ్రశబ్దచింతామణి (సంస్కృతం, తెలుగు, ఇంగ్లీషు) – 2016

**జానపద విజ్ఞానం**

1.అలిచిప్పలు – ఆణిముత్యాలు – 1972
2.జానపద సాహిత్య స్వరూపం – 1976, 1993
3.జానపద సాహిత్యద మూలతత్వగళు (కన్నడం) – 1976
4.తెలుగు – కన్నడ జానపద గేయాలు – 1979
5.జానపద విజ్ఞాన స్వరూపం – 1980
6.జానపద సాహిత్యం – 1982
7.ఆంధ్రుల జానపద విజ్ఞానం – 1983, 1993, 2003, 2016
8.కర్నాటకాంధ్ర యక్షగాన సమీక్షె (కన్నడం) – 1985
9. Studies in Folkloristics - 1986
10.ఆంధ్ర ప్రదేశ్ జానపద (కన్నడం) – 1987
11.జానపద తత్వగళు (కన్నడం) – 1987
12.జానపద సాహిత్య సౌరభం – 2002

13. Folk Intelligence and other essays - 2008
14. దక్షిణ భారతీయ జానపద కోశ (కన్నడం) – 2011
15. దక్షిణ భారతీయ జానపద విజ్ఞాన కోశం – 2011
16. దక్షిణ భారతీయ దేశీకృషి విజ్ఞాన కోశ (కన్నడం) – 2015
17. దేశీ ఆహార పద్ధతి (కన్నడం) – 2015

**భాష – భాషా విజ్ఞానం**

1. కన్నడ స్వయం బోధిని – 1977
2. భాషె మత్తు భాషా విజ్ఞాన (కన్నడం) – 1978
3. ధ్వని విజ్ఞాన (కన్నడం) – 1979
4. తేనె లొలుగు తెలుగు పలుకు – 2006
5. చెన్న కన్నడ (కన్నడం) – 1979
6. ప్రాచీన భాషగా తెలుగు – 2008
7. శాస్త్రీయ కన్నడ భాషె (కన్నడం) – 2009
8. వజ్రకోశం – 2011
9. తెలుగు కరదీపిక – 2011

**జీవిత చరిత్రలు**

1. పుట్టప్ప కథ – 1975
2. పట్టాభి సీతారామయ్య (కన్నడం) – 1980
3. కోలవెన్ను రామకోటీశ్వరరావు (కన్నడం) – 1080
4. పంజె మంగేశరావ్ – 1981
5. డాక్టర్ సి.ఆర్. రెడ్డి (కన్నడం) – 1986
6. రచనాస్వాదనం – 1994
7. బరెహద బదుకు (కన్నడం) – 2008

**సంపాదకత్వం**

1. అనంతరాగం – 1977
2. రాళ్ళపల్లి పీఠికలు – 1979
3. పఠాభి పన్‌చాంగం – 1980
4. భాష – జానపదం – 1981





5. తెలుగు పాఠ్యగ్రంథం – 1978
6. తెలుగు సాహిత్య ప్రవంతి – 1980
7. శేషేంద్ర చమత్కారికలు – 1987
8. చీని సాహిత్య (కన్నడం) – 1989
9. జాపనీస్ సాహిత్య (కన్నడం) – 1990
10. యహూది సాహిత్య (కన్నడం) – 1991
11. అమృత సంపుట (కన్నడం) – 1994
12. సంశోధన పథ (కన్నడం) – 2006
13. పాల్కురికి సోమనాథన లఘుకృతిగళు (కన్నడం) – 1010
14. శ్రీరామాయణ మహాన్వేషణం – 2012

**పిల్లల సాహిత్యం, నవాక్షరాస్య సాహిత్యం**

1. బాలధ్రువుడు – 1970
2. కుట్టొకుట్టొ మళెరాయ (కన్నడం) – 1984
3. మాట, మంత్ర, మోడి ఎష్టు సత్య? (కన్నడం) – 1989
4. మహాభారతద నీతి కథెగళు (కన్నడం) – 1995
5. మోడ – మించు – గుడుగు – సిడిలు (కన్నడం) – 1995
6. అవతారగళు (కన్నడం) – 2001
7. అవతారగళు మానవసృష్టి (కన్నడం) – 2004
8. సైకల్ (కన్నడం) – 2006
9. గ్రహణ (కన్నడం) – 2006

**ఇతర రచనలు**

1. దాక్షాయణి – 1980
2. కన్నడ సంస్కృతి వైభవం – 1990
3. ఆయిల్ పుల్లింగ్ (కన్నడం) – 1998
4. దేశి – దేశీయతె – దేశీవాద (కన్నడం) – 2003
5. సుందర కృతి సంపుట: పుస్తకగళు (కన్నడం) – 2009
6. సుందర కృతి సంపుట: లేఖనగళు (కన్నడం) – 2009
7. సుందరం రచనలు: సృజన – 2013

## మొదటి పుస్తకం

# జానపద సాహిత్య స్వరూపం

1976లో మొదటి సారిగా ఆధునిక జానపద విజ్ఞాన అధ్యయన పద్ధతుల్ని పరిచయం చేస్తూ వెలువడిన పుస్తకం. అనేక విశ్వవిద్యాలయాలలో పాఠ్యగ్రంథమయింది. విశాలాంధ్ర వారు 1993లో పునర్ముద్రించారు.





## మంగళాశాసనం

వర్ధిష్ణువు డాక్టర్ రాళ్ళపల్లి సుందరం వ్రాసిన “జానపద సాహిత్య స్వరూప” మన్న ఈ చిన్నపుస్తకం శాస్త్రానికి ప్రకరణ గ్రంథం వంటిది. శాస్త్ర గ్రంథాలకు షడ్విధలింగ విచారం చేయడమన్నది మన ప్రాచీనుల పద్ధతి. అందులో ‘అపూర్వత’ అనేదొకటి. ఏ యితర గ్రంథం వల్లను తెలియరాక ప్రసక్త గ్రంథం వల్లనే ఒక విషయం తెలియవచ్చుట ‘అపూర్వత’ అవుతుంది. దానికి ‘ఫలము’ కూడా ఉంటుంది. ఈ పుస్తకంలో ఈ రెండూ ఉన్నాయి.

మానవుని ముగ్ధప్రకృతి, సృష్టివలెనే, అనాది. దానికి జానపదులు, నగరవాసులన్న భేదం లేదు. సంస్కారం పేరుతో కృత్రిమతా వివశులైన నగరవాసులకంటే జానపదులెక్కువగా ముగ్ధత మెఱుస్తారు గనుకనే ముగ్ధతా ప్రధానమైన భాషా సంబంధ రచనలకు ‘జానపద’ దళవిశిష్టత యేర్పడింది. ఈ రచనలు దోషహీన, గుణోపాదాన, అలంకారయుక్తతా రసా వియోగత్వములనే సంస్కారాలు చాలమిని ‘సాహిత్య’ మనరాక, లేఖన దూరములగుటచేత ‘వాఙ్మయ’ మనరాక, ‘సారస్వత’ మనబడటమే లెస్స అని నా తలంపు.

జానపద సారస్వతం కూర్పులోను, తార్పులోను బాహాటంగా సమష్టిపరం. కలాదృష్టితో దాని అధ్యయనానికి ఫలం వైచిత్రిమాత్రం. సమాజ దృష్టితో దాని అధ్యయనానికి ఫలం విజ్ఞానం. ఈ విజ్ఞానం మానవ శాస్త్ర (Anthropology) పరంగాను, సమాజశాస్త్ర (Sociology) పరంగాను మనస్తత్త్వశాస్త్ర (Psychology) పరంగాను పాయలౌతుంది. ఈ విజ్ఞాన వివేకా లెవరికైనా జీవిత గాంభీర్యాన్నెఱుకపరుస్తా యనడంలో సందేహం లేదు.

ఇంక తెనుగునాట జానపద సారస్వతాధ్యయనం ఇప్పుడిప్పుడే పుంజుకొంటున్నది. ఈ శాఖలో కృషిచేసిన ఆచార్యులు, పెద్దలు కొందఱైనా మనకూ ఉన్నారు. కాని పాశ్చాత్య దేశాల్లోనూ, కర్నాటకం లాటి మన యిరుగు పొరుగు ప్రాంతాల్లోను జరిగినంత కృషి తెనుగునాట జరగలేదన్న కొదవ ఒకటుంది. ఇందునుగూర్చి మిక్కిలిగా కొదవపడుతున్న వాళ్ళలో ఈ గ్రంథకర్త–రాళ్ళపల్లి సుందరం–ఒకడు. జానపద సారస్వత పరంగానే కృషిచేసి డాక్టరేట్ పట్టం పొందినాడు. తెనుగుతోపాటు కన్నడంలోనూ ఎం.ఏ. పట్టభద్రుడు. ప్రసుత్తం మైసూరులోని ‘కన్నడ

అధ్యయన సంస్థ'లో తెలుగు ఉపన్యాసకుడు, జిజ్ఞాసువు. ఈ గ్రంథంలో జానపద గేయాలు, కథాగేయాలు, గద్యకథనాలు, సామెతలు, పొడుపు కథలు అనే విషయాల మీద శాస్త్రీయమైన చర్చ ఉంది. స్వతంత్రాభిప్రాయాలూ ఉన్నాయి. అభిరుచి, అనుభవం, పరిశ్రమ- ఈ రచనలో స్పష్టంగా కనబడతాయి. జానపద విజ్ఞాన, సారస్వతాలకు సంబంధించిన అనేకాంశాల్లో Andrew Lang ప్రతిపాదించిన బహుళోత్పత్తి (Polygenesis) వాదమే సమంజసంగా తోచుతుంది. జానపద సారస్వతానికి మేల్పడిన జిజ్ఞాసువులకు, విద్యార్థులకు ఈ గ్రంథం కైతోడుగా నిలవ గలదని నా నమ్మిక, డాక్టర్ సుందరం ఇతోధికంగా గ్రంథరచన చేసి తెనుగు సరస్వతి నారాధించి నెగడుటకు శ్రీనివాసుని కృపాకటాక్ష ముల్లసిల్లుగాక అని నా మంగళా శాసనము.

'ధీనా మవిత్ర్యవతు'

ప్రెసిడెన్సీ కళాశాల,

మద్రాసు, 27-4-76 సాళ్వ కృష్ణమూర్తి





# మున్నుడి

## రెండో ముద్రణకు

జానపద సాహిత్యాన్ని అర్థం చేసుకోవడానికి, అధ్యయనం చెయ్యడానికి శాస్త్రీయ అవగాహన అవసరం. జానపద గేయాలను మాత్రమే జానపద సాహిత్య మనుకునే కాలం ఒకటుండేది. ఆ తర్వాత తెలుగులో కూడా వీరగాథలు, సామెతలు, పొడుపుకథలు, కథలు, కళలు, సంప్రదాయాలు, నమ్మకాలు మొదలైన ప్రక్రియల మీద పరిశోధన జరిగింది. జానపద విజ్ఞానమనే అధ్యయన శాఖ ప్రత్యేకంగా ఉందనే అవగాహన కొందరిలోనైనా కలిగింది.

జానపద విజ్ఞానాన్ని గూర్చిన శాస్త్రీయ దృక్పథాన్ని తెలుగులో ప్రవేశ పెట్టడానికి నా వంతు కృషి నేనూ చేశాను. నాకు జానపద విజ్ఞానాన్ని గూర్చిన అవగాహన కలగడానికి మైసూరు విశ్వవిద్యాలయంలో ఎం.ఏ. జానపద విజ్ఞానం విద్యార్థులకు పదిహేనేళ్ళు బోధించడం చాలా వరకు తోడ్పడింది. ఈ పుస్తకాన్ని నేను మైసూరులోనే రాశాను(1976). అంతకు ముందే నా 'తెలుగు- కన్నడ జానపద గేయాలు' అనే సిద్ధాంత గ్రంథానికి మైసూరు విశ్వవిద్యాలయం పిహెచ్.డి. ఇచ్చింది(1973). జానపద విజ్ఞానంలోని అన్ని శాఖలనూ పరిచయం చేసే నా 'ఆంధ్రుల జానపద విజ్ఞానం' గ్రంథానికి కూడా మైసూరు విశ్వవిద్యాలయమే డి.లిట్. డిగ్రీ ఇచ్చింది(1987). ఇవికాక జానపద విజ్ఞానానికి సంబంధించిన ఏడెనిమిది పుస్తకాలు తెలుగులో, కన్నడంలో, ఇంగ్లీషులో రాశాను. అయినా మొదటినుంచి 'జానపద సాహిత్య స్వరూపం' మీద చాలామంది తెలుగు పాఠకులు ఆసక్తి చూపుతున్నారు. జానపద సాహిత్యాన్ని గూర్చిన శాస్త్రీయ దృక్పథాన్ని కలిగించడానికి తెలుగులో వెలువడిన మొదటి పుస్తకమిది. దీన్ని చాలా విశ్వవిద్యాలయాలు జానపద సాహిత్య విద్యార్థులకు సంప్రదింపు గ్రంథంగా సూచించాయి. మొదటి ముద్రణ ప్రతులు అచిర కాలంలోనే చెల్లిపోయాయి. ఇన్నాళ్ళకు మళ్ళీ రెండో ముద్రణ తీసుకు వస్తున్నందుకు విశాలాంధ్ర ప్రచురణాలయం వారికి ధన్యవాదాలర్పిస్తున్నాను.

నా పుస్తకాన్ని గూర్చి నాలుగు మంచిమాటలు చెప్పిన గురువర్యులు డా. సాళ్వ కృష్ణమూర్తిగారికి, ఆ తర్వాత పుస్తకాన్ని మెచ్చుకొని వెన్నుతట్టిన ఆచార్య బి. రామరాజుగారి లాంటి ఎందరో విద్వాంసులకు, మిత్రులకు ధన్యవాదాలు. దీన్ని ఎన్నో విధాలుగా ఉపయోగించుకొని జానపద విజ్ఞాన క్షేత్రంలో నేను కొనసాగడానికి దోహదం చేసిన విద్యార్థులకు, పరిశోధకులకు కూడా నేను ధన్యవాదాలు చెప్పక తప్పదు.

మానస గంగోత్రి,మైసూరు-6

28-5-1993 ఆర్వీయస్. సుందరం

# ఇందులో

| | |
|---|---|
| ప్రవేశిక | 1 |
| 1.జానపద గేయాలు | 7 |
| 2.కథా గేయాలు | 18 |
| 3.గద్య కథానాలు | 30 |
| 4.సామెతలు | 45 |
| 5.పొడుపు కథలు | 57 |
| ఆధార గ్రంథాలు | 67 |
| పారిభాషిక పదాలు | 68 |





# ప్రవేశిక

**జానపద విజ్ఞానం- జానపద సాహిత్యం :**

జానపద విజ్ఞానాన్ని Folklore కు, జానపద సాహిత్యాన్ని Folk literature కు సమానార్థకాలుగా మనం తెలుగులో వాడుతున్నాం. కొందరు ఈ రెండు పదాలకు ఉండే భిన్నార్థాలను గమనించకపోడం కూడా జరుగుతున్నది. 'Folklore' అనే పదాన్ని 1846 లో W.J.Thoms రూపొందించాడు. అంతవరకు 'Folklore' బదులు 'Papular Antiquities' అనే పత్రికకు వ్రాసిన ఒక ఉత్తరంలో 'Folklore' అన్న పదాన్ని సూచిస్తూ Thoms దాని అర్థాన్ని కూడా కొంతవరకు సూచించాడు. Folklore లో చేరదగినవిగా "manners, customs, observances, superstitions, ballads, proverbs" మొదలైనావాటిని పేర్కొన్నాడు.

జానపదానికి సంబంధించిన విజ్ఞానం, లేక జనపదులకు సంబంధించిన విజ్ఞానం జానపద విజ్ఞానమని చెప్పడం చాలా తేలిక. కాని జానపదులు (Folk) అంటే ఎవరు అన్నదే సమస్య. జనపదమంటే గ్రామమని అర్థం ఉంది జానపదులంటే పల్లెటూరివారు. కేవలం పల్లెటూరివారికి సంబంధించినదే జానపద విజ్ఞానం అంటే అది సమగ్ర నిర్వచనం కాజాలదు. ఇంగ్లీషులోని Folk అన్న పదానికి కూడా "An inhabitant of the country; a peasant; a rustic" మొదలైన అర్థాలున్నాయి. Thoms కూడా Folk అనే పదాన్ని వాడినప్పుడు కొంతవరకు అనాగరికుడు, అక్షరజ్ఞానం లేనివాడు అనే అర్థం వచ్చేట్లు చెప్పాడు.[1] అయితే Folk అంటే కేవలం గ్రామీణులు అనే అర్థాన్ని ప్రస్తుతం జానపద విజ్ఞానులు అంగీకరించడం లేదు. నగరాలలో కూడా జానపదులు ఉంటారన్నది వీరి వాదం. అదీ నిజమే. ప్రస్తుతం గ్రామాలకు, నగరాలకు ఉండే భేదం చాలావరకు తక్కువవుతున్నది. నాగరికులు గ్రామాలకు, గ్రామీణులు నగరానికి రావడం జరుగుతున్నది. అచ్చమైన నాగరికతగాని, అచ్చమైన గ్రామీణతగాని లేదు. అంతేకాదు. నగరంలోనే పుట్టి పెరిగిన ఒక వ్యక్తి దైనందిన జీవనంలో జానపద విజ్ఞానానికి సంబంధించిన అంశాలను మనం చూడగలుగుతున్నాం. జానపదుల సొమ్ము అనుకుంటున్న నమ్మకాలు, ఆచారాలు, సామెతలు, పలుకుబళ్ళు నాగరికుల జీవితంలో కూడా భాగాలుగా ఉన్నాయి. అలాంటప్పుడు ఎవరు నాగరికులు? ఎవరు జానపదులు?

జానపద విజ్ఞానక్షేత్రంలో బంగారు పంటలు పండించిన మేధావి Alan Dundes Folklore అంటే ఏమిటి అన్న ప్రశ్నకు సమాధానం చెప్పడానికి ప్రయత్నించాడు. Folk అంటే గ్రామీణులుకాదంటూ అంటాడు "There are still some folklorists who mistakenly identify the folk with peasant society or rural groups. If one were to accept this narrow conception of folk, then by denfiniton one would have to conclude that city dwellers were not folk and hence city dwellers could have no folklore"[2] నగరాలలో కూడా జానపద విజ్ఞానం ఉంటుందని చెప్పడమే కాకుండా దండెస్ జానపద విజ్ఞానం ఎప్పుడో ప్రాచీన కాలంలో మాత్రమే సృష్టింపబడినదనటం కూడా తప్పేననీ, ఇప్పటికి దాని నిర్మాణం జరుగుతూనే ఉన్నదనీ అంటాడు.

అలన్ దండెస్ అభిప్రాయం ప్రకారం 'ఫోక్' అంటే సమాన ధర్మాలు కల జనుల గుంపు. "The term folk can refer to any group of people what so ever who share atleast one common factor. It does not matter what the linking factor is - it could be am occupation, language, or religion-but what is important is that a group formed for whatever reason will have some traditions which it calls its own."[3]

సమాన సంప్రదాయాలు, ఆచారాలు కల జన సముదాయం 'ఫోక్' అని తేలింది. ఇక్కడ ' సముదాయం' అన్నది చాలా ముఖ్యం. 'ఫోక్' అంటే ఒక్కరికి సంబంధించింది కాదు; ఒక జనసముదాయానికి సంబంధించింది. ఆ జన సముదాయం ఒక మతానికో, ప్రదేశానికో, భాషకో, వయస్సుకో, వృత్తికో సంబంధించినవారై ఉండాలి. అందుకే women folk, student folk, Andhra folk మొదలైన పదా లేర్పడ్డాయి. అంతేకాదు. ప్రతి మనిషీ ఏదో ఒక సందర్భంలో జానపదుడు కానే అవుతాడు. విశ్వవిద్యాలయాలలో చదివే విద్యార్థులు కానివ్వండి, కార్ఖానాలలో పనిచేసే కార్మికులు కారివ్వండి– అందరూ ఏదో ఒకచోట, ఒక సందర్భంలో జానపదులలాగా ప్రవర్తిస్తారు. అంటే folk లేక జానపదులు అన్నవారు వేరుగా ఉన్నారనడం కంటే 'జానపదత్వం' ఉండేవారు జానపదులనడం మేలు.

జానపద విజ్ఞానంలో భాగంగా మనం అధ్యయనంచేసే నమ్మకాలు, ఆచారాలు, సామెతలు, పొడుపు కథలు, గేయాలు, కథలు, భంగిమలు, రూపకాలు, ఆటలు, సంగీతం మొదలైనవన్నీ పరిశీలించినప్పుడు మనకు ఒక విషయం స్పష్టం గాక మానదు.





ఇవన్నీ ఒకానొక మానసిక స్థితిలో సృష్టి అవుతాయి. మానవుని పుట్టుక నాటినుంచి నేటివరకు జరిగిన మానసిక పరిణామాన్ని మనస్తత్వశాస్త్ర, మానవశాస్త్రాల సహాయంతో అధ్యయనం చేశామంటే, మానసిక పరిణామంలో అనేక దశలను గుర్తించవచ్చు. ప్రతి మానవుడిలోనూ ఈ మానసిక స్థితులు ఉంటాయి. అవి ఒక్కొక్క క్షణంలో ఒక్కొక్క విధంగా వ్యక్తమవుతుంటాయి. ఆదిమ మానవుడి మనస్తత్వం పిల్లల మనస్తత్వం వంటిది. ఆ మానసిక స్థితిలో ఆదిమ మానవుడు జానపద విజ్ఞానంలో మనం అధ్యయనం చేసే అనేక విషయాలను సృష్టించాడు. అంటే మొత్తం మీద మనం జానపద విజ్ఞానాన్ని ఈ విధంగా నిర్వచించవచ్చు: మానవుని మానసిక పరిణామంలోని ఒక దశవరకు వెలువడే ఆలోచనల ఫలితంగా అవతరించిందే జానపద విజ్ఞానం. లేక దీన్నే మరోవిధంగా చెప్పవచ్చు: ప్రాచీన మానవుని మనస్సును ప్రతిబింబించేలా సాంప్రదాయికంగా, సామూహికంగా వెలువడేదే జానపద విజ్ఞానం. వేటాడే మానవుడు తను వేటాడిన జంతువుల్ని ఒకచోట వేసి చుట్టూ ఆడుతూ పాడుతుంటే అదీ జానపద విజ్ఞానమనే అనిపించుకుంటుంది. విశ్వవిద్యాలయంలో చదివే విద్యార్థి గోడలమీద అశ్లీల చిత్రాలు వేసే సంప్రదాయయూ (latrinalia-writings on the walls of public bath rooms) జానపద విజ్ఞానమే అవుతుంది. అయితే ఒకానొక మానసిక స్థితిలో వెలువడినదంతా Folklore కాదు. అది జానపద విజ్ఞానంలో ఒక భాగం కావాలంటే దానికి ఒక సంప్రదాయమంటూ (tradition) ఏర్పడాలి. అంటే ఆదిమానవుని చిత్తవృత్తిని పోలిన మానసిక స్థితిలో వెలువడి, ఒక సంప్రదాయాన్ని ఏర్పరుచుకున్న అంశాలు జానపద విజ్ఞానంలో భాగాలన్నమాట. ఇవి ప్రాచీన కాలంలో వెలువడి ఈనాటి వరకు కొనసాగవచ్చు. లేదా ఈ కాలంలోనే వెలువడి ఒక సంప్రదాయాన్ని పొందవచ్చు.

జానపద విజ్ఞాన మన్నది చాలా విశాలక్షేత్రం. జానపద సాహిత్యం అందులో ఒక భాగం మాత్రమే. జానపద విజ్ఞానాన్ని ముఖ్యంగా రెండు విభాగాలుగా చేయవచ్చు. 1.Verbal folklore, 2. Non-verbal folklore (వాగ్రూపమైనవి లేక మౌఖికాలు, వాగ్రూపం కానివి). గేయాలు, కథలు, సామెతలు మొదలైనవాటిని verbal arts అని పిలుస్తారు. వాగ్రూపం ప్రచారాన్ని పొందే కళలు మాత్రమే జానపద విజ్ఞానం అనే తప్పు అభిప్రాయంకూడా ఉంది. కాని నమ్మకాలు, ఆచారాలు, దుస్తులు, అలంకారాలు మతం వగైరాలుకూడా జానపద విజ్ఞానంలోనే చేరుతాయి.

జానపద విజ్ఞానాన్ని Richard M.Dorson అనే జానపద విద్వాంసుడు తన Folklore and Folklife అనే పుస్తకంలో నాలుగు శీర్షికల క్రింద పరిశీలించాడు.

అవి: 1. Oral Folklore (కథా గేయాలు, సామెతలు, పొడుపు కథలు మొదలైనవి).
2. Social Folk custom (పండుగలు, వినోదాలు, వైద్యం, జానపద మతం మొదలైనవి)
3. Material culture (చేతిపనులు, వేషభూషణాలు, వంటా వార్పూ మొదలైననవి).
4. Folk Arts (రూపకాలు, సంగీతం, నృత్యం). ఈ విభజనలో కూడా కొన్ని లోపాలు లేకపోలేదు. భంగిమలు మొదలైన వాటికి ఇందులో అవకాశం లేదు. కళగా మనం పరిగణించే కవిత్వం వాగ్రూపమైన కళగా పరిగణించబడింది. జానపద కళలలో సంగీతం, నృత్యం, రూపకమేగాని చిత్రకళ చేరలేదు. అది వస్తువులలో చేర్చబడింది. ఈ విధంగా అతివ్యాప్తులు, అవ్యాప్తులు, చిన్నలోపాలు ఉన్నాకూడా అది జానపద విజ్ఞానంలోని వైవిధ్యాన్ని తెలుపుతుందేగాని, వింగడించిన విజ్ఞాని లోపం మాత్రం కాదు.

జానపద విజ్ఞానాన్ని శాస్త్రీయంగా విశ్లేషించి అధ్యయనం చేయడానికి అనుకూలంగా వింగడించడానికి ప్రయత్నించినవారిలో R.S.Boggs ముఖ్యుడు. శాఖోపశాఖలుగా విస్తరించుకొనివున్న జానపద విజ్ఞానాన్ని, అందులోని సూక్ష్మాతిసూక్ష్మాంశాల్ని పరిశీలించడానికి Boggs వర్గీకరణ ఉపయోగిస్తుంది. జానపద సాహిత్యంలోని వివిధ శాఖలను అధ్యయనం చేసేటప్పుడు Boggs వర్గీకరణను కూడా ఇవ్వడం తప్పనిసరి కాబట్టి ఆయన వర్గీకరణ విధానాన్ని తెలుసుకోవటం ముఖ్యం. జానపద విజ్ఞానంలో మనం తెలుసుకోవలసిన ముఖ్యాంశాలను Groups అనే పేరుతో Boggs విభజించాడు. వీటికి గుర్తులుగా ఇంగ్లీషులోని A B C D వగైరాలను ఉంచాడు. అంటే మొత్తం జానపద విజ్ఞానాన్ని మొదట ఈ క్రింది విధంగా Groups గా విభజించాడు.

A. General Folklore

B. Prose Narrative

C. Ballad Song Dance Game Music Verse

D. Drama

F. Custom Festival

G. Geography

L. Language

M. Art Craft Architecture

N. Food Drink





P. Belief

S. Speech

V. Proverb

W. Riddle

తర్వాత పై Groups లో ఒక్కొక్కదాన్ని కొన్ని Categories గా విభజించాడు. అంటే B అన్నది Prose Narritive కదా! దానిలో మరో మూడు categories ఉన్నాయి. అవి-B 200 Myth, B 400 Legend, B 600 Tale. ఈ మూడు categories లో ఒక్కొక్కదాన్ని మళ్ళీ Types గాను Types ను Forms గాను Forms ను Division గాను Divisions ను Sub-division గాను Boggs విభజించాడు. అంటే ఈ వర్గీకరణవల్ల ఏ సూక్ష్మాంశాన్నయినా, దాని స్థానంలో దానిని ఉంచి స్పష్టంగా చెప్పడానికి వీలవుతుంది. ఉదాహరణకు జ 324 అని చెప్తే చాలు- ఆది సంతోషగీతం అని తెలుస్తుంది. C అంటే Song Ballad మొదలైనవి, C 300 అంటే జానపద గేయం, C 320 అంటే రసానికి సంబంధించిన గేయాలు, C 324 అంటే సంతోషమనే భావాన్ని తెలిపే పాటలు.

బాగ్స్ వర్గీకరణవల్ల మనకు రెండు ప్రయోజనాలున్నవి. మొదటిది ప్రపంచంలో ఏ ప్రాంతానికి చెందిన అంశాన్నయినా శాస్త్రీయంగా విశ్లేషించడానికి పనికివస్తుంది. రెండవది జానపద విజ్ఞానంలో ఏయే అంశాలు వస్తాయి అన్నది తెలియటంవల్ల దాని స్వరూపం కొంతవరకు బోధపడుతుంది.

బాగ్స్ వర్గీకరణనీ, డార్సన్ విభాగాన్నీ, ఇంకా ఇతర జానపద విజ్ఞానుల రచలల్నీ చూచినప్పుడు జానపద విజ్ఞానంలో సాహిత్యగంధం ఉండే కొన్ని అంశాలు ఉన్నట్లు మనకు తెలుస్తుంది. అవి వాగ్రూపమైనవి. జానపద సాహిత్యం అనే పేరుతోగాని, వాగ్రూపమైన కళలు అనే పేరుతో గాని మనం పిలవదగిన వాటిలో ముఖ్యంగా చేరేవి ఐదు. అవి 1. జానపద గేయాలు, 2. జానపద కథాగేయాలు, 3. గద్యకథనాలు, 4. సామెతలు, 5. పొడుపు కథలు.

జానపద విజ్ఞానమనే విశాల క్షేత్రంలో జానపద సాహిత్యం అన్నది ఒక భాగమని చెప్పడంతో బాటు, జానపద విజ్ఞానంలో మనం గమనించ వలసిన అంశాలను గురించి International Encyclopaedia of the Social Sciences లో ఉన్న ఈ క్రింది మాటలను చూచి తెలుసుకోవచ్చు: "Folklore means folk learning; it comprehends all knowledge that is transmitted by word of mouth and all crafts and techniques

that are learned by imitation or example as well as the products of these crafts. Folklore includes folk art, folk crafts, folk tools, folk costume, folk custom, folk belief, folk medicine, folk recipes, folk music, folk dance, folk games, folk gestures, and folk speech as well as those verbal forms of expression which have been called folk literature but which are better described as verbal art."[4]

పైన ఉదారించిన విజ్ఞాన సర్వస్వంలోనే వాగ్రూపమైన కళలు లేక జానపద సాహిత్యంలో "folk tales, legends, myths, proverbs, riddles and poetry" చేరుతాయన్న అభిప్రాయం వ్యక్తమయింది.[5] కథలు, ఐతిహ్యాలు, పురాణాలు– ఈ మూటినీ కలిపి గద్యకథనాలు (Prose narratives) అంటారు. సామెతలు, పొడుపు కథలు ప్రత్యేకంగా పరిగణింపబడిదగిన వైశిష్ట్యం కలవి. ఇక జానపద కవిత్వంలో జానపద గేయాలు, జానపద కథాగేయాలు అని రెండు భాగాలున్నాయి. Folk Literature అనే పదానికి సమానార్థకంగా తెలుగు పండితులు ప్రజా వాఙ్మయము, అనాదృత వాఙ్మయము. మధుర కవితలు, దేశీ సారస్వతము మొదలైన పేర్లెన్నిటినో వాడారు. కాని వీటిన్నిటికీ అతివ్యాప్తి, అవ్యాప్తి దోషాలున్నాయి. జానపద సాహిత్యమనే పేరే ఎక్కువగా ప్రచారంలో ఉంది. అదే మెరుగైన పదం అని చెప్పవచ్చు. Verbal arts, Oral literature అనే పదాల ననుసరించి వాగ్రూపమైన కళలు లేక సాహిత్యమని కూడా పిలవవచ్చు.

**టిప్పణి**

1. "When Thoms first coined the word, he defined it be the lore of the folk.By the later term he meant the unlettered peasantry"-Encyclopaedia Britannica, Vol.9.p.519
2. The study of Folklore, p.2
3. The study of Folklore, p.2
4. p.496-97
5. p.497





# 1.జానపద గేయాలు

జానపద విజ్ఞానానికి సామాన్యంగా అన్వయించే లక్షణాలతోబాటు, కొన్ని విశిష్టగుణాలను కలిగిన జానపద గేయాలు వాగ్రూపమైన కళలలో అత్యంత ప్రధానమైన స్థానాన్ని ఆక్రమిస్తాయి. జానపద గేయాలకు గాని, కథా గేయాలకుగాని, మరే సాహిత్య శాఖకుగాని అన్వయించే సామాన్య గుణాలు కొన్ని ఉన్నాయి. 1.ఆదిమ మానవుని చిత్తవృత్తిని ప్రతిబింబించే మానసిక స్థితిలో వెలువడడం, 2. వాగ్రూపమైన ప్రసారం కలిగి వుండడం (Oral transmission), 3. ఒక సంప్రదాయం ఏర్పడడం, 4. అనేక రూపాలతో గోచరించడం(different versions) మొదలైన లక్షణాలను జానపద సాహిత్యానికి మొత్తంమీద అన్వయించి చెప్పవచ్చు.

జానపద సాహిత్యానికి ఉండవలసిన లక్షణాలతోబాటు గీతరూపంగా ఉండడం, భావప్రధానమై ఉండడం, కథారహితంగా ఉండడమన్నవి జానపద గేయానికి విశిష్టంగా ఉండే లక్షణాలు. గేయ రూపంలో భావప్రధానంగా వెలువడే ఆశురచన జానపదగేయం అని నిర్వహించవచ్చు.

జానపద గేయానికీ (Folk song), జానపద కథా గేయానికి (Narrative poem) ఉండే భేదాన్ని ఇంకా కొందరు గమనించడంలేదు. ఈ రెండింటినీ వేరువేరుగా చూడడమే మేలు. Ballads లేక Narrative poems కూడా గేయాలే. అయితే Encyclopaedia Britannica లో చెప్పినట్లుగా "Ballads are a variety of folk songs; but they are sufficiently a group in themselves to be classed separately"[1] ఈ గేయాలకు, కథా గేయాలకు ఉండే భేదాన్ని స్పష్టంగా చెప్పాలంటే ఈ రెంటినీ కలపి చెప్పేటప్పుడు జానపద కవిత్వం (Poetry) అనే పదాన్ని వాడడం మంచిది. అప్పుడు జానపద సాహిత్యాన్ని ఈ క్రింది విధంగా విభజించవచ్చు–

జానపద సాహిత్యం

1.జానపద కవిత్వం 2.గద్యకథనాలు 3.సామెతలు 4.పొడుపు కథలు

జానపద కవిత్వం

1.గేయాలు 2.కథాగేయాలు

గద్యకథనాలు

1.పురాణాలు 2.జనప్రియ కథలు 3.ఐతిహ్యాలు

"ఆజ్ఞాత కర్తృత్వం, సామూహిక ప్రచారం. వాక్సంప్రదాయం, జనప్రియత్వం, సారళ్యం, అనేకుల మనస్సుల నాకర్షించి సంపాదించిన జాతీయత" జానపదగేయ లక్షణాలని Chamber's Encyclopaedia చెప్తున్నది. జానపద గేయాలకు నియమిత లక్షణాలు కనిపిస్తాయి. జానపదత్వం కలిగి ఉండడమే జానపదగేయం ప్రధాన లక్షణం. వాడుకలో ఉండే అన్ని గేయాలూ జానపదగేయాలు కాలేవు. అది ఒక్కరిచేత కల్పితమైనదైనా, పలువురి సృష్టి అయినా జానపద విజ్ఞానానికి చెప్పిన సామాన్య లక్షణాలు జానపదగేయాలకూ ఉంటాయి.

జానపదగేయం అనగానే మరొక లక్షణమూ స్ఫురిస్తుంది. ఇవి గేయరూపంలో ఉంటాయి. అంటే అవి పాడడానికి అనువైనవి. మాటల్ని లయబద్ధంగా కూర్చే శక్తి జానపదులకుంది. మన మాటల్లో కనిపించని లయ అనాగరికుల మాటల్లో కనిపిస్తుంది.[2]

జానపద గేయానికి ప్రత్యేకంగా కవి అంటూ ఒకళ్ళు లేకపోవడం మరొక లక్షణం. జానపద గేయం వైయక్తిక సృష్టి అని కొందరూ సమష్టి సృష్టి అని మరికొందరూ అభిప్రాయపడుతున్నారు. అవి రెండు విధాలుగానూ వెలువడడానికి అవకాశం ఉన్నా, జానపదగేయంగా రూపొందేటప్పుడు సామూహిక పునఃసృష్టి (Communal re-creation) జరుగుతుందన్నది మాత్రం నిజం. ఎందుకంటే, నలుగురి నోళ్లలో నాని, నలుగురి చేతులు పడితేనే అది జానపదగేయం అవుతుంది. (న్యాయంగా చేతులు పడుతాయి అని చెప్పడం కూడా తప్పే. ఎందుకంటే, జానపద గేయాలను ఎవరూ వ్రాసి ఉంచరు కాబట్టి, ఇంకొంచెం సరిగ్గా చెప్పాలంటే నలుగురి మాటలు చేరితేనే జానపద గేయం అవుతుంది అనవచ్చు.) జానపద గేయానికి కవి లేడు అని చెప్తున్నాం కాబట్టి. అది స్వయంభువు అనవచ్చు. దీన్నే మరో విధంగా చెప్పాలంటే అవి అజ్ఞాత కర్తృకాలు. అంటే "Collective creations of the folk" (or re-creations) కావడం మూలంగా జానపద గేయాలను వ్రాసినవారు అప్రధానులవుతారు. మనస్తత్వ శాస్త్రవేత్త యూంగ్ ప్రతిపాదించిన ' సమష్టి సుప్తప్రజ్ఞ' సిద్ధాంతం (Collective unconscious) వీటి కన్వయిస్తుంది. ప్రాచీన కాలంనాటి సామాజిక జీవనంలో ఒక భాగమైన కర్మకాండలలో పాటలు ఎక్కువ ప్రాధాన్యం వహించేవి. మానవాతీత శక్తులకు తమ భావోద్వేగాన్ని బహిర్గతం చేసేందుకు ప్రాచీన మానవులు గీతాన్నాశ్రయించేవారు. ఆనాడు సామూహిక గీతాలే ఎక్కువ. "Primitive songs which is born from an elemental dramatiorite, is a communal activity. In a world





where ceremonies provide a main focus for social life, song is among the chief of them, and is used both to communicate with the supernatural and to express joy or grief or other strong emotions. Choral song is the more popular form in most primitive societies"[3]

పై లక్షణం మూలంగా జానపద గేయాలకు మరొక లక్షణమూ లభిస్తున్నది. అవి అజ్ఞాన కర్తృకాలవటంవల్ల వాటి రచనాకాలం మనకు తెలియదు. కాలం తెలియకపోవటంచేత జానపద గేయాలు పాతవీకావు, క్రొత్తవీ కావు. ఎందుకంటే, అవి నిత్యనూతనాలు.[4] "A folk song is neither new nor old because it is continually taking on new life. It is individual flowering on a common stem."

జానపద గేయం ఎప్పుడో, ఎక్కడో పుట్టి పలువురి నోళ్ళలో నాని తన స్వరూపాన్ని సతతం మార్చుకుంటూ ఉంటుంది. నోటిలో నాలుగు మాటలు తిరిగే ప్రతివాడూ, జానపద గేయానికి తానూ ఒక పాదం చేరుస్తుంటాడు. అందువల్ల జానపద గేయానికి నియమిత స్వరూపం అంటూ ఉండదు. నియమిత స్వరూపం లేకపోడమే జానపదగేయం యొక్క మరొక లక్షణం. "In order to remain satisfactory and memorable to the community a folksong must be founded on certain inflexible principles but constantly subjected to individual variation"[5] కొంతకాలం గడిచేసరికి గేయం స్వరూపమే మారిపోవచ్చు. ఒక్కొక్కసారి భాషే అర్థం కాదు. ఇలా నియమిత స్వరూపం లేకపోవడానికి కారణం సామూహిక కర్తృత్వమే. అంతేకాక, ఎప్పుడో రూపమెత్తిన జానపదగేయం పలువురి నోళ్ళలో పడడంవల్ల వివిధ పాఠాలను గలిగి ఉంటుంది. దీనికి చివరి స్వరూపం అంటూ ఉండదు. "There are texts but there is no text."

ఇవన్నీ చూచినపుడు మనకింకో లక్షణం స్పష్టమవుతూ ఉంది. జానపదగేయాలు వాగ్రూపమైన ప్రచారంవల్లనే జీవిస్తాయి. అవి వ్రాతరూపంలో ఉండడం చాలా విరళం. జానపదులకు వ్రాయడం, చదవడం తెలియాల్సిన అవసరం కూడా లేదు. ఒక్క జానపదగేయాలే కాదు– ప్రాచీన కవిత్వం చాలావరకు వ్రాయబడింది కాదు. "Primitive Poetry cannot be studied in the written literatures of the past, because by its nature it is unwritten, preliterate, only in exceptional conditions is it ever written down"[6] అనే మాటల్లో ఎంతో సత్యం ఉంది.

ఆశురచన జానపదగేయాల మరొక లక్షణం. కలాలు, కాయితాలు అవసరం

లేకుండా ఏవైనా భావాలు తక్షణ రూపాన్నివ్వడం ఆశురచన. "Poetry is the spontaneous overflow of powerful feelings" అన్న Wordsworth మాట జానపద కవిత్వానికి చక్కగా సరిపోతుంది. భావనిర్భరతవల్ల ఉద్భవించినవి జానపదగేయాలు. జానపదులకు ఆశుకవిత్వం చేప్పే శక్తి సహజంగానే ఉంది. జానపదులకు సంతోషం కలిగినప్పుడు, భయం కలిగినప్పుడు, దుఃఖం కలిగినప్పుడు భావావేశాన్ని వ్యక్తంచేయడానికి లయాత్మకమైన పదాలు వాటంతట అవే వస్తాయి. "తన మనోభావాన్ని ఎదుటివారితో చెప్పడం ఎప్పుడైతే మానవుడు నేర్చుకున్నాడో అప్పట్నుంచే కవిత్వం పుట్టుకొస్తుంది. మలమల మాడ్చే ఎండలు, హోరున కురిసే వర్షాలు, ముడుచుకుపోయే చలి, ఆనందంతో హృదయాన్ని ఉ(గ్రూతలూగించే పంటపోలాలు, శరీరాన్నంతటినీ కదలింపజేసే కష్టమైన పనులు, చావులు, పుట్టుకలు, పెళ్ళిళ్ళు, పేరంటములు, పండుగలు, పబ్బాలు, పూజలు– ఒక్కటేమిటి ప్రతీ సంఘటన, ప్రతీ సన్నివేశము పల్లెటూరివారి కవితావేశానికి మూలకందాలవుతూ వచ్చాయి."[7]

ఇలా తమ జీవతంలోని ప్రతి సన్నివేశాన్ని అనుభవించి ఆశువుగా పలికే ఈ గేయాల శైలి కృతకమైనది కాదని వేరే చెప్పనక్కరలేదు. వాటిది సహజశైలి, సరళత్వం, ముగ్ధత్వం ఈ గేయాల ప్రధానలక్షణాలు. ఈ సరళత్వంతోబాటు వాటిల్లో నవనవోన్మేషశాలినియైన ప్రతిభ కనపడుతుంది. జానపద కవిత్వానిది నిరాభరణ సౌందర్యం. స్వభావోక్తిఒక్కటే జానపదులు మెచ్చిన అలంకారం. ప్రజల జీవితంలో ఒక భాగంగా ఉండే నుడికారాల సొగసులన్నీ మనకు జానపద గేయాల్లో కనిపిస్తాయి. సహజ శైలి అప్రయత్న శిల్పానికి సంబంధించింది. జానపదులు ప్రయత్న పూర్వకంగా శబ్దాలంకారాలనుగాని, అర్థాలంకారాలనుగాని వాడరు. అలాగే భావాలూ క్లిష్టమైనవి కావు. అతి సుకుమారాలై సహజ సువాసనల్ని వెదజల్లే పువ్వుల్లాంటి ఊహలు జానపద గేయాలలో మనకు కనిపిస్తాయి.

పై లక్షణాలతోబాటు జానపదగేయాలకు మరికొన్ని చిన్న లక్షణాలున్నాయి. వీటిలో ప్రతి చరణం చివరనో లేక కొన్ని చరణాల చివరనో ఒక పదమో, చరణమో మళ్ళీ మళ్ళీ రావడం కనిపిస్తుంది. ఇదీ గేయ లక్షణాలలో ఒకటే. దీనినే ఇంగ్లీషులో Refrain అంటారు. ఇదీ ప్రాచీనతను సూచించేదనీ, పదాల పునరుక్తి, భావాల పునరుక్తి జానపదకవిత్వ ముఖ్యలక్షణమనీ భావించేవారూ ఉన్నారు. ఏది ఏమైనా ఈ పద, భావ పునరుక్తి మనకు గేయాలలో కనిపిస్తుంది. జానపద గేయాలను కథాగేయాలనుండి వేరుచేసే ముఖ్యమైన గుణం ఆత్మపరత్వం (Subjectivity). పారమార్థిక గేయాలలో,





కొన్ని పనిపాటలలో ఈ ఆత్మపరత్వం ఇంకా ఎక్కువగా కనిపిస్తుంది. ఈ పాటల్ని పాడేవారు జీవితంలోని సుఖదుఃఖాలకు అకృతకమైన గేయరూపం ఇవ్వడంమూలాన ఈ గీతాలు వారి జీవితంలో ఒక భాగమైపోయాయి. ఇతర సాహిత్యప్రక్రియలకంటే వీటిలో భావప్రాధాన్య మెక్కువ.

సమగ్ర మానవ జీవితంగాని, రసాలకు స్థాయిత్వంగాని మనకు జానపదగేయాలలో కనిపించకపోవచ్చు. అంతమాత్రంచేత అవి ఆనందం కలిగించకపోవు. జానపదగేయాలలో శృంగారానికే ఎక్కువ ప్రాధాన్యం. సామాన్యంగా జానపద గేయాలు వినోదంకోసం ఏర్పడినవి కావడంవల్ల వలపుపాటలు ఎక్కువగా కనిపిస్తాయి. కాని పాతకాలపు పాటలలో పనిపాటలు, పారమార్థిక గీతాలే ఎక్కువ. ఇలా ఎన్ని లక్షణాలు చెప్పినా జానపదగేయం ఈ లక్షణాలన్నిటికీ లొంగదు. ఇవి, లక్షణాలను చదివి జానపదులు వ్రాసిన గేయాలు కావు. అప్పటికప్పుడు తమ నమ్మకాలకు, ఆధారాలకు, భావాలకు తగినట్లుగా లయాత్మకంగా వ్యక్తీకరించినమాటలే గేయాలు. అందువల్ల లక్షణాలకు లొంగకుండా ఉండడమే జానపద గేయం అతి ప్రధానమైన లక్షణమని చెప్పవచ్చు. "సంగీతమే శయ్య, సాహిత్యమా పోతపోసిన వెండిలాగా ప్రవహిస్తుంది. జానపదుల గేయము హృదయోద్గతమూ రసపుష్టమూను. ఇన్ని చెప్పి, అసలు విషయము చెప్పడము తప్పయిపోతుంది. జానపద గేయాలన్నిటికి ఈ లక్షణాలన్నీ ఉండనక్కరలేదు."[8]

**జానపద గేయాల పుట్టుక– వికాసం**

జానపదగేయం ఎలా పుట్టింది, వికాసం చెందింది–ఇత్యాది విషయాలను శాస్త్రీయంగా, స్పష్టంగా అవగాహన చేసుకోవాలంటే మనం మానవ శాస్త్రాన్ని, జీవశాస్త్రాన్ని, మనస్తత్వశాస్త్రాన్ని ఆశ్రయించాల్సి ఉంటుంది. డార్విన్ ప్రతిపాదించిన పరిణామవాదం మొదలైనవాటిని పరిశీలిస్తే మానవుడు మాటల్ని నేర్చుకోవడం, భాషను నేర్చుకోవడం, గేయాలల్లడం ఎలా జరిగిందన్న దాన్ని కొంతవరకైనా అర్థంచేసుకోగలుగుతాం.

పరిణామవాదం (Theory of Evolution) జీవశాస్త్ర అధ్యయనంలో ఒక సంచలనాన్నే లేవదీసింది. జీవపరిణామం ఉన్నత దశలలో జరిగేకొద్దీ కర్మేంద్రియాలు, జ్ఞానేంద్రియాలు అభివృద్ధి చెందాయి. ఇవి స్తన్యజంతువుల్లో ఇంకా వికాసాన్ని పొందుతూ వచ్చాయి. వాటిల్లోను ప్రయిమేట్స్ అనబడే వర్గంలో ఇంద్రియాలు బాగా అభివృద్ధి చెందాయి. వాటి మెదడు చక్కగా పెంపొందింది. చిన్న చిన్నగా చేతులు ప్రధాన

కర్మేంద్రియాలుగా పరిణమించాయి. ప్రయిమేట్సు మిగిలిన జంతువుకంటె ఎక్కువ తెలివితేటల్ని సంపాదించుకున్నాయి.

మానవ చరిత్రలో నూటికి 90 పంతులు పాత రాతియుగమే అని శాస్త్రజ్ఞుల అభిప్రాయం. తర్వాత తర్వాత నిప్పు ఉపయోగం, వేటాడడం మొదలైనవి మానవుడు తెలుసుకున్నాడు. వేటాడడం ఒంటరిగా కాక సామూహికంగా జరిగేది. వారిలో వారికి సహాయ సహకారాలు, వ్యూహరచనా విధానం ఉండేవి. అతి ప్రాచీన మానవులకు భాష లేదు. రకరకాల సంజ్ఞలతో అభిప్రాయాలను వ్యక్తం చేసేవారు. కాలం గడిచేకొద్దీ భాష ఆవశ్యకత పెరిగింది. దానికి తగ్గట్టుగా మనిషి కంఠం కూడా రూపొందింది. వానరులకంటె నరులకు శబ్దాలను స్పష్టంగా ఉచ్చరించే నేర్పు వచ్చింది. పాత రాతియుగం తుదిదశలో మనకు క్రోమాన్యాన్ మానవులు కనిపిస్తారు. వీరు దాదాపు మనలాంటివారే. ఆ తర్వాత భౌతికంగా కాక సాంస్కృతికంగా పరిణామం జరిగింది.

పాతకాలపు మానవుడు మాంసాహారం తినితిని అతని శరీరానికి, ముఖ్యంగా మెదడుకు, మాంసకృత్తుల ద్వారా పుష్టిగల ఆహారం లభించింది. శతాబ్దాలు, సహస్రాబ్దాలు గడవగా గడవగా మానవుడు అనుభవాన్ని గడించాడు. దృశ్యమాన ప్రపంచాన్ని చూచి తనలో రేగే భావాలకు రూపాన్ని కల్పించడంకోసం తహతహలాడాడు. జంతువులకూ ఒక రకమైన వ్యక్తీకరణ శక్తి ఉంది. అయితే ఆది మానవుడి భాష అంత స్పష్టమైంది కాదు. మానవుడి భాష సంజ్ఞలతో ప్రారంభమై చిన్నచిన్నగా భావాలకు తగిన శబ్దాలను వాడుకోవడం వరకు వచ్చింది. అతని మెదడు కొద్ది కొద్దిగా పెరిగేకొద్దీ ఆలోచనా ఎక్కువయింది. మానవుడు లయ బద్ధంగా మాటల్ని కూర్చడం కొన్ని వేల ఏళ్ళక్రితమే ప్రారంభమయింది.[9] ఇలా లయబద్ధంగా మాటల్ని కూరుస్తూ, మానవుడు తన భావాలను జోడించి జానపద గేయాలను రూపొందించాడు. "హృదయంలో ఉన్న ఆనందమో, ఆవేశమో, దుఃఖమో, కష్టమో పైకి వెళ్ళబుచ్చుకుంటేనే గాని హృదయభారం తీరదు. ఇదే జానపద కవిత్వంగా వెలువడింది. హృదయ భారం తీర్చుకోవడమే మానవ స్వభావము."[10]

గేయం వ్యష్టిసృష్టి అని కొందరు, సమష్టి సృష్టి అని మరికొందరు అంటారు. రెండూ సాధ్యాలే అని చెప్పవచ్చు. అయితే ఒక గేయం ఒక్కరి చేత సృష్టింపబడినా, పలువురిచేత కల్పితమైనా అది నలుగురి నోటిలో పడవలసిందే. అందువల్ల సామూహిక పునఃసృష్టి మాత్రం తప్పదు. అంటే కొన్ని సందర్భాలలో జానపద గేయాల పుట్టుక





వైయక్తికంగా జరిగినా, దాని వికాసం మాత్రం సామూహికంగా జరగవలసిందే.

కొన్ని గీతాలు వైయక్తికంగానే వెలువడ్డాయిని ఒప్పుకున్నా. అతి ప్రాచీన కాలంలో మానవులేపని చేసినా సామూహికంగానే చేసేవారన్న విషయాన్ని మాత్రం మరచిపోరాదు. మానవశాస్త్రవేత్తల పై అభిప్రాయాన్ని కవిత్వ చరిత్రకారులుకూడా అంగీకరించారు. ఒకవేళ ఒక్కవ్యక్తే ఏదైనా చెప్పినా అది సామాజిక ప్రజ్ఞతో వెలువడుతుంది. Hudson మాటలు ఈ అభిప్రాయాన్నే బలపరుస్తున్నాయి : "Investigations into the beginning of literature have shown that poetry originated in the desire to give outward form to the feelings not of the individual but of the cloud or group".[11] ఆదిమ మానవుడు సామూహికంగా జరుపుతుండిన కర్మకాండలలో గేయం ప్రధాన స్థానాన్ని ఆక్రమించిందని చెప్పవచ్చు.

పనికి – పాటకు సంబంధం ఉంది. ఈ రెంటికి ఉన్న సంబంధమే ప్రప్రథమంగా మానవుని నోట జానపద గేయం వెలువడడానికి కారణభూతమయిందని ఊహించవచ్చు. పాట లయబద్ధమైన కదలికల కనుగుణంగా పుట్టడం సహజం. ఆదిమ మానవుని ప్రధానమైన వృత్తి వేట. అతని తెలివినంతట్నీ వేటపైననే కేంద్రీకరించాడు ఆనాటి మానవుడు. వేటతోపాటు మానవాతీత ప్రపంచంలో నమ్మకం కూడా ప్రారంభమైంది. వేటలో ఆదిమ మానవుడు నిమగ్నుడై ఉండినప్పుడు పాటలు పాడి ఉండడు. అతడు వేటాడి, వేటాడిన జంతువుల్ని ఒకచోట వేసి, ఆ సంతోషంతో తమ వేట కథను చెప్పుకుంటూ నృత్యాలు చేస్తూ ఆవేశంగా మాట్లాడేటప్పుడు వెలువడిన భాష లయబద్ధంగా ఉండేదని ఊహించవచ్చు, మరోవిధంగా కూడా జరిగి ఉండవచ్చును. తమ సంతోషాలను, దుఃఖాలను మానవాతీత శక్తులకు విన్నవించుకొనేటప్పుడు కూడా ఆదిమ మానవులు లయాత్మక గీతాలను పలికి ఉంటారని చెప్పవచ్చు. ఇలా పనిపాటలు, పారమార్థిక గీతాలు ఇంచుమించు ఒకే కాలంలో పుట్టాయనిపించినా మానవాతీత శక్తులపై నమ్మకం, దేవుడున్నాడనే భావం మానవుడికి కలగకముందే మానవుని ముఖతః జానపద గేయానికి ప్రాథమిక రూపమైనా తప్పక వెలువడి ఉంటుందని ఊహించవచ్చు.

వర్గీకరణ :

జానపద గేయాల వర్గీకరణలో అనేక విధాలున్నాయి. స్థూలంగా ఈ గేయాలను విభజించాలనుకుంటే లౌకిక గీతాలు, పారమార్థిక గీతాలు (Secular song and Sacred song) అని రెండు విభాగాలు చేయవచ్చు. మానవుడి

జీవితాన్ని మనం పరిశీలిస్తే మనకు కనిపించేవి ముఖ్యంగా రెండు అంశాలు. ఒకటి అతని లౌకిక జీవితానికి సంబంధించింది, మరొకటి మానవాతీత శక్తులపై అతనికున్న నమ్మకానికి సంబంధించింది. దానికి తగ్గట్టే గేయాలను విభజిస్తే రెండే విభాగాలు అవుతాయి. అయితే అది స్థూలమైన వర్గీకరణ మాత్రమే అవుతుంది.

ఆశ్రయాన్ని బట్టి గీతాలను నాలుగు రకాలుగా విభజించవచ్చు. 1.పురుషుల గీతాలు, 2.స్త్రీల పాటలు, 3.ఉభయుల గేయాలు, 4.పిల్లల పాటలు. ఎంతగా లెక్కవేసినా మానవులలో మనకు కనిపించే వర్గాలు మూడే. పురుషులు, స్త్రీలు, పిల్లలు అనే మూడు వర్గాలకు సంబంధించిన పాటలు, స్త్రీ పురుషు లిరువురు - చేరి పాడే పాటలు - ఇలా నాలుగు భాగాలుగా చేసిన విభజన కూడా స్థూలమైందే. అంతేకాదు, ఒక్కొక్కసారి స్త్రీలపాటలనే పురుషులు పాడవచ్చు. పురుషుల పాటలను స్త్రీలు పాడవచ్చు. అలాగే పిల్లలకోసం లాలిపాటల్ని పెద్దవారు పాడుతారు. స్థూలమైన పై విభజనకంటె కొంత వివరంగా జానపద గేయాల స్వరూపంలోని వైవిధ్యాన్ని తెలిపే విభజన అవసరం.

Standard Dictionary of Folklore, Mythology and Legend, రెండవ సంపుటంలో Type అనే శీర్షిక క్రింద R.S.Boggs ఇచ్చిన వర్గీకరణ కూడా గమనించదగింది. అందులో బాగ్స్ జానపద గేయాలను భావోద్వేగం (Emotion), దైనందిన జీవనం (Daily life), జీవిత చక్రంలోని ముఖ్య సన్నివేశాలు (Crucial moments in life cycle), పిల్లలపాటలు (Children's songs), ధార్మిక గీతాలు (Religious songs) అనే ఐదు శీర్షికల క్రింద ఇచ్చాడు. వలపు పాటలు, శోక గీతాలు, హాస్య గీతాలు మొదలైనవి మొదటి విభాగంలో వస్తాయి. పనిపాటలు వగైరా రెండవ విభాగంలో చేరుతాయి. పుట్టుక, వివాహం, చావు మొదలైనవి మూడవ విభాగంలోనివి. పిల్లల పాటలలో లాలిపాటలు, ధార్మిక గీతాలలో మతసంబంధ గేయాలు చేరతాయి. ఈ విభజన కొంత వరకు జానపద గేయాలలో చాలావాటిని విశ్లేషించడానికి పనికివస్తుంది.

జానపద గేయాలను వర్గీకరించేటప్పుడు ఎన్నో అంశాలను గమనించాల్సి ఉంటుంది. భావోద్వేగాన్ని లేక రసాన్ని ఆశ్రయించి విభాగం చేస్తే వలపుపాటలు, హాస్యగీతాలు, శోకగీతాలు మొదలైనవి ఏర్పడతాయి. క్రియాత్మక గుణాన్ని తీసుకుంటే పనిపాటలు, క్రీడాగీతాలు, నృత్య గేయాలు మొదలైనవి చెప్పవచ్చు. అలాగే ఛందస్సు, గాయకులు, వాద్యాలు మొదలైనవాటిని కూడా పరిగణించి విభాగం చేయవచ్చు.





కాని ఇందులో ఏ ఒక్క విధానమూ ప్రత్యేకంగా సమగ్రం కాదు. అందువల్ల సాధ్యమైనంతవరకు అన్ని గేయాలకు అన్వయించేలాగా, అన్నిటినీ ఇముడ్చుకునేట్లుగా వర్గీకరించడానికి ప్రయత్నించాలి.

ప్రాచీనకాలం నుంచి కూడా పనికి, పాటకు ఉండే సహజ సంబంధం వల్ల ప్రపంచంలో అన్ని ప్రదేశాలలోను పనిపాటలు అసంఖ్యాకంగా వెలువడ్డాయి. వాటి బాహుళ్యాన్ని బట్టి, వైశిష్ట్యాన్ని బట్టి పనిపాటల్ని ప్రత్యేకంగా పరిగణించవలసి ఉంటుంది. ఇంచుమించుగా పనిపాటలు వెలువడిన కాలంలోనే మానవుడికి సహజాతీత శక్తులలో ఉన్న నమ్మకాల ఆధారంగా వెలువడిన పారమార్థిక గీతాలు మరొక ముఖ్య విభాగంగా పేర్కొనవచ్చు. ఇవి స్తుతులు లేక భక్తి గీతాలు, కర్మమార్గ సంబంధమైన పాటలు, తత్వాలు అని మూడు విధాలుగా ఉంటాయి. పని, పారమార్థిక చింతన తర్వాత మానవుని జీవితంలో ముఖ్యమైనది కుటుంబం. కుటుంబంలో, సమాజంలో ఇద్దరు వ్యక్తులనడుమ మనం చూచే బాంధవ్యాలను ప్రతిబింబించేవి గృహసంబంధ గీతాలు. అన్న - చెల్లెలు, అమ్మ - కూతురు, అత్త - కోడలు, స్నేహితులు మొదలైనవారి మధ్య ఉండే బాంధవ్యాన్ని తెలిపే ఈ గేయాలనే స్త్రీల పాటలనే పేరుతో పిలుస్తారు. పిల్లలపాటలు ప్రత్యేక విభాగంగా పరిగణించదగ్గవి. వీటిలో పిల్లలకోసం పెద్దలు పాడే లాలులు, జోలలు, పిల్లలకోసం పెద్దలు రచించి, పిల్లలు పాడే గేయాలు, పిల్లలే కల్పించుకొని పాడుకొనే పాటలు చేరుతాయి. కర్మమార్గానికి సంబంధించిన ఆచరణలలో కొన్ని, కొంతకాలానికి తమ అసలు స్వరూపం వదలి కేవలం వేడుకలుగా నిలిచిపోయాయి. దసరా, దీపావళి, హోళి మొదలైన పండుగలు, వివాహం, కోలాటం మొదలైన వినోదాలు వీటన్నిటినీ కలిపి వేడుకలని చెప్పుకోవచ్చు. ఈ సందర్భాలలో పాడేపాటలు వేడుక పాటలు. ఇక రసానికి సంబంధించినంతవరకు వలపు పాటలు, హాస్యగీతాలు, శోక గీతాలు అన్నవాటిని చేర్చుకోవచ్చు.

పై విభాగం కొంతవరకు సమగ్రంగా గోచరించినా దానిలో అతివ్యాప్తి, అవ్యాప్తి లేకపోలేదు. పనిపాటలలోనే వలపు పాటలున్నాయి. పెళ్ళి పాటలలోనే హాస్యగీతాలు, శోకగీతాలు వున్నాయి. పనిపాటలలోనే గృహ సంబంధ గేయాలు, పారమార్థిక గేయాలు ఉండవచ్చు. పడవ పాటలలో తత్వాలున్నాయి. ఈ విధంగా చూస్తే ఏ విభాగానికైనా ఇలాంటి అడ్డంకులు రానే వస్తాయి. అయితే ఒక పాటలో ప్రధానంగా ఏం ఉందో దాన్ని బట్టి ఆ పాటను ఆ విభాగంలో చేర్చవలసిఉంది.

ఉదాహరణకు ఒక పని పాటలో శృంగారాంశం ఎక్కువగా ఉంటే వలపుపాటలో పారమార్థిక చింతన ఉంటే పారమార్థిక గేయాలలో చేర్చవచ్చు. లేక "ఊదుపూడవం డమ్మల్లారా" అని పాడుకునే పాటల్ని పనిపాటలుగానే పరిగణించవచ్చు. ఆయా ప్రదేశాలలో విశిష్టంగా ఉండే గేయాల స్వభావాన్ని బట్టి వర్గీకరించడం సబబుగా ఉంటుంది.

**జానపద గేయాల వైశిష్ట్యం :**

జానపద గేయాలను సృష్టించినవారు జీవితంలోని సుఖదుఃఖాలను అనుభవించినవారు, ఆనందపు టంచుల్నీ, దుఃఖపు లోతుల్నీ చూచినవారు. సంసార సుఖమే సర్వస్వమని నమ్మినవాళ్ళు కాదు. అయినా సంసారంలో ఉండే సుఖాన్ని, దుఃఖాన్ని, గృహజీవనాన్ని తమ కవితల్లో ప్రతిబింబింపజేశారు. హృదయాంతరాళంలో ఎక్కడో దాగివుండే భావాల్ని నిసర్గ సుందరంగా పట్టిచూపేశక్తి జానపదులకుంది.

జానపద గేయాలు మన జాతీయ సంపద అనడంలో ఏ మాత్రం సందేహం లేదు. ఆసేతుహిమాచలం – ఆ మాటకొస్తే ప్రపంచంలో ఉండే ప్రతి మానవుడిలో అణగిఉండే హృదయాన్ని, ఆ హృదయం పొందే సుఖాలను, దుఃఖాలను, అనుభవాలను, అన్నిటినీ మనం అనుభవించేట్లు చేస్తున్నాయి జానపద గేయాలు. జానపద గేయాలకు తెలుగనీ, కన్నడమనీ భేదభావం లేదు. తెలుపనీ, నలుపనీ, ఈ జాతనీ, ఆ జాతనీ సంకుచిత దృష్టి లేదు. సర్వాన్నీ సమదృష్టితో చూచే యోగులు జానపద కవులు. రవీంద్రుడు చెప్పినట్లు "జానపదుల గీతాలు మనస్సునూ హృదయాన్నీ తెలుసుకోడానికి సహాయకారులై ఉన్నాయి. వేరువేరు ప్రదేశాల పల్లెపాటల్లో కనిపించే సమానగుణాలవల్ల భారతాద్యంతమూ మానవ స్వభావంలోని వైవిధ్యంలో ఏకత్వాన్ని మనం చూడగలం. అన్ని దేశాల జానపద గీతాలను సేకరించి, ఒక దానితో మరొక దానిని పోల్చి చూస్తే సర్వ మానవ కులానికి సామాన్యమైన మనస్సు, హృదయం వాటిలో అణగిఉండడాన్ని చూడవచ్చు."[12]

**ప్రమాణ గ్రంథాలు :**


1. తెలుగు జానపద గేయ సాహిత్యము – డా. బి. రామరాజు
2. జానపద గేయ వాఙ్మయ పరిచయము – హరి ఆదిశేషువు
3. జానపద గేయ వాఙ్మయ వ్యాసావళి – నేదునూరి గంగాధరం
4. జానపద కళాసంపద – డా. టి. దొణప్ప
5. ఆంధ్రుల జానపద విజ్ఞానం – డా. ఆర్వీయస్. సుందరం







6. తెలుగు, కన్నడ జానపద గేయాలు – డా. ఆర్వీయస్. సుందరం
7. జానపద విజ్ఞాన వ్యాసావళి – డా. జి. ఎస్. మోహన్

**కన్నడం :**

8. కన్నడ జానపద గీతగళు – డా. బి. ఎస్. గద్దగీమఠ
9. జనపద సాహిత్య సమీక్షె – డా. జీ. శం. పరమశివయ్య
10. జానపద గీతెగళు – డా. కె. శివరామ కారంత
11. జానపద స్వరూప – డా. హా. మా. నాయక
12. హొన్నబిత్తేవు హొలకెల్ల – వ్యాస సంకలనం

English

13. Standard Dictionary of Folklore, Mythology and Legend, Ed. Maria Leach, Vol.1, and 2
14. Marxism and Poetry - George Thomson
15. Primitive song - C.M.Bowra
16. Encyclopaedia Britannica-Vol.9


**టిప్పణి**

1. Vol.3, p.22
2. "We find that unlettered and untravelled people have both the desire and the power to express themselves musically." Encyclopaedia Britannica, Vol.9, p.447
3. C.M.Bowra, Primitive Song, p.41
4. Encyclopaedia britannica, Vol.9, p.448
5. Ibid. p.522
6. George Thomson, Marxism and Poetry, p.4
7. నేదునూరి గంగాధరం, జానపదగేయ వాఙ్మయ వ్యాసావళి, పు. 3-4
8. శ్రీపాద గోపాలకృష్ణమూర్తి, ఆంధ్రవిజ్ఞాన సర్వస్వము, 4వ సం. పు. 802
9. "It is indeed tempting to surmise that in the Late Palaeolithic Age (30,000 - 15,000 B.C.) when men delighted in painting and carving and modelling, they delighted also in the melodious arrangement of words C.M.Bowra, Primitive song, p.13.
10. ఎన్. గంగాధరం, జానపదగేయ వాఙ్మయ వ్యాసావళి, పు. 3
11. Introduction to the study of literature, p.97
12. (ఆంగ్లమూలం) Modern Review, Vol.55, p.266

## 2. కథా గేయాలు

జానపద సాహిత్యంలోని ప్రధానమైన అంగాలలో కథాగేయం ఒకటి. జానపద కథాగేయాలనే కొందరు వీరగాథలని కూడా పిలుస్తారు. ఆంగ్లంలో Ballad, Ballad cycle, Balladling, Narrative peom, Folk epic మొదలైన పదాలు వాడుకలో ఉన్నాయి. వీటికి పలువురు విద్వాంసులు పలువిధాలుగా అర్థం చెప్పారు. కథాగేయాలను గురించి చెప్పేటప్పుడు పై పదాలను గురించి, వాటికి విద్వాంసులు చేసిన అర్థ వివేచనాన్ని గురించి తెలుసుకోవలసి ఉంది.

Ballad అన్న శబ్దం Ballare అనే లాటిన్ పదం నుంచి పుట్టింది. దీన్ని మొదట నృత్తగీతమనే అర్థంలో వాడుతుండినా, తరువాతి కాలంలో సామాన్యంగా కథాగేయమనే అర్థమే దీనికి స్థిరపడింది.[1] Ballad అనే శబ్దానికి వీరగాథ అన్నది అనువాదం. ఇది వీరరస ప్రధానమైన కథా గేయాలకు వర్తిస్తుందే కాని మిగిలిన అన్నిటికి వర్తించదు. పరిమాణంలో పెద్దవైన కొన్ని వీరగాథల సమూహాన్ని Ballad cycle (వీరగాథా చక్రం) అనీ, చిన్నవైన వీరగాథల్ని Ballad lings (లఘు వీరగాథలు) అనీ అంటారు. అయితే ఇటీవలి కాలంలో Ballad అన్న పదానికంటే Narrative poem అన్న పదంపైననే విద్వాంసులు మొగ్గు చూపుతున్నారు. ఎందుకంటే Ballad కు విద్వాంసులిచ్చిన అర్థాలను మనం చూస్తే అది కొంతవరకు పరిమితమైన అర్థంతో కూడిందని అనిపిస్తుంది. ఏ అర్థంతో మనం Ballad ను చూచినా అది కథాగేయం మాత్రం తప్పక అవుతుంది. అందువల్ల కథనం ఉండే గేయం కాబట్టి కథాగేయం అని Narrative Poem ను మనం పిలవవచ్చు. కొందరు దీనినే పద్యాఖ్యానం లేక గేయాఖ్యానం అని కూడా అంటారు. నాగరిక సాహిత్యంలో మనం చూచే ఇతిహాసాల లక్షణాలను కొంతవరకు కలిగివుండి, సుదీర్ఘమైన కథా భాగం కలిగివుండే గేయాలను జానపద మహాకావ్యాలని, జానపద ఇతిహాసాలని పిలవడం కద్దు. ఈ అన్నిటినీ Narrative Poem లేక కథా గేయం అన్న పదం ఇముడ్చుకోగలదు.

Ballad ను నిర్వచించి, లక్షణాలను చెప్పడానికి ప్రయత్నించిన వారిలో Francis B.Gummere, Albert B.Friedman మొదలైన వారిని పేర్కొనవలసి ఉంది. Gummere 'Ballad ను Popular Ballad అనీ Traditional Ballad అనీ రెండు భాగాలు చేసి నిజమైన జానపద కవితగా పేర్కొనదగిన Popular Ballad ను ఈ క్రింది





విధంగా నిర్వచించాడు. "Popular Ballad is a poem meant for singing, quite impersonal in manner, narrative in material, probably connected in its origins with the communal dance, but submitted to a process of oral tradition among people who are free from literary influences and fairly homogeneous in character."[2] కథను కలిగి ఉండడంతో బాటు, కథాగేయాలు భావాత్మకాలు కూడా అయి ఉంటాయి. అందువల్లనే ఇవి బాహ్యస్వరూపంలో lyric ను, అంతర స్వరూపంలో epic ను పోలి ఉంటాయని విమర్శకులు భావించారు. Ballad ను narrative lyric అని పేర్కొన్నవారూ ఉన్నారు.[3] "వీరరస ప్రధానమగు కథను చెప్పుచు, సంచారగాయక భిక్షువుల (minstrels) చే పాడబడు సరళ కథాగేయమే వీరగాథ"[4] అన్న నిర్వచనం అన్ని కథాగేయాలకు వర్తించదు. వాగ్రూపమైన సంప్రదాయం కలిగి, తరతరాలుగా అనేక పాఠాంతరాలతో ప్రచారం పొంది, సామూహికమైన వికాసం కలిగిన కథాగేయాన్ని జానపద కథాగేయమని నిర్వచించవచ్చు.

జానపద గేయాలకు చెప్పుకున్న లక్షణాలనే చాలావరకు కథాగేయాలకు కూడా చెప్పుకోవచ్చు. జనపదీయంగా ఉండడం, గేయరూపం, వాగ్రూపమైన ప్రచారం, సహజశైలి, ఆశురచన మొదలైన లక్షణాలు వీటికి వర్తిస్తాయి.

కథాగేయాలకు ప్రత్యేకంగా చెప్పదగిన లక్షణాలలో మొట్టమొదటిది కథనం కలిగివుండడం (Narrative nature). జానపద గద్యకథలలో ఉన్నట్లే అద్భుతమైనవి, వీరరస ప్రధానమైనవి, శోకాత్మకమైనవి అయిన కథాభాగాలు కథాగేయాలలో కూడా ఉంటాయి. అయితే ఈ కథనం అన్నది కథాగేయాల అతిముఖ్య లక్షణం కాదనేవారు కూడా ఉన్నారు. అనుకరణ సాధ్యమైన సన్నివేశాలు (imitable situations) కథాభాగం కంటె ముఖ్యమైనవని వీరి భావన. కథకు కావలసిన సన్నివేశాలు ఉంటే కథనం ఎవరైనా చేయవచ్చు. జానపదుల భావనకు అందుబాటులో ఉండే సన్నివేశాలు కథాగేయాలలో ముఖ్యమని Gummere మొదలైన విద్వాంసులు అంటారు.

నిర్దిష్టమైన కవి అంటూ ఎవరూ లేకపోవడం (Anonymity) జానపద గేయానికిలాగే కథాగేయానికి గూడ ఒక లక్షణం. మూలగేయాన్ని ఒకవేళ ఎవరో ఒకరు కూర్చివున్నా, కొన్ని తరాల తర్వాత అదే గేయంలో ఎన్నో మార్పులు కనిపిస్తాయి. అది అందరి ఆస్తి అవుతుంది. అందువల్ల వైయక్తికంగా కథాగేయం ఈ రచయితది అని చెప్పడానికి వీలుకాదు. ఈ విధంగా ఎవరో ఒక్కరికి మాత్రమే చెందకపోవడాన్ని (Impersonality) పై లక్షణానికే ఉపలక్షణంగా చెప్పవచ్చు.

మహాకావ్యాలలో మనకు కనిపించే కవిసమయాల లాగానే కథా గేయాలలో కూడా కొన్ని సామాన్యగుణాలు ఉన్నవి. వీటిని కొందరు Conventional ballad diction అన్నారు. కొంతమంది Ballad common places అనే పేరు వాడారు. కొన్ని పడికట్టు వర్ణలు ఒకే కథాగేయంలోగాని, కొన్ని కథాగేయాలలోగాని మళ్ళీ మళ్ళీ వస్తాయి. ఇలాంటిదే అయిన Incremental repetition (అభివర్ధిత పునరుక్తి) అన్నది కూడా మరో లక్షణంగా చెప్తారు. ఒక్క ప్రశ్నకు బదులు అనేక ప్రశ్నలు అడగడం, ఒకే ప్రశ్నను పలుమార్లు అడగడం ఇటువంటివి పెంపుదలగా కనిపిస్తాయి. అయినా నిజాన్ని మనస్సుకు హత్తుకునేట్లు చెప్పడానికి ఇటువంటి పునరుక్తులు సహాయం చేస్తాయి.

ఒక సన్నివేశం నుంచి మరో సన్నివేశానికి వెళ్ళిపోవడం, మధ్య ఏదో వెలితి ఉండడం ఇత్యాదులు కథాగేయాలలో సహజం. ఇది అనేకుల వల్ల కథాగేయం ప్రచారం పొందడంచేత వచ్చిన గుణం. దీనినే Leaping and lingering అంటారు.

పునరావృత్తి లేక పల్లవి కథాగేయాలలో కనిపించే మరొక లక్షణం (Refrain). Evelyn Wells అనే విద్వాంసుడు Refrain లో మూడు రకాలున్నవని అన్నాడు: 1.Internal (refrain line within the stanza) 2.External (refrain following the stanza) 3.Mixed (refrain lines both within and following the stanza.[5])'గేయాలలో పల్లవికి అతిముఖ్యమైన స్థానం ఉందనేవారున్నారు. కథాగేయాలు అతి ప్రాచీనకాలం నుంచి గేయాత్మకంగా ఉండేవని ఇది నిరూపిస్తుంది అంటారు. "Ballads were at first always sung, and always had a refrain; the refrain is incontestably sprung from singing of the people at dance, play, work going back to that choral repetition which seems to have been the protoplasm of all poetry"[6] అన్న మాటలు గమనించతగ్గవి.

Bliss Perry అనే పాశ్చాత్య విమర్శకుడు కథాగేయాలకు చెప్పిన పది లక్షణాలు చాలావరకు వాటి స్వరూపాన్ని తెలియజేస్తాయి.[7] గేయ రూపంలో ఉండడం కథాగేయాల మొదటి లక్షణం. సరళ ఛందస్సు, పల్లవి, గానయోగ్యత అన్నవి దీనికి ఉపలక్షణాలు. కథాగేయాలు ఆఖ్యాన రూపంలో ఉంటాయన్నది రెండవ లక్షణం. నియమిత పరిమాణం, యథార్థ సంఘటనా జన్యత్వం, దేశీయ ఇతివృత్తం, నాయకాభేదత, వీర రస ప్రాధాన్యం, కథాసారళ్యం, హఠాత్ ప్రారంభత్వం, సంభాషణా సహితత్వం, గద్యరాహిత్యం, విషాదాంత్యం, అభివర్ధిత పునరుక్తి రెండవ లక్షణానికి ఉప లక్షణాలు. గాయక భిక్షువుల ఆశుకవితగా జనించడం కథాగేయాల మూడవ లక్షణం, కవి





అప్రధానుడుగా ఉండడం దీని ఉప లక్షణం, వాగ్రూపమైన ప్రచారం కలిగి ఉండడం, వాగ్రూప సంప్రదాయం లభించడం వీటి నాల్గవ లక్షణం. దీనివల్లనే జనప్రియత్వం అన్న ఉపలక్షణం కూడా లభిస్తుంది. కథాగేయాలు వస్తునిష్ఠమైన కవిత్వానికి (objective poetry) ఉదాహరణాలు. ఇదే కథాగేయాల ఐదవ లక్షణం.

జానపద కథాగేయాల భాష, భావాలు సరళంగా ఉంటాయి. కొన్ని పదాలు, వర్ణనలు వగైరా మళ్ళీ మళ్ళీ వస్తాయి. వీటిని వారాను వర్తనాలు (common places) అంటారు. ఇది ఆరవ లక్షణం. కథా గేయాలు ఒక్క కవి రచించినవి కావు. ఇవి ప్రజలలో సహజంగా పుడ్తాయి. ఈ విధంగా అనితర సాధ్యంగా ఉండడం కథాగేయాల ఏడవ లక్షణం. ప్రపంచంలోని వివిధ ప్రదేశాలలో కనిపించే కథాగేయాలలో మనం ఏక సూత్రతను చూడగలం. వసుధైక కుటుంబాన్ని నిరూపించే ఇట్టి అద్వితీయగుణం (Unique character) కథాగేయాల ఎనిమిదవ లక్షణం. కథాగేయాలు నీతిని వాచ్యంగా చెప్పవు; కాని వ్యంగ్యంగా చెప్తాయి. విధిబలీయమని ఇవి బోధిస్తాయి. ఇలా నీతిని వ్యంగ్యంగా చెప్పడం తొమ్మిదవ లక్షణం. కథాగేయాలు ప్రతి జీవితానికీ చివర ఓటమి ఉన్నదనే విషాద విషయాన్ని ప్రతిధ్వనిస్తూ ఉంటాయి. ఇది పదవ లక్షణం.

ఇవికాక ఇంకా మరికొన్ని లక్షణాలను కూడా చెప్పవచ్చు. కథా గేయాలలో ఎక్కువగా వీరరస ప్రధానాలు ఉన్నాయి. వీరం తర్వాత కరుణ, అద్భుతం పేర్కొనదగ్గవి. వీరంలోను యుద్ధవీరమే ఎక్కువ. నాయకుని వీరానికి పోషకంగా రౌద్ర, బీభత్స, కరుణ, భయానక, హాస్య, శృంగార, అద్భుతాలు కూడా ఉంటాయి.

వీరుడు తల్లిదండ్రులకు చాలా కాలానికి పుట్టడం; అతని ఆటపాటల్లోనే శౌర్యం ప్రదర్శితమవడం మొదలైనవి సామాన్యంగా కథా గేయాలన్నిటిలో కనిపిస్తుంటాయి. అలంకారాలలో సరళమైన ఉపమలు, భాషలో సారళ్యం కనిపిస్తాయి. సహజ సుందరమైన దేశీయ భాషను జానపదులు వాడుతారు. వ్యాకరణాలంకారాల కట్టుబాట్లను వారు లెక్క చేయరు. సామెతలు, నుడికారాలు కథాగేయాలలో సమృద్ధంగా దొరుకుతాయి. నిఘంటువులలో ఇంకా ప్రవేశించని దేశ్యపదాలు జానపద కథా గేయాలలో అసంఖ్యాకంగా కనిపిస్తాయి. వైరి సమాసాలు అన్యదేశ్యాలు తరచుగా కనిపిస్తాయి. కథా గేయాల భాషే ప్రత్యేకంగా పరిశీలనార్హమైంది.

జానపద కథాగేయాల ఛందస్సు లక్షణ గ్రంథాల ననుసరించి ఉండదు. రాగాలు సంకీర్ణాలై ఉంటాయి. ఒక పాటను అందరూ ఒకే విధంగా పాడాలని లేదు. అసలు ఒక్క గాయకుడే ఒకే పాటను వేరు వేరు స్థలాలలో, వేరువేరు కాలాలలో, వేరు

విధంగా పాడవచ్చు. మొత్తం మీద పాడడం అన్నది మాత్రం ముఖ్యం.

పైన చెప్పిన లక్షణాలలో కొన్ని చిన్న చిన్న మార్పులు ఉండవచ్చు. అయితే సార్వత్రికంగా మనకు కనిపించేవి ఐదు లక్షణాలు.[8] 1. ఇది కథాఖ్యానమై ఉంటుంది. 2. పాట రూపంలో ఉంటుంది. 3. ఇది జనపదీయమై ఉంటుంది. 4. ఒక ముఖ్యమైన సంఘటన మీద కథాగేయం కేంద్రీకృతమై ఉంటుంది. 5. ఇది వ్యక్త్యతీతమై ఉంటుంది. (impersonal) సామాన్యంగా ఆఖ్యానాలలో కనిపించే క్రియ (action) , పాత్రలు (character), సంయోజనం (setting), కథా వస్తువు (theme) అనే నాలుగింటిలో క్రియకు కథాగేయాలలో ఎక్కువ ప్రాధాన్యం ఉంటుంది. క్రియ చాలా నాటకీయంగా ఉంటుంది. సంక్షిప్తగుణం అంతటా కనిపిస్తుంది.

**కథాగేయాల పుట్టుక :**

జానపద గేయాల పుట్టుకను గురించి చెప్పిన విషయాలన్నీ కథా గేయాలకు కూడా చాలా వరకు అన్వయిస్తాయి. ప్రాథమిక రూపమైన శుద్ధ గీతానికి తర్వాతికాలంలో కథాకథనం చేరి కథాగేయాలు పుట్టి ఉండవచ్చు. ఏది ఏమైనా జానపద గేయాలు, కథాగేయాలు శిష్టసాహిత్యం కంటె ప్రాచీనమైనవి అనడంలో ఏ మాత్రం సందేహం లేదు. వీటిలో ఉండే సరళమైన ఛందస్సు, అతి ప్రాచీన మానవ భావనలు, సంప్రదాయాలు వీటి ప్రాచీనతను నిరూపిస్తున్నాయి. క్రీస్తుపూర్వం కొన్ని వేల సంవత్సరాలకు చెందిన వేదాలలోనే కథాగేయాలకు బీజాలున్నాయి. వేదాలు ప్రాచీన ఆర్యుల జానపద సాహిత్యమని అనేవారూ ఉన్నారు. రామాయణ, మహాభారతాల రచనకు జానపద కథాగేయాలు ఆధారమనే అభిప్రాయంలో ఎంతవరకు సత్యమున్నదన్నది ఇంకా పరిశీలించవలసి ఉంది. గ్రీక్, ల్యాటిన్, జర్మన్, హిబ్రూ, చైనా మొదలైన వారి ప్రాచీన సంస్కృతులలో కూడా కథాగేయాలు పుట్టి ప్రచారం పొందాయి.

కథాగేయాలను, వాటి పుట్టుకను గురించి విద్వాంసులు ఎన్నో ఊహలు చేశారు. అతి ప్రాచీన కాలంలో జానపద సమాజంలో ప్రచలితమై ఉండిన నృత్య సంప్రదాయంలో కథాగేయాలు ఆశువుగా అవతరించాయని ఒక ఊహ. మధ్య యుగాలలో వీటిని కొందరు గాథాకారులు సృష్టించారన్నది మరొక మతం. కథాగేయాలకు మూలం ప్రాచీన శిష్ట సాహిత్యమేనని కొందరి తలంపు. ప్రాచీన మానవుని నృత్తగీతాలు భావాత్మకాలై, చిన్నవిగా ఉండి ఉంటాయేగాని కథాకథనంతో





కూడిన పెద్దపాటలు పుట్టడం స్వభావ విరుద్ధమనే అభిప్రాయం ఉంది. అయితే కథాగేయాలకు బీజప్రాయమైనవి అతి ప్రాచీన కాలంలోనే పుట్టి ఉంటాయన్నది సమంజసమైన అభిప్రాయం అని చెప్పవచ్చు.

Minstrels[9] అనే పేరుగల వృత్తి గాయకులు మధ్యయుగాలలో కథాగేయాలను రచించారనే బలమైన అభిప్రాయం ఉంది. కాని Gummere మొదలైనవారు దీన్ని తీవ్రంగా ఖండించారు. Minstrels అన్న వాళ్ళు రచించినవి కథాగేయాలకు భిన్నమైనవని Prof.Kittredge మున్నగువారు అభిప్రాయపడుతున్నారు. సాంప్రదాయికంగా ప్రజలలో ప్రచారంలో ఉన్న కథాగేయాలు ప్రజలు సృష్టించినవే అని బహుజన సమ్మతమైన అభిప్రాయం. ప్రజలు సృష్టించినదాన్ని minstrels వాడుకున్నారేకాని, ఈ వృత్తి గాయకుల రచనలను ప్రజలు అనుకరించలేదు. అందువల్ల వృత్తిగాయకులు రచించిన కథాగేయాలు సాంప్రదాయిక కథాగేయాలు కావచ్చుగాని జానపద కథాగేయాలు లేక జనప్రియ కథాగేయాలు కాలేవని చెప్పవచ్చు. కేవల సంప్రదాయానికి (tradition), జనప్రియ సంప్రదాయానికి (popular tradition) భేదం ఉంది.

కథాగేయాలు వైయక్తిక రచనలా లేక సామూహిక రచనలా అన్నది కూడా వివాదాస్పదమే. కథాగేయాలలో కొన్ని వైయక్తిక రచనలే కావచ్చు. అది వైయక్తిక రచన అయినంతమాత్రానికే, ఒక కథాగేయాన్ని మనం జానపద కథాగేయం కాదని కొట్టివేయడానికి వీలులేదు. ఒకరి రచన అయినా, పలువురి రచన అయినా జనప్రియత్వం, సంప్రదాయం ఏర్పడి కథాగేయం సామూహిక సంపద అయిందంటే దానిని జానపద కథాగేయం అని చెప్పవచ్చు.

అత్యంత సరళంగా, సామూహికంగా లేక వైయక్తికంగా రూపమెత్తిన కథాగేయం వికాసం చెందేటప్పుడు ఒక ఐతిహాసిక విధానానికి (epic process) లోనవుతుంది. ఎవరో ఒకరు చిన్న కథను చెప్పారనుకుందాం. అది విన్నవారు ఆ కథను పూర్తిగా వినకపోయినా కథాసారాన్ని అర్థం చేసుకుంటారు. ఆ కథనే వాళ్ళు జానపదులకు చిరపరిచితాలైన మూలాంశాల (motifs) సహాయంతో పునర్నిర్మిస్తారు. ఎంతగా మధ్య మధ్యలో మార్పులు సంభవించినా ఒకవిధమైన క్రమవికాసాన్ని మనం కథాగేయాల నిర్మాణంలో గమనించవచ్చు. ఇలా కథ పెరిగి అనేక సన్నివేశాలతో కూడి కథాచక్రంగా పరిణమిస్తుంది. ఇతిహాసాలతో దీనికి ఉండే పోలికను బట్టి కొందరు ఈ సుదీర్ఘ గేయాలను జానపద ఇతిహాసం (Folk Epic) అనీ జానపద మహాకావ్యం అనీ అనడం కద్దు.

కథాగేయాలు ఎక్కడ, ఎప్పుడు పుట్టాయని ఖచ్చితంగా చెప్పడం కష్టం. ఎందుకంటే, వీటికి ఒక చరిత్ర అన్నది లేదు. కథాగేయాలలో మిగిలి ఉన్న విషయాలను ఆధారంగా చేసుకొని ఊహించవలసిందే కాని ఈ కథాగేయం పుట్టడానికి ఇదీ కారణం అని చెప్పలేము. ప్రాచీన కాలంలో జరిగిన అనేక సంఘటనలు, నమ్మకాలు, జానపదులలో ప్రచారంలో ఉండిన అనేక మూలాంశాలు (motifs) కథాగేయాల పుట్టుకకు కారణాలయ్యాయి. ప్రాచీనకాలంలో వేట ప్రధానవృత్తిగా ఉండిన మానవుడు, వేటను గురించిన వృత్తాంతాన్ని తనవారికి లయబద్ధంగా చెప్తున్నప్పుడే కథాగేయాలు పుట్టడం ప్రారంభమయింది. తర్వాతి కాలంలో ప్రాదేశికంగా జరిగిన చిన్న చిన్న పోట్లాటలు, యుద్ధాలు కథాగేయాల అవతరణకు కారణమయ్యాయి. సుదీర్ఘ కథాగేయాలకు కూడా అంతగా ప్రధానమైనవి కాని చిన్న చిన్న యుద్ధాలే ప్రేరణ ఇచ్చాయన్నది గమనించవలసిన అంశం.

ప్రపంచంలోని అన్ని భాగాలలోను కథాగేయాలు కనిపిస్తాయి. వీటన్నిటికీ మూలం ఏ దేశానికి చెందిన కథాగేయాలు అన్నది కూడా పరిశీలనార్హమే. జానపద విజ్ఞానం పుట్టుకను గురించి ఆలోచించేటప్పుడు చాలా సిద్ధాంతాలు ఈ శాస్త్రానికి సంబంధించిన రెండు విషయాలకు ఎక్కువ ప్రాధాన్యం ఇస్తాయి. అవి జానపద విజ్ఞానంలో కనిపించే బహుప్రదేశ అస్తిత్వం (multiple existence), వివేక రాహిత్యం (irrationality). జానపద విజ్ఞానం అనేక ప్రదేశాలలో కనిపిస్తుందన్నది మన మెరిగిందే. తెలుగుదేశంలో చంద్రుణ్ణి పిలుస్తూ మన తల్లులు జోలపాటలు పాడితే ఎక్కడో ఉండే దీబంప్త్ర ఎవఅ కూడా చంద్రుణ్ణి పిలుస్తూ పాటలు పాడుతారు. విభిన్న ప్రదేశాలలో కనిపించే ఈ ఏకత్వం ఏ విధంగా సాధ్యమవుతుంది అన్నది జానపద విజ్ఞానంలో ఒక ముఖ్యప్రశ్న. దీనికి ఏకోత్పత్తి వాదం (Monogenesis), బహుళోత్పత్తివాదం (Polygenesis) రెండు సమాధానాలు. ఏకోత్పత్తివాదం ప్రకారం ఒక కథాగేయం గాని, సామెతగాని, మరేదైనాకాని ఎక్కడో ఒకచోట పుడ్తుంది. అది సాంస్కృతిక వ్యాపక గుణం (Cultural Diffusion) వల్ల మిగిలిన స్థలాలకు వ్యాపిస్తుంది. బహుళోత్పత్తి వాదం ప్రకారం జానపద విజ్ఞానం విభిన్న ప్రదేశాలలో, విభిన్న కాలాలలో స్వతంత్రంగా అవతరిస్తుంది. మానవుని మనఃస్థితిలో ఏకత్వాన్ని ప్రతిబింబిస్తుండడంవల్ల విభిన్న ప్రదేశాలలోని కథలలో, కథాగేయాలలో, పాటలలో మనకు పోలికలు కనిపిస్తాయి. ఈ రెండు విధాలుగానూ కథాగేయాలు అవతరించే సాధ్యత ఉంది. కథాగేయాలలో కనిపించే మూలాంశాలన్నిటినీ సేకరించి అవి ఏ ఏ దేశాలలో ఎక్కువగా ప్రచారంలో





ఉన్నవి మొదలైన అంశాలను నిశితంగా పరిశీలించి, ఈ కథాగేయం ఈ ప్రదేశం నుంచి వచ్చి ఉండవచ్చునని ఊహించడానికి కొంతవరకు సాధ్యమవుతుంది. ఈ విషయంలో Stith Thompson's Motif-Index of Folk Literature చాలా వరకు ఉపయోగిస్తుంది.

**కథాగేయాల విభజన :**

కథాగేయాలను ఛందస్సునుబట్టి, వస్తువునుబట్టి, కాల ప్రమాణాన్ని బట్టి, గాయకులను బట్టి, వాద్యాలను బట్టి అనేక విధాలుగా విభజించవచ్చు. స్థూలంగా కథాగేయాలను సాంప్రదాయిక కథాగేయాలు (Traditional ballads) లేక జనప్రియ కథాగేయాలు (Popular ballads) అనీ, సాహిత్య కథాగేయాలు (Literary ballads) అనీ రెండు విధాలుగా విభజిస్తారు. సాహిత్య కథాగేయాలనే, కథాగేయానుకరణలని (Ballads of imitation) కూడా చెప్పవచ్చు. కొందరు జనప్రియ కథాగేయాలకు, సాంప్రదాయిక కథాగేయాలకు కొంత భేదాన్ని గుర్తిస్తారు. జనప్రియ కథాగేయాలన్నవి జనప్రియత్వం, సంప్రదాయం రెండూ ఉండేవి. ఇవే నిజమైన జానపద కథాగేయాలు. ఇక రెండవ రకం వృత్తిగాయకులు రచించినవి. ఇవి జనప్రియ గేయాల లాగా కాకుండా వైయక్తిక రచనలై ఉండి, జనప్రియ కథాగేయాల ఆధారంగా రూపొందింపబడినవి. వీటికి సంప్రదాయం ఉంటుంది. జనప్రియత్వం ఉంటే ఉండవచ్చు, లేకుంటే లేకపోవచ్చు. ఇవి సాంప్రదాయిక కథాగేయాలు. ఇక ఈ రెండిటికంటె నాగరిక సాహిత్యానికి దగ్గరగా, జానపద కథాగేయాలకు అనుకరణలుగా రూపొందిన సాహిత్య కథాగేయాలు మూడవ రకం.

కథాగేయాలను పాడటానికి పట్టే కాలప్రమాణాన్ననుసరించి వాటిని మూడు భాగాలు చేయవచ్చు. లఘుకథాగేయాలు (Balladlings), కథాగేయాలు (Ballads), గేయకథాచక్రాలు (Ballad cycles). తెలుగు కథాగేయాల్ని, కన్నడ కథాగేయాల్ని, ఇతర దేశాల కథాగేయాల్ని పరిశీలించినప్పుడు ఆయా భాషలలో విశిష్టంగా కనిపించే లక్షణాలనుబట్టి విభజన జరపడం మేలనిపిస్తుంది. తెలుగు వీరగాథా చక్రాలను[10] ఇతివృత్తాన్ని బట్టి "శక్తి కథా చక్రము, పల్నాటి వీరకథా చక్రము, కాటమరాజు కథాచక్రము, వెలకంటి వీరుని కథా చక్రము" అని విభజింపవచ్చునని డా.సుబ్బారావు అభిప్రాయపడుతున్నారు.[11] శక్తికథా చక్రంలో "ఎల్లమ్మ కథా చక్రము, అంకమ్మ కథా చక్రము, చౌడమ్మ పాటలు, ఇతర శక్తి కథలు"[12] ఉన్నాయి. అలాగే కథాగేయాలలో

(Ballads) బొబ్బిలి వరుస కథలు, పదాలు, జంగం కథలు మొదలైనవి ఛందస్సును బట్టి యేర్పడే విభాగాలు. లఘుకథా గేయాలలో గుర్రాల గోపిరెడ్డి పాట, మానందిరెడ్డి పాట, ధర్మాపురం నరసింహుని పాట మొదలైనవి వస్తాయి.

"జానపద గేయ సాహిత్యము"ను వివేచించిన డా॥ రామరాజుగారు జానపద గేయాలను, కథాగేయాలను వర్గీకరించడానికి కొన్ని పద్ధతులను సూచించారు.[13] వస్తువును బట్టి గేయాలను పౌరాణికాలు, చారిత్రకాలు, అస్పష్ట చారిత్రకాలు, మతసంబంధాలు, సాంఘికాలు మొదలైన భేదాలుగా విభజించవచ్చు. రసానుగుణంగా విభజిస్తే శృంగార గేయాలు, అద్భుత గేయాలు, కరుణరస గేయాలు మొదలైనవి లభిస్తాయి. ఆలంబనాన్ని బట్టి స్త్రీల పాటలు, పురుషుల పాటలు, స్త్రీ పురుషోభయ సంబంధాలు మొదలైన వాటిని కల్పించవచ్చు. అయితే వీటిలో ఏదీ సమగ్రం కాదు. డా॥ రామరాజుగారి విభజనలో ఈ క్రింది విభాగాలను కథాగేయాలకు అన్వయించవచ్చు. 1.పౌరాణికాలు, 2.చారిత్రకాలు, 3.మత సంబంధ గేయాలు, 4.పారమార్థికాలు, 5.శృంగార గేయాలు, 6.అద్భుత రస గేయాలు, 7.కరుణరస గేయాలు, 8.హాస్యరస గేయాలు.

Gummere "The Popular Ballad" లో కథాగేయాలలోని అనేక విభాగాలను గురించి చర్చించాడు. Riddle Ballads అన్నవి అత్యంత ప్రాచీన కథాగేయాలకు చెందుతాయి. ప్రాచీన కాలంలో పొడుపు కథలన్నీ గేయరూపంలో ఉండేవి. ఈ నాటికి కూడా పొడుపు కథలు చాలావరకు గీతరూపంలో ఉండడం మనం గమనించవచ్చు. పొడుపు కథలే కథా రూపంలో కూడా ఉంటాయి. అలాగే కథా గేయాలుగా కూడా రూపుదాల్చిన కొన్ని పొడుపు కథలు కనిపిస్తాయి. గృహసంబంధమైన కలతలు మొదలైనవి కొన్ని కథాగేయాలకు వస్తువులు కావచ్చు. అలాంటివి Domestic complication అనే పేరును కలిగి ఉన్నాయి. రాక్షస వివాహం లాంటి కథను కల్గిన కథాగేయాలు మరొక రకం. పెళ్ళి కూతుర్ని బలవంతంగా ఎత్తుకుపోయి పెళ్ళి చేసుకునే కథలు వీటిలో కనిపిస్తాయి.

కథాగేయాలలో మానవాతీత శక్తుల పాత్ర ప్రముఖమైనది. ప్రాచీన మానవునికి నమ్మకాలు, ఆచారాలు ఎక్కువ. అనేక కథాగేయాలలో ఈ మానవాతీత శక్తులకు సంబంధించిన కథలు కనిపిస్తాయి. రాజకుమారులకు సంబంధించిన కథాగేయాలు సరేసరి. కథాగేయాలలో చాలావరకు ఇటువంటివే. మంత్ర తంత్రాలతో కూడిన కథాగేయాలలో చాలావరకు ఇటువంటివే. మంత్ర తంత్రాలతో కూడిన





కథాగేయాలు కొన్నిటిని Transformation Ballads అనే పేరుతో పిలుస్తారు. చారిత్రక ప్రాధాన్యం ఉండే కథాగేయాలు Legendary Ballads అనే పేరుతో చలామణీ అవుతాయి. కాల్పనికాలైన ప్రాచీన ఇతివృత్తాలుగల కొన్ని కథాగేయాలను Minstrel Ballads అని Gummere పేర్కొన్నాడు. Border Ballads అనేవి ప్రధానమైన కథాగేయాలలో ఒకటిగా Gummere పేర్కొన్నాడు. అలాగే యుద్ధ సంబంధమైన కథాగేయాలు ప్రధాన విభాగాలలో చేరుతాయి. ఇవికాక Humourous Ballads, Journalistic Ballads, Ballads of the sea మొదలైన కథా గేయాలను Gummere తన "The Popular Ballad" అనే పుస్తకంలో పేర్కొన్నాడు. ఈ అన్ని విభాగాలను గమనించి, ప్రాదేశికంగా ఉండే విశిష్టగుణాలను గమనించి కథాగేయాలను వర్గీకరించడం మంచిది.

జానపద మహాకావ్యాన్ని (Folk Epic) కొందరు నాలుగు విధాలుగా వర్గీకరిస్తారు. Felix J.Oinas 1.Shamanistic 2.Heroic 3.Romantic 4.Historic అనే నాలుగు విధాల కావ్యాలను గుర్తించాడు.[14] మంత్ర తంత్రాలతో, అంతగా వీరోచితమైన సన్నివేశాలు లేని, మానవాతీత కథాగేయాలను Shamanistic epics అనే పేరుతో పిలుస్తారు. వీరరస ప్రధానాలు, కాల్పనికాలు, చారిత్రకాలు మిగిలిన మూడు విభాగాలు. సహజాతీతమైన శక్తి సామర్థ్యాలను ప్రదర్శించే వీరుల కథలు Heroic లో ఉంటాయి. వీరత్వం కాకుండా ప్రేమ, సాహసం ఉండేవి Romantic epics చారిత్రకమైన సన్నివేశాలకు, పాత్రలకు ప్రాధాన్యం ఉండేవి Historic epics. ఇలా ఆయా భాషా విశేషాలను బట్టి, మూలాంశాలనుబట్టి కథాగేయాలను విభజించవచ్చు

**సేకరణ, అధ్యయనం, వైశిష్ట్యం :**

కథాగేయాలను సేకరించడం పాశ్చాత్య దేశాలలో 17వ శతాబ్దం పూర్వార్ధంలోనే ప్రారంభమయింది. 18 వ శతాబ్దం నుంచి క్రమబద్ధమైన సేకరణ, అధ్యయనం ప్రారంభమయ్యాయి. 1765లో ప్రచురితమైన Percy's Relique of Anciet English Poetry గొప్ప సంకలనం. ఇది కాల్పనిక కవిత్వ ప్రాదుర్భావానికి చాలావరకు దోహదం చేసింది. ఇంగ్లండు, జర్మనీ, స్కాండినేవియా మొదలైన దేశాల కథా గేయాలు అందరినీ ఆకర్షించాయి. Sir Walter Scott ప్రచురించిన Minstrelsy of the Scottish Border (1802-03) జానపద కవిత్వ అధ్యయనంలో కొత్త దారులను చూపింది. 19వ శతాబ్దం నుంచి యూరపులోని అనేక దేశాలలో కథాగేయాల సేకరణ, అధ్యయనం ప్రారంభమయ్యాయి. Francis James Child అనే అమెరికన్ విద్వాంసుడు కథాగేయాల

సేకరణకు, ప్రచురణకు తీసుకొన్న శ్రద్ధ గమనార్హమైంది. ఎనిమిది సంపుటాలలో ఆయన ప్రచురించిన English and Scottish Ballads చిరస్మరణీయమైన సంకలనం. Child దే మరొక బృహద్గ్రంథం The English and Scottish Popular Ballads (1882-98) ఐదు సంపుటాలలో వెలువడింది. తర్వాత Gummere, Louise Pound మొదలైనవారు ఈ క్షేత్రంలో కృషిచేసిన మహనీయులు. ఫిన్లెండుకు చెందిన Elias Lonnrot ఫిన్నిష్ వీరులను గురించిన కథాగేయాలను సేకరించి ప్రచురించిన Kalevala ప్రపంచ ప్రసిద్ధి చెందింది. క్రీ.శ.1842లోనే సి.పి.బ్రౌనుదొర ఒక జంగముణ్ణి నెలరోజులపాటు తన ఇంట్లో ఉంచుకొని బొబ్బిలి కథ, కొమార రాముడి కథ, కాకమ్మ కథలను పాడించి, వ్రాసి భద్రపరచడం మనం స్మరించుకొని తీరాలి. 1874లో J.A.Boyle దొర సర్వాయిపాపని కథను సేకరించారు. డా॥ రామరాజు, డా॥ నాయని కృష్ణకుమారి, డా॥ టి.వి.సుబ్బారావు ప్రభృతులు తెలుగులో జానపద కథాగేయాలను గూర్చి కృషి సల్పారు. ఇంకా ఎంతో మంది పెద్దలు ఇందులో ఆసక్తిని చూపుతున్నారు.

జానపద కథాగేయాలు ఇతిహాసాలకు మూలకందాలు. సహజత్వమే ప్రాణంగా అవతరించిన రసవాహినులు. ఇవి సాంఘిక ప్రయోజనాన్ని సాధించడంలో కూడా మహత్తర పాత్రను వహించే శక్తి కూడా కలిగి ఉన్నాయి. రష్యాలో విప్లవ సాధనకు జానపద కవిత్వ పద్ధతులను వాడుకున్న విషయాన్ని మనం గమనించవచ్చు. సర్వజనాకర్షణశక్తి, సంఘసంచాలక శక్తి, విచిత్రానుభూతిదాయక శక్తి కథాగేయాలకు ఉండే మూడు మహత్తర శక్తులు.[15] అందువల్ల కథాగేయాల సేకరణ అధ్యయనం, వాటిని సాంఘిక ప్రయోజనానికి తగినట్లుగా ఉపయోగించుకోడం చాలా అవసరం.

**ప్రమాణ గ్రంథాలు :**


**ఇంగ్లీషు :**

1.Dictionary of Folklore, Mythology, Legend - Ed.Maria Leach

2. The Popular Ballad - Francis B.Gummere

3. The Ballad of Tradition - Gordon H.Gerould

4. The Ballad Book - Mac Edward Leach

5. The Ballad Tree - Evelyn Kendrick Wells

6. Folklore and Folklife -Ed.Richard M.Dorson

7. The Study of Folklore - Ed.Alan Dundes

8. Introducing Folklore-Kenneth W.Clarke and Mary W.Clarke.







**తెలుగు :**

9. తెలుగు జానపద గేయ సాహిత్యము - డా.బి.రామరాజు

10. జానపద సాహిత్యం-వీరగాథలు - డా.టి.వి.సుబ్బారావు

11. తెలుగు జానపదగేయ గాథలు - డా.నాయని కృష్ణకుమారి

12. ఆంధ్రుల జానపద విజ్ఞానం - డా.ఆర్వీయస్.సుందరం

13. అనంతపురం జిల్లా స్త్రీల పాటలు - డా.జి.ఎస్.మోహన్

**కన్నడం :**

14. జానపద గీతెగళు - డా.కె.శివరామ కారంత

15. జానపద స్వరూప - డా.హా.మా.నాయక

16. జనపద సాహిత్య సమీక్షె - డా.జీ.శం.పరమశివయ్య

17. జనపద గీతె- డా.సి.పి.కె.


**టిప్పణి**

1. "Ballad is a song to which folk used to dance; yet nearly every variety of short poem in English has been called a ballad"-Gummere, The Popular Ballad, p.3
2. The Popular Ballad, p.2
3. The Popular Ballad, p.13
4. తంగిరాల సుబ్బారావు, జానపద సాహిత్యము-వీరగాథలు, పు.17
5. The Ballad Tree. (1950), p.93-97, as quoted in Introducing Folklore (1963), p.68
6. Francis B.Gummere, The Popular Ballad (1959), p.73-74
7. డా॥ తంగిరాల సుబ్బారావు ఉదాహరించింది: జానపద సాహిత్యము-వీరగాథలు, పు.24-26
8. Mac Edward Leach, Standard Dictionary of Folklore, Mythology and Legend, Vol.I. p.106
9. "Minstrel, as later official term, must often mean a performer on musical instruments, town piper, or what not" -Gummere, The Popular Ballad, p.8
10. డా.టి.వి.సుబ్బారావు Ballad cycles కు వాడిన పేరు : జానపద సాహిత్యము-వీరగాథలు,పు.28
11. అదే పు.28
12. అదే పు.28
13. తెలుగు జానపద గేయ సాహిత్యము, పు.6-7
14. Folklore and Folk life, Ed.Richard M.Dorson, p.101
15. డా॥ టి.వి.సుబ్బారావు, జానపద సాహిత్యము-వీరగాథలు, పు.79

# 3. గద్య కథనాలు

Prose Narratives అనే పదానికి సమానార్థకంగా మనం గద్య కథనాలు అని తెలుగులో వాడవచ్చు. మానవుని ప్రాచీన సంస్కృతి, సంప్రదాయాలను గూర్చి అధ్యయనం చెయ్యడానికి చక్కగా ఉపకరించే సాధనాలలో గద్య కథనాలు ముఖ్యమైనవి. కథనం అన్నది ఈనాటిది కాదు. కథ చెప్పాలనే ఆత్రుత, వినాలనే కుతూహలం తరతరాలనుంచి మానవుల్లో గూడు కట్టుకొని ఉంది. గద్య కథనాలన్నీ జానపద సాహిత్యంలో చేరుతాయా అన్నది సందేహాస్పదమే. ఎందుకంటే, గద్య కథనాలలో భాగాలైన కొన్ని పురాణాలకు (myths), ఐతిహ్యాలకు (legends) ఒక నిర్దిష్టరూపం అంటూ ఉండదు. కాని కథలు అలా కాదు. వాటికి ఎన్ని రూపాంతరాలున్నా, ఒక రూపం అంటూ ఉంటుంది. పురాణాలకు, ఐతిహ్యాలకు కొన్ని నమ్మకాలు, సన్నివేశాలే ప్రధానం కాని, రూపం ప్రధానం కాదు. అందుచేత గద్య కథనాలలో ముఖ్యభాగాలైన పురాణాలు, ఐతిహ్యాలు, కథలు అనే మూడిట్లో కథలను మాత్రమే జానపద సాహిత్యంగా, మిగిలిన రెండింటిని జానపద విజ్ఞానంలో ఒక భాగమైన గద్య కథనాలుగా పరిగణించేవారున్నారు. అయితే పురాణాలు, ఐతిహ్యాలు అనే రెండింటికీ పురాణ కథలు (mythological-stories), ఐతిహ్యాత్మక కథలు (legendary stories) అనే కథా రూపాలకూ ఉండే భేదాన్ని గమనించడం చాలా కష్టం కావడం చేత సామాన్యంగా గద్య కథనాలను జానపద సాహిత్యంలో ఒక భాగంగా చేర్చడం జరుగుతున్నది. జానపద సాహిత్యమనే పేరుతో పిలిచినా పిలవకున్నా గద్యకథనాలు వాగ్రూపమైన జానపద విజ్ఞానంలో ఒక భాగమన్నది మాత్రం నిజం. జానపద కవిత్వం గేయరూపంలో ఉంటే, గద్యకథనాలు వచనరూపంలో ఉంటాయని ఆ పేరే సూచిస్తున్నది. జానపద విజ్ఞానానికి అన్వయించే సామాన్య లక్షణాలతోబాటు గద్యరూపమైన కథనం కలిగి ఉండడం వీటి ముఖ్య లక్షణమని చెప్పవచ్చు. వాగ్రూపమైన ప్రచారం, అనేక రూపాలు, జనప్రియత్వం, గద్యరూపం ఉండే జానపద రూపాలను గద్యకథనాలని పిలవవచ్చు.

గద్యకథనాల స్వరూపాన్ని గురించి చెప్పేటప్పుడు మూలాంశం (motif), మాదిరి (type) అనే రెండు విషయాలను గమనించవలసి ఉంటుంది. జానపద సాహిత్య అధ్యయనంలో ఈ రెండిటి పాత్ర అతిముఖ్యమైనది. కథలు, కథాగేయాలు మొదలైన వాటి స్వరూపాన్ని పరిశీలించేటప్పుడు, వాటిని వర్గీకరించేటప్పుడు ఈ





మూలాంశాలను, మాదిరులను తప్పనిసరిగా పరికించాల్సి ఉంటుంది. మూలాంశాలు కథావస్తువుకు సంబంధించినవని, మాదిరి కథా నిర్మాణ పద్ధతికి సంబంధించినదని స్థూలంగా చెప్పవచ్చు. జానపద గద్యకథనాలు, కథాగేయాలు మొదలైనవాటిలో కనిపించే కనిష్ఠాంశాలను మూలాంశాలు అంటారు. ఇవి మామూలుగా అసామాన్యమైనవై ఉంటాయి. ఈ మూలాంశాలను మూడు విభాగాలు చేయవచ్చు. బ్రహ్మరాక్షసి, మాంత్రికుడు, పిశాచాలు, దేవతలు మొదలైనవి పాత్రలు; మంత్రదండం, ఆకాశంలో విహరించడానికి ఉపయోగించే చాప మొదలైనవి వస్తువులు; మూడవ విభాగం కొన్ని సంఘటనలు. ఈ మూలాంశాలు సహాయంతో కథ పెరుగుతుంది. ప్రపంచ జానపద సాహిత్యంలో వాడుకలో ఉన్న మూలాంశాలను ఒకచోట చేర్చి "Motif Index of Folk Literature" అనే పేరుతో బృహత్సంపుటాలను తయారు చేసిన ఖ్యాతి Stith Thompson కు దక్కింది.

మాదిరి (type) అంటే స్వతంత్రమైన, స్వయం సంపూర్ణమైన కథ, ఒక్క మూలాంశంగాని, అనేక మూలాంశాలుగాని ఒక మాదిరిలో ఉండవచ్చు. మాదిరి చిన్నదైనా కావచ్చు లేక పెద్దదిగా ఉండవచ్చు. ఒక మాదిరిలో ఒక మూలాంశం ఉండవచ్చు అని చెప్పినంతమాత్రాన, అన్ని మూలాంశాలు ఒక్కొక్క మాదిరి అవుతాయనుకోవడం పొరపాటు. మూలాంశాలు సూచిని తయారుచేసినట్లే, విద్వాంసులు మాదిరి సూచిని కూడా తయారుచేశారు. జానపద కథల వర్గీకరణకు, కథల నిర్మాణ పద్ధతిని తెలుసుకోడానికి చాలా ఉపయుక్తమైన "The Types of the Folk-Tale" అనే ఉద్గ్రంథం Antti Aarne, Stith Thompson అనే ఇద్దరు విద్వాంసులు కృషి ఫలితంగా 1928లో వెలువడింది. Motif-Index, Type-Index జానపద కథల అధ్యయనంలో మహత్తరమైన పాత్రను వహిస్తున్నవి.

గద్యకథనా లన్నిటికీ అన్వయించే విధంగా లక్షణాలను నిర్దేశించడం చాలా కష్టంతో కూడుకున్నపని. ఇంతకు ముందే చెప్పినట్లు జానపద సాహిత్యంలో మనం చేర్చవచ్చా చేర్చకూడదా అని సందేహించడానికి ఆస్కారమిచ్చే పురాణం, ఐతిహ్యం. జానపద సాహిత్యంలో ప్రధాన భాగమైన కథ, కథలలో ముఖ్య విభాగాలైన Marchen, Sage మొదలైన వాటిని వేరువేరుగా నిర్వచించి లక్షణాలను నిర్దేశించడానికి జానపద విజ్ఞానులు ప్రయత్నించారు.

**పురాణం :**

దేవతలు, రాక్షసులు ఇంకా ఇతర మానవాతీత శక్తులు పాత్రలుగా ఉండే

కథన రూపాలు పురాణాలు. ప్రపంచం పుట్టుకను గురించి, మానవుని జన్మను గురించి వీటిలో ప్రవచించడం జరుగుతుంది. కథన రూపంలో ఉండే పురాణాలలో కనిపించే మత సంబంధమైన విషయాలు, నమ్మకాలు తక్కువ మోతాదుకు దిగి, అవి జానపద కథలుగా మారే వీలుంది. కాని జానపద కథలకు, పురాణాలకు ఉండే భేదాన్ని సూక్ష్మంగా గుర్తించడం కష్టసాధ్యం. మొత్తంమీద మత సంబంధమైన నమ్మకాలతో, కర్మకాండలతో కూడినవి పురాణాలని చెప్పవచ్చు. విజ్ఞాన ప్రపంచానికి అందని ప్రాచీన కాలాన్ని వైజ్ఞానికంగా విశ్లేషించడానికి ప్రయత్నించేవే పురాణాలు. పురాణాలలో దేవుళ్ళు, దయ్యాలు ఉన్నవన్న దానికంటే, 'ఇవి జరిగాయి' అనే నమ్మకం ప్రధానమని మానసిక సాంస్కృతిక దృక్పథం (psycho - cultural approach) తో పురాణాలను పరిశీలించేవారంటారు.[1] 'భాషా శాస్త్ర దృష్టితో, మానవశాస్త్ర దృష్టితో పురాణాలను అధ్యయనం చేసే ఆధునిక పురాణ విద్వాంసులలో ప్రసిద్ధులైన Pierre Maranda ఈ క్రింది విధంగా పురాణాన్ని నిర్వచించారు. "Myths display the structured predominantly culture specific, and shared, semantic systems which enable the members of a culture area to understand each other and to cope with the unknown. More strictly, myths are stylistically definable discourses that express the strong components of semantic systems."[2]

పురాణానికి, మూఢవిశ్వాసానికి (Superstition) ఉన్న భేదం గమనించదగింది. పురాణంలో ఒక విశేషమైన నమ్మకం ప్రధానం. మూఢ విశ్వాసంలో వివేకశూన్యమైన నమ్మకం ఆధారంగా కలిగే భయం ప్రధానంగా ఉంటుంది. వీటికి సంబంధించి మత సంబంధమైన నిషేధం కూడా (taboo) మామూలుగా ఉంటుంది. అయితే పురాణాలే తర్వాత మూఢ విశ్వాసాలు కావచ్చు. లేక మూఢ విశ్వాసాలు పురాణాలుగా పరిణమించవచ్చు.

పురాణాలకు, నమ్మకాలకు ఉండే సంబంధం కూడా పరిశీలించదగింది. ఒక తరానికి ఒక విషయం మీద ఉండే విశ్వాసం మరొక తరం వాళ్ళకు పురాణం అవుతుంది. అంటే నేడు కేవలం నమ్మకంగా ఉండేది కొన్ని తరాల తర్వాత ఒక పురాణం కావచ్చు నన్నమాట.

**ఐతిహ్యం** (legend) :

కొందరు వ్యక్తులు, స్థలాలు, వస్తువులకు సంబంధించిన కథనాలను ఐతిహ్యాలని పిలుస్తారు. ఏనాడో జరిగిందని నమ్మే సన్నివేశాన్ని జానపదులు ఐతిహ్యంగా





రూపొందిస్తారు. పురాణానికి, ఐతిహ్యానికి భేదాన్ని స్పష్టంగా చెప్పడం చాలాసార్లు కష్టమవుతుంది. పురాణంలో ముఖ్యమైన పాత్రలు దేవతలు, దయ్యాలు. దాని ఉద్దేశం కొన్ని విషయాలను వివరించడం, ఐతిహ్యాలలో కథ ముందెప్పుడో జరిగినట్లుగా చెప్పడం జరుగుతుంది.

ఐతిహ్యాలే కాక మరి కొన్ని రకాల కథలను కూడా చేర్చుకొని జర్మన్ భాషలో 'Sage' అనే పదాన్ని వాడతారు. జరిగినవే అని జానపదులు నమ్మిన సంఘటనలను గూర్చిన కథలివి. వీటి ముఖ్యోద్దేశం సత్య ప్రతిపాదనం.

**మార్చెన్ లేక కట్టు కథ :**

కల్పనాత్మకాలైన కథలన్నిటినీ కలిపి Marchen అనే పేరుతో పిలుస్తారు. జర్మన్ శబ్దమైన Marchen కు సమానార్థకమైనది ఇంగ్లీషులో లేదు. ఈ కథలలో అద్భుతమైన విషయాలు, అసహజ ప్రపంచాలలో అసంభావ్యమైన పాత్రలు ఉంటాయి. మంత్ర తంత్రాలు, పరకాయ ప్రవేశాలు కనిపిస్తాయి. ఇది ఒక కాలానికిగాని, ప్రదేశానికిగాని సంబంధించినది కాదు. రాజరికానికి సంబంధించిన పాత్రలు ఉంటాయి. నాయిక మామూలుగా చిన్న కూతురై ఉంటుంది. మూడుకు ఎక్కువ ప్రాధాన్యం కనిపిస్తుంది. ముగ్గురు కూతుళ్ళు ఉండడం. కోరికలు కోరినప్పుడు మూడిటిని కోరడం వగైరా కనిపిస్తాయి. మంచివాళ్ళకు ఎప్పుడూ విజయం లభిస్తుంది. రాజులు, రాజకుమారులు మామూలుగా మంచివాళ్ళుగా ఉంటారు. ఒకవేళ రాజు చెడ్డవాడైనా, రాజకుమారుడు మంచివాడై ఉంటాడు.[3]

**జానపద కథ** (Folktale) :

గద్య కథనాలలో అత్యంత ముఖ్యమైనది జానపద కథ. జానపద సాహిత్యంలో మనం ప్రత్యేకంగా పరిశీలించవలసిన విభాగం కూడా ఇదే. పురాణ సంబంధమైన కథలు, ఐతిహాసిక కథలు, మార్చెన్, సాగె మొదలైన అనేక కథనరూపాలను జానపద కథ అనే పేరుతోనే పిలవడం వాడుక. జానపద కథలకు అన్వయించే విధంగా Axel Olrik కొన్ని లక్షణాలను నిర్దేశించాడు. అవి ఈ క్రింది విధంగా ఉన్నాయి.[4]

1. ముఖ్యమైన క్రియతో ప్రారంభం కావు. ఉన్నట్టుండి ముగిసిపోవు.

2. పునరావృత్తి సామాన్యంగా అన్ని చోట్లా కనిపిస్తుంది. అది కథకు నిండుదనాన్ని ఇస్తుంది. ఈ పునరావృత్తి ఒక్కొక్కసారి మూడు సార్లు, కొన్ని దేశాలలోని

ధార్మిక సంకేతాల కారణంగా నాలుగు సార్లు ఉండవచ్చు.

3. మామూలుగా ఒకసారి ఇద్దరు వ్యక్తులు మాత్రం ఒక దృశ్యంలో కనిపిస్తారు. ఇంకా ఎక్కువగా ఉన్నా, ఇద్దరు మాత్రం క్రియాశీలురై ఉంటారు.

4. విభిన్న పాత్రల కలయిక కనిపిస్తుంది. ఉదాహరణకు నాయకుడు – ప్రతినాయకుడు, శిష్టుడు – దుష్టుడు.

5. ఒకే రకమైన పాత్రలు రెండు ఉంటే, వాళ్ళు చిన్నవాళ్ళుగా గాని లేక అశక్తులుగాగాని చిత్రింపబడతారు. ఒకవేళ శక్తిగలవాళ్ళు అయితే విరోధులయ్యే అవకాశం ఉంది.

6. దుర్బలులుగా ఉండేవారు మంచివాళ్ళుగా ఉంటారు. సోదరులలో చిన్నవాళ్ళు మామూలుగా జయం సాధిస్తారు.

7. పాత్ర చిత్రణ సరళంగా ఉంటుంది. కథకు నేరుగా సంబంధించినవి మాత్రం చిత్రితమవుతాయి. పాత్రలకు, కథకు అతీతమైనవేవీ కనిపించవు.

8. కథా వస్తువు సరళంగా ఉంటుంది. ఏకకాలంలో ఒక్క కథనే వివరించాలి. రెండుగాని, అంతకంటె ఎక్కువగా కథలు ఏకకాలంలో చెప్పవలసివస్తే అప్పుడు అది సాహిత్యకథను పోలుతుంది.

9. మామూలుగా అన్నీ చాలా సరళంగా ఉంటాయి. వైవిధ్య పూర్ణంగా చేయాలనే ప్రయత్నం కనిపించదు.

పై లక్షణాలనుబట్టి సాధ్యమైనంతవరకు కథలు సరళంగా ఉంటాయని తేలింది. కథనమే కథలలో ప్రధానం. అయితే ఈ లక్షణాలవల్ల జానపద కథల సమగ్ర స్వరూపం గోచరమవుతుందని అనుకోవడానికి వీలులేదు. మొత్తం మీద కథలలో మనకు కనిపించే విషయాలను కొన్ని విభాగాలుగా చేసుకొని పరిశీలించవచ్చు.

కథలలో కనిపించే పాత్రలను గురించి మొదట చెప్పవలసి ఉంది. మానవులేకాక జానపద కథలలో జంతువులు, దేవతలు, దయ్యాలు, బ్రహ్మరాక్షసులు వగైరా పాత్రలన్నీ కనిపిస్తాయి. నాయకుడు, నాయిక, ప్రతి నాయకుడు ఉంటారు. మామూలుగా చిన్న కొడుకు కథానాయకుడుగా ఉంటాడు. పెద్ద కొడుకు ఇంటి విషయాలను చూచుకొంటూ ఉంటాడు. ఒక్కొక్కసారి అప్రధాన పాత్రలే ప్రాముఖ్యాన్ని కలిగి ఉంటాయి. నాయకుడికి జంతువుల సహాయం మామూలుగా లభిస్తూ ఉంటుంది. పాత్రల తర్వాత సన్నివేశాలను పరిశీలిస్తే ఇవి స్వర్గ మర్త్య పాతాళాలు మూడిట్లోనూ జరుగుతుంటాయి. నాయకులకు ఈ అన్ని లోకాలతో సంబంధం





ఉంటుంది. ఇవికాక కథలలో కొన్ని వస్తువులకు చాలా ప్రాముఖ్యం ఉంటుంది. మంత్రదండాలు, ఉంగరాలు, భూతద్దాలు మొదలైన వాటికి జానపదులు కథలలో ప్రాధాన్యాన్నిస్తారు. మొత్తంమీద ఎన్నో చిత్రవిచిత్రమైన విషయాలు కథలలో ఉంటాయి. చివరికి దుష్టులకు శిక్ష, శిష్టులకు రక్ష, విజయం అన్నవి కథలో ముఖ్య ఉద్దేశాలుగా ఉంటాయి. మామూలుగా కథలు సుఖాంతాలుగా ఉంటాయి. దుఃఖాంత కథలు చాలా తక్కువ. 'అనగా అనగా' అంటూనో, 'ఒకానొకకాలంలో' అనో కథ మొదలై, 'కథ కంచికి వెళ్ళింది, మనం ఇంటికి వెళ్దాం అనో' (తెలుగు కథలైతే), 'తర్వాత వాళ్ళు సుఖంగా ఉన్నారు'అనో ముగుస్తుంది. పెళ్ళి చివరి సన్నివేశంగా ఉండడం సామాన్యంగా కనిపిస్తుంది.

**గద్య కథనాల పుట్టుక :**

జానపద విజ్ఞానంలో పుట్టుకను గురించిన వివేచన చేసేటప్పుడు విద్వాంసులు ముఖ్యంగా కథలను దృష్టిలో పెట్టుకోడం గమనించదగింది. కథలు అత్యంత ప్రాచీన కాలం నుంచి ఉన్నాయి. పిరమిడ్లు ప్రాచీనమైనవైతే కథలు ఇంకా ప్రాచీనమైనవి. పిరమిడ్లు కట్టిన cheops దగ్గర 5,000 సంవత్సరాల క్రితమే వృత్తికథకులు ఉండేవారట.[5] వైశిష్ట్యం దృష్ట్యామాత్రమే కాకుండా సంఖ్యాదృష్ట్యా కూడా కథలకు జానపద సాహిత్యంలో ప్రముఖమైన స్థానం ఉంది. గద్య కథనాలలోని పురాణాల పుట్టుకను గురించి విద్వాంసులు ప్రత్యేకంగా కృషి చేశారు. ఖగోళ వస్తువులను గురించిన కల్పనలు, ఇతర భౌతిక వస్తువులను గూర్చిన ఊహలు, ప్రాచీన కర్మకాండలు మొదలైనవి పురాణాలకు, ఐతిహ్యాలకు మూల కారణాలయ్యాయంటూ విద్వాంసులు ఎన్నో సిద్ధాంతాలను ప్రతిపాదించారు. జానపద కథలను, గద్య కథనాలన్నిటినీ, ఆ మాటకొస్తే జానపద విజ్ఞానంలోని ఇంకా అనేక అంశాలను, వాటి జన్మ సంబంధమైన విషయాలను విశ్లేషించాలంటే మనం జానపద విజ్ఞానులు ప్రతిపాదించిన కొన్ని సిద్ధాంతాలను ఆశ్రయించవలసి ఉంటుంది. ముఖ్యంగా జానపద కథలకు అన్వయించదగిన సిద్ధాంతాలలో ఇండో – యురోపియన్ సిద్ధాంతం, పురాణ మూల సిద్ధాంతం, భారత మూల సిద్ధాంతం, స్వప్న మూల సిద్ధాంతం మొదలైనవి చేరుతాయి.

Jacob Grimm, Wilhelm Grimm అనే జర్మన్ సోదరులు తాము ప్రచురించిన (1812-14, two volumes) Kinder-und Hausmarchen అనే కథా సంపుటాలలో ఇండో యూరోపియన్ సిద్ధాంతాన్ని ప్రతిపాదించారు. ప్రపంచంలోని కథలన్నిటికీ ఇండో

యూరోపియన్ కథలే మూలమని ఈ సిద్ధాంతం చెప్తుంది. సంస్కృత భాషకు గ్రీకు భాషకు ఉండే పోలికలను గురించి పరిశోధించిన విద్వాంసులు ఇండో – ఆర్యన్, ఇండో – యురోపియన్ భాషలకు మూలం ఒకటే అని చెప్పేసరికి, అది గ్రిమ్ సోదరులకు ఇండో యూరోపియన్ సిద్ధాంతాన్ని ప్రతిపాదించే ప్రేరణను కలగజేసింది.

గ్రీకు సోదరులే మరొక సిద్ధాంతం ప్రచారం కావడానికి కారకులయ్యారు. అది పురాణ మూలసిద్ధాంతం. ఆర్యుల పురాణాలే ముక్కలై కథలకు మూలమయ్యాయని ఈ సిద్ధాంతం ప్రతిపాదిస్తుంది. (Broken down Myth Theory). ఋగ్వేదంలో ఉన్నట్లే ఇండో యురోపియన్లు తమ దైనిక జీవనంలో రహస్యార్థాలను ఉపయోగించే వారట.[6] మాక్స్ ముల్లర్, కాక్స్ మొదలైనవారు ఈ సిద్ధాంతాన్ని బలపరిచారు. ఋగ్వేదంలో మనకు కన్పించే పౌరాణికదృష్టి కథా సాహిత్యానికి మూలమని పురాణ మూల సిద్ధాంతం ప్రధాన అభిప్రాయం. Andrew Lang ఈ సిద్ధాంతాన్ని కటువుగా విమర్శించిన వారిలో ప్రముఖుడు.

పురాణమూల సిద్ధాంతం కారణంగా విద్వాంసుల దృష్టి భారతదేశం వైపు ప్రసరించింది. మాక్స్‌ముల్లర్ వేదాలను అధ్యయనం చేస్తే, Benfey పంచతంత్రాన్ని విశ్లేషించాడు. పంచతంత్ర కథలను ఆంగ్లంలోకి అనువాదం చేసిన దీవఅటవఎ (1859) ఆ గ్రంథానికి ఆరువందల పుటల సుదీర్ఘమైన పీఠికను వ్రాశాడు. ప్రపంచంలోని వివిధ ప్రాంతాలలో కన్పించే కథలలో పెక్కింటికి భారతదేశంలోని కథలే మూలమని బెన్ఫెవాదం. ఇది భారత మూల సిద్ధాంతంగా పేరు గాంచింది (Indic Orgin Theory Benfey). భారతదేశం నుంచి కథలు బౌద్ధుల మూలంగా, అరబ్బుల మూలంగా ఇతర ప్రదేశాలకు పాకాయని ఊహించాడు.[7] Kohler, Cosquin మొదలైన వాళ్ళు భారత కథలే అన్ని కథలకు మూలమని చెప్పకున్నా, భారతదేశం కథల కాణాచి అని, అనేక కథలకు భారత కథలే ప్రేరణ అని ఒప్పుకున్నాడు. Joseph Bedier 1893లో ఈ సిద్ధాంతాన్ని తీవ్రంగా గర్హించాడు[8] Andrew Lang ఈజిప్టు కథలు భారత కథలకంటే ప్రాచీనమైనవంటూ, బెన్ఫె వాదాన్ని ఖండించాడు.

Andrew Lang కథల మూలాన్ని తెలియజేయడానికి తనే ఒక వాదాన్ని ప్రతిపాదించాడు. జానపద కథలలో కనిపించే ప్రాచీన భావాలను పరిశీలించినప్పుడు అవి పురాతన కాలం యొక్క అవశేషాలని చెప్పవచ్చునని Lang అభిప్రాయపడ్డాడు. జానపద అంశాలు ప్రపంచంలోని అనేక ప్రదేశాలలో కనిపించడానికి (Multiple existence) బహుమూల సిద్ధాంతాన్ని (Polygenesis) సమాధానంగా చెప్పినవారిలో





Lang ఒకరు. కథలలో సమానాంశాలు కనిపిస్తాయంటే దానికి కారణం అవి సంస్కృతీ వికాసంలో ఒకానొక దశలో ఉద్భవించడమే అని ఈయన అభిప్రాయం. మానవశాస్త్ర దృష్టితో కథల మూలాన్ని కనుగొనడానికి ప్రయత్నించినవారిలో Lang ప్రముఖుడు.

జానపద కథల మూలాన్ని కనుక్కోడానికి ఉపయోగించే సిద్ధాంతాలలో మరొకటి స్వప్నమూల సిద్ధాంతం. కథలలో మనం చూచే అనేక సంఘటనలకు కలలే కారణమని ఈ వాదం వారి అభిప్రాయం. స్వప్నాలను మనస్తత్వ శాస్త్రపరంగా విశ్లేషించినప్పుడు కథల అర్థవివరణ సాధ్యమవుతుందని కొందరి అభిప్రాయం. Ludwig Laistner మొదలైన వాళ్ళు ఈ సిద్ధాంతాన్ని ప్రతిపాదించారు. కోరికలను అణచి ఉంచితే అవి కలలు రావడానికి కారణమవుతాయని ఫ్రాయిడ్ చెప్పాడు. చాలా కథలలో అణచి ఉంచిని కోరికలకు ఒక రూపం ఉండడాన్ని మనం చూడవచ్చు. అయితే అన్ని కథల పుట్టుకకు స్వప్నవాదాన్ని అన్వయించడం సాధ్యం కాదు.

ధార్మిక సంబంధమైన ప్రాచీన కర్మకాండలే జానపద కథలకు మూలాలనే బలమైన అభిప్రాయం ఒకటి ఉంది. దీన్ని Ritualistic Theory అంటారు. కర్మకాండలు ప్రాచీన మానవుని జీవితంలో అత్యంత ప్రధాన స్థానాన్ని ఆక్రమించేవన్నది నిర్వివాదం. కథలను లోతుగా పరిశీలించినప్పుడు ఏదో ఒక కర్మకాండను పునర్నిర్మించవచ్చని (reconstruction) కొన్ని కథలను పరిశీలించి కొందరు విద్వాంసులు నిరూపించారు. కర్మకాండలను గురించిన ఈ సిద్ధాంతం ముఖ్యంగా పురాణాలకు అన్వయిస్తుంది కాని అన్ని కథలకు అన్వయించదు. చెట్టు ముందా విత్తు ముందా అని మనం చేసే మీమాంస ఈ సిద్ధాంతం విషయంలో కూడా ఉంది. “పురాణాలు కర్మకాండలనుంచి పుడితే కర్మకాండలు ఎలా పుట్టినట్లు?” అని కొందరు ప్రశ్నిస్తారు.[9]

జానపద కథలనే కాక మిగిలిన జానపద అంశాలను అధ్యయనం చేసేటప్పుడు గమనించదగిన ఇటీవలి సిద్ధాంతాలను, విధానాలను మనం గమనించవలసి ఉంది. చారిత్రక – భౌగోళిక విధానం (Historical-Geographical method) అన్నది అటువంటి వాటిలో ముఖ్యమైనది. దీనినే ఫిన్నిష్ విధానం అంటారు. Elias Lonnrot ఫిన్లెండులోని కథా గేయాలను సంకలనం చేసి ‘Kalevala’ అనే పేరుతో ఒక కథాచక్రాన్ని ప్రకటించిన తర్వాత ఈ చారిత్రక భౌగోళిక విధానం తలెత్తింది. ఇది జానపద కథలు, కథా గేయాలు మొదలైనవాటి చరిత్రను పునర్నిర్మించడానికి ఉపయోగించే విధానం. ఇది ఒక విధానమయినా సిద్ధాంతపరమైన అనేక ఆలోచనలకు ఈ విధానం దోహదం చేసింది. వందలకొద్దీ పాఠాలతో అనేక ప్రదేశాలలో కనిపించే జానపద కథలకు

మూల కథ ఏదో ఒక ప్రదేశంలో, ఒక కాలంలో పుట్టి ఇతర ప్రదేశాలకు వ్యాపించి ఉంటుందని ఈ సిద్ధాంతం తెలియజేస్తుంది. బహుమూల సిద్ధాంతానికి (Polygenesis) ఇది వ్యతిరేకం. ఈ చారిత్రక భౌగోళిక విధానాన్ని ప్రతిపాదించిన వారిలో Julius Krohn (1835-1888), Kaarle Krohn (1863-1933), Antti Aarne (1867-1925) మొదలైన వారు ముఖ్యులు. ఒక కథను అధ్యయనం చేయాలంటే విభిన్న పాఠాలను సేకరించి, కాలానుగుణంగా, క్రమ బద్ధంగా వింగడించి, ఆయా కథల విశేష లక్షణాలకు అనుగుణంగా ప్రతి కథనూ లోతుగా పరిశీలించాలి. కథ ప్రచారం విస్తీర్ణతను, సులభంగా గుర్తుపెట్టుకోదగిన కథలోని విశేష గుణాలను, కథనంలో విశిష్టతను గమనించి, మూలాంశాలను పరిశీలించి, అవి ఏ ప్రాంతాలకు సంబంధించినవో గమనించాల్సి ఉంటుంది. జానపద కథల పుట్టుకను, వికాసాన్ని అధ్యయనం చేయడంలో చారిత్రక-భౌగోళిక విధానం చాలా దోహదం చేసిందనడంలో సందేహం లేదు.

జానపద గద్య కథనాల పుట్టుకను, వికాసాన్ని తెలుసుకోడానికి ఉపయోగించే మరికొన్ని సిద్ధాంతాలు, విధానాలు ఉన్నాయి. వీటిలో ఏదీ స్వయం సంపూర్ణం కాదు. ఇవన్నీ జానపద కథల, మిగిలిన కథనాల వైవిధ్యాన్ని, వైశాల్యాన్ని తెలుపుతూ వాటి అధ్యయనంలో అనేక ముఖాలను ఎరుకపరుస్తాయి.[10]

**జానపద గద్య కథనాల వర్గీకరణ**

బ్రిటానికా విజ్ఞాన సర్వస్వం. Dictionary of Folklore మొదలైన గ్రంథాలలో, గద్య కథనాలలో ముఖ్యమైన మూడు విభాగాలను గూర్చిన వివరణ ఉంది. ఆ విభాగాలు 1.పురాణం (Myth) 2.ఐతిహ్యం (Legend) 3.కథ (Tale). పురాణాలను, ఐతిహ్యాలను ప్రత్యేక గద్య కథనాలుగా పరిగణించామంటే జానపద సాహిత్యంలో ప్రధానాంగమైన కథలో అనేక విభాగాలను మనం గుర్తించవచ్చు. కథలలో ముఖ్యమైన రెండు విభాగాలు మార్చెన్, సాగే (Marchen, Sage). Sage లో మళ్ళీ స్థల ఐతిహ్యాలు, వ్యక్తి ఐతిహ్యాలు, అద్భుత కథలు, సంఘటనా ఐతిహ్యాలు మొదలైన విభాగాలు ఉన్నాయి. Marchen లో పశు పక్ష్యాదులకు సంబంధించిన కథలు. మానవాతీత కథలు, వినోద కథలు మొదలైన కాల్పనిక కథలు చేరుతాయి. కొందరు గద్య కథనాలలో కట్టుకథ (marchen), అద్భుతకథ (Fairy tale), ఐతిహ్యం (Legend), సృష్టి స్థితులకు సంబంధించిన కథలు (Etiological tale), నీతికథ (Fable), పురాణం (Myth) అనే





విభాగాలను చేశారు.[11]

మొత్తం మీద కథలను Complex tales (సంకీర్ణ కథలు), Simple tales (సరళ కథలు) అని రెండు విభాగాలు చేయవచ్చు.[12] సంకీర్ణ కథలలో కట్టుకథ లేక Marchen ముఖ్యమైనది. Type Index లోని 300-749 మాదిరులు ఈ రకం కథలకు ఉదాహరణలు. Aarne, Thompson's Types of the Folk-Tale లో మానవాతీత శక్తులననుసరించి ఈ కట్టుకథల వర్గీకరణ జరిగింది. మానవాతీత శత్రువులు-అభిమంత్రితులైన భార్యాభర్తలు, బంధువులు-మానవాతీత కార్యాలు - మానవాతీతులైన సహాయకులు - మాంత్రిక వస్తువులు - మానవాతీత శక్తి, జ్ఞానం అనే శీర్షికలు పై సూచికలో - ఉన్నాయి. సంకీర్ణ కథలలో రెండవ రకం ధార్మిక కథలు (Religious tales) Novella అన్నది కాల్పనిక కథల ఒక రకం (Romantic tale). ఇవి కూడా Marchen వంటివే కాని వాటిలో ఉన్నంత అద్భుత గుణం ఉండదు. ఇవి సాహసోపేతమైనవి, శోకాత్మకమైనవి, రసవంతమైనవిగా ఉంటాయి. ఎక్కువగా మానవ స్వభావం వర్ణితమవుతుంది.

సరళ కథలలో ముఖ్యమైనవి ప్రాణి కథలు (Animal Tales), వినోద కథలు (Jokes and Anecdotes), ఇతర లాక్షణిక కథలు (Formula tales). ఈ విధంగా వివిధ విద్వాంసులు అభిప్రాయాలను, వర్గీకరణలను పరిశీలించినపుడు మొత్తం మీద కథలలో ఈ క్రింది విభాగాలను గుర్తించవచ్చు. 1.పురా కథలు (Mythological tales), 2.ఐతిహ్యాత్మక కథలు (Legendery tales), 3.వినోద కథలు (Merry tales), 4. అద్భుత కథలు (Fairy tales), 5.ప్రాణి కథలు (Animal tales) 6. సమస్యాత్మక కథలు (Riddle stories).

పురాకథలు కథావిభాగానికి చెందవని అనేవారున్నారు. కాని కేవల పురాణాలు కాకుండా కథాంశం ఎక్కువగా ఉండేవాటిని ఈ పేరుతో పిలిస్తే తప్పులేదు. సృష్టి, స్థితి, లయలను గురించిన ఈ పురాకథలు ప్రపంచంలో నలుమూలలా కనిపిస్తాయి. ప్రకృతిలో మనకు కనిపించే వస్తువులను ధార్మిక రీతిలో వివరించే ప్రయత్నం ఈ కథలలో కనిపిస్తుంది. ఐతిహాసిక కథలకూ వీటికీ ఉండే భేదాన్ని సూక్ష్మంగా గుర్తించడం కష్టసాధ్యం. పురా కథలలోని పురాణాంశాలు తక్కువయ్యేకొద్దీ అవి ఐతిహాసిక కథలుగానూ, జనప్రియ అద్భుత కథలుగానూ పరిణమిస్తాయని విద్వాంసుల అభిప్రాయం. మనిషికి ఉండే నమ్మకాలను దృఢపరచడమే ఈ పురాకథల ముఖ్యోద్దేశం. సృష్టికర్తకు, ఇతర దేవుళ్ళకు, విశ్వసృష్టికి సంబంధించినవి పురాకథలలో ఉంటాయి.

మానవసృష్టి, జంతుసృష్టి, వృక్షాదుల సృష్టి మొదలైనవి ఈ కథలలోని మరికొన్ని రకాలు.

ఐతిహ్యాత్మిక కథలు ఐతిహ్యాలకు కథారూపాలు. వీటిలో జరిగిన సంఘటనల అవశేషాలు. ఆభాసాలు ఉంటాయి. ఇవి కొంతవరకు పురా కథలను పోలినవే. అయితే వీటిలో ధార్మిక అంశ తక్కువగా ఉంటుంది. మనుష్యులు ప్రధాన పాత్రలుగా ఉంటారు. స్థలాలకు, వ్యక్తులకు, ప్రకృతి వస్తువులకు సంబంధించి ఐతిహ్యాలు మూలాలై, చారిత్రక కథలు ఉద్భవిస్తుంటాయి. మానవాతీత శక్తులకు సంబంధించినవి, మానవునికి సంబంధించినవి, జంతు సంబంధాలు, దివ్యవస్తు సంబంధాలు, పంచభూతాలకు సంబంధించినవి అని ఐతిహాసిక కథలను విభజించవచ్చు.

సరళ కథలలో వినోద కథలు ముఖ్యమైనవి. ఇవి సంక్షిప్తంగాను, హాస్యప్రధానంగాను ఉంటాయి. మానవాతీత అంశాలు ఎక్కువగా ఉండవు. అప్పుడప్పుడూ పశుపక్ష్యాదులు కనిపిస్తుంటాయి. కొన్ని కథలు అసభ్యంగా ఉండడం కద్దు. సోమరిపోతులు, మూర్ఖులు, మోసగాళ్ళు, దొంగలు మొదలైనవాళ్లు పాత్రలుగా ఉంటారు. వాస్తవ జీవితానికి ఇవి దగ్గరగా ఉంటాయి. అప్పుడప్పుడూ హాస్యానికి తోడు ఈ కథలలో నీతికూడా మిళితమై ఉంటుంది.

కథాసాహిత్యంలో అత్యంత ప్రచారం కలవి అద్భుత కథలు. రాజకుమారులు, మంత్రులు, మంత్రతంత్రాలు – వీటన్నిటికంటే ఎక్కువగా సాహసప్రవృత్తి ఈ కథలను నడిపించేవిగా ఉంటాయి. 'ఒకానొక కాలంలో ఒకానొక ప్రదేశంలో' జరిగినట్లుగా చెప్పే కథలివి. ఎక్కడయినా హాస్యం కనిపించవచ్చుగాని మొత్తంమీద ఇవి గంభీరంగా ఉంటాయి. మానవాతీత శక్తుల పాత్ర ప్రధానంగా ఉంటుంది. యక్షులు, గంధర్వులు, కిన్నరులు, రాక్షసులు, పిశాచాలు సర్వసామాన్యంగా కనిపించే పాత్రలు. జానపద కథల కల్పనకు ప్రాణసమానంగా ఉండే మూలాంశాలు ఈ కథలలో మనకు వందలకొద్దీ కనిపిస్తాయి. ఇవి ఒక ప్రదేశం నుంచి మరొక ప్రదేశానికి చాలా వేగంగా పయనిస్తాయి.

ప్రాణి కథలు అతి ప్రాచీనకాలంనుంచి ప్రచారంలో ఉన్నాయని చెప్పవచ్చు. ఇవి మామూలుగా సంక్షిప్తంగాను, సరళంగాను ఉంటాయి. ముఖ్యంగా ఈ కథలలో జంతువులు, పక్షులు మాత్రమే ఉండేవి, మానవులతోబాటు పశుపక్ష్యాదులుండేవి అనే రెండు రకాలను గుర్తించవచ్చు. ఇవి సంస్కృతిలో అన్ని దశలలోను ఉద్భవించాయి. ఇవి సాహిత్య కథలు పెక్కింటికి ప్రేరణను కలుగజేశాయి.





ప్రాణి కథలే కొంతకాలానికి నీతి కథలుగా పరిణమించాయంటారు. నీతి కథలలో కూడా చాలావరకు పశుపక్ష్యాదులే పాత్రలుగా ఉండడమే ఇందుకు కారణం. ప్రాణులే పాత్రలైనా కథలో నీతి ముఖ్యంగా ఉంటుంది. ఇవి కూడా సంక్షిప్తంగా, నాటకీయంగా నీతివాక్యంతో అంతమవుతూ ఉంటాయి.

కథారూపంలో ఉండే పొడుపు కథలను సమస్యాత్మక కథలని అంటారు. కథాసరిత్సాగరం, బేతాళ పంచవింశతి, త్రిషష్టిశలాకపురుష చరిత మొదలైన గ్రంథాలలో ఇలాంటి సమస్యాత్మక కథలు కనిపిస్తాయి. ఇవి మొదట సాహిత్య కథలుగా ఉండి తర్వాత జానపద కథ లయ్యాయని కొందరు అభిప్రాయపడుతున్నారు. వధువు పొడుపు కథను విప్పలేక వరునికి వశం కావడం. అక్రమ ప్రణయం మొదలైనవి ఈ కథలలో కనిపిస్తాయి. ఇలా జానపద కథలను వర్గీకరించుకుంటూపోతే ఇంకా అనేక వర్గాలు కనిపిస్తాయి. ఇటీవలి కాలంలో జానపద కథలలో కనిపించే మూలాంశాల సహాయంతో, కథల మాదిరులను దృష్టిలో పెట్టుకొని విభజించడం సంప్రదాయంగా ఉంది. ఆయా ప్రదేశాలలో కనిపించే కథల వైశిష్ట్యాన్ని, మూలాంశాలను దృష్టిలో పెట్టుకొని ప్రాదేశిక కథలను విభజించడం సబబుగా ఉంటుంది. అతి విశాలమైన కథా ప్రపంచాన్ని వర్గీకరించడంలో సార్వజనీనాలైన సూత్రాలను అనుసరించడం సాధ్యం కాదు.

**కథల అధ్యయనం, వైశిష్ట్యం :**

జానపద కథలను గురించి జరిగినంత కృషి జానపద సాహిత్యంలోని ఇంక ఏ ప్రక్రియను గురించీ జరగలేదని చెప్పవచ్చు. సిద్ధాంతపరమైన అనేక వివాదాలు ఈ కథాక్షేత్రంలో తలెత్తాయి. పందొమ్మిదవ శతాబ్దం నుంచే కథలను గురించిన అధ్యయనం ప్రారంభమయింది. గ్రిమ్ సోదరులు 1812లో ప్రచురించిన కథాసంకలనం కథాక్షేత్రంలో అనేక విద్వాంసులకు ఆసక్తి పుట్టేట్లు చేసింది. భారతదేశంలో పుట్టి ప్రపంచానికంతా వ్యాపించిన పంచతంత్ర కథలు, జాతక కథలు అనేక సిద్ధాంతాలు తలెత్తడానికి కారణమయ్యాయి. గ్రిమ్ సోదరులు, లాంగ్ (Andrew Lang), బెన్ఫె, టేలర్, స్టిత్ థాంసన్ మొదలైనవారు కథలను గురించిన అనేక సిద్ధాంతాలను లేవదీశారు. ఈ సిద్ధాంతాలు కథల పుట్టుక, వికాసాలను గురించి మాత్రమేకాక జానపద విజ్ఞానంలోని అనేక శాఖలను గురించిన పెక్కు విషయాలను అర్థం చేసుకోడానికి ఉపయోగపడతాయి.

జానపద కథలను అధ్యయనం చేసేటప్పుడు ఇతర జానపద అంశాలకు

లాగానే సేకరణ, పరిష్కరణ, విశ్లేషణ అనే మూడు దశలు అవసరం. కథలను సేకరించేటప్పుడు కొన్ని విషయాలను గమనించవలసి ఉంటుంది. నివేదకులు (Informants) చెప్పింది చెప్పినట్లుగా వ్రాసుకోవడం మనం చేయవలసిన మొదటిపని. ఒకే నివేదకుడు రెండవసారి ఒకే కథను చెప్పినా దానిలో భేదం కనిపించవచ్చు. కథ పాఠం (text) మాత్రమేకాక సందర్భం (context) కూడా ముఖ్యమన్నది మరచిపోగూడదు. కథ చెప్పే కాలం, చెప్పేవాని వయస్సు, కులం, అతను ఎక్కడ వినింది వగైరా విషయాలను లిఖితం చేయాలి.

కథలను సేకరించిన తర్వాత వాటిని చక్కగా పరిష్కరించాలి. కథలో పదాలు, వాక్యాలకంటె కథావస్తువు, మూలాంశాలు ప్రధానమైనవి. వీటి సహాయంతో మూలపాఠాన్ని గుర్తించేందుకు ప్రయత్నించవచ్చు. పరిష్కరణ తర్వాత రచనాత్మకంగా, సాంస్కృతికంగా కథలను విశ్లేషించడం అవసరం. భాషాశాస్త్రంలో లాగానే కథలను కూడా వర్ణనాత్మకంగా (Descriptive), తులనాత్మకంగా (Comparative), చారిత్రకంగా (Historical) పరిశీలించవచ్చు. ఒక కథ వ్యక్తంచేసే రచనాత్మకమైన లక్షణాలను అధ్యయనం చేస్తే అది వర్ణనాత్మక విశ్లేషణ. ఆ కథ మూలం, వికాసం, ప్రచారం మొదలైనవాటిని గురించి తెలుసుకొని ఆ కథ చరిత్రను నిర్మించడానికి ప్రయత్నిస్తే అది చారిత్రక విశ్లేషణ. అనేక ప్రదేశాలలో దొరికే వివిధ పాఠాంతరాలను తులనాత్మకంగా పరిశీలించి పరిశోధించడం తులనాత్మక విశ్లేషణ అవుతుంది. ఈ విధంగా కథలను సేకరించి, పరిష్కరించి, విశ్లేషించినప్పుడు మనకు సమస్త మానవజాతికి సమానమైన అనేక విషయాలు అవగతమవుతాయి. మానవ సంస్కృతిని అధ్యయనం చేయడంలో జానపద కథలు సహాయం చేస్తాయనడంలో సందేహం లేదు.

**ప్రమాణ గ్రంథాలు :**

**ఇంగ్లీషు :**

1. Dictionary of Folklore, Mythology and Legend-Ed. Maria Leach
2. Folklore and Folklife-Ed.Richard M.Dorson
3. The Types of the Folk-Tale-Antti Aarne and Stith Thompson
4. The Folktale-Stith Thompson
5. Household Tales-Jacob and Wilhelm Grimm
6. Introducing Folklore-Kenneth. W.Clarke, Mary W.Clarke





7. Mythology-Ed.Pierre Maranda
8. A Folklore Reader - Ed.Kenneth and Mary Clarke
9. The Study of Folklore-Ed.Alan Dundes
10. Motif - Index of Folk Literature - Stith Thompson
11. Morphology of the Folktale-Vladimir Propp

**తెలుగు :**

12. తెలుగు జానపద కథలు – డా.కె.సుమతి
13. జానపద కథలు – డా.జి.ఎస్.మోహన్
14. మహబూబ్ నగర్ జిల్లా జానపద కథలు – డా.బి.బాలాస్వామి

**కన్నడం :**

15. జానపద స్వరూప – డా.హా.మా.నాయక
16. కర్ణాటక జానపద కథెగళు – రా.గౌ.
17. కన్నడ జనపద కథెగళు – డా.జీ.శం. పరమశివయ్య
18. జానపద సాహిత్య దర్శన – సం.డా.ఎం.ఎస్.సుంకాపుర

**టిప్పణి**

1. వివరాలకు David Bidnecy వ్రాసిన The Concept of Myth చూడవచ్చు – The Structural study of Myth and Totemism - Ed.Edmund Leach, 1967
2. Mythology, Ed.P.Maranda, Penguin Education, Reprinted 1973, p.12-13
3. వివరాలకు – Kenneth W.Clarke,Mary W.Clarke-Introducing Folklore,p.21- 23
4. As quoted in Stith Thompson's Folktale, P.456
5. "It is an activity more ancient than the pyramids and in no wise dependent on the extent of our western culture. Cheops, the great pyramid builder, 5,000 years ago had his professional story-tellers." Stith Thompson. A Folklore, the Reader, Ed.By Kenneth and Mary Clarke (1965) P.40
6. "Fragments of a belief back to most ancient times, in which spritual things are expressed in a figurative manner are common to all stories"- As quoted in Stith Thompson's Folktale, p.369

7. "...tales invaded Europe through the Arab conquest in Spain and the influx of Levantine traders into the Byzantine Empire, affecting mainly literary media. A third impulse came through the Mongolian invasion that helped import oral tales into castern Europe"-Linda Degh, Folklore and Folklife, Ed.Richard, M.Dorson, P.56

8. Les Fabliaux

9. "If a myth does come from ritual, where then does the ritual come from? Ritualists delight in tracing folkloristic items back to ritual, but they usually have little if anything to say about the origin of the ritual" - Alan Dundes, The Study of Folklore, 1965, p.84

10. ఇంకా వివరాలకు - Current theories of Folklore, Richard M.Dorson, Folklore and Folklife, p.7-47

11. Kenneth W.Clarke, Mary W.Clarke, Introducing Folklore, p.p.21-26

12. Folklore and Folklife, p.62,68





# 4. సామెతలు

సామెత అనే మాట సామ్యతనుంచి వచ్చింది. సామెతల ముఖ్య గుణాలలో సామ్యతను చెప్పడంకూడా ఒకటి. హంగరీ భాషలో సామెతకు పేరైన pelda begged (పెల్డ బెగెడ్), అరబ్బీ భాషలోని Mathal (మతల్)కు కూడా దృష్టాంత మనే అర్థమే ఉంది. ఆంగ్లంలో సామెతను Proverb అంటారు. సంస్కృతంలో సుభాషితమనీ, సూక్తి అనీ, తమిళంలో పళమొళి (పాతమాట) అనీ, కన్నడంలో గాదె (గాథా శబ్ద భవం) లేక నాణ్ణుడి (నానుడి) అనీ అంటారు. జన జీవనం ఎంత విస్తృతమైందో, సామెత కూడా అంత వైవిధ్యపూర్ణమైంది. సామెతను నిర్వచించడం పుస్తకం ప్రారంభంలో ఉండకూడదని, చివర ఉండాలని చెప్పడంలో[1] సామెతలోని వైవిధ్యం తెలుస్తున్నది.

Roger D.Abrahams సామెత ఇలా నిర్వచించాడు – "Proverbs are short and witty traditional expressions that arise as part of everyday discouse as well as in the more highly structured situations of education and judicial proceedings."[2] ఇందులో సామెతలు వివేకయుతమైన, సాంప్రదాయికమైన సంక్షిప్త వ్యక్తీకరణాలనే మాట గమనించ తగ్గది. జానపద విజ్ఞానంలోని అన్ని అంశాలలాగే సామెతలుకూడా సాంప్రదాయికమైనవి. వీటి ప్రత్యేకత వివేకపూర్ణమైనవిగా ఉండడం, సంక్షిప్తంగా ఉండటం. పై రెండింటిలో మొదటిది వీటి పుట్టుకను గురించి, రెండవది వీటి స్వరూపాన్ని గురించి చెప్తుంది. పలువురి జ్ఞానం ఒక్కని వివేకంగా వెలువడడం[3] సామెత పుట్టుకకు సంబంధించినది. సామెతలు సంక్షిప్తంగా ఉంటాయి. ఇరవై పదాలకంటె ఎక్కువ ఉంటే అవి సామెతలు కావని కొందరు అనడాన్ని చూస్తే[4] సామెతలకు సంక్షిప్తత అన్నది ముఖ్య గుణం అని తెలుతుంది. మామూలుగా సామెతలలో ఒక్క వాక్యం మాత్రం ఉంటుంది. కళాత్మకంగా ఉండే ప్రాచీన అభివ్యక్తులలో సామెతలు ముఖ్యమైనవి. ఇవి 'అల్పాక్షరాలలో అనల్పార్థ రచన' కలిగి ఉండేవి కావడంచేత వీటి విలువ మరింత ఎక్కువ అని చెప్పవచ్చు. అవసరమైన పదాలను మితంగా వ్యయం చెయ్యడ మన్నది సామెతలలో కనిపిస్తుంది. అయితే సామెతలు ఎప్పుడూ సంక్షిప్తంగానే ఉంటాయని గాని లేక సంక్షిప్తంగా లేకుంటే దానిని సామెత అని పిలవనే రాదని చెప్పకూడదు. అతి దీర్ఘంగా, గంభీరంగా, సూచ్యంగా, అనుభవాన్ని అభివ్యక్తీకరించేట్లయితే అలాంటి వాక్యాలను సామెతలని పిలవడంలో తప్పలేదు.

సామెతలో ఒకే వాక్యం ఉండవచ్చు. లేక సమతూకం కలిగిన రెండు వాక్యాలు గాని, ఒకే వాక్యంలో రెండు భాగాలు గాని ఉండవచ్చు. ఇలా విడగొట్టబడి ఉండడాన్ని caesura అంటారు. An apple a day keeps doctor away, పిల్లికి చెలగాటం ఎలుకకు ప్రాణ సంకటం. చివరికి అక్షరాల సంఖ్యలో కూడా పోలిక కనిపిస్తుంది. అంటే రెండు భాగాల అక్షరాలు సమానంగా ఉంటాయన్నమాట.

ఒకవేళ రెండు సమాన భాగాలు లేకున్నా సామెతలలో ప్రాసాను ప్రాసలతో కూడిన లయ కనిపిస్తుంది. సామెతల్ని విడదీసి చూస్తే ద్విపద పాదాలూ, తేటగీతి పాదాలూ, ఆటవెలది పదాలూ కనిపిస్తాయి. ఇది ఒక్క తెలుగుకే సంబంధించినది కాదు. ఇంగ్లీషులో గాని, కన్నడంలో గాని, తమిళంలోగాని మరే భాషలోనైనా ఈ ఛందోబద్ధత కనిపిస్తుంది. ప్రతి సామెతా అనుభవం రంగరించిన కవితా రసగుళిక అని చెప్పవచ్చు. అంటే కవితా గుణాలు చాలావరకు సామెతలలో ఉన్నాయన్న మాట.[5] లయ అనేది ప్రాచీన కవితా గుణాలలో ఒకటి. ప్రాక్తన మానవుని భాష సామాన్యంగా లయబద్ధంగానే ఉండేదని మానవశాస్త్రం. భాషాశాస్త్రం చెప్తాయి. అందువల్ల ప్రాచీన మానవ సంస్కృతిని ప్రతిబింబించే సామెతలలో లయ ఉంటుందని చెప్పవచ్చు. ఈ లయ సామెతలను చక్కగా గుర్తు పెట్టుకోడానికి ఉపయోగిస్తుంది.

మానవుని వివేకాన్ని ప్రతిబింబించేవిగా ఉండడం సామెతల మరో లక్షణంగా చెప్పుకోవచ్చు. ప్రాచీన మానవుడు తన తరతరాల అనుభవ సారాన్ని సామెత రూపంలో వ్యక్తం చేశాడు. అయితే తన జీవితంలో సంపాదించుకొన్న అనుభవాన్ని ఎవరైనా అభివ్యక్తం చేసిన వెంటనే అది సామెత అనిపించుకోదు అది ఆ క్షణంలో ఒక పలుకు (saying) మాత్రమే. ఆ పలుకు జనులలో ప్రచారం పొంది తనదైన ఒక సంప్రదాయాన్ని ఏర్పరచుకొన్న తర్వాతనే అది సామెత అవుతుంది. దీన్ని నాణ్యాలతో పోల్చవచ్చు. ఎవరైనా ఒక నాణ్యం ముద్రించగానే అది చలామణీలోకి రాదు. ప్రభుత్వం ఆమోదం పొంది ముద్రించవలసిన నాణ్యం ప్రజల వాడుకలో ఉండి, ప్రాచుర్యం పొందితేనే దానికి విలువ ఏర్పడేది. అలాగే సంప్రదాయం, ప్రాచుర్యం లేని పలుకులు పలుకులుగానే ఉండిపోతాయి; సామెతలు కావు. అందువల్ల ఒక వ్యక్తి వివేకవంతంగా చెప్పిన మాట నలుగురి నోళ్ళలో నాని ప్రాచుర్యాన్ని సంపాదించి, సామెతగా రూపొందుతుంది. వివేకవంతమైన అంశాన్ని కలిగి ఉండడం, సంప్రదాయం, ప్రాచుర్యం కలిగి ఉండడం సామెతకు వుండే కొన్ని లక్షణాలని ఇందువల్ల తేలింది.

పదునైనవిగా లేక తీక్ష్ణంగా ఉండడం సామెతకు మరో లక్షణం. చెప్పే





విషయాన్ని సామెతలు సూటిగా చెప్తాయి. చప్పగా ఉంటే అవి సామెతలు కావు. మానవుని దీర్ఘానుభవం ఆధారంగా రూపుదాల్చిన సంక్షిప్త వాక్యాలు కావడం చేత సామెతలకు ఈ తీక్ష్ణత లభ్యమైందని అనవచ్చు. చెప్పే విషయాన్ని ఆలంకారికంగా, గూఢార్థద్యోతకంగా చెప్పడం సామెతకు మరో లక్షణంగా చెప్పుకోవచ్చు. చెప్పవలసినదాన్ని వ్యంగ్యంగా చెప్తాయేగాని వాచ్యంగా చెప్పవు సామెతలు. సామెతలలోని భాష సంకేతాత్మకంగా ఉంటుంది. రూపకాలు, ఉపమానాలు, దృష్టాంతాలు సామెతలలో తరచుగా కనిపిస్తుంటాయి. అయితే సామెతలలో స్వభావోక్తులు కూడా లేకపోలేదు.

పై లక్షణాలు మాత్రం ఉంటే అవి సామెతలవుతాయని గాని, సామెతలకు మరే లక్షణాలూ ఉండవని గాని చెప్పడానికి వీలులేదు. సామెతలలో కనిపించే వైవిధ్యం అసాధారణమైనది. బహుముఖవ్యక్తిత్వం ఉండే జానపద విజ్ఞానాంశాలలో సామెత ముఖ్యమైంది. మొత్తం మీద సంక్షిప్తమైన, వివేకయుతమైన, తీక్ష్ణమైన, సాంప్రదాయకమైన, ప్రాచుర్యం కల్గిన, అనుభవం పునాదిగా ఉండే అభివ్యక్తి సామెత అని నిర్వచించవచ్చు.

**పుట్టుక – వికాసం :**

సామెతలు పుట్టడానికి నిజమైన కారణాలేమిటి, సామెతలు ఎలాటి సమాజంలో, ఏ కాలంలో, ఏ విధంగా ఉద్భవించాయి మొదలైన ప్రశ్నలకు సమాధానం చెప్పడం అంత సులభమేమీ కాదు. ఆదిమ మానవుడు తన సుఖదుఃఖాలను అభివ్యక్తీకరించడానికి, అనుభవాలను ఎదుటివారికి తెలియజెప్పడానికి గీతాలను, కథలను, సామెతలను ఉపయోగించుకున్నాడు. మౌలికమైన ప్రతిభాశక్తి, కల్పనాసక్తి ఉండిన అతి ప్రాచీన మానవుడే సామెతలను సృష్టించాడనడంలో సందేహం లేదు. అయితే అవి ఎంత ప్రాచీనమైనవి అని ఖచ్చితంగా చెప్పడం మాత్రం సాధ్యం కాదు.

సామెతల పుట్టుకను గురించి ఆలోచించేటప్పుడు కూడా మనం మిగిలిన జానపద విజ్ఞాన విభాగాలకు అన్వయించే సిద్ధాంతాలనే అన్వయించవచ్చు. గీతాలు, కథాగేయాలు మొదలైన వాటిని గురించి వివేచించేటప్పుడు అలాంటి కొన్ని సిద్ధాంతాలను పేర్కొనడం జరిగింది. ఏ విషయం పుట్టకను గురించి అయినా ఆలోచించేటప్పుడు అన్వయించదగిన సిద్ధాంతాలను మూడు విభాగాలు చేసి పరిశీలించవచ్చు. మనస్తత్త్వపరంగా పుట్టుక గూర్చి వివేచించడం మొదటిది. చారిత్రకంగా ఎంత ప్రాచీనమైన

విషయమో పరిశీలించడం రెండవది. భౌగోళికంగా ఆ విషయం ఎక్కడ అవతరించి, వికాసం చెందిందో పరిశీలించడం మూడవది. మనోవిశ్లేషణ సిద్ధాంతం (Psycho analysis), స్వప్న సిద్ధాంతం మొదలైనవి సామెతలు మొదలైనవి ఏ మానసిక స్థితిలో ఉద్భవిస్తాయి, వాటిలో కనిపించే వివేక రాహిత్యానికి (Irrationality) కారణమేమిటి మొదలైన విషయాలను పరిశీలిస్తాయి. ఒక సామెత ఏ కాలంలో పుట్టింది అని పరిశోధించి నిర్ణయించడానికి ప్రయత్నిస్తే అది చారిత్రకమైన అధ్యయనం అవుతుంది. ఉదాహరణకు 'బుక్కరాయ మెచ్చి బెక్కిన మరి ఇత్త' (బుక్కరాయడు మెచ్చి పిల్లికూనను ఇచ్చాడు) అనే కన్నడ సామెత ఉంది. ఇది విజయనగర కాలంనాటి బుక్కరాయనికి సంబంధించిన సామెత అని ఊహించవచ్చు. అలాగే 'కృష్ణరాయ భూప మనె మనెగె దీప' (కృష్ణరాయ భూపుడు ఇంటింటికి దీపం) అనే కన్నడ సామెత కూడా రాయల కాలంనాటిదో, తర్వాతి కాలందో అయి ఉండవచ్చు. భౌగోళికంగా సామెతలను పరిశీలించడానికి చారిత్రక-భౌగోళిక విధానం ఉపయోగిస్తుంది. ఫిన్నిష్ పద్ధతి అని పేరు గాంచిన ఈ విధానం ప్రకారం కథ, సామెత మొదలైన జానపద సాహిత్య ప్రక్రియల వివిధ పాఠాలను సేకరించి వాటి మూల పాఠాన్ని కనుగొనే ప్రయత్నం జరుగుతుంది. ఈ విధంగా ఏకోత్పత్తి సిద్ధాంతాన్ని బలపరుస్తుంది. అంటే దీని ప్రకారం ఒక సామెత కాని, కథకాని ఏదైనా ఒక ప్రదేశంలో పుట్టి మిగిలినచోట్లకు వ్యాపిస్తుంది. జానపద విషయాల బహుప్రదేశ అస్తిత్వాన్ని మరోవిధంగా వివరించేది బహుళోత్పత్తి సిద్ధాంతం. దీని ప్రకారం సామెతలు మొదలైనవి వేరువేరు ప్రదేశాలలో స్వతంత్రంగా అవతరిస్తాయి. వేరు వేరు ప్రదేశాలలోని సామెతలలో ఏవైనా పోలికలు కనిపించాయి అంటే – అది మానవ మనోధర్మంలోని సామ్యతే కాని ఒకదాని నుంచి మరొకటి పుట్టడంవల్ల కాదు. ఈ విధంగా వివిధ సిద్ధాంతాలు సామెతల పుట్టుక, వికాసాలను వివరించడానికి ప్రయత్నిస్తాయి.

సామెతలు కొన్ని కథలలో నుంచి, లేక కథల ఆధారంగా పుట్టాయని చెప్పవచ్చు. కథా భాగాన్ని గాని, పూర్తి కథను గాని సూచించే సామెతలు కొన్ని ఉంటాయి. పురాణేతిహాసాలు కొన్ని సామెతలు పుట్టుకకు కారణమయ్యాయి. బైబిలు, రామాయణ మహాభారతాలు, పంచతంత్రం మొదలైనవి చాలా సామెతలను రూపొందించడానికి తోడ్పడ్డాయి. ఉదా. రామాయణంలో పిడకలవేట; వింటే భారతం వినాలి, తింటే గారెలే తినాలి; మణ్ణినింద కౌరవకెట్ట, హెణ్ణినింద రావణకెట్ట (మన్నువల్ల కౌరవులు చెడ్డారు. ఆడదానివల్ల రావణుడు చెడ్డాడు-కన్నడం). కొన్ని సామెతలు





ఏదో ఒక కథను సూచిస్తాయి. కోతి కజ్జాయం పంచినట్లు, కొంగ జపం చేసినట్లు, అందని ద్రాక్షపళ్లు పుల్లన మొదలైన వాటి వెనుక కొన్ని కథలు ఉన్నాయి.

కొన్ని సామెతలు స్థలపురాణాలను, దేశ చరిత్రలకు సంబంధించిన విషయాలను సూచించేవిగా ఉంటాయి. ఫ్రాన్సువాళ్ళు ఆకలేస్తే కాకిని కూడా వదలరు అని ఒక ఆంగ్ల సామెత ఉంది. నెపోలియన్ రష్యామీద దండెత్తివచ్చినప్పుడు వేలమంది ఫ్రెంచి సైనికులు అన్నం, నీళ్ళు లేక కాకులను కూడా చంపి తిన్నారని ప్రతీతి. ఈ విషయాన్ని సూచించేదే పై సామెత. See Naples and die అనే సామెత ఒకానొక కాలంలో నేపల్స్ వ్యాపారానికి, కళలకు కేంద్రస్థానంగా ఉండిన విషయాన్ని తెలుపుతుంది. All roads lead to Rome అన్న సామెత రోమనులు రహదారులను వేయడంలో నిపుణులన్న విషయాన్ని సూచిస్తుంది. 'తిరుపతి క్షౌరం' అన్నది అక్కడి క్షురకుల తొందరపాటుకు సామెత రూపం. హంపెగె హోగువుదక్కింత తన్న కొంటెయే వాసి (కన్నడం) (హంపీకి పోవడం కంటె తన కొంపే నయం) అన్నది విజయనగర రాజ్యపతనాన్ని తెలుపుతుందంటారు. ఇలా ఎన్నో చారిత్రక విషయాలు, స్థల వైశిష్ట్యాలు సామెతలు పుట్టడానికి కారణమవుతాయి.

ప్రతిదినం జీవితంలో మనం కన్నవీ, విన్నవీ, అనుభవించినవీ సామెతల రూపంలో వెలువడుతాయి. ఎన్నో సామెతలు సరళమైన ఉపమల రూపంలోను, అనుభవసారమైన వాక్యాలుగాను, హాస్యపూరితంగా ఉండే చెణుకులుగాను వెలువడుతుంటాయి. 'రామాయణమంతా విని రాముడికి సీత ఏమవుతుందని అడిగినట్లు' అన్నది ఏ రామాయణ కాలక్షేపం సందర్భంలో వెలువడిందో! 'రోట్లో తలపెట్టి రోకటి దెబ్బకు జడిసినట్లు' అన్నది ఏ దంపుడు పాటలు వింటూ అన్న అనుభవ వాక్యమో! 'చిన్న మిరపకు కారం హెచ్చు' అన్నది అనుభవం కాక మరేమవుతుంది? ఏ మూర్ఖునితో వేగలేని వాడో ఎప్పుడో అన్నదే 'తాను పట్టిన కుందేటికి మూడే కాళ్ళు' అన్న సామెతగా వెలువడి ఉండవచ్చు. 'నీటికొద్దీ తామర' అన్నది కేవలం ప్రకృతి పరిశీలనకు ఉదాహరణ మాత్రమే కాక ఎంతో అనుభవంతో చెప్పినమాట. ఈ విధంగా సామెతలు మన జీవనానుభవం ఆధారంగా అవతరిస్తాయి.

జానపద సాహిత్యంలోని ఇతర అంశాలలాగే సామెతలు కూడా సామూహిక వికాసాన్ని పొందేవే అయినా వాటి సృష్టి మాత్రం మొదట వైయక్తికంగానే జరుగుతుందని చెప్పవచ్చు. తరతరాలుగా మానవుడు సంపాదించి ఉంచుకున్న అనుభవం ఎవరో ఒకరి నోటిలో వివేకవంతమైన మాటగా వెలువడుతుంది. దాన్ని జనం గ్రహించి

ప్రాచుర్యాన్ని కలిగించిన నాడు ఆ మాట సామెత అవుతుంది. 'పలువురి జ్ఞానం, ఒక్కని వివేకం' అన్నమాట సామెతల పుట్టుకను గురించి కూడా తెలుపుతున్నది. జ్ఞానం అనేది వైయక్తికంగా మాత్రమే లభించేది కాదు. నలుగురితో మాట్లాడి, నలుగురి పుస్తకాలు చదివి, సమాజంలో ఒకడిగా ఎంతో నేర్చుకుంటేనే జ్ఞానం లభిస్తుంది. వివేకం ఒక్కనికి సంబంధించింది. ఇలా సమాజంలో తాము సముపార్జించుకున్న జ్ఞానానికి తన వివేకం తోడుకాగా సామెతలు ఉద్భవిస్తాయి.

ఇంతకు ముందే చెప్పినట్లు సామెతల వికాసాన్ని గురించి రెండు అభిప్రాయాలున్నాయి. సామెతలు ఒక ప్రదేశంలో పుట్టి మిగిలిన ప్రదేశాలకు వ్యాపిస్తాయి అన్నది ఒక అభిప్రాయం. వేరువేరు ప్రదేశాలలో స్వతంత్రంగా అవతరిస్తాయన్నది మరొక అభిప్రాయం. డా.చాంపియన్ ఈ విధంగా అంటాడు: "సామెతలను గురించిన జ్ఞానం ప్రపంచమంతటా ఒక్కటే. భిన్నత్వం కన్పించేది సామెతల అభివ్యక్తిలో మాత్రమే. మనుష్యులంతా ఒకే పిండినుంచి చేయబడినవాళ్ళే. మూలభూతంగా ప్రాచ్యులనీ పాశ్చాత్యులనీ భేదంగాని, తెలుపు నలుపన్న భేదంగాని లేదు. మానవులంతా ఒక్కటే. మానవుడి మూలభూత ప్రవృత్తులైన ప్రేమ, ఆకలి, భయం మొదలైనవి సంస్కారహీనులు, సంస్కారులని లేక అందరికీ సమాన గుణాలుగానే ఉంటాయి. మానవుల ఈ మూలభూత ప్రవృత్తులను తరతరాల నాగరికత లేవీ మార్చలేవు.[6]

అత్యంత ప్రాచీనమైన సామెతలు ఏ దేశంలో ఉద్భవించాయి అన్న విషయంకూడా విద్వాంసులను ఆకర్షించింది. బాబిలోనియా, ఈజిప్టు, ఇండియాదేశాల అతి ప్రాచీన గ్రంథాలలో కూడా సామెతలు కనిపిస్తాయి. ఏసు సువార్తలలో సామెతలను వాడుకున్నాడు. ముస్లిముల ఖురానులో సామెతలు, సామెతలను పోలిన వాక్యాలు చాలా ఉన్నాయి. వేదాలలో, ఉపనిషత్తులలో సుభాషితాలు, నుడికారాలు కోకొల్లలుగా కనిపిస్తాయి. ప్రాచీన కాలానికి చెందిన భారతీయ ఋషులు, అరిస్టాటిల్, ప్లాటోలాంటి తాత్వికులు ఎన్నో సామెతల్ని వాడారు. వాళ్ళు చెప్పిన కొన్ని వాక్యాలు సామెతలు కావడం కూడా సంభవించింది. ఇలా ఒక్కొక్క దేశంలో దార్శనికుల సుభాషితాలు సామెతలు కావచ్చు. సామాన్య జనుల అనుభవ వాక్యాలు సామెతలు కావచ్చు. ఆచారాలు, ఆదర్శాలు, ప్రకృతి పరిశీలన, స్వభావ పరిశోధన, చారిత్రక స్థలాలు, ప్రాచీన పురాణాలు, నిత్య జీవితంలో చూచి మనం అనుభవించే ప్రతి విషయమూ సామెతల పుట్టుకకు కారణం కావచ్చు.





**వర్గీకరణ :**

సామెతలంత వైవిధ్యం ఉన్న విషయాలను వర్గీకరించడం చాలా కష్టమైన పని. సామెతల వర్గీకరణకు ఎందరో విద్వాంసులు ఎన్నో మార్గాలను సూచించారు కాని, అందులో ఏదీ సమగ్రం కాదు. సామెతలను విభజించడంలో ముఖ్యంగా రెండు మార్గాలను అనుసరిస్తారు. అకారాదిగా విభజించడం ఒక మార్గం. దీన్ని రెండు విధాలుగా చేయవచ్చు. సామెతల మొదటి మాటను తీసుకొని అకారాదిగా అమర్చడం లేక సామెతలో ముఖ్యమైన పదాన్ని తీసుకొని అకారాదిగా కూర్చడం. రెండవ పద్ధతి సామెతలలో వస్తువు ఆధారంగా చేసికొని వర్గీకరించడం. ఈ రెండవ విధానమే మొదటి దానికంటె ఉత్తమమైందని చెప్పవచ్చు. లేకుంటే ఏదైనా ఒక విషయానికి సంబంధించిన సామెత కావాలంటే పుస్తకమంతా వెదకవలసి వస్తుంది. మొదట వస్తువును బట్టి వర్గీకరించి తర్వాత ఒక్కొక్క వస్తువుకు సంబంధించిన సామెతల్ని (అవి సంఖ్యలో తక్కువగా ఉంటాయి కాబట్టి) అకారాదిగా కూర్చవచ్చు.

Warren Roberts సూచించిన వర్గీకరణ విధానం గమనించదగింది.[7] దశమాంక పద్ధతిని ఉపయోగించే ఈ వర్గీకరణంలో మొదటి సంఖ్య ప్రధాన విషయాన్ని సూచిస్తుంది. రెండవ సంఖ్య ఆ విషయంలోని ఉపవిభాగాలను తెలియజేస్తుంది. మూడవ సంఖ్య ఈ ఉపవిభాగంలో ఆ సామెత స్థానాన్ని తెలియజేస్తుంది. ఇంకా ఏదైనా విశేషం చెప్పవలసివస్తే దాన్ని చివరి సంఖ్య ద్వారా సూచించవచ్చు. ఉదాహరణకు వయస్సుకు సంబంధించిన వాటికి 7 అనే సంఖ్య ఇచ్చామంటే, అందులో ముదుసలులను గూర్చిన వాటిని 4 అంకెతో సూచించ దలచుకుంటే, అప్పుడలాంటి సామెతలు 7.4 అనే అంకెల క్రిందికి వస్తాయి. మళ్ళీ వీటిలోని విభాగాలను 7.4,14.1. లేక 7.4, 13.2. ఇలా విభజిస్తూ పోవచ్చు. ఇందువల్ల సామెతలలో కనిపించే వైవిధ్యాలతో కూడిన విషయాలను చాలావరకు ఈ వర్గీకరణలో ఇమడ్చడానికి వీలవుతుంది.

సార్వజనీనంగా సామెతల్ని వర్గీకరించడం మాత్రం సాధ్యం కాని పని. ఎందుకంటే, ప్రతి సామెతకూడా ఏదో విధంగా విశిష్టమైనదై ఉంటుంది. మొత్తం మీద ప్రపంచంలోని వివిధ ప్రదేశాలలో కనిపించే సామెతల కొన్ని రకాలను విద్వాంసులు తమ తమ వర్గీకరణాలలో ఉదహరించారు. జానపద విజ్ఞానాన్ని వైజ్ఞానికంగా వింగడించడానికి ప్రయత్నించిన విద్వాంసుడైన ఆర్.ఎస్.బాగ్స్ జానపద విజ్ఞాన కోశంలో సామెతల్ని ఆరు విభాగాలు చేశాడు.[8] అవి 1.Proverbial Metaphor

(ఉపయోగాన్ని గురించి చెప్పేది. A new broom sweeps clean 2.Proverbial Apothegm, Maxim (సూటిగా, సాధారణీకరణం చేసి చెప్పినది. Seeing is believing) 3.Blason populaire (జనులను గూర్చి స్థలాలను గూర్చి చెప్పినది. It takes nine tailers to make a man) 4.Wellerism (ఉదాహృత వాక్యం తమాషాగా అంతమయితే "Everyman to his taste," said the farmer when he kissed his cow) 5.Proverbial phrase (ఇది సామెతలాంటిది. To break the ice) 6. Proverbial comparison (As white as snow; wiser than Solomen).

బాగ్స్ పేర్కొనిన పై సామెతలతోబాటు మరికొన్ని రకాలను పేర్కొంటూ Archer Taylor వ్రాసిన వ్యాసం గమనార్హమైంది.[9] సామెతలలో కొన్ని ఏదో ఒక సత్యాన్ని చెప్పేవిగా ఉండవచ్చు. Honesty is the best policy. ఒక సూత్రాన్ని గాని, అనుభవాన్ని గాని చెప్పేవి కొన్ని. మౌనం అంగీకార సూచకం, Silence gives consent. కొన్ని కథలను సూచించేవిగా, పాతకాలపు సంప్రదాయాలను సూచించేవిగా ఉంటాయి. Sour grapes ఈసపు కథకు సంబంధించింది. Good wine needs no bush మద్యం అమ్మే అంగడి ముందు ఒక తీగను వ్రేలాడ దీసేవారు. ఈ సంప్రదాయాన్ని తెలుపుతుందీ సామెత. కొన్ని సామెతలకు అనుకరణలుగా మరికొన్ని సామెతలు పుట్టుకొస్తాయి. The nearer the church, the farther from God అన్న సామెత నుంచి The nearer Rome, the worse christian అన్నది పుట్టిందంటారు.

పోలికలను చెప్పే సామెతలను ఒక వర్గంగా విభజించవచ్చు. Enough is as good as feast. వైద్యానికి సంబంధించిన సామెతలు కొన్ని ఉన్నాయి. ఉల్లి చేసిన మేలు తల్లి చేయదు, An apple a day keeps doctor away అలాంటివే. ఇవి అనుభవం ఆధారంగా రూపుదాల్చినవి. అనుభవ గృహవైద్యాలు, అనుభవైక వేద్యాలు ఇవి. లాటిన్ సామెత అయిన Like cures like అన్నదే హోమియోపతి వైద్యానికి ప్రేరణ నిచ్చింది. వాతావరణానికి సంబంధించిన సామెతలు కొన్ని ఉన్నాయి. అర్ద్రమళె కైతుంబ బెళె (ఆరుద్ర వాన చేతినిండా పంట) అనే కన్నడం సామెత, April showers bring May flowers అనే సామెతా ఇలాంటివి. కొన్ని న్యాయశాస్త్రానికి సంబంధించిన సామెతలు కూడా ఉన్నాయి. Ignorance of the law excuses no man మొదలైనవి ఒక విధమయితే కొన్ని జన సామాన్యులకు సంబంధించిన న్యాయాన్ని తెలుపుతాయి. Don't kick a man when he is down. చచ్చిన పామును ఎందుకు చంపుతావు? మొదలైనవి ఇలాంటివి.





Margaret M.Bryant చేసిన విభాగం భాషాశాస్త్ర పరమైనది.[10] 1.పూర్తివాక్యాలు, 2.విద్యావంతుల సంగ్రహ వాక్య రూపాలైన సామెతలు, 3.అనుప్రాసలు, 4.అసంపూర్ణ వాక్యాలు, క్రియాత్మకాలు, 5.క్రియారహితాలు, 6.ఉపమలు, 7.ఉదాహృత వాక్యాలు, 8.ఆధునిక సరసోక్తులు.

సామెతలలో ముఖ్యంగా రెండు రకాలున్నాయి. జనప్రియమైన సామెతలు, గ్రంథస్థమైన సామెతలు. కొందరు నాగరికుల సామెతలనే మూడో విభాగాన్ని కూడా చేరుస్తారు. నాగరికుల సామెతలు జానపదుల సామెతల ఆధారంగా పుట్టినవే. జానపదుల సామెతలు సహజంగా జన్మించినవి. మిగిలినవి చాలావరకు కల్పితమైనవి. ప్రాస, లయ, ఛందస్సు వగైరా ప్రయత్నపూర్వకంగా చేర్చి కవులు, విద్యావంతులు అటువంటి సామెతల్ని రూపొందిస్తారు. జానపదుల సామెతలది గ్రామ్యభాష. నాగరికుల సామెతలది, గ్రంథస్థ సామెతలది వ్యావహారిక భాష లేక గ్రాంథిక భాష. జానపదుల నుడికారపు సొంపు వీటిలో అంతగా కనిపించదు. ఒక్కొక్కసారి విద్యావంతుల సామెతలు, గ్రంథస్థాలైన సామెతలు కూడా ప్రజలలో ప్రాచుర్యాన్ని సంపాదించి, జానపదుల సామెతలుగా పరిణమించవచ్చు. వేమన పద్యాలలో మూడవపాదాలనేకం సామెతలుగా చలామణీ అవుతుండడం దీనికి ప్రత్యక్ష నిదర్శనం.

మొత్తం మీద సామెతల్ని గేయాలు మొదలైనవాటిని విభజించినట్లే వస్తువును, భావాలను, రచనను ఆధారంగా చేసుకొని వర్గీకరించవచ్చు. వస్తువును బట్టి విభజించేట్లయితే వివిధరకాల సామెతల్ని ఉదహరించవచ్చు. కొన్ని పౌరాణికాలు, మరికొన్ని చారిత్రకాలు ఉన్నాయి. కొన్ని సామెతలు స్థలపురాణాలు. అంటే ఆయా స్థలాలవైశిష్ట్యాన్ని తెలుపుతాయి. వస్తువును బట్టి చేసే వర్గీకరణాలలోనే ప్రకృతిలోని వస్తువులను గురించిన సామెతలు, వాతావరణాన్ని గురించిన సామెతల్ని చేర్చవచ్చు. జంతువులకు, పక్షులకు, నిర్జీవ వస్తువులకు సంబంధించిన సామెతలను కూడా వీటిలోనే చేర్చవచ్చు. ఇవన్నీ వస్తువుకు సంబంధించినవి. ఇంకొక విభాగం వేదాంతపరమైనవి. సలహాలు, చమత్కారాలు, విజ్ఞానానికి సంబంధించిన వాటిని ప్రత్యేక విభాగంగా పరిగణించవచ్చు.

కథలకు తోకగా పుట్టుకువచ్చే సామెతలను మరొక విభాగంగా పరిగణించవచ్చు. శృంగారం, హాస్యం మొదలైన వాటికి సంబంధించిన సామెతలు ప్రత్యేకంగా పరిగణించదగ్గవి. ఇవికాక అలంకారికమైన సామెతల నన్నిటికీ కలిపి ఉపమలు, రూపకాలు వగైరా ఉండేవి. శబ్దాలంకారాలుండేవి కలిపి మరొక విభాగంగా

పరిగణించవచ్చు. ఇలా ఆయా ప్రదేశాలలో కన్పించే విశేషాలను గుర్తించి వర్గీకరణ చేయవలసి ఉంది.

**అధ్యయనం, వైశిష్ట్యం :**

సామెతలు జనులమీద మంచి ప్రభావాన్ని చూపగలవని చాలా ప్రాచీనకాలం నుంచే మేధావులు తెలుసుకున్నారు. అందువల్లనే వేదకాలపు ఋషుల మాటల్లో కూడా సామెతలు చోటుచేసుకున్నాయి. ప్లాటో, అరిస్టాటిల్, ఏసుక్రీస్తువంటి వాళ్ళు తమ ఉపన్యాసాలలో, ధార్మిక ప్రసంగాలలో సామెతల్ని వాడుకున్నారు. ప్రాచీన శిష్టగ్రంథాలలో వాటి రచయితలు ఆనాడు వాడుకలో ఉండిన సామెతల్ని సందర్భానికి తగినట్లుగా ఉపయోగించుకున్నారు. సామెతలతోనే కావ్యాలల్లే సంప్రదాయానికి మార్గ దర్శకమయింది John Haywood లో రచించిన A Dialogue of Proverbs. పాశ్చాత్య దేశాలలో సామెతలకు గురించి ప్రశంసార్హమైన అధ్యయనం జరిగింది. లక్షలాది సామెతల్ని పాశ్చాత్యులు సేకరించారు. ఇలాంటి సంకలన గ్రంథాలలో చాంపియన్ ప్రచురించిన 'Racial Proverbs' అన్న పుస్తకం చాలా ప్రశస్తమైంది. ప్రపంచంలోని వేలకొలది సామెతల్ని సేకరించి, ఇంగ్లీషుకు అనువాదం చేసి విలువైన పీఠికతో చాంపియన్ ఈ గ్రంథాన్ని ప్రచురించాడు.

సామెతలను అధ్యయనం చేసేటప్పుడు కూడా మిగిలిన జానపద విజ్ఞాన విభాగాల లాగే సేకరణ, పరిష్కరణ, విశ్లేషణ జరుపవలసిన ఆవశ్యకత ఉంది. అత్యంత శాస్త్రీయంగా జరుగవలసిన ఇలాంటి అధ్యయనం కోసం పాశ్చాత్య దేశాలలో కొన్ని సంస్థలే ఉన్నాయి. అలాంటి వాటిలో Proverbial Sayings Committe ఒకటి. American Dialect Society కి అనుబంధంగా 1944లో ఏర్పడిన ఈ సంస్థ సామెతల అధ్యయనానికి మహత్తర కృషి సల్పుతున్నది. సామెతలలో ఎలాంటి వాటిని సేకరించాలి, ఎక్కడ నుంచి సేకరించాలి మొదలైన విషయాలను గురించిన కొన్ని సూచనలను ఈ సంస్థ ప్రచురించింది.[11] వాగ్రూపంగా కాని, వ్రాత ప్రతుల రూపంగా కాని ఉన్న సామెతలను యథాతథంగా ఏమీ మార్పు చేయకుండా లిఖితం చేయాలి. ఏమీ మెరుగులు దిద్దకూడదు. పాఠాంతరం ఉంటే గుర్తించాలి. ఎక్కడ, ఎప్పుడు, ఎవరి వల్ల వినింది, లేక ఏ గ్రంథం నుంచి సేకరించింది వ్రాయాలి. ఇలా సేకరించిన సామెతలను విశ్లేషించి అధ్యయనం చేసినవాడు సంస్కృతిని గురించిన ఎన్నో విశేషాలు మనకు అవగత మవుతాయి.





సామెతల అధ్యయనంవల్ల ప్రాక్తన మానవుని స్వభావం, జీవనం, ఆలోచన విధానం మొదలైనవి మనం తెలుసుకోగలుగుతాం. ఇంకా న్యాయశాస్త్రాల వెలుగు క్రిందికి రాని సమాజాలలో అనుభవజ్ఞుడైన పెద్దలు చెప్పిన ఒక్క సామెత గ్రామంలోని సమస్యల్ని విడగొట్టే సందర్భాలు నేటికి కూడా కనిపిస్తాయి. అకారంలో చిన్నది కావచ్చు. కాని సామెతలో ఉండే అర్థ గాంభీర్యం గొప్పది కాబట్టి అది చూపే పరిణామమూ విలువైనదే. కాని సామెతలను గురించి మనం తీసుకొనే శ్రద్ధ చాలా తక్కువ. వాక్సంప్రదాయంలోని సామెతలు సరేసరి. వ్రాత ప్రతులలో ఉండే సామెతల మీద కూడా మనకు శ్రద్ధలేదు. "బ్రిటిషు మ్యూజియం, లండన్ లైబ్రరీ మొదలైన చోట్ల సామెతలను అన్వేషిస్తూ వెళ్ళినప్పుడు, నాకు పేనాకంటే చాకు అవసరమే (వ్రాత ప్రతులను చూడడానికి) ఎక్కువగా కన్పించింది" అని డా. చాంపియన్ 'Racial Proverbs' పీఠికలో చెప్పిన మాటలు అన్ని సామెతల సంపుటాలకు అన్వయించకముందే, జానపదుల నోళ్ళలో ఇంకా నిలిచి ఉండే సామెతలు మరుగున పడక ముందే మనం వాటిని సేకరించి వాటివల్ల పొందగలిగిన లాభాన్ని పొందడం ఎంత త్వరగా జరిగితే అంత మేలు.

**ప్రమాణ గ్రంథాలు :**


**ఇంగ్లీషు :**

1. Standard Dictionary of Folklore, Mythology and Legend-Ed.Maria Leach
2. Folklore and Folklife-Ed.Richard M.Dorson
3. Racial Proverbs-Ed.S.G.Champian
4. Encyclopaedia of Religion and Ethics. Vol.X Ed.J.Hastings

**తెలుగు :**

5. తెలుగు సామెతలు – ఆం. ప్ర. సాహిత్య అకాడెమీ
6. తెలుగు సామెతలు (ఆంగ్లానువాదంతో) ఎం. డబ్ల్యు. కార్
7. పసిడి పలుకులు – నేదునూరి గంగాధరం
8. వ్యవసాయ సామెతలు – నేదునూరి గంగాధరం

**కన్నడం :**

9. కన్నడ గాదెగళు – సం. హెచ్. ఎస్. అచ్చప్ప
10. నమ్మ గాదెగళు – రాగౌ

11. గాదెగళు - ఎ.కె.రామానుజన్
12. కన్నడ గాదెగళ సమీక్షె - నం.తపస్వీ కుమార్

**టిప్పణి**

1. రామానుజన్, ఎ.కె.గాదెగళు (కన్నడం) పుట.6
2. Richard M.Dorson, Folklore and Folklife, p.119
3. లార్డ్ జాన్ రసెల్ నిర్వచనం, రాగౌ చే ఉదాహృతం, నమ్మగాదెగళు (కన్నడం) పుట.12
4. ఇలాంటి అభిప్రాయం ఉందని చెప్పినవారు రాగౌ, పూర్వోక్తం, పు.17
5. "....Proverbs use all of the devices we commonly associate with poetry in English : meter, binary construction and balanced phrasing, rhyme, assonance and alliteration, conciseness, metaphor, and occasional inverted word order and unusual construction." Roger D.Abrahams, Folklore and Folklife, Ed.Richard M.Dorson-p.119
6. Racial Proverbs, p.xxiv
7. As quoted in Kenneth and Mary Clarke's Introducing Folklore, p.120
8. Standard Dictionary of Folklore, Mythology and Legend (One Volume Ed.) p.1147
9. Ibid. p.902-905
10. Standard Dictionary of Folklore, Mythology and Legend.(one-volume Ed)p.907
11. Ibid, p.907





# 5.పొడుపు కథలు

జానపద విజ్ఞానంలో ప్రత్యేకమైన శాఖగా పరిగణించదగిన వైశిష్ట్యం ఉండే వాటిలో పొడుపు కథల్ని కూడా చేర్చాల్సి ఉంది. పొడుపు కథలు జానపద విజ్ఞానంలోని ఇతర శాఖలు చాలా వాటికంటె ఎక్కువ వైవిధ్యం కలవి. వీటిని జానపద సాహిత్యంలో ఒక భాగంగా మనం పేర్కొంటున్నా, ఇతర సాహిత్య ప్రక్రియలలా కేవలం వాగ్రూపమైనవి అని పొడుపు కథల్ని గురించి చెప్పడానికి వీలులేదు. ఎందుకంటే, పొడుపు కథల్ని బొమ్మలుగా వేసి చూపించవచ్చు. భంగిమలుగా ప్రదర్శించవచ్చు. అంతేకాకుండా, జానపద గేయాలలో పొడుపు కథలున్నాయి. కథాగేయాల రూపంలో పొడుపు కథలున్నాయి (Riddle Ballads). కొన్ని పొడుపు కథలు గద్య కథల రూపంలో ఉంటాయి (Riddle Tales). సామెతల రూపంలో ఉండే పొడుపు కథలు కూడా ఉంచవచ్చు.[1] అందువల్ల పొడుపు కథల్ని ఏ జానపద గేయాలలోనో ఒక భాగంగా వివేచించడం కంటె ప్రత్యేక విభాగంగా గుర్తించి అధ్యయనం చేయవలసిన అవసరం ఎంతో ఉంది.

పొడుపు కథవల్ల వినోదం, విజ్ఞానం రెండూ లభిస్తాయి. జానపదులకు ఈ విధంగా ఉపయోగించే విశిష్టప్రక్రియలు కావడంచేత ప్రపంచంలోని అన్ని జాతులవారూ ఈ పొడుపు కథల్ని తమ నిత్య జీవితంలో ఒక భాగంగా చేసుకున్నారు. ఆదిమ మానవుని చిత్తవృత్తిని, బుద్ధి వికాసం పొందుతున్న దశలో అతని తహతహను, అభివ్యక్తి శక్తిని ప్రతిబింబిస్తున్నాయి పొడుపు కథలు.

జీవితమే ఆకరంగా, జీవితంలో సమస్యల్ని విడగొట్టడానికి మనిషి చేసే ప్రయత్నమే ప్రేరణగా, ఎదుటివాడి బుద్ధి కుశలతకు ఒక పరీక్షగా అవతరించినవే పొడుపు కథలు. సామాన్య మానవునిలో ఉండే చాతుర్యం, హాస్యప్రియత్వం, సమస్యల్ని పరిష్కరించాలనే కోరిక - ఇవన్నీ పొడుపు కథలను కళాత్మకంగా తీర్చిదిద్దడానికి తోడ్పడతాయి. Roger D.Abrahams, Alan Dundes పొడుపు కథను ఇలా నిర్వచించారు ` "Riddles are questions that are framed with the purpose of confusing or testing the wits of those who do not know the answer."[2] ఇంగ్లీషులోని 'riddle' పొడుపు కథకు సమానార్థకమైంది (Riddle కు మూలమైన raedan అనే పాత ఇంగ్లీషు పదానికి సలహా ఇవ్వడమనే అర్థం ఉంది.) సంస్కృతంలో వేదకాలంనుంచీ ప్రహేళికలనే పేరుతో

పొడుపు కథలు ప్రచారంలో ఉన్నాయి.

"పొడుచుట, విప్పుటలో ఆనందమును వెల్లివిరియించునని పొడుపు కథలు"[3] అన్నారు నేదునూరి గంగాధరంగారు. పొడుపు కథలలో వస్తువు గూఢంగా ఉంటుంది. అది వినేవాళ్ళకు కుతూహలాన్ని రేకెత్తిస్తుంది. పొడుపుకథ అన్న పేరు ఇలాంటి సమస్యాత్మక కథలకు (riddle stories) పేరుగా ఉండి తర్వాత అన్ని సమస్యలకూ పేరు అయిందేమో అనిపిస్తుంది. ఎందుకంటే, పొడుపుకథ అనే అర్థం వచ్చే 'ఒగటిన కథె' కన్నడంలో కథారూపంలో ఉండే సమస్యలకు పేరై ఉంది. ఒగటు లేక ఒడపు riddle అనే అర్థాన్నిస్తుంది. తెలుగులో కూడా పొడుపు అంటేనే చాలేమో, కాని riddle అనే అర్థంలో పొడుపుకథ అన్నదే ప్రచారంలో ఉంది.

పొడుపు కథల్ని నిర్వచించడానికి జానపద విజ్ఞానులు చాలామంది ప్రయత్నించారు. అయితే పొడుపు కథలలో ఉండే వైవిధ్యాన్నంతటినీ ఒకే నిర్వచనంలో ఇమడ్చడం కష్టమైన పని. Archer Tayler పొడుపు కథల్లో ముఖ్యంగా రెండు వివరణాత్మక గుణాలున్నాయంటాడు. వాటిలో ఒకటి రూఢము, మరొకటి వ్యతిరేకము (one positive and another is negative)రూఢంగా ఉండేది ఆలంకారికంగా ఉంటుంది. Archer Taylor నిర్వచనం ప్రకారం "a riddle consists of two descriptions of an object one figurative and one literal, and confuses the hearers who endevour to identify an object described in conflicting ways."[4] అయితే ఈ విధంగా ఒకటి రూఢంగా, మరొకటి వ్యతిరేకంగా ఉండే గుణం అన్ని పొడుపు కథల్లోనూ కనిపించదు. పొడుపు కథలోని రహస్యగుణాన్ని తెలుపుతూ దానిలోని వైవిధ్యాన్ని కొంతవరకు ప్రదర్శించే నిర్వచనం ఈ క్రిందిది – "A Riddle may either have an apparent sense which serves as disguise to the real one, or it may be in the form of a question, the terms of which do not directly indicate the nature of which do not directly indicate the nature of the answer required"[5]

గంభీరంగా ఉండడం పొడుపుకథల ప్రధాన లక్షణాలలో ఒకటిగా పేర్కొనవచ్చు. ఇవి బుద్ధి ప్రధానమైనవి. ఊహాతీతంగా కన్పిస్తూ, గూఢంగా ఉండే వస్తువు తెలియగానే ఎదుటివానికి దిగ్భ్రమ కలిగేట్లు చేయడం పొడుపు కథల గంభీరతలో ఒక భాగం. మంచి పొడుపు కథను చెప్పడం ప్రశ్నించేవాడి వంతు. ప్రతిభావంతంగా దానిని విప్పడం విన్నవాడి వంతు. గంభీరతకు సంబంధించిందే అర్థగోపనం అన్నది ప్రయత్నపూర్వక సృష్టికి సంబంధించింది. ఇదే జానపదగేయం మొదలైన అప్రయత్నంగా





వెలువడే అంశాలకు పొడుపు కథకు ఉండే భేదం. ప్రయత్న పూర్వకంగా మరొక వ్యక్తి బుద్ధి శక్తిని పరీక్షించేందుకై పొడుపు కథలు కల్పింపబడ్డాయి.

రూపకమై ఉండడం పొడుపుకథ ప్రధాన లక్షణాలలో ఒకటి. కేవలం వాగాడంబరమై ఉండకుండా పొడుపుకథ ఏదో ఒక వస్తువుకు గాని, వ్యక్తిగాని సంకేతంగా ఉంటుంది. ఈ గుణాన్ని బట్టి పొడుపు కథను వ్యాజోక్తి అని గాని, గూఢోక్తి అని గాని అనవచ్చు, ప్రాచీన సంస్కృతాలంకారికులు వ్యాజోక్తికి, వక్రోక్తికి, గూఢోక్తికి ఇచ్చిన ఉదాహరణలు వేరు వేరు రకాల పొడుపు కథలే. చిన్నపిల్లలు మాట్లాడుకునే 'క' భాషకూడా ఈ కోవకు చెందిందే. (ప్రతి అక్షరం ముందు 'క' చేర్చి మాట్లాడితే 'క' భాష అంటారు). ఈ ఆలంకారిక గుణం పొడుపుకథలు చమత్కార జనకాలుగా ఉండేట్లు చేస్తుంది. పదగూఢత, వస్తుగూఢత, అన్వయ గూఢత మొదలైనవి పొడుపు కథలలో కనిపిస్తాయి. భావాది గూఢత గలది ప్రహేళిక (పొడుపు కథకు సంస్కృతం పేరు) అనే అర్థం వచ్చే నిర్వచనాలు సంస్కృతంలో కనిపిస్తాయి.[6] జేమ్స్.ఎ.కెల్సొ అర్థస్పష్టత లేని రూపకం లేక రూపకం సముదాయం పొడుపు కథ అనడం[7] కూడా ఆలంకారికమైన పొడుపుకథ గుణాన్ని తెలుపుతున్నది. రూపకానికీ పొడుపు కథకూ ఉండే సంబంధాన్ని గుర్తించిన వారిలో మొట్టమొదటి వాడు అరిస్టాటిల్. పొడుపు కథను రూపకాల మాలగా పేర్కొన్నాడు అరిస్టాటిల్. పొడుపు కథల్లో ముఖ్యంగా రెండు భాగాలుంటాయని చెప్పవచ్చు. ఒకటి ఉపమానం, మరొకటి ఉపమేయం. ఉపమానం వాచ్యంగాను ఉపమేయం సూచ్యంగాను ఉంటుంది. ఉపమానాల సహాయంతో ఉపమేయాన్ని తెలుసుకోవాలి. ఉపమానాలను జానపదులు నిత్య జీవితంలో మనకు పరిచితాలైన వస్తువులనుంచే తీసుకుంటారు.

పొడుపు కథలు హాస్యగుణాన్ని కలిగి ఉంటాయి. కొన్ని అశ్లీలంగా కూడా ఉంటాయి. వినోదం వీటి ముఖ్యోద్దేశం కాబట్టి కొన్నిటికి అశ్లీల గుణం అలవడింది. కాని సామాన్యంగా పదాలు అశ్లీలంగా ఉన్నా అర్థం గంభీరంగా ఉంటుంది. హాస్యానికి తోడు ఒక్కొక్కసారి ఎత్తిపొడుపు కూడా కనిపిస్తుంది. మనిషిలో సహజంగా ఉండే నవ్వే, నవ్వించే గుణం, హాస్యప్రవృత్తి పొడుపు కథలు రూపొందడానికి కొన్ని కారణాలు కాబట్టి ఈ గుణాలు వాటిలో కనిపిస్తాయి. "Riddles are probably the oldest extant forms of humour"[8] అన్నమాట గమనించదగింది. హాస్యమూ, గాంభీర్యమూ రెండూ విచిత్రంగా సంగమించిన గూఢోక్తులు పొడుపు కథలు.

ప్రకృతితో సంబంధాన్ని కలిగి ఉండడం పొడుపు కథల మరొక లక్షణం.

పొడుపు కథలలో ప్రకృతికి సంబంధించిన అనేక వస్తువులు స్థానం సంపాదించుకున్నాయి. ప్రాచీన కాలం నాటి మానవుడు తన జీవితంలో ప్రకృతికి ఇచ్చిన ప్రాముఖ్యాన్ని ఈ గుణం తెలుపుతుంది. జానపద విజ్ఞానంలోని అనేక అంశాలకున్నట్లే పొడుపు కథలకు సార్వజనీనత మరొక లక్షణం. ప్రపంచంలో ఒక మూల కన్పించే పొడుపు కథల్లాంటివి మరొక మూల కన్పించవచ్చు. ప్రపంచంలోని వివిధ ప్రదేశాలలో దొరికే పొడుపు కథలను సేకరించి, పరిశీలిస్తే మనుష్య సంబంధమైన కొన్ని సార్వత్రిక గుణాలు కనిపిస్తాయి.

పై వివరణ వల్ల పొడుపుకథ స్వరూపం కొంతవరకైనా బోధపడుతుంది. చాతుర్యంతో కూడిన, కళాత్మకమైన, లయాత్మకమైన సంక్షిప్త గూఢోక్తి పొడుపుకథ. ఇది బుద్ధికి కసరత్తు కలిగిస్తుంది. ప్రాక్తన మానవుని బౌద్ధిక సృష్టి పొడుపుకథ.

**ఉత్పత్తి, వికాసం :**

పొడుపు కథలలో ముఖ్యంగా కనిపించేది ఆలోచన. ఇవి బుద్ధి శక్తితో జానపదులు ప్రయత్న పూర్వకంగా కల్పించినవి. పొడుపు కథలు ఎంత ప్రాచీనమైనవి, మానవ సంస్కృతి చరిత్రలో వీటిని ఏ దశకు చెందినవిగా చెప్పవచ్చు మొదలైన ప్రశ్నలు విద్వాంసుల దృష్టి నాకర్షించాయి. ఈ విషయాలను గురించి జరిగిన పరిశోధనల లోతుల్లోకి వెళ్ళకుండా స్థూలంగా చూచినప్పుడు గేయాలు, కథాగేయాలు మొదలైనవి మొదటి ఘట్టంలోను, గద్య కథనాలు రెండవ దశలోను, పొడుపు కథలు మూడవ ఘట్టంలోను వెలువడినాయని చెప్పవచ్చు. "A last department of oral Folklore is the so - called popular riddle"[9] అన్న Krappe మాటల్లో సత్యం ఉందనిపిస్తుంది. వాగ్రూప కళలు చాలా వాటి కంటే పొడుపు కథలు ప్రాచీనమైనవనే అర్థం వచ్చేట్లుగా C.F.Potter చెప్పిన మాటలను[10] అంగీకరించడం కష్టం. ఆయన అభిప్రాయం ప్రాకరం పొడుపు కథలలో కనిపించే ఆలంకారిక గుణం ప్రాథమిక మనస్తత్వానికి నిదర్శనం. అయితే పొడుపు కథలలో మిగిలిన వాటికంటే ఎక్కువగా కన్పించే క్రమబద్ధత అవి గీతాలు మొదలైనవాటి కాలం తర్వాత ఉద్భవించాయని ఆలోచించడానికి ఆస్కారం కలిగిస్తున్నది. అంతమాత్రంచేత పొడుపు కథలు ఇటీవలి కాలానికి చెందినవని అర్థం కాదు. మానవ మనోవికాసం బాల్యావస్థలో ఉన్నప్పుడే పొడుపు కథలు అవతరించాయి. "All peoples in the first stages of Culture were lovers of riddles"[11] అన్నమాట సత్యమనవచ్చు.





సాహిత్యపరమైన పొడుపు కథలు కూడా చాలా కాలంనుంచే కనిపిస్తున్నాయి. అయితే అవి జానపదుల పొడుపు కథలకంటే గంభీరమైనవి. ఎక్కువగా ధార్మిక వాతావరణం కలవి. భారతదేశంలో వేదకాలం నుంచి ఇవి ప్రచారంలో ఉన్నాయి. వేదాలలో, పురాణాలలో, బౌద్ధ జైనాది ధర్మ గ్రంథాలలో పొడుపు కథలు అసంఖ్యాకంగా కనిపిస్తాయి. వేదాలలో, అత్యంత ప్రాచీనమైన ఋగ్వేదంలోని మొదటి మండలంలోనే పొడుపు కథలున్నాయి. "ద్వా సువర్ణా సయుజా సఖాయా సమానం వృక్షం పరిష స్వజాతే తయో రన్యః పిప్పలం స్వాద్వత్త్యనశ్నన్నన్యో2భి చాకశీతి" అన్న ఋగ్వేదంలోని ప్రహేళిక సుప్రసిద్ధమైనది. చెట్టు మీద రెండు పక్షులున్నాయి. ఒకటి పండును తింటున్నది. మరొకటి తినడం లేదు. ఇక్కడ జీవాత్మ పరమాత్మలను ధ్వనిరూపకంగా చెప్పాడు వేదఋషి. జీవిత రహస్యాన్ని నిగూఢంగా చెప్పే అభిలాష ఇందులో వ్యక్తమవుతున్నది. ఇలాంటి ప్రహేలికలు ఇంకా ఉపనిషత్తులు, పాణిని అష్టాధ్యాయి, భారతం మొదలైన వాటిల్లో కనిపిస్తాయి. యజ్ఞయాగాలలో, పెళ్ళిళ్ళలో పొడుపు కథలను అనాది కాలం నుంచి వాడేవారు.

భారతదేశంలోని పొడుపు కథల వికాసాన్ని గురించి చెప్పేటప్పుడు వేదాల తర్వాత మహాభారతాన్ని పేర్కొనవలసి ఉంది. ప్రకృతికి, నీతికి సంబంధించిన పొడుపు కథలు ఈ ఇతిహాసంలో ఉన్నాయి. యక్షప్రశ్నలు ప్రశ్నోత్తరరూపంలో ఉండే పొడుపు కథలు చాలా వెలువడడానికి ప్రేరణ ఇచ్చి ఉండవచ్చు. జాతక కథలలో ఉండే పొడుపు కథలు నీతికి సంబంధించినవి. రాజు చనిపోయిన తర్వాత మరొకర్ని ఎన్నుకోడానికి పొడుపు కథల ద్వారా పరీక్ష జరిపే కథలు జాతక కథల్లో ఉన్నాయి.

భారతదేశంలో ప్రాచీనకాలంలో పొడుపు కథలు దొరికినట్లే ఇతర దేశాల సంస్కృతులలో కూడా ఈ వినోద సాధనం సాహిత్యవేత్తలలో ప్రచారంలో ఉండేది. గ్రీక్, సెమెటిక్, బాబిలోనియా సంస్కృతులకు చెందిన కావ్యాలలో, ప్రాచీన హిబ్రూ కావ్యాలు, బైబిలు మొదలైన వాటిలో ఆధ్యాత్మిక చింతన కల్గిన పొడుపు కథలు కనిపిస్తాయి. మధ్యయుగాల తర్వాత పొడుపు కథల మీద సాహిత్యవేత్తల ఆసక్తి తగ్గిందని చెప్పాలి. కాని ప్రాక్తన కాలం నుంచి నేటివరకు పొడుపు కథలు జానపదులకు వినోద సాధనాలుగా, ఆలోచనను రేకెత్తించే శక్తులుగా నిలిచి ఉన్నాయి.

పొడుపు కథలు ఎలా పుట్టాయి అన్నది కూడా విచారణీయమే. ప్రాచీన కాలపు పొడుపు కథలు ఇప్పటివాటిలాగా కేవలం వినోదం కొరకు కాకుండా వాటి వెనుక ఒక ధార్మిక చింతన ఉంటూ ఉండడం గమనించవచ్చు. పొడుపు కథలు

పుట్టడానికి మానవుడి ప్రకృతి పరిశీలన, ధార్మిక చింతన కారణాలై ఉండి ఉండవచ్చు. ప్రాచీన మానవుని జీవనం ధార్మిక ఆచరణలతో, మానవాతీత శక్తులపై నమ్మకాలతో నిండి ఉండిందని మానవ శాస్త్ర అధ్యయనంవల్ల తెలుసుకోవచ్చు. గహనమైన ప్రకృతి రహస్యాలను అస్పష్ట భాషలో చెప్పడానికి అవతరించాయని ఊహించవచ్చు. ప్రకృతిలో ఒకడుగా మానవుడు బ్రతుకుతుండిన కాలంలో, ప్రకృతిని అర్థం చేసుకోవాలనే కుతూహలం కలిగిన ప్రాచీన మనస్సు చేసిన ప్రాథమిక అభ్యాసం పొడుపు కథల పుట్టుకకు కారణమయిందని మరో విధంగా చెప్పవచ్చు. పొడుపు కథల నిశిత పరిశీలన ఆదిమవాసుల జీవితాలను, అనుభవాలను, ఆలోచనలను గురించి కుతూహలకరాలైన అనేక విషయాలను తెలుపుతుంది.

జానపద విజ్ఞానంలోని ఇతర విషయాలను గురించి చెప్పేటప్పుడు ఎదురయే ప్రశ్నలే పొడుపు కథలను భౌగోళికంగా పరిశీలించినప్పుడు కూడా ఎదురవుతాయి. ప్రాచీనమైన పొడుపు కథలు అనేక దేశాల సాహిత్య కృతుల్లో లభ్యమవుతున్నవి. వీటికి ఒకే మూలం ఏమైనా ఉన్నదా లేక అవి వేరు వేరు స్థలాలలో స్వతంత్రంగా పుట్టినవా అన్న ప్రశ్న ఉండనే ఉంది. ప్రపంచంలోని ఏ సంస్కృతి ప్రాచీనతమమైందో, ఆ సంస్కృతిలో ఉదయించిన పొడుపు కథలు మొదలైనవే మిగిలిన స్థలాలకు కూడా వ్యాప్తి చెందాయి అని చెప్పడం అసాధ్యమైన పని. అది ఏనాటికైనా సాధ్యమవుతుందేమో కాని ప్రస్తుతం మనమింకా ఒక నిర్ణయం తీసుకునే స్థితికి రాలేదు. బహుప్రదేశ అస్తిత్వం పొడుపు కథలకు ఉండడం కూడా నిజమే కాని, అవి అలా ప్రపంచంలోని వివిధ ప్రదేశాలలో ఉండడం, వాటిలో పోలికలు కనిపించడం ఒకే మూలం నుంచి పుట్టడం వల్లనా (ఏకోత్పత్తి సిద్ధాంతం) లేక మానవుల మనస్సులోనే ఉండే సమాన గుణంవల్లనా (బహుళోత్పత్తి సిద్ధాంతం) అన్నది ఇంకా చర్చనీయాంశంగానే మిగిలి ఉంది. పొడుపు కథ ఈ రెండు విధాలలో ఏవిధంగా పుట్టినా, వికాసం చెంది ఉన్నా అది ఇంకా ఇంకా బుద్ధిశక్తిని సంపాదించాలనే కుతూహలం, ఉత్సాహం కలిగిన మనిషి మనస్సును ప్రతిబింబిస్తుందన్నది మాత్రం నిజం.

**విభజన :**

పొడుపు కథలను విభజన చేయడానికి ఎన్నో విధానాలు వాడుకలో ఉన్నాయి. పొడుపు కథలలో ముఖ్యమైన రెండు విభాగాలు 1.జానపదుల పొడుపు కథలు. 2.సాహిత్యపరమైన పొడుపు కథలు. జానపదుల పొడుపు కథలు ముఖ్యంగా





వినోదంకోసం ఏర్పడినవి. సాహిత్యంలో కనిపించేవి తాత్వికమైనవిగా, ధార్మికమైనవి ఉంటాయి.

పొడుపు కథలలో మత సంబంధమైన ఆచరణలకు సంబంధించినవి కొన్ని ఉన్నాయి. కొందరు Conundrums, Enigma అనే రెండు రకాల పొడుపు కథలను పేర్కొంటారు. మొదటిదానిలో పదాడంబరం, రెండో దాంట్లో ఊహాత్మక వివరణ ముఖ్యంగా ఉంటుందని స్థూలంగా చెప్పవచ్చు. పద సమస్య అనే పొడుపు కథలో ఒక పదంలోని ప్రతి అక్షరాన్ని లేక పదాన్నంతటినీ పొడుపు కథ రూపంలోనో, నటన మూలంగానో సూచించినప్పుడు పదాన్నంతటినీ ఊహతో కనిపెట్టడం ఉంటుంది. నటన మూలంగా సూచించే దానిలో ఒక రకమే నేత్రావధానం. గణిత సంబంధమైన పొడుపు కథలు ఒక విభాగం.

చాలా ప్రాచుర్యాన్ని సంపాదించిన పొడుపు కథలలో ప్రశ్నోత్తర రూపంలో ఉండే పొడుపు కథల్ని పేర్కొనవచ్చు. ఇవి పాటల రూపంలో ఉండవచ్చు. పెళ్ళిళ్ళలో ఇలాంటి వాటిని చూడవచ్చు. కొన్ని రకాల పద్యాలలో స్పర్ధారూపంగా ఉండే పొడుపు కథల్ని ఉపయోగిస్తారు. నేత్రావధానం మొదలైన వాటిని నేర్చుకొని, చిత్రాల ద్వారా సూచించేపొడుపు కథలను దృశ్య సంబంధమైన పొడుపు కథలుగా (Visual riddles) పేర్కొనవచ్చు. తర్కసంబంధమైన Puzzles బుద్ధికి పదును పెడ్తాయి.

Brothers and sisters have I none,
But that man's father is my father's son
Who is he? His son[12]

మొదలైనవి చాలా ప్రచారంలో ఉన్నాయి.

భాషాశాస్త్రపరంగా కూడా పొడుపు కథలను వర్గీకరించవచ్చు. అనేక పదాలు గొలుసు కట్టులాగా ఉండడం, సామాన్య వాక్యాలు, సంకీర్ణ వాక్యాలు, వ్యతిరేకాన్ని సూచించే వాక్యాలు, పద్య రూపంగా ఉండే పొడుపు కథలు, కథారూపంలో ఉండేవి, ఇత్యాదుల్ని విభజనక్రమంలో తీసుకోవచ్చు.

సంస్కృత సాహిత్యంలో ప్రహేలికలను గురించి చెప్పిన వాళ్ళు చేసిన వర్గీకరణాలను కూడా గమనించవచ్చు. దండి ప్రహేలికలలో 16 భేదాలు చెప్పాడు. విశ్వనాథుడు సాహిత్య దర్పణంలో చ్యుతదత్తాక్షరాదికము లన్నాడు కాని ఇన్ని అని సంఖ్య చెప్పలేదు. భోజరాజు చ్యుతాక్షర, దత్తాక్షర, చ్యుత దత్తాక్షర, ముష్టిక, బిందుమతి, అర్థవతి అనే ఆరువిధాలను చెప్పాడు.

సామెతలను సూచించిన దశమాంక పద్ధతిలాంటి వర్గీకరణనే పొడుపు కథలకు అన్వయించి Archer Taylor ఒక విధానాన్ని సూచించాడు.[13] ప్రధానమైన ఐదు వర్గాలను పొడుపు కథలలో గుర్తించవచ్చు. 1.మనుష్యులు, జంతువులు అని గుర్తించరాని జీవాలతో పోలిక, 2.జంతువులతో పోలిక, 3.మనుష్యులలో పోలిక, 4.వృక్షాదులతో పోలిక, 5.వస్తువులతో పోలిక. "నా బాతుల్లో ఒకటి నాలుగు ముక్కులది" (దిండు) అనే cheremis పొడుపు కథ పశుపక్ష్యాదులకు సంబంధించినది కాబట్టి అది 2 – వ వర్గానికి చెందుతుంది. ఇది ప్రత్యేకంగా పక్షికి సంబంధించింది కావడం చేత 2-2 అని సూచించవచ్చు. పక్షులలో బాతు 4 -పది కావడం చేత 2-2-4. ఇంకా సూక్ష్మాంశాలను సూచించడానికి 2-2-4-1-2 ఈ విధంగా అంకెల ద్వారా సూచిస్తూ పోవచ్చు. ఇలాంటి సక్రమ విధానాన్ని జానపద విజ్ఞానంలోని ఏ విషయానికైనా అన్వయించి చెప్పవచ్చు. లైబ్రరీలలో పుస్తకాలను విభజించే పద్ధతిని పోలిన ఈ విధానం సరళంగానూ ఉంటుంది. అధ్యయనానికి తోడ్పడుతుంది.

**ప్రయోజనం, అధ్యయనం :**

పొడుపు కథ కాలక్షేపానికి పనికి వస్తుంది. కేవలం కాలక్షేపానికే కాక రాజకీయంగా, తాత్వికంగా, మత పరంగా, సాంస్కృతికంగా కూడా పనికి వస్తుంది. బుద్ధి వికాసానికి దోహదం చేస్తుంది. పొడుపు కథ వినడం, విప్పడం పిల్లలకు వినోదాన్ని, విజ్ఞానాన్ని కలిగిస్తాయి. పొడుపు కథలో ఆదిమ మానవుని ఆచారాలు, సంప్రదాయాలు ప్రతిబింబితమై ఉంటాయి. వర్షంకోసం, వివాహాలలో వినోదం కోసం, వంట సమృద్ధికోసం పొడుపు కథలను ఉపయోగిస్తారు. పొడుపు కథలకు సంబంధించిన కొన్ని నిషేధాలూ ఉన్నాయి. కొన్ని సందర్భాలలో మాత్రమే పొడుపు కథల్ని వాడాలనే నియమం ఉంది.

పొడుపు కథలను గురించి అధ్యయనం చేసిన వారిలో మొదటివాడు అరిస్టాటిల్ అని చెప్పవచ్చు. టేలర్, ఆర్నె, పాటర్ మొదలైనవారు ఈ క్షేత్రంలో కృషి చేశారు.

**ఉపసంహారం :**

జానపద సాహిత్యంలో ప్రధాన శాఖలైన గేయం, కథాగేయం, కథ, సామెత, పొడుపు కథ అనే ప్రక్రియల సంక్షిప్త వివరణ ఇంత వరకు ఇవ్వడం జరిగింది.





ఇవికాక సంగీతం, నృత్యం, నాటకం, భౌతిక సంస్కృతి, ఆచార సంప్రదాయాలు మొదలైనవి జానపద విజ్ఞానం విస్తృతిని, వైవిధ్యాన్ని తెలుపుతాయి. వీటిని సేకరించి, విభజించి, విశ్లేషించినప్పుడు మానవ సంస్కృతికి సంబంధించిన అనేక విశేషాలు తెలుస్తాయి. జానపద విజ్ఞానాధ్యయనంవల్ల మనల్ని గురించి, మన జన జీవనాన్ని గురించి తెలుసుకోవచ్చు. భవిష్యత్తుకూ సోపానాలు వేసుకోవచ్చు.

**పొడుపు కథలు : ప్రమాణ గ్రంథాలు :**


**ఇంగ్లీషు :**

1. Introducing Folklore - Kenneth and Mary Clarke
2. Folklore and Folklife - Richard M.Dorson (Ed.)
3. The Science of Folklore - Alexander Krappe
4. Standard Dictionary - Maria Leach (Ed.)

**తెలుగు :**

5. తెలుగు పొడుపు కథలు – డా.కె.వెంకటరెడ్డి
6. గోడమీద బొమ్మ – డా.వెలగా వెంకటప్పయ్య
7. పొడుపు కథలు – డా.జి.ఎన్.రెడ్డి (సం.)

**కన్నడం :**

8. కన్నడ ఒగటుగళు – డా.లక్కప్పగౌడ
9. నమ్మ ఒగటుగళు – డా.రామేగౌడ


**టిప్పణి**

1. 'కట్టె, కొట్టె, తెచ్చె' అన్నది రామాయణ కథను సూచించే సామెత. దీన్ని చిన్న పిల్లలు ఒక్కొక్కసారి పొడుపు కథగా ఉపయోగించుకోడం కూడా కద్దు.
2. "Riddles" Richard M.Dorson (Ed), Folklore and Folklife, p.130
3. జానపద గేయ వాఙ్మయ వ్యాసావళి
4. Quoted in M.N.V.Panditaradhya's On Riddles, a definition and an analysis, p.11
5. The new popular Encyclopaedia, p.112

6. "వ్యక్తీ కృత్య కమప్యర్థం స్వరూపార్థస్య గోపనాత్
యత్ర బాహ్యాభ్యంతరా వర్ణా కథ్యతే సా ప్రహేళికా."
"క్రీడా గోష్ఠీ వినోదేషు తజ్‌జ్ఞై రా కీర్ణ మంత్రణే
పరవ్యామోహనే చాపి సోపయోగాః ప్రహేలికాః."
– ఈ రెంటిని ఉదహరించినవారు భాష్యం విజయసారథి. ప్రహేళికలు, ప్రథమభాగము, పు. vii-viii

7. Encyclopaedia of Religion and Ethics, p.765

8. Encyclopaedia Britannica, vol xx, p.549

9. Alexander Krappe, The Science of Folklore, p.201

10. Standard Dict. of F.lore, p.938

11. Encyclopaedia of Religion and Ethics, p.768

12. Richard M.Dorson (Ed.), Folklore and Folk life, p.138

13. Kenneth W.Clarke, Mary W.Clarke, Introducing Folklore, p.120





## కొన్ని ఆధార గ్రంథాలు

English :

Bowra, C.M.Primitive Song, 1962

Clarke, Kenneth and Mary, ed. A Folklore Reader 1965

Clarke, Kenneth and Mary, Introducing Folklore, 1963

Dorson, Richard M, ed. Folklore and Folklife 1972

Dundes, Alan, ed. The Study of Folklore 1965

Gummere, Francis B., The Popular Ballad, 1907

Leach, Maria, ed., Standard Dictionary of Folklore Mythology, and Legend, 1975

Thompson, Stith, Folk tale, 1946

**తెలుగు :**

ఆదిశేషువు, హరి. జానపద గేయ వాఙ్మయ పరిచయము, 1967

గంగాధరం, నేదునూరి జానపద గేయ వాఙ్మయ వ్యాసావళి, 1961

రామరాజు, బి. తెలుగు జానపద సాహిత్యము, 1958

సుబ్బారావు, తంగిరాల. జానపద సాహిత్యము–వీరగాథలు, 1975

**కన్నడం :**

గద్దగిమఠ, బి.ఎస్., కన్నడ జానపద గీతగళు, 1962

నాయక, హా.మా., జానపద స్వరూప, 1971

రామానుజన్, ఎ.కె., గాదెగళు, 1968

రామేగౌడ (రాగౌ), కర్ణాటక జానపద కథెగళు, 1969

రామేగౌడ (రాగౌ), నమ్మ ఒగటుగళు, 1970

రామేగౌడ (రాగౌ), నమ్మ గాదెగళు, 1975

సి.పి.కె, (సి.పి.కృష్ణకుమార్), జనపద గీతె, 1975

# పారిభాషిక పదాలు

anthropology – మానవ శాస్త్రం
ballad – కథాగేయం, వీరగాథ
----, Popular – జనప్రియ కథాగేయం
traditional – సాంప్రదాయిక కథాగేయం
diffusion – వ్యాపక గుణం
fable – నీతి కథ
folk epic – జానపద ఇతిహాసం
folk literature – జానపద సాహిత్యం
folklore – జానపద విజ్ఞానం
folklorist – జానపద విజ్ఞాని
historical-geographical theory– చారిత్రక భౌగోళిక సిద్ధాంతం
indic origin theory– భారత మూల సిద్ధాంతం
informant – నివేదకుడు
Irrationality – వివేక రాహిత్యం
Legend – ఐతిహ్యం
marchen – కట్టుకథ
minstel – వృత్తి గాయకుడు
monogenesis – ఏకోత్పత్తి వాదం
motif – మూలాంశం
multiple existence– బహు ప్రదేశ అస్తిత్వం
myth – పురాణం
narrative poem – కథా గేయం
novella – కాల్పనిక కథ
polygenesis – బహుళోత్పత్తి వాదం





prose narratives – గద్య కథనాలు
proverb – సామెత
reconstruction – పునర్నిర్మాణం
refrain – పల్లవి
riddle – పొడుపుకథ
situation – సన్నివేశం
song – గేయం, పాట
song, children's – పిల్లల పాట
song, festive – వేడుక పాట
song, love – వలపు పాట
song, sorrowful – కన్నీటి పాట
song, work – పనిపాట
superstition – మూఢవిశ్వాసం
tale – కథ
tale, animal – ప్రాణి కథ
tale, complex – సంకీర్ణ కథ
tale, etiological – సృష్టిస్థితి కథ
tale, fairy – అద్భుత కథ
tale, legendary – ఐతిహాసిక కథ
tale, mythological– పురాకథ
tale, religious – ధార్మిక కథ
tale, simple – సరళ కథ
type – మాదిరి

## రెండవ పుస్తకం

# తెలుగు-కన్నడ జానపద గేయాలు

మైసూరు విశ్వవిద్యాలయం నుండి 1973లో పిహెచ్.డి.పొందిన గ్రంథం. వ్యావహారిక భాషలో తెలుగులో వెలువడిన మొదటి సిద్ధాంత వ్యాసం. 1979లో మొదటి సారి ముద్రితమైంది. తెలుగు జానపద సాహిత్య పరిశోధనలో మొదటి తులనాత్మక పరిశీలన కూడా ఇదే.





**తెలుగు-కన్నడ జానపద గేయాలు**

పల్లెపాట పాడితే లయ
కడలి పొంగి పొర్లితే లయ
గుండె కోయిల కూస్తే లయ
పండు వెన్నెల కాస్తే లయ
మొన్న పుట్టిన పువ్వు నవ్వినా లయ
నిన్న పూచిన పువ్వు రాలినా లయ
కాల పురుషుని గమనంలో లయ
తీపి తలపుల మననంలో లయ
లయాత్మక జీవనంలోని
అనుభవాల – అనుభూతుల
ఈ అభివ్యక్తి
నా మనోలతలో నిశ్చలంగా నిలిచిన
అలరుకే అంకితం

**– సుందరం**

# తొలిపలుకు

పిహెచ్.డి. పట్టం కోసం మైసూరు విశ్వవిద్యాలయానికి సమర్పించిన పరిశోధన గ్రంథమిది. 1973లో డిగ్రీ లభించిన తర్వాత మైసూరు విశ్వవిద్యాలయంలో అధ్యాపకుడిగా చేరి, జానపద విజ్ఞానం ప్రధాన విషయంగా ఎం.ఏ.చదివే విద్యార్థులకు బోధించే అవకాశం రావడంతో ఇంకా ఈ క్షేత్రంలో కృషిచెయ్యడానికి వీలుకలిగింది. అందువల్ల పరిశోధన గ్రంథంలో అక్కడక్కడా కొన్ని మార్పులు చేసి ప్రస్తుత గ్రంథాన్ని ప్రచురించడం జరిగింది.

ఈ గ్రంథ రచనకు ఎంతో ప్రోత్సాహమిచ్చి, అత్యంత వాత్సల్యంతో పరామర్శించి, పర్యవేక్షణ చేసిన ప్రచేతసులు ఆచార్య కె.సుబ్బరామప్ప గారు. విషయానుగుణంగా ఈ గ్రంథాన్ని వ్యావహారిక భాషలో రాయడానికి అనుమతి ఇచ్చినందుకు వారికి నా హృదయపూర్వక ధన్యవాదాలు. వ్యావహారిక భాషలో రచితమై పిహెచ్.డి.డిగ్రీ పొందిన తెలుగు సిద్ధాంత గ్రంథాలలో ఇదే మొట్టమొదటిది.

జీవిక కోసం కర్నాటకంలో అడుగు పెట్టడంవల్ల నాకు కలిగిన మేలు అంతా ఇంతా కాదు. కన్నడంలో స్నాతకోత్తర పట్టాన్ని పొందడంతో బాటు, కన్నడ సాహిత్యంతో-ముఖ్యంగా-జానపద సాహిత్యంతో పరిచయం కలిగించుకోడం సాధ్యమయింది. మైసూరు విశ్వవిద్యాలయంలో ప్రవేశించిన తర్వాత (1973) ఇక్కడి జానపద విద్వాంసుల సాహచర్యంవల్ల ఎన్నో కొత్త విషయాలను తెలుసుకొనే అవకాశం ఏర్పడింది.

ఈ పరిశోధన గ్రంథాన్ని రచించడానికి ముఖ్యంగా నెల్లూరు, చిత్తూరు, కోలారు జిల్లాలలో పర్యటించి సుమారు ఐదువందల గేయాలు సేకరించాను. నా విద్యార్థి ప్రకాష్ మున్నగువారు ఈ సేకరణలో తోడ్పడ్డారు. గేయాలను పాడిన నివేదకులందరికీ ధన్యవాదాలర్పిస్తున్నాను.

తెలుగులో ఇంతవరకు వెలువడిన జానపద గేయ సంకలనాలు, విమర్శలు, కన్నడంలో అసంఖ్యాకంగా వెలువడిన జానపద గ్రంథాలు, ఆంగ్లంలోని ప్రామాణిక గ్రంథాలు ఈ సిద్ధాంత వ్యాస రచనకు ఎంతగానో ఉపయోగపడ్డాయి. శ్రీయుతులు హా.మా.నాయకగారు, జి.ఎన్.రెడ్డి గారు, జీ.శం.పరమశివయ్యగారు, బి.రామరాజుగారు, టి.దొణప్పగారు, టి.వి.సుబ్బారావుగారు-ఇంకా ఎంతోమంది ఎన్నో





సలహాల నిచ్చి సహాయపడ్డారు. మదరాసులోని ప్రాచ్యలిఖిత భాండాగారాధికారులు వ్రాతప్రతులను ఉపయోగించుకోడానికి అనుమతి ఇచ్చారు. అందరికీ నా కృతజ్ఞతలు.

పరిశోధన చేయడం, గ్రంథాన్ని ప్రచురించడం అన్నవి వ్యక్తిగతమైన సాధనలనడంకన్న, సమష్టి ఫలితాలనడం సమంజసం. ప్రస్తుత గ్రంథం వెలువడడానికి అనేకులు ఎన్నో విధాలుగా సహాయం చేశారు.

ధన సహాయం చేసిన ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వారికి,
ముద్రణకు అనుమతి ఇచ్చిన మైసూరు విశ్వవిద్యాలయం వారికి,
గ్రంథఋణం ఇచ్చిన సహోద్యోగి రామేగౌడ గారికి,
నేను అడిగినదే తడవుగా చిత్రాలు రచించి ఇచ్చే
ప్రఖ్యాత కర్నాటక చిత్రకారులు పి.ఆర్.తిప్పేస్వామిగారికి,
అందంగా ముద్రించి ఇచ్చిన అరవింద ముద్రణాలయం వారికి
నా కృతజ్ఞతలు.

ఏ పని చేయడానికైనా మంచి వాతావరణం అవసరం. మైసూరు విశ్వవిద్యాలయంలో, ముఖ్యంగా నేనుండే కన్నడ అధ్యయన సంస్థలో, హేమాహేమీలైన విద్వాంసులున్నారు. మా సంస్థ నిర్దేశకులైన, ప్రఖ్యాత రచయిత డా హా.మా నాయకగారి ప్రోత్సాహం, పండిత మిత్రుల సహకారం నా ప్రగతికి మూలకారణాలని చెప్పాలి.

సన్నిహిత సంబంధముండే కన్నడ జానపద సాహిత్యంతో పోల్చి చెప్పే తెలుగు జానపద సాహిత్య గ్రంథాలలో ఇదే ప్రప్రథమం. ఇంకా ఇతర భాషలతో మన జానపద సాహిత్యాన్ని తులనాత్మకంగా పరిశీలించి, తద్వారా జానపద విజ్ఞానానికుండే సార్వజనీన గుణాన్ని నిరూపించడంలో భావి పరిశోధకులు ఆసక్తి కనబరచాలని నా ఆశ. విద్వాంసులు కూడా ఈ క్షేత్రం వైపు తమ దృష్టిని కొంత త్రిప్పగలిగితే బంగారు పంటలు పండగలవు.

కాళయుక్తి సంక్రాంతి,
14-1-1979 సుందరం
మైసూరు

# విషయ సూచిక


| | |
|---|---|
| 1.ప్రవేశిక | 75 |
| 2.పని పాటలు | 103 |
| 3.పారమార్థిక గేయాలు | 130 |
| 4.బాంధవ్య గీతాలు | 161 |
| 5.పిల్లల పాటలు | 177 |
| 6.వేడుక పాటలు | 196 |
| 7.వలపు పాటలు | 216 |
| 8.హాస్య గీతాలు | 229 |
| 9.కన్నీటి పాటలు | 239 |
| 10.జానపద గేయాలు – సంస్కృతి | 249 |
| 11.భాషా విశేషాలు | 261 |
| 12.ఛందస్సు–సంగీతం | 279 |
| 13.ఉపసంహారం | 291 |
| పరిశోధన ఫలితాలు 1 | 298 |
| పరిశోధన ఫలితాలు 2 | 301 |
| తెలుగు–కన్నడ జానపద గేయాలు–తులనాత్మక పరిశీలన | 303 |
| గ్రంథ సూచి | 309 |
| పారిభాషిక పదాలు | 313 |






# ప్రవేశిక

జానపదుల లోతైన గుండెల బావుల్లో దాగి ఉండే తియతియ్యని జలాలు జానపద గేయాలు. సాదరంగా ఆ నీళ్ళను తోడి సాహిత్య క్షేత్రంలో బంగారుపంటలు పండించాల్సిన బాధ్యత సహృదయుడైన ప్రతి ఒక్కడి మీదా ఉంది. అందరూ హృదయంలో దాచుకోదగిన, మృదువైన, మధురమైన, సౌరభం వెదజల్లే విచ్చీవిచ్చని కుసుమాలు ఈ జానపదగేయాలు. "భారతదేశంలోని లక్షలాది జనుల కోసం తలుపులు తెరిచి ఉంచిన కవితా సంగీతాల మహాదేవాలయాలివి. ఇవి జనుల హృదయాలలో నుంచి పొంగి వచ్చిన మాటలు కావడం చేత వాటిలో ఉండే పల్లెల స్వచ్ఛందజీవితంలోని కష్టసుఖాలను మనమూ అనుభవిస్తాము"[1] అని జానపదగేయాల రుచి యెరిగిన దేవేంద్రసత్యార్థిగారు వచించారు. ప్రపంచంలోని యే భాషకు చెందినవైనా యీ జానపద గేయాల వెనుక దాగివున్న మనిషి హృదయం ఒక్కటే. తెలుగు గేయాలైనా, కన్నడగేయాలైనా వాటిలోని సౌందర్యం ఒక్కటే. జానపదుల గుండెల్లోంచి పొంగివచ్చే రసప్రవాహమాధుర్యం అనుభవైకవేద్యం. ఆసక్తి ఉన్న ప్రతి వాడికీ అది నవరసనైవేద్యం.

జానపద గేయం – స్వరూప స్వభావాలు

జానపదులచేత సృష్టింపబడి, మౌఖిక ప్రసారంతో బతుకుతూ, సంగీత సాహిత్యాలతో రసికులను రంజింపజేసే సరస్వతీరూపం జానపద గేయం. నాతిదీర్ఘమైన భావకవితా రూపంగానో, సంక్షిప్త సంభాషణల రూపంలోనో ఉండే జానపద గేయం జానపద కథాగేయానికంటె భిన్నమైంది. "తెలుగు జానపద గేయ సాహిత్యము" అనే శీర్షికతో డా.బి.రామరాజుగారు ఉస్మానియా విశ్వవిద్యాలయానికి సమర్పించిన పరిశోధన వ్యాసంలో జానపద గేయాలను, కథాగేయాలను రెండింటినీ పరిశీలించారు. "కన్నడ జానపద గీతగళు" అనే పరిశోధన గ్రంథంలో డా.బి.ఎస్.గద్దగిమఠగారు కూడా జానపద కథా గేయాలను తమ వ్యాసం పరిధిలోకి తీసుకొన్నారు. జానపద కథాగేయాలు గేయరూపంలో ఉన్నా అవి ప్రత్యేకంగా పరిశీలింపదగినవి.[2] కథనరూపమైన క్రియ (action) ప్రధానంగా ఉండే కథాగేయం భావాత్మకమైన చిన్ని గేయానికి భిన్నం కాబట్టి ఇటీవలి జానపద విజ్ఞానులు ఈ రెండింటినీ వేరువేరుగానే అధ్యయనం చేస్తున్నారు. ప్రకృత గ్రంథంలో కథావిరహిత గేయాలను మాత్రమే పరిశీలించడం జరిగింది.

జానపద గేయం folksong అన్న ఆంగ్లపదానికి సమానార్థకం. కొందరు జానపద గేయాలనే "పాతపాటలు" అన్నారు. "జానపదుల చేత ఏనాటినుండో పాడబడి నేడు ఉండడమా, ఊడడమా అన్న స్థితిలో ఉన్న పాటలు పాతపాటలు."[3] వీటినే పల్లె పాటలని కూడా పిలుస్తారు. కన్నడంలో జానపద గేయం అనే అర్థం వచ్చే 'జనపద గీతె, పల్లెపాట అనే అర్థం వచ్చే 'హళ్ళియ హాడు' అనే పదాలు వాడుకలో ఉన్నాయి.

గేయం జానపద విజ్ఞానం (folklore) లో ఒక భాగం. జానపద విజ్ఞానం ఇంకా అభివృద్ధి చెందుతున్న శాస్త్ర విషయాలలో ఒకటి. ఫోక్‌లోర్ అన్న పదం నిర్వచనం, అర్థవ్యాప్తి, అధ్యయన రీతులు మొదలయిన విషయాలను గూర్చిన చర్చిలింకా జరుగుతూనే ఉన్నాయి. జానపద గేయం స్వరూపస్వభావాలను అర్థం చేసుకోవాలంటే జానపద విజ్ఞాన స్వరూపాన్ని గురించి, ఆ విశాలక్షేత్రంలో గేయానికుండే స్థానాన్ని గురించి తప్పక తెలుసుకోవలసి ఉంటుంది.

ఫోక్‌లోర్ అన్న పదాన్ని థాంస్ (W.J.Thoms) అనే విద్వాంసుడు 1846లో కల్పించాడు. ఆ సంవత్సరం ఆయన "ది అథనీయం" అన్న పత్రికకు వ్రాసిన ఉత్తరంలో ఈ పదాన్ని సూచించాడు. అప్పటి వరకు ఫోక్‌లోర్‌కు బదులు ఇంగ్లాండులో popular antiquities లేక popular literature అన్న పదాలు వాడుకలో ఉండేవి. ఫోక్‌లోర్ అన్నది జానపదులకు సంబంధించిన విజ్ఞానమని థాంస్ తన ఉత్తరంలో వివరించాడు. ఫోక్‌లోర్‌లోని ఫోక్ (జనపద సంబంధి)ను గురించిన చర్చలు ఈనాటికీ ఇంకా జరుగుతూనే ఉన్నాయి. జానపద విజ్ఞానంలోను జానపద గీతంలోను ఉండే 'జానపదం' ఏమిటన్నది తేలితేగాని జానపద గేయ స్వరూపం బోధపడదు.

సంస్కృతాంగ్ల నిఘంటు కర్తయైన మోనియర్ విలియంస్ 'జనపద' శబ్దానికి community, nation, people, inhabited country అన్న అర్థాలను ఇచ్చాడు. ప్రాచీన కన్నడ కవులు జనపద మనే శబ్దాన్ని దేశమనే అర్థంలో ప్రయోగించారు. కావేరి నుంచి గోదావరి వరకు కన్నడ దేశం వ్యాపించి ఉన్నదని తొమ్మిదవ శతాబ్దానికి కవిరాజ మార్గంలో ఉంది.[4] కన్నడాంగ్ల నిఘంటుకారుడైన కిట్టెల్ జనపద శబ్దానికి a community, nation, people, an inhabited country అనే అర్థాలను, జానపద శబ్దానికి an inhabitant of the country, a peasant, a rustic అనే అర్థాలను ఇచ్చాడు. జనపద మన్నది పట్టణానికి భిన్నమైనదని, జానపదుడంటే నాగరికుడికి భిన్నుడని సామాన్యంగా బోధపడే అర్థం. మొదటిసారిగా ఫోక్‌లోర్ అన్న పదాన్ని వాడిన థాంస్ కూడా ఫోక్ అంటే నిరక్షరకుక్షులైన జనులనే అభిప్రాయాన్ని వ్యక్తపరిచాడు.[5] ఈ అర్థాన్ని మనం





ఒప్పుకుంటే అక్షరజ్ఞానంలేని పల్లెటూరివారికి సంబంధించిన విషయాలు జానపద విజ్ఞానమని సులభంగా నిర్ణయించవచ్చు. కాని జానపద విజ్ఞాన స్వరూప నిర్ణయం ఇంత సులభం కాదు.

ప్రముఖ విద్వాంసుడు అలన్ డండెస్ (Alan Dundes) ఫోక్ లేక జానపదులు కేవలం గ్రామవాసులే కానక్కర లేదని, నగరంలో కూడా అలాంటి మనస్తత్వం ఉన్నవారు ఉండవచ్చుననీ 'ఫోక్' శబ్దాన్ని వివరిస్తూ చెప్పాడు.[6] జానపదులు అని మనం పిలవదగినవారు నగరంలో ఉండవచ్చునని చెప్పడమే కాకుండా 'ఫోక్'ను నిర్వచిస్తూ డండెస్ సమాన ధర్మాలు కలిగిన ఏ జనసమూహాన్నయినా జానపదులని పిలవవచ్చునన్నాడు.[7] సమానధర్మమంటే ఒకే మతంకావచ్చు. ఉద్యోగం కావచ్చు, మరేదైనా కావచ్చు.

సమాన సంప్రదాయాలు కల్గిన ఏ జనసమూహమైనా 'ఫోక్' అయ్యేట్లయితే ఇక ఫోక్ లేక జానపదులు కానిదెవరు? శిష్ట సంప్రదాయాలు కలిగిన జనసముదాయం కూడా జానపదులే అయ్యేట్లయితే సమస్త మానవ జీవితమూ జానపద విజ్ఞానమే కావలసి వస్తుంది. ప్రతి మనిషి జీవితంలోనూ జానపద జీవనం (folk life) అవిభాజ్యమైన అంగంగా ఉన్నా, జీవితమంతా జానపద సంబంధమేనని చెప్పడం కూడా సరికాదు. గ్రామ వాసుల జీవితంలో నాగరకతా సంబంధమైన సంప్రదాయాలు, నాగరకుల జీవితంలో జానపద సంప్రదాయాలు కొంత వరకైనా ఉండి తీరుతాయి. అటువంటప్పుడు ఏది జానపదం, ఏదికాదు అని స్పష్టంగా నిర్ణయించడం కష్ట సాధ్యమే.

ఫోక్‌లోర్‌లో భాగంగా విద్వాంసులు భావిస్తున్న గేయాలు, కథా గేయాలు, కథలు, సామెతలు, నమ్మకాలు, ఆచారాలు, ఆటలు, సంగీతం మొదలైన వాటిని పరిశీలించినపుడు ఇవన్నీ ప్రాక్తన మానవుని మనస్సును ప్రతిబింబించే ఒకానొక మానసిక స్థితిలో వెలువడినవని చెప్పవచ్చు. మనస్తత్వశాస్త్రం, మానవశాస్త్రం మొదలైన వాటి సహాయంతో మానవుని పుట్టుక నుంచి నేటి వరకు జరిగిన మానసిక పరిణామాన్ని పరిశీలిస్తే కొన్ని దశలను గుర్తించవచ్చు. ఆదిమ మానవుని చిత్తవృత్తి పిల్లల మనస్తత్వం వంటిది. ఇంకో విధంగా చెప్పాలంటే జానపద విజ్ఞానంలోని అనేక విషయాలు మనం కలల్లో చూచే, అనుభవించే అనేక అద్భుత విషయాలను పోలి ఉంటాయి. అంటే వీటిలో చాలావరకు మన సుప్తప్రజ్ఞాస్థితిలో (subconscious state) లేక ప్రజ్ఞాహీన స్థితిలో (unconscious state) సృష్టి అవుతాయని ఊహించవచ్చు. మానవుని పరిణామంలో ముఖ్యంగా మూడు దశలున్నాయని మానవ శాస్త్రవేత్తలు చెప్తారు.

అవి. 1. అరణ్య జీవన స్థితి (savagery) 2. అనాగరక స్థితి (barbarism) 3. నాగరక స్థితి (civilization) . జానపద విజ్ఞానం అరణ్య జీవనస్థితిలో వెలువడింది. అంటే అది అత్యంత ప్రాచీన కాలంలో సృష్టింప బడిందన్నమాట. అన్ని భాషల్లోని జానపద విజ్ఞానం ఇంత ప్రాచీనమైనదని దీని అర్థం కాదు. అరణ్య జీవన స్థితిని ప్రతిబింబించే మనస్సుగల ఏ జానపదుడైనా, ఏ కాలంలోనైనా ఈ విజ్ఞానాన్ని సృష్టించవచ్చు. అలాంటి మనస్తత్వం ఎక్కువగా కల్గినవారు పల్లెల్లో నివసిస్తారు కాబట్టి మనం సామాన్యంగా పల్లెటూరి వాళ్ళనే జానపదులని పిలుస్తాంగాని, నగరంలో కూడా జానపదులు (ఫోక్) ఉండవచ్చు, జానపద విజ్ఞానం ఉండవచ్చు. మొత్తం మీద జానపద విజ్ఞాన మన్నది జానపద మనస్తత్వం కల్గిన వారు సృష్టించిందన్నది స్పష్టం.

జానపదుల చేత సృష్టింపబడిన తక్షణమే ప్రతి విషయమూ జానపద విజ్ఞానంలో ఒక భాగం అవుతుందనుకున్నా అది పొరపాటే. జానపద విజ్ఞానానికి ఇంకా కొన్ని లక్షణాలున్నాయి. జానపద చిత్తవృత్తి ఫలితంగా అవతరించిన విషయాలు సంప్రదాయాన్ని గడించుకొంటేనే అవి జానపద విజ్ఞానం అవుతాయి. ఈ సంప్రదాయ అన్నది ప్రసారం (transmission) వల్ల లభిస్తుంది. ఒక తరం నుంచి మరొక తరానికి (generation to generation) ప్రసారం మౌఖికం (oral) గా గాని, అలవాట్ల వల్లగాని (customary example) పరోక్షం (indirectly) గా గాని జరగవచ్చు. గేయాలు, కథలు మొదలైనవి మౌఖికంగా, వృత్తులు, కళలు మొదలైనవి అభ్యాసం వల్ల ప్రభావం అవుతాయి. చిత్రకళ, శిల్పం మొదలైన వాటిని నేరుగా కాకున్నా వస్తువులను చూచి కూడా నేర్చుకోవచ్చు. ఇది పరోక్ష ప్రసారం. ప్రసారమూ, సంప్రదాయమూ ఉండే ఈ జానపద విజ్ఞానం వివిధ పాఠాల (different versions) ను కలిగి ఉంటుంది. మొత్తం మీద "జానపద విజ్ఞానమంటే జానపద మనస్తత్వం కల్గిన జనసమూహంలో సాంప్రదాయికంగాగాని, మౌఖికంగా గాని, అభ్యాస బలం వల్లగాని, పరోక్షంగా గాని ప్రసారం పొందే, వివిధ పాఠాలుగల్గిన సంస్కృతీ సంబంధమైన విషయాలు" అని చెప్పవచ్చు. ఇది బ్రున్ వాన్డ్ చేసిన నిర్వచనానికి [8] దగ్గరగా ఉండే నిర్వచనం.

జానపద విజ్ఞానంలో గేయం స్థానం ఏమిటి అని పరిశీలించవలసి ఉంది. జానపద గేయాలను, ఇంకా ఇతర సాహిత్య ప్రక్రియలను మాత్రమే జానపద విజ్ఞానం అనుకునేవారు ఇంకా ఉన్నారు. జానపద విజ్ఞానం అన్నది చాలా విస్తృతమైనది. దానిలో వాగ్రూపమైనవి, వాగ్రూపంలో లేనివి (verbal folklore and non-verbal folklore) అన్నవి రెండు ముఖ్యవిభాగాలు. జానపద విజ్ఞానమంతా వాగ్రూపమైనదే





అని కొందరు అభిప్రాయ పడుతున్నా, ఆ అభిప్రాయం చాలా సంకుచితమైనదని చెప్తూ, విద్వాంసులు వాగ్రూపంలో లేని (లేక ఉండ నవసరం లేని) నమ్మకాలు, ఆచారాలు, ఆటలు, కళలు మొదలైనవి కూడా జానపద విజ్ఞానంలో భాగమేనంటారు. జానపద విజ్ఞానాన్నే ఇంకా కొంత సూక్ష్మంగా విభజిస్తే నాలుగు విభాగాలేర్పడతాయి.[9] అవి 1. మౌఖికం (oral folklore) – గేయాలు, కథాగేయాలు, సామెతలు, పొడుపు కథలు, భాష మొదలైనవి. 2. సాంఘిక ఆచారాలు (social folk customs) – పండుగలు, వినోదాలు, వైద్యం, జానపద మతం మొదలైనవి. 3. వస్తు సంస్కృతి (material culture) – చేతిపనులు, వేషభూషణాలు, చిత్రకళ, వంటావార్పు, దుస్తులు మొదలైనవి. 4. జానపద కళలు – రూపకాలు, సంగీతం, నృత్యం.

వాగ్రూపమైన జానపద విజ్ఞానంలోని గేయాలు, గద్య కథలు, సామెతలు, పొడుపుకథలు అనే ఐదు అంశాలను చేర్చి జానపద సాహిత్యం (folk literature) అని పిలుస్తారు. వీటిలో కథలు గద్య విభాగమైతే, గేయాలు, కథాగేయాలు పద్య విభాగానికి చెందినవి. సామెతలు, పొడుపుకథలు ప్రత్యేక విభాగాలుగా పేర్కొనదగ్గవి.

జానపద కవిత్వంలో భాగమైన గేయానికి నిక్కచ్చిగా చెప్పదగిన నియమాలంటూ లేవు. ఎందుకంటే జానపదులు పాటలను అల్లేటప్పుడు ఎటువంటి కఠిన నియమాలనూ పాటించరు. ఈ గేయాలకు ఏవైనా నియమాలంటూ ఉన్నాయి అంటే అవి సహజంగా ఏర్పడినట్టివే. ప్రపంచంలో అన్నిమూలలా కనిపించే ఈ గేయాలను పరిశీలించినప్పుడు సార్వజనీనంగా ఉండే కొన్ని లక్షణాలు కనిపిస్తాయి. ఇవి తప్పకుండా అన్ని గేయాలలోను ఉండాలని లేదు. కఠిననియమాలంటూ ఏవీ లేకపోవడమే గేయానికున్న ప్రథమ లక్షణంగా చెప్పుకోవచ్చు.

"అజ్ఞాత కర్తృత్వం, సామూహిక ప్రచారం, మౌఖిక సంప్రదాయం, ప్రాచుర్యం, సారళ్యం, అనేకుల మనస్సుల నాకర్షించి సంపాదించిన జాతీయత" జానపద గేయ లక్షణాలని ఛేంబర్స్ విజ్ఞాన సర్వస్వం చెప్పున్నది.[10] ఇవి కాక గేయాల పరిశీలనవల్ల మరికొన్ని లక్షణాలు తెలియవస్తాయి.

జానపద గేయాలు అనిపించుకోవాలంటే ఉండవలసిన అత్యంత ప్రధాన గుణం జానపదత్వం. జానపదుల చేత కల్పింపబడినవి జానపద గేయాలు. జానపదులంటే ఎవరు అన్న విషయాన్ని ఇంతకు ముందే చెప్పడమయింది. జానపద మనస్తత్వం ఉండే వారు రచించిన గేయాలు జానపదగేయాలన్నమాట. అయితే ప్రతి విషయానికి అపవాదాలున్నట్లే ఈ లక్షణానికీ కొన్ని అపవాదాలు కనిపిస్తాయి. కొన్ని

గేయాలను ప్రసిద్ధ కవులే రచించి ఉండవచ్చు. కాని కవి అప్రధానుడై పోయి, ఆ గేయానికి ఉన్న ఇతర లక్షణాలవల్ల అచ్చంగా మిగిలిన గేయాలాగానే ఉంటే దాన్ని కూడా జానపద గేయంగానే పరిగణించవచ్చు. ఉదాహరణకు అన్నమాచార్యుల కీర్తనలు కొన్ని, రామదాసు కీర్తనలు కొన్ని సామాన్యులలో కూడా ప్రచారం పొంది ఉన్నాయి. వాటిని పాడే వారిలో చాలామందికి వాటి కర్త గురించి తెలియదు. ఈ విధంగా కొన్ని గేయాలు జానపదుల రచనలు కాకున్నా ఇతర లక్షణాల వల్ల జానపదత్వాన్ని కలిగి ఉంటే అవి జానపద గేయాలే అవుతాయి.

'జానపద గేయం' అన్న పేరులోనే అది పాడడానికి అనువైనది అన్న అర్థం బోధపడుతున్నది. లయబద్ధమైన మాటలను కూర్చడమన్నది ప్రాచీనులకు సహజమైనది. మన మాటల్లో కనిపించని లయ అనాగరికుల మాటల్లో కనిపిస్తుంది.[11] మానవుడు లయబద్ధంగా మాటల్ని కూర్చడం కొన్ని వేల ఏళ్ళ క్రితమే ప్రారంభమయింది.[12]

గేయాలను, కథాగేయాలను పరిశీలించినపుడు పల్లవి (refrain) చాలా వాటిల్లో కనిపిస్తుంది. ప్రతిచరణం చివరగాని, కొన్ని చరణాల తర్వాతగాని ఒక పదమో, చరణమో మళ్ళీ మళ్ళీ వస్తుంది. ఇది ప్రాచీన గేయ లక్షణాలతో ఒకటి. ఈ పల్లవి బాహ్య పల్లవి (external refrain) కావచ్చు. అంతర పల్లవి (internal refrain) కావచ్చు లేక మిశ్ర పల్లవి(mixed refrain) కావచ్చు. గేయాల పుట్టుకకంటె ముందు నృత్తం ఉండేది. ఆనాటి లయాత్మకమైన కదలికలను సూచించే వాటిలో పల్లవి ఒకటి. పాటలేని కాలంలో నృత్తం చేసేటప్పుడు లయకు తగినట్లు కొన్ని అర్థరహితమైన శబ్దాలను చేసేవాడు మానవుడు. నేటి పడవ పాటలలో, కర్షక గేయాలలో మిగిలి ఉన్న పల్లవులు ఇట్టి ప్రాచీన లయాత్మక శబ్దాలను సూచిస్తాయంటారు.[13]

గేయాలను కథాగేయాలనుంచి వేరుచేసే గుణాలలో ఆత్మపరత్వం (subjectivity) ఒకటి. గేయాలు వస్తునిష్ఠ కవిత్వానికి (epic) చెందవు; భావనిష్ఠ కవిత్వానికి (lyrical) ఉదాహరణలవి. కథాగేయాలలో లాగా గేయాలలో కథనం(narration) ఉండదు. ఆత్మపరత్వం అన్నది ఎక్కువగా పనిపాటల్లోనూ (work songs), గృహజీవనానికి సంబంధించిన గేయాల్లోనూ (songs of daily life), పారమార్థిక గేయాల్లోనూ (sacred songs) ఎక్కువగా కనిపిస్తుంది. ఆత్మ పరత్వంతో బాటు జానపద గేయాల మరొక లక్షణం అప్రయత్న రచన. జానపదులు గేయాలను ఆశువుగా, అప్రయత్నంగా చెప్తారే కాని ఈ సమయంలో, ఈ విధంగా, ఈ లక్షణాలతో చెప్పాలని పట్టు పట్టరు. జానపదుల అభివ్యక్తికి వారి జీవితంలో గడించిన అనుభవం సహాయం





చేస్తుంది. "తన మనోభావాన్ని ఎదుటివారితో చెప్పటం ఎప్పుడైతే మానవుడు నేర్చుకున్నాడో అప్పట్నుంచే కవిత్వం పుట్టుకొస్తుంది. మలమల మాడ్చే ఎండలు హెూరున కురిసే వర్షాలు ముడుచుకుపోయే చలి, ఆనందంతో హృదయాన్ని ఉఘ్ఘాతలూగించే పంటపొలాలు, శరీరాన్నంతటినీ కదలింప జేసే కష్టమైన పనులు చావులు, పుట్టుకలు, పెళ్ళిళ్ళు, పేరంటములు, పండుగలు, పబ్బాలు, పూజలు ఒక్కటేమిటి ప్రతీ సంఘటన, ప్రతీ సన్నివేశము, పల్లెటూరివారి కవితావేశానికి మూలకందాలవుతూ వచ్చాయి."[14]

అప్రయత్న రచనలు, ఆశు రచనలు అయిన గేయాలు మౌఖిక సంప్రదాయం (oral tradition) తో జీవిస్తాయి. ఇవి మౌఖిక జానపద విజ్ఞానంలో చేరుతాయని ఇంతకు ముందే చెప్పడమయింది. గేయాలు, కథలు, కథాగేయాలు మొదలైనవి వ్రాత రూపంలో ఉండడం చాలా విరళం. అవి ఆనోట ఆనోట ప్రచారం పొందేవి. ఒక్క జానపద గేయాలే కాదు, ప్రాచీన కవిత్వం చాలావరకు మౌఖికమయినదే. "గ్రంథస్థ సాహిత్యం సహాయంతో ప్రాచీన కవిత్వాన్ని అధ్యయనం చేయడం సాధ్యంకాదు. ఎందుకంటే అది దాని స్వభావాన్ని బట్టి గ్రంథస్థం కానిది, అక్షరస్థ సాహిత్యంకన్న ప్రాచీనమైనది, చాలా అరుదుగా మాత్రమే వ్రాయబడింది".[15]

గేయానికి ప్రత్యేకంగా కవి అంటూ ఎవరూ ఉండరు (anonymity). ఇది వైయక్తిక సృష్టికావచ్చు, సమష్టిసృష్టి కావచ్చు. అయితే గేయంగా రూపొందేటప్పుడు సామూహిక పునఃసృష్టి (communal re-creation) జరుగుతుందన్నది మాత్రం నిజం. ఎందుకంటే నలుగురి నోళ్ళలో నాని, నలుగురి మాటలు చేరితేనే అది జానపద గేయం అవుతుంది. ఈ కారణంవల్ల జానపద కవి ఎప్పుడూ అప్రధానుడే. మనస్తత్త్వశాస్త్రవేత్త యూంగ్ ప్రతిపాదించిన "సమష్టిసుప్తప్రజ్ఞ" ని(collective unconcious) సిద్ధాంతం వీటి కన్వయిస్తుంది. మరొక విధంగా చెప్పాలంటే వ్యక్త్యతీతం (impersonal) గా ఉండడం జానపద గేయాల లక్షణమన్నమాట. ఎవరైనా 'ఈ గేయం నాది' అని చెప్పగలిగే స్థితిలో ఉంటే అది జానపద గేయం కాదు. ఆ గేయం తమది అని అందరూ అనుకోవాలి, ఎవరో ఒక్కరికి దాని మీద అధికారం ఉండ కూడదు.

అందరూ తమది అనుకోవడంవల్ల కొన్ని చిక్కులున్నాయి. గేయాన్ని పాడే ప్రతి ఒక్కరూ ఏదో ఒక పదాన్నో, వాక్యాన్నో చేరుస్తారు లేక తీసేస్తారు. అందువల్ల జానపద గేయానికున్న రూపం మారిపోతూ ఉంటుంది. దానికి బోలెడన్ని పాఠాలు తయారవుతాయి. కాని అధికృత పాఠం అంటూ ఏదీ ఉండదు. కొంతకాలం తర్వాత గేయం రూపమే పూర్తిగా మారి, భాష అర్థం కాకుండా పోవచ్చు.

జానపద గేయాల కర్త అప్రధానుడు కావడం వల్ల, అనేక పాఠాలుండడం వల్ల వాటి రచనా కాలం తెలుసుకోవడం కష్టమవుతుంది. కాలం తెలియక పోవడంవల్ల జానపద గేయాలు పాతవీకావు, కొత్తవీకావు. అవి నిత్యనూతనాలు.[16] ఇన్ని విశిష్ట గుణాలున్నాయని మనం చెప్పుకుంటున్నా జానపద గేయాలు సరళమైనవి, అకృతకమైనవి అని చెప్పడం కూడా అవసరం. ముగ్ధ జానపదుల రచనలు కాబట్టి గేయాలలో నవనవోన్మేషశాలినియైన ప్రతిభ కనబడుతుంది. జానపద కవిత్వానిది నిరాభరణ సౌందర్యం. స్వభావోక్తి ఒకటే జానపదులు మెచ్చిన అలంకారం. ప్రజల జీవితంలో భాగమైన నుడికారాల సొగసులన్నీ గేయాలలో కనిపిస్తాయి. అతి సుకుమారాలై సహజ సుగంధాన్ని వెదజల్లే పువ్వుల్లాంటి ఊహలు జానపద గేయాలలో కనిపిస్తాయి.

గేయాలు ప్రాచీన మానవుని అత్యంత సహజమైన చిత్తవృత్తిని ప్రతిబింబిస్తాయి. అయినా వాటిలో సామాన్యంగా కనిపిస్తాయని చెప్పుకున్న లక్షణాలన్నీ వాటికి సార్వత్రికంగా అన్వయిస్తాయని చెప్పడానికి లేదు. జానపద గేయాలకు "సంగీతమే శయ్య. సాహిత్యమా పోత పోసిన వెండి లాగా ప్రవహిస్తుంది. జానపదుల గేయము హృదయోద్గతము రసపుష్పమూను. ఇన్ని చెప్పి, అసలు విషయము చెప్పడము తప్పయిపోతుంది. జానపద గేయాలన్నిటికీ ఈ లక్షణాలన్నీ ఉండనక్కర లేదు".[17]

**జానపద గేయాల పుట్టుక**

జానపద గేయాలు ఎప్పుడు పుట్టాయి, ఎందుకు పుట్టాయి మొదలైన ప్రశ్నలకు సమాధానాలు నేదునూరి గంగాధరం గారు ఈ విధంగా వ్రాశారు– "రెక్కాడితేగాని డొక్కాడని ఆ కర్షకకార్మికులకు విశ్రాంతి యెరుగని ఆ రెక్కలే దిక్కు. వారి కష్టసుఖాలు వారిలో వారే చెప్పుకోవాలి. హృదయంలో ఉన్న ఆనందమో, ఆవేశమో, దుఃఖమో, కష్టమో పైకి వెళ్ళ బుచ్చుకుంటేనేగాని హృదయభారం తీరదు. ఇదే జానపద కవిత్వంగా వెలువడింది".[18]

జానపద గేయాల ఉత్పత్తిని గురించి అధ్యయనం చేయడానికి ఇటీవలి కాలంలో విద్వాంసులు ప్రతిపాదించిన అనేక సిద్ధాంతాలు ఉపకరిస్తాయి. ఈ సిద్ధాంతాలన్నీ ముఖ్యంగా మూడు ప్రశ్నలకు సమాధానం చెప్పడానికి ప్రయత్నిస్తాయి. అవి 1. జానపద విజ్ఞానం ఎప్పుడు పుట్టింది 2. ఎక్కడ పుట్టింది 3. ఎందుకు, ఏ విధంగా పుట్టింది? అన్నవి. మొదటిది కాలానికి సంబంధించింది, రెండవది ప్రదేశానికి సంబంధించింది, మూడవది స్వభావానికి సంబంధించింది. ఈ మూడు ప్రశ్నలకు





సమాధానం చెప్పగలిగితే జానపద గేయాది ప్రక్రియల ఉత్పత్తి తెలిసినట్లే. వీటిలో చారిత్రక భౌగోళిక సిద్ధాంతం కాలానికి, ప్రదేశానికి సంబంధించిన ప్రశ్నలకు సమాధానం చెప్పడానికి ప్రయత్నిస్తుంది. జానపద గేయాల కాలాన్ని నిర్ణయించడం సాధ్యమయ్యే పనికాదు. జానపద కథల అధ్యయనానికి సంబంధించిన చారిత్రక–భౌగోళిక సిద్ధాంతం (historical-geographical theory) జానపద గేయాల అధ్యయనానికి కూడా తోడ్పడుతుంది. దీనికే ఫిన్నిష్ విధానం అనే పేరుంది. వందల కొద్దీ పాఠశాలతో అనేక ప్రదేశాలలో కనిపించే జానపద గేయాలను పరిశీలించి మూలపాఠాన్ని కనుక్కోడానికి ప్రయత్నం చేయడం ఈ విధానంలో ముఖ్యం. కాలానుగుణంగా క్రమ బద్ధంగా గీతాలను వింగడించి ఆయా పాటల విశేష గుణాలకు అనుగుణంగా ప్రతిగేయాన్నీ లోతుగా పరిశీలించాలి. ఈ సిద్ధాంతం జానపద విజ్ఞానాంశాలు ఏదైనా ఒక ప్రదేశంలో పుట్టి ఇతర ప్రదేశాలకు ప్రసారమవుతాయని చెప్తుతుంది.

జానపద విజ్ఞానాంశాలు పుట్టుకను గురించి వాదాలలో ముఖ్యమైనవి ఏకోత్పత్తివాదం (monogenesis), అనేకోత్పత్తివాదం (polygenesis) అన్నవి ఈ వాదాలు జానపద విజ్ఞానానికే కాక సంస్కృతి అధ్యయనానికి, మానవశాస్త్ర అధ్యయనానికి కూడా అన్వయిస్తాయి. ఏదైనా ఒక గేయం గాని, కథగాని, కథాగేయంగాని ఒక ప్రదేశంలో పుట్టి మిగిలిన ప్రదేశాలకు వ్యాప్తిస్తుందనడానికి కొందరు విద్వాంసులు ఆధారాలను వెతికారు. ముఖ్యంగా చారిత్రక భౌగోళిక విధానాన్ని ప్రతిపాదించిన జూలియస్ క్రోహ్న్ (Julius Krohn,1835-1888), కార్లె క్రోహ్న్ (Kaarle Krohn,1863-1933), అంటి అర్నె (Antti Aarne, 1867-1925) ఈ సందర్భంలో పేర్కొనదగినవాడు. వీరంతా చెప్పేదేమిటంటే జానపద కథగాని, గేయంగాని ఒక ప్రదేశంలో పుట్టి వాటి వ్యాపక గుణం (diffusion) వల్ల మరొక ప్రదేశానికి ప్రయాణం చేస్తాయి. అనేకోత్పత్తి వాదాన్ని బలపరచే వారు దీన్ని ఒప్పుకోరు. ప్రపంచంలో వివిధ ప్రదేశాలలో కనిపించే జానపదాంశాలలో ఏదైనా పోలిక కనిపిస్తే దానికి కారణం మనిషిలో మూల భూతంగా ఉండే మానసిక ఐక్యత (psychic unity) గాని మరే కారణమూ కాదని వీరి వాదన. ప్రపంచంలో ఏ ప్రదేశంలోనైనా మనిషికి కొన్ని ప్రాథమిక ప్రవృత్తులు (motives) ఉంటాయి. కోపం, సంతోషం, ఈర్ష్య, దుఃఖం మొదలైనవి ఏ మనిషికైనా ఉంటాయి. అదీకాక మానవుని పరిణామ చరిత్రలో ఏ ప్రాంతంలోనైనా అరణ్యజీవన స్థితి, అనాగరిక స్థితి, నాగరిక స్థితి అన్న మూడు దశలు కనిపిస్తాయి. అందువల్ల ప్రపంచంలో

ఏ మారుమూల ఉన్నా ఒక్కొక్క దశలో మనిషి ఆలోచనలు, అనుభవాలు ప్రాథమికంగా ఒకే విధమైనవి. అందువల్ల జానపద ప్రక్రియల బహుప్రదేశ అస్తిత్వానికి (multiple existence) అనేకోత్పత్తే కారణం అని ఈ విద్వాంసులంటారు. కాని ఈనాడు పెక్కుమంది విద్వాంసుల సమ్మతిని పొందింది ఏకోత్పత్తి వాదమేగాని అనేకోత్పత్తి వాదం కాదు. ఎందువల్ల నంటే ఏదైనా సాంస్కృతిక అంశం ప్రత్యేకంగా ఒక చోటునుంచి మరొక చోటికి వెళ్ళకున్నా, రెండు సంస్కృతుల మధ్య ఏదో ఒక కాలంలో జరిగిన పరస్పర వినిమయం మూలంగా ఆ సాంస్కృతిక అంశం ఉత్పత్తి అయి ఉండవచ్చు. ఉదాహరణకు ఒక తెలుగు జానపద గేయం కన్నడ దేశానికి నేరుగా వెళ్ళి ఉండకపోవచ్చు. అయితే ఏనాడో తెలుగు దేశం నుంచి అక్కడికి వలస వెళ్ళిన వాళ్ళవల్లనో, మరే విధంగానో కన్నడదేశానికి చేరిన సాంస్కృతిక అంశాలు కన్నడ దేశంలో తెలుగు గేయాన్ని పోలిన గేయం ఉత్పత్తి కావడానికి దోహదం చేయవచ్చు.

ఏకోత్పత్తి వాదం, అనేకోత్పత్తి వాదం మొదలైనవి ఒక గేయం కాలం గురించి, పుట్టిన దేశం గురించి తెలుసుకోడానికి ఉపయోగిస్తాయి. చారిత్రక పునర్నిర్మాణ సిద్ధాంతం (historical-reconstructional) అన్నది గేయాది ప్రక్రియలలో కనిపించే కొన్ని ఆధారాల మూలంగా దాని చరిత్రను తెలుసుకోడానికి సహాయపడుతుంది.

జానపద గేయాలు ఎందుకు పుట్టాయి, ఎలా పుట్టాయి అన్నదాన్ని తెలుసుకోడానికి స్వప్నమూల సిద్ధాంతం, మనో విశ్లేషణ (psycho-analysis) సిద్ధాంతం ఉపయోగిస్తాయి. జానపద ప్రక్రియల ఉత్పత్తిని గురించి చెప్పేటప్పుడు ఈ సిద్ధాంతాలు చాలామటుకు రెండు విషయాలను వివరించడానికి ప్రయత్నిస్తాయి. ఒకటి బహుప్రదేశ అస్తిత్వం, మరొకటి వివేక రాహిత్యం (irrationality).[19] బహుప్రదేశ అస్తిత్వాన్ని గురించి సిద్ధాంతాలు 'ఎప్పుడు, ఎక్కడ' అనే రెండు ప్రశ్నలకు సమాధానం చెప్పడానికి ప్రయత్నిస్తాయి. వివేక రాహిత్యాన్ని గురించి చెప్పేవి 'ఎందుకు జానపద విజ్ఞానం పుట్టింది' అనే దాన్ని వివరించడానికి ప్రయత్నిస్తాయి. అటువంటి ప్రయత్నం చేయడానికి ఫ్రాయిడ్ కలలను గురించి, సుప్తప్రజ్ఞను గురించి చేసిన అనేక పరిశోధనలు తోడ్పడతాయి. జానపద విజ్ఞానంలో కనిపించే వివేకరాహిత్యానికి కారణం అవి ప్రాచీన మానవుని మనస్తత్వం సృష్టించినవి కావడమే. ఈ ప్రాచీన మనస్తత్వం మన కలలలో కనిపించే వివేక రహితమైన విషయాలవంటి వాటిని సృష్టిస్తున్నది. స్వప్నాలను మనస్తత్వ శాస్త్ర పరంగా విశ్లేషించినప్పుడు కథలు, గేయాలు మొదలైన వాటి అర్థ వివరణ అసాధ్యమవుతుందని కొందరు విద్వాంసుల అభిప్రాయం. లైస్నర్ (Ludwig Laistner)





మొదలైనవాళ్ళు దీన్ని ప్రతిపాదించారు.

ధార్మిక సంబంధమైన ప్రాచీన కర్మకాండలే జానపద ప్రక్రియలకు మూలమన్న అభిప్రాయ మొకటి ఉంది. దీన్ని ఆచరణాత్మక సిద్ధాంతం (ritualistic theory) అంటారు. కథలు, గేయాలు మొదలైన వాటిని లోతుగా పరిశీలించినప్పుడు ప్రాచీనకాలంనాటి ఏదో ఒక కర్మకాండను పునర్నిర్మించవచ్చునని ఈ సిద్ధాంతాన్ని నమ్మేవారంటారు. అయితే జానపద సంబంధమైన నమ్మకాలు మొదలైన వాటి ఆధారంతో మతసంబంధ ఆచరణలు నిర్మాణంకాగా, ఆచరణలే జానపద విజ్ఞానానికి మూలమని ఎలా అనడమని కొందరి ప్రశ్న. చెట్టు ముందా విత్తుముందా అనే మీమాంస ఈ సిద్ధాంతం విషయంలోనూ ఉంది.[20]

జానపద గేయం ఉత్పత్తి, వికాసాలను శాస్త్రీయంగా అవగాహన చేసుకోడానికి మానవ శాస్త్రం, మనస్తత్వశాస్త్రం మొదలైనవన్నీ దోహదం చేస్తాయి. ముఖ్యంగా డార్విన్ ప్రతిపాదించిన పరిణామవాదం సహాయంతో మానవుని వికాసాన్ని, తర్వాత గేయం పుట్టుకను ఊహించగలుగుతాం. పరిణామవాదం జీవశాస్త్ర అధ్యయనంలో ఒక సంచలనాన్ని లేవదీసింది. జీవపరిణామం ఉన్నత దశలలో జరిగేకొద్దీ కర్మేంద్రియాలు, జ్ఞానేంద్రియాలు అభివృద్ధి చెందాయి. మానవుడు చిన్నచిన్నగా నిప్పు ఉపయోగం, వేటాడడం మొదలైనవి నేర్చుకున్నాడు. వేటాడడం ఒంటరిగాకాక సామూహికంగా చేస్తుండినా అతి ప్రాచీనమానవుడికి భాష లేదు. కాలం గడిచే కొద్దీ సంజ్ఞలు పోయి భాష వచ్చింది. దానికి తగ్గట్లుగా మనిషి కంఠం కూడా రూపొందింది. పాతరాతియుగం తుదిదశలో ఉండిన క్రోమాన్యాన్ మానవులు దాదాపు మనలాంటివారే. ఆ తర్వాత భౌతికంగాకాక సాంస్కృతికంగా పరిణామం జరిగింది.

మెదడు, కంఠం రెండూ బాగా అభివృద్ధి చెందిన తర్వాత దృశ్యమాన ప్రపంచాన్ని చూచి తనలో రేగే భావాలకు రూపాన్ని కల్పించడం కోసం మానవుడు తహతహలాడాడు. మానవుడి భాష సంజ్ఞలతో ప్రారంభమై చిన్న చిన్నగా భావానికి తగిన శబ్దాన్ని వాడడం వరకు వచ్చింది. లయబద్ధంగా మానవుడు మాటలను కూర్చడం కొన్ని వేల ఏళ్ళ క్రితమే ప్రారంభమయింది.

గేయం వ్యష్టి సృష్టి అని కొందరు, సమష్టి సృష్టి అని మరికొందరు అంటారు. రెండూ సాధ్యాలే అనవచ్చు. కాని గేయాన్ని ఒక్కరే కల్పించినా అది నలుగురి నోటిలో పడవలసిందే అందువల్ల సామూహిక పునఃసృష్టి మాత్రం తప్పదు. అతి ప్రాచీన కాలంలో మానవులే పని చేసినా సామూహికంగానే చేసేవారు. ఒక వేళ ఒక్క వ్యక్తే

ఏదైనా చెప్పినా అది సామాజిక ప్రజ్ఞతో వెలువడేది. హడ్సన్ (Hudson) మాటలు ఈ అభిప్రాయాన్నే బలపరుస్తున్నాయి. "Investigations into the beginnings of literature have shown that poetry originated in the desire to give outward form to the feelings not of the individual but of the cloud or group".[21]

జానపద గేయాలలో మొట్టమొదట వెలువడిన పాట ఎటువంటిది అని చెప్పడం అసాధ్యం. అయినా పనికి, పాటకు ఉండే సంబంధాన్ని బట్టి మొట్టమొదటి పని పాటలు (work songs) వెలువడి ఉండవచ్చుననిపిస్తుంది. ఆదిమ మానవుని ప్రధానవృత్తి వేట. అతని తెలివినంతటినీ వేటపైననే కేంద్రీకరించాడు ఆనాటి మానవుడు. వేటలో నిమగ్నుడై ఉన్నప్పుడు పాటలు వెలువడడం చాలా అరుదు. వేటాడిన తర్వాత జంతువులను ఒకచోట వేసి, ఆ సంతోషంతో వేట వృత్తాంతాన్ని చెప్పుకుంటూ, నృత్తాలు చేస్తూ ఆవేశంగా మాట్లాడేటప్పుడు వెలువడిన భాష లయబద్ధంగా ఉండేదని ఊహించవచ్చు.

వేటతో బాటు మానవునికి మానవాతీత ప్రపంచంలో నమ్మకం కూడా ప్రారంభమయింది. తమ సంతోషాన్ని, దుఃఖాన్ని మానవాతీత శక్తులకు విన్నవించుకొనేటప్పుడు కూడా ఆదిమ మానవులు లయాత్మక గీతాలను పలికి ఉంటారని చెప్పవచ్చు. ఇలా పాటలు, పారమార్థిక గీతాలు ఇంచుమించు ఒకే కాలంలో పుట్టాయనిపించినా మానవాతీత శక్తులపై నమ్మకం, దేవుడున్నాడనే భావం మానవుడికి కలగక ముందే మానవుని ముఖతః జానపద గేయానికి ప్రాథమిక రూపమైనా తప్పక వెలువడి ఉంటుందని ఊహించవచ్చు.

జానపద గేయాల అధ్యయనానికి వర్గీకరణ చాలా ముఖ్యం. వైజ్ఞానిక అధ్యయనానికి వీలుండేట్లుగా జానపద విజ్ఞానాన్ని విభజించే ప్రయత్నాలు జరిగాయి. జానపద విజ్ఞానంలో భాగాలైన గేయాలు, కథలు, సామెతలు, నమ్మకాలు, మతం, కళలు మొదలైనవాటినికి సూక్ష్మాతిసూక్ష్మంగా విభజన చేసినవాడు ఆర్.ఎస్.బాగ్స్ (R.S.Boggs). ఈ పద్ధతిని అనుసరించి జానపద విజ్ఞానంలోని ఏ అంశాన్నయినా సూక్ష్మంగా విశ్లేషించడానికి వీలవుతుంది. బాగ్స్ వర్గీకరణను తెలుసుకుంటే జానపద గేయాల విభజనకు కూడా అది తోడ్పడుతుంది.

జానపద విజ్ఞానంలోని ప్రధాన భాగాలను groups అనే పేరుతో మొదట విభజించిన బాగ్స్ వాటికి గుర్తులుగా ఇంగ్లీషులోని ABCD వగైరాలను ఉంచాడు. జానపద విజ్ఞానంలో బాగ్స్ ప్రకారం ఈ క్రింది groups ఉన్నాయి.





| | |
|---|---|
| A | General Folklore |
| B | Prose Narrative |
| C | Ballad Song Dance Game Music Verse |
| D | Drama |
| F | Custom Festival |
| G | Geography |
| L | Language |
| M | Art Craft Architecture |
| N | Food Drink |
| P | Belief |
| S | Speech |
| V | Proverb |
| W | Riddle |

పై groups లో ఒక్కొక్కదానికి మళ్ళీ బాగ్స్ కొన్ని categories గా విభజించాడు. బి అన్నది Prose Narratives ను సూచిస్తుంది కదా. దానిలో మూడు categories ఉన్నాయి. అవి బి 200 Myth, బి 400 Legend, బి 600 Tale. అంటే క్యాటగరీస్ అన్నవి నూర్లలో ఉంటాయి. వీటిల్లో ఒక్కొక్కదాన్ని మళ్ళీ types గా విభజించాడు. అవి పదుల్లో ఉంటాయి. ఉదాహరణకు బి 200 అనే క్యాటగరీలో బి 220, బి 230, బి 240 మొదలైన types ఉంటాయి. forms లో మళ్ళీ కొన్ని types, వాటిలో కొన్ని divisions ఉంటాయి. ఉదాహరణకు 'సి 324' అని ఉన్నదనుకుందాము. ఇందులో సి అంటే కథాగేయం, పాట, నృత్యం, ఆట మొదలైన వాటిని సూచించే group అన్నమాట. సి 300 అంటే జానపద గేయం. సి 320 అంటే రసానికి సంబంధించిన గేయం. సి 324 అంటే సంతోషానికి సంబంధించిన గేయం. ఇది గ్రంథాలయాలలో మనం చూచే పుస్తకాల వర్గీకరణ వంటిది.

బాగ్స్ వర్గీకరణవల్ల మనకు రెండు ప్రయోజనాలున్నాయి. మొదటిది జానపద విజ్ఞానాన్ని, ప్రపంచంలో ఏ మూలదైనా సరే, శాస్త్రీయంగా విశ్లేషించడానికి పనికి వస్తుంది. రెండవది జానపద విజ్ఞానంలో ఏయే అంశాలు వస్తాయి అన్నది తెలిసి దాని స్వరూపం కొంతవరకు బోధపడుతుంది.

Standard Dictionary of Folklore, Mythology and Legend లో type అనే

శీర్షిక కింద చేసిన తన వర్గీకరణలో బాగ్స్ జానపద గేయాన్ని, కథాగేయాన్ని ఇంకా కొన్నిటిని సి అనే group కింద ఇచ్చాడు. జానపద గేయాన్ని సి 300 అనే క్యాటగరీ కింద ఇచ్చాడు. సి 300 అనే క్యాటగరీ కింద ఈ కింది సూక్ష్మ విభాగాలున్నాయి.

జానపద గేయంలోని types 5. అవి రసగీతాలు, దైనిక జీవనానికి సంబంధించిన గేయాలు, జీవనంలోని ముఖ్య ఘట్టాలు. పిల్లల పాటలు, మత సంబంధ గేయాలు అన్నవి. వీటిని ఇంకా విభజిస్తే ఇలా ఉంటాయి.

C 300 SONG

C 320 Emotion

C 322 Love

C 323 Hate

C 324 Joy Happiness

C 325 Sorrow Unhappiness

C 326 Admiration Praise Adulation

C 327 Serious condemnation Scorn

C 328 Good humor Jest

C 329 ILL humor Ridicule Mockery

C 330 Daily Life

C 334 Work

C 335 Cries of street vendor

C 336 Social reunion

C 337 Serenade Charivari

C 340 Crucial Moment of Life

C 342 Birth

C 345 Marriage

C 346 Death

C 347 Parting

C 348 Nostalgia

C 349 War cries

C 360 Children





C 366 Cradle song Lullaby

C 370 Religious

జానపద గేయాల వర్గీకరణను ఇంకా ఎన్నో విధాలుగా చేయవచ్చు. స్థూలంగా గేయాలను విభజించాలనుకుంటే లౌకిక గీతాలు, పారమార్థిక గీతాలు (secular songs and sacred songs) అని రెండు విభాగాలు చేయవచ్చు. మానవుని జీవితంలో ముఖ్యంగా రెండు అంశాలు కనిపిస్తాయి. ఒకటి అతని లౌకిక జీవితానికి సంబంధించింది; మరొకటి మానవాతీత శక్తులపై అతనికున్న నమ్మకానికి సంబంధించింది. ఈ రెండు అంశాలను బట్టి గీతాలలో పై రెండు స్థూల విభాగాలు ఏర్పడతాయి.

ఆశ్రయాన్ని బట్టి గీతాలను నాలుగు విధాలుగా విభజించవచ్చు. 1. పురుషుల గీతాలు 2. స్త్రీల పాటలు 3. ఉభయుల గేయాలు 4.పిల్లల పాటలు. ఇదీ స్థూలమైన విభాగమే. అంతే కాదు. ఒక్కొక్కసారి స్త్రీల పాటలనే పురుషులు పాడవచ్చు. పురుషుల పాటలను స్త్రీలు, పిల్లల పాటలను పెద్దలు పాడవచ్చు. స్థూలమైన ఈ విభజనకంటె కొంత వివరంగా వర్గీకరణ చేయడం అవసరం.

రసాన్ని బట్టి గేయాలను విభజిస్తే వలపు పాటలు, హాస్య గీతాలు మొదలైనవి ఏర్పడతాయి. క్రియాత్మక గుణాన్ని తీసుకుంటే పనిపాటలు, క్రీడాగీతాలు, నృత్యగేయాలు మొదలైనవి వస్తాయి. ఈ విధంగానే లయను. గాయకులను, వాద్యాలను తీసుకొని విభాగం చేయవచ్చు. కాని ఇందులో ఏ ఒక్కటి సమగ్రమైన విధానం కాదు. ఒక భాషలో కనిపించే ప్రధానమైన గేయాలను దృష్టిలో ఉంచుకొని సాధ్యమైనంత వరకు అన్ని గేయాలను ఇముడ్చుకొనే విధంగా వర్గీకరణ చేయవలసి ఉంటుంది.

పనికి, పాటకు ఉండే సహజ సంబంధంవల్ల ప్రపంచంలోని అన్ని ప్రదేశాలలోను పనిపాటలు (work songs) విరివిగా లభిస్తాయి. వాటి బాహుళ్యాన్ని బట్టి పనిపాటల్ని ప్రత్యేకంగా పరిగణించవలసి ఉంటుంది. అతి ప్రాచీన కాలంలోనే పారమార్థిక గీతాలు కూడా వెలువడ్డాయి. ఇవి భక్తి గీతాలు, కర్మమార్గ సంబంధమైన పాటలు, తత్వాలు అని మూడు విధాలుగా ఉంటాయి. పని, పారమార్థిక చింతన తర్వాత మనిషికి కుటుంబం ముఖ్యమైనది. కుటుంబంలో ఉండే వివిధ బాంధవ్యాలు ప్రతిబింబించే గేయాలు కొన్ని ఉన్నాయి. అన్న-చెల్లెలు, అమ్మ-కూతురు, అత్త-కోడలు మొదలైనవారి మధ్య ఉండే బాంధవ్యాన్ని ఈ గేయాలు తెలుపుతాయి. వీటినే స్త్రీల పాటలని కూడా పిలుస్తారు. పిల్లల పాటలు ప్రత్యేకంగా పరిశీలింపదగ్గవి. పిల్లల

కోసం పెద్దలు పాడే పాటలు, పెద్దలు రాయగా పిల్లలు పాడే పాటలు, పిల్లలే కల్పించుకొని పాడే పాటలు వీటిలో చేరుతాయి. కర్మ మార్గానికి సంబంధించినవైనా కొన్ని ఆచరణలు కొంత కాలానికి తమ అసలు స్వరూపాన్ని మార్చుకొని కేవలం వేడుకలవుతాయి. దసరా, దీపావళి, హోళి మొదలైన పండగలు, వివాహం, కోలాటం మొదలైన వినోద సందర్భాలు-వీటన్నిటినీ కలిపి వేడుకలనవచ్చు. ఈ సందర్భాలలో పాడే పాటలు వేడుక పాటలు. రసభావాలకు సంబంధించినంత వరకు వలపు పాటలు, హాస్య గీతాలు, కన్నీటి పాటలు అన్నవాటిని చేర్చుకోవచ్చు.

మామూలుగా అన్ని విధాల గేయాలనూ ఇముడ్చుకోగలిగిన విభాగంగా కనిపించినా పైదానిలోనూ అతివ్యాప్తి, అవ్యాప్తి లేక పోలేదు. పని పాటలలోనే వలపు పాటలు, స్తుతులు మొదలైనవి ఉన్నాయి. పెళ్ళి పాటలలోనే హాస్యగీతాలు, కన్నీటి పాటలు ఉన్నాయి. పడవ పాటలలో తత్వాలున్నాయి. అయితే ఒక పాటలో ప్రధానంగా ఏం ఉందో దాన్ని బట్టి ఆ పాటను ఆ విభాగంలో చేర్చవలసి ఉంది. ఉదాహరణకు ఒక పనిపాటలో శృంగారాంశం ఎక్కువగా ఉంటే వలపు పాటల్లో, పారమార్థిక చింతన ఉంటే పారమార్థిక గీతాలలో చేర్చవచ్చు. లేక కేవలం పనిని గురించి మాత్రం ఉంటే పనిపాటలుగానే పరిగణించవచ్చు. అధ్యయన దృష్టితో ఇంకా కొన్ని విధానాలను అనుసరించవచ్చు. గ్రంథాలయాలలో పుస్తకాలను విభజించడానికి అనుసరించే విధానం వంటి వాటిని సామెతలు, పొడుపు కథలు మొదలైనవాటిని వర్గీకరించేటప్పుడు అనుసరిస్తారు. అంతే కాక భాషా శాస్త్రీయ దృష్టితో, నిర్మాణ విశ్లేషణ (structural analysis) ను అనుసరించి జానపద గేయాలలో సార్వజనీనంగా కనిపించే కొన్ని అంశాలు (units) గా గేయాలను విడగొట్టే విధానాలు శాస్త్రీయమైనవి, క్రమబద్ధమైనవి. అలాంటి పద్ధతిని జానపద గేయ అధ్యయనం గురించి చెప్పేటప్పుడు వివరించడం జరుగుతుంది. ఈ గ్రంథంలో గేయాలలోని అంశాలను గురించి పరిశోధన జరిగినా, వర్గీకరణ మాత్రం అంశాలను బట్టి కాక కింద చెప్పిన విధంగా చేయడమయింది. ఇది విషయ వివరణలో ఉండవలసిన సౌలభ్యాన్ని దృష్టిలో ఉంచుకొని చేయడం జరిగింది. మొత్తం మీద తెలుగు-కన్నడ భాషలలో కనిపించే గేయాలను ఈ కింది విధంగా విభజించవచ్చు.

జానపద గేయం -

- పనిపాటలు
- పారమార్థికాలు





- బాంధవ్య గీతాలు
- పిల్లల పాటలు
- వేడుక పాటలు
- వలపు పాటలు
- హాస్య గీతాలు
- కన్నీటి పాటలు

**జానపద గేయాలను గూర్చి తెలుగు, కన్నడాలలో కృషి**

తెలుగు జానపద సాహిత్య క్షేత్రంలో జరిగిన కృషిని గురించి చెప్పేటప్పుడు మొదట సి.పి.బ్రౌన్‌ను తలచుకోవాలి. శిష్టసాహిత్యోద్ధరణకు పడరాని పాట్లు పడ్డ బ్రౌన్, జానపద సాహిత్య సేకరణకు కూడా చెప్పుకోదగ్గ కృషి చేశారు. పల్నాటి వీరచరిత్ర, బొబ్బిలికథ మొదలైన కథా గేయాలను కూడా సేకరించారు బ్రౌన్. దక్షిణ దేశంలో జానపద గేయాలను సేకరించాలనే బుద్ధి మొదట ఛార్లెస్ ఇ.గోవర్ (Charles E.Gover) కు కలిగింది. ఆయన "Folk songs of Southern India" అనే గ్రంథాన్ని 1871లో ప్రచురించారు. అయితే తెలుగు గేయాలకు బదులు పొరపాటున వేమన పద్యాలను చేర్చారాయన. అంతకు ముందే 1869లో గోవ్యాఘ్ర చరిత్రమనే కథాగేయం ప్రచురితమయింది. 1872లో గుత్తెనదీవి రామాయణాన్ని ఎమ్.రాఘవయ్య అనే ఆయన ప్రచురించారు.

తెలుగులో జానపద గేయాల సేకరణకు నిజానికి జె.ఎ.బోయల్ (J.A.Boyle) ను ఆద్యులని చెప్పుకోవాలి. ఆయన సేకరించి ఇండియన్ అంటిక్వరీలో ప్రచురించిన వాటిలో ఒక చారిత్రక గేయం ఉంది. మిగిలినవి శృంగార గేయాలు. సర్వాయి పాపడికి సంబంధించిన ప్రసిద్ధ చారిత్రక గీతాన్ని మొట్టమొదట ఈయన సేకరించారు. 20వ శతాబ్దానికి ముందే ఇంకా కొంతమంది జానపద గేయాలను సేకరించి ప్రచురించిన వారున్నారు. 1884లో జానకి పాటలు, 1893లో కోలాట కీర్తనలు అచ్చయాయి. ఈ కోలాట కీర్తనలు జానపదులవో లేక కె.నాగభూషణంగారి రచనలో తెలియదు.

1900లోను, 1903లోను నందిరాజు చలపతి రావుగారు స్త్రీల పాటల్ని అచ్చువేశారు. క్రమబద్ధంగా ప్రచురితమైన, చెప్పుకోదగ్గ గేయ సంకలనాలివి. 1905లో కాకినాడ వారైన మంగు వెంకట రంగనాథరావుగారు స్త్రీల పాటల్ని అచ్చు వేశారు. 1909లో 'చిల్లరపాటలు' ప్రచురింప బడ్డాయి. 1910-20 మధ్య గేయాల సంపుటాలు

కొన్ని తెలుగులో వెలువడ్డాయి. అవి 'అప్పగింతల పాటలు', 'అడవి గోవిందనామ కీర్తనలు', 'కొమార్తె నత్తవారింటికంపెదు పాట', 'రాములవారి అలక', 'శ్రావణ మంగళవారపు పాటలు'. ఆంధ్రవాఙ్మయ సూచికలో 20వ శతాబ్దం పూర్వార్థంలో ప్రచురింపబడ్డ మరికొన్ని జానపద గేయ సంపుటాల పేర్లు కూడా ఇవ్వబడ్డవి. వాటిలో కన్యకామ్మవారి పాటలు, కోటప్పగురు కీర్తనలు, పెండ్లిగోవింద నామములు, శ్రావణ మంగళ, శుక్రవారముల పాటలు, చల్ మోహనరంగ, సిరిసిరి మువ్వపాటలు మొదలైనవి ఉన్నాయి. 1924లో టేకుమళ్ల అచ్యుతరావుగారు ఆంధ్ర పదములు-పాటలు అనే చిన్న పుస్తకాన్ని ప్రచురించారు.

విమర్శనాత్మకంగా జానపద గేయాలను గూర్చిన కృషి ఈ శతాబ్దం ఉత్తరార్థంలోనే జరిగింది. ఈ సందర్భంలో పంచాగ్నుల ఆది నారాయణశాస్త్రిగారు, వేటూరు ప్రభాకరశాస్త్రిగారు, చిలుకూరి నారాయణరావుగారు, మల్లంపల్లి సోమశేఖర శర్మగారు, అక్కిరాజు ఉమాకాన్తంగారు పేర్కొనదగ్గవారు. కాశీనాథుని నాగేశ్వరరావుగారు భారతిలో, కేసరిగారు గృహలక్ష్మిలో అసంఖ్యాకంగా గేయాలను ప్రచురించారు. ఆస్వాల్టు కూల్డ్రే దొరగారు కూడా ఈ క్షేత్రంలోపాటు పడ్డారు. ఆయన ప్రోత్సాహంచేత అడవి బాపిరాజు, కవికొండల వెంకటరావు, చింతాదీక్షితులుగార్లు ఎన్నోపాటల్ని సేకరించారు. ఆంధ్రప్రభలో నార్ల వెంకటేశ్వరరావు, విశ్వం, కె.సభాగార్లు వేలకొద్ది గేయాలను ప్రకటించారు. వివిధ వ్యాసాలను వ్రాసి జానపద సాహిత్యానికి ప్రాచుర్యాన్ని కలిగించిన వారిలో పేర్కొనదగ్గవారు వావిలాల సోమయాజులుగారు, యనమండ్ర శ్రీరామమూర్తిగారు, అడిదము రామారావుగారు, శివశంకరశాస్త్రిగారు.

జానపద విజ్ఞానాన్ని అసంఖ్యాకంగా సేకరించి తమ జీవితాన్నే దానికి అంకితం చేసినవారు నేదునూరి గంగాధరంగారు. వారి 'మిన్నేరు', 'మున్నీరు', 'సెలయేరు' మొదలైనవి అందరూ కళ్ళకద్దుకోదగ్గవి. టేకుమళ్ల కామేశ్వరరావుగారు 'పాతపాటలు' శీర్షికన ఎన్నో వ్యాసాలను ప్రచురించారు. 'కృష్ణశ్రీ' గారు ఎన్నో గేయాలను సేకరించారు, వ్యాసాలను వ్రాశారు. 1954లో శ్రీహరిఆదిశేషువుగారి 'జానపద గేయవాఙ్మయ పరిచయము' ప్రచురింపబడింది. ఇది తెలుగు భాషా సమితివారి బహుమతి నందుకొన్నది.

డా.బి.రామరాజుగారిని ప్రత్యేకంగా చెప్పుకోవాలి. తెలంగాణా ప్రాంతంలో వేల కొద్దీ గేయాలను సేకరించడమే కాకుండా ఆయన 'తెలుగు జానపద గేయ సాహిత్యము'ను గూర్చి పరిశోధన చేసి పిహెచ్.డి.పట్టం పొందారు. పెక్కు వ్యాసాలను,





తెలుగు ఇంగ్లీషులలో గ్రంథాలను ప్రకటించారు. డా.టి.దొణప్పగారు రాయలసీమ జానపద సాహిత్యంలో మంచి కృషిని చేసి వివిధ పత్రికలలో వ్యాసాలను ప్రకటించారు. అపూర్వమైన ఎన్నో జానపద ప్రక్రియలను వెలుగులోకి తెచ్చారు. డా.యస్వీజోగారావుగారు యక్షగానాలను గురించి పరిశోధించి పిహెచ్.డి.పట్టాన్ని పొందారు. తెలుగు గేయాలను గూర్చి ఇతర భాషల వారికి తెలిపి మన గేయాలకు కీర్తిని సంపాదించి పెట్టినవారు దేవేంద్ర సత్యార్థి. వింజమూరి సీతాదేవిగారు జానపద సంగీతాన్ని గూర్చి పరిశోధన చేసి ఎం.లిట్.పట్టాన్ని పొందారు. తెలుగులో వీరగాథలను క్షుణ్ణంగా పరిశోధించి బృహద్గ్రంథాన్ని వ్రాసి పిహెచ్.డి.పొందినవారు డా.తంగిరాల వెంకట సుబ్బారావు. జానపద కథాగేయాలను మానవశాస్త్ర దృష్టితో పరిశీలించినవారు డా.నాయని కృష్ణకుమారి. డా.బి.రామరాజుగారి ఆధ్వర్యంలో యెల్దండ రఘుమారెడ్డిగారు జానపద-గేయములు సాంఘిక చరిత్ర అనే పరిశోధనకు పిహెచ్.డి.పొందారు. ఉస్మానియా విశ్వవిద్యాలయం, బెంగుళూరు విశ్వవిద్యాలయం, మైసూరు విశ్వవిద్యాలయం మొదలైన చోట్ల తెలుగు జానపద సాహిత్యానికి సంబంధించిన విషయాలపై పరిశోధన జరుగుతూ ఉంది.

ఇటీవలి కాలంలో వెలువడిన జానపద సాహిత్య గ్రంథాలు కొన్ని పేర్కొనదగ్గవి. 1960లో 'త్రివేణి' పేరుతో ఆంధ్రప్రదేశ సంగీత నాటక అకాడెమీవారు ప్రచురించిన గేయసంకలనం చాలా విశిష్టమైనది. డా.రామరాజుగారి 'తెలంగాణా పల్లెపాటలు' ఉత్తమ సంకలనాలలో ఒకటి. నేదునూరి గంగాధరంగారి 'సెలయేరు', 'జానపద గేయ వాఙ్మయ వ్యాసావళి' రసజ్ఞుల మెప్పును పొందాయి. ఎల్లోరాగారి 'సరాగాలు' మొదలైన సంకలనాలు, చింతా దీక్షితులుగారి 'జానపద వాఙ్మయము' పేర్కొన దగ్గవి. డా.టి.దొణప్పగారి 'జానపద కళా సంపద'లో ఎన్నో కొత్త విషయాలున్నాయి. డా.ఆర్వీయస్ సుందరం, డా.టి.వి.సుబ్బారావు, శ్రీ జి.అశ్వత్థనారాయణ ప్రచురించిన 'ఆలిచిప్పలు-ఆణిముత్యాలు' అనే జానపద గేయ సంకలనం, డా.సుందరం ప్రచురించిన 'జానపద సాహిత్య స్వరూపం' ఈ సందర్భంలో పేర్కొనదగ్గవి. ఇప్పుడిప్పుడే ఈ క్షేత్రంలో కృషి ఎక్కువగా జరుగుతున్నది. వివిధ విశ్వవిద్యాలయంలో జానపద సాహిత్యాన్ని పఠనీయవిషయంగా చేయడం, ఆంధ్రప్రదేశ్ జానపద సాహిత్య పరిషత్తు ఏర్పడడం శుభ సూచకాలు. ఇంకా జానపద విజ్ఞాన రంగంలో బహుముఖంగా కృషి జరగవలసి ఉంది.

కన్నడ జానపద గేయాల విషయంలో కూడా మొదట సేకరణ ప్రారంభించింది

ఆంగ్లేయులే. గోవర్ 1871లో ప్రచురించిన "The Folk songs of Southern India" ను గూర్చి ఇంతకు ముందే చెప్పడమైంది. తెలుగు విషయంలో చేసిన తప్పునే గోవర్ కన్నడంలోనూ చేశాడు. జానపద గేయాలకు బదులు హరిదాసుల పదాలను ఇచ్చాడు. తెలుగులో బోయల్ లాగా కన్నడ జానపద గేయాల సేకరణ ఫ్లీట్‌తో ప్రారంభమయింది. ఈయన ఇండియన్ ఆంటిక్వరీలో ఎనిమిది కథాగేయాలను ప్రచురించాడు.

జానపద సాహిత్యాన్ని గూర్చిన ఆసక్తిని పెంపొందించే విధంగా సుదీర్ఘ వ్యాసాన్ని శ్రీమాస్తి వెంకటేశయ్యంగార్ 1919లో ప్రచురించారు. ఇందులో కొన్ని కథాగేయాలను గురించి, ఎల్లమ్మ పాటలు, కోలాటం పాటలను గురించి వ్రాశారు. శ్రీమాస్తి, శ్రీ బేంద్రె ఊరూరికి వెళ్ళి స్త్రీల పాటల వైశిష్ట్యాన్ని చాటి చెప్పారు. 'గరతియ హాడు' (ఆడబడుచుల పాటలు) అనే గేయ సంకలనం 1931లో ప్రచురింపబడింది. ఇది ఈ నాటికీ అత్యంత విశిష్ట సంకలనంగా కీర్తింపబడుతున్నది. చెన్నమల్లప్ప, రేవప్ప, లింగప్పగార్లు సేకరించిన త్రిపదులున్న ఈ గేయ సంకలనానికి మాస్తిగారు, బేంద్రెగారు, బి.ఎం.శ్రీకంఠయ్యగారు ముందుమాటలు వ్రాశారు.

1933లో 'జీవన సంగీత' అనే పేరుతో సింపి లింగణ్ణగారు కొన్ని కథాగేయాలను ప్రచురించారు. 1933లోనే వి.వి.తొర్కొగారి 'హళ్ళియ హాడు' వెలువడింది. ఆ తర్వాత 'గరతియ హాడు' ను ప్రచురించిన మిత్రులలో ఒకరైన రేవప్పగారు 'మల్లిగెదండె' అనే సంపుటిని ప్రచురించారు. ఇది కూడా చాలా ప్రసిద్ధిని పొందింది. దీనిలో స్తుతిపదాలు, వలపు పాటలు, కథా గేయాలు, పెండ్లి పాటలు, శోభన గీతాలు, హాస్య గేయాలు మొదలైనవి ఉన్నాయి. బి.ఎస్.రంగస్వామిగారు ఒక విశిష్ట రీతిలో జానపద విజ్ఞాన సేకరణ సాగించారు. ఆయన ఎక్కడికీ వెళ్ళకుండానే తమ పల్లెనే ప్రధాన క్షేత్రంగా చేసుకొని అక్కడి పాటలు, సామెతలు, ఆచారాలు, పొడుపు కథలు మొదలైనవి సేకరించి ప్రచురించారు.

20వ శతాబ్దం పూర్వార్ధంలో పేర్కొనదగిన కృషి చేసిన వారిలో శ్రీ గొరూరు రామస్వామి అయ్యంగార్ ఒకరు. 1943లో ఆయన 'హళ్ళియ బాళు' (పల్లె జీవితం) అనే గ్రంథాన్ని ప్రచురించారు. 1943లోనే మతిఘట్ట కృష్ణమూర్తిగారు ప్రచురించిన 'నాడపదగళు' (పల్లెపదాలు) గేయ సంకలనాలలో విశిష్టమైంది.

20వ శతాబ్దం ఉత్తరార్ధంలో జానపద గేయాల సేకరణ చురుగ్గా సాగింది. ఉత్తర కర్నాటకంలో బి.ఎస్.గద్దగిమఠగారు చాలా కృషి చేశారు. 'కంబియ హాడుగళు', 'లోకగీతెగళు', 'నాల్కు నాడపదగళు', 'జనతాగీతెగళు' మొదలైన గేయ





సంపుటాలను ప్రచురించారు. అంతే కాక 'కన్నడ జానపద గీతగళు' అనే పరిశోధన వ్యాసం వ్రాసి పిహెచ్.డి.పట్టం పొందారు. మతిఘట్ట కృష్ణమూర్తిగారు ఈ క్షేత్రంలో చాలా కృషి చేశారు. కరీంఖాన్, క.రా.కృష్ణస్వామి మొదలైనవారు జానపద గేయ సంకలనాలు పెక్కింటిని ప్రచురించారు.

కన్నడంలో జానపద విజ్ఞానాన్ని శాస్త్రీయంగా అధ్యయనం చేయడానికి డా.హా.మా.నాయక కృషి మెచ్చదగింది. ఆయన వ్రాసిన 'జానపద స్వరూప' అనేకులకు ప్రేరణ ఇచ్చింది. ఇటీవల కన్నడ జానపద విజ్ఞాన గ్రంథ సూచిని ప్రచురించారు డా.హా.మా.నాయక. దాన్ని బట్టి కన్నడంలో 1974 నవంబరు వరకు 532 జానపద విజ్ఞాన గ్రంథాలు ప్రచురితమయ్యాయి. మైసూరు విశ్వవిద్యాలయంలో ఉపకులపతిగా, ఆచార్యులుగా పని చేసిన ప్రొ॥ డి.జవరేగౌడగారూ ఈ క్షేత్రంలో గణనీయమైన కృషి చేశారు. మైసూరు విశ్వవిద్యాలయంలో జానపద విజ్ఞానాచార్యులైన డా.జీ.శం. పరమశివయ్య అనేక జానపద గేయ సంకలనాలను ప్రచురించారు. జానపద సాహిత్య ప్రక్రియలను గూర్చి పరిశోధించి పిహెచ్.డి.పట్టం పొందారు. డా.సి.పి.కృష్ణకుమార్, శ్రీ రామేగౌడ, డా.శివరామకారంత, శ్రీ డి.లింగయ్య మొదలైనవారు ఈ సందర్భంలో పేర్కొనదగిన మరికొందరు. జానపద విజ్ఞానానికి సంబంధించిన అసంఖ్యాక వస్తువులను సేకరించినవారు, ప్రఖ్యాత చిత్రకారుడు, మైసూరు విశ్వవిద్యాలయంలోని జానపద వస్తుప్రదర్శనశాలాధికారి అయిన శ్రీ పి.ఆర్.తిప్పేస్వామి అభినందనీయులు.

కన్నడ దేశంలో జానపద విజ్ఞానంమీద ఆసక్తి దినదినానికీ హెచ్చుతున్నది. తరీకెరె, మంగళూరు, నాగమంగల అనే చోట్ల మూడు సమ్మేళనాలు జరిగాయి. మైసూరు విశ్వవిద్యాలయంవారు ఈ రంగానికి చేస్తున్న సేవ ప్రశంసింపదగింది. అక్కడ ఎం.ఎ.జానపద విజ్ఞానం ఒక అధ్యయన విషయంగా ఉంది. భారతదేశంలో ఇంకెక్కడా లేనంత గొప్ప జానపద వస్తుప్రదర్శనశాల ఉంది. దీని కంతా సారథులు డా.హా.మా.నాయక, డా.జీ.శం.పరమశివయ్య, శ్రీ పి.ఆర్.తిప్పేస్వామి. బెంగళూరు విశ్వవిద్యాలయం, కర్నాటక విశ్వవిద్యాలయం కూడా తమ ప్రచురణల ద్వారా, బోధన విషయాలద్వారా జానపద విజ్ఞానానికి ఉత్తమమైన సేవ చేస్తున్నవి.

### జానపద గేయం - శాస్త్రీయ అధ్యయనం

జానపద విజ్ఞానం కొన్నివేల సంవత్సరాలనుంచి ప్రచలితమై ఉన్నా, దాన్ని గురించిన అధ్యయనం మాత్రం సుమారు ఒక శతాబ్దం ముందు ప్రారంభమయింది.

థాంస్ జానపద విజ్ఞానం (folklore) అనే పదాన్ని రూపొందించిన తర్వాత (1846), వివిధ విజ్ఞాన విభాగాలలో కృషి చేస్తుండిన విద్వాంసుల దృష్టి ఈ సాంప్రదాయిక విజ్ఞానం మీద పడింది. జానపద విజ్ఞానానికి సన్నిహితంగా ఉండే సహాయ విజ్ఞానాలనేకం ఉన్నాయి. జానపద గేయాల శాస్త్రీయ అధ్యయనానికి మానవ శాస్త్రం, భాషాశాస్త్రం, సాహిత్యం, చరిత్ర, ప్రాక్తన శాస్త్రం మొదలైనవి అనేక విధాలుగా ఉపకరిస్తాయి.

ఒక గేయాన్ని చూడగానే ఒక్కొక్క శాస్త్రంలో నిష్ణాతులైనవారు ఆ దృష్టితో దాన్ని అధ్యయనం చేయడం సహజం. సాహిత్యవేత్త గేయంలో సాహిత్య గుణం ఎంత వరకు ఉంది అని చూస్తాడు; భాషా శాస్త్రవేత్త గేయాల భాషను వివిధ కోణాలనుంచి నిశితంగా పరిశీలిస్తాడు; ప్రాక్తన శాస్త్రవేత్త ప్రాచీన కాలానికి చెందిన అవశేషాలేమైనా సూచితమై ఉన్నాయేమోనని శోధిస్తాడు.

ఇటీవలి కాలంలో నిర్మాణవాదం (structuralism) లాంటివి జానపద విజ్ఞాన అధ్యయనంలో కొత్తదారుల్ని చూపాయి. గేయాలను అధ్యయనం చేయడానికి వాటిని శాస్త్రీయ విధానాలను అనుసరించి వర్గీకరించడం అవసరం. స్థూల వర్గీకరణ చేయడానికి అనుసరించాల్సిన కొన్ని పద్ధతులను ఇంతకు ముందే సూచించడం జరిగింది. జానపద గేయాలను అధ్యయన దృష్టితో కొన్ని అంశాలు (units) గా విడగొట్టడానికి నిర్మాణవాదం ఉపకరిస్తుంది. కేవలం ఒక భాషకు సంబంధించిన గేయాలకు కాక, సార్వత్రికంగా అన్ని గేయాలకూ అన్వయించే విధంగా గేయాలలోని అంశాలను నిర్ణయించడం కష్టంతో కూడుకున్న పని. ఇంతకు ముందు అటువంటి ప్రయత్నాలు కథాంశం ఉండే సాహిత్య ప్రక్రియల విషయంలో చేయడం జరిగింది. ఉదాహరణకు జానపద కథలలో ప్రాప్ (V.Propp) కొన్ని క్రియలు (functions) ఉంటాయని, అవి అన్నీగాని, వాటిలో కొన్ని గాని, ప్రపంచంలోని ఏ కథలోనైనా సార్వత్రికంగా కనిపిస్తాయని చెప్పారు. అయితే ఈ విధంగా గేయాలలో అంశాలను నిర్ణయించలేము. ఎందుకంటే కథలు, కథాగేయాలలోనూ గేయాలలో కథాంశంలేదు. కథాంశంలేని గేయాలలో అంశాల (units) ను నిర్ణయించడానికి, తద్వారా జానపద గేయాల అధ్యయనాన్ని నిర్మాణవాద పద్ధతిలో చేయడానికి ప్రస్తుత రచయిత ప్రయత్నం చేయడం జరిగింది.[22]

జానపద గేయాలలో మానవునిలో సహజంగా కనిపించే ప్రవృత్తుల అభివ్యక్తి మనకు కనిపిస్తుంది. సమస్త మానవ జాతిలోను కనిపించే కొన్ని సహజ ప్రవృత్తులు





(motives) ఉన్నాయి. ప్రవృత్తులు మూడు విధాలు. అవి ప్రాథమిక ప్రవృత్తులు (basic motives), సామాజిక ప్రవృత్తులు (social motives), భావావేశాలు (emotions) అన్నవి. గేయాల నిర్మాణాన్ని గమనిస్తే మానవుని సహజ ప్రవృత్తులకు సంబంధించిన అంశాలు కనిపిస్తాయి. ఆకలి, దాహం, బాధను తప్పించుకోడం మొదలైన ప్రాథమిక ప్రవృత్తులు, నమ్మకాలు, దేశభక్తి మొదలైన సామాజిక ప్రవృత్తులు, భయం, కోపం, ప్రేమ, ద్వేషం మొదలైన భావావేశాలు జానపద గేయంలో అంశంగా కనిపిస్తే దాన్ని భావాంశం (psycheme) అని పిలవవచ్చు. అధ్యయనంకోసం మనం తీసుకొన్న గేయంలో ప్రధానంగా ప్రేమ ఉండి అప్రధానంగా హాస్యం ఉంటే ప్రేమ ప్రాథమిక భావాంశమని, హాస్యం అప్రధాన భావాంశమని చెప్పవచ్చు. బాగ్స్ తన వర్గీకరణలో వివిధ విషయాలను కొన్ని గుర్తులతో సూచించినట్లే ప్రాథమిక భావాంశాలను ఇంగ్లీషులోని పెద్ద అక్షరాలతోను, అప్రధాన భావాంశాలను చిన్న అక్షరాలతోను సూచించవచ్చు. సామాన్యంగా గేయాలలో కనిపించే భావాంశాలివి:

| | | | |
|---|---|---|---|
| A-Anxiety | (కలవరపాటు) | H-Hate | (ద్వేషం) |
| A-Anger | (కోపం) | H-Humour | (హాస్యం) |
| B-Belief system | (నమ్మకాలు) | J-Joy | (సంతోషం) |
| C-Curiosity | (ఉత్సుకత) | L-Love | (ప్రేమ) |
| D-Disgust | (విసుగు) | M-Maternal behaviour | (తల్లిగుణం) |
| E-Escape from pain(బాధనుంచి తప్పించుకోడం) | | | |
| F-Fear | (భయం) | P-Patriotism | (దేశభక్తి) |
| H-Hunger | (ఆకలి) | T-Thirst | (దాహం) |

కొన్ని గేయాలలో ఒక్క భావాంశం ఉంటుంది; మరికొన్నిట్లో రెండు భావాంశాలుంటాయి. ఉదాహరణకు:

"Give me pregnancy, o Mbali
Give me pregnancy that I may bear a child"[23]

(నన్ను గర్భవతిని చెయ్యి, నా కడుపున ఓ కాయ కాచేట్లు చెయ్యి). అనే పాటలో తల్లి గుణం, నమ్మకం అనే రెండు భావాంశాలూ ప్రధానమే. అందువల్ల ఈ పాటను 'ఎంబి' అని సూచించవచ్చు. ఇట్లే దశాంశ విధానాన్ని అనుసరించి గేయాలలోని వివిధాంశాలకు ప్రాతినిధ్యం ఇస్తూ ప్రపంచంలోని ఏ గేయాన్నయినా మనం

నిర్మాణాత్మకంగా పరిశీలించవచ్చు. ఒక అప్పగింత పాటనే ఉదాహరణగా తీసుకొని దీన్ని మరికొంత వివరించవచ్చు. ఏదైనా పాటలో తల్లి తన కలవర పాటను, కూతురు తన భయాన్ని వ్యక్తం చేశారనుకుంటే ఆ పాటను ఈ క్రింది విధంగా భావాంశాలతో సూచించవచ్చు.

ఇందులో A కలవరపాటును సూచిస్తుంది. A1 తల్లి కలవరపాటును A 1. 3' కూతుర్ని అత్తవారింటికి పంపించేటప్పుడు తల్లికలవర పాటును సూచిస్తాయి. అట్లే ఈ గీతంలోని మరొక భావాంశం కూతురు అత్తవారింటికి వెళ్ళేటప్పుడు చూపిన భయాన్ని సూచిస్తుంది. ఈ విధంగా ఏ గేయాన్నయినా స్పష్టంగా కొన్ని గుర్తులతో సూచించడంవల్ల వివిధ భాషలలోని గేయాలను పోల్చి చూపడానికి వీలవుతుంది.

జానపద విజ్ఞానంలోని వివిధ విషయాలను అధ్యయనం చేయడానికి కంప్యూటర్ వంటి ఆధునిక పరికరాలను ఉపయోగించడం కూడా జరుగుతున్నది. ముఖ్యంగా పురాణాలు (myths) కథలు (tales) మొదలైన వాటిని అంశాలుగా విడగొట్టి సహజ భాషను విశ్లేషణాత్మక భాష (analytic language) గా మార్చి కంప్యూటర్ సహాయంతో వాటి నిర్మాణాన్ని అధ్యయనం చేస్తున్నారు. అటువంటి అధ్యయనం గీతాల విషయంలో కూడా చేయవచ్చు.

జానపద గేయాల అధ్యయనానికి సహాయం చేసే విషయాలలో సాహిత్యం ఒకటి. జానపద విజ్ఞానంలోని వివిధ విభాగాలలో గేయం సాహిత్య విభాగానికి చెందుతుంది. సాహిత్య విమర్శలో మనం అనుసరించే పద్ధతులను గేయాన్ని అధ్యయనం చేయడానికి కూడా ఉపయోగించవచ్చు. అయితే జానపద గేయం ప్రాథమిక చిత్తవృత్తికి సంబంధించిందనీ, శిష్ట సాహిత్యమంత నియమబద్ధంకాదని గుర్తుంచుకోవలసి ఉంటుంది.

గేయం అధ్యయనం చేసేటప్పుడు మానవశాస్త్రం సహాయం కూడా అవసరమే. జానపద విజ్ఞానం సాంస్కృతిక మానవ శాస్త్రంలో ఒక భాగం. మానవశాస్త్రం మనిషి, అతను చేసిన అన్ని పనులను గురించి చెప్తుంది. మనిషి తన అభివృద్ధి కోసం చేసిన పనులన్నీ కలిసి మానవ సంస్కృతి అవుతుంది. గేయం, కథాగేయం, నమ్మకాలు, కళలు మొదలైనవన్నీ మానవసంస్కృతిలో భాగాలే. అందువల్ల మానవశాస్త్రవేత్తలు అనుసరించే అనేక సిద్ధాంతాలు జానపద విజ్ఞానానికి కూడా అన్వయిస్తాయి.

జానపద గేయాన్ని అధ్యయనం చేయడంలో చరిత్ర కూడా కొంత వరకు ఉపకరిస్తుంది. నిజానికి గేయాల కన్నిటికీ సహజమైన చరిత్ర ఉన్నా, గేయాల





అధ్యయనానికి చారిత్రక ఆధారాలు లేవు. అయినా కొన్ని సార్లు గేయాల భాషను పరిశీలించడంవల్ల, గేయాలలోని సామాజిక, సాంస్కృతిక విషయాల పరిశీలనవల్ల వాటి చరిత్రను కొంతవరకు ఊహించడానికి వీలవుతుంది.

గేయాల అధ్యయనానికి మనస్తత్వశాస్త్రం చాలా ఉపకరిస్తుంది. మనోవిశ్లేషణ (psychoanalysis) సిద్ధాంతం వికాసం చెందడానికి ఫ్రాయిడ్ రచనలు చాలా దోహదం చేశాయి. గేయాలను అధ్యయనం చేసేటప్పుడు అసామాన్య మనస్తత్వ శాస్త్ర (abnormal psychology) వంటివి ఉపకరిస్తాయి.

జానపద గేయం వంటి జానపద ప్రక్రియల అధ్యయనం అంటే మానవ సంస్కృతిలో ఒక ముఖ్యమైన ఘట్టాన్ని పరిశీలించడమే అవుతుంది. అందువల్ల మానవ జీవితాన్ని శాస్త్రీయంగా విశ్లేషించడానికి ఉపయోగించే ఏ విషయమైనా గేయాదుల్ని పరిశీలించడానికి ఉపకరిస్తుంది. వైద్యశాస్త్రం, రసాయనశాస్త్రం, భౌతికశాస్త్రం, జంతుశాస్త్రం, వృక్షశాస్త్రం మొదలైనవి, వాటికి సంబంధించిన సిద్ధాంతాలు గేయాన్ని అధ్యయనం చెయ్యడానికి ఉపయోగిస్తాయి.

## జానపద గేయం – ప్రయోజనం, వైశిష్ట్యం

జానపద విజ్ఞానమంటే ఏదో ఉబుసుపోకకు ఉపయోగించేదని, జానపద గేయాలంటే బిచ్చగాళ్ళు పాడుకునే పనికిమాలిన పదాలని ఈసడింపుగా మాట్లాడే వాళ్ళున్నారు. కాని ఆ అభిప్రాయం సత్యదూరమైంది. మానవశాస్త్రజ్ఞులు జానపద విజ్ఞాన ప్రయోజనాన్ని చక్కగా గుర్తెరిగి దానికి ఎక్కువ ప్రాధాన్యమిచ్చి అధ్యయనం చేస్తారు. జానపదులకు బుద్ధి గరపడంలో ఈ విజ్ఞానం పాత్ర మహత్తరమైంది. ముఖ్యంగా జానపద విజ్ఞానం సామాన్యంగా సమాజంలో నిషిద్ధమైన వాటిని కొన్ని పరిస్థితులలో అంగీకరించేట్లు చేస్తుంది. ఉదాహరణకు సామాన్య సంభాషణలో నిషిద్ధమైన అశ్లీల పదాలకు, అశ్లీల భావాలకు జానపద గేయాలలో స్థానం ఉంది. అలాగే మనం నిత్య జీవితంలో చేయగూడని పనులను ధార్మిక ఆచరణల సందర్భంలో, పండుగల సందర్భంలో చేయవచ్చు. అంటే జానపద విజ్ఞానం సాంస్కృతికమైన కొన్ని పనులను చేయడానికి అనుమతినిస్తుంది. కొన్నిటిని నిషేధిస్తుంది. మొత్తంమీద సాంస్కృతిక వాహకంగా జానపద విజ్ఞానం పనిచేస్తుంది. జానపద గేయం వంటి విషయాలద్వారా ఒక సమాజం సంస్కృతి తరతరాలకు సంక్రమిస్తుంది. గేయం, సామెత, కథలు, పురాణాలు మొదలైనవి సాంప్రదాయికమైన నమ్మకాలను, ఆచారాలను,

అలవాట్లను కలకాలం నిలబెడ్తాయి.

జానపద గేయం మొదలైన విషయాలు సామాన్య జనుల విద్యావిధానంలో ప్రముఖమైన పాత్రను వహిస్తాయి. అక్షరాస్యత అన్నది మనం బడిలో చదువుకుంటేనే వస్తుందనుకోడం పొరపాటు. సాంకేతికంగా మనం జానపదులను నిరక్షరాస్యులని చెప్తున్నా నిజానికి వారు బడిలో చదివిన వారికంటే జీవితంలో లోతుపాతు లెక్కువగా తెలిసినవారు. జీవితమే వారి పాఠశాల, జానపద విజ్ఞానం వారికి విద్యను నేర్పుతుంది. మనుషులుగా తీర్చిదిద్దుతుంది.

జానపద గేయం మొదలైన సాహిత్య ప్రక్రియలు సంతోషాన్నిస్తాయి. ఇది కూడా ఒక ప్రయోజనమే. పనిలో, ఆచరణల్లో, పెళ్ళిళ్ళలో, మనసుకు తృప్తినిచ్చే సాధనాలు పాటలు, పాటల పుట్టుక, నిర్వచనం, లక్షణాలు మొదలైన వాటితో జానపదులకు ఏమాత్రం పనిలేదు. వారికి కావలసింది వాటి ప్రయోజనాన్ని పొందడమే.

జానపద గేయాల వైశిష్ట్యాన్ని పరిశీలించేటప్పుడు వాటిని శిష్ట సాహిత్యంలో పోల్చి చూడడంలో సందేహం తప్పులేదు. జానపద గేయాలు ఆశు కవితలయితే కావచ్చు. వాటిని వ్రాసినవారికి ఛందశ్శాస్త్రం, వ్యాకరణం, ఇతర శాస్త్రాలు తెలియక పోవచ్చు. కాని వారు కావ్యప్రయోగ పరిణత మతులు, జానపద కవులకు ప్రతిభ సమృద్ధిగా ఉంది. శబ్దాల ఉపయోగం, భాషకుండే అంతస్సత్త్వం, పాటకు అత్యంత సహజంగా అమరేగతి ఈ కవులకు తెలుసు. జానపద కవికి జీవితం నుంచి నేర్చుకున్న అనుభవం ఉంది, దానిని అభివ్యక్తీకరించే శక్తి ఉంది.

జానపద గేయాలను సృష్టించినవారు జీవితంలో సుఖదుఃఖాలను అనుభవించినవారు. ఆనందపుటంచుల్నీ, దుఃఖపులోతుల్నీ చూచినవారు. సంసార సుఖమే సర్వస్వమని నమ్మక పోయినా సంసారంలోని సుఖాన్ని దుఃఖాన్ని, గృహజీవనాన్ని తమ కవితల్లో ప్రతిబింబింప చేశారు. జానపద గేయాలు మన జాతీయ సంపద అని చెప్పవచ్చు. వీటికి తెలుగనీ కన్నడమనీ భేదభావంలేదు. ప్రపంచంలో ఉండే ప్రతి మానవుడిలో అణగి ఉండే హృదయాన్ని, ఆ హృదయం పొందే సుఖాలను, దుఃఖాలను, అనుభవాలను అన్నిటినీ మనం అనుభవించేట్లు చేస్తాయి జానపద గేయాలు.





**టిప్పణి**

1.Modern Review, Vol.56, p.36

2."Ballads are a variety of folk song; but they are sufficiently a group in them selves to be classed separately"-Encyclopaedia Britannica, Vol.3, p.20

3. నాయని కృష్ణకుమారి, సారస్వత వ్యాసములు, ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడెమి, సం. 2, పు. 218

4. కావేరియింద మా గో<br>
దావరి వరమిర్ద నాడదా కన్నడదొళ్<br>
భావిసిద జనపదం వసు<br>
ధావళయ విలీన విశద విషయ విశేషం (1-36)

5."When Thoms first coined the word, he defined it as the lore of the folk. By the latter term he meant the unlettered peasantry"-Encyclopaedia Britannica, Vol.9, p.519

6."There are still some folklorists who mistakenly identify the folk with peasant society or rural groups. If one were to accept this narrow conception of folk, then by definition one would have to conclude that city dwellers were not folk and hence city dwellers could have no folklore"-The study of Folklore, p.2

7."The term folk can refer to any group of people what so ever who share atleast one common factor. It does not matter what the linking factor is-it could be a common occupation, language, or religion-but what is important is that a group formed for whatever reason will have some traditions which it calls its own"-The study of Folklore, p.2

8."Those materials in culture that circulate traditionally among members of any group, in different versions, whether in the oral form or by means of customary example"- Jan Harold Brunvand, The Study of American Folklore, New York, 1968. As quoted by P.K.Subramanian, An Introduction to the study of Indian Folk Lore, 1972, p.5

9.Richard M.Dorson (Ed.), Folklore and Folklife,Introduction, p.2-5

10. సి.పి.కె., జనపద గీతె (కన్నడం)లో ఉదహరించింది, పు. 11

11.“We find that unlettered and untravelled people have both the desire and the power to express themselves musically”-Encyclopaedia Britannica, Vol.9,p.447

12.“It is indeed tempting to surmise that in the Late Palaeolithic Age (30,000-15,000 B.C.) when men delighted in painting and carving and modelling, they delighted also in the melodious arrangement of word”-C.M.Bowra, Primitive song, p.13

13........“the refrain is incontestably sprung from singing of the people at dance, play, work, going back to that choral repetition which seems to have been the protoplasm of poetry”, Francis B.Gummere, The Popular Ballad, 1959, p.73-74

14. నేదునూరి గంగాధరం, జానపద గేయ వాఙ్మయ వ్యాసావళి, పు. 3-4

15.George Thomson, Marxism and Poetry, p.4

16.“A folksong is neither new nor old because it is continually taking on new life. It is individual flowning on a common stem”, Encyclopaedia Britannica, Vol.a, p.448

17. శ్రీపాదగోపాలకృష్ణమూర్తి, ఆంధ్ర విజ్ఞాన సర్వస్వము, 4వ సం.పు. 302

18. నేదునూరి గంగాధరం, జానపద గేయ వాఙ్మయ వ్యాసావళి, పు. 3

19.Alan Dundes, The Study of Folklore, p.53

20.“If a myth does come from ritual, where then does the ritual come from? Ritualists delight in tracing folkloristic items back to ritual, but they usually have little if anything to say about the origin of the ritual”, Ibid., p.84

21.Introduction to the study of literature, p.97

22.R.V.S.Sundaram, Structural Study of Folksong” (Paper presented at the VI All India Conference of Dravidian Linguistics Association, Waltair), June,1976

23.C.M.Bowra, Primitive Song, 1963, p.40





# 2. పనిపాటలు

వరినాటేటప్పుడు, కలుపు తీసేటప్పుడు, మోట తోలేటప్పుడు, దున్నేటప్పుడు, కోసేటప్పుడు, కుప్ప కొట్టేటప్పుడు, ధాన్యం దంచేటప్పుడు, బరువులు మోసేటప్పుడు, రాళ్ళు కొట్టేటప్పుడు, పడవనడిపేటప్పుడు పడేశ్రమను తగ్గించుకోడంకోసం జానపదులు పాటలు పాడుకుంటారు. వీటిని ఇంగ్లీషులో work songs అనీ, labour songs అనీ songs of action అనీ పిలుస్తుంటారు. వీటిని తెలుగులో కొందరు శ్రామిక గేయాలన్నారు, కొందరు కర్షక - కార్మిక గీతాలన్నారు, పాటకజన సారస్వతమన్నారు. పని చేసేటప్పుడు పాడే పాటలు కాబట్టి పనిపాటలంటే మేలు. కన్నడిగులు కూడా పనిపాటలు అనే అర్థం వచ్చే 'కెలసద హాడుగళు' అనే పదాన్నే ఎక్కువగా వాడుతారు.

పనికి-పాటకు చాలా దగ్గరి సంబంధం ఉంది. పాట లయబద్ధమైన కదలికల కనుగుణంగా, ఆవేశాలకు, అనుభూతులకు అనుగుణంగా అవతరించడం సహజం.[1] శారీరక శ్రమకు, గేయానికి చాలామంది శాస్త్రవేత్తలు సంబంధాన్ని ఊహించారు. జానపద గేయ ఉత్పత్తికి స్నాయుమండలం, నాడీమండలం, ఊపిరితిత్తులు, స్వరపేటిక మొదలైనవి దోహదం చేస్తాయి.

శరీరం తన పరిసరాలకు స్పందించేట్లు చేసేది నాడీమండలం. వేట మొదలైన పనులను చేసేటప్పుడు మనిషికి భావావేశం కల్గుతుంది. నాడీమండలంలో అన్ని భాగాలకంటె మనిషి మెదడు చాలా అభివృద్ధి చెందింది. మనిషి కంఠంనుంచి లయాన్వితమైన ధ్వనులు రావడానికి కావాల్సిన ఆవేశాన్ని, భావాలను మెదడు ఇస్తున్నది. ఈ ధ్వనులు స్వరపేటిక సహాయంతో వెలువడుతాయి. మానవుడి స్వరపేటిక బాగా అభివృద్ధి చెందిన స్థితిలో ఉంది. మనిషిలో కలిగే వివిధ విధాల కదలికలకు, కండరాల చలనానికి, ధ్వనుల ఉత్పత్తికి సంబంధముందని విజ్ఞానం చెప్తున్నది. నాలుక, తాలువు, దంతాలు, పెదవులు, దవడలు, కొండనాలుక, సప్తపథ మొదలైన వాటివల్ల స్వరసంయోజనం (modulation of voice) జరుగుతుంది.

పని చేసేటప్పుడు ఉచ్ఛ్వాసనిశ్వాసాలు ఎక్కువవుతాయి. గుండె కొట్టుకోడం ఎక్కువవుతుంది. ఊపిరితిత్తుల నుంచి గాలిపోయే మార్గానికి, స్వరపేటికకు సంబంధముంది. చలనం హెచ్చిన ఊపిరితిత్తులనుంచి గాలి స్వరపేటికగుండా బయటికి వచ్చి మనకు కొంత శ్రమ తగ్గేట్లు చేస్తుంది; కనీసం శ్రమ తగ్గినట్లు అనిపిస్తుంది. ఈ

విధంగా పని పాటలు మానసికంగాను, శారీరకంగాను శ్రమను తగ్గిస్తాయి. జానపదులు తమబాధను మరిచిపోయేట్లు చేస్తాయి. బాధనుంచి తప్పించుకోవాలనుకోడం మనిషికుండే ప్రాథమిక ప్రవృత్తులలో ఒకటి.

పనిపాటల్లో అనంతవైవిధ్యం ఉంది. అత్యంత ప్రాచీన కాలంనుంచి నేటివరకు నిలిచి ఉన్నవి పనిపాటలు. నేడు ఆధునిక పరికరాల అవసరం, ఉపయోగం హెచ్చి చాలావరకు పనిపాటలు మరుగున పడిపోయాయి. అయినా పల్లెటూళ్ళు, పాటకజనమూ ఉన్నంత కాలం మనదేశంలో పని పాటలు అక్కడక్కడా వినిపిస్తూనే ఉంటాయి.

పనిపాటలలో సమాన్యంగా ఏ వాద్యాలూ వినిపించవు. గొడ్డలి, అంపం, కొడవలి, రోకలి, తిరగలి, ఎద్దుల మువ్వలు, పడవ కర్రలు మొదలైనవే పని పాటలకు పక్క వాద్యాలు. పనిపాటలు లయ పనిననుసరించి ఉంటుంది. ఒక్క మనిషికి సాధ్యంకాని బరువైన పని చేయవలసి వస్తేపాట కూడా బరువుగా, నెమ్మదిగా సాగుతుంది. పని చకచకా సాగవలసి ఉంటే పాట కూడా అలాగే నడుస్తుంది లేక పరుగెడ్తుంది. పనిపాటలలో గీతనాయకుని (song leader) పాత్ర ముఖ్యమైంది. నాయకుడు పాట మొదలు పెట్టగా ఇతరులు అతన్ని అనుసరిస్తారు. ఒక్కొక్కసారి గీత నాయకుడొక్కడే పాటను పాడుతాడు. మిగిలినవాళ్ళందరూ ఊతపదాలను పలుకుతారు.

పనిపాటలుగా చెప్పదగినపాటలు అసంఖ్యాకంగా ఉన్నా పనిని గురించిన పాటలు తక్కువనే చెప్పాలి. పని–పాటలను ప్రత్యక్షంగా చూచి తెలుసుకుంటే సరేగాని, లేకుంటే ఏవి పనిపాటలు, ఏవి కావు అని నిర్ధరించడం చాలా కష్టం. పనిని గురించి పాటలో ఏమైనా సూచన ఉంటే దానిని ఏ సందర్భంలో పాడుతారో చెప్పవచ్చు. కాని మామూలుగా పనిచేసేటప్పుడు పాడే పాటలు ఏ వలపుపాటలో, హాస్యగీతాలో, భక్తిగీతాలో అయి ఉంటాయి.

పనిపాటల్లో మొదట చెప్పదగినవి వేటపాటలు (hunting songs). ఇవి జానపద గేయాలన్నిట్లోకి ప్రాచీనమైనవని, ప్రాథమికమైనవని చెప్పవచ్చు. ఎందుకంటే మనిషి చేపట్టిన మొదటి వృత్తి వేట. నేడు తెలుగు, కన్నడం మొదలైన నాగరికుల భాషలలో వేట పాటలు దొరకకున్నా నేటికీ వేటపాటలుండే ఆదిమజాతుల వారున్నారు. అత్యంత ప్రాచీన కాలం నాటి మానవుల సంస్కృతిని ఈ నాటికీ కలిగి ఉన్నవారు ప్రపంచంలో అక్కడక్కడా కనిపిస్తారు. వేటకు సంబంధించిన పాటలున్న వారిలో అండమానీయులు (Andamanese), ఎస్కిమోలు, పిగ్మీలు (Pigmies), వెడ్డాజాతివారు (Vedda People) మొదలైన వారిని చెప్పవచ్చు.





వేటాడేటప్పుడు పాటలు పాడడం చాలావరకు జరగదు. వేటకు ముందుగాని, వేట తర్వాతగాని పాటలు పాడడమే ఎక్కువ. పనిని గురించి మామూలుగా పని పాటలలో ఉండక పోవడం వేట పాటలకూ వర్తిస్తుంది. వేటవర్ణనగాని, వేటాడు జంతువులను వర్ణించడంగాని పాటలలో చాలా తక్కువగానే కన్పిస్తుంది. కింది పాట వంటివి కొన్ని కనిపించవచ్చు.

"I, the head of the village am here!

I have caught you!

Die, elephant!

Die, giraffe!

Die, kudu!

Die, eland!

Die, wildebeest!"[2]

తెలుగు కన్నడాలకు సంబంధించినంత వరకు పనిపాటల్లో ముఖ్యంగా పేర్కొనదగినవి కర్షకగేయాలు. మొత్తం మీద భారతదేశంలో ప్రధానంగా వినిపించేవి ఇవే. అతి ప్రాచీన మానవుని ప్రధాన వృత్తులు వేట, ఆహార సేకరణ కావడంవల్ల అతనికి వ్యవసాయంతో అవసరం లేకపోయింది. తర్వాత సంస్కృతి అభివృద్ధి అయ్యేకొద్దీ వ్యవసాయంకూడా నేర్చుకున్నాడు మానవుడు. పురుషుడు వేటాడుతుంటే స్త్రీ కందమూలాలను సేకరించేది. మొదట పోడు వ్యవసాయం, తర్వాత నాగలి సేద్యం అమలులోకి వచ్చాయి. సుమారు 10,000 ఏళ్ళ క్రితం నాగలి వ్యవసాయం ప్రారంభమయింది.

పొలం పాటలలో ఎన్నో రకాలున్నాయి. వానదేవుణ్ని ప్రార్థించడం మొదలుకొని, అన్ని పనులు ముగించుకొని ఇంటికి వెళ్ళేవరకు రైతు నోటి నిండా పాటలే. వీటిలో వాన పాటలు, ఏరువాక పాటలు, ఏతాము పాటలు నీరుకట్టే పాటలు, మడికిగట్లు కడ్తూ పాడే పాటలు, కలుపు పాటలు, కోత పాటలు, కుప్పనూర్పిడి పాటలు, గింజలు దులుపు పాటలు ఉన్నాయి.

కార్మిక గేయాలు ఈనాడు తక్కువగానే వినిపిస్తాయి. భారీ పరిశ్రమలలో పనిచేసే వాళ్ళే కాక చిన్నచిన్న మిల్లులు మొదలైన చోట్ల పని చేసే వాళ్ళు కూడా కార్మికులే. మనదేశంలో చాలాకాలం నుంచి కుటీర పరిశ్రమలే పెక్కుమందికి జీవనాధారంగా ఉన్నాయి. కుమ్మరి, కమ్మరి, వడ్రంగి, మేదరి మొదలైన వాళ్ళవి

కర్మాగారాలని పిలువకున్నా అవీ 'చిన్న సైజు' కర్మాగారాలనే చెప్పాలి. ఇవికాక ఇంకా వివిధ వృత్తులకు, కూలి వాళ్ళకు సంబంధించిన పాటలున్నాయి. కార్మికులకు సంబంధించిన గేయాలు భారీపరిశ్రమల శబ్దాలలో అణగారిపోయాయి. కూలీల అక్కడా ఇక్కడా పాడుకునే పాటలలో అమాయకులైన జానపదుల గుండెలలో దాచుకున్న నిశ్శబ్ద బాధామయ భావ పరంపరలు సున్నితంగా వెలువడుతాయి. ఇవి అన్ని భాషలలోనూ సమానమే. యూరప్‌లోని ఒక తోంగా బాలుడు రాళ్ళు పగులగొడ్తూ ఈక్రింది గీతం అలాపిస్తున్నాడు –

'They treat us badly, ehe'!

They are hard on us, ehe'!

They drink their coffe, ehe'!

And give us none,ehe'![3]

ఈ పాటలో పల్లె పిల్లవాని గుండెల చప్పుళ్ళు ప్రతిసహృదయునికి వినిపిస్తాయి.

పడవపాటలు కూడా ఒక విధంగా వృత్తి పదాలే. ఇవి జాలరులు, పడవమీద వస్తువుల్ని – మనుషుల్ని చేరవేసేవారు పాడేపాటలు. ఇవి అన్ని భాషల్లో ఉన్నాయి. మామూలుగా సాగర ప్రాంతాలలో వినిపిస్తాయి. పడవపాటల్లో సామాన్యంగా ఊతపదాలుంటాయి. లేక అనుపల్లవులుంటాయి. వీటిని ఉచ్చరిస్తూ పడవనడిపే వాళ్ళు శ్రమ తీర్చుకుంటారు. ఊపిరి తిత్తులలోని గాలి వెలుపలికి వెళ్ళి వాళ్ళ శ్రమ తగ్గినట్లనిపిస్తుంది. తండేలు పాటను అందిస్తూ ఉంటే కళాసులు ఊతపదాలను చేర్చి పలుకుతూ ఉంటారు. చాలా పాటల్లో శబ్దాలేగాని అర్థవంతమైన పదజాలం ఉండదు. ధ్వన్యనుకరణలే ఎక్కువ.

'ఏలెస్సా ఓలెస్సా ఏలెస్సా ఓలెస్సా

ఏలెస్సాబో ఓలెస్సా ఏలెస్సాబో ఓలెస్సా

ఏలా యేలా యేలా యేలా యేలా యేలా యేలా యేలా

ఏలా యేలా యేలా యేలా యేలా యేలా యేలా తండేలా

ఏలా ఏలా జోర్సెయ్ బార్సెయ్'

ఇవన్నీ భారం తీర్చుకునేందుకు చేసే ధ్వనులు.

ఇంకా ఇతర వృత్తులవారు పాడేపాటలున్నాయి. పశువులు కాచే పిల్లలు పాడే పాటల్లో అమాయకత్వం ప్రతిబింబిస్తూ ఉంటుంది. పనిపాటలు ముఖ్యంగా పనిలో కష్టాన్ని తగ్గించడానికి ఏర్పడినవి కాబట్టి అవి రూపొందిన రీతికూడా అలాగే





ఉంటుంది. ఈ గేయాలలో హేళనలు, ఓహోలు, ఆహాలు చాలా కనిపిస్తాయి.

కర్షకేతర గేయాలలో కార్మిక, వృత్తి గేయాల పోగా మిగిలినవి తిరగలి పాటలు, రోకటి పాటలు. ఇవి తెలుగులోను, కన్నడంలోను అత్యంత విశిష్టమైనవి. ఇవి గృహజీవనానికి సంబంధించిన పనిపాటలు. తిరగలి తిరగడానికి, రోకలి పోటుకు తగినట్లే ఉంటాయి ఈ పాటలు. తిరగలి, రోకలి చేసేధ్వనే ఈ పాటలకు ఉపశ్రుతిగా ఉంటుంది. తిరగలి పాటల్లోను, రోకటి పాటల్లోను స్త్రీ హృదయం ప్రత్యక్షమవుతుంది. ఆ హృదయం లోతుల్లోదాగి ఉండే ఆశలు, దుఃఖాలు, సంతోషాలు, మమతలు–ఒక్కటేమిటి మగువ విశ్వరూపం ఈ చిన్న పాటల్లో కనిపిస్తుంది. ఈ విధంగా పని పాటలు జానపదుల జీవితంలోని వివిధ ముఖాలను వర్ణరంజితంగా ప్రదర్శిస్తాయి.

## తెలుగు

తెలుగు జానపద గేయాలలో పనిపాటలదే సంఖ్యలో అగ్రస్థానం. ఆంధ్రదేశం వ్యవసాయానికి పేరుగన్నది. తెలుగు నాట ఏ మారుమూల ప్రదేశానికి వెళ్ళినా పొలం పాటలు దర్శనమిస్తాయి. వాన దేవుణ్ని పంట పొలాలకు నీళ్ళు ఇమ్మని ప్రార్థించే పాటలనుంచి, ధాన్యలక్ష్మిని ఎద్దుల మువ్వల సవ్వడితో ఇంటికి తరలించే వరకు తెలుగు నాట తేటతియ్యని పాటలున్నాయి.

రైతుకు బంగారు పంటలు పండాలంటే కావలసింది నీరు. వేదాలలో కూడా వరుణ దేవుణ్ని ప్రార్థించే మంత్రాలున్నాయి. మేఘదేవత పర్జన్యుడు. ఇతణ్ని గూర్చినవి ఋగ్వేదంలో మూడు సూక్తాలున్నాయి. పర్జన్యుని రథం నీటిబండి.

"ప్రవతావాన్తి పతయన్తి విద్యుత

ఉదోష ధీర్జిహతే పిన్వతే స్వః

ఇరా విశ్వస్మై భువనాయ జాయతే

యత్పర్జన్యః పృథివీం రేత సావతి"

జానపదులు గూడా వానదేవుణ్ని ఇలా ప్రార్థిస్తారు.

"వానల్లు కురవాలి వానదేముడా

వరిచేలు పండాలి వానదేముడా

నల్లాని మేఘాలు వానదేముడా

చల్లంగ కురవాలి వానదేముడా"[4]

అనో లేకుంటే–

"కారుమేఘమా రావే రావే
పువ్వుల మబ్బా దిగవే దిగవే
పింజమేఘమా ధూళి మేఘమా
చెమటను ఊడ్చి దిమ్మరింపవే"[5]

అని అమాయక హృదయాలతో ప్రార్థిస్తారు. వట్టి ప్రార్థనలకే వానదేవుడు కరుణించడు. అందువల్ల కర్షకులు కప్పలపెళ్ళి చేస్తారు. ఒక బోదురు కప్పను తీసుకొని వచ్చి పసుపురాచి, కుంకుమ బొట్టు పెట్టి, రోకలి మీద పసుపు గుడ్డతో కట్టి, ఇద్దరు పిల్లలు దాన్ని మోస్తుండగా కొందరు పేరంటాండ్రు పళ్లెంలో పసుపు, కుంకుమ. పువ్వులు పెట్టి పాటలు పాడుతారు. ఇంతా చేస్తే వాన వచ్చిందో రాలేదో తర్వాతి విషయం. రైతులు తమ పనిని ప్రారంభించడానికి ముందు 'ఏరువాక' పండుగను చేస్తారు. మొదట వినాయకుడికి పూజ చేసి, నాగలికి రావి ఆకులు కట్టి, కాడికి పసుపు పూసి, ఎద్దులను, నాగలిని పూజించి తొలిదుక్కి దున్నుతారు. ఆ సందర్భంలో–

ఏరువాకమ్మకు ఏమి కావాలి
ఎర్రఎర్రని పూలమాలకావాలి
ఎరుపు తెలుపుల మబ్బుటెండ కావాలి
ఏరువాకమ్మకు ఏమికావాలి.......

మొదలైన పాటలను పాడుతారు.

ఒక వేళ వానదేవుడు కరుణించకపోతే వ్యవసాయదారులు వాళ్ళ అవస్థలు వాళ్ళు పడాల్సి ఉంటుంది. బావిలో ఉన్న కాస్తోకూస్తో నీళ్ళు ఏతాం సాయంతో తోడుకోవాలి. నీరు కట్టుకోవాలి, ఏతాలు తొక్కుతూ పాటలు పాడడం ఈ నాటిది కాదు. రాయలు తన కాలంలో జానపదులు ఏతం పాటలు పాడడం విని ఆ మాధుర్యం అనుభవించాడు (ఆముక్త మాల్యద 2–55). ఏతాముతో నీరుతోడి ఎన్నో పాట్లుపడిన రైతు ఏతాం తొక్కేటప్పుడు తన పాడు జీవితం గుర్తు వచ్చి ఇలా పాడుకుంటాడు.

ఏటికేతం బెట్టి యెయిపుట్లు పండించి
ఎన్నడూ మెతుకెరగనన్నా
నేను గంజిలో మెతుకెరగనన్నా.

కపిలె పాటలకు రాయలసీమ పెట్టింది పేరు. ఆ ప్రాంతంలో కపిల బావులెక్కువ. సర్కారు ప్రాంతలోలాగా ఒకే కాడితో కాక రాయలసీమలో బావులలో





మూడు నాలుగు కాండ్లు ఉంటాయి. కాబట్టి ఇద్దరు కాడికాండ్ల అవసరం ఉంది, పాటపాడే అవకాశమూ ఉంది. రెండురెండు చరణాలలో సాగే కపిల పాటలలో అనంత వైవిధ్యం ఉంది, అల్పాక్షరాలలో అనల్పార్థాలు ఉన్నాయి. మచ్చుకు కొన్ని :

మానుమాను పువ్వుగాచె, మానికింద రాసి పోసె
ఇప్పిమాను పువ్వుగాసె, ఇప్పుడిరిగె నా మనసు.

ఈతమాను ఇల్లుకాదు, తాటిమాను తావుకాదు
తగిలినోడు మొగుడుకాదు, తగురు బంగరు కాదు.

బాయిగంగా బల్లారిగంగా, బారమంతా మోపినాము
బాయిలోని సిరిబాలగంగా, బాలలెద్దులు నీ బారమమ్మా.

ఏడుమట్ల యీ బాయికాడ, ఎద్దుల యీ బాదసూడు
బక్కయెద్దులు బారుకపిలి, బద్రమమ్మా బాయిగంగా.

తోటతోట బొమ్మన్నకీ, ఆవునెయ్యా అరటిపండు
మనబాయి బొమ్మన్నకీ, మల్లెపూల మెడదండ.

ఏదో విధంగా గంగమ్మ తల్లిని ప్రసన్నం చేసుకున్నరైతు నీరుకడ్తూ నీటి గలగలలతో తన పాటకు పక్కవాద్యాలు సమకూర్చుకుంటాడు.

చుట్టూ కొల్లారంటివో సంసారియా
సున్నపు మిద్దంటివో–ఇద్దరికీ బోడంటివో సంసారియా

ఈ విధంగా పాడుతూ నీరు కట్టిన తర్వాత మడికి గట్లుకడ్తూ పాటలు పాడుతారు. నీరు లభించిన సంతోషంలో అన్ని బాధలు మరిచిపోతాడు. ఉల్లాసంగా చందమామ పాటనాలాపిస్తాడు.

"రాతిరి రాతిరి వస్తావని చందమామయ్యో–మామ–చంద॥
రాతిగంధం తీసి ఉంచితి చందమామయ్యో–మామ–చంద॥
రాతిరి రాతిరి రాకపోతే మామ–చంద॥
రాతి గంధం రగిలి పోయే మామ–చంద॥ [6]

ఇక విత్తనాలు నాటాలి. రైతు చేసే ప్రతిపనికీ ఓ పాట ఉండాల్సిందే. అతని

పనుల్లో పాటలూ ఒక భాగమయ్యాయి. నాట్లునాటడం స్త్రీల పని. వ్యవసాయంలో స్త్రీ పురుషులకు పోటీలు లేవు; ద్వేషాలు లేవు. అందరూ కలిసి కట్టుగా పని చేస్తారు. నాట్లు, నాటేటప్పుడు తెలంగాణా ప్రాంతంలో–

"ఓతాని ననీ తానిననీ తానిననీ నా
తాని ననీ తానిననీ తానీ నానా॥
ఓ మన్ని దాయిలాల గొబ్బియాలాలో
ఓ మన్ని దాయిలాల గొబ్బియాలాలో
కుంట పూ వాసనకు రాయుడు రాంగా
కుసుమ పూ వాసనకు కుంటదారల్లె"[7]

అనే పాట పాడుతారు. రెక్కాడితేగాని డొక్కాడని ఈ అమాయక స్త్రీలు ఏ భూస్వాముల పొలంలోనో నడుం విరిగేట్లు పనిచేసి నాలుగు కానీలు చేతబట్టుకుపోతారు. వాళ్ళకూ ఆశలుంటాయి. ఏ మహారాజైనా వాళ్ళ పని చూసి ఇనాము లిస్తాడని వాళ్ళ పిచ్చినమ్మకం. నాట్లు నాటుతూ తమ ఆశలకొక రూపాన్నిచ్చుకుంటారు.

"ఊడుపుడవం దమ్మలారా మీ
రుడవండీ దమ్మ సేసిన నేలల్లో
ఊసులాడుకొని ఊరుకోబోకండీ
ఇడదీసి వరిమొక్క లెడమొదముగ పాతండీ
బాడనక బందనక పాటుపడినామంటే
మారాజు పని సూసి మనకీనామిస్తాడు
ఆవూరి మారాజు ఐదణాలిస్తేను
ఈ వూరి మారాజు మువ్పావలిస్తాడు"[8]

ఈ వరినాటు పాటలను హిందీలో రసియా గీతాలంటారు. వరినాటిం తర్వాత కలుపుతీసేటప్పటి పాట చరచరా సాగుతుంది. కలుపు తీసేవారు స్త్రీలు. ఇది ఎంతో నేర్పుతో చేయవలసిన పని. ఒకరిద్దరు కలుపుపాట పాడడం మిగిలిన వారు వంత పాడడం ఉంటుంది. కలుపు పాటల్లో కథా గేయాలూ ఉన్నాయి, లఘుగేయాలూ ఉన్నాయి.

వరి నాటడం, కలుపుతీయడం ముగిసిన తర్వాత మళ్ళీ కోతల వరకు పనులుండవు. కోతకాలం వచ్చేసరికి ఎక్కడలేని కోలాహలం వచ్చేస్తుంది. ఒక జానపద





స్త్రీని కోతకు రమ్మని ఎందరో ఎన్నో విధాలుగా అడిగి చూచారు. అయినా ఆమె ఒప్పుకోలేదు. కాని మామ చేనుకుమాత్రం కూలి లేకుండానే సిద్ధమయింది జానపదుల బాంధవ్యమట్టిది.

సోలెడు సోలెడు మచ్చాలిస్త సోనిపూల దండలిస్త
మనుమరాల జొన్న చేను కోయరావమ్మా॥– అంటే
అందుకు ఆమె అంగీకరించలేదు. కాని మామ :

కుంచెడు కుంచెడు మచ్చాలిస్త కుంకుమ పూల దండలిస్త
కోడలా మా జొన్నచేను కొయ్య రావమ్మో–అనగానే

కుంచెడు కుంచెడు ముచ్చాలొద్దు కుంకుమపూల దండలొద్దు
మామ నీ జొన్న చేను ఊకే కోస్తనో సై
అని ప్రీతిలో జవాబు చెప్పిందా యువతి

తెలుగులో పొలి పదాలన్నవి చాలా లభిస్తాయి. గింజల్ని దులిపి ధాన్యం రాశులుగా పోసి, రాశిచుట్టూ గీత గీస్తారు. దాన్ని పొలి అంటారు. నెల్లూరు జిల్లా ప్రాంతంలో 'ఈ యేడు బాగా పొలి అయింది' అంటారు. కళ్ళంలో ధాన్యాన్ని తూర్పార బట్టేటప్పుడు తొలి చేటను "పొలికలుగు" అంటారు. అప్పుడు 'పొలి కలుగు పోలో పొలి' అంటూ ఉంటారు. ఇలాంటప్పుడు లాభం రావటానికి పూజించే దేవుడే పొలిగాడవి అర్థం చెప్పుకోవచ్చు. అనంతపురం ప్రాంతాలలో కొలవడానికి ముందు పొలంలో ధాన్యరాశి చుట్టూ జిల్లేడు ఆకు చేత బట్టుకొని మూడు ప్రదక్షిణాలు చేస్తారు. దీనికి 'పొలిదిరుగు' అని పేరు. నెల్లూరు మొదలైనచోట్ల జాతరలలో దేవతకు ప్రీతిగా పాడే పాటల్ని కూడా పొలిపదాలు అంటారు.

బంతిమాలి, బంతిమాలి, ఉయ్యాలో
మా ఎల్లెడ్ల బంతికి ఉయ్యాలో–అంటూ

ఈలా పల్లెడ్లు, దోరెడ్లు, కర్రెడ్లు, బట్టడ్లు, గోరింక బట్టిడ్లు, మసరి, కసరి, పై లక్కపై, చాపనెల్ల, జాలె, పూత మొదలైన ఎడ్లరంగులను వర్ణిస్తూ, బంతులు తోలుతూ, కుప్పలు నూరుస్తారు. గింజలు పొలి గలగాలని వినాయకుణ్ని, గాలిని ప్రార్థిస్తారు. అన్ని పనులు ముగించుకొని గృహానికి మరలేటప్పుడు కూడా పాటలు పాడు కుంటారు రైతులు. పొలంలో పని మొదలు పెట్టినప్పటినుంచి ధాన్యంతో నిండుగా ఇంట అడుగు

పెట్టే వరకు పాడేపాటలను సేకరించి అధ్యయనం చేస్తే అదే ఒక పరిశోధన గ్రంథమవుతుంది. ఒక్కొక్కపని చేసేటప్పుడు ఎలాంటి పాట పాడుతారు, దాని లయ ఎలాంటిది అది ఆ పనికి ఏవిధంగా సరిపోతుంది మొదలయినవన్నీ చాలా ఆసక్తిదాయకమైన పరిశోధనాంశాలు.

పని పాటలలో ముఖ్యంగా పేర్కొనదగిన వాటిలో పడవ పాటలూ చేరుతాయి. ఇవి ప్రపంచంలో అన్ని ప్రదేశాలలోనూ దొరుకుతాయి. పనికి, పాటకు ఉండే దగ్గరి సంబంధాన్ని తెలియబరిచే వాటిలో పడవ పాటలను మొదట చెప్పుకోవాలి. పల్లవులకు పడవ పాటలు పెట్టింది పేరు. కొన్ని పడవ పాటలలో ఊత పదాలు తప్ప పాటే ఉండదు. మామూలుగా పడవపాటలు సాగర ప్రాంతాలలో, నదీనదాలున్న చోట్లలో వినిపిస్తాయి. జాలరులు, పడవమీద వస్తువుల్ని, మనుషుల్ని చేరవేసే వాళ్ళు పాడే పాటలివి.

ఆంధ్రదేశంలో కృష్ణాగోదావరీనదులు ప్రయాణాలకు, ఎగుమతి దిగుమతులకు ఉపకరిస్తున్నాయి. పొడవైన సాగర తీరానికి తెలుగుదేశం పెట్టింది పేరు. అందువల్ల ఆంధ్రదేశం పడవ పాటల మేలైన స్థావరంగా ఉంది.

పడవ పాటలలోని ఊత పదాలు, అనుపల్లవులు పడవ నడిపే వారికి తరగని ఆస్తులు. ఊత పదాలను పలుకుతూ పడవ నడిపేవారు శ్రమను తగ్గించుకుంటారు. గీత నాయకుడు ఏదో ఒక పాటను ఎత్తుకుంటాడు. మిగిలిన వాళ్ళు ఊతపదాలను పలికి, ఊపిరి విడుస్తున్నప్పుడు ఊపిరితిత్తులలోని గాలి వెలుపలికి వెళ్ళి వాళ్ళ శ్రమ తగ్గినట్లనిపిస్తుంది. తండేలు పాటను అందించడం, కళాసులు ఊతపదాలను చేర్చి పలకడం విని తీరవలసిన సన్నివేశం పాటకంటే ఎక్కువగా ధ్వన్యనుకరణలే ఉంటాయి.

ఏలెస్సా ఓలెస్సా ఏలెస్సా ఓలెస్సా
ఏలెస్సాబో ఓలెస్సా ఏలెస్సాబో ఓలెస్సా
ఏలా యేలా యేలా యేలా యేలా యేలా యేలా తండేలా
ఏలా ఏలా జోర్సెయ్ బార్సెయ్

మొదలైనవి భారం తీర్చుకునేందుకు చేసే ధ్వనులు.

పడవ పాటల్లో వేదాంతం పుష్కలంగా కనిపిస్తుంది. చుట్టూ పరుచుకొని ఉండే సాగరం, నడుమ మెలమెల్లన సాగే చిన్ని పడవ ఎప్పుడు ఏక్షణంలో ఏ అల కొడుతుందో, ఏగాలి ముంచుతుందో తెలియని స్థితి. ఈ పరిసరాలలో ఎవరికైనా





వేదాంతం పుట్టుకొస్తుంది.

"గట్టెక్కుతాదా నా తెప్ప?
కల్లోల జలధిలో మునిగిపోతుందా
కొక్కొరోకోయంచు కోడి కూయంగానే
దేవుడిచ్చిన నిద్ర తేలింది రాయంటు
చలిగాలిలో వళ్ళు సవరించుకొంటూ
చద్దిగట్టుక నేను, చక్కవచ్చాను"[9]

పాట సాగే కొద్దీ దీనిలో కూట వేదాంతం కనిపిస్తుంది. ఈ పడవ పాటల్లో మామూలుగా కన్పించే ఊతపదాలు హైలేసో, ఏలేయాలా, జోరుసెయ్యి బారుసెయ్యి, జాలుమాలి మొదలైనవి.

వివిధ వృత్తులకు సంబంధించిన పాటలు, వాటి లయలు పనికి తగ్గట్టుగా ఉంటాయి. కూలిపని చేసుకునేవారు పాడే పాటలు మన హృదయాన్ని కదిలిస్తాయి. అమాయకుడైన జానపదుని గుండెలో దాచుకొన్న నిశ్శబ్ద బాధామయ భావ పరంపరలు సున్నితమైన గీతంగా వెలువడుతాయి.. ఇది ఒక్క తెలుగు భాషలోనే కాదు; ఏ భాషకు చెందిన వారైనా జానపదుల హృదయం ఒక్కటే. యూరపులోని ఒక తోంగా బాలుడు రాళ్ళు పగుల గొడ్తూ ఈ క్రింది గీతం అలాపిస్తున్నాడు.

They treat us badly, ehe'!
They are hard on us, ehe'!
They drink their coffie, ehe!'
And give un none, ehe!'[10]

ఈ పాటలో పల్లె పిల్లవాని గుండెల చప్పుళ్ళు ప్రతి సహృదయునికి వినిపిస్తాయి.

కాంట్రాక్టు పనులు చేసేటప్పుడు నలుగురైదుగురు మగవాళ్ళు, ఆడవాళ్ళు పని చేస్తారు. ఇవి సామూహిక గీతాలు. పనికి తగినట్లు పాట ఉంటుంది. పార పదాలు చిన్నవి. పారను దించినపుడు పాటలో మొదటి భాగాన్ని పాడుతారు.

"ఏయూరు, భామా
గుంటూరు, నాది
ఏమి నీ, పేరు
పేరు గు, న్నమ్మ"[11]

ఈ పాట పూర్తి అయ్యే సరికి రెండు పారల మన్ను పోగవుతుంది.

పశుల కాపర్లు సామాన్యంగా పిల్లలై ఉంటారు. అమాయకత్వం, ఉత్సాహం ప్రతిబింబిస్తుందేవివారి పాటలు. ఏదో ఒక పక్షిగాని జంతువుగాని కనిపించగానే దాన్ని గురించి ఒక పాట ఎత్తుకుంటారు వాళ్ళు. 'ఉడతా  ఉండతా హూత్, ఎక్కడి కెళతావ్ అనో చిలకా చిలకా రామచిలకా పలకల్లంటావా' అనో, ప్రకృతి ప్రాణుల్ని పలకరిస్తారు పశుల కాపర్లు. రాయలసీమ ప్రాంతాలలో వినిపించేది ఈ క్రింది గేయం.

ఉడతా ఉడతా ఉ(రి–ఉండే కమ్మాల్లో జెట్టి
యాడకి పోతావోయ్–సంతకి పోతానేయ్
యేమి తెస్తావోయ్–పప్పులు బెల్లాలు
వోలికి పెడతావు–ఏమేమి తెస్తావు
మిఠాయిబెల్లాలు–ఓలికి పెడతావు
లంజకి పెడతాను–ఏడవణు కుంటావు
పొయ్యి గడ్డలో వణుకుంటాను–మీసాలు కాలిపాయె

రజక వృత్తికి సంబంధించిన గేయాలు కూడా అరుదుగా వినిపిస్తాయి. నేను సేకరించిన ఆసక్తికరమైన గేయం ఈ క్రిందిది. రజకులకు కావల్సింది బట్టలు తెల్లగా ఉండడం మాత్రమేనట! బట్టలు చిరిగినా పరవాలేదట. ఏ రజకుణ్ని నిలదీసి అడిగినా యీ నిజాన్ని ఒప్పుకోడుగాని యీ గేయం అతని హృదయంలో నుంచి వెలువడింది కాబట్టి అరమరికలు లేకుండా పాడుతున్నాడు.

బండమీద వెయ్యరా దబాదుబా
బట్టలు చినిగినా కోమిటోడు అరిసినా
మనకేమిరా బయమో
కొట్టరా బండమీద వెయ్యరా బండమీద దబాదుబా
మనకు కావల్సిందేమిరా గుడ్డలు తెల్లగ కావాలిరా
ఎయ్యర బండమీద దబాదుబా
ఎత్తెయ్యరా దబాదుబా
బట్టలు బల్లమీద వేసి ఇత్తడి పెట్టి ఎత్తుకొని
సరాబరా తోమురా నాన్న
సరాబరా తోమురా నాన్న

(మునుస్వామి, చింతామణి, కోలారుజిల్లా)





పని పాటలు ముఖ్యంగా పనిలో కష్టాన్ని తగ్గించడానికి ఏర్పడ్డవి కాబట్టి అవి చాలా ఉత్సాహంగా సాగుతుంటాయి. హేళనలు, ఓహోలు, ఆహోలు చాలా కనిపిస్తాయి. నరకవయ్య, కొట్టవయ్య, తోమవయ్య అంటూ పనిచేసే వాడికి పురి ఎక్కిస్తుంటారు.

కొన్ని పాటలలో ఆ వృత్తిలోని పనితనాన్ని గురించిన ప్రసక్తి ఉంటుంది. ఒక 'మేదరి కూతుర్ని' గురించి ప్రశంసా పూర్వకంగా చెప్పిన పాట ఈ క్రిందిది.

మేదారి కూతూరు మేలంపు రాలురా
కూసోని అల్లెరా కూరాకు జిబ్బిరా
పండుకో నల్లెరా పట్టుమంచామురా చందమామా–సై
నిలబడుకో నల్లెరా నీలంపు దాగిరి
వంగోని అల్లెరా వడ్ల జల్లిడిరా
పండుకో నల్లెరా పట్టు మంచామురా చందమామా–సై

(తాయమ్మ, రామాపురం, చింతామణి తాలూకా, కోలారుజిల్లా)

**కార్మిక గేయాలు :**

కర్మాగారాలలో పనిచేసే వాళ్ళు కార్మికులు. భారీ పరిశ్రమలలో పనిచేసే వాళ్ళే కాక చిన్ని చిన్న మిల్లులు మొదలైన చోట్ల పనిచేసే వాళ్ళు కూడా కార్మికులే. మన దేశంలో చాలా కాలంనుంచి కుటీర పరిశ్రమలే పెక్కుమందికి జీవనాధారంగా ఉన్నాయి. కార్మికులకు సంబంధించిన గేయాలు తక్కువ. ఎందుకంటే మనదేశంలో భారీ పరిశ్రమలు ఇటీవలివి. అక్కడి కార్మికులకు అసలు పాటలు పాడడానికే తీరి కుండదు.

మిల్లులలో బరువులు మోసేటప్పుడు, రాళ్ళు కొట్టేటప్పుడు, బస్తాలు మోసేటప్పుడు పాడే పాటలు ఎక్కువగా లభిస్తాయి.

"కలకాలయన బోకు కనీ రుదియ్యాబోకు
మన అంతునుంటె తప్పదే–ఓ బొల్లార పెల్లా
అచ్చాము తెల్లచీర అంచూన జిల్లేడు కొమ్మ
నీ కొంగున రామ చిలుకలే–ఓ బొల్లార పెల్లా
బొంబాయిల బొంగులొరె–యిందూర్ల గంటలెగె
మన రజా యెత్తిపోతదె–ఓ బొల్లార పెల్లా"[12]

ఈ పాట బొంబాయిలోని తెలుగు కార్మికులకు సంబంధించినది. కార్మిక గేయాలు ప్రపంచమంతటా ఉన్నాయి. కాని యీనాడవి యంత్రాల చప్పుళ్ళ వెనుక అణగిపోయాయి. "Labour songs abound at all stages of culture all over the world except where they have been silenced by the hum of machinery"[13]

**తిరుగలి పాటలు, రోకటి పాటలు :**

ఇప్పటి వరకు సమీక్షించిన గేయాలు చాలావరకు గృహానికి వెలుపల వినిపించేవి. ఇంటిలోనే వినిపించే పనిపాటలలో తెలుగు సంస్కృతికి సంబంధించిన విశిష్ట గీతాలలో తిరుగలి పాటలు, రోకటి పాటలు చేర్చవలసి ఉంటుంది. ఇంటిపనులకు ఉపయోగించే పరికరాలలో తిరుగలి, రోకలి తెలుగు దేశంలో అనేక శతాబ్దాల నుంచి ఉన్నాయి.

తిరుగలి పాటలనే విసరుపాతి పాటలు అంటారు. ఇవి రాయలసీమలో ఎక్కువ ప్రచారంలో ఉన్నాయి. స్త్రీ జీవితంలోని అనుభవ సారమంతా ఈ పాటల్లో ప్రతిబింబిస్తూ ఉంటుంది. విసరురాళ్ళు గృహిణి శక్తి సామర్థ్యాలను బట్టి ఒకటి రెండడుగుల వ్యాసాన్ని కలిగి ఉంటాయి. రాయలసీమలోలోగా ఇద్దరు ముగ్గురు విసరేరాళ్ళు మూడు అడుగుల వ్యాసం కలిగినవి కూడా ఉండేవి. కాని యిప్పుడు వాటిని తిప్పే శక్తి ఎక్కడిది!

తిరుగలి పాటలు మామూలుగా ద్విపదచ్ఛాయలో నడుస్తాయి. మామూలుగా వీటిలో పదిపదిహేను పాదాలుంటాయి. మొదట ఎడమచేతితో మెల్లగా విసరడానికి పూనుకుంటారు. ఆ సమయంలో పాటమొదలు పెట్టి ఒక పాదం పాడుతారు. బియ్యమో, జొన్నలో కొంతవరకు మెదిగేవరకు తిరుగలి చిన్నగా తిరుగుతుంది. తర్వాత తిరుగలిని కుడిచేత పట్టి, పాటపూర్తిచేసి విసురుగా తిరుగలిని తిప్పి పిండిని సిద్ధం చేస్తారు. ద్విపదలయ తిరుగలి పాటకు చక్కగా సరిపోతుంది.

చింతాకు పట్లు దీసి యిల్లలికి నానూ
అక్క చూతువురాయె నాయిల్లుతీరూ
వాకిటా వజ్రాలు నిలువు నీలాలూ
కడపలన ముత్యాలు తలుపు పగడాలు...
మా పొసెత్త నాయిల్లు మల్లెల్ల పూజా
తిరుపతి బాటంట తిమ్మప్ప రాగా........





"విసురురాతికి శ్రుతితోనే గాని తాళముతో సంబంధము లేదు. కనుక ఈ పాటలలో తాళపు బిగుతు ఉండదు. ఊహలూ భావాలూ మాత్రమే పొదుగు పెంచుకుని పట్టుకుంటాయి. కథనము కనబడుతుంది. వీటిలో ముఖ్యంగా" అన్నారు 'కృష్ణశ్రీ' గారు 'పల్లెపదాల'లో (పు 39). తిరుగలి పాటలలో ముఖ్యంగా ఆడవారి అనుభవాలు అణగి ఉంటాయి. వారి ప్రేమలు, దుఃఖాలు, మమతలు, అన్నలు, వదినలు మొదలగు వారితో సంబంధాలు మొదలైనవన్నీ తిరుగలి ధ్వనితో కలిసి వినవస్తుంటాయి.

రోకటి పాటలు ఈ నాటివి కావు. నన్నెచోదుని కాలంనుంచీ ఈ పాటలున్నాయి. శబరకామిని మల్లికార్జునుని గూర్చి గీతాలు పాడుతూ రోకలితో దంచుతూ ఉండడం నన్నెచోదుని కంటబడింది. విసరురాతి పాటలలో హ్రస్వాలు దీర్ఘాలవుతాయి; రోకటి పాటల్లో దీర్ఘాలు హ్రస్వాలవుతాయి. రాయితిప్పేటప్పుడు సాగదీసి తిప్పాల్సి ఉంటుంది, దంచేటప్పుడు దీర్ఘాక్షరాలను పొట్టిగా చేస్తే పోటు వేయడానికి అనువుగా ఉంటుంది. రోకటి పాట ఎరిగిన పడుచు దంచడానికి సిద్ధమయిందంటే కష్టసాధ్యమైన పనికూడా సులువవుతుంది. అప్పుడు–

దంపు దంపని యేరు అదియెంత దంపు
ధాన్యరాశుల మీద చెయ్యేసినట్లు
వంట వంటని యేరు అది యెంత వంట
వదినెతో మరదళ్ళు వాదాడినట్లు– అని పాడుతూ త్వరగానే ఆమె పనిముగించుతుంది.

అయితే అందరూ ఇంత సులభంగా పని చేయరు. కొందరు అనుమానపు పురుగులు. వడ్లు దంచడం ఆ వేళ కాదేమో అని భయం ఈ సంశయం పాటలోనూ ధ్వనిస్తుంది.

"ఈ యేలా ఈ వడ్లు దంగవుగామోలూ
ఏలూరు సంతాకు ఎల్లనుగా మోలూ
ఏగాణి గోంగూర తేను గామోలూ
ఎగరేసి తాలింపు పెట్టను గామోలూ
సందాల మావోరి కెట్టను గామోలూ
ఈ యేలా ఈ వొడ్లు దంగవుగామోలూ[14]

విన్నకోట పెద్దన యీ పాటలు తరువోజ లయలో ఉంటాయని చెప్పాడు. విసరురాతి పాటలకూ, వీటికీ కొంత భేదం కనిపిస్తుంది. ఈ భేదాన్ని

గూర్చి చెపుతూ 'కృష్ణశ్రీ' గారు "విసురుపాతి పాటలు సోదరుని అభిమానమూ, పొదుపుకథవంటి సమస్యా, పుట్టింటి అందమూ, ప్రేయసి పరివేదనమూవంటి అనుభవ బీజముల చుట్లున్నూ అల్లిన అందపు గూళ్ళు …….. రోకటితో దంపుతున్న ఆయాసములో కల్పన సాగడానికి అవకాశము తక్కువ. తల్లియైన తరువోజను బట్టి నాలుగు పాదాలకూ, ద్విపద ప్రభావాన్ని బట్టి రెండు పాదాలకూ దిగుతుంది రచన"[15] అన్నారు.

ఈ రోకటి పాటల్లో నీతులు కూడా ఉంటాయి. పాపం చేసుకోని బావిలో పడితే పై మురికేగాని పాపాలు ఎలా పోతాయని ఒక అనుభవంగల ఆడదాని ప్రశ్న. ఇది అందరికీ వర్తించే విలువగలమాట. సమయంపడితే దేవుడినయినా తిట్టడానికి వెనుకాడదు పల్లె పడుచు. తాను సవతి బాధ లెరిగినది. అందుకనే శివుణ్ని 'నీకు చేటుకాలమటరా రెండో పెళ్ళి చేసుకోడానికి?' అని అడుగుతున్నది.

పాపాలు చేసుకొని బావిలో పడితే
పై మురికియేగాని పాపాలు పోనా
చేటు కాలమటరా శంకరుడ నీకు
అలి మీద పెళ్ళి యెట్లాడి నావు?

రోకలి ఎత్తే శక్తిలేదు ఒక స్త్రీకి. చేమంతి కడియాలు వేసుకున్న చెయ్యి బరువుగా ఉంది. అందుకే నేమో దేవుని సహాయం కోరుతున్నది. ఇష్ట దైవాన్ని తలచుకుంటే ఎత్తలేని చెయ్యి ఎత్తగలనని ఆశకాబోలు!

"రోక లెత్తాలేను-రోలెత్త లేను
చామంతి కడియాల-చేయెత్తలేను
కోటకు పోటాశ-పొరుగు నాకాశ
కంటికి రెప్పాశ-శ్రీ వెంకటేశ"[16]

మామూలుగా సువ్వి పాటలనేవి ఇంట్లో ఎవరైనా సమర్తాడినపుడు పాడుతారు. నువ్వులు, బెల్లం, కొబ్బెర వేసి దంచి చిమ్మిరి ఉండలు తయారుచేసి అందరికీ పంచుతారు. అప్పుడు కూతురు సమర్తతో బాటు అన్ని విషయాలూ అమ్మకు గుర్తు వస్తాయి. ఈ పాటల్లో 'సువ్వి అల్లో నేరేడల్లో' మొదలైనవి ఊతపదాలుగా వస్తాయి. తిరుగలి పాటలు, రోకలి పాటలు పనిలోని లయకు, పాటలోని లయకు ఉండే సంబంధాన్ని గూర్చి పరిశోధించే వారికి చక్కగా పనికి వస్తాయి. తెలుగు-కన్నడ జానపద గేయాల తులనాత్మక పరిశీలనలో కూడా తిరుగలి పాటలు, రోకటి పాటలు బాగా ఉపకరిస్తాయి.





**కన్నడం**

తెలుగు వారికైనా కన్నడిగులకైనా వ్యవసాయమే ప్రధానవృత్తి. అందుకనే యీ రెండు భాషలలోనూ పొలం పాటలు అత్యధికంగా దొరుకుతాయి. వ్యవసాయానికి నీరు కావాలి. నీటిని ఇచ్చేవాడు వానదేవుడు. అందుకే కన్నడ రైతులు కూడా వాన దేవుణ్ని ప్రార్థిస్తారు. వానలో రైతుకు కనిపించేది వట్టి నీరుకాదు అమృతధార.

అకాలంలో వాన కురవడం, దానివల్ల ఉపయోగం లేకపోగా అది బాధాకరంగా పరిణమించడం రైతుకు మామూలే. 'మళెరాజు' (వానరాజు)ను పట్టుకొని దులిపి వేయక ఏం చేస్తాడు రైతు? 'చుట్టూ అన్ని దేశాలలోనూ వాన కురిసింది. ఇంత ఆలస్యంగా వచ్చావు. ఏం మనిషివయ్యా' అంటాడు జానపదుడు.

'స్వాతీయ మళె బందు మళెరాజ
సుత్త దేశకె ఆగ్యాదె మళెరాజ
హళ్ళ కొళ్ళ హెణ హరిదాడి హోదావు
యావాగ బంద్యప్ప మళెరాజ"[17]

వానలు కురవాలని కన్నడ దేశంలో కరగ ఉత్సవం చేస్తారు. ఒక పచ్చి కుండకు పూలు మొదలైనవి చుట్టి, కౌపీనధారియైన బాలుని తలపైన పెట్టి ఇంటింటికీ తిరుగుతారు. తర్వాత పూజలు చేస్తారు. 'మళెరాజ'ను ప్రార్థిస్తూ – 'ఓ వానదేవుడా! పూలతోటకు నీరు లేదు, దోస తోటకు నీరు లేదు, గుమ్మడి తోటకు నీరు లేదు, కురవవయ్యా వానరాజా' అంటారు.

హుయ్యో హుయ్యో మళెరాయ
హూవిన తోటకె నీరిల్ల
చెచ్చో చెచ్చో మళెరాయ
సౌతెయతోటకెనీరిల్ల
కుట్టో కుట్టో మళెరాయ
కుంబళ తోటకె నీరిల్ల

ఈ పాట, ఇంతకు ముందుదహరించిన పాట కూడా తెలుగులో ప్రసిద్ధమైన 'వానల్లు కురవాలి వానదేవుడా' అన్న పాటవే పోలి ఉన్నాయి. లయకూడా అటువంటిదే.

తెలుగు దేశంలోని వివిధ ప్రాంతాలలో పాటలు వేరువేరైనా ఒక విధమైన ఐక్యత కూడా కనిపిస్తుంది. కన్నడనాడులో ఇంత మాత్రం ఐక్యత కూడా పాటలలో

మనకు కనిపించదు. ఉత్తర కర్నాటక మనబడే ధార్వాడ, గుల్బర్గా, రాయచూరు, బెల్గాం మొదలైన ప్రాంతాలలోని పాటలకూ, దక్షిణ కర్నాటకంలోని ప్రాంతాల పాటలకూ చాలా వ్యత్యాసం కనిపిస్తుంది. ఉత్తర కర్నాటకంలో వరినాటేటప్పుడు పాటలే వినిపించవు. కోత కాలంలో అసంఖ్యాకంగా వినిపిస్తాయి. దక్షిణ కర్నాటకంలో వరినాటేటప్పుడు, కలుపు తీసేటప్పుడు పాటలతో ప్రతి పల్లె ప్రతిధ్వనిస్తుంది. ఉత్తర కర్నాటకంలోని కర్షకగేయాలపై శైవమత ప్రభావం కనిపిస్తుంది. తెలుగు పని పాటలలో మత ప్రసక్తి చాలాతక్కువ.

12వ శతాబ్ది కన్నడ దేశంలో ఒక విప్లవయుగం. బసవన్న ప్రచారం చేసిన లింగాయత మతం అన్ని రంగాలలో లాగానే వ్యవసాయ రంగంలోనూ అనల్ప ప్రభావాన్ని చూపింది ముఖ్యంగా ఉత్తర కర్నాటకంలోని అనేక గేయాలలో శివుడు లేక శివునికి సంబంధించిన దేవతల ప్రసక్తి ఉంటుంది. రైతుకు పొలం, నాగలి, ఎద్దులు మొదలైనవన్నీ శివాలయంలా, చెన్న బసవేశునిలా, లింగంలా కనిపిస్తుంటాయి.

'కణవె మంటప వాతొ, గుణవంత బసవేశ
హెూణెగారు రైత దండేశ। కణమేటి
గణె గురువు కణకె, ప్రభులింగొ'[18]

ధాన్యం రాశి చేసేటప్పుడు ఎత్తయిన ఒక త్రిపాదిని వాడుతారు. దానికి మూడు కాళ్ళుంటాయి. అది రైతుకు మూడు విధాల లింగాలుగా కనిపిస్తుంది. రాశి చేసేవాడు జీవుడు, చేసిన రాశి వచనరాశి

'మూరు కాలిన మెట్టు. మూరు లింగళేనొ
తూరువను జీవి చిత్కళెయు। వచనగళు
తూరిదారాశి శివమతకె'[19]

భక్తితో భగవంతుడికి పూజ చేసి విత్తనాలు నాటితే చక్కగా వానకురిసి పైరు పచ్చగా పండి కళకళలాడుతుందని కర్షకుని నమ్మకం. అందుకని విత్తనం వేసేటప్పుడు-

అడవి పూజయ మాడి, ఎడెమాడి కూరిగె
ఒడెయ గొల్లాళ బిత్తిదరె। మళెయాగి
కడెరాశి తుంబి కైసోతు [20]

అంటూ పూజాపునస్కారాలు చేస్తే వానకురిసి ధాన్యం బాగా పండుతుందని గీతమాలాపిస్తాడు.

నాట్లు వేసేటప్పుడు పాడే పాటలకు 'నాటియ పదగళు' అని పేరు. 'ఏ





గిణియే', 'నెడతీమి', 'మల్లిగె' మొదలైన పల్లవులు ఈ పాటల్లో వినిపిస్తాయి. శృంగారం, శ్రమ తగ్గాలనే కోరిక, ఉత్సాహం ఈ పాటల్లోని భావాలు.

'ఏ గిణి ఏ గిణియే
ముద్దు హవాళాదా
ఏ గిణియే గిణియే'

-అంటూ మంచి ఉత్సాహాన్నిచ్చేవిగా ఉంటాయి యీ పాటలు. ఇవి ఆడవాళ్ళ పాటలు. ఇలాంటివే కలుపు పాటలు కూడా. ప్రభాత కాలం నుంచి మిట్ట మధ్యాహ్నం వరకు పని ఉంటుంది. కథా గేయాలు ఎక్కువగా ఈ పనికి ఉపకరిస్తాయి. కొంత మంది గేయాన్నెత్తుకుంటే, మరి కొంత మంది పల్లవిని పలుకుతారు. కలుపు పాటలను కన్నడంలో 'కళకీళువ పదగళు' అంటారు.

దక్షిణ కర్నాటకంలో కొన్ని చోట్ల కోతలప్పుడు పొలిపాటలు వినిపిస్తాయి. అలాంటి ఒక పాటలో ఈ క్రింది విధంగా ఉంది.

భాగ్యలక్ష్మియు బరలు బాగిలలి కాదిదై
హూవు అక్షతె హిడిదు నింతిద్దె అణ్ణయ్య
హెూలి బారె నమ్మ మనె తుంబ

ఆఖరు పాదానికి 'పొలి రార మా ఇల్లు నిండగా' అని అర్థం. 'పొలి' పదానికి కన్నడం వాళ్ళు కూడా సరియైన అర్థం చెప్పలేక పోతున్నారు. 'పైరు' అని కొందరు అర్థం చేసుకున్నారు. కొత్తగా కోసిన ధాన్యాన్ని వేరు పరచేటప్పుడు 'హెూలియోడిబా', హెూలి హెచ్చిబా' అంటూ అరుస్తారు. ఈ సంప్రదాయం కేరళలో కూడా ఉన్నదట.

కన్నడనాడులోని కొన్ని ప్రాంతాలలో నరకచతుర్దశి నాడు బలి చక్రవర్తినీ, ధాన్యపు రాశినీ పూజ చేయడమనే సంప్రదాయముంది. ఇక్కడ ధాన్యపు రాశినే 'పొలి' అంటారు (కన్నడంలో పొలి-హెూలి అవుతుంది)

'హెూలి దేవ్రా బలి దేవ్రో
హెూలి కొట్ట బటి త్యేకండ్
తమ్మ్ రాజ్యక్క్ తావే బంద్
హెూలియే బా .............[21]

ఉత్తర కర్నాటకంలో 'హంతి' పాటలన్నవి ఎక్కువగా కనిపిస్తాయి. 'హంతి' అన్నది 'పంక్తి' శబ్ద భవం హంతి కట్టడం అంటే to form a row అని, హంతిదావణి

అంటే A rope to which bullocks are tied in a row for treading out corn on a threshing floor అనీ అర్థం ఇచ్చాడు కిట్టెల్. ఈ పాటలు ఉత్తర కర్నాటకంలో కోతల కాలంలో ప్రతి పల్లెలోనూ వినిపిస్తాయి. హంతి కట్టడానికి సమానమైన 'బంతికట్టడం' రాయలసీమలోని కొన్ని ప్రాంతాలలో వాడుకలో ఉంది.

బంతిమాలి, బంతిమాలి ఉయ్యాలో
మా ఎల్లెడ్ల బంతికి ఉయ్యాలో

అని బంతులు తోలుతూ గీతాలాలాపిస్తారు.

ఉత్తర కర్నాటకంలో రాత్రి సమయంలో బంతి కడ్తారు. రాత్రి అంతా పశువులకు, మనుషులకు, చేతినిండా పని ఉంటుంది. ఈ శ్రమనంతా మరిచి పోవటానికే పాటలు.

కన్నడ బంతి పాటలలో అనేక మధుర భావాలు కనిపిస్తాయి. శివుణ్ని, శివశరణులను ధ్యానిస్తూ పాడే పాటలనేకం. ఇలాంటి పాటలలో ఒకచోట వానరాజును ధ్యానిస్తూ ఆయన గుర్రాలు రాగుల రంగు కలవని చెప్తాడు రైతు. ఇది చదువుతుంటే కాళిదాసు గుర్తువస్తాడు. శాకుంతలలో ఆశ్రమవాసులు జింకను పుష్పరాశితో, దుష్యంతుని బాణాల్ని అగ్ని కణంతో పోలుస్తారు. వాళ్ళకు పుష్పాలు, అగ్ని చిరపరిచితాలు. అట్లే రైతు తాను పండించే రాగుల రంగు వానరాజు గుర్రాలకు కలదని చెప్పడం అత్యంత సహజంగా ఉంది.

రాగి బణ్ణద కుదురి రాజేక దొడ్డదు
రాజరొళు రాజ మళెరాజ, బరువాగ
రాజేవ కైయ ముగిదావ

ఉత్తర కర్నాటకంలో పెక్కుమంది రైతులు శైవులే కావచ్చు. కాని వాళ్ళ సంపదలు పెంపొందాలంటే వారికి అందరు దేవుళ్ళూ కావాలి శివుడు, వానదేవుడు, హనుమంతుడు, హరి మొదలైన వారితోబాటు ఎల్లమ్మ, మారెమ్మ, కాళవ్వ మొదలైన వారూ రైతును ఆదుకోవాలి. ఎల్లమ్మను గురించిన ఈ క్రింది బంతి పాటలోని కమనీయ భావం గమనించదగింది.

'ఏళ ఎల్లవ్వ తాయి ఎష్టొత్త మలగీదె
హూవెంజలాగి హుళ ముట్టికొళ్ళద
నీరెంజలాగి గిళి కుడిదు'[22]

(ఎల్లమ్మ తల్లీ, లే. ఎంత సేపు నిద్రపోతావ్. పురుగు తాకి పూవు ఎంగిలవుతున్నది. చిలుక తాగి కొలనులో నీరు ఎంగిలవుతున్నది)





దక్షిణ కర్నాటకంలోని వారికి పూర్తిగా అపరిచితాలైన 'హంతియ హాడుగళు'(బంతి పాటలు) వైవిధ్యపూర్ణమైనవి. బంతి కట్టేటప్పుడు రైతులు కులదేవతల్ని పూజిస్తారు. పూజారి మంత్రించి యిచ్చిన భస్మాన్ని ధాన్యరాశిపై చల్లుతారు. బంతి కట్టడం అయ్యాక ఒకటిరెండు గంటల వరకు ఇష్టదేవతల్ని, క్షుద్రదేవతలతో సహా, ప్రార్థిస్తూ పాడుతుంటారు. మధ్య మధ్య హాస్యాలు, ప్రణయ వాక్యాలు దొర్లుతుంటాయి. ఒకరికొకరు పోటీలు పడి పాడుతుంటారు. చిన్న గేయాలతో బాటు బసవన్న మొదలైన శివశరణుల చరిత్రలు కూడా ఈ సందర్భంలో వినిపిస్తుంటాయి. బంతి పాటలపైన శైవమత ప్రభావం ఎక్కువగా దర్శనమిస్తుంది. బంతి పాటలపైన శైవ మత ప్రభావం ఎక్కువగా దర్శనమిస్తుంది. దీనికి కారణం బసవన్న ప్రచారం చేసిన లింగాయత మతం. అక్కమహాదేవి అనేమహాభక్తురాలు శ్రీశైల మల్లికార్జునుని భక్తితో సేవించి అనేక వచనాలు వ్రాసింది. బసవన, అక్క మొదలైన వారి రచనలు కన్నడ జనులపై చూపిన ప్రభావం అనల్పం. ఈ ప్రభావం పొలం పాటల వరకు పాకింది.

పడవ నడిపే వారికి సంబంధించిన పాటలు కన్నడంలో చాలా తక్కువ. ఆంధ్ర దేశంతో పోల్చినప్పుడు సాగరతీరం కన్నడ దేశానికి అతి స్వల్పం. సాగర తీరం ఉన్న చోట కూడా కన్నడ భాషలో బాటు కొంకణి, తుళు మొదలైన భాషలూ ఎక్కువగా వినిపిస్తాయి. కన్నడంలో జానపద గేయాలను సేకరించిన వారు పడవ పాటల పైన ఎక్కువ శ్రద్ధ కనబరచ లేదు. దక్షిణ కన్నడ జిల్లాకు సంబంధించిన ఈ క్రింది పడవ పాట (దోణియహాడు)లో 'హూంతత్తయ్య' (హూం అంటూ తొయ్యవయ్య, హూం+అంత+ఒత్తయ్య) అన్నది పల్లవి. ఈ పాటలో దశావతారాలను స్మరించుకుంటున్నాడు జానపదుడు.

'హూం తత్తయ్య కడ్గి ముత్తయ్య
కళిన్ చిక్కయ్య దోణి ఒత్తయ్య
సాగర శాయి రామయ్య హూం తత్తయ్య
హత్తవతారద రామయ్య ॥హూం॥
దశరథ కంద రామయ్య ॥హూం॥
మత్స్యవతారద రామయ్య ॥హూం॥
హత్తలె కొంద రామయ్య ॥హూం॥
బత్తలె నింద రామయ్య ॥హూం॥

కత్తియ కొడలి రామయ్య ॥హూం॥
సుత్తిద జగవ రామయ్య ॥హూం॥
ముత్తిద లంకె రామయ్య ॥హూం॥
హత్తితు బెంకి రామయ్య ॥హూం॥
కొత్తల మురిద రామయ్య ॥హూం॥
హూం తత్తయ్య కడ్గి ముత్తయ్య
కళిన్ చిక్కయ్య దోణి ఒత్తయ్యా'[23]

కూలీవాళ్ళకు సంబంధించిన గీతాలు నేటికీ అక్కడక్కడా వినిపిస్తుంటాయి. కాయ కష్టం చేస్తూ పొట్ట పోసుకునే కూలివారి నోరు పెగలకూడదు. వాళ్ళు తమ బాధలను వెళ్ళబోసుకోవాలంటే ఉన్న ఒకే మార్గం జానపదగేయం. ఈ క్రిందిది ఒక కూలీ వాని స్వగతం. అన్ని గ్రామాల్లో కూలీ ఎక్కువ ఇస్తారే, తన కెందు కివ్వరని వారి బాధ ఇంటి నిండా పిల్లా పాపా ఉన్నారు. కాని తనకు తగినంత కూలీ లభించడం లేదు. ఒక సామాన్యుని వేదన ఈ గీతంలో ప్రతిధ్వనిస్తున్నది.

'దేశ దేశదల్లెల్లా పడికాళ కూల్యాదె
నమ్మూరిగ్యాక కడిమెవ్వ-నమగ్యేన
మక్కళిల్యేన మనితుంబ
హిత్తల గ్వాడి హ్వారె హత్త్యెద దినమాద్యె
కొడిరెంద నా కూలి కేళ్యేన
కొడిరెంద నా కూలి కేళ్యేన-బర సుగ్గి
బరలోగ కొడువె నెందరా.....'[24]

కార్మికులకు సంబంధించిన గేయాలు ఎక్కువగా దొరకవు. అయితే నేటికీ రైల్వే లైన్లు మోసేవారు, ఎలక్ట్రిక్ స్తంభాలు మోసే పని వారు తమ కష్టాన్ని మరిచేందుకు గేయాల నాశ్రయిస్తారు. ఎలక్ట్రిసిటీ బోర్డుకు సంబంధించిన వారు పెద్ద పెద్ద స్తంభాల నెత్తేటప్పుడు ఈ క్రింది పాటల లాంటివి పాడుతారు. వీటిలో పల్లవికే ఎక్కువ ప్రాధాన్యం ఉంటుంది. మిగిలిన పదాలను పనివారు వాళ్ళ ఇష్టం వచ్చినట్లు మార్చు కుంటారు. ఈ క్రింది గేయం కోలారు జిల్లాలో వాడుకలో ఉంది.

| మూలం | తెలుగు |
|---|---|
| మావన మగ హైస్సా | మావకొడుకు హైస్సా |
| ఊర్గె బంద హైస్సా | ఊరి కొచ్చాడు హైస్సా |
| యారిగోస్కర హైస్సా | ఎవరి కోసం హైస్సా |
| నింగోస్కర హైస్సా | నీ కోసమే హైస్సా |
| ఎల్లింద బంద హైస్సా | ఎక్కడ్నుంచి హైస్సా |
| బెంగ్ళూర్నింద హైస్సా | బెంగుళూరునుంచి హైస్సా |





'హైస్సా' అన్న పల్లవి వచ్చినప్పుడల్లా బరువును పైకి లాగుతారు. కూలీల గుంపులోనుంచి ఒకడు (గీత నాయకుడు) దీర్ఘంగా రాగం తీస్తూ 'మావన మగ హైస్సా' అని ప్రారంభిస్తాడు. ఆ తర్వాత అందరూ సామూహికంగా గీతాన్నెత్తుకుంటారు.

కుంభకారునికి సంబంధించిన ఈ క్రింది గేయం నేను సేకరించింది. ఇందులో కుండలు చేసే విధానం, కుంభకారుని గుణగణాలు వర్ణింపబడ్డాయి.

జాణ కుంబారన మనియావ కడగద
కప్పురద తిప్పి ఎడ ఎడబలసో ॥
కప్పురద తిప్పి ఎడబల మాడికొండు
జాణ కుంబారన మనిగ్హ్వాద॥
ముంజాళి కుంబారణ్ణా మసర బోనుండాన
హార్యారి కెసర తుళదాన సో॥
హారిహారీ కెసర తుళదు తా మాడ్యాన
నార్యార హురువ ఒందైయ రాణి సో॥

**తిరుగలి పాటలు, రోకటి పాటలు :**

కన్నడంలో తిరుగలి పాటలు వేల సంఖ్యలో సేకరించబడ్డాయి. వీటిని బీసువ కల్లిన పదగళు (విసురురాయి పాటలు) లేక రాగియకల్లు పదగళు (రాగిరాయి పదాలు) అంటారు. కన్నడంలోని తిరుగలి పాటలు అనేక ముగ్ధ భావాలకు నిలయాలు. అమాయకమైన జానపద హృదయానికి మనుషులే కాదు-జంతువులు, వృక్షాలు-చివరికి నిర్జీవమైన రాళ్ళు, రప్పలూ కూడా బంధువులే. తిరుగలి ఆమెకు ఆత్మబంధువు తెల్లవారకముందే పల్లెపడుచు రాగులు తిరుగలిలో పోస్తుంది. ఇలా బలవంతంగా ఆ రాయిని బాధ పెట్టడం తనకూ బాధ అనిపిస్తుంది. అందువల్ల రాతితో 'నీ నిద్రపాడు చేశాను రాగిరాయీ' అంటూ-

నా నిన్న సోలిసిదె నా నిన్న నిద్దె కెడిసీదె
నా నిన్న నిద్దె కెడిసీదె రాగి కల్లె.......

అని పాడడంలో ఎంతో ఆత్మీయత, ఆప్యాయత కనిపిస్తున్నది.

పొద్దున లేవగానే కన్నడ పల్లె పడుచు మొదట భూమాతను తలచుకుంటుంది. తనకు అన్నాన్ని ప్రసాదించే ఆ చల్లని తల్లిని తలచిన తర్వాత ఇంకా ఎవరెవర్ని స్తుతించాలో ఆలోచిస్తుంది. పాడాలంటే వాక్కు శుద్ధంగా ఉండాలి. వాక్కు నొసగే దేవి సరస్వతి. అందుకే సరస్వతిని తన నోటిలో ఉండే అవరోధాలనన్నిటినీ తొలగించమని వేడుకుంటుంది జానపద స్త్రీ.

మనం మామూలుగా విసరురాయి అంటాం, తిరుగలి అంటాం–అంతే. అంత కంటె గౌరవాన్ని ఇవ్వం, చిల్లర రాళ్ళకన్నిటికీ దేవుళ్ళని మొక్కుతున్నప్పుడు, నిత్యజీవితంలో అనుదినమూ మనకు సహాయపడే రాగి కల్లును ఒక జీవమున్న వస్తువుగా అనుకోడంలో తప్పులేదు. కన్నడ జానపద స్త్రీ 'కల్లు' అనడం కన్న 'కల్లమ్మా' అనడమే మిన్న అని భావిస్తుంది. 'రాయమ్మ'ను తల్లిగా తలుస్తుంది. 'ఓ రాయమ్మా త్వరత్వరగా విసరవమ్మా. నీకు హారతి ఇస్తాను' అంటుంది.

'కల్లమ్మ మాతాయి మెల్లమ్మ రాగీయ
జల్లి జల్లనె ఉదురమ్మ నా నినగె
నెల్లక్కి పడియ నడెసేను
కల్లమ్మ మాతాయి మెల్లవ్వ రాజనవ
జల్ల జల్లనె ఉదురవ్వ నా నినగె
బెల్లదారతియ బెళగేను'[25]

కన్నడంలోని తిరుగలి పాటల్లో ఎక్కువగా స్తుతులు, బాంధవ్య గీతాలు కనిపిస్తాయి. అదీ త్రిపదులలో ఉండేవే ఎక్కువ. శరణు శరణని అందరు దేవతల్ని తలచుకుంటూ తిరుగలిని పట్టుకుంటారు కన్నడ స్త్రీలు.

శరణందు శివునికి శరణందు గురువుకు
శరణందు శివుని భార్య గౌరమ్మకు
శరణంచు రాయి పట్టేను (అనువాదం)

అని దైవ స్తుతి చేయడం అలా ఉంచి జానపదులు కృతజ్ఞతను వ్యక్త పరచడంలో వాళ్ళకు వాళ్ళే సాటి దైవ ధ్యానాలూ మొదలైనవన్నీ పూర్తి అయిన తర్వాత చివరి సారిగా పాడుతూ పల్లెపడుచు, తిరుగలి ఇచ్చిన తల్లికి అన్ని భోగభాగ్యాలూ ఒనగూడ వలెనని, పల్లకి మీద కొడుకు రావాలనీ, ఆ ఇంటికి మల్లెలు ముడుచుకొనే కోడలు రావాలనీ కోరుకుంటుంది. 'ఏరుదాటగానే తెప్ప తగలేసే' వాళ్ళు ఎక్కువ యీ లోకంలో.





పని పూర్తి కాగానే చేసిన మేలు మరచిపోతారు. కాని జానపదులలా కాదు. విసరడం పూర్తి కాగానే–

కల్లు కొట్టమ్మగె ఎల్లా భాగ్యవు బరలి
పల్లక్కి మేలె మగ బరలి ఆ మనెగె
మల్లిగె ముడియో సొసె బరలి – అని పాడుతుంది.

కన్నడంలో దంపుడు పాటలు అత్యంత ప్రాచీన కాలంనుంచీ ఉన్నాయి. శివమారన ప్రచారం చేసిన రోకటి పాటను గూర్చిన ప్రస్తావన తొమ్మిదవ శతాబ్దానికి చెందిన ఒక శాసనంలో ఉంది.26 వడ్లు దంచేటప్పుడు స్త్రీలు ఎన్నో విషయాలను తలపోసుకుంటారు. ఒక వనిత తాను దంచే బియ్యం తనవి కావని, తన దుస్థితిని వెళ్ళ బోసుకుంటూ పాడుతున్నది.

'కూకాణి నంటరె ఉంబోకె అక్కిల్ల
నా కుట్టొ అక్కి ననదల్ల నంటరె
బేకారె హొూగి హొళె హాయ్రి'[27]

నిజంగా వడ్లు ఉన్నవోలేవో గాని ఈ పాట పాడుతున్న ఆమె లౌక్యం ఎరిగిన పడుచు. ఇంటికి బంధువు లొచ్చారు. వాళ్ళు ఎంత కాలమైనా తిష్ఠవేయవచ్చు. అందువల్ల ముందే బియ్యం లేవంటున్నదీ తల్లి.

పైన పేర్కొన్న తెలుగు కన్నడాలలోని పని పాటలు సార్వజనీన గుణం కలవి. మిగిలిన విభాగాలలోని పాటలలాగా కాదు. ఉదాహరణకు స్త్రీ పాటలనే పేరుతో ప్రచారంలో ఉన్నవి చాలావరకు ఒక వర్గం వారిలోనే ఎక్కువగా వినిపిస్తాయి. వరస పాటలలో బ్రాహ్మణాదులలో వినిపించేవి కొన్ని. బ్రాహ్మణేతరులలో ప్రచారంలో ఉండేవి మరికొన్ని. పిల్లలపాటలు పిల్లలకే పరిమితమైనవి. పనిపాటలు వీరు వారనక అందరికీ సంబంధించినవి. పని పాటలలోని ఒక్కొక్క విభాగమూ కొందరిలో ప్రచారంలో ఉండవచ్చు గాని, మొత్తం మీద ఇవి అన్ని కులాలలోను జాతులలోను ప్రచలితంగా ఉండేవి. వివిధ వృత్తులకు సంబంధించిన పాటలు ఆయా జాతులలో ప్రచారంలో ఉంటాయి. చింతమాను కొట్టే పాటలు, రాళ్ళు మోసేటప్పుడు పాడే పాటలు, రాళ్ళుకొట్టే పాటలు కూలీపనితో పొట్టపోసి కొనేవారు పాడుతారు. తిరుగలి పాటలు, దంపుడు పాటలు అందరి ఇళ్ళలోనూ వినిపిస్తుంటాయి.

ఇదంతా చూస్తూ ఉంటే నిజమైన జానపద గేయాలు ఈ పని పాటలే అనిపిస్తుంది. జానపదులలో పుట్టి, జానపదులలో ప్రచారంలో ఉండే స్వచ్ఛమైన

జానపద గేయాలు ఈ పనిపాటలు. పనిలోని కష్టాన్ని మరిపింప జేసేవి ఈ పాటలు. ఈ విధంగా ఇవి ఒక ప్రయోజనాన్ని కూడా సాధిస్తున్నాయి. కేవలం పాటకోసం పాటగా కాకుండా శ్రమను తగ్గిస్తూ, మనసుకు హాయిని కల్గిస్తూ, పనికి తోడ్పడుతూ ఉండే ఈ పని పాటలు జానపదుల పాలిటి వరప్రసాదాలు. జానపదుల ముఖంనుండి వెలువడిన రసవద్గంగలు. జానపదులు మెచ్చిన గానామృత ప్రవాహాలు.

తెలుగు కన్నడాలలోని పనిపాటలను గురించిన వివరాలను సూచనా ప్రాయంగా ఈ క్రింద పొందు పరచడమైనది.

**టిప్పణి**

1. "Song rises from rhythmical action and owes to it some of its most important characteristics. Such action is older and earlier than rhythmical words, which are added to it and give to it a new clarifying element"-C.M.Bowra

2.Ibid, p.119

3.George Thomson, Marxism and Poetry, p.18

4.'కృష్ణశ్రీ' (సం.) పల్లె పదాలు, పు. 1

5. నేదునూరి గంగాధరం (సం.) మిన్నేరు, పు. 343

6. నేదునూరి గంగాధరం, జానపద గేయ వాఙ్మయ వ్యాసావళి, పు. 27

7. 'కృష్ణశ్రీ', పల్లె పదాలు, పు. 6

8. అదే, పు. 3

9. అదే, పు. 157

10.George Thomson, Marxism and Poetry, p.18

11. 'కృష్ణశ్రీ', పల్లె పదాలు, పు. 31

12. బి.రామరాజు, తెలుగు జానపద గేయ సాహిత్యము, పు. 485

13.George Thomson, Marxism and Poetry, p.17

14. త్రివేణి, పు. 120

15. 'కృష్ణశ్రీ', పల్లెపదాలు, పు. 46

16. 'ఎల్లోరా' (సం), సరాగాలు, పు. 149

17. రేవప్ప (సం.), మల్లిగెదండె, పు. 27

18. బి.ఎస్.గద్దగిమఠ, కన్నడ జానపద గీతగళు, పు. 132





19. అదే.

20. అదే, పు. 136

21. గుండ్మి చంద్రశేఖర ఐతాళ (సం), కైలియ కరెద నొరెహాలు, పు. 46

22. ఎం.ఎం.కరడి (సం) హంతీ హాడుగళు, పు. 8

23. గుండ్మి చంద్రశేఖర ఐతాళ, పూర్వోక్తం, పు. 46-47

24. ఎం.జీవన (సం), జానపద గీతగళు, పు. 215

25. అదే, పు. 15

26. ఏ వేళ్విదొ శివ మార మ
హీవళయాధిపన సుభగ కవితా గుణమం
భూవళయదొళ్ గజాష్టక
మోవనిగెయు మొనకె హాడు మాడుదె పేళ్గిం (E.C.Vol.VII, NR 35)

27. కె.ఎస్.కారంత, జానపద గీతెగళు, పుట. 31

# 3.పారమార్థిక గేయాలు

బెళగాగి నానెద్దు యార్యార నెనెయాలి
ఎళ్ళు జీరిగె బెళెయోళ। భూతాయ
ఎద్దొందు గళిగె నెనెదేను

దేవర నెనెదారె సావుట్టు నమగిల్ల
హావు కచ్చిదరూ విషవిల్ల। సర్పాన
హెడెయ దాటిదరూ భయవిల్ల

(పొద్దున్నే లేచి ఎవరెవరిని తలచుకునేది? నువ్వులు, జీలకర్ర పంట ఇచ్చే పుడమి తల్లిని ఒక ఘడియసేపు అనుకుంటాను. దేవుణ్ని తలచుకుంటే చావు పుట్టుకలు మనకు లేవు. పాము కరిచినా విషముండదు. పాము పడగను దాటినా భయం లేదు)

చేసిన సహాయాన్ని మరవని చిత్తవృత్తి, దేవుడిపైన పిచ్చి నమ్మకం జానపదులకుంటాయనడానికి పై రెండు త్రిపదులే సాక్షి. భూమిని కేవలం ఒక గ్రహంగా, మట్టిగడ్డగా భావించడం నాగరికుల వంతు. జానపదుల ఇల్లు ధాన్యంతో కళకళలాడుతుండాలంటే భూమాత చల్లగా చూడాలి. భూమాతతో బాటు జానపదులు గోవిందుణ్నీ అనుకుంటారు; మల్లయ్యనూ మనసులో తలుస్తారు. వాళ్ళకు శివుడని విష్ణువనీ భేదంలేదు. క్షుద్ర దేవతలు కూడా వాళ్ళకు కావలసిన వారే. పొద్దున్నే లేచి దేవుణ్ని తలచుకుంటే చావు పుట్టుకలు లేవట, పాము కరిచినా విషమెక్కదట. అందువల్ల సర్పఫణాన్ని కూడా అవలీలగా దాటవచ్చునట! ఈశ్వరాజ్ఞ లేనిదే చీమయినా కుట్టదనే గట్టి నమ్మకం కలవారు జానపదులు. అందుకే వారు దేవుణ్ని స్తుతిస్తారు, పూజిస్తారు, మెట్ట వేదాంతమైనా సరే-మాట్లాడుతారు.

జానపదుల దేవుడు ఎక్కడో స్వర్గంలో లేడు. ప్రతి మనిషి హృదయంలో ఉన్నాడు. పరమార్థాన్ని గూర్చిన నమ్మకాలు వాళ్ళ జీవితంలో భాగమై పోయాయి. భక్తి-కర్మ-జ్ఞాన మార్గాల ద్వారా ముక్తి లభిస్తుందని వాళ్ళు పుస్తకాల ద్వారా నేర్చుకోలేదు. మానవాతీత శక్తులను మంచి చేసుకోడానికి స్తుతించడం, కర్మకాండలను జరపడం, తత్వచింతన అత్యంత ప్రాచీన కాలంలోనే ఉన్నాయి. "Sacred songs are, in the first





place intended to establish a relation with supernatural powers and to influence them in a direction desired by the singers. They are composed against a background of accepted beliefs, and use its assumptions to make themselves felt"[1] అన్నమాట తెలుగు వారికి, కన్నడం వారికి, ఇంగ్లీషు వారికి-వీరికి వారికి అనడం ఎందుకు-ప్రపంచంలో జానపదుల కందరికీ వర్తించే మాట.

పరమార్థమంటే అత్యుత్కృష్టమైన అర్థం (The highest or most sublime truth, the highest and most excellent object or end or man-Kittel). పరమార్థ ప్రాప్తికి ముఖ్యమైన సాధనాలు శక్తి, కర్మ, జ్ఞాన మార్గాలు. "భక్తి వలన పరమేశ్వర సాక్షాత్కారము కలుగును భక్తి, రూపాపన్న జ్ఞానముదయించుటకు పూర్వసంచితమైన పాప పుణ్యాది జ్ఞాన విరోధి కర్మనిరస్తము కావలయును. అది నిష్కామ కర్మచే నిరస్తమగును. వేద చోదితమైన కర్మ, నిష్కామ బుద్ధితో చేసి సంచిత పాపమును పోగొట్టుకొనవలెను. ఇల్లు పాప క్షయమైన తర్వాత బ్రహ్మ మీమాంస నభ్యసించి, బ్రహ్మ స్వరూపమును తెలిసికొని, దానిని ధ్యానించుచు, ప్రేమించుచు, భజించుచు నుండినయెడల మోక్షమబ్బును"[2] అని కొందరు తత్వవిదులు చెప్తారు.

పై మూడు మార్గాలలోను ఒక్కొక్క దానికి ఒక్కొక్క మతంవారు ప్రాధాన్యమిచ్చారు. కొందరు భక్తి-కర్మ-జ్ఞాన మార్గాలకు ఏ మాత్రం సంబంధం లేదన్నారు. మరికొందరు ఇవి పరస్పరం నికట సంబంధ ముందేవన్నారు. కాని జానపదులకు ఈ వాదోపవాదాలకు సంబంధం లేదు. వాళ్ళకు భక్తి గేయాలూ కావాలి, పూజలూ పురస్కారాలూ కావాలి, వేదాంతమూ కావాలి. దేనివల్ల మోక్షం వస్తుందన్నది వారి కక్కర లేదు. తరతరాలుగా వాళ్ళు భగవంతుణ్ని స్తుతిస్తున్నారు, పూజిస్తున్నారు, తత్వచింతన చేస్తున్నారు.

## తెలుగు

### భక్తి గేయాలు :

'భక్తియింద ముక్తి యుక్తి యింద ఉక్తి' (భక్తి వల్ల ముక్తి యుక్తివల్ల ఉక్తి) అని కన్నడంలో ఒక సామెత ఉంది. దీనివల్ల జానపదులలో కూడా భక్తివల్ల ముక్తి లభిస్తుందనే నమ్మకం ఎంతగా వేళ్ళు పాతుకుందో తెలుస్తున్నది. చాలా సరళంగా చెప్పాలంటే ఈశ్వరునిపైన అత్యంత ప్రేమ కలిగి ఉండడమే శక్తి. "సాపరానురక్తిరీశ్వరే" (శాండిల్య సూత్రం,2). అన్ని మార్గాలలోను పరమార్థ ప్రాప్తికి భక్తి మార్గమే సులభమైందని

బహుజన సమ్మతమైన అభిప్రాయం. బ్రహ్మ జిజ్ఞాసకు సాధన చతుష్టయాదు లెన్నెన్నో అవసరమని శంకరుదు, జైమిని, వేదాంతులు పెక్కురు కట్టుదిట్టాలు చేశారు. అయితే భక్తి మార్గానికి ఇటువంటి ఆటంకాలు లేవు. భక్తి కలిగి ఉండడానికి అందరికీ అధికారం ఉంది. వర్ణాశ్రమ విభేదాలు వగైరా భక్తిలో లేవు. అందుకనే జానపదులందరూ తమ ముగ్ధ హృదయాలలో భక్తిని దాచుకున్నారు–గేయాలుగా పాడుకున్నారు.

జానపదుల నిత్య జీవితంలో దేవతలకున్న స్థానం ఎన్నదగ్గది. పొద్దున లేచినప్పటినుంచి పదుకోబోయే వరకు వాళ్ళ నోళ్ళలో ఏదో ఒక దేవుదు వాసం చేస్తూనే ఉంటాదు. కొందరు తమకోరికలన్నీ వెళ్ళబోసుకుంటారు. కొందరు కోరికలు తీరలేదని దేవుడిమీద విసుక్కుంటారు. మరి కొందరు 'నాకేమీ అక్కరలేదు, భక్తునిగా అంగీకరిస్తే చాల'ని వేదు కుంటారు.

తెలుగులోని దేవతాస్తుతులను మూదు విధాలుగా విభజించవచ్చు. 1. శివునికి, అతని బంధువర్గానికి, శివశరణులకు సంబంధించినవి. 2. విష్ణువుకు, అతని అవతారాలకు, అతని భార్యలకు, భక్తులకు సంబంధించినవి. 3. ఇతర దేవతలకు సంబంధించినవి. ఈ భక్తి గేయాలలో కొన్ని స్తుతులు, కొన్ని వర్ణనలు, మరికొన్ని సేవారూపాలుగా ఉన్నాయి.

**శివసంబంధ గేయాలు :**

శివునికి సంబంధించిన గేయాలలో మొదట చెప్పదగినవి గణనాథుని భక్తితో సంస్మరించే గీతాలు. గజాననుదు జానపదులకు ప్రియమైన దేవుదు. పార్వతి స్నానానికి వెళ్తూ ఒక బొమ్మను చేసి, ప్రాణం పోసి కాపలా ఉంచిందట! శివుదు వచ్చి, అడ్డుపడిన ఉమాతనయుని తల నరికి వేవాదు. తర్వాత పార్వతి ద్వారా కథంతా తెలుసుకొని ఒక ఏనుగు తల తెచ్చి అతికించాదని జానపదులలో ప్రచారంలో ఉన్న కథ చెప్తుంది. ఇది కొంత మార్పుతో మత్స్య, స్కాంద పురాణాలలో ఉంది.

తెలుగువారు, కన్నడంవారు ప్రతి పనికీ ప్రారంభంలో గణపతిని పూజిస్తారు. కన్నడ రైతులకు గణపతి ప్రధానదేవత కాదని బి.ఎస్.గద్దగి మఠగారు వ్రాశారు.[3] గణపతి పూజ ఆర్య సంస్కృతి సంస్కారమని, ఆర్యులు రాకముందునుంచే ఇక్కద ఉన్న ద్రావిడులకు ఈ పూజ అంత ముఖ్యంకాదని వ్రాశారు. గణపతి పూజకు పంట కోత కాలంలో స్థానం లేదట! అంతమాత్రం చేత గణపతి పూజ ప్రభావం ద్రావిడుల మీద





లేదనదం సమంజసం కాదు. ఎందుకంటే తాము శుద్ధ ద్రావిడులని నమ్ముతున్న తమిళులు కూడా గణపతి(పిళ్ళైయార్)ని తమ ప్రియతమ దైవంగా ఎంచుకొని పూజిస్తారు. అందువల్ల అది ఆర్య సంస్కారమని కొట్టివేస్తే వేయ వచ్చుగాని, గణపతి పూజ ప్రాముఖ్యాన్ని మనం మరవడానికి వీలులేదు.

కోలాటం ప్రారంభించేటప్పుదు గణపతిని స్తుతిస్తారు. ఈ పాటల్లో ఎన్నో రకాలున్నాయి. నేను సేకరించిన ఈ క్రింది గేయంలో ఒక్కొక్క కులానికి చెందిన వాళ్ళు గణపతిని ఎలా స్తుతిస్తారో తెలుపబడింది. దీనివల్ల గణనాథుదు అందరికీ కావలసిన దేవుదని విశదమవుతున్నది.

గణనాథ నిర్గుణ గణనాథ
గెజ్జమూర్తి మోవలింగ గణనాథ
తొడ్లమూతొ నీరు తెచ్చి గణనాథ
తోరంపు బొజ్జాలు కడిగి గణనాథ ॥గ॥
అయ్యవార్లు నిన్నే గొల్వ గణనాథ
వాళ్ళ పంచాంగమున వుందువయ్య గణనాథ ॥గ॥
కొమిడివాళ్ళు నిన్నే గొల్వ గణనాథ
వాళ్ళు తక్కిడందే వుందువయ్య గణనాథ ॥గ॥
కాపువారే నిన్ను గొల్వ గణనాథ
వాళ్ళ కాడి మేడి నుందువయ్య గణనాథ ॥గ॥
............(గంగన్న, కొమ్మేపల్లి, వాయల్పాదు తా ॥, చిత్తూరు జి ॥)

పంట కోతలప్పుదు, ఇళ్ళు కట్టదం ప్రారంభించినప్పుదు గణపతిని ధ్యానిస్తారు.

'గనపతయ్య గనపతయ్య
ఉండ్రాళ్లు నీకు పోతురా ఓ గనపతయ్య
మంద కొడిగ వుండ బోకురా'[4]

సామాన్యంగా పూజలు చేసేటప్పుదు అందరూ సిద్ధివినాయకున్ని ముందు కీర్తిస్తారు. దానికి తగ్గట్లు ఇతర దేవతలకు సంబంధించిన కొన్ని పాటల్లో ముందు గణపతి స్తోత్రంతోనే పాట మొదలవుతుంది. 'ఆదివారం పాట' సూర్యుణ్ని కీర్తించేది. అయినా పాట 'శ్రీగణాదిపతిని చిత్తాన దలతు, దలచిన మ్రొక్కేను దైవనుచు దేవ, ఈశ్వరా పుత్రుండు ఏకదంతుదు, వాక్కు శుద్ధి మాకు వరమెప్పుడొసగు' అని ప్రారంభమవుతుంది. ఇది గణపతి ప్రాముఖ్యాన్ని తెలుపుతున్నది.

శివునికి సంబంధించిన గేయాలు కూడా తెలుగులో అసంఖ్యాకంగా ఉన్నాయి. ఏగంటివారు, చిలుకపాటివారు మున్నగువారు రచించిన వచనాలు కొన్ని శివపరమైనవి, ప్రసిద్ధమైనవి. అయితే యీ కవుల రచనలు చాలావరకు ఆధ్యాత్మికాలు.

రాపాక కవులు రచించిన కొన్ని కీర్తనలు జానపదుల్లో ప్రచారంలో ఉన్నాయి. ఇవి ఓరుగల్లు, కరీంనగర్ జిల్లాలలో ఎక్కువగా వ్యాప్తి పొందాయి. 'మేలుకొనవే చంద్రశేఖర మేలుకొనవే ఇంద్రవందిత' ఇత్యాది గేయాలను వ్రాసింది శిష్టులైనా జానపదులలో ప్రచారంలో ఉన్నాయి. ఈ క్రిందిది ఒక మేలు కొలుపు.

తెల్లవారవచ్చె దిక్కులు తెలుపొందె
చక్కని నా తండ్రి మేలుకో
పురహర ఈశ్వర సమ్ముని వందిత
ఫాలలోచన హరుడ మేలుకో
సాధుజనుల బ్రోచు శంకర నా స్వామి
తెల్లవారె వేగ మేలుకో (సుశీలమ్మ, నెల్లూరు)

కోలాటాలలో కూడా కొన్ని శైవ గేయాలున్నాయి. శ్రీశైల మల్లేశుడు ఆంధ్రులకు, కన్నడిగులకు కూడా ఇష్టదైవం ఒక కోలాటం పాటలో భక్తులు-

'శరణూ మల్లేశ శరణూ మల్లేశ
శరణూ శ్రీశైల పర్వతాల మల్లేశ
గుడిమీద నందులన్ని గుబగుబలాడంగ
గురుతన్న కానవయ్య గురుడ మల్లేశ
అయో మల్లేశ బాయో మల్లేశ। [5]

అని కీర్తిస్తున్నారు.

ఈ భక్తి గేయాలలో మేలుకొలుపులు, లాలులు మొదలైనవే కాక కొన్ని సంవాదాలు కూడా ఉన్నాయి. పార్వతి, ఆమె చెలికత్తెలు పాడుతున్నట్లుగా సంవాద రూపంలో ఒకగేయముంది. దీనిలో శివుని రూపం, పార్వతి సౌందర్యం కళ్ళకు కట్టినట్లుగా చిత్రింపబడ్డాయి.

ఘల్లు ఘల్లున పాద గజ్జెలందెలు మ్రోయ
కలహంస నడకల కలికి ఎక్కడికే
    జడలోను గంగాను ధరియించుకొన్నట్టి
    మండల మేలు సాంబశివుని సన్నిధికే – మంగళం





తళతళమను రత్న తాటంకములు మెరయ
పసిడి కుండలముల పడతి ఎక్కడికే
    కరియుగ చర్మాంబరధరుడైనట్టి
    గురుడైన శంభు శంకరుని సన్నిధికే – మంగళం
చెంగావి చీరలు కొంగులు జారంగ
రంగైన నవమోహనాంగి ఎక్కడికే
పులితోలు వస్త్రాము బూది ధరించిన
    బ్రహ్మాండ మేలు జగదీశు సన్నిధికే-మంగళం
హెచ్చు పాపట బొట్టు రత్న కిరీటముతో
వెళ్ళే కరుణా కటాక్షి ఎక్కడికే
    కడుపెద్ద రుద్రాక్ష మెడను హారమును
    శిరమున వెలసిన శివుని సన్నిధికే – మంగళం (సుశీలమ్మ, నెల్లూరు)

ఇది తెలుగు వారి ఇళ్ళల్లో మామూలుగా వినిపించే పాట. ఇదే కొద్ది మార్పులతో ఎల్లోరాగారి 'సరాగాల'లో అసంపూర్ణంగా ఉంది. స్తుతి గీతాలలో కొన్ని హారతుల రూపంలో ఉంటాయి. ప్రతిరోజూ పూజ తర్వాత అంబకు హారతియిస్తూ-

హారతి మీరేల ఇవ్వారే అంబకు మంగళ
    హారతీ మీరేల ఇవ్వారే
హారతీ మీరేల ఇవ్వరె జ్ఞాన విద్యల కెల్ల ప్రబలము
లీలతో పదియారు వన్నెల మేలిమీ బంగారు తల్లికి ॥హా॥
(విజయమ్మ, నెల్లూరు)

అని పాడుతుంటారు తెలుగు స్త్రీలు.

నాగన్న మీద కూడా స్త్రీలకు ఎంతో భక్తి. భక్తికన్నా వాత్సల్యం ఎక్కువనాలి.

'పుట్టలో నాగన్న బూచి నాగన్న
ఎండలో పడుకోకు వెర్రి నాగన్న
కలవారు ఇళ్ళలో గర్వంబు వారు
కాలాపి జల్లేరు కాళ్లదన్నేరు'[6]

అన్నదొక భక్తిగీతం. జానపదులకు కలవారి కండ కావరం ఎటువంటిదో తెలుసు. 'వాళ్ళు ఎంగిళ్ళు యేసేసి భంగపుస్తార'ని హెచ్చరిస్తారు పల్లె పడుచులు.

**విష్ణు సంబంధ గేయాలు :**

విష్ణువు త్రిమూర్తులలో ఒకడు. సత్వ ప్రధానమైన దేవత. ఈయన ఎత్తిన నది అవతారాలలో రామ, కృష్ణావతారాలు జానపదులకు అత్యంత ప్రీతికరమైనవి, మహా విష్ణుని పది అవతారాలలో రామావతారం ఏడవది. ఇది ఈ వైవస్వత మన్వంతరంలోని 24వ త్రేతాయుగంలో జరిగిందని హిందువుల నమ్మకం. కృష్ణావతారం ఎనిమిదవది. అది ఇప్పటి వైవస్వత మన్వంతరంలో 28వ ద్వాపర యుగంలో జరిగిందంటారు.

రాముడంత ఇష్టమైన తండ్రి, సీతవంటి చల్లని తల్లి తెలుగువారికి మరెవ్వరూ లేరు. 'సీతమ్మ మాయమ్మ శ్రీరాముడు నాకు తండ్రి' అని త్యాగయ్య గానం చేయడానికి ముందే తెలుగువారు వాళ్ళను తల్లిదండ్రులుగా స్వీకరించారు. రామదాసు కీర్తనలు సలక్షణంగా, సంప్రదాయనుసారంగా ఉన్నప్పటికీ చాలావరకు జానపద గేయాలుగా మారిపోయాయి.

పొద్దున లేవగానే తమతండ్రి రామయ్యకు మేలు కొలుపులు పాడుతారు తెలుగు తల్లులు. 'పుత్రకామేష్టియందు పుట్టిన శ్రీరామ పుండరీ కాక్షుడ మేలుకో-అండజవాహన అభయమివ్వర మాకు అయోధ్య రామమేలుకో' అంటూ రాముడు పుట్టింది మొదలు సీతను పెళ్ళాడి నంతవరకు ప్రీతితో తలచుకుంటారు.

రాముడిమీద గేయాలలో భజనగేయాలు, భక్తి గీతాలు, కామిక్ పాటలు ఇత్యాది నామాలతో ఉన్నవి దొరకుతాయి. ఈ క్రింది దాన్ని 'కామిక్ పాట' అంటారు.

రామయ్య రామదేవరా ననుగన్న తండ్రి
రావయ్య రామభూవరా
రావయ్య రాముడా రఘువంశ సోముడా
యీవయ్య అభయము యీ వేళ మాకందరికిని ॥రా॥
...........(గంగన్న, కొమ్మేపల్లి, వాయల్పాడుతా॥)

రామదాసు రచించిన కీర్తనలలో 'పలుకే బంగార మాయెనా, కోదండపాణి' వంటివి జానపదులలో కూడా చొచ్చుకొని పోయాయి. శ్రీరామనవమి మొదలైన సందర్భాలలో రామదాసు పాటలు భక్తుల నోటిలో నిండుగా ఉంటాయి; పిలిస్తే పలుకుతాయి.

సీతమ్మ పేరెత్తితేనే తెలుగు పడుచుల గుండె ఝుల్లు మంటుంది. సీత పేరు చెప్తేనే వారి ఒళ్ళు పులకరిస్తుంది. భక్తితో పరవశిస్తుంది. అందుకే ప్రతిదినం సీతమ్మను





మేలుకొలుపుతూ తెలుగు స్త్రీలు పాడే యీ క్రింది పాటలో జానపదులకు సహజమైన నిసర్గ సుందర భావాల గుసగుసలు వినిపిస్తాయి. మనల్ని అలరిస్తాయి.

అమ్మా సీతమ్మ మా తల్లి ముద్దులగుమ్మ
లేవె బంగరు బొమ్మ లేవమ్మా
లేచి వేగమె నీవు లేపుమీ రాముని
లోక రక్షణి రాణి లేవమ్మా-తెల్ల వార వచ్చెనూ
........ అత్త మామ మరదులు తోడి కోడళ్ళు
అపుడె లేచున్నారు లేవమ్మా
అదియేమె మాయమ్మ అలసి నిద్రించేవు
అత్తవారిల్లిది లేవమ్మా-తెల్లవారవచ్చెనూ (శారదాంబ, నెల్లూరు)

చివరి రెండు పాదాలలో తెలుగువారి సంస్కృతి, కుటుంబ మర్యాదలను ప్రతిబింబించే జానపద హృదయం తొంగి చూస్తున్నది. కలకాలం గుర్తుండే పాదాలివి.

ఇక విష్ణు రూపాలైన కృష్ణుడు వేంకటేశ్వరుడు, పాండురంగడు, రంగనాథుడు మొదలైన వాళ్ళను గూర్చి అసంఖ్యాకంగా స్తుతులున్నాయి. 'భగవన్నామ సంకీర్తనలు' అనే పేరుతో ప్రచురింపబడిన పుస్తకాలలో పెక్కు భక్తిగీతాలున్నాయి. వీటిలో కొన్ని జానపద గేయాలుగా చలామణీ అవుతున్న శిష్టుల రచనలు. ముద్రితమైన వాటిలో 'పాండురంగ భజన కీర్తనలు' కూడా పేర్కొనదగ్గది.

రంగారంగారంగారంగా శ్రీరంగాయనుడీ
మంగళకరుడగు పాండురంగని మదిలో తలచండి'

మొదలైన ప్రసిద్ధ కీర్తనలు పాండురంగని గూర్చి ఉన్నాయి. 'గోవిందుని పాటలు' అనే మరొక పుస్తకంలో 'గోవింద' అనే మకుటంతో పాటలున్నాయి.

గోవిందు డేల రాడే గోపాలు డేల రాడే
ముత్యాల పందిటిలో రత్నాల వాన గురిసె
మత్స్యావ తారు డేడే-గోవిందా..........

అనే పాటను పొలంపనులు చేసేటప్పుడు కూడా నెల్లూరు జిల్లాలో పాడుతారు.

మేలు కొలుపులలో, లాలి పాటలలో, మంగళ హారతులలో విష్ణు స్వరూపాలను కొలుస్తారు జానపదులు.

కేశవయని నిన్ను వాసిగ భక్తులు
వర్ణింపుచున్నారు మేలుకో

వాసవ వందిత వసుదేవ నందన

వైకుంఠ వాసుడ మేలుకో-మేలుకో

నారాయణ నిన్ను నమ్మిన భక్తుల

కరుణ బ్రోవ వేగ మేలుకో

శరణన్న రక్షణ బిరుదు నీకున్నది

శశిధర సన్నుత మేలుకో-మేలుకో (సుశీలమ్మ, నెల్లూరు)

అనే పాట తెలుగు వారిళ్ళల్లో అధిక ప్రచారం పొందింది.

పసి పిల్లలు దేవునితో సమానం. దేవునికుండే పేర్లు అన్నిటితోను తమ పిల్లల్ని కూడా పిలుచుకుంటారు తల్లులు.

'లాలి మాధవుడలాలీ గోవింద

లాలి అచ్యుతుడ లాలీ

లాలి కేశవుడ లాలీ హరి హరీ

రామ రఘురామ లాలీ

మాణిక్య స్తంభములనౌ అమరినవి

ఆణిముత్తెపు చేరులూ

నాణెముగ క్రీడించెనే, కుందనపు

రాణులూ చేరుయ్యాలా ॥లాలి॥[7]

జానపదులకు దేవుని భక్తి ఎంతవరకు ఉందంటే 'నోరు నొవ్వంగ నొక్క సారి గోవిందయని పరమార్థమున భజన చేయని వారుంటేనేమి పోతేనేమి' అని ఖచ్చితంగా పాడుతారు.

విష్ణువును గూర్చేకాక విష్ణుభక్తుడైన రామానుజాచార్యునికి సంబంధించి కూడా ఒకటి రెండు పాటలున్నాయి. తన్ను రక్షించ వలసిందని ఒక వైష్ణవుడిలా వేడుకుంటున్నాడు.

'రామానుజాచార్యా నన్ను రక్షించి దయనేలయా

పామరుడను క్రూర పాపిని ద్రోహిని పరమ

చండాలుడనూ................'[8]

**ఇతర దేవతలు :**

శివుడు, విష్ణువు భారతీయులకు ప్రధాన శిష్ట దేవతలు. జానపదులకు వీరే కాక అనేక క్షుద్ర దేవతలు కూడా నిత్య జీవితంలో కావలసిన వారు వివాహ సమయంలో





దంపతుల నాశీర్వదించాలని ప్రార్థించే దేవతలలో బ్రహ్మదేవుడు కూడా ఒకడు.

హంస వాహనుడు అభ్యాసనుడు నారాయణ సుతుడు

పాణి తలమున వీణా కలిపిన వాణి విభుడు

వేదా జనకుడు వేదాతీతుడు వేదాంతార్థ విచారపరుడు

బ్రహ్మదేవుడు రక్షించు ఈ దంపతులనూ

ఈ పాటలోనే సూర్యాది గ్రహముల ఆశీర్వాదం కూడా కావాలని ముత్తైదువలు కోరుతారు.

రక్తవస్త్ర ప్రీతి కరుడు రక్తాంబర ధరుడు

రక్త పాత్రుడు ఋగ్వేదుడు రాచ కార్యుడు

పదమూ డారిట ఫలదాయకుడు

పంచమి రాశిన నివశించుండు సూర్యగ్రహము

రక్షించు ఈ దంపతులనూ (శారదాంబ, నెల్లూరు)

కొందరు తెలుగు వారికి కాలేషా మస్తాను కూడా ఆరాధ్యదైవం. నెల్లూరు దగ్గర కసుమూరు అనే ఊరుంది. అది ఎప్పుడూ యాత్రికులతో నిండి ఉంటుంది. గాలిదయ్యాల చేత పీడింప బడే వాళ్ళను మస్తాను తప్ప బాగు చేస్తాడని పలువురి నమ్మకం. ఆ ఊరిలో ఏడు 'దర్గా' లున్నాయి. మూడు రకాల నూనెలు మస్తాను దగ్గర పెట్టి రాచుకుంటే ఎలాటి నొప్పులైనా పోతాయని ఒక నమ్మకం. దయ్యాలవీ తరిమి వేయబడిన తర్వాత మస్తానే కలలో కనిపించి వెళ్ళిపొమ్మని చెప్తాడట! ఈ మస్తాను మీద అనేక కీర్తనలు ప్రచారంలో ఉన్నాయి. ఇంద్రకంటి సూర్యకాంతంగారు 'కాలేషామస్తాన్ దేవుని కీర్తనలు' రచించారు. అవికాక ఈ క్రింది పాటవంటివి ప్రజలలో ప్రాచుర్యాన్ని పొందాయి.

నిన్ను చూడ వచ్చాను మస్తానయ్యా

నన్ను కాపాడు మా మస్తానయ్యా

పుట్టలో పుట్టినట్టి మస్తానయ్యా

కస్మూర వెలసిన మస్తానయ్యా

మౌలాలి నిన్నె గొల్చె మస్తానయ్యా

మమ్మూ కరుణతో కావుమయ్య మస్తానయ్యా

(రంగయ్య, గూడూరు, నెల్లూరు జిల్లా)

**కర్మ మార్గం :**

కర్మలు నిత్యములు, నైమిత్తికములు, కామ్యములు, నిషిద్ధములు అని నాలుగు విధాలు. శరీరారోగ్యం కోసం ప్రతినిత్యం చేసే స్నానం, సంధ్య మొదలైనవి నిత్యకర్మలు. దుష్టగ్రహశాంతి కోసం, ప్రాయశ్చిత్తాదుల కొరకు చేసే వ్రతాదులు నైమిత్తిక కర్మలు. వర్షాలు కురవడంకోసం, పుత్ర ప్రాప్తి కోసం యజ్ఞాదులు చేయడాన్ని కామ్యకర్మలంటారు. సురాపానాదులు నిషిద్ధ కర్మలు.

వేదాంతులు కర్మమార్గాన్ని నిరసించినా వేదాదులన్నీ కర్మలకూ ప్రాధాన్యమిచ్చాయి. యజుర్వేదం యజ్ఞాది కర్మలను గూర్చి చెప్తున్నది. అయితే యజ్ఞయాగాదులు సామాన్య జనుల కందుబాటులో ఉండేవి కావు. అందరికీ పనికివచ్చే కర్మకాండలు కొన్ని ఉన్నాయి. అలాంటి వ్రతాలు, నోములు, జాతరలు మొదలైన సందర్భాలలో జానపదులు పాటలను కట్టుకొన్నారు. ఈ నోములకు, వ్రతాలకు సంబంధించిన నమ్మకాలు ఈ నాటికీ వేళ్ళు పాతుకొని ఉన్నాయి. ఈ కర్మలు చాలావరకు స్త్రీలకు సంబంధించినవి. వరలక్ష్మీ వ్రతం, మంగళగౌరీవ్రతం, లక్ష వత్తుల నోము, తులసినోము, మోచేటి పద్మం నోము, మదన ద్వాదశివ్రతం మొదలైనవి స్త్రీలు నోరు కొనేవి. పురుషులకు సంబంధించిన కర్మకాండలలో జాతరలు ముఖ్యమైనవి. గంగమ్మ, ఎల్లమ్మ, బాలమ్మ మొదలైన దేవతలకు సంబంధించిన జాతరల పాటలున్నాయి.

మనిషి జీవితంలో కర్మకాండలకు అత్యంత ప్రాచీన కాలంనుంచి ప్రాధాన్యం కనిపిస్తుంది. గుహాంతర వాసిగా మనిన మానవుని జీవితం మానవాతీత శక్తులతో ముడివడి ఉండింది. మనిషి అనుదినమూ తన సుఖ దుఃఖాలను ఏదో ఒక పేరున తానే కల్పించిన మానవాతీతశక్తుల ముందు వ్యక్తీకరించేవాడు. మానవతీత శక్తుల ప్రీత్యర్థం సామూహికంగా కర్మకాండల నాచరించేవాడు. పారమార్థిక గీతం ప్రాచీన కర్మకాండల కాలంలోనే వెలువడింది. "In a world where ceremonies provide a main focus for social life, song is among the chief of them and is used both to communicate with the supernatural and to express joy or grief or other strong emotion"[9],అన్న సి.పి.బౌరా మాట గమనించదగ్గది.

తెలుగులో కర్మకాండలకు సంబంధించిన స్త్రీల పాటలు వందలకొద్దీ లభ్యమౌతున్నాయి. శ్రావణమాసంలో మంగళవారాలు, శుక్రవారాలు గృహిణులకు పర్వదినాలు. పచ్చ తోరణాలు, పసుపు కుంకుమలు, పేరంటాళ్ళతో ఊరంతా కళ కళలాడుతుంటుంది. శ్రావణ మంగళవారం మంగళ గౌరీవ్రతాన్ని, శుక్రవారం





వరలక్ష్మీవ్రతాన్ని జరుపుకుంటారు. ఒకటి శివ సంబంధమైంది, మరొకటి విష్ణు సంబంధమైంది.

గౌరీవ్రత సందర్భంలో 'గౌరీదేవికి పూజచేద్దాము రండి' అంటూ స్త్రీలు పాట పాడుతారు. ఈ పాటలో గౌరికి పూజ చేయడం, పుష్పాలతో అలంకరించడం, నైవేద్యం పెట్టడం మొదలైన కర్మకాండ వివరించబడింది.

పూజ చేతాము రారె మన గౌరుకు
పూజా చేతాము రారె తేజముగను
మన రాజీవాక్షులందరు జాజీపూల ॥పూ॥
బంగారు తట్టలోన పొంగుచు పుష్పములు
మంగళ వాయిద్యముల అంగనకూ ॥పూ॥
గంధ కుంకుమ ఆనందముగను మన
ఇందు వదనలారావిందాక్షికి ॥పూ॥
దుండు మల్లేపూలు చెండు చామంతిపూలు
దండా కట్టీమెడ నిండా చుట్టి ॥పూ॥
పంచముఖుని రాణి చెంచు లక్ష్మీగౌరు
పంచ భక్ష్యా పరమాన్నము పెట్టి ॥పూ॥
సురలు నారదులు కిన్నరులూ స్తుతి చేయ
మంగళ వాయిద్యముతో మన గౌరికి ॥పూ॥ (సుశీలమ్మ, నెల్లూరు)

శ్రావణ శుక్రవారం నాడు వరలక్ష్మీ వ్రతాన్ని చేసుకుంటారు. కలశానికి ముక్కు చెవులు పెట్టి, ఆభరణాలతో అలంకరించి, మొగలి రేకుల జడకుట్టి, కలశంపైన టెంకాయ పెట్టి పూజ చేసుకుంటారు. ఆ సందర్భంలో లక్ష్మీదేవిని గూర్చిన అనేక గీతాలు వినిపిస్తాయి.

ఎట్లా నిన్నెత్తు కొందూనమ్మా వరలక్ష్మీ తల్లి ॥ఎట్లా॥
అట్లాడే బాలవు నీవు ఇట్లా రమ్మని పిలిచి
కోట్లా ధనమిచ్చే తల్లీ పసి బాలవైతే
ఎత్తుకొందు వరలక్ష్మీ...................... (శారదాంబ, నెల్లూరు)

అనే పాట ఆ వ్రత సందర్భంగా పాడే వాటిలో ఒకటి.

మోచేటి పద్మం నోమొకటి ఉంది. నేదునూరి గంగాధరంగాను 'సెలయేరు'లో ఇచ్చిన పాట ఒకటి ఈ నోము సందర్భంలో పాడేది లాగుంది.

'మోచేటి పెద్దమ్మ నోచేటి వేళ
మొగ్గల్లు తామరలు పూసేటి వేళ
బీరాయి పువ్వులు పూసేటి వేళ
బిందెలతో ఉదకమ్ము తెచ్చేటి వేళ........'

ఇంకా ఇటువంటి పాటలనేకం ఉన్నాయి. కామేశ్వరీవ్రతం, చిక్కుళ్ళ గౌరీవ్రతం, ఏకాదశీ వ్రతం మొదలైన సమయాల్లో పాడే పాటలు కూడా కొన్ని ఉన్నాయి. నాగులకు పూజ చేయడం కూడా స్త్రీలు భక్తితో చేసే కర్మ. నాగపూజ చాలా ప్రాచీన కాలంనుంచి వస్తున్నది నాగుల చవితికి, నాగపంచమికి ఉపవాసాలుండి, పుట్టలో పాలు పోసివస్తారు. నాగపూజ చేసే సందర్భంలో ఈ క్రింది పాట పాడుతారు.

'నాగుల చవితికి నాగన్న–స్నానం సంధ్యల నాగన్న
పూలు పడగలు నాగన్న–మడిగట్టులతో నాగన్న
చిమ్మిలి చలిమిడి నాగన్న–పాలూ పండ్లూ నాగన్న
దివిటీ తేజున నాగన్న–ఉపవశించుచూ నాగన్న
ఉద్యాపించుచు నాగన్న–ఊరేగిస్తాం నాగన్న
పుట్టకు వస్తాం నాగన్న–పూజలు గొనరా నాగన్న'[10]

అగ్రవర్ణాలవారు పూజలూ, వ్రతాలూ, నోములూ చేస్తే మిగిలినవారు ఎల్లమ్మ, గంగమ్మ మొదలైన వారిని కొలుస్తారు. వారికి జాతరలను జరిపిస్తారు. రేణుకాదేవే ఎల్లమ్మ. ఈమెను గూర్చిన కథాగేయాలు కన్నడంలోను, తెలుగులోను ఉన్నాయి. కరీంనగర్‌లో ప్రచారంలో ఉండే ఈ క్రింది పాటలో ఎల్లమ్మను సేవించే విధానం వర్ణింపబడింది.

'ఏడేడు బోనాలతోనూ ఏడేడు జమిడికెలతోను
కొల్తురూ ప్రజలంత ఎల్లమ్మనూ
కల్లులోట్లాతో కోడి పుంజులతో
సార సీసాలతో గొఱ్ఱెపోతులతో
ఎల్లమ్మను గొల్తురూ వేడుకాతోను'[11]

స్ఫోటకానికి సంబంధించిన దేవతయైన పోచమ్మ, ఇతర సాంక్రామిక దేవతల మీద గేయాలున్నాయి. రాయలసీమ ప్రాంతంలో గంగమ్మను ఎక్కువగా కొలుస్తారు. గంగమ్మ శివుని భార్యయైన గంగమ్మ అని కొందరి అభిప్రాయం. గ్రామదేవత అయిన గంగమ్మను గూర్చి వింత కథలున్నాయి. అటువంటి వాటిలో ఈ క్రిందిది ఒకటి.





ఒక నాలవ జాతివాడు పురాణాలు, శాస్త్రాలు అన్నీ చదువుకొని బ్రాహ్మణుడినని చెప్పుకొని మోసంతో ఒక బ్రాహ్మణ స్త్రీని వివాహం చేసుకున్నాడు. ఒకసారి ఉగాది సందర్భంలో అతని కొడుకులు తండ్రివల్ల వచ్చిన సంస్కారంతో పోళీలు ఎనుబోతు నాలుకలా ఉన్నాయన్నారట! అప్పుడా బ్రాహ్మణ స్త్రీ నిజం తెలుసుకొని భర్తను ఎనుబోతు కమ్మని శపించింది. కొడుకుల్ని మేక, గొఱ్ఱె, కోడి కండని చెప్పింది. ఎనుబోతు ఆమెను తరిమి కొట్టింది. ఆమె ఒక పుట్టలో దాక్కొనింది. ఎనుబోతు పుట్టను కాళ్ళతో తలతో కుమ్మగా ఆమె కోపం పెట్టలేక 'నీ తలను నరికించి, నీ కుడికాలును నరికి నీ నోట్లో కరిపించి, నీ రక్తం నా నుదుట అలంకరించు కుంటాను' అన్నది. ఆమె గంగమ్మట! ప్రతియేటా చిత్తూరు జిల్లాలోని పుంగనూరు మొదలైన చోట్ల ఉగాదికి ముందు వచ్చే మంగళవారం గంగమ్మ జాతర జరుపుతారు. జాతరకు ముందురోజు సంత జరుగుతుంది. మొక్కు బళ్ళు ఉండే వాళ్ళు పశువులను కొంటారు. ఇళ్ళలో అందరూ గరిగలు (కుండలు) ఉంచి వాటిపై వేపాకులు మొదలైనవి అమర్చి పూల కుచ్చు లాగా చేస్తారు. ఎక్కడ చూచినా గంగలకు బలులివ్వగా వచ్చిన రక్తపు మడుగులే కనిపిస్తాయి.

గంగమ్మ గుడికి వచ్చేటప్పుడు పాటలు పాడుకుంటూ వస్తారు. ఎనుబోతును బలి ఇస్తారు. గంగమ్మ కోపం చల్లారిన తర్వాత, బలి అన్నాన్ని, ఎనుబోతు పొట్టలోని కలుషాన్ని చేటలో తీసుకొని ఊరిలో అందరి ఇళ్ళముందు చల్లుతారు. ఈనాటికి కూడా ఆచారాలన్నీ చాలా వరకు సాగుతూనే ఉన్నాయి.

పుంగనూరులో గంగమ్మ జాతర సమయంలో ఈ పాటను పాడుతారు.

1. నిలునిలు గంగమ్మ తల్లి, నిలువమ్మా గంగమ్మ తల్లి
నీ వల్ల మేము బ్రతికేము
2. నిలువ లేను నే నిలువలేను జాగు చేయలేను
నే జాగు చేయలేను పోతాను నేను
మదవాద చెరువుకి
3. విను విను నీళ్ళ గండెప్ప వినప్పా
వినప్పా నీళ్ళ గంటప్ప
నిలిచి నేను మాట్లాడ లేను
పోతాను నేను మదవాద చెరువుకి

4. విను విను గంగమ్మ తల్లీ వినమ్మా గంగమ్మ తల్లీ
కొమ్ములు తిరిగిన పొటేలి నిచ్చేనో
ఒక పుట్టి బీము దీపాలు పెట్టేను
కొమ్ములు తిరిగిన ఎనుపోతు నరికేను.........
(కరిబసవయ్య, పుంగనూరు)

రాయల సీమలో మామూలుగా ప్రతి ఊరిలో ఒక గంగమ్మ గుడి ఉంటుంది. ఒక్కొక్కరు ఒక్కొక్క విధమైన కథ చెప్తారు. వాయల్పాడు తాలుకా, మేడికుర్తిలో–

ఏడు పొలి మేర్లు దాటినావమ్మా
ఏటి వర్తన నీవు వచ్చినావమ్మా
వచ్చి మేడి కుర్తిలో నిలిచి నావమ్మా....... (చెంచమ్మ, మేడికుర్తి)

అని పాడుతారు. చంద్రశేఖర శతకంలో కూడా గంగమ్మ జాతర ప్రసక్తి ఉంది.

'యిరియిగ సూస్తి తీరతము లెన్నెనో; ఆ దొనకొండ గంగజా
తర సరిరావు; పంబలును తప్పెటలున్, కొముకాండ్ల సింద్ల సం
బరము బలుంట; దింకొక పెబావము, రంకుల రాటమెక్కినే
తిరిగిన సాటిగాదని నుతించును మూర్ఖుడు చంద్రశేఖరా!'

దీన్ని బట్టి పండితులకు జాతరలంటే యెంత నిరసన భావమో తెలుస్తుంది.

**వేదాంత మార్గం :**

ఇదే జ్ఞాన మార్గం. అన్నిటిలోకి ఇది విశిష్టమైందని పెద్దల ఉవాచ. వేదాంత గేయాలనే తత్వాలంటారు. శంకరుని అద్వైత వేదాంతంలో జ్ఞాన యోగం యొక్క సంపూర్ణ వివరణం ఉంది. జ్ఞానమంటే సంపూర్ణ ఆధ్యాత్మిక అనుభవం. తత్వమెరిగిన వాడికీ లోకంలో హేయోపాదేయాలు ఉండవు. అతనికి సర్వమూ ఒకటిగానే భాసిస్తుంది.

మోక్ష సాధనమైన జ్ఞానమార్గాన్నే వ్యవహారంలో వేదాంతమని పిలుస్తారు. దీన్నే తత్వమని, దర్శనమని కూడా వ్యవహారంలో అంటారు. 'నేనెవణ్ని? ఈ ప్రపంచం ఎందుకు పుట్టింది? ఈ ప్రపంచానికి నాకు ఏమిటి సంబంధం?'– వీటిని గూర్చి, ఇలాంటి వాటిని గూర్చిన చింతనే తత్వం.

జానపదులకు ఉపనిషత్తులు, దర్శనాలు, తాత్విక శ్లోక సముదాయం తెలియదు. కానీ వాళ్ళకూ, వాళ్ళ తాహతుకు తగ్గట్లుగా ఏదో వేదాంతం ఉండనే ఉంది– అది





ఎక్కువగా మెట్ట వేదాంతమే కావచ్చు. అక్షర బద్ధమైన శిష్ట వేదాంత సాహిత్యం పండితులకు మాత్రమే వేద్యమై ఉండగా, వాగ్రూపమైన జానపద తత్వాలు ప్రతి చెవికీ ఇంపుగా ఉంటాయి. ఇవి ప్రతి జానపదుని నోరనే గాదెలో ధాన్యంగా పాతబడుతుంటాయి. జానపద తత్వాలలో ఎక్కువగా అద్వైతం కనిపిస్తుంది. ఇంకా రాజయోగం, అచల వేదాంతం, గురుభక్తి, కులమతాదుల నిరసన, అహింస మొదలైనవి ప్రతిపాదింపబడి ఉంటాయి. వీరబ్రహ్మం, పరశురామపంతుల లింగమూర్తి, ఎడ్ల రామదాసు మొదలైన వారి తత్వాలు జానపదులలో కూడా ప్రచారమయ్యాయి. ఇవి మార్మిక కవిత్వానికి ఉదాహరణలు. కొన్ని తత్వాల అర్థం బోధపడదు. అయినా వాటిలోని గూఢార్థాలు తెలీక పోయినా జానపదులు ఆ బరువైన సొమ్ములను వేసుకొని, వేసుకొని అలవాటు చేసుకొన్నారు.

'సీత పాట', 'నారాయణ శతకము', 'రామ రామ శతకము', 'వచన కాల జ్ఞానము', 'ఆత్మబోధామృత తత్త్వము', 'కలి ప్రమాణతత్వ కీర్తనలు', 'కాల జ్ఞాన తత్వములు', 'శుద్ధ నిర్గుణ తత్వ కందార్ధదరువులు', 'తారకామృత సారము' మొదలైనవి అచ్చయిన తత్వగేయాల సంకలనాలు. వీటిలో ఏగంటి, ఎడ్ల రామదాసు, నారాయణ దాసు, హరిదాసు, పిడుపర్తి వారు, చిలుకపాటి వారు మొదలైన వారి రచనలున్నాయి. ఇవికాక అసలు సిసలైన జానపద తత్వాలు కూడా వీటిలో చేరి ఉన్నాయి.

పిడుపర్తి వారి వచనాలను వ్రాసింది ఎవరో తెలియదు కాని, ఇవి పిడుపర్తి మల్లికార్జునునికి అంకితం చేయబడ్డాయి. వీటిలో

యేమందురా లింగ యేమందురా
యేమందు యీ మాయ ఆ మందు నీపై
కామాంధుని జేశి కడతీర నీయనందు[12] ॥కేమందురా॥

మొదలైన గేయాలున్నాయి.

చిట్టన్నగారి వచనాలు శ్రీగిరి మల్లికార్జునునికి అంకితమయ్యాయి. గ్రంథాదిని చిట్టన్నగారి వచనాలని ఉన్నదిగాని దీనికీ పేరు ఎలా వచ్చిందో తెలియదు.

'అంచితంబుగ నాత్మ నష్టదళముల నెపుడు
మించి వెలిగెడి లింగ మెరిగన్న దెరుక
అన్నియును గురుడనుచు అరసి చూచుచు
మదిని పన్నుగా వున్నది పరమ యెరుక
చెన్ను మీరగ శ్రీగిరీశ్వరుని కృపజేరి

చిన్న బుద్ధులు మాని వున్నదె యెరుకా'[13]

అని ఎరుకను గూర్చి వ్రాసినారు చిట్టన్నగారు. చిలుకపాటి వారి వచనాలు కూడా ఎక్కువ ప్రచారంలో ఉన్నాయి. అజ్ఞానులను గూర్చి ఈయన చెప్పిన తత్వం ఇలా ఉంది.

'చెలని చెలములు బలుశృతిగాన్క
చిలుకల చదువులు చదివితిరో
ఎలుకల వలె తొడాకులు గొరుకుచు
ఏచి బోనుల కెగిరితిరో
కలకల నవ్వుచు పడుచుల వలె
వుమ్మెత్త కాయదిని కళదప్పితిరో
ఎలికె పిండిదిని కడుపుచ్చితిరో
తెలియ కడవి బడి తిరిగితిరో'[14]

వీరబ్రహ్మంగారి కాలజ్ఞాన తత్వాలకు ఆంధ్రదేశంలో మంచి ప్రచారం ఉంది. వేమనకు కొంత చదువుకొన్న వాళ్ళలో ఉన్నంత ప్రచారం పోతులూరికి జానపదుల్లో ఉంది. కాలజ్ఞానమంటే భవిష్యత్ జ్ఞానం. యోగులు భూత భవిష్యద్వర్తమానాలను మూడింటినీ ఎరుగగలరు. కాలజ్ఞాన తత్వాలు వీర బ్రహ్మంగారితోనే పుట్టకపోయినా తత్వ ప్రచారంలో బ్రహ్మంగారనుసరించిన పద్ధతి పలువురి నాకర్షించింది. ఆయన ఉపయోగించిన ఉపమానాలు చాలవరకు నిత్య జీవితంతో సంబంధముండేవి కాబట్టి వాటి కనన్యప్రచారం లభించింది. వీర బ్రహ్మంగారి పై భక్తిగల వారెవరో 'కలియుగ మాహాత్మ్యము–వచన కాలజ్ఞానము' అనే పుస్తకం వ్రాశారు. అందులో వీరబ్రహ్మంగారి మీద వెలసిన గేయాలు కూడా ఉన్నాయి. పోతులూరి వారి శిష్యుడైన దూదేకుల సిద్ధయ్య తత్వాలు కూడా బహుళ ప్రచారం పొందాయి. 'ఏ కులమని నను వివరమడిగితే ఏమని చెప్పుదు లోకులకూ' అనేది అధిక ప్రచారం గల గేయాలలో ఒకటి.

తిత్తితత్వాలు అన్నవికూడా తెలుగు దేశంలో ప్రచారంలో ఉన్నాయి. ఒక తిత్తినిండా గాలి నింపుతారు. సంగీతపుగొట్టంగుండా ఆ గాలి వచ్చేటప్పుడు మధుర శబ్దం వినిపిస్తుంది. సాధువులు తత్వాలు పాడుతూ వ్యాఖ్యానం చేస్తూ శ్రోతలకు వేదాంతాన్ని బోధిస్తారు. తిత్తిలో గాలి ఒత్తిడి తగ్గేసరికి పాట ఆపి మళ్ళీగాలి ఊది పాట ఎత్తుకుంటారు.[15]





వేదాంతానికి, హాస్యానికి చుక్కెదురు. కాని కొన్ని తత్వాలలో హాస్య ప్రవృత్తి కనిపిస్తుంది. ఈ క్రింది తత్వం బహుళ ప్రచారంలో ఉంది.

దేముడయ్యా దేముడూ మాయదారి దేముడూ
ఊరెల్లా యిండ్లు జేశె నోరెల్లా పళ్ళు జేసే ॥దే॥
మంచమెల్లా కళ్లు జేసె మంచెల్లా నీళ్లు జేసే ॥దే॥
నల్లనీ మేకలా పాలూ తెల్ల జేశె దేముడూ
తెల్లని పాలల్లో నీళ్లు నల్ల జేశె దేముడూ ॥దే॥[16]

మామూలుగా తత్వాలలో రూపకాలు ఎక్కువగా ఉంటాయి. మర్మ భావాలు అధికంగా కనిపిస్తాయి. కొన్ని గేయాలలో జీవితంపై రోసిన వారు తమ జన్మను 'రద్దు' చేయవలసిందని గురువును వేడుకోవడం కనిపిస్తుంది.

వదలాను మీ పాదము సద్గురుదేవా
రద్దు చేయుము జన్మము
ముందు జన్మము నందు వచ్చిన గబ్బు దేహము
రద్దు చేయుము.......(రమణ, మేడికుర్తి)

పడవ పాటలలో కనిపించే వేదాంతాన్ని గూర్చి ఇంతకు ముందే చెప్పడమైంది. మొత్తం మీద జానపదులు సృష్టించిన తత్వాలు లోతైన వేదాంతాన్ని వెతుక్కుంటూ పోక పోయినా, వాళ్ళకర్థమైన రీతిలో వేదాంతాన్ని గేయాలలో తెలియ జెప్పడం కనబడుతుంది. ఏది ఏమైనా ఈ జగత్తు, మానవ జన్మ, జనన మరణాలు ఇత్యాదుల్ని అర్థం జేసుకోవాలనే తహతహ జానపదులకు కూడా ఉందనడానికి ఈ జానపద తత్వాలే సాక్షి.

## కన్నడం

**భక్తి గేయాలు :**

తెలుగులో లాగే కన్నడంలోనూ భగవంతుని సంబోధిస్తూ పాడే పాటలు కొన్ని ఉన్నాయి. తెలుగు భక్తి గేయాలలో కొన్ని పొలంపాటలు, వేడుక పాటలు, కోలాటాదులలో ఉపయోగింపబడే పాటలు ఉన్నాయి. అట్లే కన్నడంలో కూడా పొలంలో నీరు కట్టేటప్పుడు, కలుపు తీసేటప్పుడు, బంతి తోలేటప్పుడు కొన్ని భక్తి గీతాలనాలాపిస్తారు. తిరుగలి పదాలలో, రోకటి పాటలలో అనేక స్తుతులు కనిపిస్తాయి. కోలాటాలలో, పెళ్ళి పాటలలో, వేడుక పాటలు మరికొన్నిటిలో కూడా భక్తిగేయాలు సాక్షాత్కరిస్తాయి.

ఈ విధంగా భక్తి సామాన్య జీవనంలో విడదీయరాని భాగంగా చెలామణీ అవుతున్నది.

**శివ సంబంధ గేయాలు :**

తెలుగులో ఉన్నట్లే గణపతికి సంబంధించిన భక్తి గీతాలు కన్నడంలో అనేకం కనిపిస్తాయి.

కోలాటంలో ప్రథమస్తుతి గణనాయకునికే చెల్లుతుంది. కన్నడిగుల కోలాటాలలో ప్రసిద్ధమైన గణపతి స్తుతికి ఒక తెలుగు పాటకూ సాదృశ్యం కనిపిస్తుంది. తెలుగు పాటలో వినాయకుడికి ఎన్నో పదార్థాలు పెట్టి సంతృప్తి పరుస్తామని చెప్పినట్లే కన్నడ గీతంలో కూడా ఉంది. ఈ క్రింది గణనాయకుని స్తుతిలో జానపదుడు కరుణ చూపుమని వేడుకుంటున్నాడు. గణపతికి పళ్ళు, తాంబూలాలు, కర్పూరం, సాంబ్రాణి మొదలైనవన్నీ సమర్పిస్తానని భక్తుడు ప్రార్థిస్తాడు.

'శరణు శరణువయ్య గణనాయ్క
నమ్మ కరుణదిందలి కాయొ గణనాయ్క
ఎళ్ళుండె జేను తుప్ప గణనాయ్క
నమగె విద్యావ కలిసయ్య గణనాయ్క
ఉద్దు హోళిగె తుప్ప గణనాయ్క
గొనె మేగ్గ బాళెహణ్ణు గణనాయ్క'[17]

ఈ పాటలో భావమేకాదు, లయ కూడా తెలుగు పాటలో లాగానే ఉంది. కన్నడ దేశంలో శివునికి, శివశరణులకు ఎక్కువ ప్రాధాన్యం వచ్చి, కొందరు విఘ్నేశ్వరుడి పూజ కంతగా ప్రాముఖ్యం ఇవ్వడం లేదు. పంటకోత కాలంలో కన్నడ కర్షకుడు పాడే పాటల్లో శివశరణులను ఎక్కువగా ధ్యానిస్తాడు.

కన్నడంలో శివస్తుతి పరమైన గేయాలు అత్యధికంగా– అంటే తెలుగులో కన్న ఎక్కువగా కనిపిస్తాయి. దీనికి కారణం అక్కడి సామాజిక పరిస్థితులే. బసవని వీరశైవం కన్నడ దేశంలో వ్యాపించినంతగా తెలుగు దేశంలో వ్యాప్తి చెందలేదు. కన్నడ జానపద గేయాలలో సంగమేశ్వరుడు, సోమేశ్వరుడు, మహాకూటేశ్వరుడు, మహాబలేశ్వరుడు, మల్లికార్జునుడు, వీరభద్రుడు, విరుపాక్షుడు, బసవన్న మొదలైనవారు, చెన్నబసవేశ్వరుడు, రేవణ సిద్ధేశ్వరుడు, సిద్ధరామేశ్వరుడు, నీలమ్మ, గొల్లాళుడు మొదలైన శివశరణులు, కుమారస్వామి, నాయలింగప్ప, మడివాళప్ప మొదలైన అనేక సాధుసత్పురుషులు స్తుతింపబడ్డారు.

సుఖ సంతోషాలలో మునిగి ఉన్నప్పుడు ఎలా ఉన్నా కష్టాల కబంధ హస్తాలలో





కట్టుపడినప్పుడు మాత్రం అనేకులు 'ఎలెమనవె, శివనెంబ శబుద బిడబేడ' (ఓ మనసా, శివుడనే శబ్దాన్ని వదలవద్దు) అంటూ శివుణ్ని తలచుకుంటారు. జానపదుల దృష్టిలో అవసరానికి ఆదుకునే వాడు ఆ పరమాత్ముడొక్కడే. అందుకనే 'వాళ్ళు వీళ్ళని అందరినీ నమ్మగా అందరూ నడి నీళ్ళలో వదిలారు మల్లయ్యతండ్రీ, నా చేయి వదలవద్దు' అంటున్నారు జానపదులు.

'మంది మందీయెందు మంది నంబలి హోద
మంది బిట్టార నడునీర । మల్లయ్య
తంది ననకైయ బిడబ్యాడ'[18]

కొన్ని కన్నడ త్రిపదులలో అత్యంత రమణీయమైన వర్ణనలున్నాయి. ఇంత చిన్నపద్యంలో జానపదకవి ఇంత రమణీయంగా మధుర భావాలను ఎలా దాచాడా అని ఆశ్చర్యం వేస్తుంది. దేవుణ్ని చూచి, ప్రార్థించి, తన కష్టాలన్నీ చెప్పుకోవాలని ఉరకలు పరుగులతో వచ్చాడొక భక్తుడు. కాని దైవదర్శనం కాలేదు. దుఃఖ మగ్న మానసుడై చుట్టూ చూడగా ఒక చెట్టు కనిపించింది. చెట్టునిండా పూలు కనిపించాయి. అప్పుడు–

'హూవినాగ హుదుగ్యాన మాల్యాగ మలగ్యాన
మొగ్యాగ కణ్ణు తెరెదాన । లింగయన
నోడటికె నిద్ది బయలాగి'[19]

అని ఆ జానపదుడు పాడాడు. దీనిలో అపూర్వకల్పనా విన్యాసం అడగి ఉంది. శివుడు పూవులోదాగి, పూమాలలో శయనించి, మొగ్గరూపంలో కన్ను తెరిచాడట! సౌందర్య మూలకంగానే శివుణ్ని దర్శిస్తున్నాడీ జానపదుడు. పుష్పకాశిని సందర్శించి పునీతుడయ్యాడు.

జానపదులు కడుపునిండుగా బిడ్డలుంటే ఆ గృహం స్వర్గతుల్యమని భావిస్తారు. ముత్తయిదువతనం ఉంటే బీదతనాన్ని లెక్క చేయరు. శివునిదయ ఒక్కటి ఉంటేచాలు. ఎన్ని కష్టాలయినా భరించే శక్తి ఉన్నట్లుగా భావిస్తారు వారు. ఈ క్రింది గీతం విశ్వకవి రవీంద్రుడు వ్రాసిన 'నాకు ఎన్ని కష్టాలైనా రానీ, అయితే వాటిని నిగ్రహించే శక్తియివ్వు' అనే గీతాన్ని పోలి ఉంది.

బడతన ననగిరలి భాళ మక్కళిరలి
మ్యాగ గురువిన దయవిరలి । నన గురువె
బడతనద చింతి నినగిరలి

కన్నడ దేశంలో చుంచనగిరి అనే పుణ్యక్షేత్రం ఉంది. శివరాత్రికి అక్కడికి భక్తులు అసంఖ్యాకంగా వస్తారు. ఆనాటి రాత్రి అందరూ అక్కడక్కడ కొండలమీద, గుట్టలమీద గుంపులు గుంపులుగా కూర్చొని పాటలు పాడుతారు. ఈ క్షేత్రాన్ని గూర్చిన పాటలు వందలకొద్దీ ఉన్నాయి.

శ్రీశైలం మల్లన్న తెలుగు దేశంలో ఉన్నా కన్నడ శైవులకు ఆ దేవుడంటే అమిత ప్రేమ. పూర్వం శివరాత్రి మొదలైన పుణ్యదినాలలో కావళ్ళు ఎత్తుకొని శ్రీశైలయాత్ర చేసేవాళ్ళు. కావడి పాటలన్నవి కన్నడంలో బహుళ ప్రచారం పొందాయి. వీటిని కన్నడంలో 'కంబియ హాడుగళు' అంటారు. డా.బి.ఎస్.గద్దగిమఠ ఇలాంటి పాటలు పెక్కింటిని సేకరించారు. ఈ పాటలకు ఎంత ప్రాముఖ్యం వచ్చిందంటే 'కంబి' అంటేనే శ్రీశైలం మల్లన్న అని వాడుకలోకి వచ్చింది (కంబి=కావడి కొయ్య)

శివుని తర్వాత కన్నడ దేశంలో ఎక్కువగా ఉన్న పాటలు బసవన్నను గూర్చి. బసవన్న కేవలం మానవ మాత్రుడిగా కాక అవతార పురుషుడై భాసించాడు. వీరశైవ మత ప్రతిష్ఠాపకుడైన బసవన్న పుట్టిన తర్వాత శివుని వాహనమైన బసవన్న ప్రతిష్ఠ పెరిగింది. 'లేచిరా ముద్దు బసవా, పాదాలు గజ్జెలు మాట్లాడుతాయి' అని మధుర భావాలను వ్యక్తీకరింస్తారు జానపదులు.

బసవన్నకింత ప్రాధాన్యం రావడానికి మరో కారణం కూడా ఉంది. వృషభం కర్షకులకు అన్న ప్రదాత. అందువల్ల అదంటే రైతులకు ఎంతో ప్రీతి. వాళ్ళ సంపదకు కారణభూతుడైన బసవన్నను ఎద్దు అనడం తగదని జానపదుల అభిప్రాయం.

'ఎత్తు ఎనబహుదె ఎడచోరి బసవన
సుత్తేళు లోక సలహాన బసవన
సత్వ మరెయువుదె ధరెయల్లి'[20]

కన్నడ శైవ జానపద గేయాలలో మనకింకో ప్రత్యేకత కనిపిస్తుంది. కేవలం శివుడు, ఆయన బంధువర్గంలోని వారే కాక శివశరణులను గూర్చిన గేయాలు కూడా అసంఖ్యాకంగా కనిపిస్తాయి. శివుడినేకాక ఆయన భక్తుల్ని కూడా కీర్తిస్తే శివపదం లభిస్తుందని జానపదుల నమ్మకం.

'ముగ్ధ శరణర హాడు, సిద్ధి మంత్రపు నోడు
సిద్ధాగొ హాడు హాడుదకె । ఎలెజీవ
శుద్ధాగి హొందు శివపదవ'[21]
(ముగ్ధ శరణుల పాట, సిద్ధిమంత్రము చూడు
సిద్ధమవు పాట పాడుటకు । ఓ జీవ
శుద్ధమయిపొందు శివపదము)

ఈ పాటలే కాక ఇంకా వీరభద్రుడు మొదలైన వాళ్ళనుగూర్చి కూడా పాటలున్నాయి. మొత్తం మీద కన్నడంలో శివసంబంధ గేయాలు ఎక్కువగా కనిపిస్తాయి.

**విష్ణుసంబంధ గేయాలు :**

తెలుగులో ఉన్నన్ని విష్ణుసంబంధ గేయాలు కన్నడంలో లేవు; కన్నడంలో ఉన్నన్ని శివసంబంధ గేయాలు తెలుగులో లేవు. తెలుగులో ఉన్నంతగా రామాయణ సంబంధ సారస్వతం కన్నడంలో లేదు. తెలుగులో భాస్కర రామాయణం, నిర్వచనోత్తర రామాయణం, రంగనాథ రామాయణాదుల దగ్గర్నుంచి యీనాటి వరకు కొన్ని వందల రామాయణ కథలు చిన్నవీ పెద్దవీ వెలశాయి. వీటిలో మహాకావ్యాలు, ద్విపదలు, జానపద కథాగేయాలు, యక్షగానాలు, నాటకాలు, కీర్తనలు, పాటలు ఉన్నాయి. భద్రాచలాది పుణ్యక్షేత్రాలు, రామదాసు, త్యాగయ్య మున్నగువారి కీర్తనలు రామునిపై తెలుగువారి ప్రీతినెక్కువ చేశాయని చెప్పవచ్చు.

కన్నడిగులకు కూడా వేంకటేశ్వరుడు ఇష్టదైవం. తిరుమలలోని తిరుమలప్పనే కన్నడంవారు తిమ్మప్ప అని ముద్దుగా పిలుచుకుంటారు. వేంకటరమణుడు శ్రీమంతుడు. ఆయన వైభవమే వైభవం. ఆయన వంటిల్లు బంగారు, చిలికే కవ్వం బంగారు, కొండ బంగారు, స్నానంచేసే కొలనూ బంగారే.

'అడిగెమనె చిన్న కడెయొ కంబ చిన్న
కోనేరి చిన్న గిరి చిన్న – వెంకటదొరే
స్నాన మాడువ కొళ చిన్న'[22]

తిరుపతి తిమ్మప్పను గూర్చిన పాటలు కొన్నిటిని కన్నడంలో డా.జీ.శం.పరమశివయ్య 'అవర నెనెదేవు' అనే సంపుటంలో ప్రచురించారు. క.రా.కృష్ణస్వామిగారు తిమ్మప్పను గూర్చి అనేక గేయాలను సేకరించి 'గిరికాణెమూడలగిరి' అనే పేరుతో ఒక సంపుటాన్ని ప్రచురించారు. 'వెంకటరమణా, గోవిందా, భక్తాధీన సుగుణా, తిమ్మప్పా మమ్ము ఓడించవద్దు, గెలిపించు' అని భక్తులు ఈ క్రింది గీతంలో వెంకటేశ్వరుని వేడుకుంటున్నారు.

'వెంకటరమణానె ఎళెయ గోవిందానె
భకుతరి గొలియొ సుగుణానె – తిమ్మయ్య

సోలిస బేడ గెలిసయ్య'[23]

పండరి పురంలో వెలసిన పాండురంగ విఠలుడు కూడా కన్నడిగులకు ఇష్టదైవం. పురందరదాసు వేలకొద్దీ కీర్తనల్ని వ్రాసి పాండురంగనికి కన్నడ దేశంలో అమిత వ్యాప్తిని కలిగించాడు. పండరినాథుడు ఇటుకమీద నిలిచి, రెండు చేతులు నడుమ మీద పెట్టుకొని ముగ్ధ మోహనంగా కనిపిస్తుంటాడు. ఆయన రూపాన్ని భక్తులు ఈ క్రింది విధంగా కీర్తిస్తారు.

'ఇట్టిగి కల్లమ్యాల ఊరినింతానెరడు పాద
జరద మందీల శాల । ఇళియ బిట్టార చోల
నాదబ్రహ్మ మేఘశామ । సృష్టికర్త సర్వగోమ
సాదుసంతర ప్రేమ
హ్యాంగ నింతారె నగపేళిరే । శ్రీ పాండురంగ
హ్యాంగ నింతారె నగపేళిరే'[24]

జానపద గేయాలలో మనకెన్నో ముగ్ధభావాలు కనిపిస్తాయి. జానపదులు పండితులు కాకున్నా అచ్చమైన కవిత్వాన్ని అల్లగలిగినవారు వాళ్ళ కవిత సెలయేటి గలగలల్లాంటిది. చల్లని వెన్నెల లాంటిది. ప్రాతః కాలపు అరుణ రేఖవంటిది. కృష్ణుని కోసం ఒక భక్తురాలు వెతికింది. దినమ్మూ వెతుకుతూనే ఉంది. ఆమె హృదయంలో నిరాశ అలముకుంది. అందుకని–

కృష్ణ కృష్ణ ఎందు మత్తె బీదిగె బందె
కృష్ణ నమగెల్లి దొరెతాన । ఈ పరి
ఎష్టుదిన హీంగ కళెయలె
(కృష్ణ కృష్ణయంచు మరల వీదికి వస్తి
కృష్ణుడేడరా దొరికేను । ఈలాగు
ఎన్ని దినములు గడిపేది) – అంటూ వాపోతుంది ఆ భక్తురాలు.

రాముని సేవకుడైన హనుమంతుడంటే కన్నడిగులకు ప్రీతి. రాముని కంటె హనుమంతుని మీదనే ఎక్కువ గేయాలున్నాయి. హనుమంతుడు జానపదుల పీడలను తొలగించే దేవుడు. ఆంజనేయుణ్ణి చూడగానే దయ్యాలు పారిపోతాయని నమ్మకం. అంతేకాదు హనుమ రామునికంటే గొప్ప వాడట! ఎందుకంటే సీతను రావణుడు తీసుకొని వెళ్ళేటప్పటికి రాముడు ఇంకా చిరుత ప్రాయం వాడట! హనుమంతుడు మంచి వయసులో ఉన్నాడట! అందువల్లనే సీతమ్మను రావణుని చెరనుంచి





విడిపించగలిగాడని జానపదుల నమ్మకం.

సీతమ్మ ఒయ్యాగ శ్రీరామ సణ్ణవ
ఆగ హనుమంత హెుసమగ! తా కూతు
సీతాన సెరెయ బిడిస్యాన'[25]

**ఇతర దేవతలు :**

ఇతర దేవతలకు సంబంధించిన స్తుతులలో సరస్వతీ స్తుతులు పేర్కొనదగ్గవి. వాగ్దేవిని ఒక దేవతగా కాక అక్కగా, తల్లిగా భావించి ప్రార్థిస్తారు జానపదులు. 'వాకిట నిలవవద్దని, లోపలికి రమ్మ'ని ఆహ్వానిస్తారు. సరస్వతికి లంచ మివ్వడానికి ప్రయత్నిస్తారు. అయితే వారిచ్చేది డబ్బుకాదు; అరటి పళ్ళు

అక్క సరసోతి ఆది బ్రహ్మన మడది
బాళెయ హణ్ణు ఒళలంచ హెురలంచ
బాగూరు బెనవ కొడుమతియ

తెలుగు వారికి పరిచయం లేని స్తుతి ఒకటి కన్నడంలో ఉంది. అది జవరాయస్తుతి. జవరాయడంటే యముడు. యముణ్ణి అనేక పదాలుగా స్తుతించే తిరుగలి పాటలు అనేకం లభిస్తాయి.

ఈ విధంగా సంప్రదాయాన్ని బట్టి, సమాజాన్ని బట్టి, మత ప్రచారాల్ని బట్టి కొంత భేదం కనిపించినా తెలుగు కన్నడాలలో ఉన్న భక్తి గేయాలలో పోలికలు కూడా చాలా కనిపిస్తాయి.

**కర్మమార్గం :**

కర్మ మార్గానికి చెందిన వ్రతాలు, నోములు, జాతరలు మొదలైనవి కన్నడ దేశంలో కూడా పుష్కలంగా ఆచరింపబడుతున్నాయి. వ్యవసాయానికి సంబంధించిన పూజలు, స్త్రీలు చేసే వ్రతాదులు, గ్రామాలలో సామాజికంగా జరిగే జాతరలు పాటలతో కూడి ఉంటాయి.

వానాకాలంలో భూమాతకు పూజలు చేస్తారు. కన్నడ కర్షకులు. ఉత్తర కర్ణాటకంలో జ్యేష్ఠ బహుళ అమావాస్యను మణ్ణెత్తిన అమావాస్యె (మట్టెద్దు అమావాస్య) అంటారు. మట్టితో బసవన్నను చేసి ఆరాధించడం అప్పటి సంప్రదాయం. ఈ ఆరాధన సమయంలో కర్మమార్గానికి సంబంధించిన పాటలు వినిపిస్తాయి.

నాగపూజ కన్నడిగులకు కూడా ముఖ్యమైనదే. నాగులచవితి నాడు పుట్టలో పాలు పోసే సంప్రదాయం కన్నడ స్త్రీలలో ఉంది. ఆ సందర్భంలో

'అళ్ళిట్టు తంబిట్టు, మాడిట్ట ఎళ్ళుండి
దళ్ళురి కణ హణెయవన కొరళాన
నాగ నినగెడెయొ కై ముగిదొ'[26]
మొదలైన పాటలు పాడుతారు.

ఉత్తర కర్నాటకంలో జోకుమారుని సంప్రదాయం చాలా ప్రసిద్ధి వహించింది. భాద్రపదశుద్ధ అష్టమి నాడు జోకుమారుడు పుట్టాడని చెప్తారు. ఇది రైతులకు సంబంధించిన పూజ. మట్టితో జోకుమారుణ్ని చేసి యింటింటికీ తిరుగుతారు. జోకుమారుడు జోకముని అనేవాని కొడుకని చెప్తారు. ఈ దేవుణ్ని యెత్తుకొని తిరుగుతూ స్త్రీలు పాటలు పాడుతారు.

ఉత్తర కర్నాటకంలో కనిపించే మరొక సంప్రదాయం 'గుర్చి'. దీన్ని మిగిలిన స్థలాల్లో 'కరగ' అంటారు. భాద్రపదాశ్వయుజ మాసాలలో వానలు కురవడం కోసం ఈ సంప్రదాయాన్ననుసరిస్తారు. రాయలసీమలో కూడా జాతర సమయాల్లో గరిగలను (కరగ) తయారుచేసి పూజించడం, బలులివ్వడం అలవాటుంది. ఒక పచ్చికుండను చేసి, దాని చుట్టూ పూలు కట్టి, శిరస్సుపైన ధరించి పాటలుపాడుతూ కన్నడిగులు ఇంటింటికీ తిరుగుతారు.

'గుర్చీ గుర్చీ ఎల్యాడి బందె
హళ్ళా కొళ్ళా తిరుగాడి బందె
కార మళియే కప్పత మళియే
సురి మళియే సురి మళియే॥
సురి మళి యాదర ఒక్కలిగ ఒక్కలిగ
ఒక్కలిగణ్ణ బిత్తొ హొన్న
సుత్త సురియితు సురి మళియే సురి మళియే॥'[27]
ఇది గుర్చి సంప్రదాయపు పాట.

గౌరి పూజ కన్నడ స్త్రీలకు ప్రీతి పాత్రమైంది. మంగళ గౌరిని, సంపద్గౌరిని, గజగౌరిని పూజిస్తారు కన్నడ స్త్రీలు.

గౌరి గౌరి గాణాగౌరి మ్యాణాగౌరి
కళ్ళీగౌరి కుంకుమ గౌరి
అవరియంత అణ్ణన కోడ అణ్ణన కోడ
తొగరి యంత తమ్మన కోడ తమ్మన కోడ...... (సీతమ్మ, చింతామణి)





అంటూ గౌరీ దేవిని గూర్చిన పాటలు పాడుతారు.

గౌరీపూజలాగానే తెలుగు వారిలా వరలక్ష్మీ పూజ కూడా చేస్తారు కన్నడ స్త్రీలు. 'ఐదు శుక్రవారాల పాటల'నే పేరుతో శుక్రవార వ్రతానికి సంబంధించిన గీతాలు కన్నడ దేశంలో ప్రచారంలో ఉన్నాయి. శుక్రవార వ్రతంతోబాటు శ్రావణ సంపత్ శనివార వ్రతాన్ని కూడా ఆచరిస్తారు కన్నడిగులు. ఆ సమయంలో మంగళహారతులు మొదలైనవి పాడుతారు. శనివార వ్రతం ముగిసిన తర్వాత

మంగళ జయవెన్ని మంగళ శుభవెన్ని
మంగళాంగనె మహాలకుమి
కంగళు తెరెదు కటాక్షది నోడలు
ఇంగోదు సకల పాపగళు
బరడు కరెయలి బంజెగె మక్కళాగలి
కురుడగె కంగళు బరలి
బరహరియలి దారిద్ర్యగళింళి
శ్రీహరి నమ్మ హృదయ దొళిరలి (సీతమ్మ, చింతామణి)

అని మహాలక్ష్మికి మంగళం పాడుతూ ఆమె కళ్ళు తెరచి చూస్తేనే సకల పాపాలూ నశిస్తాయని, వంధ్యాస్త్రీకి బిడ్డలు కలుగుతారని, గుడ్డివారికి కళ్ళు వస్తాయని చెప్తారు శ్రీహరి తమ హృదయంలో నిలవాలని ఆశిస్తారు.

క్షుద్ర దేవతల్ని పూజించడం కన్నడ దేశంలో కూడా ఉంది. కన్నడ జానపదులు ఎల్లవ్వ, కాళవ్వ, సోరవ్వ, సత్యవ్వ, సెట్టవ్వ, ద్యామవ్వ, జక్కవ్వ, దురగవ్వ, కరియవ్వ మొదలైన దేవతలను కొలుస్తారు. ఈ దేవతలనే కాక భరమప్ప, ఏళుమక్కళ తాయి, బ్రహ్మ రాక్షసుడు, కొరివిదయ్యం పూజలందుకొనే మానవాతీత శక్తులు.

ఎల్లమ్మ మీద కన్నడంలో పాటలు అత్యధికంగా వినిపిస్తాయి. బెల్గాం జిల్లా సవదత్తిలో ఎల్లమ్మ వెలసి ఉంది. ఎల్లమ్మ కొండకు ప్రతి ఏడూ 10-15 లక్షల మంది యాత్రికులు వస్తారు. నెల రోజులు జరిగే ఎల్లమ్మ జాతరకు సుమారు రెండు లక్షల మంది జనం పోగవుతారు. ఇక్కడి దేవతకు ఏళుకొళ్ళద ఎల్లమ్మ (ఏడులోయల ఎల్లమ్మ) అని పేరు. మహావిష్ణువు ఆరో అవతారమైన పరశురాముని తల్లి రేణుక. ఈమెను గూర్చి ఎన్నో కథాగేయాలున్నాయి; గద్య కథలు ప్రచారంలో ఉన్నాయి. 'ఎల్లమ్మకు జాతర చేద్దాంరమ్మ'ని జాతర సమయంలో ఈక్రింది పాట పాడుతారు.

'ఏళు కొళ్ళదల్లిరువ ఎల్లమ్మన
జాత్రెయ మాడువ బా
సత్యుళ్ళె సత్యవ్న పాదవ
పూజెయ మాడువ బా
ఉధో ఉధో ఉధో ఎన్నుత హాడను హాడువ బా..........[28]

ఈ పాటలో ఆడవాళ్ళు అలంకారాలు చేసుకొని ఎల్లమ్మ గుడికి రావడం వర్ణింపబడింది. వేప మండలు మొదలైనవి పట్టుకొని రావడం కూడా చెప్పబడింది. నింబప్రసూన మాల్యాలు ధరించి స్త్రీలు జాతరకు రావడాన్ని నిగమశర్మోపాఖ్యానం (పాండురంగ మాహాత్మ్యం)లో తెనాలి రామకృష్ణుడు చక్కగా వర్ణించాడు.

ఎల్లమ్మవలెనే జాతరలలో సేవింపబడే దేవతలలో కెంపమ్మను కూడా పేర్కొవచ్చు. తుంకూరు జిల్లాలో శెట్టికెరె ఒక పల్లె. కెంపమ్మ ఆ గ్రామ దేవత. ఉగాది తర్వాత, శుక్రవారం నాడు ఇక పదిహేను దినాలకు కెంపమ్మ బాన (భోజన-బోన-బాన) అని పదకొండు పల్లెల్లో చాటుతారు ఈ చాటింపు విన్నవారు జాతరకు తప్పక రావాలి. ఈ నమ్మకం తెలుగు దేశంలో కూడా ఉంది. 'బాన' శుక్రవారం జరుగుతుంది. జాతర శనివారం నాడు జరుగుతుంది. ఆడవాళ్ళు కూడా కెంపమ్మకు సంబంధించిన పాటలు పాడుతారు. కన్నడిగుల ఈ జాతరలలో శిష్టుల పూజావిధానాలు కూడా అనేకం చోటు చేసుకున్నాయి.

**వేదాంత మార్గం :**

అద్వైతం, రాజయోగం, కుండలినీ యోగం మొదలైనవి కన్నడ తత్వాలలో కనిపిస్తాయి. కాలజ్ఞాన తత్వాలకూ కన్నడ దేశంలో మంచి ప్రచారం ఉంది. వీరశైవ ధర్మాన్ని కన్నడ దేశంలో ప్రచారం చేసిన అల్లమ ప్రభువు, అక్కమహాదేవి మొదలైన వారు వేదాంత మార్గానికి కూడా ప్రాధాన్యం ఇచ్చి రచనలు చేశారు. ఈ శిష్ట సాహిత్యం జానపదుల మీద కూడా ప్రభావం చూపింది. సర్వజ్ఞాది ప్రజాకవులు సరళమైన భాషలో, ఛందస్సులో వేదాంత మార్గానికి చెందిన అనేక భావాలను వ్యక్తీకరించారు. ఇవన్నీ కన్నడ జానపదులలో తాత్విక చింతనను కొంత వరకైనా ప్రేరేపించాయి, రచనలు చేయడానికి స్ఫూర్తి నిచ్చాయి.

ఈ కింది 'రాజయోగ తత్వం'లో రాజయోగం అనేమాటకు అర్థం తెలుసుకోవాలని, నరజన్మ ఎత్తిన తర్వాత మోక్షమార్గాన్నన్వేషించాలని, ముందు పెద్దల





యందు భక్తి కలిగియుండి, విద్య నేర్చుకొని సన్మార్గ వర్తనుడై పిదప రాజయోగ పద్ధతి ద్వారా ముక్తి పొందాలని ఉంది.

'రాజయోగద మాతిన అర్థ తిళియబేకు
నరజన్మదల్లి హుట్టిద మేలె
మోక్ష మార్గదల్లిరబేకు
తాయితందె హొట్టెయల్లి హుట్టి అవర
పాద పూజె మాడలె బేకు
గురహిరియరన్న కండరె
భక్తి మార్గదొళిర బేకు.......'[29]

తెలుగులో కొన్ని తత్వాలలో రూపకాలనాశ్రయించి వేదాంతాన్ని చెప్పడం కనిపిస్తుంది. అలాగే కన్నడంలోను గీతాలున్నాయి. పెరుగు చిలకడం, పత్తివిరువడం మొదలైన పనులను వేదాంత మార్గంతో పోల్చి చెప్పడం కొన్ని తెలుగు తత్వాలలో కనిపిస్తుంది. అలాగే వంటచేయడం జ్ఞానమార్గం, ఈ రెంటినీ కలిపి పాడుతున్నాడొక కన్నడ జానపదుడు. 'వంట చేయవలె నన్నామనమిపుడు, జ్ఞానమను వంట చేయవలె నన్నా' అని ఈ తత్వం సాగుతుంది చీకటి వంటి మనసు అనే పొట్టును గాలించి పారెయ్యాలి. పిమ్మట జ్ఞానమనే వంట చెయ్యాలి.

'అడిగెయను మాడబేకణ్ణా
నావీగ జ్ఞానద అడిగెయను మాడబేకణ్ణా ॥ప॥
అడిగెయను మాడబేకు మదిసబేకు మదగళన్ను
ఒడెయనాజ్ఞెయింద ఒళ్ళే సడగరద ముక్తి అదకె ॥
మనెయ సారిసి మడగ బేకణ్ణా
ఆ బళిక తన్నాఘనది గురువన్ను నెనెయ బేకణ్ణా
కనసుయెంబువ కల్మషంగళ వనికెయింద కుట్టికేరి
తనగె తానె అద కర్చను
అచ్చి అడిగెయను మాడ బేకణ్ణా
తత్వ భాండవ తొళియ బేకణ్ణా
సత్యాత్మనాగి అరిసి అక్కియ మథిసబేకణ్ణా'[30]

ఒక తత్వంలో 'గురువు మహిమను గురుభక్తులె తెలియరు చందమామా।

మూఢ నరులెట్లు తెలియుదురు అంతరంగ జ్యోతిని చందమామా' అని ఆత్మజ్ఞానాన్ని బోధించడం ఉంది.

'గురువిన మహిమెయ గురుభక్తరె బల్లరు చందమామా। మూఢనర రేను బల్లరు నడురంగ జోతియ చందమామా। కదరు గాతర మరకు దురెగాతర హువ్వు చందమామా। ఒంటెగాతర కాయి అనెగాతర హణ్ణు చందమామా। కణ్ణిల్లదాతను కండను ఆ మర చందమామా। కైయిల్లదాతను కొయ్దను ఆ హణ్ణు చందమామా'[31]

కళ్ళులేని వాడు చెట్లను చూడడం, నాలుకలేనివాడు రుచి చూడడం మొదలైనవి తెలుగులోనూ కొత్తకావు. రెండు భాషల్లోనూ ఇలాంటివి ఉన్నాయి.

కన్నడంలోనూ అసంఖ్యాకంగా కాలజ్ఞాన తత్వాలు ఉన్నాయి రుద్రముని స్వామి, నీలమ్మ మొదలైనవారు రచించిన తత్వాలు చాలా ప్రచారంలో ఉన్నాయి. భూమిపైన వృక్షాలన్నీ నరుక బడుతాయని, సీమలన్నీ పాడై పోతాయని, మితిమీరి చోరులు కనిపిస్తారని, వ్యాపారం బదులు పోరాటం జరుగుతుందని ఈ క్రింది తత్వంలో రుద్రముని చెప్తున్నాడు.

'ముందిన సూచనె చెన్నాగి హేళువె కేళిరణ్ణా
భూమి మేలణ వృక్షగళెల్లవు మురిదావు నోడిరణ్ణా
సీమెగళెల్లవు హాళాగి హోదవు కేళిరణ్ణా
లోకక్కె మీరిద చోరరు బరుతారె కేళిరణ్ణా
మారాట నడియాదు హోరాట వాదీతు నోడిరణ్ణా'[32]

ఏనుగు కడుపున సింహం పుట్టడం, మనిషి కడుపున పాములు పుట్టడం, ఏడు సంవత్సరాల యువతికి గర్భం రావడం, బ్రాహ్మణులంతా భ్రష్టులు కావడం మొదలైనవి జరుగుతాయని తెలుగువారూ కన్నడంవారూ కాలజ్ఞాన తత్వాలలో చెప్తారు పిండోత్పత్తి క్రమం మొదలైనవి వివరించే తత్వాలు కూడా ఉన్నాయి.

పారమార్థిక గేయాలు భక్తి-కర్మ-జ్ఞాన మార్గాలుగా విభజింపబడి పరిశీలింపబడినాయి. చారిత్రకంగా కూడా పారమార్థిక జానపద గేయాలు ఈ మూడు మార్గాల వరుసలోనే వెలువడ్డాయని ఊహించవచ్చు. మతం అన్నది, భగవంతుని గూర్చిన నమ్మకాలు అన్నవి ప్రారంభమయి సుమారు 13,500 సంవత్సరాలకు పూర్వమని కొందరు మానవశాస్త్రజ్ఞులు అభిప్రాయ పడ్డారు. కాని మానవాతీత శక్తులపై నమ్మకం ఇంకా చాలా ముందు కాలంలోనే ఉదయించిందని ఊహించవచ్చు.





పారమార్థిక గేయాలలో భక్తిగేయాలు ప్రాచీనమైనవి. అనంతమైన ఆకాశాన్ని, అగాధమైన సముద్రాన్ని, అనంతకోటి నక్షత్రాలను, చంద్రుణ్ని సూర్యుణ్ని, ఉరుముల్ని, మెరుపుల్ని చూచి-అనుభవించి మానవుడు భయం, సంతోషం మొదలైన వివిధ భావాలను వ్యక్తం చేశాడు. ఇలాంటి వివిధ భావాలకు అనుగుణంగా మానవుడు కొన్ని దేవతా స్వరూపాల్ని కల్పించుకున్నాడు. తన కష్టాలను విన్నవించుకున్నాడు. ఆ తర్వాతనే కర్మకాండలు ప్రారంభమయ్యాయి. ఆ తరువాతి దశలో మానవుడు ఇంకా వివిధ విషయాలను గురించి ఆలోచన సాగాడు. అప్పుడు తత్వమన్నది పుట్టింది. అందువల్ల భక్తి-కర్మ-జ్ఞాన మార్గాలు చారిత్రకంగా ఒక వరుసలో ఉన్నాయి.

అయితే తెలుగు-కన్నడాలలో కూడా పారమార్థిక గేయాలు పైన చెప్పిన క్రమంలోనే వెలువడ్డాయని చెప్పడం వీలుకాదు. తెలుగులోని భక్తి గేయాలే కర్మకాండలకు సంబంధించిన గేయాల కన్న ప్రాచీనమని చెప్పలేము. రాగతాళాలు ఉండి, అగ్రవర్ణాల ఇళ్ళలోనే ఎక్కువగా ప్రచారంలో ఉండి జానపద గేయాలుగా చెలామణీ అవుతున్న భక్తిగేయాలు, వ్రతోత్సవ గీతాలు చాలా ఉన్నాయి. వాటికంటే జాతరలు మొదలైన సమయాలలో పాడేపాటలే నిజమైన జానపదగేయాలని చెప్పవచ్చు. ఇటువంటి పాటలను పూర్తిగా సేకరించి, వింగడించి, అధ్యయనం చేసినవాడే నిజమైన జానపద పారమార్థిక గేయాల స్వరూపం బోధపడుతుంది.

**టిప్పణి**


1. C.M.Bowra Primitive, Song, p.55
2. ఆచంట లక్ష్మీపతి, ఆయుర్వేద శిక్ష-దర్శనములు, పు. 380
3. కన్నడ జానపద గీతగళు, పు. 24
4. త్రివేణి, పు. 65
5. బి.రామరాజు(సం), తెలంగాణా పల్లె పాటలు, పు. 91
6. కృష్ణశ్రీ (సం), పల్లెపదాలు, పు. 141
7. నం. 2509 (తాళపత్రము), ప్రాచ్య లిఖిత పుస్తక భాండాగారము, మదరాసు
8. అదే
9. C.M.Bowra, పూర్వోక్తం, పు. 41
10. ఎల్లోరా(సం.) సరాగాలు, పు. 129
11. త్రివేణి, పు. 303

12. డి.నం. 2544, ప్రాచ్యలిఖిత పుస్తక భాండాగారము, మదరాసు
13. డి.నం. 2544, అదే
14. డి.నం. 2544, అదే
15. పి.సాంబమూర్తి, తెలుగు పల్లె పాటలు(ఉపోద్ఘాతం)
16. డి.నం. 3258, దరువులు, ప్రాచ్యలిఖిత పుస్తక భాండాగారము, మదరాసు
17. కరీంఖాన్, జనపద గీతెగళు, పు. 1
18. బి.ఎస్.గద్దగిమఠ, కన్నడ జానపద గీతెగళు, పు. 8
19. హెూన్న బిత్తేవు హెూలకెల్ల, పు. 336
20. పుస్తక ప్రపంచ, సెప్టెంబర్, 1971, పు. 32
21. బి.ఎస్.గద్దగిమఠ, పూర్వోక్తం, పు. 16
22. జానపద, సం. 1, కర్నాటక జానపద పరిషత్తు, పు. 54
23. కరీంఖాన్, పూర్వోక్తం, పు. 12
24. రేవప్ప, మల్లిగె దండె, పు. 5
25. బిఎస్ గద్దగిమఠ, పూర్వోక్తం, పు. 11
26. అదే, పు. 145
27. అదే, పు. 157
28. ఎం.కృష్ణమూర్తి, ఏళుకొళ్ళద ఎల్లమ్మ, పు. 67
29. బళ్ళారి తత్వగళు, పు. 9
30. అదే, పు. 15
31. అదే, పు. 17
32. కలియుగద కాల జ్ఞానవు, పు. 9





# 4. బాంధవ్య గీతాలు

గృహజీవనంలో వివిధ వ్యక్తుల మధ్య కనిపించే బాంధవ్యానికి అద్దం పట్టే అందమైన జానపద గేయాలు తెలుగు–కన్నడ భాషలలో అసంఖ్యాకంగా కనిపిస్తాయి. వీటినే మామూలుగా 'స్త్రీలపాటలు' అంటారు. కన్నడంలో 'గరతియ హాడుగళు' (గృహిణీ గీతాలు) అని పిలుస్తారు. స్త్రీల పాటలు కొందరు చెప్పిన లాలుల్ని పిల్లల పాటల్లోనూ, పెళ్ళిపాటల్ని వేడుక పాటల్లోనూ చేర్చడమైంది. గృహజీవనంలో భాగమైన అమ్మ–కూతురు, అత్త–కోడలు, వదిన–మరదలు, అన్నా చెల్లెళ్ళు మొదలైన వారి అలవాట్లు, అభిరుచులు, భావనలు వర్ణింపబడి ఉండే అత్యుత్తమ భావగీతాలను బాంధవ్య గీతాలనే శీర్షిక క్రింద చేర్చడమైంది. వీటినే కౌటుంబిక గీతాలని కూడా పిలవవచ్చు.

స్త్రీ పురుష సంబంధం ప్రకృతి సహజమైంది. అది వివాహమనే వ్యవస్థకు దారితీస్తుంది. వివాహం కుటుంబమనే సామాజిక వ్యవస్థకు మూలమవుతుంది. వివాహం లేకుంటే కుటుంబమన్నది లేదు. కుటుంబంలో వివిధ బాంధ్యవాలు రూపమెత్తుతాయి. కుటుంబం, వివిధ విధాల బాంధవ్యాలు ప్రతి జాతిలోనూ ఉన్నాయి. సంతానోత్పత్తి, రక్షణ మాత్రమే కాక కుటుంబం నిర్వహించాల్సిన ధర్మాలు ఎన్నో ఉన్నాయి. శారీరకమైన లైంగిక వాంఛ, శిశుపోషణ, పితృసంబంధవిధులు ఇత్యాదులతో ఆగక ఎన్నో నిబంధనలు, కర్మకాండలు కుటుంబ వ్యవస్థలో భాగాలయ్యాయి.

ప్రాచీన కాలంలోను కుటుంబ వ్యవస్థ ఉండేది. అయితే అది ఆధునిక కుటుంబం లాగా కాకుండా, కలిసికట్టుగా ఉండే గుణంతో, సమాజంలో ఒక భాగంగా ఉండేవి. కొన్ని కుటుంబాల వారు కలిసి ఒకే వేట ప్రదేశం (hunting ground) ఏర్పరచుకునే వారు. మగవాళ్ళు వేటాడితే ఆడవాళ్ళు దుంపలు, వేళ్ళు మొదలైనవి సేకరించేవారు.

కుటుంబంలో మొదట స్త్రీదే అగ్రస్థానం. మాతృస్వామ్య వ్యవస్థే పితృస్వామ్య వ్యవస్థకంటె ప్రాచీనమని పలువురి అభిప్రాయం. భారత దేశ సమాజంలో స్త్రీ కుటుంబ వ్యవస్థకు పునాది అయింది. 'ఇల్లు చూచి ఇల్లాలిని చూడు' అన్న సామెత తెలుగులో ఉంది. ఇల్లాలు తెలివిగలదైతే ఇల్లూ చక్కగా ఉంటుంది. బిడ్డల్ని లాలించి, పాలించి

ఆదర్శవ్యక్తులుగా తీర్చిదిద్దే మాతృమూర్తిగా, భర్తను ఆప్యాయంగా చూచుకుంటూ మన్నన పొందే గృహిణిగా, కోడల్ని అదుపులో పెట్టుకొని ఇంటి అధికారాన్ని చేపట్టిన అత్తగారిగా, అత్తగారింటికి వచ్చినా చిన్ననాటి నుంచి పెంచిన తల్లి మమతను మరచి పోలేని కోడలుగా అనేక రూపాలతో సాక్షాత్కరిస్తుంది స్త్రీ.

బాంధవ్యగీతాలలో మొట్టమొదట పేర్కొనదగినవి మాతృమూర్తికి సంబంధించిన గేయాలు. ప్రపంచంలో ఏదేశంలోనయినాసరే మనిషి జన్మకు కారణభూతురాలయిన తల్లికొక ప్రత్యేక స్థానముంది; పవిత్ర స్థానముంది. బిడ్డను తొమ్మిది నెలలు మోసి, జాగ్రత్తలోను అతి జాగ్రత్తతో భవిష్యత్ కను పాపను కాపాడి, కష్టపడి, ప్రసవవేదనను కూడా లెక్క చేయకుండా, కనడంతో తన బాధ్యత తీరిందనుకోకుండా ప్రతి నిముషమూ కనుపాప కంటే జాగ్రత్తగా బిడ్డను పెంచి పెద్దచేసే తల్లిఋణం ఎవరు తీర్చగలరు!

బిడ్డల తల్లికి ఉండే గౌరవం గొడ్రాలికి లేదు. పిల్లలు లేని వాళ్ళ నీడ పడడం కూడా జానపదులు సహించరు.

పసుపు కుంకుమలకు పోలేను నేను
పసి బిడ్డలను నేను ఎత్తుకోలేను
ఇల్లు కలకలలాడ చూడంగ లేను
ఒక్క బిడ్డనైనా ముద్దాడ లేను
గొడ్రాలి బతుకయ్యో గౌరవంలేదయ్యో (సీతమ్మ, సూళ్ళూరుపేట, నెల్లూరుజిల్లా)

అనే పాటలో గొడ్రాలు బిడ్డలు కోసం ఎంత తపిస్తుందో వ్యక్తమవుతున్నది. స్త్రీ తనకు బిడ్డలనిమ్మని పదేపదే దేవుణ్ని వేడుకొంటుంది.

'Give me pregnancy, O, Mbali
Give me pregnancy that I may bear a child'[1]

అని పిగ్మీలు వనదేవతలను ప్రార్థిస్తారు.

స్త్రీలు తమకొక్కరికే కాక అందరికీ బిడ్డలు కలగాలని కోరుకుంటారు. ఆస్ట్రేలియాలో ప్రాచీన జాతికి చెందిన ఒక అవ్వ ఇలా ప్రార్థిస్తున్నది.

'Give to me, baby, Give to her, baby,
Give to him, baby, Give to one, baby,
Give to all, baby'[2]

బాంధవ్య గీతాలలో తల్లికి, కూతురికి, ఉండే సంబంధం మనస్సుకు





హత్తుకునేట్లుగా చిత్రింపబడి ఉంటుంది. తల్లికి కూతురిపై ప్రత్యేకమైన అభిమానం. తెలుగువారిళ్ళలో కూతురిని అత్తవారింటికి పంపడం సంప్రదాయం. కూతుర్ని గురించిన చింత తల్లి కెప్పుడూ ఉంటుంది. తల్లిమీద కూతురికీ అంతే.

కాశి కెళదా మంటె కదలవే కాళ్లు
ఢిల్లి కెళదా మంటె తిరగదే మనసు
నారాచ పుట్టింటి కెళదాము అంటె
నాకాళ్లు పన్నిన్న రథములై నడచు
నా చేతు లుయ్యాల చేరులైయూగు

చివరి పాదం హృదయాన్ని తాకుతుంది. ఉయ్యాల ఊపడం తెలుగు తల్లికి అలవాటయిన పనే. ఉయ్యాల చేరుల్లాగా చేతు లూగుతాయన్న ఉపమానం అపూర్వమైంది.

కూతురు మంచి యింటికి పోవాలనే తల్లికి ఉంటుంది. తనకు సుఖంగా ఉండే యింటికి వెళ్ళాలని కూతురికీ ఉంటుంది. అందుకే ఒక కన్నెయిలా అంటున్నది.

'సామల దేశానికి నన్నియ్య బోకవ్వ
నేను తినలేను సామల బువ్వ
వడ్లు బండే దేశానికి నన్నియ్య బోకవ్వ
నేను దంచలేను వడ్లన్నీ
కొర్రల దేశానికి నన్నియ్య బోకవ్వ
నేను తినలేను కొర్రల బువ్వ
మక్కల దేశానికి నన్నియ్య బోకవ్వ
నేను తినలేను మక్కాల బువ్వ[3]

అత్తగారింటికి వెళ్ళిన తర్వాత ఆమె మనసంతా పుట్టింటి మీదనే ఉంటుంది. తాను పుట్టింటిలో ఉండేటప్పుడు ఎంతో బాగుండేది, తన తల్లి ఎంతో మందిని కన్నది. పెళ్ళిళ్ళు చేసింది. తర్వాత అమ్మ పోయింది. అమ్మలేని పుట్టిల్లు విషయం చెప్పాల్సిన పనిలేదు.

'కాకర్లు పూసెనే కల్లాకి వొరిగే
మాయమ్మ కనింది మంది కిచ్చింది
పుట్నిల్లు దొవ్వాయె పోరు మోపాయె
సంగటి జొరగాయె తెడ్డు కురసాయె
అమ్మలేని పుట్నిల్లు అడిగేమి ఫలము

అడవి తంబకాయి కాసేమి ఫలము'[4]

పుట్టింటి సొమ్ముపైన ఎంతో ఆశ ఉంటుంది ఆడుదానికి. తండ్రిపైన కూడా ప్రత్యేకమైన అభిమానం ఆమెకు. అన్నయ్యతో చెల్లెలు మనసువిప్పి తన బాధలు చెప్పుకుంటుంది. నిష్ఠురాలాడుతుంది, ఆదరిస్తుంది; ఆత్మీయుల్లో ఆత్మీయుడుగా భావిస్తుంది. ఆమె దృష్టిలో–

'అబ్బాయి మామలు ఎటువంటి వారు
నిలువు బొట్టులవారు నియ్యోగి వారు
అంచు పంచెల వారు అంగీల వారు
పట్టు పంచెల వారు పాగాల వారు
చెవి చెవికి చేరడేసి పోగుల్ల వారు
పెసర కాయల వంటి పెదిమెల్ల వారు
కందికాయల వంటి కను బొమల వారు
మిరపకాయల వంటి మీసాల వారు
వారు మా అబ్బాయి మేన మామల్లు.........'[5]

చుట్టపు చూపుగా సోదరుడు రాగానే తమ బాధలను వెళ్ళబోసుకుంటారు ఆడబడుచులు, అన్నయ్య ఓదారుస్తాడు. ఇలాంటి భావాలను వ్యక్తీకరించే పాటలు ఆయా సందర్భాలలో పాడేవి కావు. ఇవి ఏ విసరురాతి పాటలో, రోకటి పాటలో అయి ఉంటాయి. ప్రతియింట్లో ఏవేవో బాధలుంటాయి. ఆ బాధలను ఇతరులతో చెప్పుకుంటేగాని బాధోపశమనం కలగదు. కాని చెప్పుకోడానికి ఆత్మీయులెవరూ దగ్గర ఉండరు. తెల్లవారు ఝామున రాగులో, బియ్యమో తిరుగలిలో పోసుకొని విసురుతూ ఉన్నప్పుడు పుట్టిల్లు జ్ఞాపకం వస్తుంది. దానితోబాటు అత్తింటి బాధలు కూడా తలపుకు వస్తాయి. ఆ స్మృతులు, ఈ బాధలు హృదయంలో కదలి జానపదగేయంగా వెలువడుతాయి. ఇలా తమ హృదయాలలో ఏ మారుమూలో అవ్యక్తంగా పడి ఉండే భావాలను వెలిపరచడానికి జానపదులు ఏర్పరచుకున్న సాధనమే జానపద గేయం.

అన్న–చెల్లెలు మాట్లాడుకుంటున్న ఒక గేయచిత్రం ఈ క్రింది విసరురాతి పాట. అన్నయ్యకు చెల్లెలు తన బాధలను నివేదించుకుంటున్నది. ఆయన ఓదార్చడానికి అన్ని విధాలా ప్రయత్నిస్తున్నాడు. ఇది ఒక గేయంలా లేదు. ఎంతోదూరం నుంచి వచ్చిన అన్నయ్యకు కావిలించుకొని ఏడుస్తూ తన బాధలను విప్పిచెప్తున్న సన్నివేశం కళ్ళ ఎదుట సజీవ చిత్రంలాగా కనిపిస్తున్నది.





'కాకరచెట్టు మీద కాకెమ్మ వాలే
కాకెమ్మ సకిణాల అన్న లొచ్చిరీ
కాళ్ళాకు నీళ్లిచ్చి కన్నీళ్లు బెట్టే
కన్నీళ్లు బెట్టినా కార్ణమేమమ్మా
పుట్నింటి వాళ్ళేమి బుగ్గి అయ్‌నారా
తుడుచుకో కన్నీళ్లు ముడుచుకో కురులు
నూటికీ నూరామడ నన్నిస్తిరన్నా
పుట్టిల్లు దొవ్వాయె పోరు బలమాయె
యారాళ్లు వున్నింటికి నన్నిస్తిరన్నా
యేరు నుగ్గుల దాలి యేసినట్లుంది
కలిగున్న వారనీ నన్నిస్తిరన్నా
కళివి కాయలు తెచ్చి గంప కేసీరీ
భాగ్యవంతూలని నన్నిస్తిరన్నా
బారకాయలు కాసె బాన కేసీరీ
బతికింటె చెల్లెలా బందలంపేనూ
తీరింటి చెల్లెలా చీరలంపేనూ
యాడాది కొక చీర చాటె డొడిబాలు
బాలునికి పుట్టంగి బంగారుగిలకా'[6]

మన సంస్కృతికి అత్తకోడళ్ళ సంబంధం ఒక మాయని మచ్చ. తెలుగుదేశంలోను, కన్నడదేశంలోను అత్త అంటే ఆరళ్ళే గుర్తుకు వస్తాయి. అందరు అత్తలు అలాగే ఉండరు. కాని మామూలు అభిప్రాయం మాత్రం 'అత్తలేని కోడలుత్తమూరాలు, కోడలూ లేనత్త గుణవంతురాలు' అని. అత్తలను సాధించే కోడళ్ళకూ కొరత లేదు. ఆరడి చేసే అత్తగారితో ఒక కోడలు ఇలా అంటున్నది–

అత్తగారా రావమ్మా ఆరడి చేయకమ్మా
ఒత్తులు ఒత్తకమ్మా ఒత్తిగిలి ఉండాలమ్మా
కొడుకులు గన్నానంటూ
కోమలి పొంగాకమ్మా (కామమ్మ, నెల్లూరు)

కొందరికి అత్తమామలంటే లక్ష్యమే ఉండదు. వాళ్ళను వెక్కిరించడమే పని.

'మాయత్త మామామ ఊరేగుతుంటే

చుట్టపీకలు రెండు చూడొచ్చినాయి
మట్టగిడసలు రెండు మాట్లాడినాయి
కందరీగలు వచ్చి కత నడిపినాయి
బోదురు కప్పలు వచ్చి భాగోతమాడు’[7]

అంటుంది ఇరుగు పొరుగుతో పొగరుబోతు కోడలు

తెలంగాణలోని గేయంగా రామరాజుగారిచ్చిన ఒక గేయం చివర భావాలు నిరుపమానంగా ఉన్నాయి. ఒకసారి చదివితే మళ్ళీ మరిచిపోలేమవి. తన జీవితం అత్యంత దుర్భరమైనదని వేదనతో తల్లడిల్లుతూ పలికే జానపద స్త్రీ హృదయం ఇందులో మనకు కళ్ళకు కట్టినట్లు కనిపిస్తుంది. ఆ కోడలు అంటున్నది–

‘మా నన్న గానైతి మంచె వేతూరు
చెట్టన్న గానైతి చెలగి వేతూరు
ఆకన్న గానైతి మేకలారగించు
కాయన్న గానైతి కాకులారగించు
పండన్న గానైతి పక్షులార గించు
బలుడు మా తండ్రి పాలు బిందంగ
బంగారు చెంబులో ధారగానైతి
సిరిదేవి మాయమ్మ చల్ల చేయంగ
చిల్లి పోయి కవ్వాన చితుపగానైతి’[8]

వేదన వల్ల కలిగిన వైరాగ్యానికి ఇది పరాకాష్ఠ. ఇటువంటి గేయాలు ప్రాచీన కవిత్వంలో పరమోత్కృష్టాలని మనం చెప్పుకునే ఏ పద్యానికీ తీసిపోవు.

అత్త కోడళ్ళతో బాటు అత్త–అల్లుళ్ళనుగూర్చి కూడా చెప్పుకోవాలి. అత్తా అల్లుళ్ళ మీద పాటలే కాదు – ఎన్నో కథలున్నాయి. అవి చాలా వరకు బూతుల బుంగలు. మామ దగ్గరకన్నా అత్త దగ్గర కొంచెం ఎక్కువ కలుపుగోలు తనం చూపిస్తారు అల్లుళ్ళు. అల్లుడంటే ఒకనొక అత్తగారికి ఒళ్ళుమంట. ఎప్పుడూ తాను కానుకాలు స్వీకరించడమే కాని తనకు తేడాయె! అయితే ఆ అల్లుడొకసారి అత్తకు ప్రీతిగా ఒక అద్దాల రైక తెచ్చాడు. ఆ సంబరం ఈ క్రింది పాటలో వ్యక్తమవుతున్నది.

‘అల్లుడల్లాడంటె ఒళ్లు మండేను
అల్లుడత్తకు తెచ్చె అద్దాల రైక
ఇప్పుక తొడగ బోతే నిప్పుల్లురాలె





మరగేసి తొడిగితే మల్లెల్లురాలె
ఇదియేమి అల్లుడా ఇంత సోద్యాము
కాదత్త నేసెబుత సువ్వాలకించు
నిత్తె మల్లెల రైకు నీకు అందమ్ము
నువు కన్న కూతూరూ నాకు అందమ్ము’[9]

కొందరు ‘పండుగొచ్చితేను పంటికే చేటు, అల్లుడొచ్చితేను అత్తకే చేటు’ అనుకునే వారుంటారు.

కథాగేయాలు కాకున్నా కొన్ని చిన్న జానపద గేయాల్లో ఎంతో కథ ఉంటుంది. ఆ సన్నివేశాన్ని మనంనేరుగా చూడనక్కరలేదు. గేయమే మన కళ్ళకు చూపిస్తుంది. జానపదుల కవితానిర్మాణ శక్తి ఒక్కొక్కసారి మనకు ఆశ్చర్యాన్ని కలిగిస్తుంది. ఈ క్రింది జానపద గీతంలో జీవం తొణికిసలాడే కథ ఉంది. ఒక పడుచు తమ్మునింటికి వెళ్ళింది. అక్కడెంతో మర్యాద చేశాడు తమ్ముడు. అన్న యింటికి వెళ్ళింది. వదిన పరమగయ్యాళి. సూటి పోటి మాటలతో మనసు గాయపరచింది. అన్నయ్యతో చెప్పుకున్నది చెల్లెలు. ఆయన ఊరడించాడు. ‘కొనుక్కొచ్చిన దాని మాటకు కోపమేలమ్మా’ అన్నాడు. ఆ దినాల్లో వాడుకలో ఉండిన కన్యాశుల్క విధానాన్ని తెలుపుతున్నాయీ మాటలు. తన చెల్లెలికి ఎన్నో కానుకలిచ్చి పంపాడన్నయ్య. ఇది ఒక సజీవ చిత్రం. మధుర భావ సంభరితం.

‘తలమాసి నేబోతి తమ్మునింటీకి
తలగడిగె మల్లెలతొ తమ్ముడాదెప్ప
ఆకలిగొని పోతి అన్న యింటీకీ
అరటి పండ్లొడగట్టె అన్న రామన్నా
అడుగడుగు నిమ్మల్లు ఆకుదోటల్లు
అరిచంద్రుని పూదోట అమ్మా పుట్నిల్లు
టెంకాయ వనముల్లు దేరి వాకిండ్లు
దేవేంద్రుని పూదోట నాది పుట్నిల్లు
యెండేటి ధాన్యము యెత్తుకొని పొమ్మ
వండేటి వంటకము వార్చుకొని పొమ్మ
వింటివా అన్నయ్య నీ యాలి మాటా
అన్నెకారి మా వదిన ఆడిన్నమాటా

కొను కొచ్చిన దాని మాటకు కోపమేలమ్మా
నీకీ వొన్నెల చీరా నీకి వొడిబాలూ
బాలునికి పుట్టంగి బంగారు కుల్లాయి
అయిదేళ్ళ కుంగరాల్ అస్త కడియాలు
పదియేళ్ళ కుంగరాల్ పాల కడియాలు
అత్తింటి కంపెనే అన్న రామన్న'[10]

## కన్నడం

కన్నడంలో కూడా బాంధవ్యగీతాలు ఇంచుమించు ఇలాగే ఉంటాయి. ఇతర ప్రదేశాలలో ఎలా ఉన్నా ఆంధ్ర కర్నాటకాలలో సాంస్కృతికంగా కుటుంబ ఆచారాలు ఒకే విధంగా ఉంటాయి. అందువల్ల కౌటుంబిక గీతాలలో పోలికలు ఎక్కువగా కనిపిస్తాయి. బాంధవ్యగీతాలను గురించి చెప్పేటప్పుడు ఒక విషయాన్ని మనం మరచి పోగూడదు. పని పాటలు, వేడుక పాటలు మొదలైనవి ఆయా సందర్భాలలో పాడడానికై కల్పించబడ్డవి. కాని తల్లీ కూతుళ్ళ, ఓదార్పులుగాని, అత్తాకోడళ్ళ ఆరళ్ళుగాని, అన్నా చెల్లెళ్ళ సంవాదాలుగాని ఆయా సందర్భాలలో గేయాలుగా పాడబడేవికావు. రాగులో బియ్యమో తిరుగలిలో పోసుకొని తిప్పుతూ పాడుతారు వీటిని. అత్త తనను కసురుకొంటున్నదనో, అన్న తన ఇంటికి రాలేదనో, తల్లి ఇంటికి వెళ్ళలేక పోయామనో వేదన చెందుతూ పాడే పాటలివి. ఈ విధంగా బాంధవ్య గీతాలు అత్యుత్తమ భావ గేయాలకు ఉదాహరణాలని చెప్పవచ్చు.

కన్నడంలో 'గృహిణీ గీతాల' పేరుతో ప్రచురింపబడిన గేయ సంకలనాలలో ఎక్కువ భాగం బాంధవ్య గేయాలే. ఇవి చాలా వరకు త్రిపదులలో ఉన్నాయి. జీవితానుభవం, కల్పనాశక్తి, భావపుష్టి, అర్థ సౌందర్యం ఉండే అత్యంత మనోహర గీతాలివి.

తల్లీకూతుళ్ళ సంబంధం కన్నడిగుల సంస్కృతిలో కూడా తెలుగు కుటుంబాలలో లాగానే కనిపిస్తుంది. కన్నడ స్త్రీకి కూడా తల్లి ప్రేమమయి, పవిత్రమూర్తి. వంధ్యాస్త్రీకి సంఘంలో గౌరవం లేదన్న విషయం కన్నడ బాంధవ్య గీతాలలోను వ్యక్తమవుతున్నది. గొడ్రాలు పిల్లలను చేరదీయకూడదు, తాకకూడదు, అసలు చూడడంకూడా పాపమే. వంధ్యాస్త్రీ తన్ను తాను నిందించుకుంటుంది. బిడ్డలు లేని బ్రతుకు వ్యర్థమని వేదన





చెందుతుంది.

"బాలకరిల్లద బాళీద్యాతర జన్మ
బాడీగి ఎత్తు దుడిద్వంగ బాళెలెయ
హాస్యుండు బీసి ఒగెదంగ"[11]

బాడుగకు తీసుకున్న ఎద్దులాంటిదట వంధ్యాస్త్రీ. తిని పారవేసే అరటి ఆకు వంటిదట గొడ్రాలు. కన్నడ గృహిణి కాలకంఠుణ్ణి భక్తితో వేడుకొంటుంది– 'స్వామీ! బిడ్డను ఇవ్వు. బిడ్డలు లేని ఈ జీవితాన్ని భరించలేను. వంధ్య అనే శబ్దాన్ని భరించలేను' అని.

'కందన కుడు శివనె, బందానె బిడలారె
హంగీన బాన ఉణలారె మర్యాదాగ
బంజెంబ శబుద హొరలారె'[12]

జానపదులలో గమనించ వలసిన మరొక గొప్పగుణం త్యాగబుద్ధి. తమకు లేకున్నా ఇతరులకు బిడ్డలను ఇవ్వవలసిందని దేవుణ్ణి ప్రార్థించే గుణం ఒక్క జానపదులలోనే మనకు కనిపిస్తుంది. ఒక పడుచు తన స్నేహితురాలు బిడ్డలకోసం పడే బాధను చూచి ఇలా ప్రార్థిస్తున్నది–

'కూడల సంగయ్య ఇవ్వు బిడ్డల నాకు
నా కొద్దు నాదు సఖి కివ్వు! ఇస్తేను
వాకిలికి హొన్ను వేసేను' (తెలుగు అనువాదం)
'కూడల సంగయ్య నీడు మక్కళ ననగ
ననగల్ల నన్న గెళతిగ కొట్టారె
బాగిలక హొన్న బడిసేన'[13]

మన సమాజంలో స్త్రీ ఎన్ని విధాల కష్టాలను ఎదుర్కోవలసి వస్తుందో తలచుకుంటే కళ్ళలో నీళ్ళు తిరుగుతాయి. అందువల్లనే ప్రతి స్త్రీ తనకు కూతురు పుట్టగానే కొంతవరకు మనస్సులో గుబుళ్ళు నింపుకుంటుంది. 'స్త్రీగా పుట్టడం కన్న మట్టి కావడం మంచిది. మట్టి మీద చెట్టుగా పుట్టితే వచ్చిన వారికి నీడయినా ఇవ్వవచ్చు' అని ఒక స్త్రీ పాడుకుంటున్నది. ఇది భావ కవిత్వానికి అత్యుత్తమ ఉదాహరణ. సహృదయుడైన ప్రతిశ్రోత హృదయాన్నీ ఇది కదిలిస్తుంది. 'మానన్న గానైతి మంచె వేతూరు, చెట్టన్నగా నైతి చెలగి వేతూరు.....' అన్న తెలుగు గేయాన్ని పోలుతుంది.

'హెణ్ణు ఆగుదకింత మణ్ణు ఆగుదు లేసు
మణ్ణిన మ్యాలె మరవాగి బెళెదార
బందవరిగెల్ల నెరళవ్వ'[14]

తల్లీకూతుళ్ళ సంబంధంలోని ఔన్నత్యాన్ని సూచించే పాటలు కన్నడంలోను ఎన్నో ఉన్నాయి. అత్తగారింటికి వచ్చిన తర్వాత తల్లిని గూర్చిన చింత కూతురికి ఎక్కువవుతుంది. ఆమెకు అత్తగారిల్లు కొత్త. ఎందరో వచ్చి తన యోగక్షేమాలను విచారిస్తారు. కాని కూతురికి తృప్తి లేదు. భర్త ఎంతో ప్రేమతో చూచుకున్నా అత్తగారు మంచివారైనా ఎవ్వరూ తల్లిని సరిపోలరు.

'యారు ఇద్దరు నన్న తాయవ్న హోలర
సావీర కొళ్ళి ఒలియాగ ఇద్దర
జ్యోతి నిన్నారు హోలర'[15]

వెయ్యి కొరివి కట్టెలున్నా జ్యోతికి సమానమా? తల్లిజ్యోతి వంటిది. చిన్ని చిన్ని కన్నడ త్రిపదుల్లో ఉండే మహత్తర సౌందర్యాన్ని విలోకించినపుడు మళ్ళీమళ్ళీ వాటిని చదివి ఆ సుఖాన్ని అనుభవించాలనిపిస్తుంది. గోవుచుట్టూ ప్రదక్షిణం చేస్తే భూప్రదక్షిణం చేసినంత ఫలమంటారు. కాని తల్లి యింటికి వెళ్తే కాశీకి పోయినంత పుణ్యమని ఒక కన్నడ గృహిణి కమనీయ కల్పన. కాశీకి వెళ్ళాలంటే కాళ్ళు కదలవని, పుట్టింటికి వెళ్ళాలంటే చేతులుయ్యాల చేరులై ఊగుతాయని తెలుగు పడుచులు పాడుతుంటారు. కాశీయాత్రకు వెళ్ళాలంటే యెన్నోదినాలు కావాలి. అంతదూరం వెళ్ళి ఎన్నో కష్టాలు పడే బదులు తల్లియింటికి పోయివస్తే చాలు. ఈ జానపద గేయంలోని కల్పన ఏ సహృదయుణ్ణి అలరించదు!

'కాసీగి హోగలక ఏసొందు దినబేక
తాస్పొత్తి న్హాది తవరూర మనియాగ
కాసి కుంతాళ హడెదవ్వ'[16]

ఆమె దృష్టిలో తల్లికి, దేవుడికి భేదం లేదు. అయితే తల్లిని తలచుకునే తీరిక ఎక్కడిది? పొద్దున్నే పెరట్లో దూడ తల్లి దగ్గర పాలు తాగుతుంటే ఆ దృశ్యం చూచినప్పుడు కూతురి హృదయం తల్లిని గురించిన జ్ఞాపకాలలో నిండిపోతుంది. తాను చిన్నప్పుడు తల్లిదగ్గర పాలుతాగడం గుర్తువస్తుంది. 'ఆవుదూడ వచ్చి అంబ అంబ అని పాలుతాగుతుంటే మా అమ్మ ధ్యానం నాకు'అనుకుంటుంది.

అకళ కరు బందు అంబ అంబా ఎందు





తమ్మమ్మన మొలెయు నలినలిదు ఉంబాగ
నమ్మవ్వన ధ్యాన ననగాగి (సీతమ్మ, చింతామణి)

తల్లిని గూర్చిన భావాలు తనువు పులకరించేలా చెప్పే గీతాలు కన్నడంలో అసంఖ్యాకంగా ఉన్నాయి. వాటిని చదివితే వదలడానికి బుద్ధి పుట్టదు. ఒక త్రిపదిలో తల్లిని గూర్చి తనయ ఇలా అనుకుంటుంది. 'వేసవిలో వేపచెట్టు చల్లన భీమరథి నది చల్లన, నన్నుగన్నమ్మ! నా పుట్టింటికి నీవే చల్లన'

'బ్యాసగి దివసక బేవిన మరతంపు
భీమరతి యెంబ హొళి తంప హడదమ్మ
నీ తంప నన్న తవరీగి'[17]

తల్లిలేని పుట్టింటికి వెళ్ళాలంటేనే తనయ మనసు తల్లడిల్లుతుంది. తల్లికి కూతురు ఇచ్చే స్థానం మహత్తరమైంది, అద్వితీయమైంది.

ఇక సోదరీ సోదరీ సంబంధం కూడా కన్నడిగులలో తెలుగు ఇళ్ళను బోలినదే. అన్న గురించి చెల్లెలు చాలా ఘనంగా అనుకుంటుంది. తన అన్న చాలా గొప్పవారు. గుఱ్ఱాన్ని ఆడిస్తూ, ఏనుగును నడిపిస్తూ, చిలుకకు మాటలు నేర్పుతూ వస్తాడు అన్న.

'కుదిరీయ కుణిసూత అనీయ నడసూత
అరగిణిగె మాత కలిసూత బరతాన
బరి గొడదమ్మ బదిగాగ'[18]

తన కుమార్తెను తమ్ముడికి ఇవ్వాలని ఎంతో ఆశ స్త్రీకి. 'ఆడపిల్లను కన్నాను, తమ్ముడికి ఇచ్చాను, నేను పుట్టిన యింటికే కోడలైంది నా బిడ్డ, నా తమ్ముడికి భార్య అయింది' అని సంతోషంగా పాడుకుంటుంది అక్క.

'హెణ్ణమ్మ పడెదెనా తమ్మనిగె కొట్టె
హుట్టిద మనెగె సొసె యాగి కందమ్మ
తమ్మన మడది యాదాళు (సీతమ్మ, చింతామణి)

తన కూతురు తమ్ముణ్ణి పెళ్ళాడుతున్నదన్న భావమే ఆమెను పులకరింప జేస్తుంది. దానికి తగ్గట్లే తమ్ముడికూడా అక్క అంటే ఎంతో ప్రేమ 'ఊరక అన్నం తినమంటే తినను, నీ కడుపులో ఉండే పిల్లను ఇస్తానంటే వస్తాను' అంటాడు.

బరియ ఊటక్కె బరలొల్లె అక్కయ్య
నినతోళ మేలాడొ హసుళెయ కందమ్మ
కొడుతీనెందారె బరుతీని (సీతమ్మ, చింతామణి)

ఈ మాట చెప్పగానే ఆమెకు కలిగే సంతోషం చెప్పనలవికాదు.

అన్నాతముళ్ళ మీద సోదరి కుండే ప్రేమ మాటల కందనిది. ఒక దినం జంగముడొకడు భిక్ష అడగడానికి వచ్చాడు. అత్తగారింట్లో తనకు స్వాతంత్ర్యం లేదు అందుకని అతనికి చెప్తున్నది.

'ఓ జంగమ జోగి మా పుట్టింటికి వెళ్ళు
సన్నబియ్యం దాన మిస్తారు-అన్నయ్య
బంగారు దానమిస్తారు
ఉల్లిపాయ దానం నీరుమజ్జిగ దానం
అంబలి దానం ఇస్తారు అన్నయ్య'

అన్నయ్యే కాదు; తమ్ముడు కూడా ఎన్నో బావులు తవ్వించాడు. భీముడు, ధర్మరాజు వంటి అన్నదమ్ములున్నారు తనకు.

'జోగి జంగమరె హోగి నన్న తౌరిగె
సణ్ణక్కి దాన కొడుతారె అణ్ణయ్య
హొన్నిన దాన కొడుతారె ॥
నీరుళ్ళి దాన నీరు మజ్జిగె దాన
మత్తె అంబలిదాన కొడుతారె అణ్ణయ్య
అంబలియ ముద్దె కొడుతారె ॥
అత్తిగె బసురి మనెముందె చప్పర
అన్న చత్రావ ఇడసీదె అణ్ణయ్య
మనెముందె ఇడిసీదె అరవంటిగె ॥
హొదీయె అరమనె బీదియా పడసాలె
ఏళు సుత్తిన కల్లు భావి కట్టిస్యాను
ఇడిస్యాను తమ్మయ్య అరవంటిగె ॥
భీమధర్మజరంథ సోదరిరువారు
ద్రౌపతియంథ మడదీయ సిక్కాలి
మనెతుంబ హొన్ను హరియాలి'॥ [19]

అన్న, తమ్ముడు మంచివారే గాని వారి భార్యలు మాత్రం అంత మంచివారుకారు. అన్న భార్య కళ్ళకు చూడడానికి బాగుంటుందట! కాని మనసు మంచిది కాదు. సున్నం నీళ్ళు చూపించి ఇవి బఱ్ఱెపాలు అని చెప్తుందట!





'అణ్ణన హెండతి కణ్ణిగె ఒళ్ళెవళు
సుణ్ణద నీర ఒలె ముంద ఇటగొండు
ఎమ్మి హాలెందు బడస్యాళ'[20]

కన్నడిగుల కుటుంబాలలో కూడా అత్తాకోడళ్ళనగానే విభేదాలే మొట్టమొదట కనిపిస్తాయి. అత్తాకోడళ్ళ సామరస్యాభావాన్ని తెలిపే పాటలు కన్నడంలో అసంఖ్యాకంగా ఉన్నాయి. అత్తను తృప్తి పరచడం అలవి కాని పని, 'పచ్చి పాల మీద మీగడలేవి' అని అడుగుతుంది అత్త. ఎలుగుబంటిని కట్టి పాలు పిండమటుంది. పులి ముంగాలు పట్టుకో అంటుంది.

మాడబారద కెలస మాడెందళత్తెమ్మ
కరడీయ కట్టి హాల కరెయెందళు దేవరె
హులియ ముంగాల హిడి ఎంద్రు     (తిమ్మక్క, మైసూరు)

స్త్రీకి మంచి అత్తగారు లభించాలని ఎంతో ఆశ ఉంటుంది. గోవు వంటి అత్త, గోకులంవంటి మామ, శ్రీకృష్ణుని వంటి శ్రీవారు ఉంటే పుట్టింటినే మరచి పోగల ననుకుంటుంది.

'ఆకళంథ అత్తె గోకులదంథ మావ
శ్రీకృష్ణనంథ పతిరాయ ఇద్దరె
సాకిద తవర మరెదేను'[21]

భావగీతాలలో అత్యుత్తమమైనవిగా పరిగణించదగిన జానపద గేయాలు కన్నడంలో ఉన్నాయి. రాగులు వేసుకొని విసరుతూ 'ఎవరిని తలచుకునేది' అనుకుంటున్నది ఒక గృహిణి. తర్వాత నాతల్లిదండ్రులను తలచుకుంటే అత్తయింటి కష్టం కొంత వరకైనా మరచి పోగలను' అనుకుంటుంది. ఈ త్రిపది భావగంభీరంగా ఉంది. చిన్నప్పుడు తల్లిదండ్రుల దగ్గర అల్లారుముద్దుగా పెరిగింది తాను. ఇప్పుడిలా కష్టాలనుభవించవలసి వచ్చింది. కష్టాల్లో ఉన్నప్పుడు మనం జీవితంలో ఏనాడో అనుభవించిన మధురక్షణాలను తలచుకొని తృప్తిచెందడం మామూలు. అలాగే ఈ అతివ చిన్ననాటి జ్ఞాపకాలతో తృప్తి చెందుతున్నది. ఈ క్రింద ఉదహరించిన గీతం ఒక విధంగా మన సంస్కృతికి ప్రతిబింబం. ముఖ్యంగా ఆంధ్ర కర్ణాటకాలలోని గృహాలలో, ముఖ్యంగా పల్లెటూళ్ళలో కనిపించే జీవనానికి ప్రతిరూపం. త్రిపదులలో తన హృదయాన్నంతటినీ వెలిపరుస్తూ ఒక గృహిణి ఇలా అనుకుంటున్నది-'అత్తయింటి కష్టం ఎవరికి చెప్పేది? నేను బ్రతికి ఏం లాభం? కుక్కవంటి కొరగాని బ్రతుకు నాది.

కనీసం బిడ్డలైనా పుడితే ఆ సంతోషంలో ఈ కష్టాలను మరచి పోయేదాన్ని. నీ భర్త కూడా అత్తగారి వైపుచేరి నన్నే తప్పులెంచుతారు పతిదేవుడే ఇలా అయినప్పుడు ఇక ఎవరిని అనుకునేది నేను! నేను చేసిన వంట ఏమాత్రం బాగలేదట! మా అత్త నామీద కోపగించుకుంటుంది ఓ రాగిరాయీ! నీ వైనా నామీద దయచూపుమా? నా మీద కోపగించుకోకు. నా తల్లీ నీవైనా కాపాడు. అత్తవచ్చే పొద్దయితే నాకు తలనొప్పి హెచ్చవుతుంది. మామ వస్తాడంటే నాకు భలే ఇష్టం. పుట్టినింటికి పోయి మూడు మాసాలయింది. పుట్టింటి మీద చాలా బెంగ పట్టుకుంది. అక్కడికి వెళ్ళలేనందుకు ఎంత చింతిస్తే ఏం లాభం? ఎవరికి చెప్పుకునేది నా కష్టం. ఏదేమైనాకానీ నా భర్త నా దైవం అయిన గడుసువాడే కాని, ఆయన్ను చూస్తే నా కెందుకో భయం అయినా ఆయనే నా దైవం.

'రాగీయ బీసుత్త యారన్న నెనెయాలి
నన్న తందె తాయి తవరన్న నెనెదారె
అత్తేయ కష్ట పరిహార ॥
అత్తెమాడువ మాట యా గె హేళాలి
నా నిద్రుకూడ భూమీలి నాయియ
మరియంత జన్మ ననగీగ ॥
ఎష్టెష్టు బీసిద్రూ ముగియోద నాకాణె
యావాగ ననగె మక్కళు మరిగళు
ఎందిగప్ప నాను అత్తేయు ॥
నమరాయు కూడా అత్తేయ కడెగాగి
ననమేలె తప్పు హేళ్తారె పతిదేవ్రు
యారన్ను నెనెయాలి ఆ మేలె ॥
నాను మాడిద అడిగె హల్లిగ్విడిసదంతె
నాను మనెయింద దూరవంతె నమ్మత్తె
ననమేలె కోప మాడ్తారె ॥
రాగీరాగీ కల్లె నీ నాద్రూ దయమాడి
ననమేలె కోప మాడ్బేడ నంతాయి
నీ నాద్రూ నన్న కాపాడు ॥
అత్తె బరువా హెత్తు నెత్తి కాదాహంగె





మావ బరువ హెత్తు మావిన్హంగె । ననగె
మావ బందరె బలు ప్రీతి ॥
తౌరూరిగ్హో గాదె మూర్మాస సందీతు
తౌరీన చింతె బలుచింతె । ననగీగ
తాయ్తుందె చింతె బలుచింతె ॥
చింతె యాదరాను యారిగె హేళాలి
అత్తె ఎందారె మునిస్యాళు సిడుక్యాళు
గండ ఎందరె గడుస్యాను ॥
గడుసిరలి హ్యాగిరలి ననగండ దేవరు
నమరాయేన్నన దేవరు దినదల్లి
దేవర నోట ఉరినోట॥'[22]

తల్లిదండ్రులను తలచుకుంటే కష్టాలు పరిహారమవుతాయనుకోడం వల్లె పడుచు గుండెలోతులను తెలుపుతున్నది. భర్త కూడా అత్తతో చేరాడు. కదా అనే బాధ తొలుస్తున్నా భర్తే నా దైవం అనుకొనే ఆ స్త్రీ మూర్తి హృదయం భారతీయ సంస్కృతికి దర్పణం తానూ ఒకనాటికి అత్తను కావచ్చుననే భావన ఆమెకు తృప్తినిస్తుంది. రాగి విసరే రాతితో తన గోడును విన్నవించుకుంటూ, అమాయక జానపద స్త్రీ వెలువరించే ఆవేదన మన యెదుట కన్నులకు కట్టినట్లవుతుంది. ఈ కరుణామయ సన్నివేశం మన హృదయంలో శాశ్వతంగా నిలిచిపోతుంది. ఇలాంటి గృహజీవనానికి సంబంధించిన గీతాలలో ప్రతిబింబితమయ్యే కౌటుంబిక బాంధవ్యం మన సంస్కృతిలోని వివిధ విషయాలను తెలియజేస్తుంది.

గృహంలోని ఒక్కొక్కరి బాంధవ్యాన్ని గూర్చి తెలిపే ఈ పాటలు మన నిత్యజీవితంలో కనిపించే వెలుగు నీడలను చూపిస్తాయి. గృహ జీవనమనేది మనం ఏర్పరచుకొన్న వ్యవస్థ. ఆ జీవనంలో ఎన్నో కష్టాలున్నాయి; వాటిని ఉన్నవి ఉన్నట్లుగా మనస్సునాకట్టుకొనేలా వర్ణిస్తున్నాయి జానపద గేయాలు.

**టిప్పణి**

1.C.M.Bowra, Primitive Song, p.40

2.Ibid, p.169

3. బి.రామరాజు (సం), తెలంగాణా పల్లెపాటలు, పు.112
4. త్రివేణి, పు.87
5. నేదునూరి గంగాధరం, జానపద గేయ వాఙ్మయ వ్యాసావళి, పు.31
6. త్రివేణి, పు.96
7. బి.రామరాజు, తెలుగు జానపద గేయ సాహిత్యము, పు.462
8. బి.రామరాజు (సం), తెలంగాణా పల్లెపాటలు, పు.99
9. త్రివేణి, పు.88
10. అదే, పు.88
11. బి.ఎస్.గద్దగిమఠ, కన్నడ జానపద గీతగళు, పు.103
12. అదే, పు.103
13. అదే, పు.104
14. అదే, పు.104
15. హొన్న బిత్తేవు హొలకెల్ల, పు.276
16. అదే, పు.274
17. అదే, పు.271
18. హళ్ళియ హాడుగళు, అరుణోదయ, పు.43
19. జనప్రియ జనపద గీతె, పు.72
20. హళ్ళియ హాడుగళు, పూర్వోక్తం, పు.43
21. ఎం.జీవన (సం.), జానపద గీతెగళు,పు.106
22. జనప్రియ జనపద గీతె, పు.28





# 5.పిల్లల పాటలు

పిల్లలు కూడ గృహజీవనంలో ఒక భాగంగా ఉన్నారు. అయినా పిల్లల పాటల కుండే ప్రత్యేకతను బట్టి వాటిని విశిష్టశాఖగా పరిగణించి పరిశీలించవలసి ఉంది. నిష్కపటమూ, నిర్మలమూ అయిన పసిపిల్లల హృదయంనుంచి వెలువడే పాటలు మృదువుగా, స్వచ్ఛంగా, నిసర్గ మనోహరంగా ఉంటాయి. తల్లిగర్భంనుంచి వెలువడిన శిశువు కేరుమని ఏడుస్తూ, కాళ్ళుచేతులాడించడమే మొదటి పాట, ఆట. పాడి, ఆడడమే పసివారి దేహారోగ్యానికి ఉత్తమ వ్యాయామం.

ఆదిమానవుని భాష మన భాషకంటె ఎక్కువ లయబద్ధంగా, పాటకు దగ్గరగా ఉండేదని విజ్ఞులు చెప్తారు. అట్లే పసిపిల్లల మాటల్లో కూడ ఏదో తెలియని మాధుర్యం ఉంటుంది. పసిపిల్లలు కఠినమైన మాటలు పలకలేరు. వాళ్ళకు నోరు తిరగదు. అందువల్ల వారు మాట్లాడే మాటల్లో లాలిత్యం ఉంటుంది. అందుకే బాలగేయాలు తియతియ్యని మాటలతో నిండి ఉంటాయి.

పిల్లల పాటలు ఇతర జానపద గేయాలలాగే ప్రపంచమంతా వ్యాపించి ఉన్నాయి. ప్రపంచంలో ఎక్కడైనా సరే పసివారు పాట అంటే చెవి కోసుకుంటారు. పాటలు నేర్చుకోవడంలో పెద్దవాళ్ళు పిల్లలతో పోటిపడితే తప్పకుండా ఓడిపోతారు. వాళ్ళ జీవితమే కవిత్వమయం. "All over the world children live in a song-saturated atmosphere, Rhymes and chants come as easily to them as the green leaves to the forest. Their life is all poetry.......Indian Folklore is just a rose bush with Children's rhymes and chants as its lovely buds"[1]

పిల్లల పాటలను ఇంగ్లీషులో Children's Songs అంటారు. ఇవి అమెరికాలో mother goose అనే పేరుతో ప్రసిద్ధమయ్యాయి. ఇంగ్లాండులో వీటిని nursery rhymes అంటారు. పిల్లల పాటలలో చేర్చదగినవి లాలిపాటలు (lullaby), ఉయ్యాల పాటలు (cradle songs), ఆట పాటలు (game songs), శిశు ప్రాసలు (children's rhymes) మొదలైనవి.

పిల్లల పాటలలో రెండు రకాలున్నాయి. పెద్దవాళ్ళు పిల్లల కోసం వ్రాసినవి. పిల్లలు తామే అల్లుకున్నవి. పెద్దవాళ్ళు రూపొందించిన వాటిలో లాలులు, జోలలు, ఆటలకు సంబంధించిన పాటలు ఉన్నాయి. లాలి పాటల్ని డా.బి.రామరాజుగారు

తమ 'తెలుగు జానపదగేయ సాహిత్యము'లో స్త్రీల పాటలనే శీర్షిక క్రింద చేర్చారు. వీటిని స్త్రీలపాటల్లోనూ చెప్పవచ్చు, పిల్లల పాటల్లోనూ చెప్పవచ్చు. "ఈ లాలి జోల పాటల భావములు పిల్లలెంత మాత్రము అనుభవింపరు, కేవల మా సంగీతము మాత్రము వారిని నిద్రపుచ్చుటకో ఏడుపు నాపుటకో ఉపకరించును"[2] అన్నారు రామరాజుగారు. కాని ఆయన తమ 'తెలంగాణా పల్లెపాటలు'లో లాలిజోల పాటలను పిల్లల పాటలలోనే చేర్చారు. చిన్నపిల్లల కోసం మాత్రమే ఉద్దేశించబడినవి కావడంచేత వీటిని పిల్లల పాటలలో చేర్చడమే సబబని తోస్తుంది.

పెద్దలు పిల్లలకోసం వ్రాసిన పాటలలో వైద్యరహస్యాలు కూడా ఉంటాయి. వీటిలో మళ్ళీ పెద్దలే పాడేవి కొన్ని, పిల్లలు పాడేవి కొన్ని ఉంటాయి. చిన్న పిల్లలను నిద్ర పుచ్చడానికి పాడే లాలలు కాక, ఆడిస్తూ పాడే పాటలు కొన్ని ఉన్నాయి. పిల్లలే కల్పించి పాడేవి చాలా సరళంగా, లయ ప్రధానంగా ఉంటాయి.

బాలగీతాల ముఖ్యలక్షణం వాటి లయ. అక్షరాలుగాని పదాలుగాని పునరావృత్తి కావడం పిల్లల పాటల ముఖ్యలక్షణం. ఇదే వాటిని సుదీర్ఘ కాలం సజీవంగా నిలబెడ్తుంది. పిల్లల పాటలలో కొన్ని సంవాదరూపంలో కనిపిస్తాయి. హాస్యప్రవృత్తి కొన్నిట్లో కనిపిస్తుంది. అవిచ్ఛిన్నంగా ఒక తరంనుంచి మరొక తరానికి పిల్లల పాటలు సంక్రమిస్తూ ఉంటాయి. సంస్కృతిలోని ఒక భాగంగా వీటిని పిల్లలు ప్రచారం చేస్తూ ఉంటారు. ఇతర గేయాలకంటె ఎక్కువగా ప్రపంచంలోని వివిధ ప్రదేశాలలోని పిల్లల పాటల్లో పోలికలు కనిపిస్తాయి. భాషలోను, సాంస్కృతిక నైపథ్యంలోను విభిన్నమైనవైనా పిల్లల మనస్తత్వాన్ని ప్రతిబింబించే ఈ పాటలలో సార్వజనీన గుణం గోచరిస్తుంది. వేగంగా ప్రసారంకావడం బాలగీతాల మరొక లక్షణం. ఉత్సాహానికి ప్రతిబింబాలైన పసిపిల్లలు వాహకాలుగా ఉన్నందువల్ల ఈ వేగం బాలగేయాల ప్రసారాని కుంటుంది.

పిల్లల పాటలు ఎప్పుడు పుట్టాయి, ఎక్కడ, ఏ విధంగా అనే ప్రశ్నలకు సమాధానం చెప్పడం చాలా కష్టం. అర్థ గౌరవం ఎక్కువగా లేని లయాత్మక వ్యక్తీకరణలు కావడం వల్ల ఈ పాటల పుట్టుకను గురించి మాట్లాడడం కష్టసాధ్యం. పెద్దలు రూపొందించిన పాటలు వైద్యాది అనేక విషయాలతోగూడి, కొన్ని సమయాలలో అర్థం చేసుకోడమే కష్టమవుతుండడం కనిపిస్తుంది. ఇవి ఒక విధంగా అవశేషరూపాలుగా ఉంటాయి. పిల్లలు ఆటలాడేటప్పుడు ఆటలోని లయకు తగ్గట్టుగా ఒకటి రెండు పదాలను ఉచ్చరించడం దానికి ఇంకా పదాలు అదే లయలో చేర్చగా చేర్చగా పాట రూపొందవచ్చు. ఏదో జంతువునో, పక్షినో చూచినప్పుడు పరిచితమైన లయలో పిల్లలు





నాలుగు మాటలను చేర్చి పాట రూపొందేట్లు చేయవచ్చు.

పిల్లల పాటలను వర్గీకరించడం కష్టమైన పని. వీటిలో ముఖ్యమైనవి లాలులు, జోలలు. ప్రపంచమంతటా వ్యాపించి ఉన్న ఈ లాలిపాటలలో అంత్యప్రాసలు గమనించదగ్గవి కొన్ని పాటలలో పల్లవికే ఎక్కువ ప్రాధాన్యం ఉంటుంది. అర్థరహితమైన శబ్దాలు మాత్రమే ఉండే పాటలు కొన్ని ఉన్నాయి. చిన్నపిల్లలను కాళ్ళమీద వేసుకొని ఆడిస్తూనో, చక్కిలిగింతలు పెడ్తూ, తమాషాలు చేస్తూనోపాడేపాటలు కొన్ని. వీటిలో కొన్ని చారిత్రక ప్రాధాన్యం ఉండేవి. ఏదో ప్రదేశాన్నో, వ్యక్తినో తీసుకొని అల్లబడిన పాటలివి. పొడుపు కథల రూపంలో ఉండే పాటల కొన్ని. ఇవి పిల్లల బుద్ధిశక్తి ప్రచోదించేవి. వారికి మానసికమైన కసరత్తు వీటివల్ల లభిస్తుంది. ఎగతాళి పాటలు వీటిలో ఒక భాగం. స్నేహితులనో, బంధువులనో, అయ్యవార్లనో అనుకరిస్తూ, ఎగతాళి చేస్తూ, పాడేపాటలివి. కొన్ని పాటలను అసంబద్ధ గీతాలనే పేరుతో పిలవవచ్చు. ముఖ్యంగా పశుపక్ష్యాదులను గూర్చినవివి. ఇవీ ఎగతాళి పాటలేగాని, వస్తువు జంతువులకు, పక్షులకు సంబంధించినదై ఉంటుంది. ముక్తపదగ్రస్తాల రూపంలో ఉండే పాటలు కొన్ని. సంఖ్యాత్మక గేయాలు కూడా పిల్లల పాటలలో చేరదగ్గవే, ఆటపాటలనే పేరుతో కొన్నిటిని చెప్పవచ్చు. ఈ క్రీడాగేయాలు పిల్లల ఆటలకు నేపథ్యాన్నిస్తాయి. పల్లవిగా పనికి వస్తాయి. పిల్లల భావుకతను, స్వచ్ఛమైన మనస్తత్వాన్ని ప్రతిబింబించే బాలగీతాల అధ్యయనం జానపద విద్వాంసులు తప్పక చేయవలసింది.

### తెలుగు

తెలుగులో బాలగేయాలను రచించిన పరిశ్రమ ఇటీవలనే జరిగింది. కొందరు ఆంధ్రేతరులు కూడా శిశుప్రాసలను ప్రచురించి ఈ క్షేత్రంలో కొంత కృషి చేశారు. పిల్లల పాటలను తెలుగులో ప్రచురించినవారు, సేకరణలో అనేకులకు మార్గదర్శకులైన వారు ఎం.ఎన్.వెంకటస్వామి గారు, టి.వి.రంగయ్య శెట్టిగారు, వేదుల సత్యనారాయణశర్మగారు, టేకుమళ్ళ కామేశ్వరరావుగారు, నేదునూరి గంగాధరంగారు, బి.రామరాజు గారు. వీరుగాక సురవరం ప్రతాపరెడ్డిగారు, వేటూరి ప్రభాకర శాస్త్రిగారు, చింతా దీక్షితులుగారు, కృష్ణశ్రీగారు ఇంకా ఎంతోమంది వివిధ పత్రికలలో విమర్శక వ్యాసాలు వ్రాశారు.

తెలుగు జోలపాటలలో కొన్ని శిష్ట రచనలు కూడా ఉన్నాయి. తాళ్ళపాక

అన్నమయ్యగారి 'జో అచ్యుతానంద జోజో ముకుందా – రార పరమానంద రామ గోవిందా' అనేపాట జానపదుల గృహాల్లో అత్యధిక ప్రాచుర్యాన్ని పొందింది. లాలి, జోల పాటలలో ముఖ్యంగా తల్లి తనయుని గూర్చి ఎన్ని విధాలుగా అనుకుంటుందో, ఎన్ని కలలు కంటుందో, ఎంత గొప్పవాడు కావాలనుకుంటుందో అన్నీ ప్రేమ ప్రవాహంలా, అమృతధారలా, రసవద్గంగలా ఆమె నోటినుంచి మాటలు, పాటలుగా వెలువడడం కనిపిస్తుంది.

'Sleep, to-morrow you will be big,
you will be strong
Sleep, to-morrow you will take
the bow and the knife
Sleep, you will be strong,
you will be stright, and I bent'[3]

అన్నది మాతృప్రవృత్తికి చక్కని ఉదాహరణ. పిల్లల భావిజీవితాన్ని గూర్చిన బంగారు కలలుకనే తల్లులు ప్రపంచంలోని అన్ని ప్రదేశాలలో ఉన్నారు.

లాలి పాటలలో కొన్ని ప్రయత్న పూర్వకంగా రచించబడ్డవని చూడగానే తెలుసుకోవచ్చు.

అమ్మణ్ణి కన్నులు తమ్మిపువ్వుల్లు
తమ్మి పువ్వులలోని కమ్మతేనెల్లు ॥లాలీ॥
కిలకిలా నవ్వితె కలువల్లు పూసె
కలువ పువ్వులేమొ కలికి చూపుల్లు ॥ లాలీ॥[4]

లాలి పాటలలో స్తుతిరూపంగా ఉండేవి కొన్ని. బిడ్డ దైవసమానుడు. రాముడతడే; గోపాలుడతడే; దశావతారాల నెత్తిన విష్ణువూ అతడే. లాలి పాటల్లో దశావతారాలు ఉల్లేఖింపబడ్డవి రెండు మూడున్నాయి. నేను సేకరించిన గేయభాగ మీక్రిందిది.

లాలి రామన్న లాలి – ననుగన్న బాలగోపాలలాలి
లాలితామరలాలి – నానోము పంట భాగ్యంబలాలి
ఏచి సంద్రమునజొచ్చి – మీనమై సొచ్చి సోమకుని జంపి
తెచ్చి వేదములనెల్ల – నజునకు నిచ్చిన దేవలాలి........

(గంగన్న, కొమ్మేపల్లి, చిత్తూరు జిల్లా)





ఈ పాట 'కస్తూరి రంగరంగా' అనే ప్రసిద్ధగేయం వరుసలో ఉంది.

లాలిపాటలు చాలావాటిల్లో ఒక అర్థమంటూ ఉండదు. పాట చరణం చివర దీర్ఘం తీయడం కనిపిస్తుంది. ఆ దీర్ఘం పిల్లవాడు నిద్రమత్తులో పడేవరకు సాగుతుంది. 'ఉళుళుళువహాయీ' అన్నప్పుడు, 'హాయీ' అనేమాటను మళ్ళీమళ్ళీ ఉచ్చరించినపుడు ఈ పలుకులు పిల్లలు నిద్రించేట్లు చేస్తాయి.

హాయీ..........చిచ్చిళుళుళుళువ హాయీ
హాయి హాయి హాయి ఆపదలుగాయీ
చిన్ని వాళ్ళనుగాయి శ్రీవెంకటేశా హాయ్
హాయమ్మ బాయమ్మ అక్క జెల్లెళ్ళు
తొలి ఒక్క జన్మాన తోడి కోడళ్ళు ॥హాయీ॥

........(సుశీలమ్మ, నెల్లూరు)

ఊయెల పాటలుకూడా తెలుగులో ఉన్నాయి. తమ యిష్టదైవాన్ని వివిధరూపాలతో ధ్యానించుకుంటారు వీటిలో. 'ఉయ్యాలా' అనే పల్లవి ఈ పాటల్లో కనిపిస్తుంది.

'సురలు నసురులు మందరా–గిరితరచి
తరచి మథనము చేయగా
గిరికింద తా కూర్మమై–వెలసినా
సరసు బాడరె వుయ్యాలా'.......[5]

ఇది కూడా 'శ్రీరంగ రంగరంగా' అనే పాట వరుసలోనే ఉంది. ఈ వరుసలో చాలా పాటలు కనిపిస్తాయి.

బిడ్డకు ఉగ్గుపాలు పోసేటప్పటినుంచి నిద్రపుచ్చేవరకు జానపదుల ఇళ్ళలో పాటలు వినిపిస్తూనే ఉంటాయి. ఉగ్గుపాలైనా జీర్ణమవుతాయోలేదో అని తల్లికి భయం. అందువల్ల ఉగ్గుపాలు పోయగానే ఉగ్గుగిన్నె ఒక మారు చుట్టూ చుట్టి గొంతు దగ్గర్నుంచి బొజ్జవరకు నిమురుతూ–

'జీర్ణం జీర్ణం వాతాపి జీర్ణం
గుర్రం తిన్న గుగ్గిళ్ళు జీర్ణమై
ఏనుగు తిన్న వెలక్కాయ జీర్ణమై
భీముడు తిన్న పిండివంటలు జీర్ణమై'.....[6]

అని పాడుతారు.

శిశువు మరింత పెద్దయ్యాక తల్లి తన తొడలమీద కూర్చుండ బెట్టుకొని ముందుకూ వెనుకకూ ఊపుతూ వ్యాయామం చేయిస్తూ పాట పాడుతుంది.

ఏనుగొచ్చిందేనుగూ – ఏవూరొచ్చిందేనుగూ

మావూరొచ్చిందేనుగూ – మంచినీళ్ళు తాగిందేనుగూ

ఉప్పునీళ్ళు తాగిం దేనుగూ – ఊరెళ్ళ గొట్టిందేనుగూ

అని పాడుతారు. కొందరు 'ఉప్పాడొచ్చిందేనుగూ, ఉప్పు నీళ్ళు తాగిందేనుగూ' అని మరి కొందరు 'ఉప్పటూరుపోయిందేనుగూ ఊరెళ గొట్టిందేనుగూ' అని పాడుతారు.

ఇంకాకొంచెం పెద్దవాళ్ళయిన తర్వాత తల్లి తన తొడలమీద కూర్చుండ బెట్టుకొని పాడే పాటలు కొన్ని, గోరు ముద్దలు చేసి తినిపించడానికి చందమామను చూపిస్తూ పాడే పాటలు కొన్ని ఉన్నాయి.

చందమామరావె – జాబిల్లిరావె

కొండెక్కిరావె – కోటివేలు తేవె

పరుగెత్తిరావె – పాలు పెరుగు తేవె

అన్నిటిని తెవె.... అబ్బాయికీవె

(వెంకయ్య, ఇసుకపాళెం, నెల్లూరు జిల్లా)

చందమామను పిలుస్తూ పాడేపాటలు ఇతర భాషలలో కూడా ఉన్నాయి. చంద్రుణ్ణి నీళ్ళు ఇమ్మంటున్నది ఒక తల్లి

'New moon, come out, give water for us,

New moon thunder down water for us,

New moon, shake down water for us'[7]

పిల్లలకు చక్కిలిగింతలు పెట్టి నవ్వించడం తల్లులు ఆడే మరో ఆట. శిశువు కుడిచేతిని తమ ఎడమ అరచేతిలో ఉంచుకొని చిటికెన వ్రేలినుంచి ఒక్కొక్క వేలే లెక్క పెడుతూ–

పెద్దరిటాకేసి – పప్పేసి

బువ్వ బెట్టి – అప్పచ్చేసి

ఆయబోసి – కాపి (కలిపి)

అమ్మకు బెట్టి – నాన్నకు బెట్టి

అక్కకు బెట్టి – అన్నకు బెట్టి

నువ్వుతిని – నేనుతిని





అత్తగారింటికి పోయేదెట్లంటే– (సుశీలమ్మ, నెల్లూరు)

అంటూ మెల్లగా చేతిని శిశువు చంకవరకు తీసుకొనిపోయి గిలిగింతలు పెడ్తారు. ఇలా చేసి పిల్లల ఉత్సాహాన్ని పెంచుతారు. తర్వాత కొంచెం వచ్చీరాని మాటలను పిల్లలు పేరుస్తూ ఉంటే వాళ్ళకు 'తారంగం తారంగం – తాండవ కృష్ణ తారంగం – వేణూనాద తారంగం – వెంకటరమణ తారంగం' మొదలైన పాటలు నేర్పిస్తారు. చిన్నప్పటినుంచే పిల్లలకు భగవంతుని గూర్చిన భక్తిభావం రంగరించి పోస్తారు.

పై పాటలన్నీ బాలబాలికల కోసం పెద్దలు కల్పించినవి. వీటిని పెద్దలనుంచి పసివారు నేర్చుకొని పాడుకుంటారు. ఇవికాక ఇలాంటి పాటలు ఇంకా కొన్ని ఉన్నాయి. 'కాళ్ళాగజ్జి కంకాళమ్మా', 'ఒప్పుల కుప్పావయ్యారి భామా' 'చెమ్మచెక్క చేరడేసి మొగ్గా' మొదలైన పాటలు ఆంధ్రదేశమంతటా ప్రచారంలో ఉన్నాయి. వీటిలో ఆయుర్వేద రహస్యాలు ఇమిడి ఉన్నాయి.

ఈ రహస్యాలను శోధించి బి.రామరాజు గారు, నేదునూరి గంగాధరంగారు తమ వ్యాసాలలో, పుస్తకాలలో ప్రకటించారు. ఇవన్నీ ప్రయత్న పూర్వకంగా రచితమైన పాటలేగాని కేవలం శిశుప్రాసలుగా పరిగణింపదగినవి కావు.

బాల బాలికలే ఊహించి రూపొందించే పాటలూ లేకపోలేదు. పసివారికి కూడా కవితా నిర్మాణ శక్తి ఉన్నదని నిర్ద్వంద్వంగా చెప్పవచ్చు. శిశువు మనస్తత్వం అలనాటి ఆదిమానవుని చిత్తవృత్తితో పోల్చదగింది. ప్రాచీన మానవుని జానపద గేయాలను సృష్టించే శక్తి ఉన్నట్లే పసిపిల్లలకు కూడా ప్రాస క్రీడలు చేసే ఆసక్తి ఉంది, ఆలోచన ఉంది.

బాలబాలికలు ఒకర్నొకరు ఎగతాళి చేసుకుంటూ ఉంటారు. ఒక్కొక్క సారి పెద్ద వాళ్ళనూ ఎగతాళి చేయడం కద్దు. అయ్యవారిని, అయ్యవారి పెళ్ళాన్ని ఎగతాళి పట్టించడం ఈ విధంగా–

'అయ్యవారయ్య వారంతంత

అయ్యవారి పెళ్ళాం ముంతంత

ముంత కొంటబోయి మూలకు పెడితే

నక్కెత్తుక పోయెరా నారాయణా

నారాయణాని నారకు పోతే

గొడ్డలి పోయెరా గోవిందా........'[8]

ఇది ఇలా ఎంత సేపయినా సాగుతుంది.

ఇక ఏ చిన్నజంతువును చూచినా పిల్లలకు సంబరం పిల్లినో, ఎలుకనో చూడగానే పిల్లలు ఒక పాట కట్టేస్తారు.

పొద్దు పొద్దు లేచింది చిట్టెలక
మగము కాలు కడిగింది ॥చి॥
గాదిలోకి దిగింది ॥చి॥
వడ్లగింజ కొరికింది ॥చి॥
పాలు అన్నం చేసింది ॥చి॥
మొగినికే పెట్టింది ॥చి॥ (గంగప్ప, చింతామణి, కోలారుజిల్లా)

పసివారు ప్రశ్నోత్తరాల రూపంలో ముక్త పదగ్రస్తాలుగా ఉండే కొన్ని పాటలు పాడుతూ ఆడుకుంటారు. వీటి వల్ల జ్ఞాపకశక్తి పదముక్తి పెంపొందుతుంది. చిన్నవారి ఉత్సాహమూ పెరుగుతుంది.

| | | |
|---|---|---|
| పిట్టమ్మ పిట్ట | ఏమి వనము | పొగమంచు |
| ఏమి పిట్ట | పూల వనము | ఏమి పొగ |
| చిలక పిట్ట | ఏమి పూలు | దీపం పొగ |
| ఏమి చిలక | జాజి పూలు | ఏమి దీపం |
| తెలుపు చిలక | ఏమి జాజి | గోడ దీపం |
| ఏమి తెలుపు | గుత్తి జాజి | ఏమి గోడ |
| హంస తెలుపు | ఏమి గుత్తి | కోట గోడ |
| ఏమి హంస | కవ్వం గుత్తి | ఏమి కోట |
| రాజ హంస | ఏమి కవ్వం | తులసి కోట |
| ఏమి రాజు | చల్ల కవ్వం | ఏమి తులసి |
| మృగరాజు | ఏమి చల్ల | రామ తులసి |
| ఏమి మృగము | మంచు చల్ల | ఏమి రామ |
| వన మృగము | ఏమి మంచు | ఆత్మా రామ[9] |

పాట సంగతి ఎట్లున్నా ముగింపు మాత్రం ఎవరో పెద్దలే కల్పించి నట్లుంది.

తిండిపోతు బాపతును గురించి పసివారు ఒక చిన్న పాట పాడుతారు. కన్నడంలో కూడా ఇటువంటి పాటే ఉంది. సోమరి పోతులకు ఏ భాష అయితే నేమి? 'నీరు తారో మల్ల బాగె బిద్దేనల్ల, ఊటకె బారో మల్ల తయారిద్దేనల్ల' – నీళ్ళు తెమ్మంటే బావిలో పడతానేమో నంటున్నాడు భోజనానికి రమ్మంటే తయారుగా





ఉన్నా నంటున్నాడు.

నెల్లూరు ప్రాంతంలో ఈ క్రింది పాట పాడుతారు.

నీళ్ళకు బోరా నిమ్మా అంటే
నిద్దరొస్తాదమ్మా
కట్టెలకు బోరా కమ్మా అంటే
కడుపు నొస్తదే అమ్మా
బొచ్చె దెచ్చుకో బొమ్మా అంటే
అట్ల జెప్పు మాయమ్మా.

ఇదే అనేక పాఠ భేదాలలో ఉంది.

'నీళ్ళకు బోరా తిమ్మ
నిద్ద రొస్తాదమ్మ
కట్టెలు తేర తిమ్మ
కడుపు నస్తాదమ్మ
నట్టుకు బోర తిమ్మ
నడుము నస్తాదమ్మ'[10]

అన్న పాట రాయల సీమ ప్రాంతంలోనిది.

బాలబాలికలు ఉబుసు పోకకు పొడుపు కథలు చెప్పుకుంటారు. నెమ్మదిగా వికసిస్తున్న మెదడుకు మేతకావాలి. ఒక తెలుగులోనే కాదు, ప్రపంచంలో అన్ని భాషలలో ఉన్నాయి పొడుపు కథలు. ఇవి ప్రత్యేక శాఖగా జానపద సాహిత్యం కింద పరిగణించ దగ్గవి. సాహిత్యాంశ లేని పొడుపు కథలు కూడా కొన్ని ఉండవచ్చు. బొమ్మల రూపంలో, సైగల రూపంలో లెక్కల రూపంలో ఉండే పొడుపు కథలున్నాయి. 'వాక్సం ప్రదాయం యొక్క అనేక రూపాలలో జనసామాన్యుల ప్రతిభా సామర్థ్యాలకూ, ఊహాశక్తికి అద్దంపట్టే అత్యుత్తమరూపం పొడుపు కథ. పొడుపు కథ ప్రధాన లక్షణం అర్థగోపనం'[11]

కొన్ని తెలుగు పొడుపు కథలలో గుప్తంగా ఉండే అర్థమే రావడానికి కన్నడిగులు ఇచ్చిన పొడుపు కథలు ఈ క్రింది ఇవ్వడమైంది.

చెక్కని స్తంభం చేతి కందదూ
చెయ్యని కుండ పొయ్యని నీళ్ళు
వెయ్యని సున్నం తియ్యంగా–కొబ్బరి

స్తంభం చెట్టును, కుండ కాయను, సున్నం కాయలో ఉండే కొబ్బరిని సూచిస్తున్నాయి. ఇలాంటిదే ఈ కన్నడ పొడుపు కథ.

అగస మాడిద మడియల్ల
కుంబార మాడిద మడికెయల్ల
సూర్యన కణ్ణిగె హొళపిల్ల

ఇందులో చాకలి చేసిన బాన కాదని, కుమ్మరి చేసిన కుండ కాదని ఉంది. మరొక పొడుపు కథలో–

ఒందు మడకె
మడకె యొళగొందు శంఖు
శంఖి నొళగొందు సముద్ర

(ఒక కుండ, కుండలోపల ఒక పాత్ర. పాత్రలోపల శంఖంలో ఒక సముద్రం) అని ఉంది. రెండూ కొబ్బరికి సంబంధించినవే.

పేలను గూర్చిన మరొక పొడుపు కథ ఈ క్రిందిది.

అంభాల మీద కుంభాలు
కుంభాల మీద కుడిత్తొట్టి
కుడిత్తొట్టి మీద గుండ్రాయి
గుండ్రాయి మీద కోరింతా
కోరింత మీద అరిక అవురూ
అవురు గడ్డిలో ఆవులు వేలూ

ఇది కొంచెం దీర్ఘంగా ఉంది. పేలనుగూర్చి ఇంత దీర్ఘంగా చెప్పనక్కర లేదనుకుంటాను. కన్నడంలో పేలను గూర్చిన పొడుపు కథ చిన్నదిగా ఉంది.

'కంబ – కంబద మేలె
గుంభ – గుంభద మేలె
హుల్లు – హుల్లినలి హుళు'[12]

(కంబం – కంబం మీద కుంభం, కుంభం మీద గడ్డి, గడ్డిలో పురుగు)

అరటి చెట్టును గూర్చి మరొక పొడుపు కథ ఉంది.

'నల్ల నల్లని పక్షియొకటి
నడినెత్తిని రెక్కలు వచ్చె
చేతులార గోళ్ళు వచ్చె





చెవుల సందున కొమ్ములొచ్చె
దాని పచ్చరత్నములు
కత్తి కత్తిన కోసి
బ్రాహ్మలనక బంటులనక
బంతిని భోంచేసిరంట'[13]

కన్నడంలో అరటి చెట్టును గూర్చిన పొడుపు కథ ఇలా ఉంది.

తోటదల్లి హుట్టువుదు
నీటాగి బెళెయువుదు
ఊటక్కె మొదలాగి బరువుదు

(తోటలో పుట్టేది, చక్కగా పెరిగేది, అన్నమంటే మొదట వచ్చేది)

ఇలా చెప్పుకుంటూ పోతే ఎన్నో వస్తాయి. 'గోడ మీద బొమ్మ గొలుసుల బొమ్మ–వచ్చేపోయే వారికి వడ్డించు బొమ్మ' అనగానే 'తేలు' అనలేని పిల్లలు ఆంధ్రదేశంలో అరుదు. సులభంగా అర్థమయ్యే పొడుపు కథల దగ్గరనుంచి, నారికేళ పాకంగా ఉండేవాటివరకు ఉన్నాయి. అర్థం లేని కొన్ని పాటలు, గేయభాగాలు గూఢార్థాలను సంతరించుకొని చివరికి తలపగుల గొట్టుకున్నా అర్థంకాని స్థితికి వచ్చాయి.

## కన్నడం

తెలుగులో వలెనే కన్నడంలో కూడా అన్నిరకాల పిల్లల పాటలు ఉన్నాయి. లాలి పదాల్ని బాలగీతాలలో చేర్చకూడదని చెప్తూ డి.కె.రాజేంద్రగారు "లాలి పదాలను 'శిశు సాహిత్యం'లో చేర్చడం మంచిది కాదు. ఇవి పిల్లలను గూర్చిన గీతాలే కాని, పిల్లల కోసం రచితమైన సాహిత్య విషయాలు కావు అన్నారు"[14] (తెలుగు అనువాదం) లాలి పాటలు శిశువులు కోసం రచింపబడ్డవి కావనడం సమంజసం కాదు. అవి పిల్లలకు అర్థం కావనడం సరి. అయినా వాటిని పిల్లల పాటలలో చేర్చడమే మేలు.

శిశుగీతాలను ఆటలతో కూడిన పాటలని, ప్రత్యేకంగా పాడే పాటలని విభజించారు కొందరు. వీటినే ఇంకా ప్రశ్నోత్తర గీతాలు, బొమ్మల పెళ్ళి పాటలు, లెక్కల గీతాలు, కథాగేయాలను పోలినవి అంటూ విభజించవచ్చనే అభిప్రాయం ఉంది. ఇలా చెప్పుకుంటూ పోతే ఎన్నో రకాల గేయాలు లభిస్తాయి.

పుట్టిన నాటినుంచే బిడ్డలకు పాటలంటే ప్రీతి. మూడు నాలుగు నెలలకే బిడ్డలు పాటలను కాకున్నా పాటలో ఉండే రాగాన్ని ఆపేక్షిస్తారు. 'జోల పాడితే నా బిడ్డ అలిస్తాడు' (జోగుళ హాడిదరె అలిసి కేళ్యానె) అని పాడుతుంది మాతృమూర్తి.

కన్నడదేశంలో బిడ్డను పన్నెండవ దినం తొట్టిలో వేసి పేరు పెడతారు. అప్పుడు ఉయ్యాల ఊచుతూ జోలపాట పాడుతారు. దేవుళ్ళందరూ ఆ సమయంలో గుర్తొస్తారు.

శిందీగి తళదళదల్లి సంగమ్మన తళ
శంభో మతదేవ ఇందు దయనాగొ ॥జోజో॥
భంగార తొట్టీల ధొరితాయి । కుందల
సింగర దాన శ్రీకృష్ణన ఛందాగి తూగారి ॥జో॥
కాదు బందెవు ఓణి నెరెదు బందితు మంది
బందు నింతారవ్వ కన్ని ముత్తైద్యారు ॥జో॥
(సీతమ్మ, చింతామణి)

తల్లికి తన కొడుకు తోడిదే లోకం. అతని చేష్టలన్నీ ఆమెకు అందంగా ఉంటాయి కాని ముఖ సౌందర్యం చెప్పడానికి వీలులేదు. శృంగేరి అందంగా ఉంటుంది. బేలూరు ఇంకా బాగుంటుంది. ఆ ఊళ్ళకంటె శారదాంబ అందమయింది. కాని ఎవ్వరూ, ఏదీ బాలునికి సరికాదు.

'శృంగేరి ఊరుచెంద బేలూరు కేరి చెంద
శారదాంబ చెంద జగకెల్ల । బాలయ్య
నీ చెంద నమ్మ మనెగెల్ల ॥
కత్తెయ మరిచెంద తొత్తిన నుడిచెంద
ముత్తుగద హూవు కడుచెంద కందయ్య
నిన్నాట చెంద నమగెల్ల'[15]

పసిపిల్లల ఆట పై పాటలో తల్లి అన్నట్లు చాలా అందమైనది.

జానపదులకు ఏకదేవోపాసన కంటె బహుదేవతోపాసన పైననే నమ్మకం. తన కొడుకు చంద్రుడు, రుద్రుడు, విష్ణువు, బ్రహ్మ, నాగేంద్రుడు–ఇంకా తల్లికి ఏ దేవుడు జ్ఞాపకం వస్తే ఆ దేవుడవుతాడు.

తూగిరె చంద్రన తూగిరె రుద్రన
తూగిరె నందన తూగిరె కందన





అలద ఎలెమేలె బాలన మలగిసి
లోలగన్నెయరెల్ల తూగిరమ్మ
బ్రహ్మలోకదింద బ్రహ్మేంద్ర మొదలాగి
బ్రహ్మగన్నే రెల్ల తూగిరమ్మ
నాగలోకదింద నాగేంద్ర మొదలాగి
నాగకన్నె రెల్ల తూగిరమ్మ. (సీతమ్మ, చింతామణి)

'ఆలద ఎలెమేలె' అన్న చోట 'మర్రి ఆకు మీద బాలుణ్ణి పడుకోబెట్టి నిద్రపుచ్చండి' అనడంలో వటపత్ర శాయిని తలచుకుంటూ ఉంది తల్లి.

పిల్లలు ఏడుస్తుంటే 'ఏనుగొచ్చిందేనుగూ, ఏవూరి ఏనుగూ, విజయనగరం ఏనుగూ, ఇక్కడి కెందు కొచ్చె, దారి తప్పి వచ్చె' అని పాడుతారు. ఇది తెలుగులోని 'ఏనుగొచ్చిందేనుగు, ఏ వూరొచ్చిందేనుగు' అనే పాట వరుసలోనే ఉంది.

'అని బంతానె – యావూరానె
విజయనగరద ఆనె – ఇల్లిగేకె బంతు
హాది తప్పి బంతు హాదిగొందు దుడ్డు
బీదిగొందు దుడ్డు'[16]

ఈ పాటలో విజయనగర సామ్రాజ్యపతనం సూచించ బడింది. విజయనగర సామ్రాజ్యం పతనం కాబట్టి అక్కడి ఏనుగు ఈ ఊరు వచ్చింది. ఈ పాటనే మరొక విధంగా పాడుతారు.

'అని బంతానె – ఇద్యాఊర అని
విజాపురద అని – ఇల్లిగ్యాక బంతు
హాది తప్పి బంతు – హాదిగొందు దుడ్డు
బీదిగొందు దుడ్డు – అదదుడ్డు కొట్టు
కొబరి బెల్ల తందు – లటలట మురిదు
యవనర కైయాగ కొట్టు – చక్రబాయన గుండు
కెళగ బిద్దర తుండు'[17]

బీజాపూరును పరిపాలించిన ఆదిల్ షాహి ఆకారంలో ఏనుగులాగా ఉండేవాడనీ, అతనంటేనే హడలనీ, అందుచేత ఈ పాట పాడితే శిశువులకు భయముంటుందనీ చెప్తారు.

పిల్లలు నాలుగయిదేళ్ళు వచ్చేసరికి ఆటలు ప్రారంభిస్తారు. చెమ్మ చెక్క,

తొక్కుడుబిళ్ళ, వామనగుంటలు, గోలీలాట, బిళ్ళంగోడి మొదలైన ఆటలు ఆడడం ఆరంభిస్తారు. ఎక్కువగా పిల్లల పాటల్లో శబ్దాలంకారాలు కనిపిస్తాయి. ముక్తపదగ్రస్తాలు శిశువుల జాణతనాన్ని, వివేచనా శక్తిని పెంపొందిస్తాయి. ఒకరు 'చేతులెక్కడికి వెళ్ళాయి' అని ప్రశ్నిస్తారు. మరొకరు 'సంతకు పోయాయ'ని జవాబు చెప్తారు.

సంతలో ఏమి తెచ్చావ్
అరటి పండు తెచ్చా
అరటి పండు ఏమి చేశావు
మంచివన్నీ తిని చెడ్డవి పారేశా

అని సాగుతుంది పాట.

'కైయెల్ల ఎల్హోదో – సంత్హోదో
సంతేలేన్ తందొ – బాళె హణ్‌తందో
బాళెహణ్ ఏన్ మాడ్డె – ఒళ్ళొళ్ళెద్నెల్ల తిందు కెట్ట కెట్టద్నెల్ల కదీన్ హిందాక్డె
కదేన్ కొడ్తు – చక్కెకొడ్తు
చక్కె ఏన్ మాడ్డె – ఒలెగొట్టె
ఒలేన్కొడ్తు – బూదికొడ్తు'[18]

సాగుతూ వచ్చే ప్రశ్నోత్తరాలు ఎక్కడో ఆగిపోతాయి.

పిన్నలు రెండు జట్లుగా చేరి చప్పట్లు కొడ్తూ, కాళ్లు ఆడిస్తూ పాడే పాటలు అత్యంత మనోహరంగా ఉంటాయి. చప్పట్లకు, పాటకు లయ అద్భుతంగా కుదిరి చూడడానికి, వినడానికి చాలా బాగుంటుంది. అర్థం చూస్తే ఏమీ ఉండదు. బెంగుళూరికి పోవాలి, ఏమేమో తేవాలి, చెయ్యాలి అని అశపడడం దీనిలోని విషయం.

'జగ్గుణక్కు జగ్గుణక్కు జయమ్మారె
నీల్గిరి బెట్టద్మే లెగుండప్పోరె
హోగబేకు హోగబేకు బెంగళూరిగె
తరబేకు తరబేకు ముదుగిరియ
కుయ్యబేకు కుయ్యబేకు మండ చూరిలి
మాడబేకు మాడబేకు దద్ద మడ్కెలి
ఉణ్ణబేకు ఉణ్ణబేకు అడ్కె పట్టేలి
కైతొళిబేక్ కైతొళిబేక్ తొళియగుండిలి'[19]

పిల్లలు ఆడుకునే బొమ్మల పెళ్ళిలో పాటలకు స్థానం ఉంది. బాల





బాలికలిరువురూ చేరి ఆడే ఆటయిది. మగపెళ్ళివారు, ఆడపెళ్ళివారు కలిసిపాడుకునే పాటలు అనేకం కన్నడంలో దొరుకుతాయి. ప్రశ్నలు సమాధానాలుగా ఉంటాయి ఈ పాటలు.

ఈవైపు వారు : 'గుజ గుజ మాపురి ఆడోణ
గుజేర మాపురి ఆడోణ
సామదండి ఆడోణ
నరలోక క్కెల్ల తిళిసోణ ॥ప॥

ఆవైపు వారు : గుజ గుజ మాపురి గండవరు
గుజేరి మాపురి హెణ్ణవరు
సామదండి హెణెయవరు
నరలోకక్కెల్ల నభెయవరు'[20]

తెలుగులో ఉన్నట్లే ఎగతాళి పాటలు కన్నడంలోనూ ఉన్నాయి. తెలుగు పాటలలోని భావాలు, ఒక్కొక్కసారి వరుస కూడా కన్నడంలో కనిపిస్తాయి.

తెలుగులో బావను ఏడిపించే ఈ పాట ప్రసిద్ధం.

బావా బావా పన్నీరు – బావను బట్టుక తన్నేరు
వీధీ వీధీ తిప్పేరు – వీసెడు గంధం పూసేరు
చావడి గుంజకు కట్టేరు – చప్పిడి గుద్దులు గుద్దేరు

కన్నడం లోనూ ఇట్లాంటి పాటే ఉంది. 'ఎందుకు బావా కూచున్నావ్, నేనడిగింది మరిచావు, మైసూరికి పోదాం రా బావా, మైసూర్పాకు కొను బావా......' అంటూ సాగిన పాట చివర 'కలకత్తాకు రా బావ, రాళ్ళ దెబ్బలు తిను బావ' అని ముగుస్తుంది.

'యాక్రి భావ కూత్బిట్రి
నాన్హేళిద్ మర్‌త్బిట్రి
మైసూర్గె హోగణ బన్ని భావ
మైసూర్పాక్ తక్కొండి భావ
బెంగ్ళూర్గె గ్హణ్ బన్ని భావ
బెళ్ళి తట్టె తక్కొండి భావ
దొడ్ పేటెగ్హోగ్హణ్ బన్ని భావ
దొణ్ణె ఏటు తిన్ని భావ

బొంబాయిగోగ్వణ్ బన్ని భావ
బొంబాయి బోండ తక్కొడి భావ
కల్కత్త గోగ్వణ్ బన్ని భావ
కల్లినేటు తిన్ని భావ'[21]

పశుపక్ష్యాదులను చూచినప్పుడు పసివారికి కలిగే సంతోషం అంతాయింతాకాదు. ఆ ఆనందంలో వాళ్ళు ఏమేమో పలుకుతారు. వాటిల్లో అర్థాలను వెదకడానికి వీలులేదు. పిల్లల మనస్తత్వం వాటిలో కనిపిస్తుంది. కాకితో మొదలై మామతో అంతమయ్యే పాట యిగి–

"కాగె కాగె కవ్వ
యార్ బత్తారవ్వ
మావ్ బత్తానవ్వ
మావ్గేన్ ఊట
రాగికల్ గూట"[22]

మరోగీతం టెంకాయ, బెల్లం తినడంతో మొదలవుతుంది. రాజప్ప చనిపోడం, భూమాత ఏడవడం, కోడికి మేత లేకపోవడం మొదలైన ఎన్నో విషయాలు సందర్భం ఉన్నా లేకపోయినా దీనిలో వస్తాయి.

అక్క అక్క
ఏనక్క
కాయి బెల్ల తింతిద్దె
గీరక్కి గీర్బిద్దు
రక్త బత్తు నెక్కండె
రాజప్ప సత్తోద
భూమ్తాయి అళ్తాళె
కోళిగె మేవిల్ల
సంది గొందిల్ మెయ్తవె
సంజె ఆయ్తు బత్తవె
ఓణిలొందు చౌక
ఓణి హిడ్కండ్ దుమ్కు

పిల్లల పాటల్లో మామూలుగా అక్షరాలు సొంపుగా అమరి ఉంటాయి. అవి





చెవికింపుగా ఉంటాయి. అర్థం ఉన్నా లేకున్నా శబ్దంమాత్రం మధురంగా ఉంటుంది. ఇలా ఎక్కువగా శబ్దాలంకారాలతో శ్రోతల్ని అలరించే పిల్లల పాటలు 'శిశుప్రాసగళు ' అనే పేరుతో కన్నడంలో చాలా సేకరింపబడ్డాయి.

'దడదా దడదా దడాదడ్
హన్నెరడాణె కరీమణి
నమ్మత్తె మగళు చింతామణి
ఊర్ముందిన తొగరి హొలకె
నడి నడీ
తొగరి హొలద గౌడ కండరె
మైకై మురీ మురీ'[23]

అనేది శిశుప్రాసలలో ఒకటి. ఈ శిశుప్రాసలు పసిపిల్లల హృదయాన్ని పట్టియిస్తాయి. వాళ్ళ హృదయలాలిత్యం వీటిలో ప్రత్యక్షమవుతుంది. పసివారు మాయమర్మము లెరుగని వారు. అప్పుడే పడుతున్న మల్లెమొగ్గలు. అయినా సువాసనకు తక్కువ లేదు. వారిని నిసర్గ మనోహరమైన భావాలు, వస్తు దృష్టితో చూచినపుడు వారి గీతాలు గొప్పవిగా కన్పించకపోయినా ఈ పిల్లల పాటలలో ఉండే సహజ సౌందర్యం మనల నాకట్టు కొంటుంది.

తెలుగులోలాగానే కన్నడంలో కూడా బాలగేయాలు ఎక్కువగా సేకరింపబడలేదు. వాటి అధ్యయనం కూడా సరిగ్గా జరగలేదు. పిల్లల పాటలుండే సంకలనాలు ప్రత్యేకంగా ఎక్కువ వెలువడలేదు. ఏవో కొన్ని లాలి, జోలపాటల గుజిలీ ప్రతులు లభ్యమవుతున్నాయి. ఇంకా ఈ క్షేత్రంలో ఎంతోకృషి జరగవలసి ఉంది. పల్లెల్లో పట్టణాల్లో ఈ నాడు పిల్లల పాటలు తగ్గుతూ వస్తున్నాయి. ఆటలూ తగ్గుముఖం పట్టాయి. పాశ్చాత్య పద్ధతిలో ఆటలు వస్తున్నాయి. అందువల్ల పిల్లల పాటలను ఎక్కువగా సేకరింప వలసిన అగత్యం ఎంతో ఉంది. రవీంద్రుడన్నట్లుగా "శిశువుల జీవితంలో ఉండే నిసర్గ వాక్యయోగం అనాదికాలంనుంచి వస్తున్నది. దీనివల్ల శిశువుల మనస్సు, ప్రాణాల వికాసానికి కలిగే లాభమెంత అన్నది నగరవాసులు తెలుసుకుంటారని నా కనిపించదు. దాని ఆవశ్యకత కూడా వారి కుండదు. పాఠశాలల్లో దొరికే శిక్షణ నీరసంగా ఉంటుంది. తమ పై అధికారులను మెప్పించాలనే మనస్తత్వం ఉండే బోధకులు పిల్లలపై కఠినమైన శాసనాలను రుద్దుతారు. దీనివల్ల పిల్లల కల్పనాశక్తి

ఉడిగిపోయి వారి నిత్యజీవితం కూడా నీరసమవుతుంది" (బాలసాహిత్య). ఇది ఇప్పటికీ అనవలసిన మాటే.

జానపద గీతాలకే మొత్తంమీద ప్రాధాన్యం తగ్గి పోతున్నది. ఇక పిల్లలకోసం, పిల్లలచేత విరచితాలయిన గీతాలను గౌరవించడం మనకేం చేతనవుతుంది? అయినా పిల్లల పాటల గొప్పదనం వాటికుండనే ఉంది. వీటి ప్రాశస్త్యాన్నెన్నుతూ దేవేంద్ర సత్యార్థిగారన్న మాటలను తలచుకోవలసి ఉంది.

"Indian children's rhymes and chants survived many a national storm. The wealth of the country was plundered by invaders, but who could carry off these rhymes and chants from India's little sons and daughters? They people were the victims of great catastrophies, but none could kill the children's indigenous games and home spun songs"[24]

**టిప్పణి**

1.Modern Review, Vol.60, p.394
2. తెలుగు జానపద గేయసాహిత్యము, పు. 495
3.C.M.Bowra, Primitive song, p.170
4. బి.రామరాజు, తెలుగు జానపద గేయ సాహిత్యము, పు. 445
5. నెం. 2509, తాళపత్రము, ప్రాచ్యలిఖిత భాండాగారము, మదరాసు
6. బి.రామరాజు, పూర్వోక్తం, పు. 496
7. సి.ఎం.బౌరా, పూర్వోక్తం, పు. 79
8. బి.రామరాజు (సం.) తెలంగాణా పల్లె పాటలు, పు. 17
9. త్రివేణి, పు. 11
10. అదే, పు. 23
11. రాగౌ, నమ్మ ఒగటుగళు, ప్రస్తావన (కన్నడ వాక్యాలకు తెలుగు)
12. అదే, పు. 29
13. నేదునూరి గంగాధరం, జానపద గేయ వాఙ్మయ వ్యాసావళి, పు. 150
14. జానపద, సం. 4, పు. 28
15. కరీంఖాన్, జనపద గీతెగళు, పు. 76





16. హొన్న బిత్తేవు హొలకెల్ల, పు. 294
17. ఎం. గద్దగిమఠ, కన్నడ జానపద గీతగళు, పు. 43
18. హొన్న బిత్తేవు హొలకెల్ల, పు. 111
19. జానపద, సం. 4, పు. 29
20. ఎం. గద్దగిమఠ, పూర్వోక్తం,పు. 40
21. జానపద, సం. 4,పు. 31
22. హొన్న బిత్తేవు హొలకెల్ల, పు. 112
23. రాగౌ, శిశుప్రాసగళు, పు. 43
24. Modern Review, Vol.60, p.394

# 6.వేడుక పాటలు

వేడుకలన్నవి మానవులు వినోదంకోసం ఏర్పరచుకున్నవి. కర్మ ప్రధానాలైన వివాహకార్యాలు, పండుగలు, వ్రతాలు, నోములు మొదలైనవి రానురాను వేడుకలై పోయయి. ప్రాచీన మానవుని జీవితంలో ధర్మాచరణలకు అధిక ప్రాధాన్యం ఉంది. దాంపత్యధర్మంకోసం, కామం ప్రాతిపదికగా మనిషి ఏర్పరచుకున్న వివాహ వ్యవస్థ కూడా ప్రాచీన కాలంలో ఆచరణాత్మకంగా జరుపబడుతుండేది. ఈనాడు వివాహంలోని ఆచరణ సంబంధమైన కార్యాలకంటె వేడుకలకు, వినోదాలకే ఎక్కువ ప్రాధాన్యం ఉంది. నలుగు పెట్టటం, తలంబ్రాలు పోయడం, బువ్వపుబంతి మొదలైనవన్నీ సంతోషగీతాలతో కూడి వేడుకలుగా ఆచరింప బడుతున్నాయి. అలాగే ధర్మాచరణలలోని మానవాతీత సంబంధాలను చాలా వరకు వదిలించుకొని మనిషి చాలా పండుగలను, పబ్బాలను ఏర్పరచుకున్నాడు. వాటిని సంతోషసందర్భాలుగా మలచుకున్నాడు. ఇవికాక వినోద ప్రధానంగా ఏ సందర్భంలోనైనా జరపదగినవి కోలాటాలు, వీటిలో ధార్మికాంశం చాలా తక్కువ. ఇవి వారు వీరనక అందరిని అలరించేవి (secular). ఈ విధంగా పెళ్ళి పాటలు, పండుగలకు సంబంధించిన పాటలు, కోలాటపు పాటలు వేడుక పాటలలో ప్రధాన విభాగాలుగా ఉన్నాయి.

స్త్రీ పురుషుల లైంగిక సంబంధాలను, పిల్లల పెంపకాన్ని క్రమబద్ధం చేయడానికి ఏర్పడిన సాంఘిక వ్యవస్థలు వివాహం, కుటుంబం అన్నవి. ఒకే కుటుంబంలోని స్త్రీ పురుషుల లైంగిక సంబంధాలను నిషేధించే మౌలిక నిబంధనలున్నాయి. దీనివల్ల పురుషుడు వెలుపలి కుటుంబాలనుంచి అర్ధాంగిని పరిగ్రహిస్తాడు. ఇలా సంఘ విస్తరణ జరుగుతున్నది. సాంఘిక సాంగత్యాలు బలపడుతున్నాయి. ఇలా వేరువేరు కుటుంబాల మధ్య వివాహాలు జరిగినప్పుడు తెలిసినవారు, తెలియనివారు అనేకులు చేరుతారు. ఒకరిమీద ఒకరు ఎత్తిపొడుచుకోడాలు, బంధుప్రీతులు, సరసాలు, సాధింపులు, అలకలు, అగ్రహాలు, సంతోషాలు, సంభ్రమాలు ఇలా ఎన్నెన్నో పెళ్ళిలో దర్శన మిస్తాయి. మరీ తెలుగు వారింటి పెళ్ళి సరేసరి. శ్రీనాథాది మహా కవులు కూడా వివాహమనే వేడుక చేత ఆకర్షితులై తమ కావ్యాలలో చక్కగా వర్ణించారు.

పండుగలు, శుభకార్యాలు సాంఘిక వ్యవస్థలో ప్రధానాంగంగా ఉన్నాయి. వీటిలో కొన్ని ఋతువులననుసరించి వచ్చేవి. కొన్ని ఐతిహాసిక ప్రాధాన్యం ఉండేవి.





కొన్ని పౌరాణిక వ్యక్తుల జన్మదినాలు, చారిత్రిక వ్యక్తుల జన్మదినాలు, మరికొన్ని జీవించి ఉన్న వ్యక్తుల జన్మదినాలు కూడా కావచ్చు కాని పండుగలు కృషి ఫలితాన్ని పొందిన సంతోషాన్ని వ్యక్తంచేయడానికి ఏర్పడ్డాయి.

కోలాటం జానపద కళలలో ఒకటి. పండుగల శుభకార్యాలు, ఇతర సంతోష సందర్భాలు ఏవైనా కోలాటం వేయడానికి అనువైన దినాలే. కోలాటం పాటలు నృత్యగీతాలకు ఉదాహరణాలు. ఆటకు తగ్గట్లుగా లయవిన్యాసం కల్గిన కోలాటపు కోపులు ఆంధ్రదేశంలో అన్ని మూలలా కనిపిస్తాయి.

**తెలుగు**

**పెళ్ళి పాటలు :**

పెళ్ళి చూపులతోనే ప్రారంభమవుతాయి పెళ్ళి సంబరాలు. పెళ్ళి కూతుర్ని పిలిపించమంటారు మగపెళ్ళివారు. పెళ్ళికూతురి పిలుపు (మాట) ఎట్లుంటుందో చూద్దామని వారి అభిలాష. ఆడపెళ్ళివారు తమ పిల్లలను గురించి ఘనంగా చెప్తారు.

పిలిపించు నీ సీత పిలుపు చూతాము
పిలుపేమి సూసేవు చిలుక పలుకుల్లూ
పిలిపించు నీ సీత నడక చూతాము
నడకేమి సూసేవు అంస నడకల్లూ
మీ సిరిబాల సీత ఉందని
మా అయోధ్యరామునికి అడగనొస్తి
మా సీత సిన్నాది మేమియ్య లేదు
సీతకన్న సిన్నోడె అయోధ్య రాముడు

(తాయమ్మ, రామాపురం, కోలారు జిల్లా)

ఇక్కడ సీత పెళ్ళికూతురు, రాముడు పెళ్ళికొడుకు. సీతారాములు జానపదుల నిత్య జీవితంలో అంతగా చొచ్చుకుని పోయారు.

పెళ్ళి తలంటి పోసి ముందు నలుగు పెడతారు. నలుగు పాటలు తెలుగునాట ఊరూరా అసంఖ్యాకంగా వినిపిస్తాయి. బ్రాహ్మణుల ఇళ్ళలోనే కాకుండా బ్రాహ్మణేతరుల ఇళ్ళలోకూడా వినిపించే ఈ పాటలు అచ్చమైన జానపద గేయాలే. కోలారు జిల్లాలోని ఒక జానపద స్త్రీ పాడిన ఈ క్రింది నలుగు పాటలో బురుదుగుంట గంగమ్మ నలుగు పంపినట్లుగా ఉంది. గంగమ్మ జానపదులు కొలిచే దేవత.

కమ్మలు కడియాలు కస్తూరి బావిరీలు
నలుగూకు రావె సీతమ్మ
నీ పాలిటి దేవుడు ఏను గోపాలసామి
నీ కంటెచ్చయి నోడె నిలిచి ఉండాడు
నలుగూకు రావె సీతమ్మ
అత్తారు పన్నీరు సిత్తారి గిన్నెలతో
ఏగఏగను రావె సీతమ్మ
నలుగూకు రావె సీతమ్మ
గుండూ పళ్ళెములోన గురుతాయె హో నలుగు
బురుదుగుంట గంగమ్మ అంపింది నలుగు
నలుగూకు రావె సీతమ్మ (తాయమ్మ, రామాపురం, కోలారు జిల్లా)

నలుగు పెట్టిన తర్వాత అభ్యంజన స్నానం చేయిస్తారు. బ్రాహ్మణేతరులలో అవిరేణులను పూజించే సంప్రదాయం ఉంది. ఇది లక్ష్మీపూజ. లగ్నానికి పూర్వమే కుమ్మరి చేత రెండుకుండలను అలంకరింప జేస్తారు. వాటిని ధ్యానంపైన నిలిపి లక్ష్మినావాహన చేసి పాటలు పాడుతారు.

నాకబలి అయిన తర్వాత ప్రతివిత్తులు నాటడమనే ఆచారం బ్రాహ్మణేతరుల్లో ఉంది. కూరాటి కుండల ముందు ప్రత్తివిత్తులు నాటిస్తూ ఈ క్రింది పాటను పాడుతారు.

'పన్నెండు స్తంభాల పందిరి క్రిందా
ప్రత్తివిత్తుల గుమ్మిమెత్తైన దీసి
గోవు పెండా దెచ్చి గోలెంబ గలిపి
ఆవు పెండా దెచ్చి అలుకైనా జల్లి.......'[1]

తలంబ్రాలు పోసుకోడం పెళ్ళిలో అతిముఖ్యమైన సంబరం. పెళ్ళి కుమార్తె–కుమారుడు తమ బలాబలాలను పరీక్షించుకుంటారు. పేరంటాళ్ళు ఆ సమయంలో–

'పచ్చ పచ్చన్ని పందిటిలోన
పడతులందరు కూడి పసుపునూరేటి
నూరిన్న పసుపుల నునుపెంతనునుపు
ఆడేటి ఓబయ్య అతడెంత బోగి
బోగి పోసిన నీరు ఏరులై పార





ఏరుకు తగినట్ల యిచమల్లెతోట
పులపుల వానొచ్చె పులుమొగ్గదొడిగె
రవరవ గాలిసరె రాలె మల్లెల్లు....'[2]

అన్న మనోహర కల్పనను ఆలాపిస్తారు.

పెళ్ళి భోజనాలు భలేపసందుగా, తమాషాగా జరుగుతాయి. బువ్వపు బంతి వేడుకను అనుభవించాల్సిందేగాని వర్ణించ నలవికాదు. మగపెళ్ళివారు మగువవైపు వారిని మనసారా ఎత్తి పొడుస్తారు. తమకు తగిన మర్యాదలు జరగలేదని మండి పడుతుంటారు. విందులో కూర్చున్న వాళ్ళ ఎక్కిరింపులకు లెక్కలేదు.

'ఏలాగు భోంచేతుము
ఈ విందుమే మేలాగు భోంచేతుము
విస్తర్లు వేశారు దోసెడేసి
వెడల్పు లేదండి హస్తంబు
కదులూటాకూ
ఔరా చోటులేదు ఏలాగు భోంచేతుము
ముక్కా బియ్యము వండిరీ
దానిలోకి ముద్దపప్పే వేసిరి
చెప్పుకుంటే సిగ్గొతుంది
చెయ్యికడిగిన బిడ్డేలేదు'[3]

మగపెళ్ళివారు ఎగతాళి చేస్తుంటే ఆడపెళ్ళివారు కూడా తాము తక్కువ తినలేదని నిరూపిస్తారు. ఒక పళ్ళెంలో హారతి తీసుకొని కావలసిన వారందరి దగ్గరకు వచ్చి 'కుక్క మంగళాలు' పాడి డబ్బులు వసూలు చేసుకుంటారు.

మంచివారు మామగారు మాఘస్నానం చేయబోతే
మాయదారి కుక్క వచ్చి మంచి మడుగు చేసిపోయె
చక్కాని మామగారికి కుక్కమంగళం ॥
గంపెడు సొమ్ము పెట్టుకొని కుంపటిలాగ కూర్చొని
మొగుడు వస్తె లేవదమ్మ మొండికట్టె వదినగారు
చక్కాని వదినగారికి కుక్కమంగళం ॥

అప్పగింతల పాటలు పెళ్ళిపాటలే అయినా కరుణరస సంభతాలు. వేడుక పాటలు కావవి. అప్పగింతలపాట వంటిదే. హాస్యరస పూరితమైన పాట ఒకటుంది.

ఒక తల్లి తన కూతురికిలా బోధిస్తున్నది.

'అత్తమామలు గాని ఆడబిడ్డలు గాని
లేరమ్మ నీదెంత పున్నెమోగాని
మగడు ఒక్కడు గాన మనసు కెక్కినయట్లు
మర్దించి నీ వశము చేసుకోవమ్మ'[4]

ఈ పాటను ప్రతితల్లీ పాడేట్లయితే సంసారం రామరావణ యుద్ధమే అవుతుంది.

పెళ్ళి పాటలకు సాంస్కృతికంగా చాలా విలువ ఉంది. మానవుని జీవనంలోని ప్రధాన ఘట్టాలలో పెళ్ళి ఒకటి. వివాహ సంబంధమైన ఆచారాలకు, తద్వారా ఏర్పడే కుటుంబ వ్యవస్థకు సంస్కృతిలో ప్రధాన స్థానం ఉంది. జానపద ఆచారాలు, పెళ్ళికి సంబంధమైన విధానాలు, మర్యాదలు, వేడుకలు, కుటుంబంలోని వివిధ వ్యక్తుల మధ్య సంబంధాలు-ఇవన్నీ పెళ్ళి పాటలలో ప్రతిబింబితమవుతాయి. తెలుగువారి సంస్కృతికి అద్దంపట్టి చూపుతాయి తెలుగు పెళ్ళిపాటలు.

**పండుగలు మొదలైనవి :**

తెలుగు కుటుంబాలలో సంవత్సరం పొడుగునా ఏదో ఒక పండగో పబ్బమో జరుగుతూనే ఉంటుంది. నలుగురు ఒకచోట చేరడానికి, జీవితంలో నిరంతరమూ ఉండే వ్యథ, శ్రమ కొంత సేపయినా మరిచి పోవడానికి అవకాశం కల్పిస్తాయి ఈ శుభకార్యాలు.

భోగిపళ్ళు : తెలుగువారి కుటుంబాలలో భోగిపళ్ళు పోసే ఆచారం ఒకటుంది. శిశువు పుట్టిన సంవత్సరం భోగి పండుగ రాగానే రేగుపళ్ళు, బొరుగులు, బెల్లం మొదలైనవి శిరసుపైన పోస్తారు. పిల్లలకు అన్నిరకాలు పీడలు, దిష్టిపోవాలని తెలుగుతల్లులిలా చేస్తారు. పళ్ళుపోస్తూ నెల్లూరు జిల్లాలో ఈ పాట పాడుతారు.

శశిముఖులారా రారే మన పసిపాపలకు
భోగిపళ్ళు పోయుదము ॥శ॥
మూడేసి దోసిళ్ళు మురియుచు శిరమున ॥శ॥
మంగళాకారుడు మదన సుందరుడు
రంగుగ పీటపై రవళించు చున్నాడు ॥శ॥





అద్దపు చెక్కిళ్ళు ముద్దులొలుకుచు
దిద్దిన కస్తూరి తిలకము దీర్పుక ॥శ॥ (ఆదిలక్ష్మమ్మ, ముత్తుకూరు)

గొబ్బిళ్ళు : ఇళ్ళలో జరుపుకొనే పండుగలు కొన్ని అయితే పదిమంది ఒకచోట చేరి జరుపుకునేవి కొన్ని. ధనుర్మాసం ఆరంభం కాగానే రంగవల్లులు తీర్చి ఆడపిల్లలంతా గొబ్బిళ్ళు చేసి పిడకలు కొడతారు. గుమ్మడి పూలతో అలంకరిస్తారు. మాఘమాసంతో రథసప్తమికి గొబ్బి పిడకలతో పాలు పొంగించి సూర్యుడికి పొంగలి పెడ్తారు. సంక్రాంతి ముందు నెల్లూరు జిల్లా మొదలైన ప్రాంతాలలో ప్రతిపల్లె గొబ్బిపాటలతో మార్మోగి పోతుంది. మధ్యలో గొబ్బెమ్మను పెట్టి ఆడపిల్లలు దానిచుట్టూ తిరుగుతూ, చప్పట్లు కొడుతూ పాటలు పాడుతారు.

గొబ్బియ్యళొ గొబ్బియని పాడరమ్మా
గొబ్బియ్యళొ ॥గొ॥
చందమామ చందమామ ఓ చందమామ
చందమామ కూతుళ్ళు నీలగిరి కన్నెలు ॥గొ॥
నీలగిరి కన్నెలకు నిత్యమల్లె తోట
నిత్యమల్లె తోటలో నిమ్మల్ల బావి ॥గొ॥
నిమ్మల్ల బావికి గిలకల్ల తాడు
గిలకల్ల తాడుకు బుడిగి బుడిగి చెంబు ॥గొ॥
బుడిగి బుడిగి చెంబు అందరికి మనసు
అందరికి మనసైన నేనీయ నేర ॥గొ॥
నేనీయ కుంటేను నా చెల్లియిచ్చు
నా చెల్లి నా కన్న కడుముద్దరాలు ॥గొ॥

(విజయమ్మ, నెల్లూరు)

గొబ్బెమ్మ పండుగవలెనే తెలంగాణాలో ఎక్కువగా కనిపించే రెండు వేడుకలు బొడ్డెమ్మ, బ్రతుకమ్మ పండుగలు. తెలంగాణాలో వీటికి సంబంధించిన పాటలు అమితంగా దొరుకుతాయి. ఆశ్వయుజ శుద్ధపాడ్యమి నుంచి మహర్నవమి వరకు బ్రతుకమ్మ పండుగ; అంతకు ముందు తొమ్మిది దినాలు బొడ్డెమ్మ పండుగ. బొడ్డెమ్మ పండుగలో ఎక్కువగా పిల్లలు పాల్గొంటారు. ఈ రెండు పండుగలను గురించి బి.రామరాజుగారు తమ 'జానపద గేయ సాహిత్యము'లో విపులంగా చర్చించారు.

హోళీ పండుగ : ఇది యావద్భారతంలోను ప్రఖ్యాతి గాంచింది. హోళీ

పాటలు, అల్లోనేరేళ్ళు, కామునిపాటలు, జాజర పాటలు, కోలాటం పాటలు ఈ సమయంలో మనకు వినిపిస్తాయి. కామదహనం భారతదేశంలోని అనేక ప్రదేశాలలో ఉంది. ఫాల్గుణ శుద్ధ పౌర్ణమికి కాముని పున్నమ అని పేరు. కొండవీటి రెడ్డి రాజులు ఈ ఉత్సవాన్ని అత్యంత వైభవోపేతంగా జరిపేవారు. భీమేశ్వర పురాణం, సింహాసనద్వాత్రింశిక మొదలైన కావ్యాలలో దీన్ని గురించిన విపుల వర్ణనలున్నాయి. విజయనగర రాజుల కాలంలో ఈ పండుగను మహావైభవంగా జరుపుకొనేవారు. తెలుగు దేశంలో ఈ నాడు కాముని పండుగ చాలా చోట్ల మరుగున పడిపోయింది. తెలంగాణాలోను, రాయలసీమలోని కొన్ని ప్రాంతాలలోను ఈ పండుగను ఈనాటికీ జరుపుతున్నారు. కాముని పండుగకు సంబంధించిన పాటల్లో 'హొలి హొలిరరంగ హోలి–హోలిర చెమ్మకేళి' అనే పల్లవి ఎక్కువగా వినబడుతుంది. 'చెమ్మ కేళిర హోళి' అన్నది 'శ్యామ్ ఖేలేరె హోళి' అనే హిందీ వాక్యం అపభ్రంశ రూపమని బి.రామరాజుగారు గుర్తించారు.[5] రంగులు చల్లుతూ స్త్రీ పురుషులు ఇలా పాడుతారు.

'రంగులాడుదాము రంగ హోళి
చెమ్మ కేళిర హోళి
ఉంగరాల జుట్టు మీద హోళి
చెమ్మ కేళిర హోళి – ఎర్ర
రంగు పోసి పోతాను హోళి
చెమ్మ కేళిర హోళి'[6]

ఉత్తర భారతంలో 'హోళిక' అనే రాక్షసబొమ్మను చేసి, అది దహనమవుతూ ఉంటే ఆనందంతో గంతులేస్తారు. హోళిక హిరణ్యకశిపుని సోదరి. ప్రహ్లాదుని చంపడానికి హిరణ్యకశిపుడు ఆమెను నియమించాడు. ఆ రాక్షసి మంటలలో పడి మరణించింది. శివుడు కాముణ్ణి దహించిన కథను పురస్కరించుకొని కామదహనం చేస్తారని కొందరంటారు.

కాముని పండుగ సమయంలో జాజరపాటలు కూడా వినిపిస్తాయి. నాచన సోమన వ్రాసిన వసంత విలాసమనే గ్రంథంనుంచి లక్షణకర్తలొక జాజర పాటనుదహరించారు. భీమఖండంలో వసంత ఋతువును వర్ణించే సందర్భంలోను జాదుర పాటల ప్రసక్తి ఉంది. అచ్చరలు 'జాదుర జాదురంచు మృదుచర్చరి గీతలు వారుణీ రసాస్వాదమదాతి రేకములు చంద్రికగాయన దక్షవాటికా వేదుల మీదటన్ గనక వీణలు మీటుచు' పాడుచుండిరట. జాజిరి పాటలు సంస్కృత మందలి చర్చరీ





గీతాలకు తెలుగు రూపాలని విద్వాంసుల అభిప్రాయం. ఈ జాజర పాటలను కోలలు తద్దూ పాడుతారు. వీటిని పాడేటప్పుడు కస్తూరి, గంధ వొడి, పుప్పొడి మొదలైన వాటిని చల్లుతారు. ఈ పొడికి జాజర అని పేరు. జాజర పాటలు శృంగార, హాస్యరసప్రధానమై ఉంటాయి. ఈ క్రిందిది ఒక జాజరపాట.

'జాజిరి జాజిరి గాజుల పాప
జాజుల్ల గూచున్న సన్నపు చాప
చాప చుట్టరే సందారి కోట
కోట కోటకు రెండు కొమ్మల జగ్గాల్
జగ్గాలు బుట్టుక పల్లెకు పోతె
అప్పుడే నా వొల్లు జల్లుమానె
జల్లుమన్న కాడ మల్లెల్లు రాలె
మల్లెల మాదేవి తోట్లో ఉన్నాది'[8]

దసరా : భారతీయులకు అత్యంత ప్రీతిపాత్రమైన వేడుకలలో దసరా ఒకటి. ఆశ్వయుజ శుద్ధ పాడ్యమినుంచి దశమివరకు ఈ వేడుకలు జరుగుతాయి. కాళికా పురాణంలో రాముడు మహానవమినాడు దేవిని పూజించి రావణుని వధించినట్లుగా ఉంది. రాముడు రావణునిపై దండు వెడలింది ఈ దినమేనని కొందరు చెప్తారు. విజయదశమికి భారతీయ సంస్కృతిలో చాలా ప్రాధాన్యం ఉంది. మహిషాసుర మర్దని విజయం సాధించింది ఈ దినమే నంటారు. కొందరు విజయుడు జమ్మిపై ఉండిన ఆయుధాలను తీసుకొని శత్రువులను ఓడించింది ఈ దినమే అంటారు. ఏది ఏమైనా ఈ పండుగ సర్వజనులకూ ప్రీతికరమైనది.

'దసరా పద్యాలు' ద్విపద ఛందస్సులో ఉంటాయి. వీటిలో భక్తి, శృంగారం, కరుణం, హాస్యం కనిపిస్తాయి.

'మరుజనక మమ్మేలు మత్స్యావతార
గురుతుగా కృపజూడు కూర్మావతార
వరదుడవు కావయ్య వరహావతార
సిరులు కరుణించు నరసింహావతార
వక్షమున సిరిగల్లు వామనావతార
రక్షించుమము పరశురామావతార.....'[9]

అంటూ కొన్నిట్లో దశవతార వర్ణన కనిపిస్తుంది. మరికొన్నిట్లో వినాయకుడు, సరస్వతి,

శివుడు మొదలైన దేవతల స్తుతి ఉంది. అన్ని కులాలవారిని కొన్ని పాటలలో పొగడడం కనిపిస్తుంది.

కోలాటం పాటలు : భారతదేశంలోని అనేక ప్రదేశాలలో అత్యంత జనప్రియమైన వినోదం కోలాటం. పాట, పాటలయకు తగిన ఆట, ఆటకు తగినసంగీతం, సంగీతంతో బాటు వినోదం –అన్నీ మేళవించిన కళకోలాటం.

కోలాటం పాటలు ఆంధ్రదేశంలోని అన్ని ప్రాంతాలలోను ఉన్నాయి. ఇవి మామూలుగా నాలుగు–నాలుగు మాత్రలుండే ఆవృతాలు ఎనిమిదింటితో ఉంటాయి. పాల్కురికి సోమనాథుడు 'కోలాట గొడియల'ను పేర్కొన్నాడు. అన్నమయ్య కీర్తనల్లో కోలాట కీర్తనలు అనేకం ఉన్నాయి. మువ్వలు కట్టిన బచ్చెన కోలలతో తాళాలు వేస్తూ గుండ్రంగా తిరుగుతూ పాటలు పాడుతూ కోలాటాలాడడం తెలుగు దేశంలో అన్ని చోట్లా కనిపిస్తుంది. దండనర్తనమని ప్రాచీనులు దీన్ని వ్యవహరించేవారు. తెలుగు దేశంలోనే కాక దక్షిణ దేశంలోని అనేక దేవాలయాలలో కోలాట భంగిమలెన్నో కానవస్తాయి. ఇప్పుడు పురుషుల కోలాటాలేగాని స్త్రీల కోలాటాలంతగా కనిపించవు. జడ కోలాటం మాత్ర అపవాదం.

జాతరలు, పోతరాజు కొలువులు, గ్రామదేవతల పండుగలు, పరషలు, మహమ్మదీయుల ఉరుసులూ ఇవేవీ లేకున్నా వెన్నెల రాత్రులలో ఉబుసుపోకకైనా సరే కోలాటాలు వేస్తారు.

కోలాటం నృత్త భేదాలలో ఒకటి. ఇది తాళలయాశ్రితం దీనిలో ఎనిమిది మందిగాని, పన్నెండు మందిగాని పాల్గొంటారు. ఇది ఎప్పుడూ సరి సంఖ్యలోనే ఉంటుంది. కోలాటం చేసే వాళ్ళలో బాగా ఆరితేరిన వాడు నాయకుడుగా ఉంటాడు. అతణ్ణి మేళనాయకుడు లేక పెన్నుద్ది అంటారు. వెలుపలి కక్ష్యలో సవ్యంగా తిరిగే వాళ్ళను వెలియుద్దులని, లోకక్ష్యలో అపసవ్యంగా తిరిగేవాళ్ళను లోయుద్దులని అంటారు. వీళ్ళ కాళ్ళకు గజ్జెలుంటాయి, బచ్చెనకోలలకూ గజ్జెలుంటాయి. పెన్నుద్ది 'తయ్యక తద్ధిమితా' అని విలంబగతిలో మొదలు పెడతాడు. తాళాన్ననుసరించి విలంబిత, మధ్య, ద్రుత గతుల్లో కోపులు నడుస్తాయి.

కోలాటం పాటల్లో ఎక్కువగా ఉండేది శృంగారమే పిల్లలకున్నన్ని ఆట పాటలు పెద్దలకు లేవు. క్రికెట్ మొదలైన క్రీడలు జానపదుల ఊహకందనివి. కోలాటం వంటివే జానపదుల వినోదానికై ఆశ్రయించదగ్గ ఆటలు. "దీనిలో వర్ణచలనమూ, వేష సామరస్యమూ, గమన సామరస్యమూ, మువ్వలమోత, కోలల లయ, రాగసరళీ,





కంఠమేళ, కథా సౌందర్యమూ ఒక్కుమ్మడిగా ఏకమయి అలరిస్తవి"[10]

మామూలుగా కోలాటాలు గణనాయకుని పాటతో ప్రారంభమవుతాయి. 'శివశివమూర్తివి గణనాథా, నీవు శివుని కుమారుడవు గణనాథా' మొదలైనవి అట్టి కోలాటస్తుతులే. యమకాది శబ్దాలంకారాలు ఈ పాటలలో నిండుగా ఉంటాయి. గోపాలా, మల్లేశా, విగ్గుణనాథా, చల్లుదామా, దిద్దుదమా, కూడుదమా మొదలైన పాదాంతాలు ఈ పాటల్లో ఉంటాయి.

కోలాట గేయాలలో జానపదులకు ఇష్టులైన రాముడు, గోపాలుడు, గోపికలు మున్నగు వారంతా స్మరింపబడుతుంటారు. ఎక్కడో తెలుగు నాడులోని మారుమూల పల్లెలోని పాలుకూడా పాటలద్వారా రేపల్లెను చేరుతాయి.

కొండా కొండలరామ కోదండరామ
కోదండ రామా రామయ్యా ॥కొండ॥
కొండాన మాయావు కోడే నీనిందో
దూడా నీనిందో రామయ్య ॥కొండా॥
మాయావు పాలన్ని రేపల్లె చేరా
రేపల్లె చేరా రామయ్య ॥కొండా॥
రేపల్లె కవతాల నన్నిచ్చినారు
నన్నిచ్చినారు రామయ్య ॥కొండా॥

(మోదీనా, మేడికుర్తి, చిత్తూరు జిల్లా)

జానపదులకుండే సామాజిక ప్రజ్ఞ నాగరికులకుండదు. పల్లెటూళ్ళలో అందరిని మంచి చేసుకొని బతకడం అత్యంతావశ్యకం. కోలాటం వేసినా పల్లెలోని పెద్దలను పేరు పేరునా చెప్పుకోవడం అలవాటు రెడ్డి, రెడ్డిభార్య, రెడ్డి కూతురు–అందరూ పాటలో చోటు సంపాదించుకున్నారు.

ఉయ్యాలో జంపాలో ఊరి పేరేమిరా
రామరామ కోదండ రామా
ఉయ్యాలో జంపాలో ఊరు మేడికుర్తి
రామరామ కోదండ రామా
రచ్చాన ఉండే ఆ రెడ్డి పేరేమిరా ॥రామ॥
రచ్చాన ఉండేటి రెడ్డి రాఘవరెడ్డి ॥రామ॥
ఆ రెడ్డీ భార్య పేరు చిలకా పేరేమిరా ॥రామ॥

ఆ రెడ్డీ భార్య పేరు సారస్వతమ్మరా ॥రామ॥

(ప్రకాష్, మేడికుర్తి, చిత్తూరు జిల్లా)

స్త్రీలకూ ఒకప్పుడు అనేక విధాల కోలాటాలు ఉండేవి. కాని ప్రస్తుతం జడకోలాటం మాత్రం ప్రాచుర్యంలో ఉంది. ఆ సందర్భంలో పాడే ఒక చిన్న పాటయిది–

'అటవీ స్థలముల కరగుదమా?
వట పత్రంబులు కోయుదమా?
జనులారా గుడి కూడుదమా?
జడ కోలాటము వేయుదమా?'[11]

కోలాటం, గొబ్బియాట, చెమ్మ చెక్క మొదలైన వాటిని పోలినది 'జట్టిజాము'. తాళ ప్రధానమైందీ కళ. వెన్నెల్లో ఆరుబయట మండలాకారంగా నిలబడి 'జట్టి జాము' వేస్తూ పాటలు పాడుతారు. రాయల సీమలో కనిపించే ఈ జానపద కళను ఆంధ్రలోకానికి వివరంగా పరిచయం చేసిన వారు డా.టి.దొణప్పగారు.[12]

గొబ్బిలోలాగా చుట్టిరావడంగాని, కోలాటంలోగాని చేతికోలలుగాని, చెమ్మ చెక్కలోలాగా గెంతడంగాని జట్టిజాములో ఉండదు. చేచరపులు మాత్రమే ఉంటాయిందులో. "తిన్నగా నిలుచుండి, ఉభయపార్శ్వములందలి ఉద్ది కత్తెలతో ఒద్దికలు చెడకుండ ఒకసారి కుడితట్టునకు, ఒకసారి యెడమతట్టునకు పార్శ్వముఖ భంగిమలో ఓరగా తిరిగి, ఆయా వైపుల నుండువారి అఱచేతులను తన అఱచేతులతో తట్టుచు"[13] పాడుచు స్త్రీలు ఆడే ఆటయిది. మొదట కోలలను వాడుతుండే వారేమో అనిపిస్తుంది. సంస్కృతంలో చేతికోల అని అర్థమిచ్చే 'యష్టి' ప్రాకృతంలో 'జట్టి' అవుతుంది. ప్రహరమనే అర్థం వచ్చే 'యామ' ప్రాకృతంలో 'జామ' అవుతుంది. ఇదే తెలుగులో 'జట్టి జాము' అయివుండ వచ్చునని డా.దొణప్ప గారూహించారు.

జట్టిజాము పాటల్లో వెన్నెలాయలో, వెన్నినాయలో, వెన్నిటీ, రామరామా కోదండ రామా మొదలైన పాదాంత పదాలు కనిపిస్తాయి. చైత్ర వైశాఖ కార్తిక మార్గశిరాలు ఈ పాటలు పాడే సమయాలు. నలుగురు లేక అంతకన్న ఎక్కువమంది ఉంటే సరిసంఖ్యలో జట్టిజాము వేస్తారు. రెండు జట్టుగా దీన్ని ఆడుతారు. ఒక జట్టువారు పాటలో ఒక పాదం పాడితే రెండవ జట్టువారు వంత పలుకుతారు. జట్టిజాము పాటల్లో కథాగేయాలూ ఉన్నాయి.

ఈ పాటలలో హాస్య గీతాలు, శృంగార గేయాలూ ఎక్కువగా కనిపిస్తాయి. కొన్ని స్తుతులు కూడా ఉన్నాయి. పినాకినీ నదీ తీరంలో ఉన్న జరుట్ల అనే శైవ





క్షేత్రంలో వెలసిన రామలింగేశ్వరునిగురించిన గీతం ఈ క్రిందిది.

'మారుట్ల పొలమూలోన
జారుట్ల రాముడూ జారుట్ల రాముడూ
పట్టే మంచం పానుపుమింద పూజలుగొన్నాడే
మట్ట మధ్యాన్న వేళ
నట్టింట నాదికొంగు నట్టింట నాదికొంగు
పట్ట వద్దుర నాదుకొంగూ పాదంబట్టేనూ....'[14]

## కన్నడం

### పెళ్ళి పాటలు :

తెలుగులో లాగానే కన్నడంలో కూడా పెళ్ళికి సంబంధించిన పాటలు విరివిగా లభిస్తున్నాయి. 'పిల్లనిచ్చేము' అని అర్థం వచ్చేలా 'హెణ్ణుకొట్టేవు' అనే పేరుతో జానపద మంగళ గీతాలను క.రా.కృష్ణస్వామిగారు ఒక ప్రత్యేక సంకలనంగా ప్రచురించారు. 'మల్లిగె దండె' అనే జానపద కవితా సంకలనంలో రేవప్పగారు వివాహం మొదటినుంచి తుదివరకు పాడే గేయాలను ఇచ్చారు. ఇవికాక అనేక గేయ సంపుటాలలో వివాహ గీతాలు చోటు చేసుకున్నాయి.

తెలుగువారి వివాహ సంప్రదాయాలకు, కన్నడిగుల వివాహ సంప్రదాయాలకు చాలా పోలికలున్నాయి. పెళ్ళి చూపులు, పెళ్ళికూతుర్ని – పెళ్ళికొడుకును చేయడం, కలశ పూజ, 'బాసింగం' కట్టడం, వియ్యపు రాళ్ళ వివాదాలు మొదలైనవి కన్నడిగుల పెళ్ళి పాటలలో ఉన్నాయి.

మామూలుగా మగపెళ్ళివారు ఆడపెళ్ళి వారింటికి వెళ్ళి పిల్లను చూడడం పద్ధతి. వచ్చిన వియ్యాల వారిని జంఖానాపరిచి కూర్చుండ బెట్టి విడియమిచ్చి రాకకు కారణమడుగుతున్నారీ క్రింది పాటలో. వారుమేము పిల్ల నడగడానికి వచ్చామన్నారు.

'హెణ్ణిగోగువాగ హణ్ణినందల బందొ
హన్నెరడు కుదురె బిగనూరు సైవాగి
బందరు బీగార అరమనెగె
బంద బీగరిగె జంబుకానె వాసి
గంధ వీళ్యవ నడువిరిసి కేళారల్లె

నీవు బంద కారణద బగెయేను'[15]

పెళ్ళి మూడు నాలుగు దినాలుండనగా ఆడ పెళ్ళి వారింట్లో 'వీద్యశాస్త్ర' అన్నది జరుపుతారు. దీని కోసం తమలపాకులు, వక్కలు, ఐదుకొబ్బరికాయలు, ఐదు గెలలు అరటిపళ్ళు, ఐదు బెల్లపచ్చులు, శనగపప్పు మొదలైనవి మగపెళ్ళివారు ఆడ పెళ్ళివారింటికి పంపిస్తారు. వీటిలో తాంబూలానికి అగ్రస్థానం.

'ఎలెయ తందెలెయ నందియ సురహొన్నె తోటదెలెయ
అంద కాలూరు చందకె బేలూరు
గంధ హొంబాళె బెళెవొ చన్నపట్నద
ఏరి కెళగ హంబు అరిదావొ గగనాకె.....'[16]

నలుగు పాటలు కన్నడంలో కూడా ఉన్నాయి. ఐదు మంది ముత్తయిదువలు నూనె పూసి నలుగు పెడ్తారు. పక్కనే ఒక గుండ్రాయి పెట్టి దానికి పసుపు పూసినూనె రాస్తారు. ఒక్కొక్కరే పెళ్ళికొడుకు తలమీద నీళ్ళు పోస్తారు. ఇలా తలంటి పోస్తూ పాటలు పాడుతారు.

'హత్తు కొంబరిసిన కుట్టి బట్టల్తుంబి
మాళిగె ముందె మణె హాకి మీద నీరు
అందల దాటి హొళెదాట
సముద్రద బాళె ఓలాడి బెళెదావొ
ఆరు కొంబరిసిన తేదు బట్టల్తుంబి
మాళిగె ముందె మణెహాకి మీద నీరు
ఒత్తెణ్ణె పురకె హరిదావు
చప్పర దట్టేలి ఒప్పకొలెయ నూడి
కప్పురద సేదె ఒలెగిక్కి కాదా నీరు
భూమండల నాళొ మగనిగె.....'[17]

పెళ్ళికొడుకు భాషికాలు కట్టే ఆచారం కన్నడిగులకు కూడా ఉంది. ఆ సందర్భంలో కూడా గీతాలాలాపిస్తారు. పెళ్ళిలో ఎన్నో రకాల వినోదాలు ప్రత్యక్షమవుతాయి. భోజనాలు అలాంటి వినోదాలలో ప్రధానమైనవి తెలుగులో బువ్వపుబంతిపాటలు ప్రత్యేకతను సంతరించుకున్నాయి. ఆ విధంగా కాకున్నా, వివాహ భోజనం వర్ణితమైన పాటలు కన్నడంలో కూడా ఉన్నాయి.

వివాహంలో జరిగే వేడుకలలో బంతి ఆటకూడా ఒకటి. మల్లెపూలతో





బంతులు చేసి ఆడుతారు. 'మల్లె పూలను కోసి, బంతులను కట్టి ఆడుదాంరా ప్రియా, అని పాడుతున్నారీ పాటలో.

"మల్లిగె హూవు కొయ్దు
చెండాగళన్ను కట్టి
పంతదించ చెండ కట్టి
ఆడోణ బాబా ప్రియె
హూవిన చెండ కట్టి
ప్రాణకాంతన గుణవంతనె
పంతదింద చెండ కట్టి
ఆడోణ బాబా ప్రియ"[18]

'హవ్యకర హాడుగళు' అనే పేరుతో కన్నడంలో కొన్ని పాటలున్నాయి. కదంబ మయూర వర్మ కాలంలో బ్రాహ్మణులకు కరువేర్పడిందట. ఆ రాజు వింధ్య ప్రాంతాలనుంచి హవ్యకర్మల కోసం కొన్ని బ్రాహ్మణ కుటుంబాలను రప్పించాడట! వాళ్ళే హవ్యకులు. కర్ణాటకంలోని శివమొగ్గ మొదలైన జిల్లాలలో వీరు ఎక్కువగా ఉన్నారు. వీళ్ళకు సంబంధించిన పాటలలో సుమారు సగంవరకు పెళ్ళిపాటలే ఉన్నాయి. పెళ్ళి ప్రారంభమయినప్పటినుంచి ముగిసే వరకు ప్రతి వేడుకనూ వర్ణిస్తాయీ పాటలు.

గంగ, గోదావరి మొదలైన నదులకు భారతీయుల అధ్యాత్మిక జీవితంలో పవిత్రమైన స్థానముంది. హరితో సమానుడయిన అల్లుడికి కాళ్ళు కడుగుతూ పాడే పాటలో హవ్యకులు నదులను స్మరించుకుంటారు.

"గంగె గోదావరి తుంగభద్రెయు కృష్ణె
సంగమ హరివో యమునెయను
సంగమ హరివో యమునె యుదకవ తందు
అంబుజ హరియ పాదవ తొళెద...."[19]

**పండుగ మొదలైనవి :**

కన్నడదేశంలో ఆచరింపబడే పండుగలలో కాముని పండుగ ఒకటి. దీన్నే హోళీ అంటారు. తెలుగు దేశంలోని అనేక ప్రాంతాలలో ఈనాడు మరుగున పడి పోయింది ఈ వేడుక.

స్త్రీలకే ఎక్కువగా వేడుకలు ఉండడంచూచి పురుషులు తమకు ఒక్క పండుగనైనా

దయచేయవలసిందని దేవుణ్ణి ప్రార్థించారట. అప్పుడు భగవంతుడు కాముని పండుగను ప్రసాదించాడని కన్నడ జానపదులలో ఒక కథ ప్రచారంలో ఉంది. విజయనగరానికి పోర్చుగీసు రాయబారిగా ఉండిన డామింగోపీజ్ ఈ ఉత్సవాన్ని గూర్చి వివరించాడు. తంజావూరు సరస్వతీ పుస్తక భాండాగారంలో 'ఆకాశ భైరవ కల్ప'మనే పుస్తకం ఉంది. అందులో రాజులు ఆచరించదగిన పండుగలలో కాముని పండుగను గూర్చి ప్రత్యేక అధ్యాయమే ఉంది. పండుగ మన సాంస్కృతిక సంప్రదాయాలో పెక్కింటి సమష్టి పరిణామమని విజ్ఞులు అభిప్రాయ పడుతున్నారు. యజ్ఞ పరి సమాప్తి తర్వాత అవభృథ పూర్వం ఆచరించే సర్వాహుతి సంప్రదాయం ఈ పండుగలో మనకు కొంత కనిపిస్తుంది. అవభృథ పూర్వం యజ్ఞభస్మాన్ని నీటిలో కలిపి ఒకరిపై ఒకరు చల్లుకొనే వారట! పిదప వసంత క్రీడలాడి నీటిలో స్నానం చేసే వారట! కామదహన విషయం విష్ణు, భాగవత, లింగ పురాణాలలో కనిపిస్తుంది. కాముని పండుగలో కామదహనమే ప్రధానంగా కనిపిస్తుంది. వసంతాలు చల్లుకొనే సంప్రదాయం చాలావరకు పోయి నేడు కామదహనం మాత్రం నిలిచి ఉంది.

'హోళీ' అనే పదానికి కన్నడ పండితులు వివిధార్థాలను సూచించారు. హోలికా లేక దుంఢా అనే రాక్షసి అయోధ్య సమీపంలోని అరణ్యంలో చిన్న పిల్లలను బాధిస్తుండేదట. ఆమెను ప్రజలు పట్టుకొని కాల్చివేశారు. మరికొందరు శ్రీకృష్ణభక్తి సంభరితమైన భాగవత సంప్రదాయాన్ననుసరించి వసంతోత్సవ సంప్రదాయం వచ్చిందంటారు. గోపీ కృష్ణుల రాసలీలలే వసంత క్రీడలకు ప్రాతిపదికలనడానికి ఉపపత్తిగా వసంత కాలంలో జరిపే 'వసంత మాధవుడి' పూజను ఉదహరిస్తారు.

వసంత క్రీడలను 'ఓకుళి' ఆట అంటారు. ఎఱ్ఱనీళ్ళు చల్లుకునే ఈ సంప్రదాయం శృంగారరసానికుండే ప్రాధాన్యాన్ని తెల్పుతుంది. శృంగార రసం వర్ణం ఎరుపు. రతిభావ వర్ణం ఎరుపు. శృంగారరస పోషణకు ఉద్దీపన విభావమైన వసంత ఋతువు రంగూ ఎరుపే. శృంగారసాది దేవతయైన మన్మథుని సాంకేతిక వర్ణం కూడా ఎరుపే కావడం వల్ల ఎఱ్ఱని వసంతాలను చల్లు కోవడం కాముని పండుగ ప్రత్యేకత. ఉత్తర కర్నాటకంలో 'ఓకళి' ఆడుకోడం ఇంకా నిలిచి ఉంది.

కాముని పండుగ సందర్భంలో వినిపించే కన్నడ గేయాలలో తెలుగులో లాగానే శృంగార హాస్యరసోపేతాలై ఉంటాయి. కొన్నిట్లో అశ్లీలాలు కూడా ఎక్కువగా కనిపిస్తాయి. శివుని తపస్సు చెరచడానికి వెళ్ళిన కాముని వృత్తాంతాన్ని సూచిస్తూ కొందరు–





కామణ్ణ కట్టుతలి
గొనె మళ్ళ సురియుతలి
సీతాళ బాంవి తెగెసుతలి–నమకామ
జీత హొగ్యాన శివనల్లి

అని పాడుతారు.

హోళీ పాటలలో కథాగేయాలున్నాయి. దుందుమి అనే పేరుగల వాద్యాలతో గూడిన పాటలున్నాయి, త్రిపదులున్నాయి, సోబాన గీతాలున్నాయి. కోలాటాలున్నాయి. ఉత్తర కర్నాటకంలో జానపదులు మన్మథుని వేపపూలతో సింగారిస్తారు. ప్రతి ఒక్కరూ వేపపూలను ధరిస్తారు. స్త్రీ పురుషులిర్వురూ హోళీ పాటలను తమకు విసుగు పుట్టేంత వరకు పాడుతారు. పాటలను గణపతి ధ్యానంతో మొదలు పెడ్తారు. తర్వాత మన్మథుని మోహన రూపాన్ని, రతీదేవి సౌందర్యాన్ని తలచుకుంటూ పాటలు పాడుతారు.

"ఆని గంబారి చెంద, కుదరీగె తడిచెంద
సదరీగె చెంద కామణ్ణ బగలాగ
రూపక చెంద రతిదేవి"[20]

కాముని పండుగ శైవులకూ, వైష్ణవులకూ– ఇద్దరికీ కావలసిన వేడుక. దీనికి సంబంధించిన నమ్మకాలు చాలా ఉన్నాయి. కాముని దహనంచేయగా ఆ బూది ఏదిక్కుకు ఎగిరితే ఆ వైపు పంటలు సమృద్ధిగా పండుతాయని ఒక నమ్మకం. కాముని బూదిని విత్తనాలతో కలిపి చల్లుతారు. హోళీ ఆడని దేశం దేశమే కాదని జానపదుని నమ్మకం.

'హోళి యాడద నాడు. నాళెనదె కాడాతో
గోళాతొ జనక మాలాతొ మళె హొగి
హేళతో పిడుగెద్దు దినదినకా"[21]

ఆంధ్ర కర్ణాటకాలలోనే గాక భారతదేశమంతటా ప్రసిద్ధమైన మరొక వేడుక దసరా. ఆశ్వయుజ శుద్ధ పాడ్యమినుంచి నవరాత్రులు ఆరంభమవుతాయి. కన్నడ దేశంలో దసరా 'నాడహబ్బ' అని పిలువబడుతున్నది. విజయదశమితో అంతమవుతుందిది. విజయనగరంలోని మహానవమి దిబ్బ యీ నాటికీ ఆ రాజుల దసరా మహోత్సవాల వైభవాన్ని తెలుపుతున్నది.

విజయదశమి నాడు పల్లెపెద్ద ఊరిలోని పెద్దలను పిలుచుకొని వచ్చి శమీ పూజ జరిపిస్తాడు. పేరుకు పూజ అయినా ఇది ఒక వేడుక మాత్రమే. దసరాకు

'బన్నియ హబ్బ' (=జమ్మి పండుగ) అనికూడ పేరు. స్కాంద పురాణం, బ్రహ్మాండ పురాణం, భవిష్యోత్తర పురాణం మొదలైన వాటిలో శమీ పూజ మహత్త్వం వివరించబడింది. విజయనగర సామ్రాజ్య ప్రతిష్ఠాపన విజయదశమినాడు జరగబట్టే విజయనగరమనే పేరు ఏర్పడిందని అంటారు. ఈ విషయాన్ని సూచించే కొన్ని త్రిపదులు కన్నడంలో ఉన్నాయి.

'బన్నీయ గిడహుట్టి హొన్నిన మళెగరెదు
చెన్నపట్టణకె హొళిహరిదు హంప్యాగ
బన్నాణ వీర గుట్టాగి'[22]

విజయనగర రాజుల కాలంనుంచి మొన్న మొన్నటి మైసూరు రాజుల కాలంవరకు దసరా వేడుకలు అత్యద్భుతంగా, మహావైభవోపేతంగా జరుగుతూవచ్చాయి.

ఆశ్వయుజ శుద్ధ పౌర్ణిమను కన్నడిగులు 'శీగెహుణ్ణిమె' అని పిలుస్తారు. ఆనాడు వనభోజనాలు ప్రత్యేకం. జానపదులు పొలంలో పాండవులను పూజించి తర్వాత తమ వేడుకలను సాగనిస్తారు. వనభోజనాల తర్వాత ఆడపిల్లలు వెన్నెలలో ఆట లాడుతారు, పాటలు పాడుతారు.

'శీగె హుణ్ణివె దిన ఉణలిక్కె కరెయువ రేనల్లా
కరెదరె హొగద బిడలిల్లా ॥ప॥
హురియక్కి హొళిగె హూరణగడబు
కడలి పచ్చడి కట్టినాంబరా
ఉండిగడబు పుండియ పల్లెబుట్టి యొళిట్టెల్ల
బుట్టిగె కెమ్మణ్ణ బడిదెల్ల
అదర అనుభవ తిళియలిల్లు'[23]

దీపావళి కూడా భారతదేశమంతా జరుపుకొనే వేడుక. దీన్ని కన్నడంలో 'హట్టిహబ్బ' అంటారు. దీపావళి సమయంలో పాండవులు దక్షిణదేశాన్ని వదలి ఉత్తరాదికి బయలుదేరారట. ఈ పండుగకు తప్పక కూతురు, అల్లుడు వస్తారు. చెల్లెల అన్నతో 'ఏ పండుగకు పిలిచినా పిలువకున్నా దీపావళికి మాత్రం పిలవడం మరచి పోవద్దన్నా' అని చెప్తుంది.

'కార్హుణవి హబ్బక కరిలాక బరబ్యాడ
కాల బాడీగి కొడబ్యాడ నన్నణ్ణ
హొన్న దీవళిగి మరిబ్యాడ'[24]





దీపావళి మామూలు దీపావళి కాదు; 'బంగారు దీపావళి'. కొందరు అమావాస్యతోనే దీపావళి పండుగను ముగించకుండా పంచమి వరకు చేసుకుంటారు. ఆ పంచమికి 'కడెపంచమి' (చివరి పంచమి) అని పేరు. ఈ పంచమి అయిన తర్వాతనే కూతురు అత్తవారింటికి ప్రయాణమవుతుంది.

కన్నడిగులకు యుగాది ముఖ్యమైన పండుగలలో ఒకటి. ఆనాడు ఎద్దులను సింగారించి సంతోషంగా గంతులేయిస్తారు. ఉగాదిని గురించిన పాటలు కన్నడంలో చిన్నవీ పెద్దవీ అనేకం ఉన్నాయి. ఈ క్రిందింది ఒకటి–

'గుడియ తోరణకట్టి, సడగరవు హొసదినవు
ఉడుగ రెయనాడు బెళవలవు హొసతనవ
ఎడెమాడి ఉండు శివనెందు॥
హొనదినకె హొసతనవు హొసమళెయు హొస బెళెయు
హొసదీప హచ్చి బెళవలవు ఎళెయువదు
బసవణ్ణ నిమ్మ హొసతౌరు'[25]

**కోలాటం పాటలు :**

అనంత వైవిధ్యంతో, తాళ లయాన్వితాలై, సర్వజనులకూ సంతోషాన్ని సమకూర్చే కోలాటం పాటలు కన్నడ దేశమంతా వ్యాపించి ఉన్నాయి. వీటిలో దైవస్తుతులు, తత్వాలు, స్థలపురాణాలు, శృంగార హాస్యాలు నిండిన భావాలు దర్శనమిస్తాయి.

కోలాటంలో పాల్గొనే వారిని 'ఆళుగళు' అంటారు. ఆంధ్రదేశంలో లాగే కన్నడదేశంలోను మామూలుగా ఎనిమిది మంది కోలాటంలో పాల్గొంటారు. ఒక్కొక్కసారి ఈ సంఖ్య 24 వరకు పోవచ్చు. తెలుగులోలాగానే మేళనాయకుడంటాడు. 24 మంది పాల్గొనేట్లయితే ముగ్గురు మేళ నాయకులు అవసరమవుతారు. కోలాటంలో ఉపయోగించే కోలకు 'కోలుగూట' అని పేరు. కొందరు కోల అనే అంటారు. ఇది సుమారు తొమ్మిది అంగుళా లుంటుంది. కోలాట మాడేవారి మధ్య ఒకడు నిల్చుకొని దమ్మడి అనే వాద్యం వాయిస్తూ లయబద్ధంగా పాద విన్యాసం చూపుతాడు. దమ్మడిని ఉడుముచర్మం బలంగా బిగించి తయారు చేస్తారు. దీనికి గజ్జెలు కూడా ఉంటాయి. దమ్మడి వాయించే వానితోబాటు తాళంవేసే వాడొకడు కూడా మధ్యలో నిలబడి ఉంటాడు.

కోలాటం నిదానంగా ప్రారంభమై మెల్లమెల్లగా వేగాన్ని పుంజుకుంటుంది. ఆడే వాళ్ళతోబాటు చూచేవారి మనస్సులు కూడా నృత్యం చేస్తాయి. కోలాటం పాటలలో మామూలుగా మొదట, చివర ప్రార్థన ఉంటుంది. 'శరణు శరణువయ్య గణనాయ్క' అనేపాట ప్రార్థన గీత' లలో ఎక్కువ ప్రచారం పొందింది.

కోలాటం పాటల ప్రారంభంలో ఉండే ఒకటి రెండు చరణాలు ఎక్కువగా ధ్వన్యనుకరణాలై ఉంటాయి. ఇవే ఒక్కొక్కసారి పల్లవిగా పునరావృత్త మవుతుంటాయి. ఈ క్రిందివి కోలాటం పాటల ఆరంభచరణాలు.

1. కోలన్న గంగెగె కోలన్న గౌరిగె
   కోలు కల్యాణద బసవగె కోలె

2. తందనాన తానందెనాన
   తందనాన తానందెనాన

3. సోబాన బన్ని సోబాన సోబాన
   బన్ని సోచ్చీన

శృంగార హాస్యాలు ప్రధానంగా ఉండే కన్నడ కోలాటం పాటలు తెలుగు పాటలలాగే ఉంటాయి. కర్ణాటకంలో కనిపించే కోలాటాలలో అనేక విభాగాలున్నాయి. ఉయ్యాలె కోలు, గీజుగన కోలు, బాగ్గోలు, జోడ్గోలు, హరిగోలు, తేరుగోలు, సోబానద కోలు, దండెకోలు, కరెభంటన కోలు, సుత్కోలు, నిల్‌కోలు మొదలైనవి కోలాటంలోని వైవిధ్యాన్ని సూచిస్తాయి. మొత్తంమీద కోలాటం తెలుగు-కన్నడ దేశాల సాంస్కృతిక సంబంధాలను వ్యక్తంచేసే కళలలో ఒకటని చెప్పవచ్చు.

**టిప్పణి**

1. బి.రామరాజు, తెలుగు జానపద గేయ సాహిత్యము, పు.36
2. త్రివేణి, పు.36
3. ఎల్లోరా (సం.), సరాగాలు, పు.83
4. అదే, పు.75
5. బి.రామరాజు, పూర్వోక్తం, పు.548
6. త్రివేణి, పు.55





7. 'వీణాగానం వెన్నెలతేట-రాణమీరగా రమణుల పాట పేరుచెప్పిన పిన బ్రాహ్మణువీట-జాణలు మెత్తురు జాజరపాట'
8. కృష్ణశ్రీ (సం.), పల్లె పదాలు, పు.68
9. స్త్రీలపాటలు, ఎన్.వి.గోపాల్ అండ్ కో, పు.103
10. 'కృష్ణశ్రీ' (సం.), పల్లెపదాలు
11. ఎల్లోరా, పూర్వోక్తం, పు.221
12. జానపద కళాసంపద (ప్రథమ సంపు), పు.187-208
13. అదే, పు.188
14. అదే, పు.205
15. హొన్న బిత్తేవు హొలకెల్ల, పు.753
16. అదే, పు.756
17. అదే, పు.761
18. అదే, పు.812
19. అదే, పు.786
20. బి.ఎన్.గద్దగి మఠ, కన్నడ జానపద గీతగళు, పు.174
21. అదే, పు.177
22. అదే, పు.163
23. అదే, పు.165
24. అదే, పు.167
25. అదే, పు.178

# 7. వలపు పాటలు

వలపు పాటలను శృంగార గేయాలని వ్యవహరిస్తుంటారు. జానపదుల పల్లెపువ్వులాంటి వలపు గుబాళించే మధుర గీతాలివి. తొమ్మిది లేక ఇంకా ఎక్కువ రసాలున్నా శృంగార వీరాలే ప్రధానమైనవని పెక్కు మంది లాక్షణికులు అభిప్రాయపడ్డారు. ఈ రెంటిలో కూడా శృంగారానికే అగ్రస్థానం. శృంగారం ధర్మతత్పరులచేత ఆచరింపబడి లోక కల్యాణ హేతువవుతుందని చెప్తారు. "ధర్మావిరుద్ధో భూతానాం కామోస్మి భరతర్షభ" అన్నాడు కృష్ణుడు గీత చెప్తూ. శృంగారమే మధురమైంది, ఆనంద జనకమైంది అని ధ్వన్యాలోకకర్త వచించాడు.

లాక్షణిక మతానుసారంగా శృంగారమంటే రతిస్థాయిగా ఉండేది. రూపం, యౌవనం, లావణ్యం, కులం, శీలం మొదలైన గుణాలుండే నాయికా నాయకులుండాలి చేష్టలు, అలంకారాలు, చంద్రదీపాలు, అంగికాలు, వాచికాలు అవసరం. కాని నవ్యులకు ఈ లక్షణాల లక్షలంతగా నచ్చలేదు. సంభోగ శృంగారానికి కొత్త భాష్యాన్ని చెప్పారు వారు. సౌందర్య శృంగారాలకు భేదం లేదని, సౌందర్యధారిణి అయిన ప్రకృతి అర్చనలోనే ఆధునిక కవులు తృప్తిననుభవిస్తారని రాయప్రోలువారి ఉవాచ.[1]

ప్రాచీనమైనా, ఆధునికమైనా – శిష్ట సాహిత్యంలో కనిపించే శృంగారం వేరు; జానపద సాహిత్యంలో సాక్షాత్కరించే వలపువేరు. లాక్షణికుల వచనాలకనుగుణంగా జానపదులు వలపు పాటలను రచించలేదు. ఈ పాటలలో లాక్షణికులు చెప్పిన విభావానుభానుభావ వ్యభిచారీ భావాదుల పురిపుష్టిని ఆశించడం వృథా. సామాన్యంగా అవి ఏదో ఒక సంచారి భావాన్నాశ్రయించి ఉంటాయి. జానపద సాహిత్యంలోని శృంగారం స్వకీయమా, పరకీయమా, ఉత్తమ నాయక నిష్ఠమా, ప్రాకృత నాయక నిష్ఠమా అన్న మీమాంస కత్తివిడిచిన సాము. కావ్య ధర్మాలైన ఔచిత్య విచారాదులు జానపదుల సాహిత్యంలో వెదుకరాదు. అవి కావ్య ధర్మాన్ననుసరించికాక, జీవనధర్మాన్ననుసరించి వ్రాసినవి. నాగరకత ముసుగులోకి రాని జానపదులు తమ వినోదంకోసం కల్పించుకున్న గీతాలవడం వల్ల జానపదుల వలపు పాటలలో అక్కడక్కడ అసభ్య శృంగారం, పరకీయ శృంగారం కనిపించవచ్చు. సభ్య సమాజంలో నిషిద్ధాలు (taboos) గా ఉండే వాటిని ఉపయోగించే స్వాతంత్ర్యాన్ని జానపద విజ్ఞానం ఇస్తుంది. జానపద విజ్ఞాన ప్రయోజనాలలో ఇది కూడా ఒకటి.





అత్యంత ప్రాచీన సమాజంలో వలపు పాటలకు ప్రాధాన్యం లేదు. ఈ నాటికీ సజీవంగా ఉన్న ఆదిమ మానవ సమాజంలో వలపు పాటలకు స్థానం లేదు. వారి జీవితంలో పనికి, పరమార్థానికి మాత్రమే లోటు ఉంది. వేటాడే కాలం పోయి వ్యవసాయాది ఆహార నిర్మాణ పద్ధతుల్ని నిర్మించుకున్న సమాజాలలోనే మనకు ఎక్కువగా వలపు పాటలు వినిపిస్తాయి. శృంగారం రసాధిదేవతగా మానస పూజలందుకుంటుంది. అంత మాత్రం చేత ప్రాచీన సంఘంలో ప్రేమకాస్పదమే లేదని అర్థం కాదు; కవిత్వంలో ప్రేమకు పెద్ద పీటలేదు అని మాత్రమే దీని భావం.

తెలుగు, కన్నడం మొదలైన నాగరక భాషలలో వలపు పాటలదే అగ్రస్థానం. వీటిలో కొన్ని స్త్రీలకు సంబంధించినవి, కొన్ని పురుషులకు సంబంధించినవి, మరికొన్ని సంవాదరూపంలో ఉండేవి. ప్రియురాలి మనోభావాన్ని అత్యుత్తమంగా చిత్రించే గీతాలలో 'చల్ మోహనరంగా' పాట ముఖ్యమైంది. దేవేంద్ర సత్యార్థిగారు దీన్ని అనువదించి 'Meet my people' అనే గ్రంథంలో ముద్రించారు. అక్కడక్కడా శిష్టకల్పనలు కనిపించినా జానపదుల ముగ్ధభావనలకు 'చల్ మోహనరంగ' పాట నిలయమై ఉంది.

కంటికి కాటుక బెట్టి కడవ చంకాను బెట్టి
కళ్ళ నీళ్ళు కడవ నిండెను గదరా
చల్ మోహనరంగా
కళ్ళనీళ్ళు కడవ నిండెను గదరా

దీనిలో ఇలాంటి గీతభాగాలు 55 ఉన్నాయి. మనసులొక్కటైతే మంగళ సూత్రం అవసరం లేదన్న ఉదాత్తభావం ఈ జానపద గేయాలలో చోటు చేసుకుంది.

మన మనసు లొక్కటైతే మాయ పెండిలియేల
మంగళ సూత్రమేటికి ప్రియుడా చల్మోహనరంగా

కొన్ని చిన్ని వలపు పాటలు తమిళ సంగ సాహిత్యంలోని ఉదాత్త విరహ గీతలను తలపింప జేస్తాయి రాయల సీమలో పాడే ఈకింది కపిలి పదం మధురమైన ప్రణయ భావానికి చక్కని ఉదాహరణ.

మానుమాను పువ్వుగాచె మానుకింద రాసి పోసె
ఇప్పి మాను పువ్వుగాసె ఇప్పుడిరిగె నామనసు

చెట్లు నిండుగా పూలుపూసే వసంతకాలమంతా ఒక విరహిణి ప్రియుని కోసం వేచి చూచింది. ఇప్పమాను వసంతకాలాంతంలో పూలుపూస్తుంది. దాన్ని చూడగానే ఆ మానిని మనసు విరిగి పోయింది. సామాన్యమైన ఒక భావం అత్యంత సుందర

కావ్యంగా ఎలా మారుతుందో చెప్పడానికి పై వలపు పాట తార్కాణ.

జారిణికి సభ్య సమాజంలో స్థానం లేదుకాని వలపు పాటలలో ముఖ్యమైన స్థానమే ఉంది. కోలారు జిల్లాకు సంబంధించింది ఈ కింది పాట.

నే చిన్నదాన్ని రా నెల్లూరు బోగందాన్ని రా
కాలకురుసా దాన్ని రా కల్లూరు బోగందాన్నిరా
నేను చిన్నా పాయమపుడు
చింతరాగి చెట్టు ఏసి వుంటే
చింతచెట్టు చిగురుకొచ్చె
చిన్నా బిడ్డ తల్లినైతి
రాగి చెట్టు రచ్చకొచ్చె
రాజులేలే పాయమాయె (తాయమ్మ, రామాపురం, కోలారు జిల్లా)

వలపు పాటలలో ప్రౌఢ నాయికలు చాలామంది కనిపిస్తారు. ఎన్ని అపాయాలు వచ్చినా వాటిని కడచే ఉపాయాలు తెలిసిన గడుసరి పడచు ఈ కింది పాటలో నాయిక.

నీకూ నీ వారు లేరు నాకూ నా వారు లేరు
ఏటి యొడ్డున ఇల్లు కట్టబ్బీ పెరుమాళ్ల చిన్నా
ఏరు వస్తె కూడ బోదాము
చెంపనా సంపంగి నూనె అంచునా చెంగల్వమొగ్గ
ఏటి వడ్డున ఇల్లు కడదాము
బావిలోపల బల్లి పలికె బన్న సరమూ కొలుకులూడె
బిళ్ళలా మొలత్రాడు తెగెనబ్బీ
పెరుమాళ్ళ చిన్నా
ఏరువస్తే యీది పోదాము[2]

జారిణి విటునికిచ్చే సూచనలు, హితోక్తులు, ప్రియులతో ఆడే సరసాలు, విసిరే సవాళ్ళు జానపద గేయాలలో అనేకం కనిపిస్తాయి. స్త్రీలకు సంబంధించిన పై పాటలలాగే పురుషులు పాడినట్లుగా ఉండేవి కనిపిస్తాయి. వీటిలోను విటుల్ని గూర్చినవే ఎక్కువ. జూదరి, నృత్యాది కళలలో ఏక దేశ మెరిగినవాడు, వశీకరణమున నిపుణుడు, వాగ్మి, గోష్ఠులలో బహుమానితుడు. విటుడు పరకీయశృంగారాన్ని మెచ్చేవాడు, ఇతర అక్రమ సంబంధాలున్న వాడిని వ్యవహారంలో విటుడంటారు.





ఆకు, వక్క, బియ్యం, బేడలు – అన్నీ ఇస్తానన్న ప్రేయసిని తలచుకుంటున్న ప్రియుడు ఈ కింది గీతంలో దర్శనమిస్తాడు.

బేవారి చిన్నది బంగారు కంటె వన్నెది
కంటికీ పిరిమైనదన్న కరణగలా చిన్నదీ
ఆకు ఇస్తానన్నది అది వక్క ఇస్తానన్నదీ
కూత తిరగని కోడి పుంజును కూరకిస్తానన్నది
బీము నిసానన్నది అది బేడలిస్తానన్నది
వందు కోను చేత కాకుంటే
వండి పెడతా నన్నది
(ప్రకాష్, మేడికుర్తి, వాయల్పాడు తా॥, చిత్తూరు జి॥)

వియోగ శృంగారాన్ని అత్యద్భుతంగా చిత్రించే పాటలు జానపద శృంగార గేయాలలో లేకపోలేదు. ప్రాచీన సమాజాలలో ఒకటైన ఎస్కి మోలలో అరుదుగా కనిపించే ప్రేమగీతాలలో ఈ కింది వియోగ గీతం ఒకటి.

‘My betrothed
My beloved
I leave you now
Do not sorrow too much for me
I can not forget you
Your eyes full of tears
Are the image of your heart
All who love one another
Find it hard to part from one another
And when we have held our marriage
We shall never part from one another again’[3]

వియోగ శృంగారానికి భాష్యంలాంటిది పై గీతం. రంగూనుకు పోయిన ఒక వ్యక్తి ప్రియురాలికి వ్రాసిన గీతమే ‘సిరి సిరిమువ్వపాట’గా రూపొంది అత్యధిక ప్రచారం పొందింది. ఇది ఒక రకం వలపైతే ‘రంగమెల్లి పోదాము నారాయణమ్మ, రంగురంగు మేడలోన పొంగుచు నుందాము చెంగున లేచిరాయె’ అని ఉబ్బించి, ఊరించే మొనగాళ్ళూ ఉంటారు.

ప్రియురాలు రేపే వలపుల తలపులు ప్రియునికి ఆనందలహరులై భాసిస్తాయి. తన్ను చూచి నవ్విన చిన్న దానిని తలచుకొని, అమాయకంగా కోరికను వెలిబుచ్చుతూ అచ్చమైన జానపద ముగ్ధభావాలను వ్యక్తం చేసే పడుచువాడు ఈ కింది గీతంలో కనిపిస్తాడు.

'నన్ను చూసి నవ్వింది దేశోళ్ల చిన్నదీ
మెట్టా యెట్టిందీ - అహ మేలు కళ్లది పెద్ద ॥ మేలు ॥
సట్టి సేత బుచ్చుకోని సాగెడుతుందీ
మిట్లపల్లలాగ మిడిసి మిడిసి పడుతుందీ ॥ నన్ను ॥
కోక కట్టుకుంది సెవ్వాకు లెట్టుకుంది-కొత్త
ఎల్లిక ఎల్లోరి ఎల్లు ఎల్లుమన్నది ॥ నన్ను ॥
సల్లగ బైతాకు తేను పల్లకునదీ ॥ నన్ను ॥'[4]

శృంగార గేయాలలో సంవాదాలకు ప్రధాన స్థానముంది, భార్యా భర్తల సంవాదమో, ప్రియుడు-ప్రియురాలి సంవాదమూ, మామాకోడళ్ళ సంవాదమూ మామూలుగా కనిపిస్తాయి.

సంసారంలో ప్రణయ కలహాలు తప్పవు. అయితే అవి అచిర కాలంలోనే అదృశ్యమవుతాయి. భార్య కోరికను నెరవేరుస్తానని కూరిమి మగడు మాట ఇవ్వడంతో ఈ కలహం అంతమవుతుంది. మాట పట్టింపు వచ్చినపుడు సంభాషణ నేరుగా సాగదు. ఏగోడో, తడికో మధ్యవర్తిత్వం వహిస్తుంది.

'వంకాయ వండాను వరికూడు వార్చాను
తినమని చెప్పవే తడికా తడికా
వగలాడి మాటలకు వళ్ళంత మండింది
వద్దని చెప్పవే తడికా తడికా
పట్టు చీర తెచ్చాను పెట్టెలో పెట్టాను
కట్టమని చెప్పవే తడికా తడికా
చీరకంచులు లేవు చుట్టు చెంగులు లేవు
వద్దని చెప్పవే తడికా తడికా
సంతలోకి వెళ్ళి సరిగంచు చీరను
అద్దాల రవికను అతివ తెచ్చెద ననవె'[5]

బండి పాటలు కొన్ని ప్రచారంలో ఉన్నాయి. వీటిలో ప్రేయసి బండి





ఎక్కమనడం, ప్రియుడు ఎక్కలేననడం, అప్పుడా అతివ అతనితో వాదించడం కనిపిస్తుంది.

ఎక్కు మామా బండెక్కు మామా
ఎక్కలేనే నా చేతు లెక్కులేవే....
బిడ్డనమ్మి బీడిల కిస్తావు
సరిపినమ్మి సారాయి కిస్తావు
గొడ్డోనమ్మి లొడ్డుకు ఇస్తా
ఎక్కుమామా బండెక్కు మామా

వలపు పాటలను కొన్ని చోట్ల 'యాల పదాలని'ని పిలుస్తారు. తాళ్ళపాక చిన తిరుమలాచార్యులు మొదలైన వారు సంకీర్తన లక్షణాదులలో ఏల పాటల లక్షణాలను వ్రాశారుగాని అవన్నీ వీటికి సరిపోవు. "ఏలలు అన్నవి నిర్ణీత ఛందో నిర్మాణముగల పదములు. యౌవనానుభవమును సూచించే భావాలున్న పదములను ఇక్కడ ఏల పాటలంటున్నాము. ఈ అర్థముతో 'ఏల పాటలు' అన్న మాట వాడుకలో నున్నది"[6] అన్నారు కృష్ణశ్రీగారు. నేను సేకరించిన ఈ క్రింది ఏల పాటలో ప్రేయసీ ప్రియుల సరస సంభాషణ ఉంది.

ఆమె॥ వచ్చిపోర సిన్నగ పచ్చిపూల సొగసుగా
నా తొట్టు నువ్వు సూసి నవ్వొద్దురా
ఆనూరి సంతకు నువ్వురారా సిన్నగ
ఆకులకు వక్కలకు ఓ కాసు ఇచ్చిపో
అతను॥ అమ్మతోడు అప్పతోడు కాసులేదె లచ్చిమి
ఆమె॥ లేకుంటె పీడ పాయె లేసిపోర సిన్నగ
సుగుటూరి సంతకు నీవురార సిన్నగ
సున్నాన్కి ఓ కాసు ఇచ్చిపోర సిన్నగ
అతను॥ అమ్మతోడు అప్పతోడు కాసులేదె లచ్చిమి
ఆమె॥ లేకుంటె పీడపాయె లేసి పోర సిన్నగ
పుంగనూరు సంతకి నీవురార సిన్నగ
పూలకు ఓ కాసు ఇచ్చిపోర సిన్నగ
అతను॥ అమ్మతోడు అప్పతోడు కాసులేదె లచ్చిమి
(చెన్నబసవయ్య, పుంగనూరు, చిత్తూరు జిల్లా)

జానపదులకు ప్రియతములైన నాయికా నాయకులనేకులు ఉన్నారు.

కొయ్యోడు-చిట్టెమ్మ, వెంకన్న-చంద్రమ్మ, నారాయణమ్మ-నాయుడు బావ మొదలైన వారికి తెలుగు జానపదులలో అధిక ప్రచారముంది.

## కన్నడం

తెలుగులో ఉన్నట్లే కన్నడంలోను అన్ని రకాల గేయాలున్నాయి. వాటిలో దాంపత్య శృంగారానికి సంబంధించిన గేయాలతో బాటు జారిణులకు విటులకు సంబంధించిన పాటలు గూడా ఉన్నాయి.

చలి జ్వరం పోయినా ప్రణయజ్వరం పోదని అనుభవజ్ఞుల ఉవాచ. స్నేహితుడు వచ్చి మంత్రిస్తే గాని తన జ్వరం పోదని ఒక మగువ వచిస్తున్నది.

'చళిజ్వర బిట్టావు ఒళ జ్వర బిడలిల్ల
మంటపద జాజిమనె యవనె సరదార
మంత్రిసి హోగొ తలెనోవ'[7]

మగవాడు కొంచెం ఎర్రగా, బుర్రగా, ఠీవిగా ఉంటే వాణ్ణి మెచ్చుకొంటుంది స్త్రీ. తాను చూచిన మగవాని గాంభీర్యాన్ని, గొప్పదనాన్ని తలచుకొంటూ ఉంటుంది. అతని రూపం ఆమె నాకట్టుకొంది. అతని మీసాలు, అందమైన ముఖం ఆమె మెచ్చుకోలు పడసింది.

'హాడు హాడెందరె, నానేను హాడాలె
హాడొనన గెణెయ ననమ్యాలె మూడాణ
జాణ కూరీగి హొడద్వాంగ ॥
కబ్బు కారుళ్ళవన, హుబ్బు నేరుళ్ళవన
గొబ్బరద గాడి హొడెయావ గెణెయాన
హుబ్బిగిన్నొందు సరివుంట ॥
మెంచీగి మ్యాల్హత్తి కెంచ మీసియ తిద్ది
హొంచ్వాగి హొడెద కవణీయ నెరెహొలద
కెంచి గురికందు బెరతాళొ ॥
క్వారి మీసియ తిద్ది నిరిగె హొగువాగ
దార్యాగ కండె చెలువన్న మనసాగి
వార్యాగ తరుబికేళేన॥'[8]





జానపదుల జీవితమే వేరు. మన జీవితం వారికి కృతకంగా కనిపిస్తుంది. వాళ్ళ జీవితం మనకువింతగా కనిపిస్తుంది. మామ కోడళ్ళు, బావామరదళ్ళు. వాళ్ళ సరసాలు-చిలిపి చేష్టలన్నీ జానపద జీవితంలో భాగాలు. వివాహానంతరం ఈ చిలిపి పనులన్నీ మాయవుతాయి. తన భర్తే దైవమని నమ్ముతుంది స్త్రీ. దాంపత్య జీవితంలోని వలపు అత్యంత పవిత్రమైనది. తన భర్తతో భార్య 'ఓ సరదారూ! మీ దగ్గర నేను సర్వమూ మరచి పోతాను, రాజు వారి దయవల్ల అన్ని సుఖాలూ అనుభవిస్తాను' అంటుంది. భర్తే తనకు మాంగల్య హేతువని ఆయనతోటి సంబంధం అతి పవిత్రమని నమ్ముతుంది.

సరదార నిమ్మింద సరువెల్ల మరుతేన
సరదాగ ఇరువ గుళదాళి నిమ్మింద
సరువ బళగెల్ల మరెతేన ॥
అరసర దయదింద అరసీణ కుంకూమ
గోద మల్లీగె ననెదండె కట్టూదు
అరస మారాయ దయదింద. (మునుస్వామి, చింతామణి, కోలారు జిల్లా)

భర్త ఎక్కడికైనా ఊరికి వెళ్తే భార్య దు:ఖం చెప్పడాని కలవి కాదు. భర్త లేకుంటే ఇల్లంతా బోసి అవుతుంది. ఏలకులు మొదలైనవన్నీ ఉన్నాయి. కాని అవన్నీ వేసి వంట చేసి ఎవరికి పెట్టాలి. అందువల్ల ఆ ఇల్లాలు ఊరకున్నది. తన స్నేహితురాలితో ఇలా అంటున్నది:' ఎంత వంట చేసి ఏమి ఫలం? ఊరికి పోయిన మావారు రాలేదు. భర్త ఉంటే అన్ని సుఖాలూ అవసరమే. లేకుంటే అంతా వ్యర్థం' అని -

యాలక్కి కాయ్ సులిదు యావడగి మాడలి
ఊరిగ్హోగ్యార రాయరు బారదె
యావడగి మాడి ఫలవేను ?
వారీగి రాయరు ఊరీగి హొదరె
సేర భంగార తగెదంగ మలీగి
ముడిదు అంగళక ఒగెదంగ.

ఇలాంటి దాంపత్య జీవనానికి సంబంధించిన గీతాలేకాక విటులను, స్నేహితులను పిలుస్తున్న పడుచులకు సంబంధించిన పాటలు కూడా ఉన్నాయి.

కన్నడంలో నేను చూచిన మేరకు ఆడవారి శృంగార గేయాల కంటే మగవారివే

యెక్కువగా కనిపించాయి. విటులకు సంబంధించిన గేయాలు అనేకం ఉన్నాయి. భర్తకు తెలియకుండా తనకు కావలసింది సమకూర్చమని ఒక విటుడు ప్రేయసికి చెప్తున్నాడు.

ఊర ముంద్ల హుణిసె
సర్వతి నాగ నెనసె
బందా కార్య తీర్సె
నిన్ గండ కాణ్దంగె కళుసె (మునుస్వామి, చింతామణి, కోలారు జిల్లా)

లంచం చూపించి తన కోరిక తీర్చమని అడగడం కన్నడం పాటల్లో కూడా ఉంది. ఇదే భావంగల తెలుగు పాటలు ఉన్నాయి. ఈ గేయంలో ఒకడు తన ప్రేయసికి ఆశలు చూపుతున్నాడు. తాను చెప్పిన చోటికి వస్తే ముత్యాలనత్తు మొదలైన ఆభరణాలన్నీ చేయిస్తానంటున్నాడు.

కర్రన్నోళు బారే కణ్ణు మూగుతిరుగదీరె
ముత్తుకొండు కొడువె నిన్ మూగీగె
నత్తు మాడిసిదువె నిన్గె
నానిట్ట గురుతీగె బా నన్న గెణతి
హసనాద హెణ్ణే....... (మునుస్వామి, చింతామణి)

మరొకడు సంతకు పోయి వస్తున్నాడు. ఎవరో ఒక పడుచు ఇతనిని కవ్వించింది. ఆ పడుచును తలచుకొంటూ అనుకొంటున్నాడు. 'ఆమె ఎంత జాత! ఎంత అందమైంది! ఏమి ఠీవి, ఏమి మోజు! నన్ను ఏ వూరని అడిగింది. ఇంటికి రమ్మని పిలిచింది'–ఈ విషయమంతా తన స్నేహితునితో చెప్పుకుంటున్నాడు తను.

'అవళెంథ జాణె ఇన్నెంథ చెలువణ్ణ
పంచ ముఖదొళ్ కుంచగరుడ్గి
ఏను ఠీకు ఏను మోజణ్ణ
అవళెంథ జాణె.......
ఎత్తుమారి నా బర్తిద్నప్ప
సంతెయిందా నా బర్తిద్నప్ప
యావూరంథ కేళ్యాళణ్ణ
కొత్తోడు కొరటిగెరె
మత్తోడు మరటిగెరె





అదరత్ర ఇరువ చిత్ర కల్గుదురుగ
అవళెంథ జాణె.........[9]

మరో యువకుడు కవితాగంధం కలవాడు. కొంచెం చదువుకున్నాడు కూడా. ఒక నెరజాణను చూచి 'జాణె బా మనెగె నీ సుమ్మనె మనెగె' అన్నాడు (జాణ, రా ఇంటికి నువ్వు ఊరక ఇంటికి) అన్నాడు. అంతటితో ఆగట నేనే ఒక తలుపై నీవే ఒక బీగమై ఉందాం. తలుపులేని ఇల్లు ఎందుకూ పనికి రాదు. 'నేనే ఒక జ్యోతినై నీవే ఒక రీతివై ఉందాం. జ్యోతి లేని యిల్లు రీతి లేక పోతుంది – రా యింటికి' అంటున్నాడు.

'నానె ఒందు కదవాగి
నీనె ఒందు బీగవాగి
చెందుళ్ళి చెలువె! కదవిల్ద మనెయదు
హదగెట్టు హోగువుదు – జాణె బా మనెగె......
నానె ఒందు జ్యోతియాగి నీనె ఒందు రీతియాగి
చెందుళ్ళి రమణె జ్యోతియిల్ద మనెయదు
రీతిగెట్టు హోగువుదు–జాణె బా మనెగె'[10]

తెలుగువారి సంస్కృతికి కన్నడిగుల సంస్కృతికి సంబంధం ఉంది అని చెప్పడానికి మామా కోడళ్ళ వరస కూడా ఉదాహరణం. చెల్లెలి కూతురుగాని, అక్క కూతురుగాని మనకు ప్రీతిపాత్రులు. అట్లే అత్తకూతురు, మామ కూతురు కూడా. ఈ విధమైన ప్రేమను వ్యక్త పరుస్తూ కన్నడిగులు కౌటుంబిక బాంధవ్యాల స్వభావాన్ని తెలియ జేస్తున్నాడొక జానపదుడు ఈ క్రింది గీతంలో.

'అరళల్లొందాగాయి బెరళల్లొందుంగర
ఇద ఒందు గురుతిరలో జాణ
బాగూరు బిళి ఎలె బాడి మారువాగ
బేడిద రేనాయితో జాణ
నిట్టూరు కళి అడికె కట్టి మారువాగ
బిట్టరె ఏనాయితో జాణ
హాసనద కెనె సుణ్ణ హాడి మారువాగ
బేడిద రేనాయితో జాణ
తంగెయ మగళెందు తలెదసిగ్గోదరె
సోకిద రేనాయితో జాణ

మావన మగళెందు మంచక్వోగువాగ
మాతాడిన రేనాయితో జాణ
అత్తెయ మగళెందు హత్తిర కె హెూదరె
ముట్టిద రేనాయితో జాణ'[11]

ఒక్కొక్కసారి మగడు దూర దేశం వెళ్ళవలసి వస్తుంది. మనసంతా ఇల్లాలి మీదనే ఉంటుంది. ఇంటికి వచ్చిన తర్వాత తాను ఆలస్యం చేసినందువల్ల కోపగించుకున్న భార్యతో ఆలస్యానికి కారణం వివరిస్తాడు– 'ఎద్దులు కొనుక్కొని రావడానికి వెళ్ళాను. ఆలస్యమయింది. నిన్నే తలచుకుంటూ ఉండే వాడిని ఎప్పుడూ' అని ఎన్ని చెప్పినా వినకుండా కంటనీరు పెట్టుకుంటుందా ఇల్లాలు. ఆమెను బుజ్జగించే సరికి అతని తలప్రాణం తోకకొస్తుంది.

'గుత్తీగె మలెనాడ ఎత్తు మారలు హెూనె
ఒత్తీయ బిద్ద తడవాత ననగెణతి
చిత్త ననమ్యాలె సెడుబ్యాడ॥
ఈ వరుష బందీన మీసియ తిద్దీనె
వాస్యాడ బేడ ననగూడ ఎలె హుడుగి
బేస్వాంగ బెళగు కళెయోణ॥[12]

కన్నడంలోను సంవాదాలు ఉన్నాయి. భార్యాభర్తలవి, ప్రేయసీ ప్రియులవి, ఇతరములు వీటిలో కనిపిస్తాయి.

తెలుగులో ఒక జారిణి తన ప్రియుణ్ణి తలచుకుంటూ చనిపోయిన ఆవుదూడ మీద పెట్టి మర్మంగా విలపిస్తునపట్లుగా పాట ఉంది.

దూడమ్మ దూడ దూడా దూడంటె దుఃఖమొచ్చె
వాడంతా వాడిపోయె కూడైన తినిపోవె

అని ఏడుస్తుందామె. మరొకతె పరపురష సంపర్కం మరిగి తన విటుని ఎవరో కొట్టినందువల్ల పిల్లిమీద వంకబెట్టి చింతిస్తున్నది.

'పిల్లి నెవ్వరు కొట్టిరమ్మో
చిన్న బీలి నెవ్వరు కొట్టిరమ్మో
అద్దపు చెక్కిళ్ళ ముద్దుల పిల్లో
ఉడుకుడుకు బూరెలు ఉట్టిమీద నేతులు
అందుకుని నా పిల్లి అంగిట్లోవేసో'[13]





ఇలాంటిదే కన్నడంలో కూడా ఒకటి సంవాద రూపంలో ఉంది. తన ప్రియుడు మరణించాడు కాబోలు జారిణికి ఎంతో దుఃఖం కలిగింది. ఆమె తెలివిగా ఒక కుండను పగులగొట్టింది. ఏడవడం మొదలు పెట్టింది. అందరూ వచ్చి ఓదార్చారు. 'అదేమైనా బంగారు కుండా' అన్నారు ఆమె. 'ఇది ఇక్కడి కుండ కాదమ్మా. నాగమంగలం నుంచి తెచ్చిన కుండ. పది సంవత్సరాలుగా నేను పెట్టుకొన్ని ఉన్నా. అత్తకు, మామకు కూడా తెలియకుండా నేను ఉంచుకున్నా' అని ఏడుస్తున్నది.

చిన్నద కొడవల్ల రన్నద కొడవల్ల
మణ్ణిన కొడక్యాకె కదు దుఃఖ ఎలెబాలె
పురుషాగె హేళు తరుతానె
కొడ కొడ ఎందరె ఈ సీమె కొడవల్లా
నాగమంగలద జగజోడి కొడవ
నాను హత్వర్షదింద బళసిద్దె
అత్తె కాణద్వాంగె మావ నోడద్వాంగె
ఒప్పదలి నాను బళసిద్దె కొడవు
ఈగ నుచ్చాయ్తు నీరు హెూళెయాగె

మరియొక పాటలో ఒక పడుచు తన ఇంటికి రమ్మని పిలుస్తున్నది. ఆ యువకుడు తన కామె ఇల్లు తెలియదన్నాడు. గుర్తులనీ చెప్పి రమ్మనినదామె.

చిన్నద బళెయల్లి బళెబందు ఊరల్లి నింతావె
ఆ బళె నామ తొడబేకు బళెగార
బారయ్య నమ్మ అరమనెగె
    చిన్నద కొడదల్లి పన్నీర తరువోళె
    నిమ్మానె ననగె తిళియదు దొరెసాని
    నిమ్మానె ననగె తోరమ్మ
ఎడదల్లి సీగెయు బలదల్లి బాళేయు
నాగసంపిగె నడువల్లి బళెగార
అదు నమ్మ చిన్నదరమానె

ఇది గాజుల వానికి పిలుపు.

వలపు పాటలు తెలుగు కన్నడాలలో అసంఖ్యాకంగా దొరుకుతున్నా ముద్రితమైనవి చాలా తక్కువనే చెప్పాలి. తెలుగులో ప్రత్యేకంగా వలపు పాటల

సంకలనాలు వెలువడలేదు. 'త్రివేణి', 'తెలంగాణా పల్లె పాటలు', 'పల్లె పదాలు' మొదలైన కొన్ని శృంగార గేయాలున్నాయి. క.రా.కృ.గారు కన్నడంలో 'జానపద ప్రేమ గీతెగళు', 'జేన హనిగళు' అనే పేరుతో శృంగార గేయాలను ప్రత్యేకంగా ప్రచురించారు. ఇటువంటి సంపుటాలు తెలుగులోను కన్నడంలోను ఇంకా అనేకం రావలసి ఉంది.

**టిప్పణి**

1. రాయప్రోలు సుబ్బారావు, రమ్యాలోకము, పు. 15
2. నేదునూరి గంగాధరం, జానపద గేయ వాఙ్మయ వ్యాసావళి, పు. 62
3. C.M.Bowra, Primitive Song, p.175
4. 'కృష్ణశ్రీ' (సం.), పల్లె పదాలు, పు. 185
5. అదే, పు. 92
6. అదే.
7. క.రా.కృ.(సం.), జేనహనిగళు
8. అదే.
9. అదే, పు. 11
10. క.రా.కృ. (సం.), జానపద ప్రేమగీతగళు, పు. 14
11. ఎం.సి.వసంతకుమార్ (సం.), కోలుపదగళు, పు. 36
12. బి.ఎస్.గద్దగిమఠ, కన్నడ జానపద గీతగళు, పు. 118
13. నేదునూరి గంగాధరం, పూర్వోక్తం, పు. 76





# 8. హాస్య గీతాలు

నవ్వుపుట్టించే పాటలు, నవ్వులాటకోసం పాడే పాటలు హాస్య గీతాలు. నవరసాలలో హాస్యం ఒకటి. దీనికి స్థాయి హాస్యం, స్మితాది భేదాల చేత హాస్యరసం ఆరు విధాలని లాక్షణికులు చెప్తారు. నవ్వును శారీరకమని, మానసికమని రెండు విధాలుగా చెప్తారు పాశ్చాత్యులు. స్పెన్సరు చెప్పినట్లు "Laughter is merely an over-flow of surplus energy".

హాస్యం విశ్వవ్యాపక మైంది. భరతముని "హాస్యః ప్రమథ దైవతః" అని గణపతి దీని అధిదైవమన్నాడు. గణపతి వికృత రూపం నవ్వు పుట్టిస్తుంది. నవ్వు ఎన్నో విధాలుగా, ఎన్నో కారణాల వల్ల ఉద్భవిస్తుంది. ప్లేటో "We laugh at the misfortunes of others for joy that we do not share them" అన్నాడు. నవ్వు, ఏడుపు అన్నవి మనిషి జీవితంలో అత్యంత ప్రధానమైన పాత్రను వహిస్తాయి. నవ్వుకు ఏడుపుకు ఎంతో సంబంధముంది. థ్యాకరె "Laughter is the mistress of tears" అన్నాడు. హొరేశ్ వాల్‌పోల్ అన్నట్లు "Life is a comedy to the man who thinks and a tragedy to the man who feels".

హాస్యం ప్రతి మనిషికీ హాయినిస్తుంది. ఉత్తేజాన్ని కలిగిస్తుంది. ఉత్సాహాన్ని పుట్టిస్తుంది. భరతాదులు హాస్యరసాన్ని అంత ప్రధానమైన రసంగా పరిగణించలేదు. శృంగార, వీర, రౌద్ర, భీభత్సాలు ప్రధాన రసాలని భరతుడన్నాడు. హాస్యం శృంగారాన్ని అనుసరిస్తుందని, శృంగారాను కరణమే హాస్యమని అలంకారికుల అభిప్రాయం. ఈ హాస్యం వికృతాకార వాగ్వేషచేష్టాదులవలన ఉద్భవిస్తుందని అలంకారికులన్నారు. దీనివల్ల హాస్యం వేషగతము, చేష్టాగతము, భాషాగతము అని తేలింది. వేషం వల్ల, చేష్టల వల్ల జనించే హాస్యం బాహ్యాంగాలకు సంబంధించినదైతే భావాల వికృతివల్ల, భాషలో విరుపుల వల్ల జనించేది అంతరంగికం. వేషాలతో చేష్టలతో నవ్వించడం సులభం, భాషా సంబంధమైన చమత్కారాన్ని చూపించడానికి మేధస్సునుపయోగించవలసి ఉంటుంది.

శబ్దాన్నాశ్రయించి హాస్యాన్ని సాధించడం ఎన్నో రకాలుగా జరుగుతుంది. అస్తవ్యస్త పద ప్రయోగం, నిరర్థక పద ప్రయోగం, వికృతోచ్చారణ, అశ్లీల పదప్రయోగం, ఛాందస పద ప్రయోగం-ఇలా అనేక విధాలుగా హాస్యాన్ని సాధించవచ్చు. ఇట్లే

భావాశ్రయ హాస్యం, అర్థాశ్రయ హాస్యం, ఉక్తిమూల హాస్యం అన్న వాటిని కూడా చెప్పవచ్చు.

నాగరకులలాగానే జానపదులకు కూడా జీవితంలో సుఖాలు, దుఃఖాలు ఉన్నాయి. మనిషి దుఃఖాన్ని తాత్కాలికంగానైనా మరిపిస్తూ, అతనికి జీవితంలో ఆసక్తిని పెంచేది హాస్యం. పారమార్థిక గీతాలలో ఎక్కువగా లేకున్నా, పని పాటలలో, వేడుక పాటలలో, బాంధవ్య గీతాలలో పెక్కుచోట్ల హాస్యం కనిపిస్తుంది.

పని పాటలలో అనేక హాస్య గేయాలున్నాయి. పని చేసేటప్పుడే వినోదానికి ఎక్కువ ప్రాధాన్యం ఉంటుంది. కష్టాన్ని మరిపించగల్గడం హాస్యం చేయగలిగిన పని. కొందరికి ఏ పని చేయడానికీ ఇష్టం ఉండదు. 'నీళ్ళకు బోరా నిమ్మ అంటే నిద్ర వస్తదే అమ్మా' అంటారు. 'కట్టెలకు బోరా కమ్మ అంటే కడుపునొప్పి మాయమ్మ' అంటారు. 'బొచ్చెదెచ్చుకో బొమ్మ అంటే అట్ల జెప్పు మాయమ్మ' అని మనకు, నవ్వు తెప్పిస్తారు.

పసులకాపర్లు మొదలైన వాళ్ళు వినోదంగా అనేక గేయాలనాలాపిస్తుంటారు. ఒకడి పెళ్ళాం చండిక. ఆమె జరిపే పెత్తనాన్ని పసులకాపర్లిలా పాడుతారు.

'కంబదూరు కట్టకింద వోరి మొగుడా
నేను కంది కలుపు తీయబోతె వోరి మొగుడా
యెంద్రగిత్తి యేలు గొరికె వోరి మొగుడా
నా యేలుమింద గోరు మొలిచె వోరి మొగుడా
నాకు గొడ్డు గొర్నె (గొర్రెను) కొయ్యరాద వోరి మొగుడా
నువు కంపప్పు జేసుకోర వోరి మొగుడా
నాకు గోదుప రొట్లు కాల్చరాద వోరి మొగుడా
నువ్వు జొన్నరొట్లు కాల్చుకోర వోరి మొగుడా
నాకు వొర్రి బువ్వ వండరాద వోరి మొగుడా
నువు కొర్ర బువ్వ వండుకోర వోరి మొగుడా'[1]

పై పాటలోని మాటలు నవ్వు పుట్టిస్తాయి. కొందరి చేష్టలు హాస్యరస జనకాలుగా ఉంటాయి. అవి వికృతంగా ఉండనక్కర లేదు. పల్లెటూరి వారి అమాయక చిత్తవృత్తి కూడా ఒక్కొక్కసారి నవ్వుపుట్టించేదిగా ఉండవచ్చు. ఒక ఊరిలో కాదరయ్య అనే వాడుండే వాడు. అతన్ని చూస్తే కుక్కలను కూడా అలుసే. కాదరయ్య పనులను చెప్పుకొని పసుల కావర్లు నవ్వుకుంటారు.





'పొద్దున్నె లేచినాడు కాదరయ్య
వాడు కాళ్లు మొకము కడిగి నాడు ॥కా॥
కాళ్లు మొకము కడిగి నాడు కాదరయ్య
వాడు పంగనామం దిద్దినాడె కాదరయ్య ॥పంగ॥
వాణ్ణి పల్లి కుక్కలు జూసినాయి కాదరయ్య ॥పల్లి॥
బవ్వు బవ్వుమన్నాయి కాదరయ్య ॥బవ్వు॥
వాడు చేనిలోకి పారినాడు కాదరయ్య ॥చేని॥
వాణ్ణి చేని మనిషి చూసినాడు కాదరయ్య ॥చేని॥
వాణ్ణి కూత పెట్టి అరిసినాడు కాదరయ్య'[2]

చాలామంది జానపదులు ముఖతః మెట్ట వేదాంతం వినపడుతూనే ఉంటుంది. సాంఘిక దురాచారాలను దుయ్యబట్టడమో, కలికాల అన్యాయాలను విమర్శించడమో చాలా గేయాలలో కనిపిస్తుంది. ఇటువంటివి 'నూతన కలికాల పాటలు', 'ప్రపంచచిత్రములు' మొదలైన పేర్లతో అచ్చయ్యాయి. 'కాలజ్ఞాన తత్వాల'లో కొన్ని హాస్య గీతాలే.

'వీర బ్రహ్మంగారు వీధెమ్మటొస్తారు
వీధీది కిద్దరిని కంటారయా' అంటుందొక తత్వం!
ఇంకా జరుగబోయేవి కొన్ని–
'ముత్యాలమ్మ గుడికాడ మూల స్తంభము కూడ
ముండలకు పెళ్లిళ్లు అవుతాయయా
నందామయా గురుడ నందామయా
చిక్కులూ దీశారు కొప్పులూ బెట్టారు
కొప్పు కొప్పుకు బేడ తప్పాదయా ॥నం॥......'[3]

వినోదమనగానే పిల్లలు గుర్తుకొస్తారు. వినోదం ఎక్కువగా కావలసింది పిల్లలకే. నవ్వులాటలు, పాటలు శిశు జీవనంలో ప్రముఖమైనవి. అయ్యవారినిగాని అయ్యవారి పెళ్ళాన్ని గాని ఎగతాళి పట్టించగల ధైర్యమూ పిల్లలకే ఉంటుంది. ముక్తపదగ్రస్తమైన క్రిందిగీతం చరణచరణానికీ పిల్లల ఉత్సాహాన్ని పెంపొందిస్తుంది.

'అయ్యగారయ్య గారంతంత
అయ్యగారి పెళ్లాం ముంతంత
ముంత కొంట బోయి మూలకు పెడితే

నక్కెత్తుక పోయెరా నారాయణా
నారాయణాని నారకు పోతే
గొడ్డలి పోయెరా గోవిందా
గోవిందా అని గోడ కొరిగితే
పెల్లగూలెరా పెరుమాండ్లూ
పెరుమాండ్లాని పెండకు పోతే
ఆవుదన్నె రా అనుమాండ్లూ
అనుమాండ్లాని అంగడికి పోతే
గొంగడి పోయెర శివలింగా......[4]

ఏడుగురు రాజకుమారుల కథ తెలుగు పిల్లలకు చిరపరిచితమైనదే అలాంటిదే ఒక చిన్న హాస్యగీతం కోలారు జిల్లాలో ప్రచారంలో ఉంది. ఇదీ ఏడుగురు రాజకుమారుల కథలాగే హాస్యాంతం కలది.

ఏలవె అవ్వ కక్క పెట్టింది
మా తాతయ్య తెచ్చి పెట్టలే నేనేం సేతు
ఏలరా తాతయ్య తెచ్చి పెట్టంది
బుడిగావ పండుకొనింది నేనేం నేతు
ఏలనే బుడిగావ పండు కొనింది
మడక మాను పొందలే నేనేం సేతు
ఏలనే మడక మాను పొందంది
ఎరగడ్డ నేను తింటె తుమ్మొచ్చింది(మునుస్వామి, చింతామణి, కోలారుజిల్లా)

ఎక్కువగా హాస్యగేయాలు దొరికేది వేడుక సమయాలలో అదీ పెళ్ళికి సంబంధించిన గేయాలలో హాస్యరసం ఎక్కువగా కనిపిస్తుంది. సాంప్రదాయికమైన కర్మకాండలు వదిలేస్తే, బావా మరదళ్ళ హాస్యాలు, వియ్యాలవారికి కుక్కమంగళాలు పాడడం మొదలైనవన్నీ పెళ్ళిపాటలలో కనిపిస్తాయి. ముఖ్యంగా అందరి విమర్శకూ గురి అయ్యేది వియ్యపురాలు. వియ్యపురాలు పళ్ళుతోమదు. పూలు ముడవదు, బెనారసు చీరలు కట్టదు, ఆకు వెయ్యదు. ఇలాంటి వియ్యపురాలిని సంపాదించుకున్న ఆడపెళ్ళివారు ఎగతాళి చెయ్యకేం చేస్తారు!

వెండిపుల్ల వెండిఆకు విడిదికి పంపితిమి
పారపళ్ళ వియ్యపురాలు పళ్ళేతోమదుగా





సన్నజాజులు మల్లెమొగ్గలు విడిదికి పంపితిమి
బట్టతల వియ్యపురాలు పూలే ముడవదుగా
బనారసు చీర రవిక విడిదికి పంపితిమి
అబ్బబ్బ ఇవి అన్నీ మాకు అలవాటు లేదనిరి
హారతీ కర్పూరపు దండలు విడిదికి పంపితిమి
కొండమెడ వియ్యపురాలు దండే వెయ్యదుగా
తమలపాకులు వక్కాలు మేము విడిదికి పంపితిమి
కుక్క పళ్ళ వియ్యపురాలు ఆకే వేయదుగా
వివరా మెరుగని వియ్యపురాలికి విడుదులు చూపితిమి
వివరామెరుగని వియ్యపురాలు విడిదిలొ ఉండదుగా.

(సుశీలమ్మ, నెల్లూరు)

తెలుగువారి పెళ్ళిళ్ళలో బువ్వపు బంతిని ప్రత్యేకంగా చెప్పుకోవాలి. శ్రీనాథాదుల కాలంనుంచి కూడా ఇది వినోదాలకు పేరుగాంచింది. భోజనాల సమయంలో ఆడుకొనే హాస్యాలు, ఛలోక్తులు, సరసాలు, దెప్పిపొడుపులు చాలా తమాషాగా ఉంటాయి. వినోదాన్ని కలిగిస్తాయి. ఆడపెళ్ళి వారి వైపు ముత్తయిదువలు పళ్ళెంలో హారతి నీళ్ళు కలుపుకొని వచ్చి పిల్ల అత్తగారికి, మామగారికి, వదినగారికి మంగళాలు పాడుతారు. మామగారిని చూచి–

మదుగు సంచి ఎత్తుకోని మాఘస్నానం చేయబోతే
మాలవాని కుక్కవచ్చి మంచి మదుగు చేసిపోయె
చక్కాని మామగారికి కుక్క మంగళం......
అని రూపాయో, రెండు రూపాయలో గుంజు కుంటారు. అలాగే వదినగారిని చూచి–

గంపెడు సొమ్ము పెట్టుకోని కుంపటిలాగ కూర్చోని
మొగుడు వస్తె లేవదమ్మ మొండి కట్టె వదినగారు
చక్కాని వదిన గారికి కుక్క మంగళ........ (శారదాంబ, నెల్లూరు)

పెళ్ళి పాటలు కాక వినోద సంబంధ గేయాలలో హాస్యగీతాలింకా ఉన్నాయి. ఇవి ఎక్కువగా వాక్చమత్కృతితో వికృతిని కల్పించి హాస్యాన్ని కల్గించే పాటలు. ఇలా గూఢార్థాల్ని పేర్చి ప్రశ్నోత్తరాల రూపంలో నడిపే పద్ధతిని 'ఉద్ఘాత్యక' మంటారు. అలాంటిదొకటి స్త్రీ చమత్కారమ'నే శీర్షికతో ఉంది.

ఆమె : ఒకరీకి చెయ్యినిచ్చీ ఒకరీకి కాలునిచ్చి
ఒకరీకి నడుమునిచ్చీ కూకున్నానోయ్
రాజా కూకున్నానోయ్

అతను : ఎవరీకి చెయ్యినిచ్చీ ఎవరీకి కాలునిచ్చి
ఎవరీకి నడుమునిచ్చీ కూకున్నావోలె
జాణ కూకున్నవే

ఆమె : గాజుల్కి చేయినిచ్చి అందెల్కి కాలునిచ్చీ
వడ్డాణాన్కి నడుము నిచ్చీ ॥కూకు॥

ఆమె : ఒక్కణ్ణి లోపల బెట్టీ ఒక్కణ్ణి బయట పెట్టీ
ఒక్కణ్ణి పట్టుకోని కూర్చున్ననోయి రాజా ॥కూర్చు॥

అతను : ఎవ్వణ్ణి లోపల బెట్టి ఎవ్వణ్ణి బయట పెట్టి
ఎవ్వణ్ణి పట్టుకోని కూర్చున్నా వోలె జాణ ॥కూ॥

ఆమె : కాటూక లోపల బెట్టి బొట్టూను బయట పెట్టి
అద్దమూను పట్టుకోని కూర్చున్నానోయి బావా ॥కూ॥

ఆమె : ఒక్కణ్ణీ చేరవేసి ఒక్కణ్ణీ వాల్చేసి
ఒకనీకి చెంగువిసిరి పడుకున్నానోయి రాజా ॥పడు॥

అతను : ఎవ్వణ్ణి చేరవేసి ఎవ్వణ్ణి వాల్చేసి
ఎవనికి చెంగు విసిరి పడుకున్నవే జాణ ॥పడు॥

ఆమె : తలుపైన చేరవేసి మంచమును వాల్చేసి
దీపానికి చెంగువిసిరి పడుకున్ననోయి రాజా ॥పడు॥

ఆమె : ఒకనీని నొక్కి పెట్టి ఒకనీని చుట్టబెట్టి
ఒకని కోసం ఎదురు చూస్తున్నానోయి రాజా ॥చూ॥

ఆమె : ఎవనీని నొక్కి పెట్టి ఎవనీని చుట్టబెట్టి
ఎవని కోసం ఎదురు చూస్తున్నవే బాలా ॥చూ॥

ఆమె : వక్కైన నొక్కి పెట్టి ఆకైన చుట్ట బెట్టి
సున్నాము కోసం యెదురు చూస్తున్న నోయి రాజా
॥చూ॥[5]

మొదటి చరణాలు వినగానే అనుమానం కలగడం, మళ్ళీ జవాబు చెవిని పడగానే అనుమానం విడిపోవడం, జరుగుతుంది. ఇలాంటి పాటే ఇదే వరసలో





కన్నడంలో కూడా ఉంది. దీని శీర్షిక 'మాతాడు మాతాడు మల్లిగె', (మాట్లాడు మాట్లాడు మల్లికా) 'ఒకణ్ణి కట్టాను, ఒకణ్ణి విడిచాను, మరొకణ్ణి తీసుకొని లోపలికి వెళ్ళానంటుందామె. 'ఎవరిన'ని ప్రశ్నిస్తే 'ఆవును కట్టాను, దూడను విడిపించాను, పాలు తీసుకొని లోపలికి వెళ్ళాన'ని ఆమె సమాధానం చెప్తుంది. ఇలాంటివే ప్రశ్నలు జవాబులు అనేకం సాగుతాయి.

'మాతాడ్ మాతాడ్ మల్లిగె సంపిగె శావంతిగె
గుంపినల్లి కేదిగె మాతాడు మాతాడు మల్లిగె
ఒబ్బన్న కట్టిద్దె ఒబ్బన్న బిట్టిద్దె ఒబ్బన
కరేకొండు ఒళగ్హోద మల్లిగె
యావోన కట్టిద్దె యావోన బిట్టిద్దె
యావోన కరకొండు ఒళగ్హోదె మల్లిగె
హసువన్ను కట్టిద్దె కరువన్ను బిట్టిద్దె
హాలన్ను కరకొండు ఒళగ్హోదె మల్లిగె........[6]

**కన్నడం**

పైన ఉదాహృతమైన గేయంలాగే తెలుగు హాస్యగీతాలను పోలినవి కన్నడంలో అనేకం ఉన్నాయి. 'In cheerful souls there is no evil' అన్న కార్లయిలు మాట కన్నడ జానపదులకూ వర్తిస్తుంది. అమాయక జానపద హృదయాలనుంచే స్వచ్ఛమైన నవ్వును ఆశించవచ్చు.

పని పాటలలో కన్నడంలోను అనేక వినోద ప్రధాన గీతాలున్నాయి. శారీరక శ్రమను మరచిపోడానికి హాస్యరసాన్ని ఆశ్రయించడం కన్నడ జానపదులకూ అలవాటే. ఉత్తర కర్నాటకంలో ప్రచారంలో ఉండే 'హంతి పాటల' (బంతి పాటలు)లో కొన్ని హాస్యగేయాలున్నాయి. వాటిని హాస్యద హంతి' అని పిలుస్తారు. ఒక పాటలో రైతు దేవుణ్ణి బిడ్డల కోసం ప్రార్థిస్తున్నాడు. అయితే బిడ్డలు తనకు కాదట, తన వేశ్యకట. ఆమెకు బిడ్డలను ప్రసాదిస్తే లంచంకూడా ఇస్తానంటున్నాడా కర్షకుడు!

'హంద బందద ఎత్తో బండి సాగరదెత్తో
సావుకార నెత్తో శివరాయ్న మారిదరె
సూళె నినసాల హరిలిల్లా

యమనూర పీరప్ప మక్కళ కొడప్పా
ననగల్లొ నన్నా సూళిగె కొట్టారె
జోడి కందూరి మాడ్వేను........[7]

దేవతలకుసంబంధించిన గేయాలనేకం హాస్యరసభరితాలున్నాయి. దేవుణ్ణి గూడా సమయం పడితే అపహాస్యం చేయగలడు జానపదుడు. 'దేవుడు ఏమి చేసినా ఊరుకుంటాడు. ఒంటిపైన కుక్కపిల్లలు, ఎలుక పిల్లలు పరుగెత్తినా ఆయనకు తెలియదు. దొంగలు వచ్చి నగలెత్తుకొని పోయినా ఊరుకుంటాడు' అని ఎగతాళి చేస్తాడు. ఇది ప్రేమతో కూడిన ఆక్షేపణ. ఆంజనేయుని దేవాలయంలో దొంగతనం పోయింది. అందుకని–

'సులిగెయ కొళ బహుదె హనుమయ్య
నిన్న సులిసు కొళ్ళలు బహుదె'[8]

అంటున్నాడు జానపదుడు.

కర్మ ప్రధాన గీతాలైన జాతరలను గురించిన పాటలలో దెయ్యాలు, భూతాలకు సంబంధించినవి ఉన్నాయి. వీటిలో తమాషాగేయాలు కొన్ని ఉన్నాయి. సంగీతమంటే అందరూ చెవి కోసుకుంటారు. కాని గార్దభ సంగీతమంటే దెయ్యాలకు కూడా భయమే. ఒక అమ్మాయికి దెయ్యం పట్టింది. మంత్రగాడు మంత్రం వేశాడు. కాని ఏమీ లాభం లేక పోయింది. అప్పుడు 'ఎన్నిమంత్రాలు వేసినా నువ్వుపోవు. వెళ్ళి ఒక అపస్వర గాయకుణ్ణి తీసుకొని వస్తానుండు. అప్పటికి గాని నీ తిక్క కుదరదు' అనే సరికి దెయ్యం క్షణంలో పారిపోయింది.

'దెవ్వ కుణియుతిత్తరి ముంద
తలె బేనె ఎద్దీతు హెచ్చింద
నిన్న దర్శన బ్యాడొ హొగతీని ఇల్లింద
అపస్వరద గాయనదింద
దెవ్వాదరు నింద్రు దిల్లముంద'[9]

తెలుగులోలాగానే కన్నడంలో కూడా హాస్యం ఎక్కువగా పెళ్ళి పాటలలోనే కనిపిస్తుంది. వియ్యపురాళ్ళకు సంబంధించిన పాటలు కన్నడంలో కూడా ఉన్నాయి. పదిమంది తినే అన్నం ఒక్క వియ్యపురాలే తింటుందని ఆమె తాటకి, శూర్పణఖలకు సమానమైందని హేళన చేస్తారు.





తాటక్కి శూర్పనక్కియంథవళు
హత్తుకై మరిగ్యన్న ఒట్టాగి ఉండళు
ఊటక్కె బీగిత్తి బందవళు (నారాయణస్వామి, చింతామణి)

'బీగర హాడుగళు' లేక 'జరియువ పదగళు' అనే పేరుతో వియ్యాలవారి పాటలు కన్నడంలో చాలా ప్రసిద్ధి చెందాయి. పెళ్ళిభోజనం అయిన తర్వాత వీటిని పాడుతారు. ఇవి రానురాను మరీ తిట్లక్రిందికి మారాయి. వియ్యాలవారు ఏనుగుల మీద, ఒంటెల మీద వస్తారనుకున్నారు పెళ్ళివారు. కాని వాళ్ళు వచ్చింది మామూలు వాహనాల మీద. దీన్ని చూచిన పెళ్ళివారు వియ్యలవారిని ఎగతాళి చేస్తారు.

'సరక్క సరితల్ల బీగర సరుప్ప తిళితల్ల
ఆని బరతావంత ఆర బణవీ కొండి
ఆనెల్లి నిమ్మదళవెల్లి ॥1॥
ఆనెల్లి నిమ్మ దళవెలి బీగా
బొళ్హొూం మ్యాలె బరతార ॥2॥
ఒంటి బరతావంత ఎంటు బణవి కొండె
ఒంటెల్లి నిమ్మ దళవెల్లి ॥3॥
ఒంటెలి నిమ్మ దళవెలి బీగా
కుంట్వోరి మ్యాల బరతార ॥4॥'[10]

పెళ్ళికుమారుని ఎగతాళి పట్టించే పాటలను పెళ్ళికుమార్తె చెల్లెళ్ళు పాడుతారు. పెళ్ళికుమారుడు ఎటువంటి వాడంటే 'పంచాంగం చెప్పవయ్యా బ్రాహ్మడా' అంటే పంచపాత్ర తీసుకొస్తాడట!

'పంచాంగ వేళెందరు నిమ్మళియ
పంచ పాత్రె తందిట్టరు–పంచాంగ
ఎంబొద గురుతరియదళియాగె
కొట్టల్లె నిన్న మగళ–ఇంథవరిగె
కొడ బహుదె నిన మగళు?'[11]

ఇలా తెలుగు కన్నడాలలో అనేక విధాల హాస్య గీతాలు కనిపిస్తాయి. ఇవన్నీ జానపదుల జీవితంలో వినోదానికి ఆస్పదాలవుతున్నాయి. 'Laughter makes good blood' అనే ఇటలీ సామెత జానపదుల విషయంలో నూటికి నూరుపాళ్ళు నిజం. నవ్వు పుట్టించే పాటలు మనోరోగాలకు మంచి మందులు.

హాస్యకృతులలో అధిక్షేప కావ్యం (Satire) గొప్ప ప్రక్రియ. ఇది పాశ్చాత్య వాఙ్మయంలో ఎక్కువగా కనిపిస్తుంది. వ్యక్తినో, సంఘాన్నో, జాతినో అతి సున్నితంగా అవహేళన చేయడం అధిక్షేప కావ్యకర్త పని. తెలుగు-కన్నడ జానపద గేయాలలో ఇటువంటివి తక్కువగానే కనిపిస్తాయి. జానపద హాస్యపాత్రలు శిష్ట సాహిత్యంలో లాగా లక్షణాలతో తీర్చిన బొమ్మలుకారు. మనం నిత్య జీవితంలో పండుగలతో-పబ్బాలతో- పెళ్ళిళ్ళు పేరంటాలలో చూచే పాత్రలే మనకు ఈ హాస్యగేయాలలో కూడా కనిపిస్తారు. అందువల్లనే వీటిలోని హాస్యం ఉదాత్తమైనది కాకున్నా సజీవమైంది.

**టిప్పణి**

1. త్రివేణి, పు. 220
2. అదే, పు. 227
3. అదే, పు. 282
4. బి.రామరాజు (సం.) తెలంగాణా పల్లెపాటలు, పు. 17
5. నేదునూరి గంగాధరం, జానపద గేయ వాఙ్మయ వ్యాసావళి, పు. 68
6. జనప్రియ జనపద గీతె, పు. 65
7. హొలమనియ పదగళు, పు. 56
8. హొన్న బిత్తేవు హొలకెల్ల, పు. 227
9. అదే, పు. 235
10. బి.ఎస్.గద్దగి మఠ, కన్నడ జానపద గీతగళు, పు. 54
11. జీ.శం.పరమశివయ్య, జనపద సాహిత్య సమీక్షె.





# 9. కన్నీటి పాటలు

కరుణ రస గేయాలనే కన్నీటి పాటలనవచ్చు. విభావానుభావ సాత్విక వ్యభిచారి భావాల చేత అనుభవార్హత పొందిన శోకస్థాయి కరుణరసం. ధర్మనాశంవల్ల, అర్థనాశంవల్ల, ఇష్ట జన బాంధవ జనక్షయం వల్ల, వధవల్ల, దైవోపహతివల్ల-ఇంకా ఇటువంటి వాని వల్ల శోకం కలుగుతుంది.

జానపదులు శృంగారంతోబాటు కరుణానికీ తగినంత ప్రాధాన్యం ఇచ్చారు. కన్నీటి పాటలు ప్రపంచమంతటా ఉన్నాయి. ఆత్మీయులు చనిపోయినప్పుడు Funeral songs, Burial chants మొదలైనవి పాడుతారు. వీటిలో కొన్ని హృదయాన్ని కదిలిస్తాయి. ఒక డామా జాతి స్త్రీ (Dama woman) తన భర్త చనిపోగా ఇలా విలపిస్తున్నది.

> 'The father, a tall young man
> High grown like a tree,
> Lies there and speaks no more,
> No man supports a widow,
> The children of men exist once only
> The father never smiled on a widow
> Now that he is dead, whom can I get?
> At him alone people looked;
> To what land shall I now go?'[1]

కరుణరస ప్రధానమైన వాటిలో ఎక్కువగా కథాగేయాలే దొరుకుతాయి. జానపద గేయాల రూపంలో ఉండే కన్నీటి పాటలలో మొదట పేర్కొనదగినవి అప్పగింతల పాటలు. పెళ్ళిపాటలన్నీ వేడుక పాటలయినా, అప్పగింతల పాటలు మాత్రం అపవాదాలు. పెళ్ళి జరిగినన్ని రోజులూ వినోదంగా సాగిపోతాయి. చివరి ఘట్టమైన అప్పగింతలు వచ్చేసరికి అందరి కళ్ళూ అశ్రుపూరితాలవుతాయి. హృదయాలు బరువెక్కుతాయి. ఎంత కఠినాత్ములకయినా గుండెలు కరిగి పోతాయి. ఇది శాశ్వత వియోగం. భర్తయింటినుంచి కూతురు తిరిగిరావాలని ఏ తల్లీ కోరుకోదు, శకుంతలను పంపేటప్పుడు అరణ్యవాసి, తపోనిష్ఠుడు. శమదమాది గుణసంపన్నుడు అయిన కణ్వునికే కన్నీరు ఆగలేదు. కణ్వునిలాగే ప్రతి తల్లీ బుద్ధులు చెపుతుంటుంది, మరొక వైపు

కూతురు వెళ్ళి పోతున్నదని వేదనను వ్యక్తం చేస్తుంటుంది.

'సెలవిచ్చి మాయమ్మ సెలవిచ్చినాము
చెలగి మీ అత్తింట బుద్ధిగలిగుండు
ఎవ్వరే మాడిన ఎదురాడకమ్మ
వీధిలో నిలుచుండి కురులిప్పకమ్మా
పలుమారు పలుదెరచి నవ్వబోకమ్మా
పరమాత్మతో గూడి వెలుగు మాయమ్మా'[2]

మొదలైన పాటలలో నీతివాక్యాలు తప్ప మనకేమీ కనిపించక పోవచ్చు. కాని ఆ సమయం కన్నీటిని తెప్పించేది గుండెలు పిండేది.

పల్లెలో నగరంలో కనిపించని సామాజిక స్పృహను చూడవచ్చు. నిస్వార్థ ప్రవృత్తికి నిలయాలనదగిన పల్లెటూళ్ళలో ఇరుగు పొరుగు సహకారం అత్యవసరం. ఈ కింది పాటలో ఒకతల్లి కూతుర్ని ఇంటికి కీర్తి తెమ్మని అడగడంతోబాటు, ఊరికి కూడా కీర్తి తెమ్మని కోరుతున్నది. ఇది కోలారు జిల్లా తెలుగు కన్నీటి పాట.

ఆరెకరాల్ చేనిస్తా అంటిమామిడి తోపిస్తా
పోయమ్మా నా కూతురా
పోయింటికి కీర్తి తేవమ్మా
అరెకరాల్ చేనిస్తా ఆవులప్పని నీ జతకిస్తా
పోయమ్మా నా కూతురా
పోయూరికి కీర్తి తేవమ్మా
పోనమ్మా నేను పోనమ్మా
పోతే తిరుగుట లేదమ్మా
ఆరుమంది అన్నగార్లూ
కడగొట్టోడే గంగులప్ప
వానికి నాకు కాదమ్మా
పోనమ్మా నేను పోనమ్మా
పోతే తిరుగుట లేదమ్మా
ఏడుమంది అక్క సెల్లెళ్ళు
కడగొట్టుదీ కమలమ్మ





దానికి నాకూ కాదమ్మా
పోనమ్మా నేను పోనమ్మా
నాగర బిళ్లా సెపిస్తా
నాగులప్పను నీ జతకిస్తా
పోయమ్మ నా కూతురా
పోయింటికి కీర్తితేవమ్మా
పోనమ్మా నేను పోనమ్మా
పోతే తిరుగుట లేదమ్మా.

(తాయమ్మ, రామాపురం, చింతామణి తాలూకా)

కన్నీటి పాటలు చాలా వాటిలో చిన్న కథ ఉంటుంది. లేక కథ సూచితమవుతుంది. ఇవి చారిత్రకాలుగాని అస్పష్ట చారిత్రకాలు గాని అయివుంటాయి. ఇలాంటి పాటల్లో గుజ్జాల గోపిరెడ్డి పాట కరుణ రస పూంతమైంది, హృదయ విదారకమైంది. 'కృష్ణశ్రీ'గారు గోపిరెడ్డి దుష్టుడని తలచారు. 'పల్లెపదాల'లో ఇలా వ్రాశారు. "గుజ్జాల గోపిరెడ్డి చిన్నపరెడ్డివలెనే చండశాసనుడైయుంటాడు. బాధితులు నలుగురు హఠాత్తుగా చేల నడుమన పట్టి నరికినారట. గోపిరెడ్డి దౌష్ట్యమేదో తెలియరాదు"[3] కాని అసలు కథ వేరే ఉంది. పల్నాటి సీమలో గోపిరెడ్డిని గూర్చిన పాటలు పాడుతూ కిన్నెరలాంటి వాద్యాన్ని మీటుతూ భిక్షుకులు తిరుగుతుంటారు. గోపిరెడ్డి మరణానికి విలపించే పదం ఆ చోట్ల అబాలగోపాలం ప్రసిద్ధి కెక్కింది. గోపిరెడ్డి సుమారు 1850-1900 మధ్య నలభై సంవత్సరాలు జీవించాడు. ఈయన పిల్లుట్లగ్రామ మునసబు చిన కృష్ణారెడ్డి కుమారుడు. గోపిరెడ్డి చిన్నప్పుడే తన సాటి వారిలో చాలా శౌర్యవంతుడని పేరు తెచ్చుకున్నాడు.

ఒకసారి గోపిరెడ్డి బెబ్బులితో పోరాడి దాన్ని చంపాడు. అప్పటి నుంచి ప్రజలందరూ అతన్ని ప్రీతితో చూచేవారు. పల్నాటి సీమలో నెమలిపురం కనుమ, గుత్తికొండ కనుమ మొదలైనవి బందిపోట్లకు నిలయాలుగా ఉండేవి. గోపిరెడ్డి అనుచరులను సంపాదించి హఠాత్తుగా దొంగల ముఠాపైన దాడి చేశాడు. భీకర పోరాటం జరిగింది. గోపిరెడ్డి  కుడిభుజంవంటి ఎల్లమందారెడ్డి మరణించాడు. గోపిరెడ్డి పొందిన ఖ్యాతిని కొందరు సహించలేక పోయారు. ఈ పెద్ద మనుషులు దొంగలతో చేతులు కలిపి గోపిరెడ్డి ప్రాణాలను తీయడానికి నిశ్చయించుకున్నారు. గోపిరెడ్డి వచ్చే దారిలో ఆవునొకదాన్ని చెవులు కోసిఉంచారు. గోపిరెడ్డి చాలా బాధ

పడ్డాడు. ఇంతలో పొంచి ఉండిన మనుషులు వచ్చి ఉచ్చులు వేసి బరిశెలతో అంతటా పొడిచి మాయమయ్యారు. దాచేపల్లి, కేతవరం, పిల్లుట్ల, గణపవరం మొదలైన చోట్ల గోపిరెడ్డిని గూర్చిన శోకగీతం అధిక ప్రచారం పొందింది.

'ఒగుర్రాల గోపిరెడ్డి
దాచేపల్లికి దానమైతివా
శేరుశేరు ఎండి కడియాల్
సేతులాకు పెట్టుకోనీ
కట్టమీదా వస్తావుంటే
కలకటేరు వనుకొంటిర కొడుకా.......
బంగారు కొడుకా వయ్యారి కొడుకా
దాచేపల్లికి దానమైతీవా......
ఎక్కేది ఎర్రగుర్రం
కట్టేది కాయిపంచె
చుక్కలాంటి నీ చక్కదనము
చూడ కళ్ళే సాలపు కొడుకా
వయ్యారి కొడుకా, బంగారు కొడుకా
దాచేపల్లికి దానమైతివా
ఆ పక్కా ఒక సేను
నడుమలోనా నాపసేను
సందున నిను నలుగురు పట్టి
నరికిరి కొడకా, వయ్యారి కొడకా
దాచేపల్లికి దాన మైతీవా'[4]

మానంది రెడ్డి మీద కూడా కొన్ని పాటలున్నాయి. ఇతడు స్త్రీలోలుడులాగున్నాడని, అదే యితని పతనానికి దారి తీసిందని 'కృష్ణశ్రీ' గారన్నారు. మానందిరెడ్డి (మహానందిరెడ్డి) పగలవల్ల చనిపోయాడుగాని స్త్రీలోలత వలన కాదు.

మానందిరెడ్డి పాటలోని ప్రత్యేకత నాయకుడి వర్ణన. అతని వేషం, దాని తీరు అసలు సిసలైన జానపద రీతిలో చక్కగా వర్ణింప బడింది.

'రాజా మానందీ రెడ్డీ
నీ కిలలో బత్తెము తీరెనా





కొడుకా మానందీ రెడ్డీ
మల్లుపంచె కట్టుకోనీ
నల్లకోటూ తొడుక్కోనీ
పల్లె దోవన బోతవుంటే
పాలెగాడనుకుంటిరా
కొడుకా మానందీరెడ్డీ
కట్టమీదా బోతవుంటె
కలకటేరను కుంటిరా కొడకా
రాజా మానందిరెడ్డీ
నీ కిలలో బత్తెము దీరెనా
నున్నంగ తలదువ్వి
నూగాయ జడలేసి
సందువెంట బోతావుంటె
సందమామను కొంటిర కొడకా
వచ్చి పొయ్యే దోవలోన
దానిమ్మ చెట్టుకింద
వెండి కుచ్చే నేలబడితే
ఏటుకే తెగనరికె నన్నా'[5]

శ్రీమంతులకు పేదవారికి పోరాటం ఈ నాటిది కాదు. అయితే అలాంటి గాథలెన్నో తెలియకుండా పోయాయి. 1880–1925 ప్రాంతాలలో ఒక కథ జరిగింది. నాగిరెడ్డి అని ఒక విప్లవ వీరుడుండే వాడు. ఇతడు గడేకల్లు భీమలింగేశ్వరుని వరప్రసాది అట! అతనంటే గిట్టని వాళ్ళందరూ చేరి అతన్ని చిత్రవధ చేశారు. కాని సామాన్యుల కతడు దైవం. అందువల్లనే అతని మీద పాటలు కట్టి పాడుకున్నారు.

'చుట్టూ ముట్టూ పల్లెలకెల్ల శూరుడమ్మ నాగిరెడ్డి
డెబ్బైయేడు పల్లెల కెల్ల దేవుడమ్మ భీమలింగ
రామ రామా కోదండరామా
భైరామ రామా కోదండరామా
పక్క నున్న పల్లెల కెల్ల పాళెగాడు నాగిరెడ్డి..........'[6]

ఇటువంటి నాగిరెడ్డిని బండిమీద వస్తుండగా చూచి నలుగురూ చుట్టుముట్టి

చిత్రవధ చేశారు.

అన్ని కన్నీటి పాటలూ ఇలాంటివే కానక్కర లేదు. అప్పుడప్పుడు సంభవించే దుర్ఘటనలను ఊతగా చేసుకొని అప్పటికప్పుడే పాటలు కట్టేస్తారు జానపదులు. రైలు ప్రమాదం జరిగింది. రైలు నిండా వందల మంది జనం ఉన్నారు. బ్రిడ్జిమీదకు వచ్చి రైలు పడిపోయింది. చుట్టూ నీళ్ళు. పెట్టెలన్నీ కూలి పెళా పెళా విరిగాయి. ఇంజను కూడా ముక్కలైంది. అప్పటి దృశ్యం చూచిన వాళ్ళకెంత హృదయ విదారకంగా ఉండి ఉంటుందో!

'పిల్లా జెల్లాగూడ అల్లాడి పోయిరీ
గుడ్డాలు గుడుసులూ కొట్టుకు పోయిరీ
ఊపిరాడక కొందరూడ్చుకా పోయిరీ
ఊసిగాను కొందరు ఒడ్డుకూ చేరిరీ
ఇన్ని ప్రాణాల్తీసి ఉసురూ పోసుకొంటే
ఎన్నాళ్ళూ నీ బ్రతుకూ ఎవరు మెచ్చూతారు
ఎంతమాయదారివే యెల్లల చెరువూ యేరువాకా
నీవెంత మాయదారివే యెల్లల చెరువూ యేరువాకా'[7]

ఆధునిక కాలంలో తెలుగులో స్మృతికావ్యాలు వెలువడ్డాయి. జానపదులు కల్పించిన ఒక గేయం వీటి అన్నిటికంటె ముందే వెలసింది. దీనిలో కొన్ని భావాలు అపూర్వమైనవి, కలకాలం మనసులో నిలిచేవి. తన గతదాంపత్య జీవితాన్ని జానపదుదు తలచుకొంటున్నాడు. ముఖ్యంగా రెండు భావాలు మనల్ని ఆకర్షిస్తాయి. భార్యాభర్తలిద్దరూ ఒకే కంచంలో తినేవాళ్ళు. ఇప్పుడా పాత్ర ఒక్కనికే మిగిలి పోయింది. ఇద్దరూ కప్పుకొనే దుప్పటి కూడా అలాగే అయ్యింది. వీటిని తలచుకొని దుఃఖిస్తాడు భర్త.

'సుద్ద బొందల కాడ – నీ సుద్ది దియ్యంగానె
సద్ది దిన్నట్టాయెనే సిలకా–సిన్నారి సిలకా
ఇంతెల్ల మెడబాపెనే సిలకా
ఎంత పాపపు దేవుడే సిలకా
సమర్తయై నీవు సాటుకు కూకుంటె
సత్తెబామా వందురే సిలకా–సిన్నారి సిలకా
పసిద్దై నువ్వొక్క పందిట్ల గూసుంటె
పార్వతీ దేవందురే సిలకా–సిన్నారి సిలకా





ముత్తైదవై నువ్వొక్క మూలకు గూకుంటె
ముద్దబంతీ వందురే సిలకా–సిన్నారి సిలకా
ఇద్దరము తినేటి ఆ బొద్దుగిన్నెలా
ఒక్కనికి ఒనరాయెనే సిలకా – సిన్నారి సిలకా
ఇద్దరము కప్పేటి మద్దికాయల దుప్పటి
ఒక్కనికి ఒనరాయెనే సిలకా – సిన్నారి సిలకా'[8]

ఇలాంటిదే మరొక పాట ఉంది. ఇదియే సహృదయుడినైనా తప్పక కంట తడి పెట్టిస్తుంది. తనతో ఆడుకున్న చెలికాదు చనిపోయాడు. అప్పుడొక బాలిక విలపిస్తున్నది. మృదుమధుర భావాలతో కంట తడిపెట్టించే అత్యుత్తమ గీతమిది.

'బొంగురాలా దేటి బొగుడల్లా నాయిరాజా
యాడ లెంకిన లేదే యెలదారి నాయిరాజా
చిర్రగోనె లాడేటి చింతల్లా నాయిరాజా
యాడి లెంకిన లేడె యెలదారి నాయిరాజా
గోటీలాడేటి కోనల్లా ॥యాడ॥ నాయిరాజా
నిన్న మన మాడిన నిమ్మల్ల ॥యాడ॥ నాయిరాజా
మొన్న మన మాడిన మోతుకుల్ల ॥యాడ॥ నాయిరాజా
చెండూలు ఆడేటి చెలుకల్ల ॥యాడ॥'[9] నాయిరాజా

(లెంకిన=వెదకిన)

## కన్నడం

అప్పగింతల పాటలు తెలుగులో లాంటివే కన్నడంలో కూడా ఉన్నాయి. కొన్ని వేడుకలు, అలవాట్లు, ఆచారాలు మొదలైనవి భారత దేశమంతటా వాడుకలో ఉంటాయి. కూతుర్ని భర్త ఇంటికి పంపే ఆచారంగల ప్రదేశాలలో అప్పగింతల పాటలకు అవకాశం ఉంటుంది. అలాంటి ఆచారం కన్నడ దేశంలోనూ ఉంది.

ఆడపిల్ల దుఃఖం తల్లికి ఎక్కువగా తెలుసు. అందుకే కూతురు తన ఆవేదనను తల్లి దగ్గర వెళ్ళ గ్రక్కుతుంది. తల్లి ఆమెను ఓదారుస్తుంది. అదంతా కూతురు బయలుదేరే వరకే. కూతురు వెళ్ళిపోతున్నదనే భావన రాగానే ఇక ఆమె దుఃఖం ఆగదు. అప్పుడు తల్లిని కూతురు ఓదార్చవలసి వస్తుంది. 'ఏమిటమ్మా నీ పిచ్చి! ఇలా ఎందుకు బాధ

పడుతావు? నా బొమ్మ గోడమీద ఉంది కదా? దాన్ని చూచుకొని శోకం మరిచిపో' అంటుంది.

'అత్తరె కరెదరె హత్తరిద్దేవెనె
హుచ్చేనె అవ్వా మరుళేనే గోడెయ
చిత్తార నోడి మరెయవ్వ'[10]

కాని ఆమె పిచ్చిగాని జ్ఞాపకం తెచ్చే వస్తువులు ఉంటే శోకం ఇంకా ఎక్కువవుతుందని తెలియదామెకు. అందుకే ఒక తల్లి అనుకుంటుంది : 'ఆడ పిల్లను కనడమూ వద్దు, వేరే వాళ్ళకు ఇవ్వడమూ వద్దు, పిల్ల వెళుతూ ఉంటే యేడవడమూ వద్దు' అని.

'హెణ్ణ హడెయలి బ్యాడ
హెరవరిగె కొడబ్యాడ
హెణ్ణు హోగాగ అళబేడ'[11]

అప్పగింతల పాటల్లో తలమానిక మనదగిన పాట కన్నడంలో ఒకటి ఉంది. మొదటి త్రిపదిలో 'అమ్మాయీ! ఏడవ వద్దమ్మా. ఏడవడం నీకు సరికాదమ్మా! ఉత్తములలాగా జీవించవమ్మా' అని మొదలు పెట్టింది తల్లి. కూతురికి కొన్ని బుద్ధులు చెప్పింది. అత్తమామలను పూజ చేయమన్నది. పతి పాదాలను మరవ వద్దన్నది. పుట్టినింటికి గౌరవం తీసుకురమ్మన్నది. ఇవన్నీ మామూలే. మరికొన్ని అపూర్వ భావాలున్నాయి ఈ పాటలో. 'నేను ఇప్పటికే ఎన్నో కష్టాలనుభవించానమ్మా. నేను ఎన్నని చెప్పేది. ఇంకా నా బాధ ఎక్కువవుతుంది' అని చెప్పి ఇంకా ఇలా చెపుతుందా తల్లి. 'కష్ట పడితే ఫలముందమ్మా పసిదానా. కష్టానికి ఫలం లేదనుకోవద్దు. ఆడదానివిగా పుట్టిన నీవు బంగారంలా బ్రతకాలి కన్నీళ్ళు వచ్చినా సహించు. శివధ్యానం మాత్రం మరువ వద్దు. ఆడదాని బ్రతుకే అంత. మన జన్మమే అలాంటిది' ఈ మాటల్లో స్త్రీ పడవలసిన బాధ, తల్లి ఆవేదన అంతా అత్యంత మనోహరంగా చిత్రించబడింది.

'అళబేడ ననమగళె ఉళుతి కొంబువరిల్ల
అత్తరె అదు నినగె సరియిల్ల ననమగళె
ఉత్తమర రీతియలి బాళవ్వ
కడుకష్ట పట్టేను కట్టిగె యంతాదేను
మత్తష్టు నామ కొరగెను హడెదవ్వ
ఎష్టొందు నాను హేళలి





కష్టవ పట్టరె ఫలవుంటు హసుమగళే
కష్టక్కె బెలెయు ఇల్లెందు తిళియదె
నిష్ఠెయిందలి బాళ్వె మాడవ్వ
హెణ్ణాగి హుట్టిద నీను హొన్నాగి బాళవ్వ
కణ్ణీరు బందరూ సహిసికో మగళే
శివధ్యాన మాత్ర మరి బ్యాడ
హొన్నాగి బాళువదక్కింత మణ్ణాగి హోగోదు లేసు
హెణ్ణిన బాళు బలుగోళు హడెదవ్వ
సణ్ణాగి హోయితు జన్మవు'[12]

భర్త చనిపోతే భార్యకు కలిగే దుఃఖాన్ని వేరే వర్ణింప నక్కరలేదు. ఆమె జీవితమే దుర్భరమవుతుంది. ఇలా తనకు జరగబోయే కష్టాన్ని తలచుకుంటేనే చాలు స్త్రీకి గుండె తరుక్కోబోతుంది. ఇలా తనకు వైధవ్యం ప్రాప్తింప జేసినందుకు బ్రహ్మను నిందిస్తుంది.

'దూరి గౌదగువ హెణ్ణ జనుమ హొరువదకింత
హాదీ నాయాగూదు కడులేను-ఎలెజీవ
హెణ్ణాగి బాళ హొరిబ్యాడ
హణెయల్లి ఖరెదుదకె మొదలుండ సాలక్కె
బ్రహ్మనీ బరెద బరహక్కె-నానీగ
హగరణ వాదె జనరీగె
ఒప్పీన సింగార మడిగ్యాక హూవెసళు
ఎంటెంటు దినక్యాక సంతి-ఎలెహెణ్ణె
హుడుగర బాళు హరిదావు
హెణ్ణీన జన్మవు సుణ్ణాగి కుదియలి
గాణద్విండ్యాగి నురియలి-శివరాయ
దీపదెణ్ణాగి ఉరియలి'[13]

కన్నడంలో తెలుగులో ఉన్నన్ని కన్నీటి పాటలు లేవు. కథాగేయాలలో కరుణ రస పోషణ ఎక్కువగా కనిపిస్తుంది గాని విడి గేయాలలో కనిపించదు. మరణ గీతాలు ఈ రెండు భాషలలోను చాలా తక్కువ. కన్నడంలో మూడునాలుగు రకాల మరణగీతాలు మాత్రం కనిపిస్తాయి. హాసన్ జిల్లాలో హరిజనులు ఇటువంటివి

పాడుతారు. కొడగు జిల్లాలో నృత్యం చేస్తూ పాడే పరపనాట్ గీతాలు కూడా ఇలాంటివే. దక్షిణ కన్నడ జిల్లాలో కూడా ఎర్కోల అనే నృత్యగీతం మరణ గీతమై ఉంది. సర్వమానవ హృదయాలనూ ద్రవీభూత మొనర్చగల శోకరసం తెలుగు కన్నడాలలో ఎక్కువగా కథాగేయాలలోనే కనిపించడం గమనించదగింది.

**టిప్పణి**


1. C.M.Bowra, Primitive Song, p.70
2. బి.రామరాజు, తెలుగు జానపద గేయ సాహిత్యము, పు. 454
3. కృష్ణశ్రీ (సం.), పల్లెపదాలు, పు. 78
4. అదే, పు. 78
5. అదే, పు. 79
6. త్రివేణి, పు. 268
7. అదే, పు. 256
8. అదే, పు. 275
9. అదే, పు. 237
10. హొన్న బిత్తేవు హొలకెల్ల, పు. 279
11. హళ్ళియ హాడుగళు (అరుణోదయ), పు. 41
12. హొలమనియ పదగళు, పు. 71
13. ఎం.జీవన (సం.), పు. 121






# 10. జానపద గేయాలు-సంస్కృతి

'సంస్కృతి' (culture) అనే పదాన్ని మనం సామాన్యంగా మానవుని మహత్తర సాధనను సూచించడానికి వాడుతుంటాము. కాని మానవ శాస్త్ర దృక్పథంతో పరిశీలించినప్పుడు 'సంస్కృతి'కి విస్తృతార్థాన్ని ఇవ్వవలసి ఉంటుంది. మనిషి మృగం నుండి వేరుపడి తన ప్రగతి కోసం వేసుకున్న ప్రతి సోపానమూ సంస్కృతిలో భాగమే అవుతుంది. అంటే 'మానవ కృతి' అంతా సంస్కృతమే. మానవ సంస్కృతిలో ఒక భాగమే జానపద సంస్కృతి. ఒక సంఘం యొక్క సంస్కృతిని ప్రతిబింబించే మౌఖిక అభివ్యక్తులలో జానపద గేయాలు కూడా ప్రధానమైనవి.

"ఒక జాతి ప్రజానీకము యొక్క సంపూర్ణ జీవిత చరిత్రయే సంస్కృతి చరిత్ర" అన్నారు ఖండవల్లి లక్ష్మీరంజనంగారు.[1] సంస్కృతిలో భౌతిక, మానసిక, సాంఘిక అంశాలని మూడు ఉంటాయి. భాష నైపుణ్యాలు, విశ్వాసాలు, ఆచారాలు మొదలైనవి భౌతిక సంస్కృతి, మానసిక అంశాలు మనశ్శాస్త్రం పరిశీలిస్తుంది. సంస్కృతిలోని సాంఘిక శాస్త్రానికి సంబంధించినవి. ఈ సంస్కృతిని గురించి ఖండవల్లి వారు 'ఆంధ్రుల చరిత్ర-సంస్కృతిలో విపులంగా చర్చించారు. వారి అభిప్రాయంలో జాతి జీవనంలో రెండు ముఖ్యమైన పాయలున్నాయి.[2] 1.నిత్య జీవితము 2.శాశ్వత జీవితము. నిత్యజీవితంలో మళ్ళీ వ్యక్తి జీవితం, సంఘజీవితమని రెండు శాఖలను గుర్తించవచ్చు. 1.నిత్యజీవితం : వ్యక్తిగతమైన వాటిలో గృహనిర్మాణం, ఆహారం, వేషాలు, దేహాలంకారాలు, కుటుంబం, ఆస్తి, వివాహ సంప్రదాయాలు, వేడుకలు, పండుగలు, పర్వాలు, నోములు, వ్రతాలు మొదలైనవి వస్తాయని ఖండవల్లి వారి అభిప్రాయం.

సమష్టిగా అమలు జరిపే వాటిలో వర్ణవిభజన, కులాలు, కట్టుబాట్లు, వృత్తులు, వ్యవసాయాదులు, వాణిజ్యం, నగర జీవితం, ప్రభుత్వం, ఆర్థిక వ్యవస్థ మొదలైన వాటిని చెప్తారు.

శాశ్వత జీవితానికి సంబంధించిన వాటిలో మతం, ధర్మం, ఆదిమ వాసుల మతవిశ్వాసాలు, బలులు, దేవాలయాలు, పుణ్యక్షేత్రాలు, మానసిక వికాసం, కళాజీవితం, శిల్పం, చిత్రలేఖనం, సంగీత నాట్యాదులు మొదలైనవన్నీ వస్తాయి.

'తెలుగు సంస్కృతి' అన్నది ప్రత్యేక అస్తిత్వం కలదా లేదా అన్న ప్రశ్నకు జవాబు చెప్పాలంటే నిశిత పరిశోధన అవసరం. తెలుగు వారివి అని చెప్పదగిన

బంధుత్వాలు, కులవ్యవస్థ, వివాహ పద్ధతులు, కుటుంబ జీవనం, ఆస్తి వ్యవహారాలు, దండనీతి, మతం, నమ్మకాలు, కళలు, ఆభరణాలు, చేతిపనులు మొదలైనవి జానపద గేయాలలో వర్ణితమైనాయి. జానపద గేయాల పరిశీలన వల్ల కొంత వరకు తెలుగు సంస్కృతి స్వరూపాన్ని అవగాహన చేసుకోవచ్చు.

తెలుగు ఇంటి ఆడ బడుచుకు ఎంతో మర్యాద ఉంది. ఆడబిడ్డ కంట నీరు పెడితే పుట్టింటికి మంచిది కాదనే నమ్మక ముంది. ప్రతి ఏటా తప్పక ఆడ బడుచుకు చీర, రవికె, పసుపు కుంకుమలు ఇవ్వాలి. ఈ విషయాలను తెలిపే జానపద గేయాలున్నాయి. ఆదివారం, అమావాస్యనాడు అన్న ఇంటికొక ఆడపడుచు వెళ్ళింది. వదిన ఎన్నెన్నో మాటలాడి తిరస్కారంతో చూచింది. కాని అన్న మంచివాడు. మర్యాద లెరిగిన వాడు.

'నాకు నల్లచీర నెమలి పచ్చె రవికె
వడినిండ బియ్యము వళ్ళూ కొబ్బరి గిన్నె
పసుపు కుంకుమయిచ్చి పంపె మాయన్న'[3]

అన్న మీద ఎవరికైనా ఆశ ఉంబుంది. ఎంతమంది అన్నలుంటే ఆశ కూడా అంతగా పెరుగుతుంది. ఇది ప్రతి తెలుగు ఆడబడుచుకూ అన్వయిస్తుంది. ఈ విషయాన్ని తెలిపేదే ఈ క్రింది పాట.

'ముగ్గురన్నల తోడ నే బుట్టినాను
నా నడుము మువ్వంచు చీరగోరింది
నలుగురన్నలతోడ నే బుట్టినాను
నా నడుము నల్లంచు చీరగోరింది
అయిదుగురన్నల తోడనే బుట్టి నాను
నా వొళ్ళు అద్దాల రవిక గోరింది'[4]

తెలుగువారికి కొన్ని కుటుంబ మర్యాదలు, అలవాట్లు అభిరుచులు ఉన్నాయి. పరువు, ప్రతిష్టలు గల ఆడదైతే కొంగు నిండుగా కప్పుకోవాలి. అలా చెయ్యనప్పుడు అత్తగారి మందలింపులు తప్పవు.

'అత్తింటి కోడలవు కావుగావున్నె
అజ్జ సిగ్గులు నీకు లేవుగావున్నె
వీపు నిండా కొంగేదె ఇరువరసలేవె
మడమ తిరగ బట్టేదె. మాట వాసేదె?'[5]





తెలుగువారి వివాహ సంప్రదాయాలు పెళ్ళి పాటలలో వ్యక్తమవుతాయి. నలుగు, తలంబ్రాలు, కాశీయాత్ర, వియ్యపురాలిని ఎగతాళి పట్టించడం, కుక్కమంగళాలు, బువ్వపుబంతి మొదలైన వన్నీ తెలుగువారి సంస్కృతికి అద్దంపడ్తాయి. స్త్రీలకు సంబంధించిన చిట్టిబొట్టు నోము, కాటుక గౌరీ వ్రతం, నిత్య శృంగార నోము, పువ్వుల తాంబూలం నోము, పండు తాంబూలం నోము, పదారు పళ్ళనోము, పూర్ణాది వారాల నోము, సంపద శుక్రవారం నోము, శ్రావణ మంగళవారం నోము, శుక్రవార వ్రతం, నందికేశ్వర వ్రతం, తద్దె పండుగలు, మోచేటి పద్మం, మొగదోసెళ్ళ వ్రతం, సావిత్రి గౌరీవ్రతం మొదలైన వాటికి సంబంధించిన గేయాలున్నాయి.

ఇవికాక తెలుగువారు ఆచరించే పండుగలు వాటికి సంబంధించిన పాటలు వారి జీవన విధానానికి దర్పణాలు నవరాత్రి, విజయదశమి, దీపావళి, సంక్రాంతి మొదలైనవి ఆంధ్ర కర్ణాటక ప్రజలు వైభవంగా జరుపుకొనే పండుగలు.

అనేక వృత్తులకు సంబంధించిన జానపద గేయాలు కూడా చాలా లభిస్తాయి. వీటిలో ముఖ్యమైంది వ్యవసాయం. తెలుగులోని అనేక గేయాలలో వ్యవసాయ విధానాలు, పనిముట్లు మొదలైనవి పేర్కొనబడి ఉంటాయి. వ్యవసాయానికి సంబంధించిన ఎన్నో విశేషాలున్నాయి. వ్యవసాయం జనన కార్యానికి అనుకరణమంటారు. దీనిలో ఉపయోగించే పెక్కు పారిభాషిక పదజాలం ద్వంద్వార్థాలను కలిగివుంటుంది. మిథునకార్యం, వ్యవసాయం కార్యం పోల్చబడిన ఒక పాటను రామరాజుగారు తమ సిద్ధాంత గ్రంథంలో ఉదహరించారు.[6] వ్యవసాయంలోని వివిధ కార్యాలను వర్ణించే గేయాలనేకం ఉన్నాయి. ఈక్రిందిది కోతపాట.

'కొయ్యండల్లా కొయ్యండీ
కోసీ బఱువూ లెయ్యండీ
వానల వరదల వంగిన సేను
వెన్నుల నీనిన వన్నెల సేను
తిన్నగ దీసీ మొదలూ కోసీ
పనలన్నీని పొంజెట్టావా
గింజలు బందలొ పడిపోకుండా
పొందుగ వెన్నులు కొయ్యండల్లా
కాలం సూత్తే సీతాకాలం
కొడవటి పాటూ జాగర్తల్లా

కాలూ సెయ్యీ ఆడింతేనె
కుండలొ కూడు కలిసొత్తాది'[7]

ఇట్లే మిగిలిన వృత్తులను గురించిన వివరాలు కూడా జానపద గేయాలలో కనిపిస్తాయి.

ఉతకరా చాకాలి ఉల్లిపువ్వల్లె
మడచరా సాకాలి మల్లి మొగ్గల్లె
ఇచ్చిరా సాకాలి అన్ని వాడలకి

ఇత్యాది గేయాలు అనేకం.

జానపద గేయాలలో శాస్త్ర విషయాలు కూడా పెక్కింటిలో కానవస్తాయి. అనుభవ వైద్యం, జ్యోతిషం, వాస్తుశాస్త్రం, మంత్రాలు మొదలైనవి గేయరూపం పొంది వుండడం కనిపిస్తుంది.

తలనొప్పి వస్తే నల్లిని చంపి వాసన చూస్తే పోతుందట! ఒక జారిణి తన ప్రియుణ్ణి గూర్చి పాడుతూ 'పిల్లీకి తలనొప్తె నల్లి కొచ్చిందు' అని పాడుతుంది.

దిగుదిగునాగ దివ్య సుందర నాగ
నల్ల చుక్కల నాగ నా ముద్దునాగ........

అనే పాటలో పాము మంత్ర ముందంటారు. ఈ క్రింది పాటలో కూడా పాముమంత్ర మున్నదంటారు.

గుడుగుడు గుంచం గుండారాగం
పాముల పట్టం పడగారాగం
అప్పల్రాజుగుర్రం ఆడుకోబోతే
పేర్రాజు గుర్రం పెళ్ళికి పోతే
నీ గుర్రం నీళ్ళకు బోతే
నా గుర్రం పాలకు బోతే
వేన్నీళ్ళు చన్నీళ్ళు
కత్తెయ్యనా బత్తెయ్యనా

ఇట్లే ఎలుకలకు కూడా మంత్రాలున్నాయి. 'కాళ్ళాగజ్జె కంకాళమ్మా, వేగుల చుక్కా వెలగామొగ్గా' అనే ప్రసిద్ధిమైన పాటలో కాళ్ళగజ్జికి మందుంది. బాలెంతరాలికి చేయవలసిన వైద్యాన్ని గూర్చి ఈ క్రింది గీతంలో ఉంది.





'పిప్పళ్ళు శొంఠీ మిరియాలు కొట్టివుంచరే
ఎక్కువైనా లవంగాలు పత్రి చేర్చరోయమ్మా
తాటి బెల్లము ఇంగువ
తెచ్చి వుంచరోయమ్మ'[8]

ఇది వాజీకరణయోగం.

జ్యోతిశ్శాస్త్రానికి సంబంధించిన పాటలు కూడా కొన్ని ఉన్నాయి.

'పెద్దవాడు పిన వాడు
మామతోడ గూడిరేని
వంచనింత లేకుండ వాన వచ్చునూ'[9]

పెద్దవాడు సూర్యుడు, చిన్నవాడు బుధుడు, ఈ ఇద్దరూ చంద్రుడున్న రాశిలో ఉంటే తప్ప కుండా వాన వస్తుందట!

ఆంధ్ర స్త్రీ పురుషుల వేషభూషణాలంకారాలు శిల్పాలలో చెక్కబడి భద్ర పరచబడి ఉన్నాయి. శాతవాహనుల కాలంనుంచి స్త్రీ పురుషుల అలవాట్లు మొదలైనవి గాథాసప్తసతీత్యాది గ్రంథాలలో వర్ణింపబడ్డాయి. చెంగావి చీర చాలాకాలంనుంచి ప్రీతి పాత్రమైంది. పురుషులు కూడా చెవులలో పోగులు, పూసల వరుసలు, కర్ణాభరణాలు మొదలైనవి ధరించేవారు. ఆంధ్ర దేశపు స్త్రీ పురుషుల వేష భూషణాదులను గురించి తెలుసుకోవాలంటే జానపద గేయాల అధ్యయనం అవసరం, స్త్రీలు–

కొప్పు చక్కగ బెట్టి గొజ్జ గులను ముడిచి
పమిడి జల్తారు పట్టు చీరగట్టి
రంగైన రత్తాల రవికను తొడిగి......
పసిడి గొలుసులు తీర్చి బాగుగ వేసి
గంట లొడ్డాణంబు–ధరించేవారు.

ఈకింది ప్రసిద్ధ గేయంలో కూడా ఆడవాళ్ళు ధరించే బాజా బందూలు, గుళ్ళపేరులు, కాసుల కంటెలు మొదలైన వాటిని గూర్చిన ప్రసక్తి ఉంది.

'బందారు చిన్నదాన బాజా బందూల దాన
బాజా బందూల మీద మనసేల లేదే ఓ చిన్నదానా
గుంటూరు చిన్నదాన గుళ్ళా పేరూల దాన
గుళ్ళా పేరుల మీద కళ్ళూపోలేదే ॥ఓ॥
కాకినాడ చిన్నదాన కాసూల్ కంటేల దాన

కాసూల్ కంటేల మీద మనసేల లేదే ॥ఓ॥

అర్ధ రూపాయి పెట్టి అద్దాల రయిక కొంటె

అద్దాల రయిక మీద బుద్ధేల లేదే ॥ఓ॥

ఆంధ్రుల అభిరుచులు కొన్ని గేయాలలో వ్యక్తమవుతుంటాయి. పట్టు చీరకు అంచులు, చుట్టు చెంగులు ఉండాలని, సరిగంచు కలిగి ఉండాలని, అద్దాల రవిక కావాలని కొందరు కోరుకుంటారు. వీటి కోసం భార్యా భర్తల మధ్య ప్రణయ కలహం సంభవించడమూ కద్దు.

'పట్టుచీర తెచ్చాను పెట్టెలో పెట్టాను

కట్టమని చెప్పవే తడికా

చీరకంచులు లేవు చుట్టు చెంగులు లేవు

వద్దని చెప్పవే తడికా తడికా ॥చీ॥

సంతలోకి వెళ్ళి సరిగంచు చీరను

అద్దాల రవికను అతివ తెచ్చెద కట్టుకోవే'

చంద్రగిరి చీరలు, కాకినాడ గాజులు, రాజమండ్రి రవికలు ప్రసిద్ధ మైనవి. ఈ ఆభరణాలు, భూషణాలు రకరకాల దుస్తులు మొదలైనవన్నీ మన రసికతను తెలుపుతున్నాయి. ఆంధ్రుల సాంస్కృతిక జీవనానికి నలుగు పాటలు మొదలైనవి ప్రతిబింబాలు. ఈ క్రింది నలుగు పాట అట్టి వాటిలో ఒకటి.

కమ్మాలు కడియాలు కస్తూరి బావిరీలు

నలుగూకు రావే సీతమ్మ

అత్తారు పన్నీరు సిత్తారి గిన్నెలతో

వేగ వేగను రావె చెలియ సీతమ్మ

నలుగూకు రావె సీతమ్మ

గుండు పళ్ళెములోన గురుతాయె హా నలుగు

నలుగూకు రావె సీతమ్మ (తాయమ్మ, రామాపురం, కోలారు జిల్లా)

తెలుగు వారి రసికతకు మణిదర్పణాలై వెలుగొందే గేయాలనేకం. వీరభద్రారెడ్డి వైభవం కళ్ళకు కడ్తూ, తద్వారా తెలుగు వారి సంప్రదాయాలను సుందరంగా చూపే పాట ఈ క్రిందిది.

'రెడ్డొచ్చె రెడ్డొచ్చె రెడ్డొచ్చెనమ్మా

వీర భద్రారెడ్డి విచ్చే సెనమ్మా





పొద్దున్నె మారెడ్డి పొరకూడి పించు

నిలువెల్ల నడివీధి నీరు జల్లించు ॥రెడ్డొచ్చె॥

సందు గొందులలోన సొన్పు పోయించు

చీకట్ల పసుపు కుంకుమలు పూయించు

రంగవల్లుల నూరు రాణింప చేయు

తోరణాల పంక్తులా తులకింప చేయు

దివ్వెలను వెలిగించు దివ్యమార్గాల

మా పెల్లి పాలించు మంచి మార్గాలు

ఎండలకు పందిళ్లు వేయించు వాడూ

పొందుగా మారేళ్ళు కోయించు వాడూ

ఊరి బావులలోన ఉప్పుసున్నాలా

వెదజల్లు నేటేట నిండు పున్నానా'[11]

## కన్నడం

కన్నడ గేయాలు పెక్కింటిలో కూడా ఆభరణాలను గూర్చి, కేశాలంకారాలను గూర్చి, చీరలను గూర్చి ఉన్నాయి. ఆనాటి మహిళలు స్నానం, విలేపనం, వస్త్రం, శిరోభూషణం, తిలకం, కజ్జలం, నానాభూషణం, మకర పత్రం, కేయూర మణి భూషణం, అంగులీయకం, కాంచీ ధామం, నూపురం, అలక్త రసం ఇత్యాది అలంకార సాధనాల్ని ఉపయోగించేవారు. బహెుళె, బేలూరు, హళేబీడు, మొదలైన చోట్ల దేవాలయాలలోని శిల్పాల శిరోజాలంకారాలు అత్యంత మనోహరమైనవి, అలంకార ప్రియత్వం భారతీయులకు రక్తగతమైనది. శరణులను తలచితే మల్లె పూలను అలంకరించుకున్నట్లని, శరణుల్ని తలిస్తే కలిగే సంతోషాన్ని పోలుస్తున్న దొర పల్లె పదుచు.

"శరణర నెనెదర సరగీయ ఇట్టంగ

సేర మల్లిగి ముడిద్హాంగ

సేర నీ మల్లిగి

ముడిద్హంగ కల్యాణ శరణర నెనె మనెవె"[12]

కావ్యాలలో ఎన్నో రకాల శిరోజాలంకారాలు వర్ణింప బడ్డాయి; నాగవేణి, బిడుముడి, సోగెదురుంబ, బళల్ముడి, ముత్తిన ముడి, గోడంముడి, తెక్కెదురుంబు,

కిరీట ముడి, సోర్ముడి, జడెముడి, తళిర్ముడి, పూముడి, సిరిముడి మొదలైన వాటిని వర్ణించారు. ఈముడులు శిల్పాలలో కూడా కనిపిస్తాయి.

భారత దేశ స్త్రీల ఆభరణాలు అతి ప్రాచీన కాలం నుంచి ప్రపంచ ప్రసిద్ధి పొందాయి. ఆభరణాలు స్త్రీల అందాన్ని ఇనుమడింప జేస్తాయి. అందాన్నే కాక శరీరసౌష్ఠవాన్ని కూడా పెంపొందింప జేస్తాయి. వడ్డాణము మొదలైనవటువంటివి. బిడ్డను ఉయ్యాలలో వేసి నప్పటి నుంచే ఆభరణాలను తొడగడం ప్రారంభిస్తారు. శిరస్సు నుండి కాళ్ళవరకు ఆభరణాలున్నాయి. వేదాలలో, కావ్యాలలో, నాటకాలలో, ప్రాచీనాధునిక కన్నడాంధ్రాది సాహిత్యాలలో, జానపద గేయాలలో ఆభరణాల వర్ణన కనిపిస్తూనే ఉంటుంది. సాంచి, అజంతా, ఐహొళె, బదామి, బేలూరు, పట్టద కల్లు, హళేబీడు, విజయనగరం మొదలైన చోట్ల శిల్పాలు ఆభరణాల సౌందార్యాన్ని ప్రదర్శిస్తున్నాయి.

ఆభరణాల ధారణ పరిణామం విచిత్రంగా కనిపిస్తుంది. అతి పురాతన కాలంలో ఎముకల ఆభరణాలను ధరించే వారట. ఆ తర్వాత రాళ్ళతో చిన్న చిన్న గుండ్లలాగా చేసి హారాలను ధరించేవారట. సముద్రంలో దొరికే శంఖాలు మొదలైన వాటితో హారాలను చేసేవారు. మానవుడు నాగరకుడయ్యేకొద్దీ బంగారం మొదలైన వస్తువులతో ఆభరణాలను చేసే విధానం నేర్చుకున్నాడు. శ్రీమంతులు బంగారం, వజ్రాలు, ముత్యాలు మొదలైన వాటితో ఆభరణాలను చేసుకొంటే, బీదలు వెండి, రాగి, ఇత్తడి మొదలైన వాటితో చేసుకొనే వారు.

శిరోజాలంకారాన్ని, ఆభరణాలను, చీరకట్టే విధానాలను గూర్చి జానపద గేయాలు కొన్ని కనిపిస్తాయి.

"నంది బట్టల హూవు దుండ మల్లిగెదండె
చంద్రమన బై తలెగె ముత్తు తుంబె"
"సరసి జాక్షి జడె హాకిదళు ర్యాగుటి అదరమ్యాగె"
"భరది జడె బిల్లె కేదగె కుచ్చు బిట్టళు హణెమేగె
ముంగురుళొత్తిద బైతలె బిట్టళు వారి చంద్రన్హంగ"

(నారాయణస్వామి, చింతామణి)

జానపద గేయాలలో రకరకాల చీరలను గూర్చి చెప్పబడివుంది. భరది తోరువ పరిపరి సీరి, ఉడుతర సీరి, సెరగు జరతారి, పుతాణి బణ్ణ, కస కసి అంచిన సీరి, మురిగి తట్టి, రేశిమె అంచిన సీరి, మురిగి తట్టి, రేశిమె అంచిన సాసివె బణ్ణద





సింధు పట్టావళి కుసుంబి సీరి, మంగళ గీరు బంగార బళి, నామధారి సీరి, పీతాంబర జవుళి ఇత్యాదులు కొన్ని రకాల చీరలు. కర్నాటక స్త్రీలు మెచ్చినవి.

ఈ క్రింది 'సో బాన పాట'లో పెళ్లికుమార్తె అలంకార వర్ణన ఉంది. ఇది వాళ్ల రసికతను తెలుపుతున్నది.

"హింబళి ముంబళి గంధద గీరా
హొందిసి ఇట్టాళ ఛెంద గిరాకి
జాత మల్లిగి జాళిగి దండి
వాన్యాదు తురుబ ఒనపిలి కట్టి
ఖన్ని కోమలి హసీగేళ సో
సీరెయ బావులి లిగిలిగి నాడుత
కాలుంగ్ర పిల్యా ఝుగ ఝుగ హొళెవుత
హొన్న భరణా హరడిగి మలక
హొన్న పుత్తళి రుళి సరిగిట గొండు
కోగిల మద్దానే హసి గేళ సో"[13]

ఈ క్రింది పాట కూడా 'సోబానద హాడు'. ఈ పాటల్లోనే ఎక్కువగా వస్త్రాభరణాద్యలంకార వర్ణనలుంటాయి. దీనిలో పూర్తిగా ఆభరణాలు వస్త్రాలు వర్ణింప బడ్డాయి. మాణిక్యసరాలు, కంకణాలు, ముత్యాల సరులు, ముత్యాల ముక్కరలు, చీరలు మొదలైనవి పేర్కొనబడ్డాయి.

"రన్న దుడుగుణి చిన్నద కొండి
హొన్నినా డాబా ఇట్టిదళ
ఎణకి నిల్లదె మాణిక సర
ఎదిబది తాను హాకువళ
కడియ కంకణ కమళద ముఖియ
హొళివ ముత్తిన వాలిగళ
జయ జయ మంగళ జయ జయ మంగళ
సుందరి సొంబనిగే జయ జయ మంగళ ॥1॥[14]

ఇక తెలుగు వారికి లాగానే కన్నడం వారికీ కొన్నినమ్మ కాలున్నాయి, ఆచారాలున్నాయి. ఆవులింత వచ్చినా పొలమారినా ఎవరో తలచు కుంటున్నారనే నమ్మకం తెలుగు వారికి కూడా ఉంది. ఆడవాళ్లకు ఎడమకన్ను, మగ వారికి కుడి

కన్ను అదిరితే ఏదో శుభం కలుగుతుందనే నమ్మకమున్నది. ఒక స్త్రీకి ఎడమకన్ను అదిరించి, తన తమ్ముడు వస్తాడని ఆమె ఆశ పడుతున్నది.

ఎందు ఇల్లద నన్న ఎడగణ్ణ హారీత
చెందర హుబ్బు కుడి బెళక ననతమ్మ
సంజీగ్వడదవ్న మగ బంద (భైరారెడ్డి, చింతామణి)

తెలుగు పాటల్ని గురించి చెప్పేటప్పుడు వానదేవుణ్ని ప్రార్థించే పాట నుదహరించాను. కన్నడం వాళ్లు కూడా వానరావడానికి కొన్ని కర్మకాండలు చేస్తారు. కౌపీనం ధరించిన బాలుని తలపైన వాన దేవుని ప్రతిమను పెట్టి రాత్రులు ఇంటింటికీ తిరుగుతూ–

హుయ్యో హుయ్యో మళెరాయ
హువిన తోటకె నీరిల్ల
బారొ బారొ మళెరాయ
బాళెయ తోటకె నీరిల్ల
చెచ్చో చెచ్చో మళెరాయ
సౌతెయ తోటకె నీరిల్ల
కుట్టొ కుట్టొ మళెరాయ
కుంబళ తోటకె నీరిల్ల

అని పాట పాడుతారు.

ఇంకా కొన్ని జానపదుల నమ్మకాలు విచిత్రంగా ఉంటాయి. పి.ఆర్.తిప్పేస్వామి, క.రా.కృ గార్లు కలిసి జానపద గేయాల సేకరణకు వెళ్లారట. ఒక అవ్వను పాటలు చెప్పమని ఎంతగానో వేధించారట. పాండవులను గూర్చిన పాటలను చెప్తానని ఆ అవ్వముందు పూజ చేయాలనిందట. పాట పాడేముందు నొసట విభూతి పెట్టుకొని టెంకాయ కొట్టి. సాంబ్రాణి కడ్డీలు వెలిగించి పాడడం ఆరంభించిందట.[15] ఇలాంటివి జానపదుల అమాయకతను, నమ్మకాలను తెలుపుతాయి.

తెలుగు వారికున్నట్లే కన్నడం వారికీ ఎన్నో వినోదం వగైరాలున్నాయి. వేడుకలలో మనకున్నట్లే దసరా ఉత్సావాలు, హొళీ వేడుకలు మొదలైనవి వాళ్ళకూ ఉన్నాయి. అవన్నీ వేడుక పాటలలో వివరించాను. కరపాల మేళం మొదలైనవి జానపదుల వినోదానికి సాధనాలు. కరపాల మేళమనేది సంగీతం, సాహిత్యం, నృత్యం మూడూ కలిసి ఉంటే మేళం. దీనిలో ప్రధానమైన వాడు కిరీటం వంటిది





పెట్టుకుంటాడు. అంతే కాక చెవిలో కుండలాలు, రుద్రాక్షలు, కాళ్లకు గజ్జెలు, నడుముకు రంగు రంగుల వస్త్రము, కావి రంగు నిలువు అంగీ, ధోవతి ధరిస్తారు. సహాయకుల్లో ఒకడు 'ధుమికి' మరొకడుతాళం పట్టుకుంటారు. సూర్యోదయాది వర్ణనలు, నగర వర్ణన, రాజు వైభవ వర్ణన మొదలైనవి చేస్తారు

మూడల గిరియింద మూడిదను రవిరాజ
నాడిన జనరిగె దర్శనవ కొట్టు

వెంకటాచలమున ఉదయించిన సూర్యుణ్ని యీగీతంలో వర్ణించాడు కవి. వీళ్ళు మామూలు గీతములే కాక కథాగేయాలు కూడా పాడుతారు.

పసి పిల్లలు ఒక ఆట ఆడుతారు. వాళ్లలో ఒకడు రైతు. మరొకడు కుమ్మరి. ఇంకొకడు వడ్రంగి. ఇలా వాళ్ళు చేసే పని ఏమిటింటే తాము చేసిన వస్తువును రైతు కిచ్చి దానికి తగిన ధాన్యాన్ని తీసుకొని పోవడం. ఇవి చాలా విశిష్టమైనగీతం. పూర్వ కాలంలో నాణెములు లేవు. అప్పుడు పరస్పర వినిమయ పద్ధతి (barter system) ఉండేది. ఈ పాట ఆ పద్ధతిని సూచిస్తున్నది.

"కైయల్యోయ్తు? కద్వాగ్యోయ్తు
కదయేన్మొట్ట? చెక్కికొట్త
చెక్కి ఏన్మాడ్డి? ఒలియాగ్వాకె
కదయేన్మొట్త? చెక్కికొట్త
చెక్కి ఏన్మాడ్డి? ఒలియాగ్వాకె
ఒలి ఏన్మొడ్త? బూది కొడ్త
బూది ఏన్మాడ్డి? తిప్పెగ్వాకె......"[16]

ఇలా జానపద గీతాలలో ఎన్నో సాంఘిక విషయాలు ప్రదర్శితమయ్యాయి.

**టిప్పణి**

1. ఆంధ్రుల చరిత్ర-సంస్కృతి, పు.11
2. అదే, పు.21
3. కృష్ణశ్రీ (సం.), పల్లెపదాలు, పు.39
4. అదే, పు.47
5. అదే, పు.49
6. తెలుగు జానపద గేయ సాహిత్యము, పు.480
7. పల్లెపదాలు, పు.13
8. జానపద గేయ వాఙ్మయ వ్యాసావళి, పు.140
9. అదే, పు.140
10. పల్లెపదాలు, పు.92
11. అదే, పు.80
12. మహిళెయర అలంకార, పు.7
13. మల్లిగెదండ, పు.75
14. అదే, పు.76
15. క.రా.కృ., జానపద హాస్యలహరి
16. కన్నడ జానపదగీతగళు, పు.44





# 11.భాషా విశేషాలు

జానపదుల భాష జీవం ఉట్టిపడుతూ ఉండే భాష. చెప్పదలచుకున్న విషయాన్ని తమభాషలో, అక్లిష్టమైన భాషలో సూటిగా చెప్తాడు జానపదుడు. గేయాలు పాడడానికి అనువైనవి. అందువల్ల ఒక్కొక్క చోట హ్రస్వానికి బదులు దీర్ఘము, దీర్ఘానికి బదులు హ్రస్వము వస్తూ ఉంటుంది. మామూలుగా ప్రక్క పక్కన ఉండవలసిన అక్షరాలు సంయుక్తాలవుతాయి. కొన్ని వికృత రూపాన్ని పొందుతాయి. కొన్ని అన్యదేశ్యాలు వచ్చిదాగుకుంటాయి. పలుకుబళ్లు, జాతీయాలు, నుడికారాలు, సామెతలు వీటిలో కోకొల్లలుగా కనిపిస్తాయి. అలంకారాలూ, అక్కడక్కడ కనిపిస్తాయి. కాని అవి వెండి బంగారాలతో చేసిన నగలు కావు. నిసర్గ ప్రకృతి నుండి గైకొని ప్రకృతి కన్యలా గేయం సింగారించుకున్న మనోహర ఆభరణాలు. స్వభావోక్తి అన్నిటి కంటె ఎక్కువగా జానపదులు మెచ్చిన అలంకారం, 'ఎంతగా సంస్కృతాంధ్రాది ప్రౌఢ సాహిత్యముల పుక్కిట బట్టినను చక్కని దేశీయపు పలుకుబళ్ళతో దేశీయచ్ఛందములందు సూటియగు మాటలతో అల్పాక్షరముల ననల్ప భావ సంపదను వెలార్చు జానపద గేయములు సహృదయ హృదయాహ్లాద కరములై పండిత పామర రంజకములై యొప్పుచున్నవి.'[1] అనుమాట సత్యము.

వ్యావహారిక భాష : జానపద గేయాలలో వాడబడేది వాడుక భాష. కొన్ని చోట్ల అది శిష్టవ్యావహారికం కూడా కాదు. గ్రామ్యమే. ఆ భాషను వ్యాకరణ దృష్టితో చూచే అధికారం మనకు లేదు. వ్యాకరణ విరుద్ధమైన పదాలు, సంధులు, సమాసాలు, ఈ పాటలలో ఉంటాయని వేరే చెప్పనక్కరలేదు. అందువల్ల కొన్ని సార్లు జానపదగేయాలను అర్థంచేసుకోడం కూడా కొంత వరకు కష్టమే అవుతుంది.

పల్లెవారి పలుకుల్లో కొన్ని అక్షరాలు వికార రూపాన్ని పొందుతాయి. 'చి'కి బదులు 'సి' పలుకుతారు. వెంకయ్య-ఎంకయ్య అవుతాడు. 'దమ్ము నేసిన సేలల్లో' 'ఇడదీసి' 'పనిసూసి' 'ఎళ్లు' 'కుండలో వుండే సిన్నోడా' 'సెట్టుమీద' 'మంచి నీళ్ల బాయి కాడ' మొదలైన చోట్ల ఈ పద వికారం కనిపిస్తుంది.[2]

పేపరు కాయితం, కలం పేనా మొదలైన పదాలు జానపదుల నోటిలోనే మనకు వినిపిస్తాయి. అలాంటిదే తేజీగుఱ్ఱం.

"కొమ్ముల పొట్లికి తేజీ గుట్టం
తేజీ గుట్టమ్‌కి పట్ట పేణిగి"[3]

మిశ్ర సమాసాలు కూడా జానపద గేయాలలో ఎక్కువగానే కనిపిస్తాయి. 'అతికీ చక్కాన బొమ్మా అందరికీ ముచ్చట సుమ్మా' (త్రివేణి, పు. 31). 'అతికీ చక్కాన బొమ్మ', అనేది 'అధిక చక్కని బొమ్మ' అనేదానికి రూపాంతరం. 'అధిక'ను 'అతికీ' చేశారు జానపదులు. కొన్ని సంస్కృత పదాలను జానపదులు పలక లేక అపభ్రంశరూపాలుగా చేస్తారు. అలాంటిదే 'కాకచ్ఛరాముడు' అనే మాట.

'కంసల్లి తనయూడ కాకుచ్ఛరాముడా' (త్రివేణి, పు. 50). దీనిలో 'కౌసల్య', 'కంసల్లి' అయింది. 'కాకుత్సరాముడు' కాకుచ్ఛ, రాముడయ్యాడు.

జానపద గేయాలలో పదాలు, వాక్యాలు ఎన్నో రకాలుగా ఉంటాయి. వాటిని వ్యాకరణబద్ధంగా లేవని మనం నిరసించడానికి వీలులేదు. వాడుకలో ఉండే కొన్ని పదాలను జానపదులు వాడిన తీరు ఈ క్రింద తెలుపబడింది.

'కూడు కలిగీన సిన్నోడా' (త్రివేణి, పు. 8) అన్నమనడానికి పల్లె వారు 'కూడు' అంటారు. 'మంచి నీళ్ళబాయి కాడ ముంచిరాక' (త్రి. పు. 13) దగ్గర అనేదానికి 'కాడ' అని అంటారు. 'అది ఎందు కుంటుంది' అనేందుకు రాయల సీమలో 'అది ఏల ఉండీని' అంటారు.

"అదే లుండీని చినిగి పోక
వాడేలుండీని కొట్టుకోక
నేనాలుండీను మొత్తుకోక"[4]

'తేజీగుట్టమ్‌కి పట్టపేణిగి' (త్రి పు. 14)
ఏనుగకు ఏనిగ, ఏనిగి, ఏణిగి అనే పదాలు రాయలసీమలో వాడుకలో ఉన్నాయి.

'అవి యేగుతున్నయి పొప్పులు' (త్రి. పు. 21). (వేగుచున్నవి పప్పులు అనడానికి).

బిందు పూర్వక చకారమునకు బదులు ద్విత్వం రావడాన్ని చూడవచ్చు.

"మా తాత తొగిచ్చిన మంచినీళ్ళబాయి
మానాయన కట్టిచ్చిన నందన్నబాయి"

తవ్వించిన, కట్టించిన అనేవి రూపాంతరం పొందాయి. పరమేశ్వరుణ్ణి 'పరమేసురుడ'ని, హనుమంతుణ్ని 'అనుమంతరాయడ'ని కూడ అంటారు.





'అయిదు అనుమంతరాయడు........
పండేండు పరమేసురుడు' (త్రివేణి పు. 25).

హారతి అనే పదానికి అరతి అని కూడా అంటారు. అదే అర్తి కూడా అవుతుంది.

"అపరంజి పళ్లెంలొ ఆర్తి పట్టీరి" (త్రివేణి, పు. 35).

క్త్వార్థకేకారమునకు సంధికావడం జానపద గేయాలలో మామూలు. తోలి+అంపె=తోలంపె అయింది.

"అక్కలకు తోలంపె తమ్ముడెరి స్వామి"(త్రివేణి, పు. 91).

కొన్ని పదాలు వికృతంగా తయారవుతాయి. అనసూయ 'అనసా' అవుతుంది. వెన్నెల ఎన్నీల అవుతుంది.

ఎన్నిల గాయంగ ఏరుపారంగ.....
బిడ్డ పుట్టిందని చెప్పంపు అనసా" (తెలంగాణా పల్లె పాటలు, పు. 106).

"కనక గద్దె మీద కవలక కూర్చుండి" (పల్లెపదాలు)

మొదలైన చోట్ల మిశ్ర సమాసాలు వాడ బడ్డాయి. 'కూడు' అని అన్నానికి వాడుతారు అయితే చిన్న పిల్లలతో మాట్లాడేటప్పుడు 'బువ్వ' అంటారు. "కంచంలో బువ్వెట్టుకొని" (పల్లెపదాలు).

అన్యదేశ్యములు :- అన్యభాషా సంపర్కం వల్ల ఎన్నో కొత్త మాటలు వచ్చి చేరుతాయి జానపదులు చేసేకొన్ని అనువాదాలు శిష్టుల వాటి కంటేగూడ మనోహరంగా ఉంటాయి. సజీవ భాషకు వికాసం ముఖ్య లక్షణం. ప్రతి జీవద్భాష కూడా పుట్టుక సమయంలో అల్పమై ఉన్నా కాలక్రమంగా పెరిగి సువిశాలమవుతుంది. అన్యభాషా సంపర్కం కూడా భాష పెరగడానికి చాలా వరకు కారణమవుతుంది. ఇది తెలుగు కన్నడాలకు మాత్రమే కాక ప్రపంచ భాషలన్నిటికీ వర్తించే మాట. సంస్కృత భాషలో కూడా ద్రావిడ శబ్దాలనేకం ఉన్నాయి. ద్రావిడ భాషలకు-ముఖ్యంగా తెలుగు కన్నడాలకు-సంస్కృతంవల్ల జరిగిన మేలు చెప్పనక్కరలేదు. తెలుగులో సంస్కృత ప్రాకృత శబ్దాలతో బాటు ఇతర దేశ భాషా పదాలు కూడా అసంఖ్యాకంగా చేరిపోయాయి. మహమ్మదీయులు దక్షిణ దేశాన్ని పరిపాలించడం వల్ల వాళ్ల పదాలూ చేరాయి. ఆంగ్లేయుల ప్రభుత్వం వచ్చిన తర్వాత ఆంగ్ల పదాలు ఎక్కువగా చేరాయి. నైసర్గికంగా కూడా ఈ పదాల చేరికలో మార్పు కనిపించవచ్చు. తెలంగాణా ప్రాంతపు పాటలలో ఉర్దూ పదాలు ఎక్కువగా కనిపిస్తాయి. చిత్తూరు మొదలైన చోట్ల తమిళ పదాలు,

సాగర ప్రాంతంలో ఇంగ్లీషు పదాలు, మైసూరు సరిహద్దులో కన్నడపదాలు కనిపిస్తాయి. తత్సమ తద్భవ దేశ్య గ్రామ్యములని వైయాకరణులు విభజించారు. వీటిలో పరభాషా పదాలు దేశ్యం క్రింద చెప్తారు. తత్సమ తద్భవాలంటే సంస్కృత ప్రాకృతాలకు సంబంధించినవి. అవి కూడా ద్రావిడ భాషలకు పర భాషా పదాలే కాని వాటిని వేరు చేయలేనంతగా మన భాషలలో చొచ్చుకొని పోయాయి. ఇక మిగిలినవి దేశ్యంక్రింద వచ్చే అన్యదేశ్యాలు. ఈ అన్యదేశ్యాలు ఎన్నో రూపాలతో కనిపిస్తాయి. కొన్ని వాటి అసలైన అర్థాన్ని వదలి వేరు అర్థాన్ని సంతరించుకున్నాయి. ఇలాటి వాటిని కవులు అర్థ మాధుర్యాన్నెరిగి తగినట్లుగా తీసుకుంటారు.

"అన్య దేశ్యంబులను, సంస్కృతాది పూర్వ
వాఙ్మయస్థ శబ్దంబులన్, పాటెరింగి
నుడి కరింతురు జాను తెనుంగునందు;
మధురిమార్ధ గౌరవముల్ ప్రమాణములుగ
ఇరుగు పొరుగు సీమల లోన నింపులొలయు
పలుకులను జాతి సానల పలక దీర్చి
తెనుగు బంగారు తీవె సూత్రింతు రెలమి
చేతనాహ్లాద రమణీయ చిత్రరచన" (అను-1-107).

జవాను మొదలైన పదాలు ఆంధ్ర దేశమంతటా వాడుకలో ఉన్నాయి. అలాంటివి జానపద గేయాలలో కూడా ఎక్కువగా కనిపిస్తాయి. 'అవి మా దొరగారి దోర జమానె బాపూ' (తెలం.పల్లెపాటలు-పు.69).

అలాంటిదే కచ్చేరి అనే పదం కూడా.

"చే కొని రాజ కచేరుకె పోవాలె" (తె.ప.పాటలు.94)

ఈ రెండు పదాల లాగానే చీటి అనే పదం కూడా తెలుగులో వాడుకలో ఉంది. ఇది రెండు రకాలుగా ఉంటుంది. ఇంగ్లీషులో 'chit' అంటే చిన్న కాయితం మీద 'a small note' అనే అర్థంలో ఉంది. హిందీలో చీటి అంటే జాబు. ఈ క్రింది చరణంలో జాబు అనే అర్థంలో చీటి ఉపయోగించబడింది.

'మాటవినకుంటే ఈ చీటి చూసుకొమ్మన్నడు' (తెలం.పల్లెపాటలు-పు.212)

బాజు అంటే హస్త భూషణములని ఉర్దూలో అర్థం. ఇదీ కొన్ని చోట్ల వాడబడింది. 'ఇందుముఖి నీ చేతుల కందమగు పైడి బాజు (తెలం.ప.పాటలు-121).

కొన్ని నిందా వాచకాలు ఉర్దూనుంచి వచ్చాయి.





ఆత్తేరి, ధూత్తేరి అనేవి అలాంటివే.

'ఆత్తేరి పూలు ఎక్కడివే భామ
ధూత్తేరి పూలు ఎక్కడివే భామ"

ఇంకా ఇలాంటివి కొన్ని.

'గురుగు మట్టేల మీద గొలుసులుంటే సోకే' (తెలంగాణా పల్లెపాటలు,పు.188)
'కాతా దర్మాన పనలేమక్కె' (తెలంగాణా పల్లెపాటలు,పు.188)
'షోకేల నని తన్నేదే సిరిసిరిమువ్వ' (తెలంగాణా పల్లెపాటలు,పు.188)
'ఎన్నాళ్లో ఈ బంధికానాలు మా కెన్నాళ్లో'(తెలంగాణా పల్లెపాటలు,పు.188)
'పైస తమాషా చూపర బాబూ'(తెలంగాణా పల్లెపాటలు,పు.188)
'సేబాసు కురవాడా సెవులా పోగుల వాడ'(తెలంగాణా పల్లెపాటలు,పు.188)
'మునసబు గారింటి కాడ ముందల దరవాజు కాడ'
(తెలంగాణా పల్లెపాటలు,పు.188)
'సాంబశివుడు నిను పిలువనంపినడు జల్దిగరమ్మంట'
(తెలంగాణా పల్లెపాటలు,పు.188)

హిందూస్థానీ పదాల తర్వాత ఎక్కువగా వాడుకలో ఉండేవి ఇంగ్లీషు పదాలు. ఇంగ్లీషు వారి పరిపాలన తర్వాత ఎన్నో ఆంగ్ల పదాలు జానపదులలోకి కూడా చొచ్చుకుపోయాయి. కొన్ని ఆంగ్ల పదాలను తమకే విశిష్టమైన రీతిలో అనువదించుకుంటారు వాళ్లు. కిరసనాయిల్‌ను కిరసనాలు అంటారు.

'పొరుగూరి రెడ్డి కిరసనాలు బుడ్డి' (త్రివేణి.పు.21). 'గేటు' అనేది కూడా మరొక పదం లేదు అనేంతగా తెలుగులో వాడు కయ్యింది. 'హన్మకొండ గేటు కాడ గేటు మైసమ్మకాడ' (త్రివేణి.పు.162) అలాంటివే సబ్బు, మోటారు, సర్కారు, కారు మొదలైనవి.

'దండూరి మోట రెలుగు' (మోటారు వెలుగు-త్రివేణి-163)
'అస్తారి సబ్బుదెస్తి' (త్రివేణి-162)
'సర్కారి పైకం గడుతా' (త్రివేణి-163)
'చీరాల పేరాల చిన కారు పెద్దకారు' (త్రివేణి-169)

కొన్ని ఇంగ్లీషు పదాలను జానపదులు వాడుకునే తీరు చాలా బాగుంటుంది. సైకిలును శిష్టులు 'ద్విచక్రశకటం' అనమంటారు. కాని సైకిలు అనేదే వాడుకలో ఉంది. 'బైసైకిల్'నే బైసుకోలు అంటారు.

'బైసుకోలు తొక్క బోకోయ్' (త్రివేణి-201)

'తొక్కేసైకీలు బాయె' (త్రివేణి-266)

ఇలా నిత్య జీవితంలో అలవాటయి పోయిన ఆంగ్ల పదాల సంఖ్యాకంగా ఉన్నాయి. అవే పల్లెపాటలలోకీ ఎక్కాయి. అలాంటివి కొన్ని

'కారూ చీకటిలోన గుప్పుగుప్పున రైలు' (త్రివేణి-256)

'పోలీసు లొచ్చారు పొలిమేర్లాదిగినారు' (త్రివేణి-259)

'పర్లి టేనన్ కాడ మనమంది వుంటరంట' (తెలం.ప.పాటలు-177)

'చల్ల పల్లి రోడ్డు మీద' (పల్లెపదాలు)

'కట్ట మీద బోతవుంటే 'కలకటేరను కుంటిర' (పల్లెపదాలు)

'పౌడరేసు కుంటేను సిరిసిరిమువ్వ' (పల్లెపదాలు)

**జాతీయములు-నానుడులు-సామెతలు మొ॥వి :**

జాతీయములు, నానుడులు, మాండలికములు, సామెతలు మొదలైనవి భాషయొక్క జాతీయ సంపద అనవచ్చు. భాషయొక్క ప్రత్యేకతను తెలిపేవివి. సామెతలు అన్నిభాషలలో ఉన్నాయి. జీవితానుభవాలను సూత్రప్రాయంగా కుదించి చెప్పేవి సామెతలు. అల్పాక్షరాలలో అనంతార్థము కలిగి ఉండేవివి.

కొన్ని సామెతలలో లోకానుభవమంతా దాగివున్నట్లుంటుంది. మరి కొన్నిట్లో సునిశిత హాస్యముంటుంది. ఎంతోమంది నోటి నిండా సామెతలుంటాయి. జానపదుల నోళ్లలో మరీను. లోకానుభవం ఎక్కువకల కవులే శిష్ట సాహిత్యంలోను సామెతల్ని ఎక్కువగా ప్రవేశ పెట్టారు. జానపద గేయాలలో కూడా అక్కడక్కడ సామెతలు కనిపిస్తాయి.

పలుకుబళ్లు, జాతీయాలు, నానుడులు జానపదగేయాలలో కోకొల్లలుగా కనిపిస్తాయి. ఒక జానపద స్త్రీ కపటం లేని అమాయక హృదయంతో శివుణ్ణి కూడా తిడుతున్నది. ఆలిమీద పెళ్ళి ఆడినప్పుడు శివుడైనా ఆమెకు లెక్కలేదు.

'చేటుకాల మద్ర శంకరుడ నీకు
ఆలిమీద పెండ్లి యెట్లాడి నావు' (పల్లెపదాలు)

'చేటుకాల మద్ర' అని అడగడం చక్కని పలుకుబడి. కొన్ని పదాలకు కొత్తకొత్త అర్థాలుంటాయి పల్లె భాషలో. దేశం వెళ్లాడు అంటే పల్లెటూరి వారి భాషలో దూర దేశానికి వెళ్లాడు అని.

'దేశమెల్లిన మీ అన్న తిరిగి రాలేదు' (పల్లెపదాలు)





ఎవరికోసమైనా ఎక్కువ సేపు ఎదురు చూస్తాము. అప్పుడు 'చూచాను' అంటే పస ఉండదు. అందువల్ల చూచి చూచి కళ్ళు కాయలు కాచాయంటారు. 'సూసీ సూసీ కళ్లు కాసినై కాయాలు' (పల్లెపదాలు) 'ఏకులా వుంటేవాడు మేకై కూర్చున్నాడ' నేదిమంచి సామెత. కయ్యానికి కాలు దువ్వాడనేది మంచి జాతీయం. ఈ రెంటినీ జోడించాడొక జానపదుడు.

ఏకువలె మెత్తంగ నెరుగ నట్లుండి
మేకురీతిని బిగిసి మేలుకొనియుండు
కయ్యంబునకు ముందు కాలుదువ్వుచును

కలిగిన కంట్లో కాటుక బెడితే మరెవరికన్నో మెర మెర లాడిందని ఎంత చక్కని సామెతను చెప్తున్నారో జానపదులు! 'కలిగిన కంట్లో కాటు బెడితే నాకన్ను మెర మెర లాడె రొయ్యో కొయ్యోడ (పల్లెపదాలు) ఎదిగిన పిల్లను ఇంట్లో బెట్టి బయట మంచం వెయ్యకూడదని చెప్పడంలో శృంగారార్థము, ఇంకా ఎన్నో గూఢార్థాలున్నాయి.

'ఎదిగిన పిల్లను యింట్లో బెట్టి బైట మంచం ఎయ్యకురో' (పల్లెపదాలు). మూణ్ణాళ్ళ ముచ్చట అన్నది చక్కని జాతీయం. 'మూణ్ణాళ్ళ ముచ్చటకు మురిసేవు దిరిసేవు' అంటారు తత్వాన్నెరిగిన జానపదులు.

కొన్ని ధ్వన్యనుకరణలు కూడా వాడుకలో ఉంటాయి. బిల బిలమని మనుషులు వచ్చారనేది, పుల పుల వాన వచ్చిందనేది, రవరవ గాలి విసరిందనేది ఇలాంటివి.

'పుల పుల వానొచ్చె పులు మొగ్గదొడిగె
రవ రవ గాలిసరె రాలె మల్లెల్లు' (త్రివేణి-36)

కాకులు దూరని కారడవి అనేది 'అతి చక్కని' జాతీయం. ఇది ఈ క్రింది దానిలో ఉంది.

'కాకులు దూరవి తుమ్మితీలో
కారడవి దాటేరు తుమ్మితీలో' (త్రివేణి,పు.75)

ఏదైనా పోగొట్టు కుంటే గంగ పాలైపోయిందని చెప్పడం మామూలు. రంగూనుకు పోయి దెబ్బతిన్న ఒకడు ఇలా అనుకుంటున్నాడు.

"రంగూను లాభాము సిరిసిరిమువ్వా
అయ్యోగంగ పాలు చేసేను సిరిసిరిమువ్వా"

కొన్ని గేయాలనిండా సామెతలే ఉంటాయి ఒక అత్త ఇలా అనుకుంటున్నది.

'పండు గొచ్చితేను పిండికే చేటు

అల్లుడొచ్చితేను అత్తకే చేటు
పండుక్కి పది పొయ్యి పిండికెయి బొయ్యి
ఎవరు రాక పోతే యేదుమ్మ పొయ్యి' (త్రివేణి.పు.69)

ఊరు పక్కన చేను ఉండరాదట. బావి ఎంతలోతో దిగిచూస్తేగాని తెలియదట. ఏరెంత దూరమో ఈది చూడ వలెనట. తను చెప్ప బోయే విషయాలను సమర్థించుకోడానికి ఒక్కొక్క మాటకు ఒక్కొక్క సామెతను చేర్చి అనుభవంతో చెప్తున్నాడొక జానపదుడు.

'ఊరు పక్కా చేను ఉడుతలా పాలు
బావల్ల మీదికి వన్నీ యకన్నా
బాయెంతలోతో దిగి చూడన్నా
యారాండ్ల మీదికి నన్నీయ కన్నా
యేరెంత దూరమో ఈది చూడన్నా
మరదుల మీదికి నన్నీయ కన్నా
మడుగెంతలోతో దిగి చూడన్నా
సౌతుల మీదికి నన్నీయ కన్నా
సౌంద్రమెంత దూరమో, ఈది చూడన్నా'[5]

కొన్ని గేయాలు అసలు సామెతలు, పలుకు బళ్లతోనే నిండి ఉంటాయి. ఇవి అనుభవజ్ఞుల మాటలు. వీటిలో కల్పన కాదు కనిపించేది. అనుభవాలు, భావాలు సూటిగా హృదయాన్ని తాకుతాయి.

"కాని వారి తోను కావించు చెలిమి
కట్టి విరిచీ పొయిని పెట్టినట్లుండు
అయిన వారీతో కావించు చెలిమి
ఆకు మడచీ మడత పెట్టినట్లుండు
కాని వారీ మాట కంట్లోది నలుసు
ప్రాణం పోయిందాక పక్కలో పోటు
అయిన వారీ మాట అమృతంపు తేట
బ్రతికి ఉన్నందాక భాగ్యంపు మూట
ఉన్నవూరు విడిచి ఉండనే లేము
కన్న తల్లిని విడిచి ఘడియుండ లేము





బియ్యమ్ము తెల్లన్న పిండి తెల్లన్న
వరుస దప్పిన వాని వలికి తెల్లన్న........
ఆయుస్సు మూడినను ఆకు చిరిగినను
బ్రతికించు వారెవరు? అతుకు వారెవరు?
ఉన్న ఊరేనాకు చెన్న పట్నమ్ము
కన్నతల్లే నాకు కల్పవృక్షమ్ము
చిమడకే చిమడకే ఓ చింతకాయ
నువ్వెంత చిమిడినా నీ పుల్లపోదు
ఉడకకే ఉడకకే ఓ ఉల్లిపాయ
నువ్వెంత ఉడికినా నీ కంపుపోదు"[6]

అలంకారములు : అలంకారాలు కవితాలతాంగికి అలంకారాలు. 'కావ్య శోభాకరాన్ ధర్మాన్ అలంకారాన్ ప్రచక్ష్యతే' (దండి-కావ్యాదర్శము). అలంకారాలు అసంఖ్యాకంగా పెరిగిపోయాయి. కాని ఉపమాలంకారమే సర్వాలంకారాలకు బీజము. కొన్ని అలంకారాలు, ముఖ్యంగా జానపదులవి, అత్యంత సహజంగా ఉంటాయి. కొన్ని అలంకారాలు వాడబడుతుంటాయి. ఉపమ, రూపకము, దృష్టాంతము వంటివి, కొన్ని శబ్దాలంకారాలు తెలియకుండానే జానపదుల నోటినుంచి వెలువడుతుంటాయి. ఇవన్నీ సహజాలంకారాలు. "అందమగు స్త్రీకి నొసట తిలకమువలె, కొప్పులో నొక బంతి పూవువలె ముక్కునకు ముక్కరవలె, చెవులకు పోగులవలె నీ సహజాలంకారములు జానపద గేయ సాహిత్యమునకు శోభను గూర్చునట్టివి. ముత్యాల కంఠసరులు, కేయూరములవంటి భూషణములు జానపదుల కుండనటులే వారి భాషయందు, గేయములందును అపురూపములగు నలంకారములుండవు'.[7]

జానపద గేయాలలో అక్కడక్కడ చక్కని ఉపమానాలుంటాయి. అవియే అలంకారాలని లక్షణం ప్రకారం జానపదులకు తెలియదు. తెలియకుండానే వాళ్లు చెప్పేయీ అలంకారాలు అత్యంత సహజంగా ఉంటాయి.

"చుక్కల్లో చంద్రుడమ్మ మా పెండ్లి కొడుకూ
చుప్పనాతి దానవమ్మ పెండ్లికూతుర'[8]

చంద్రుడు జానపదులకు, శిష్టుకు ఇద్దరికీ ఇష్టుడైన వాడే. చుక్కల్లో చంద్రుడితో పోల్చడం చాలా సహజంగా ఉంది. ఎంతోమంది పెళ్లి కొడుకులుండవచ్చు. వాళ్లంతా చుక్కల్లా మినుకు మినుకు మనేవాళ్లు మాత్రమే. అందరిలోకి అందమైన ఈ పెళ్లి

కొడుకును చంద్రుడితో పోల్చడం అత్యంత సహజమైన ఉపమానం.

ఈ క్రింది విసరురాతి పాటలో ఒక స్త్రీ కొన్ని అలంకారాలను సమకూరుస్తున్నది. వాళ్ల అన్నను తలచు కుంటున్నదామె. వాళ్ల అన్న మిట్ట మధ్యాహ్నం ఉరుకులు పరుగులతో గుఱ్ఱం మీద వచ్చాడు. అతనికి చెమట పట్టింది, చెమట ముత్యంలా కనిపించింది. ఎదమీద పతకము పడగల్లా ఉన్నాయి.

"ముక్కునా సెమటలూ ముత్యమై మెరిసే
యెద మీద పదకమూ అద్దమై మెరిసే
బంగారు జులపాలు పాము పడగల్లు
చేరెడు కన్నుల్లు చింత నిప్పుల్లు'[9]

మరో పూర్ణోపమచే అలంకృతమైన నూర్పిడి పాట ఒకటుంది. దీనిలో కమ్మరి కొలిమిని వర్ణిస్తున్నాడు జానపదుడు. రత్నాల పందిట్లో ఉంది ఆ ముత్యాల కొలిమి ఆ కొలిమి తిత్తులు, సమ్మెట్లు, రవ్వలు అంతా వర్ణనీయాలయ్యాయి.

"ఊదేటి తిత్తులూ ఉరుములా బోలు
వెసేటి సమ్మెట్లు పిడుగులా బోలు
లేచేటి రవ్వలు మెరుపులా బోలు
చుట్టున్న కాపులా చుక్కలా బోలు
నడుమ కమ్మరి బిడ్డ చంద్రుణ్ని బోలు"[10]

మరొక గేయంలో అన్నా చెల్లెళ్లకు సంవాదం జరుగుతున్నది. అన్న తన భార్య అందాన్ని మరీమరీ పొగుడుతున్నాడు. అన్నీ వదినను గురించిన వర్ణనలే.

"…..తొడిమె చక్కని పండూ తొడమీద బడెనూ
ఈ పండు ఎవ్వరినీ బోలు అన్నయ్యా
ఈ పండు మీవదినే మొకమునూ బోలూ
మొగ్గ ఎవరిని బోలూ అన్న రఘురామా
ఈ మొగ్గా మీ వదినే కను బొమలూ బోలూ
పిందె ఎవరిని బోలు అన్న రఘురామా
ఈ పిందే మీ వదినె పలువరుసా బోలూ
కాయె ఎవరిని బోలు అన్న రఘు రామా
ఈ కాయె మీ వదినె కన్నులా బోలూ'[11]

ఇలాంటివే కాక కొంత ప్రబంధాదుల జ్ఞానం ఉండే వాళ్ల పోలికలు మరో





విధంగా ఉంటాయి. అయినా వాటిల్లో కూడా జానపదుల హృదయం కనిపిస్తూనే ఉంటుంది. అయినా వాటిల్లో కూడా జానపదుల హృదయం కనిపిస్తూనే ఉంటుంది. ప్రియుడు పెడ మొగం పెట్టాడు. అతన్ని మంచి చేసుకోడానికి కలహాంతరిత ప్రియుణ్ని అనునయిస్తున్నది. 'ఎందు కలిగి నావురా నాసామీ, నిన్నెందుకు నేను అలా అన్నానురా, ముందంతా నేను చేసిన బాసలెక్కడ పోయినవిరా' అంటూ బాధ పడుతున్నది. ఆ తర్వాత తన్ను తాను వర్ణించు కుంటున్నది, ప్రియుని వేడుకొంటున్నది. ఇది ఒక జావళీలా ఉన్నది.

"పచ్చి కొబ్బరి వాలె పాయామున్నది సామీ
పాయా మెవ్వరి పాలు జేతూర జాణా
చెరకూ తుంటల వాలె చేతులున్నవి సామీ
చేతూ లెవ్వరి మీదా యేతూర జాణా
అరటీ బొందెలు వాలె తొడలూ వున్నవి సామీ
తొడలూ యెవ్వరి మీదా యేతూర జాణా
నిమ్మ పండుల వాలె రొమ్ముూలున్నవి సామీ
రొమ్మూ లెవ్వరి చేతీ కిత్తూర జాణా"[12]

శబ్దాలంకారాలు కూడా కొన్ని గేయాలలో కనిపిస్తాయి. ఎక్కువగా అనుప్రాసలు, ముక్తపదగ్రస్తాలు ఉంటాయి. కొన్ని పిల్లల పాటలు ప్రశ్నోత్తరాల రూపంలో ముక్తపదగ్రస్తంతో ఉండి పిల్లల ధారణా శక్తిని, పదయుక్తిని పెంపొందింప జేస్తాయి. ఈ క్రిందిదలాంటిది.

| | |
|---|---|
| "పిట్టమ్మా పిట్ట | ఏమిపిట్ట |
| చిలక పిట్ట | ఏమి చిలుక |
| తెలుపు చిలక | ఏమి తెలుపు |
| హంస తెలుపు | ఏమి హంస |
| రాజ హంస | ఏమి రాజు |
| మృగరాజు | ఏమి మృగము |
| వన మృగము……"[13] | |

## కన్నడం

వాడుక భాష : కన్నడంలో వ్యావహారికమనే పదాన్ని మనం ఉపయోగించే అర్థంలో ఉపయోగించరు. వ్యాపారానికి సంబంధించిన దాన్ని వ్యావహారిక మంటారు. అందువల్ల కన్నడంలో వాడుక భాష అనడం మంచిది. అసలు కన్నడంలో గ్రంథస్థ భాషకు (పాత కన్నడం కాదు) వాడుక భాషకు ఎక్కువ భేదం కనిపించదు. వాడుక భాషనే కొద్ది మార్పుతో కన్నడిగులు వ్రాతలో ఉపయోగిస్తారు. అయితే పామరులు మాట్లాడే భాషలో భేదం కనిపిస్తుంది. జానపద గేయాల భాష పామరుల భాషే కావడం వల్ల అది మామూలు భాషకంటె కొంత భిన్నంగా ఉంటుంది. అసలు కన్నడంలో కొన్ని సమాసాలు మొదలైనవి తెలుగు కంటె భిన్నంగా ఉంటాయి. మనం దుష్ట సమాసాలని విసర్జించేవి వాళ్లు స్వీకరిస్తారు.

బెళగాగి నానెద్దు యార్యార నెనెయాలి
ఎళ్ళు జీరిగె బెళెయాళ భూతాయ
ఎద్దొందు ఘళిగె నెనెదేను

దీనిలో 'భూతాయి' అనేది చక్కని సమాసం. సంస్కృత కన్నడ పదాలు కలిసినది. తెలుగులో 'భూతల్లి' అనే పదం విచిత్రంగా కనిపిస్తుంది. కాని కన్నడిగులకు అత్యంత సహజంగా కనిపిస్తుంది. ఇలాంటివి కన్నడిగులు మామూలుగా వాడుతూనే ఉంటారు.

ఇక పదాలు వాక్యాలు జానపద కవితలో వివిధ రూపాలను ధరిస్తుంటాయి. కొన్నిటిని పలక లేక జానపదులు మారుస్తుంటారు. కొన్నిటిని అందంగా మలచుకుంటారు. మరి కొన్నిటిని తమకు తోచిన విధంగా పలికేస్తారు. 'శోభిసుత్త' (శోభించుచు) అనే పదం జానపదుల నోటిలో 'సోబస్త' అయింది.

"పరి పరి సోబస్త పరిమళ నేరస్త
మతియ పాలిసొా ఎనగ"[14]

పైదానిలోనే 'ఏరిసుత్తేనె' అనే పదం 'ఏరస్త' అయింది.

ఇలా సౌలభ్యం కోసమో లేక నోరు తిరగకనో పెక్కు సంస్కృత పదాలను, కన్నడ పదాలను జానపదులు మారుస్తుంటారు. ఏరిహరు, కట్టిహరు మొదలైన వానిని యీక్రింది గీతంలో ఏర్యావ, కట్యార అనేస్తారు పల్లెవారు.





"అక్కిపూజి బ్యాళి పూజి మ్యాల ఎలియ ఘట్టపూజి
నిత్యపూజి కట్యారేళయ్య సిద్ధరామా
నిమగ పూజి కట్యారేళయ్యా
కెంపగంధా బిళియగంధా అష్టగంధా సిరియగంధా
ఛెందదింద ఏర్యావేళయా, సిద్ధరామా
ఛెందదింద ఏర్యావేళయ్యా'[15]

'చందము' అనేది పై పాదంలో 'ఛెందము' అయింది.

సంస్కృతం నుంచి మనకు వచ్చిన తద్భవాలు మొదలైనవి జానపదుల మూలంగానే యేర్పడ్డాయి. అవి ఎలా వచ్చాయి అనే దానికి ఎన్నో కారణాలను వెదుకుతారు శాస్త్రకారులు. అనువాదాలను చేసేటప్పుడు గాని, తద్భవాలను సృష్టించేటప్పుడు గాని జానపదులలో గమనింప వలసినది మెజారిటీ వాదం'. ఎంత మంది ఎక్కువగా ఏ పదాన్ని ఉపయోగిస్తారో అదే పల్లెటూరివారిలో రూఢి అయిపోయింది. ఇలాగే ఎన్నో నూతన పదాలు ఏర్పడుతాయి.

'నైవేద్యం' అనే దాన్ని ఒక జానపదుడీ క్రింది చరణంలో 'నేవుది' చేశాడు.

"నిమగ నేవుదీ బందా వేళయ్యా సిద్ధరామా
నిమగ నేవుదీ తోర్యారేళయ్యా"[16]

కొన్ని కొన్ని పదాలు వికృత రూపాన్ని పొందుతాయి. ఇది జానపదులకు భాషాజ్ఞానం లేక పోవడంవల్ల, నోరు తిరగక పోవడం వల్ల జరుగుతుంది. ఈ క్రింది చరణాలలో 'నింతిద్దానె' (నిలిచి ఉన్నాడు) అనేందుకు 'నింతాన', అని 'అవనదే వంశ' (వానిదే వంశం) అనేందుకు 'ఔందే అంస' అని,'భజనెగళు'(భజనలు)అనేందుకు'భజనిగోళు' అని అన్నారు జానపదులు.

కొన్ని కొన్ని పదాలు వికృత రూపాన్ని పొందుతాయి అనేందుకు ఈ క్రింది వన్నీ ఉదాహరణలే–

'ఇట్టీగి కల్లమ్యాల ఊరి వింతానెరదు పాద'
'హగల ఇరళ భజనిగోళు
అవందే అంస మృదుంగతాళ'

తెలుగు పాటల్ని గురించి చెప్పేటప్పుడు వాడు–ఆడు, వెంకన్న, ఎంకన్న, చెప్పాడు–సెప్పాడు మొదలగు రీతిగా మార్పు చెందుతాయని చెప్పాను. అలాగే కన్నడంలో కూడా అవుతాయి. ఈ క్రింది చరణంలో–

'తిలక బొట్టు' 'టిళక బట్ట' అయింది.

'టిప్పి గీలింగ కార టిళక బట్ట చంద్రతారా'

ఇలాంటివే మరికొన్ని

'కరి ఈరభద్రన కరణ నోపి పూజగోళ బన్నె' వీరభద్ర అనుటకు ఈరభద్ర

'ఎల్లక హెచ్చిందు బెల్లపత్తురి నూరు'

బెల్ల పత్తురి అంటే బిల్వపత్ర. తెలుగు పాటల్లో బావి అనేది బాయి అయింది కన్నడంలో 'భాంయి'గా మారింది.

'భాంయాదర కట్ట్యారల్ల అరుటిగ్యాదరిట్టారలను జాణి'

'నాల్వత్త్యాటద ఎలిబంద'

ఇక్కడ 'త్వాట' అనేది 'తోట' వికార రూపం. ఎలి అంటే 'ఎలె' (ఆకు).

'ఖన్ని పార్వతి దేవి ఎణ్ణి పత్తలు డిసి సోబాన పాడ్యారల్ల' ('కన్య' అనే దానికి 'ఖన్ని' అని వాడబడింది.

ఇలా కన్నడంలో మామూలుగా వాడుకలో ఉండే పదాలు జానపదుల నోటిగుండా మరింత వికృత రూపంతో వెలువడుతాయి. ఇలాంటివే యీ పాటల్లో హెచ్చుగా ఉంటాయి. ఇలా చూచినప్పుడు తెలుగు పాటలు కొన్నిటికి, కన్నడం పాటలు కొన్నిటికి ప్రధానమైన ఒక భేదం కనిపిస్తుంది. తెలుగులో గ్రాంథిక భాష ప్రభావం కొన్ని జానపద గేయాలపై కూడా కనిపిస్తుంది. ముఖ్యంగా పౌరాణిక గేయాలలో, స్త్రీల పాటలలో గ్రాంథిక భాష చాలావరకు కనిపిస్తుంది. కన్నడంలో పరిస్థితి తద్భిన్నంగా ఉంది. కన్నడంలో హళగన్నడమని, హెుసగన్నడమని రెండు ముఖ్య భేదాలు కనిపిస్తాయి. హళగన్నడం పంపాది ప్రాచీన కన్నడ కవులు వాడిన భాష. హెుసగన్నడం ఆధునిక భాష. కన్నడ జానపద గేయాలలో కేవలం పామరులు మాట్లాడే భాష చాలావరకు కనిపిస్తుంది. ఈ విషయంలో అన్నిటినీ కాకపోయినా కొన్నిటినైనా కన్నడంతో పోల్చి నపుడు తెలుగు వాటికంటె కన్నడ గేయాలలో పామరుల భాషను ఎక్కువగా చూడ వచ్చునిపిస్తుంది.

సామెతలు-జాతీయములు మొ॥వి : తెలుగులో లాగానే కన్నడంలో కూడా సామెతలు జాతీయములు మొదలైనవి గేయాలలో కనిపిస్తాయి. సామెతలు జానపదులకు చిర పరిచితాలు కాబట్టి అవి గేయాలలోకి కూడా ఎక్కాయి. "యాపకాలు మురిదరూ సొంటక్కె ఊన" (ఏకాలు జారినా తుంటికే మోసం) ఇత్యాది సామెతలు జానపద గేయాలలో భాగాలుగా చేరి వాడబడ్డాయి. ఈ సామెతలు వామన రూపంలో ఉన్నా





త్రివిక్రముని లాంటి అర్థాన్ని కలిగి ఉంటాయి. ఇలాంటి సామెతలు, జాతీయాలు, పలుకుబళ్లు ఒక భాషకు ఆభరణాల వంటివి.

ఒక జానపద స్త్రీ తెల్లవారు జామునసే శివుణ్ని తలచుకుంటున్నది. ఆమెకు కోరినది ఇస్తే నిండుగ ఉంటుందట, మనసుకు నిండుగ ఉంటుందట. 'మనసుకు నిండు'గా వుందనడం తెలుగులోను చక్కని పలుకుబడి. ఇదే కన్నడంలోను ఉంది.

'ముందేను కొట్టీతు మనవేను దణిదీతు

ముంజాన దాన గిరిమల్ల-కొట్టరె

మనెతుంబి నమ్మ మన తుంబి'[17]

కొన్ని కొన్ని పదాలకు అర్థాలు ప్రత్యేకమైనవిగా ఉంటాయి. అసలైన అర్థాలు మారి పోతుంటాయి. దీన్నే అర్థవిపరిణామము అంటారు. నిండుకున్నది, అంటే లేదని, తెల్లగుఱ్ఱ మెక్కి వచ్చాడంటే తాగివచ్చాడనీ ఇలా అర్థాలు ఏర్పడ్డాయి. అలాగే 'నెయ్యెణ్ణె' అంటే చిక్కని నూనె అనే అర్థంలో వాడుతారు. ఇది పెళ్లి కొడుక్కు తల అంటేటప్పుడంటారు.

దేవ దేవ రెణ్ణి యావదేవ రెణ్ణి

మనియ దేవర మొదలెణ్ణి

హర హర నమ సివగ నెయ్యెణ్ణె

అసలు భూదేవి అంటే అర్థం వేరు. జానపదులు కన్నడంలో భూదేవి అంటే పెళ్లికుమార్తె అనే అర్థంలో కూడా వాడుతారు.

'పంచ గూణి చెంచగూణి ముత్తిన నాగురణి

కుసుమల్లి భూదేవిగె'

ఇక్కడ పెళ్లికుమార్తెను భూదేవి అంటున్నారు.

కొందరు చాలాబాగా అరవగలరు. అటువంటి వాళ్ల కంఠస్వరాన్ని కన్నడంలో బ్రహ్మకూత అంటారు.

'బ్రహ్మ కూగు కూగుతానె.......' ఇది కన్నడంలో ఒక పలుకు బడి.

తోటలో ఎన్ని ఉన్నా అరటి చెట్లుండాలంటారు. అది సమృద్ధిని సూచిస్తుంది. అంతే కాదు మంగళకరమూనట! శుభ కార్యాలకు అరటి ఉపయోగం అందరికీ తెలియదు. గంధము, కస్తూరి మొదలైనవి ఎన్ని ఉన్నా వాటిని అనుభవించడానికి పిల్లలు పాపలు ఉండాలి. పిల్లలు లేని జీవితం అరటి చెట్టులేని తోట వంటిది. ఈ చక్కని సామెతను ఈ క్రింది గీతంలో పొందుపరచాడొక పల్లెవాడు.

'బాలరిల్లద బాళ్వి బాళెయిల్లద తోట
గంధ కస్తూరి పరిమళ ఒళగిద్దు
రంభె నీ బాళె ఫలవిల్ల'

కన్నడంలోను అన్యదేశ్యాలకు తక్కువ లేదు. ఉర్దూ, ఇంగ్లీషు పదాలు చాలా కన్నడ గేయాలలో కూడా ప్రవేశించాయి. మహమ్మదీయుల పరిపాలన మైసూరు రాజ్యంలో కూడా సాగింది. అలాగే బ్రిటిషు పాలన గూడా. అందువల్ల తెలుగులో లాగానే కన్నడంలో కూడా ఈ రెండు భాషల పదాలూ ఎక్కువగా చోటు చేసుకున్నాయి.

'ఎంథ బహుద్దూర నోడణ్ణ'

'ఎంథ సరదార నోడణ్ణ' వీనిలో బహద్దర్ సర్దార్ హిందూస్తానీ పదాలు

'ఆంగ్యాగ కస్ కసి, గండా హెణ్తి ఖుస్‌ఖుసి'

అనే చోట 'ఖుసి' అనేది అన్య దేశ్యం

'బారాతేరా వర్షదాగ ఆగ బేకంతార దొడ్డ హిరియర' దీనిలో బారా తేరా అనే హిందూస్తానీ పదాలుపయోగింపబడ్డాయి.

'మజలీగె బందీవి మారి నోడ బ్యాడ్రె' అనే దానిలో మజలీ అనే పదం వాడ బడింది.

అలంకారములు : కన్నడంలోను కొన్ని మరిచిపోలేని ఉపమానాలున్నాయి. తెలుగు వారి కోసం చెప్పిన మాటలు కన్నడం వాళ్ల విషయంలో కూడా నిజమే అవుతాయి. కొన్ని కొన్ని ఉపమానాలు జానపదుల కల్పనాశక్తికి ఉత్తమ ఉదాహరణలు.

'అరగినంథ తాయి మరదంథ మక్కళు
తరగిదరె బెణ్ణె కిళిదుప్పదంథాకి
కరగదంథ తాయి ఇరబేక'

తల్లిని తలచుకొన్నదొక కూతురు. తన తల్లి లక్కవంటిదట, వెన్నవంటిదట, నెయ్యివంటిదట, వాటిలా ఆమె కరుగుతుంది. లక్కతో తల్లిని పోల్చడం అత్యంత ఉచితమైనది. లక్క కరుగుతుంది; మళ్లీ గట్టి పడుతుంది కూడ. అలాగే తల్లి కూడా కూతుర్ని చూచి కష్టపడుతుంది. హృదయం కరుగుతుండగా ఆమె కష్టాల్ని చూచి విలపిస్తుంది. ఆమెది దయార్ద్ర హృదయం. అలాగే ఆమె ప్రేమ కూడా లక్కగట్టి పడ్డట్లే గట్టిపడుతుంది. ఇలా రెండూ కలిసొచ్చేలా చక్కని ఉపమానాన్ని సంపాదించారు జానపదులు.

వదిన రాగానే అన్న, మరదలు రాగానే తమ్ముడు దూరమై పోతారు. అన్నకు





తనకు ఉండే సంబంధాన్ని మరిచిపోలేదు చెల్లెలు, అటు దూరంగానే ఉన్నా అన్నతన హృదయంలోనే ఉన్నాడు. దీనికి అపూర్వమైన ఉపమానాన్ని చెప్తున్నాడు జానపదుడు.

'కణ్ణిగి మూగిగి ఎరడేన అత్తీగి
నా నన్న అణ్ణ ఎరడేన అతిగమ్మ
నిన్నింద అణ్ణ ఎరడాద'

కళ్లు ముక్కుల లాంటి వాళ్లు అన్నా చెల్లెళ్ళు. కళ్లకు ముక్కులకు ఉండే సంబంధం విచిత్రమైనది. అవి దగ్గరనే ఉన్నాయి. ఒకే శరీరంలో ఉండే రెండు అంగాలైనా అవి ఒకటికాలేవు. సన్నిహితంగానే ఉన్నా కొంత దూరం ఉండనే ఉంది. అయితే కళ్లలో నీళ్లుకారితే వాటి ప్రభావం ముక్కు మీద కూడా ఉంటుంది. ఇలా అన్నా చెల్లెళ్ల సంబంధాన్ని కన్నుముక్కుల సంబంధంతో పోల్చడం అత్యంత ఉచితంగా ఉంది.

కొన్ని చోట్ల తాము చెప్పిందాన్ని సమర్థించుకొనేందుకు జానపదులు దృష్టాంతాలను కూడా చూపిస్తారు. భార్య ఎర్రగా బుర్రగా ఉందని సంతోష పడవద్దు. అత్తిపండు కూడా ఎర్రగానే ఉంటుంది, తీసి చూస్తే పురుగుల మయమని హెచ్చరిస్తున్నాడు జానపదుడు. 'మేడిపండు జూడ మేలిమియైయుండు, పొట్ట విచ్చిచూడ పురుగులుండు' అనే పద్యం తెలుగులో కూడా ప్రసిద్ధమేకదా.

'కెంపు హెండతి యెందు సంతోష పడబ్యాడ
అత్తీయ హణ్ణు అతి కెంపు ఇద్దరు
ఒడెదు నొడిదరె హుళ భాళ'

మరొక గీతంలో దాంపత్య విరసాన్ని జానపదకవి ప్రకటిస్తున్నాడు. శత్రువుల మధ్య పచ్చగడ్డివేస్తే భగ్గు మంటుందంటారు. ఇద్దరు దంపతులు తగవులాడుకొంటుంటే గడ్డిపైన నిప్పులాగుంటుందట. రాయి మీద ప్రవాహం పారినట్లుంటుందట. వేపాకు బెల్లం కలిపినట్లుంటుందట.

'మల్లిగియంథ మగళీగి ఎల్లిత్తొ ఒగ్రెంన
హుల్లాగ బెంకి ఒగెధంగ గుడ్డద
కణ్ణీగె ధారి ఎరెదాంగ
ఒల్లద ఒగెతన ఎల్లిత్తో మగళీగి
బెల్లక బేవు కలతంగ అడవ్యాన
కల్లీగి ధారి ఎరెదంగ'

మరో గేయంలో ఒక భక్తుడు విరూపాక్షుతో నీముందు గంగ పాములా ప్రవహిస్తున్నదని అద్భుతమైన ఉపమానం చెప్తున్నాడు.

'హావు హావెందరె హరణవు హార్యావు
హావల్ల హంపె విరుపాక్ష-నిన్న ముందె
గంగె హావాగి హరెదాళు'

మరో గీతంలో తన తల్లిని ఇతరులను పోల్చి చూచి ఒక కూతురు అంటున్నది. 'ఎవరున్నా నా తల్లిని పోలరు. వెయ్యి కొరువులున్నా జ్యోతిని పోలవు' అని. ఇది చాలా మనోహరమైన దృష్టాంతం.

'యారిద్దరు నన్న తాయవ్వన్హోల్యారు
సావిర కొళ్ళి ఒలెయాగ ఉరిదరూ
జ్యోతి విన్యారు హెూలారు'

ఇలాంటి ఉపమానాలు జానపదుల హృదయాష్కరణ చేస్తూ ఆ సాహిత్యం శిష్ట సాహిత్యానికే మాత్రమూ తీసిపోదని నిరూపిస్తున్నాయి.

**టిప్పణి**

1. బి.రామరాజు, తెలుగు జానపద గేయ సాహిత్యము, పు.663
2. పల్లెపదాలు
3. త్రివేణి, పు.14
4. అదే, పు.13
5. అదే, పు.103
6. అదే, పు.315
7. బి.రామరాజు, తెలుగు జానపద గేయ సాహిత్యము, పు.677
8. త్రివేణి, పు.38
9. అదే, పు.56
10. అదే, పు.116
11. అదే, పు.150
12. అదే, పు.185
13. అదే, పు.11
14. మల్లిగెదండె,పు.3
15. అదే, పు.3
16. అదే, పు.4
17. జానపద-1, కర్ణాటక జానపద పరిషత్తు, పు.8





# 12. ఛందస్సు-సంగీతం

ఛందస్సుకు సంగీతానికి నికట సంబంధముంది "శ్రావ్యంగా పాడి శ్రోతల మనస్సు రంజింపజేయడం ఒక కళ. పాడిన పాటలో శ్రోతల మనస్సు రంజింప జేసే లక్షణమేమిటో పరిశీలించి పయికెత్తి చూపడం ఒక శాస్త్రం. పాడడం సంగీతకళైతే పాటలో అంతర్లీనమై ఉన్న ఛందో లక్షణం నిర్దేశించడం సంగీత శాస్త్రమౌతుంది.....సంగీత మెంత ప్రాచీనమో ఛందస్సు కూడా అంత ప్రాచీనమే. అందాకావస్తే ఛందస్సంగీతాలు అవి- భాజ్యాలు, అభిన్నాలు వేదాంగాలుగా చెప్పబడే షడంగాల్లో ఛందస్సు కూడా ఒకటి. శ్రుతికి ప్రాణం స్వరం. స్వరమంటే ఛందస్సే. ఛందస్సు చెదిరిపోతే వేదానికి కాళ్లువిరిగి నట్లు. అందుకే కాబోలు "ఛందః పాదౌతు వేదస్య" అంటుంది పాణినీయ శిక్ష. వేదాన్ని పలికించే స్వర మెటువంటిదో పాటను పాడించే ఛందస్సటు వంటిదే[1] పైవాక్యాలు ఛందస్సు-సంగీతాలకుండే సంబంధాన్ని వైశిష్ట్యాన్ని నిరూపిస్తున్నాయి.

ఛందస్సనే శబ్దం 'ఛది సంవరణే' అనేధాతు జన్యం. 'చందః- చందయతి అహ్లాదయతి చంద్యతే అనేన, చది ఆహ్లాదే, చందే రాదిశ్చభః-. ఉణాది ఇతి అసుర్-చస్యఛశ్చ (శబ్దకల్పద్రుమము) నియమ బద్ధమైనది ఆహ్లాదకరమైనది ఛందస్సు.

వైయాకరణుల లక్షణాలననుసరించి జానపదగేయాలను పరిశీలించడం వీలుకాని పని. ఛంద్సంటే కేవలం పద్యాల కోసం చెప్పే లక్షణ శాస్త్రంగా మాత్రమే అనుకుంటే యిలాంటి అభిప్రాయం కలుగుతుంది. లాక్షణికుల పద్ధతుల ననుసరించి కూడా కొన్ని గేయాలను పరిశీలించడానికి వీలవుతుంది. కాని కొన్ని చోట్ల ఇది వీలుకాదు. దంపుడు పాటలు, గొల్ల సుద్దులు, జోలలు, ఏలలు మొదలైనవి ద్విపదాది దేశీయచ్ఛందోచ్ఛాయలలో నడుస్తాయి.

'లాలి బంగరు బొమ్మ లాలి మాయమ్మా
లాలి ముద్దుల గుమ్మ లాలి సీతమ్మా'
'జో అచ్యుతానంద జోజో ముకుంద
లాలి పరమానంద లాలి గోవింద'
'ఏడవకు ఏడవకు చిట్టి నా తండ్రి
ఏడిస్తె నీ కండ్ల నీలాలుగారు

పాలైన గారవే బంగారు కండ్ల'[2]

మొదలైన పాటలు ద్విపదచ్ఛాయలో నడుస్తున్నాయి. దంపుళ్ళ పాటలు తరువోజలలాగా వినబడుతాయి.[3]

'అంద చందములేని ఆడుకూతురికి
అంద మేరు పరుచు ఆ పత్తిచెట్టు
పాడి పంటలున్న బంగారు మిచ్చు
పైడి పత్తిని పెంచ బంగారు హెచ్చు'

విన్నకోట పెద్దన 'తల కొని తలంబ్రాలు దంపెడు చోటc, దరుణులచే సొంపు దనరుc దర్వోజ' అని దంపుడు పాటలు తరువోజలన్నాడు.

'భాను వంశ మూనc బుట్టి, దానవ కామీనిగొట్టి రాతి నాతిcజేసిపురా, రాతి చేతివిల్లు విరచి' ఇత్యాదులు ఏలలు. ఇవి ఉత్సాహ, రగడచ్ఛాయలలో నడుస్తున్నాయి.

ఈ జానపద గేయాలలో ఉండే ఛందస్సు దేశి సంప్రదాయానికి చెందినది. మామూలుగా ప్రతి భాషలో ఈ రెండు భేదాలు కనిపిస్తాయి. సంగీతంలో కూడా మార్గదేశి భేదాలున్నాయి. తెలుగులో అక్షర గణాలని, మాత్రాగణాలని భేదాలు చెప్తారు. సూర్య ఇంద్ర చంద్ర గణాలు మాత్రా గణాలు. కన్నడంలో ప్రస్తారం చేయగా ఏర్పడిన గణాలన్నీ దేశీయ గణాలుగా స్వీకరింపబడ్డాయి. కాని తెలుగులో కొన్నిటిని వదలివేశారు. లాక్షణికులు చెప్పే ఛందస్సు ప్రకారం చేస్తే కొన్ని జానపద గేయాలకు మాత్రమే లక్షణం చెప్ప వలసి వస్తుంది. కేవలం మాత్రా సంఖ్యను బట్టి మాత్రమే లెక్కిస్తే దేశీయ రచనలు చాలా వరకు ద్విపదలలోనో, రగడలలోనో చేరుతాయి. కొన్ని షట్పదులూ ఉన్నాయి. ద్విపదలే యెక్కువ.

'సువ్వి–సువ్వి–రామ–చంద్ర
సువ్వి–సువ్వి–కీర్తి–సాంద్ర' (హయప్రచారరగడ)

"మేలు కొనవే చంద్రశేఖర
మేలుకొనవే ఇంద్రవందిత
ఫాలలోచన నీలకంఠా
మేలు కొనవయ్యా హరహర" (హరిణగతి)

"మొనలు మీదుగ తలలు క్రిందుగ
మొలచియున్నది వృక్షమూ
మోదమలరగ మింటి మీదను





మదగజము విహరించెరా'[4]

షట్పది కన్నడంలో ఎక్కువ ప్రచారంలో ఉంది. తెలుగు శిష్ట సాహిత్యంలో లేకున్నా జానపద గేయాలలో షట్పదులెన్నో కనిపిస్తాయి. ఆరు విధాలైన షట్పదులను, నాలుగు ఉపషట్పదులను లాక్షణికులు పేర్కొన్నారు. అన్నీ కాకపోయినా కొన్నయినా తెలుగు జానపద గేయాలలో కనిపిస్తాయి.

"శ్రీ శంభుతనయునకు
సిద్ధిగణనాథునకు
వాసిగల దేవతా వందితునకూ" (కుసుమ షట్పది)

"తులసియింట నుంచుహర్ని
తులసి పూజ చేయువార్ని
తులసియందు భక్తియుంచి మెలగువారినీ" (భోగ షట్పది).

"గుమ్మడేడే గోపిదేవీ
గుమ్మ డేడే కన్నతల్లీ
గుమ్మిడిని పొడచూపగదవే అమ్మ గోపెమ్మా"(భామినీ షట్పది)[5]

ఇలా లాక్షణికు లేర్పరిచిన నియమాలతో చూడకుండా జానపద గేయాలను మరొక విధంగా పరిశీలించవచ్చు. జానపద గేయాలు మూడు, నాలుగు, ఐదు, ఆరు, ఏడు, ఎనిమిది ఆవృత్తాలతో నడుస్తాయని నియమమేర్పరచుకోవచ్చు. పద్యపాదాలు గణముల చేత కూర్పబడుతాయి. గణాలలో అయితే గురులఘువులుంటాయి. గురువులకు రెండు మాత్రలు, లఘువు కొక మాత్ర. పాటల చరణాలతో ఆవృతాలు కాల ప్రమాణంతో సమానంగా ఉంటాయి. ఒక ఆవృతంలో ఇన్ని మాత్రలుంటాయని చెప్పగలిగినా వాటి గురులఘువుల క్రమం ఒకటే అయివుండ నక్కరలేదు. గణాలకు నిలువు గీతలు, చంద్రవంకలు చిహ్నాలుగా వాడుతున్నారు. అలాగే ఆవృత్తములలో మాత్రలకు త, క, కి, ట, అను అక్షరాలను వాడుతారు. రెండు మాత్రలుంటే 'తక' గాని 'కిట' గాని మూడు మాత్రలుంటే 'తకిట' అని సూచిస్తారు. ఇంతకు ముందు 'సువ్వి సువ్వి రామచంద్ర' అనే సువ్వి పాటను హయ ప్రచార రగడగా పేర్కొన్నారు.

'సువ్వి, రామ, చంద్ర, సువ్వి, సువ్వి, కీర్తి, సాంద్ర–
సువ్వి, సువ్వి, సీతమ్మ, మాకు, శుభము, లి, మ్మా'

అనేది 'తకిట' అనే ఆవృత్తములు పదహారు కలిగి ఉంటుందని వేరే విధంగా చెప్పవచ్చు.

'కేశవయని నిన్ను వాసిగ భక్తులు

వర్ణింపు చున్నారు మేలుకో' మొదలైన మేలు కొలుపులు, సువ్వాలలు ఇత్యాది గేయాలు ఈ త్రిశ్రగతిలోనే నడుస్తాయి.

'చెమ్మ చెక్క చేరడేసి మొగ్గ

అట్లు పోయంగ ఆరగించంగ

ముత్యాల చెమ్మ చెక్కముగ్గు లేయంగ

రత్నాల చెమ్మ చెక్కరంగు లేయగ'

అనేదీ త్రిశ్రగతిలోనే నడుస్తున్నది.

కోలాటం పాటలు నాలుగు మాత్రల ఆవృత్తములలో నడుస్తాయి. సామాన్యంగా ఎనిమిది చరణాలుంటాయి. పిల్లల పాటలు, తలుపుదగ్గర పాటలు, గొబ్బి పాటలు, జాజర పాటలు మొదలైనవి ఈ చతురశ్రగతిలోనే నడుస్తాయి.

పూల తోటలో పనిచేసేటప్పుడు ఈ క్రింది పాట పాడుతారు.

నాటేరమ్మా నాటేరు, ఏమీ మొక్కనాటేరు

జాజారమ్మా పూల తోటలో, జాజీ మొక్కనాటేరు

సాగేనమ్మా సాగేను, ఏమి తీగ సాగేను

జాజారమ్మా పూల తోటలో, సన్నాజాజీ సాగేను

ఈ క్రింది పాట కూడా చతురశ్రగతిలో నడిచేదే

ఎయ్‌రా సిన్నో డెయ్‌రా

ఏయ్‌రా జోరుగెయ్‌రా

దిక్కులు చూడక పక్కలొంచి

మక్కువతో పని చెయ్‌రా- అనే పాట ఇటుకల గుట్టల దగ్గర వినబడుతుంది.

చతురశ్రగతిలో నడిచే కోలాటం పాటలనే కోపులంటారు. విఘ్నేశ్వరుని కోపు అందరికీ తెలిసిందే. 'శివశివమూర్తివి గణనాథా నీవు శివుని కుమారుడవు గణనాథా'- ఇలాంటిగతిలో నడిచే కొన్ని యితర గేయాల్ని కూడా కోపులనడం కద్దు. చెఱకు తోట కోపు ఈ క్రిందిది.

'ఏలేస్తివి నరసన్న చెఱకు తోట

ఎందు కేస్తివి నరసన్న చెఱకు తోట

చుట్టు ముట్టు తోటల్ని చెఱకు తోట

చుట్టు కాని కొచ్చినాయి చెఱకు తోట'[6]





ఐదు మాత్రల్తో నడిచే దాన్ని ఖండగతి అంటారు. దీన్నే కిట తకిట, కిట తకిట గతి అనవచ్చు. ఐదు మాత్రల్ని 2+3, 3+2 మాత్రలుగా కూడా సూచించవచ్చు. వీటిని 'తక తకిట' 'తకిట తక' అని చెప్పవచ్చు. రోకటి పాటలు, తర్వోజలు ఇలాంటివి కొన్ని ఉన్నాయి. ఈనాటి రోకటి పాటలు రెండేసి నాలుగేసి చరణాలతో, ఖండగతిలో నాలుగేసి ఆవృత్తాలతో కనిపిస్తాయి. స్త్రీల పాటలు చాలా వరకు ఖండగతిలోనే నడుస్తాయి.

ఆరు మాత్రల ఆవృత్తముల పాటలు కూడా ఉన్నాయి. వీటిని త్రిశ్రగతి పాటలు గానే చెప్పవచ్చు. అయితే కొన్ని 2+4 మాత్రలలో 'తక-కిటతక' అని నడవవచ్చు. ఏలపదాలు ఈ వరుసలో నడుస్తాయి. 3+4 4+3 గతి వుంది. 'మేలు కొనవే చంద్రశేఖర మేలు కొనవే ఇంద్రవందిత, ఫాలలోచన నీలకంఠా మేలు కొనవయ్యా హరహరా' అనే పాట హరిణగతి రగడగా చెప్పాను. ఇది మిశ్ర గతిలోనే నడుస్తుంది. కొన్ని పాటలు ఎనిమిది ఆవృత్తాలతో గూడా నడుస్తాయి. ఇలా జానపద గేయాలు మూడు, నాలుగు ఇత్యాది ఆవృత్తములతో నడుస్తాయని ప్రమాణం ఏర్పరుచుకుంటే ఎన్నివేల గేయాలైనా యీ సూత్రంలో బంధింపవచ్చు. లాక్షణికులు చెప్పిన ఛందస్సు ప్రకారమైతే అన్నిటినీ పరిశీలించడం కష్టమవుతుంది.

సంగీతం : కంఠమాధుర్యం, కంఠమేళ అనేవి జానపదుల గేయాలాపానికి అలంకారాలు. శాస్త్రీయ సంగీతానికి, జానపద సంగీతానికి భేదముంది. ఈ పాటలకు స్వర ప్రస్తారాలు నిర్ణయించడం సులభం కాదు. ఈ పాటలు స్వచ్ఛంద స్వరూపం కలవి. సంగీతంలో మార్గదేశి భేదం ఉంది. సౌరాష్ట్ర ఇత్యాది రాగాలు దేశాల పేర్లు సూచించేవి కూడా ఉన్నాయి. సామాన్యంగా జానపదరాగాలలో ఐదు కంటె హెచ్చు స్వరాలను ఉపయోగించరు. ఆంగ్లంలోను జానపద రాగాలను pentatonic scale-అంటే-పంచ స్వర శ్రేణి అని పిలుస్తారు. ఈ పాటలలో రెండు మూడు స్వరాలే ఉన్నా రాగాల ఇంపు అద్భుతమైంది.

జానపద సంగీతం మామూలు సంగీత రచనల కంటె చాలా ప్రాచీనమైనది. జానపదానికి రచయిత లేక పోయినా అదే సంగీత రచనలకు పునాది. దినమంతా కష్టపడేటప్పుడు కర్షకుడు తీసే కూని రాగాలు, గృహిణులు రోకళ్లతో దంచేటప్పుడు, విసరేటప్పుడు, జోలలు పాడేటప్పుడు పాడే పాటలే సంగీతానికి ఆధారాలు. ఈ పాటల్లో అపూర్వ మైన రాగాలు లేవు. సామాన్యంగా ఆది, చాపు, రూపక తాళాలుంటాయి, చాపుతాళాలలో మిశ్ర జాతి, ఖండ జాతి, త్రిశ్ర జాతి ఉండవచ్చు.

జానపద సంగీత లక్షణాలను కొన్నిటినిలా చెప్పవచ్చు[7] 1. ఒక్క స్థాయిలోనే రచింపబడి ఉంటాయి. 2.ప్రతి మధ్యమ రాగాలలో, అపూర్వ రాగాలలో జానపద గీతాలుండడం అరుదు. 3.వీటిల్లో ఉండే మెట్టు సామాన్యంగా జనాకర్షణ కలిగేదిగా ఉంటుంది. 4.సంగతులు, గమకాలు ఉండవు. ఈ పాటల్లోనే కొంత నాజూకైన పాటలుగా చెప్పదగిన స్త్రీల పాటలు, పెళ్లి పాటలు మొదలైన వాటికి రాగాలుంటాయి. లాలి పాటలు ఇత్యాదులు ఆనంద భైరవి, నీలాంబరీ రాగాలలో ఉంటాయి. శిష్టులు పాడే పాటలు ఇంకా పున్నాగవరాళి, నాద నామ క్రియ, ఆనంద భైరవి, సైంధవి, మొదలైన రాగాలలో ఉంటాయి.

జానపద గేయాలు ఎప్పుడూ ఒకే స్థాయిలో ఉంటాయన్నది అన్ని వేళలా సరికాదు. ఇద్దరు ముగ్గురు కలిసి పాడే పాటలు ఒకే ఆధార షడ్జమునకు చేరి ఉండవచ్చుగాని వాళ్ళ శ్రుతిలో భేదముండవచ్చు. ఒకరొక స్థాయిలో మరొకరు మరొక స్థాయిలో పాడవచ్చు. శ్రుతి ఒక్కటే ఉన్నా స్థాయిలో భేదం కనిపించవచ్చు.

జానపద గేయాలకు రాగ నిర్దేశం చేయడం కష్టం. రాగ స్వరూపంలో ఏ ఛాయలు, ఏ కవళికలు వాడారనే ప్రశ్న వస్తుంది. కాకలి, కైశికి, అంతర, సాధారణ స్వరాలకు భేదం జానపదుల పాటల్లో గోచరించదు. వింజమూరి సీతాదేవిగారు జానపద గేయాలలో సంగీతాన్ని గూర్చి పరిశోధన చేశారు. వారాయా పాటలకు రాగ తాళాలను ఏర్పరిచారు. అయితే స్త్రీల పాటలు మొదలైన కొన్ని పాటలలో ఈ రాగ తాళాలుండడం నిజమైతే కావచ్చునేమోగాని అన్నిటిలో ఇంతగా రాగాలను చెప్పబూనడం సబబు కాదు. అన్నమయ్య కూడా తమ కాలంలోని జానపద గేయాలలాంటి కీర్తనలను రాగాలతో కల్పించారు. అయితే అవన్నీ జానపద గేయాలకు సరిపోవు.

స్త్రీల పాటలలో నందిరాజు చలపతిరావుగారు పాటలకు రాగాలను కూడా ఇచ్చారు. ఎన్.వి.గోపాల్ అండ్‌కో వారి 'స్త్రీల పాటలు' వగైరా పుస్తకాలలోను కొన్ని పాటలకు రాగాలున్నాయి.

శివ శివ మూర్తివి గణనాథ నీవు

శివుని కుమారుడవు గణనాథ– అనే ప్రసిద్ధమైన పాట నాద నామ క్రియ రాగం, ఆది తాళమని చెప్పబడింది. ఈ కోపులు చాలావరకు ఆదితాళాలే, ముఖారిరాగం, పంతువరాళిరాగం, నాద నామ క్రియ రాగం, ధన్యాసిరాగం, జంఝూటిరాగం, కాంభోజిరాగం, ఆనందభైరవి ముదలైన రాగాలు కూడా వీటిలో





ఉంటాయి. 'ఆత్మబోధామృత తత్వము' మొదలైన వాటిలోనే గీతాలకు కూడా రాగ తాళాలు కల్పించబడ్డాయి. వీటిలో ఆనందభైరవి, శుద్ధ సావేరి, కాంభోజి, ధన్యాసి మొదలైన రాగాలు, ఆది, ఏక, ఆట, మొదలైన తాళాలు ఉన్నాయి. అయితే ఇవి అన్నిటికీ సర్వ విధాలా సరిపోతాయని చెప్పలేము.

కన్నడ ఛందస్సు : కన్నడంలో కూడా రెండు విధాలుగా గణాలను చెప్పవచ్చు. వీటిని అక్షర గణములు, ఆఘాత గణములు అంటారు. ఆఘాత గణాలలో మళ్ళీ రెండు రకాలు; అంశ గణములు, మాత్రాగణములు అవి.

ద్రావిడ భాషలలో ఒక విశిష్టమైన గణాల సంప్రదాయం కనిపిస్తుంది. ఇలా వీటికే సహజంగా ఉన్న ఛందస్సును నాగవర్మ 'కర్ణాటక విషయ జాతి', 'కర్ణాటక విషయ జాతివృత్త' అనే పేర్లతో పిలిచాడు. దీన్నే 'జాతి ఛందస్సు', 'దేశ్య ఛందస్సు', 'అంశ ఛందస్సు' అంటారు.

కన్నడంలోని బ్రహ్మ విష్ణు రుద్ర గణాలు తెలుగులోని సూర్య ఇంద్ర చంద్ర గణాల లాంటివి. ఈ గణాలకు కొంతవరకు సమాన మైనవి తమిళంలో ఈరశైశీర్ (ఉలిచ్చీర్), మూవశైశీర్ (వెణ్‌చీర్), నాలశైశీర్ (పోదుచీర్) అనే వాటిని చెప్పవచ్చు. అయితే కన్నడంలోని బ్రహ్మగణం ఈరశైశీర్‌లోను, విష్ణుగణం ఈరశైమూవశై శీర్‌లలోను, రుద్ర గణం మూవశై, నాలశై శీర్లలోను అంతర్లీన మవుతుంది. బ్రహ్మగణాలు నాల్గు విధాలుగా, విష్ణుగణాలు 8 విధాలుగా, రుద్ర గణాలు 16 విధాలుగా ఉంటాయి.

కన్నడంలో అంశ గణ పద్ధతినే లెక్కవేస్తారు. అంశ గణాలలో మొదటి అంశం గురువుగా గాని, లేక రెండు లఘువులుగా గాని ఉంటుంది. మిగిలిన అంశాలు ఒక లఘువో లేక గురువో అయివుంటాయి. ఒక గణంలో రెండు అంశాలుంటే బ్రహ్మగణం, మూడుంటే విష్ణు గణం, నాలుగుంటే రుద్రగణం, బ్రహ్మ గణంలో నాలుగునుంచి ఆరు మాత్రలు, రుద్ర గణంలో ఐదునుంచి ఎనిమిది మాత్రలు ఉంటాయి.

కన్నడ జానపద గేయాలలో ఎన్నో విధాల ఛందస్సులు కనిపిస్తాయి. అంశ గణాలను మాత్రలతో లెక్కవేయడం సంప్రదాయం కోసం మాత్రమే. మాత్రల లెక్కకు అంశ గణాల లక్షణాలు బద్ధమై ఉండవు. గణం మొదటి అంశం గురువు లేక రెండు లఘువులు గాక లఘువుగానే ఉండడమూ కద్దు. అప్పుడా అక్షరాన్ని సాగదీయ వలసి ఉంటుంది. గణం చివర ఒకే అక్షరం లేక రెండు అక్షరాలు ఉండవచ్చు.

'హొస మనె । గ్వోగ బేడ । మల్లి ....... । అల్లి ।

తొలె మేలె । కుంతయ్తె । పల్లి [8]

కన్నడ జానపద గేయాలలో త్రిపదులు, సాంగత్యాలు మొదలైనవి ఉన్నాయి. కన్నడ జానపద సాహిత్యంలో కొట్ట వచ్చేట్లుగా మనకు కనిపించేవి త్రిపదులు. అన్నమయ్య పెక్కు జానపద గేయాలవరుసలను అనుకరించి నట్లుగానే, కన్నడంలో ఎక్కువ ఉపయోగంలో ఉండిన త్రిపదినే సర్వజ్ఞుడు ఉపయోగించుకున్నాడు. కన్నడ జానపద గేయాలు అత్యంత ప్రాచీన కాలంలో తమిళుల 'కురళ్' లా రెండు పాదాలు కలిగి ఉండేవి. కాలక్రమేణా ఇది మూడు పాదాలయింది. ఈ నాటికీ కొన్ని జానపద గేయాలలో త్రిపదిలోని రెండు పాదాలు మాత్రమే ఉండేవి కనిపిస్తాయి.

'సువ్వి కుట్టెందరె సువ్వంగ నాదోళు

నోడణ్ణా నిన్న మడదీయా-సువ్వి

ఒందిబ్బె కుట్టువాగ ఒబ్బణ్ణనుణ బంద

ఎబ్బిసో నిన్న మడదీయా-సువ్వి.....'[9]

త్రిపదిలో బ్రహ్మ విష్ణు గణాలు మాత్రం వాడబడుతాయి. బ్రహ్మ గణాలు నాలుగు న-గగ-స-హ గణాలు. విష్ణు గణాలు 8 : మ-సగ-ర-నగ-త-సల-భ-నల తెలుగులోని సూర్య గణాల కంటె ఎక్కువగా బ్రహ్మ గణంలో గగ-స ఉంటాయి. ఇంద్ర గణాల కంటె ఎక్కువగా సగ-మ గణాలుంటాయి. త్రిపదిలో మొదటి రెండు పాదాలలో నాలుగు. మూడో పాదంలో మూడు గణాలు; మొత్తం 11 గణాలు. వీటిలో 6వది, 10వది మాత్రం బ్రహ్మ గణాలు. మిగిలినవి విష్ణు గణాలు.

అన్ని త్రిపదులు పైన చెప్పిన గణాలనే కలిగి ఉండాలని లేదు. 11 గణాలలో 6వది, 10వది మాత్రం బ్రహ్మ గణాలు, మిగిలినవి విష్ణు గణాలయితే దాన్ని శుద్ధ త్రిపది అంటారు.

"ఎంటలె మావీన దంటాగే ఇరువోళే

గంటె సద్దిగే బదగోళే-సరసతి

గంటలా తొడర బిడిసమ్మా'[10]

శుద్ధ త్రిపదినే వేరే వేరే రీతిగా పాడేటప్పుడు త్రిపది స్వరూపం మారుతూ ఉంటుంది. కోలాటాల లోను, విసరురాతి పదాలలోను, సోబాన పదాలలోను, ఇంకా పెక్కు చోట్ల త్రిపదులనే వాడుతారు. అయితే వాటికి కొన్ని పల్లవులు కూడా చేరుస్తారు. కోలాటపదాలలో 1.కోలు రన్నద కోలన్నా 2.తాను తానందనో తందనానొ-తందని





తానందనో తందనానో ఇత్యాది. విసరురాతి పదాలలో 1.ఏగిణియే గిణియే 2.సువ్వి, సుయ్యో, నారి, శివ శివ మొదలైనవి చేరుస్తారు.

కన్నడ దేశంలో పుట్టిన అతి ప్రాచీన గీతాలు త్రిపది లయలోనే ఉండేవన డానికి ఆధారాలున్నాయి. జానపద గేయాలలో-ముఖ్యంగా-స్త్రీల పాటలలో ముక్కాలు భాగం త్రిపదులే. కన్నడం పలుకులకు, త్రిపదికి సజీవమైన సంబంధముంది. త్రిపది మూడు పాదాల పద్యమని దాని పేరే సూచిస్తున్నది. దీన్ని ప్రాచీన కాలం నుంచి (క్రీ.శ.700 నాటి) బాదామి శాసనం మొదలైన వాటిలో ఇలాగే వ్రాసేవారు. త్రిపదికి మూడు పాదాల పద్యమని పేరైనా దాన్ని పాడే విధానం నాలుగు పాదాలు పాడినట్లుగా ఉంటుంది.

'దూరు బందరె బరలి వైయ్యార నినగిరలి

రాణి నిన ముఖ కళెయిరలి ఎలెహెణ్ణె

సావిర బిద్దరూ ననగిరలి'

అని ఉంటే దీనిలో 5,6,7 గణాలను మళ్ళీ రెండవ మారు పాడుతారు. అప్పుడది ఇలా ఉంటుంది.

"దూరు బందరె బరలి వైయ్యార నినగిరలి

రాణి నిన ముఖ కళెయిరలి

రాణి నిన ముఖ కళెయిరలి-ఎలెహెణ్ణె

సావిర బిద్దరూ ననగిరలి"

త్రిపదిని పాడే విధానాన్ని బట్టి రెండు ద్విపద పాదాలవుతున్నది.

జానపద త్రిపది ఇంత ప్రాచుర్యాన్ని సంపాదించడానికి ఎన్నో కారణాలున్నాయి. ఇది చిన్న గీతము. చిన్న చిన్న భావాలను చక్కగా వ్యక్తం చేయడానికి అనుకూలమైంది. అక్షరాలు లేక మాత్రల నిర్బంధం లేదు. దీనిలో ప్రాస విన్యాసం ఎంతో చక్కగా చూపవచ్చు. యతులు ప్రాసలు అతి సహజంగా పడిపోతాయి.

"నారాయణా నిన్న నామద బీజవ

నానెల్లి బిత్తి బెళెయలి నిన నామ

నాలగి మేలె బెళెదేన"

ఇది వ్రాయడం చాలా సులభం. మూడు చరణాలలో ముద్దుగా చిన్ని చిన్ని భావాలను పొందు పరచవచ్చు. అందువల్లనే త్రిపదులలో నిత్యజీవితానికి సంబంధించిన సుఖాలు, దుఃఖాలు, కష్టాలు, శారీరక శ్రమలు, నీతులు, ధర్మాలు, వేడుకలు మొదలైన

అనేక విషయాలు పొందు పరచబడ్డాయి. ఇవి అత్యుత్తమ భావగీతాలయ్యాయి.

త్రిపదులే కాక ఇంకా ఎన్నో రకాల జానపద గీతాలు కూడా కనిపిస్తాయి.

"గంధ కస్తురి పునగ
గౌరవ్వన । కందగ ధరిసిదర ।
అందద బిళి ఎలె అడకి కాచవు సుణ్ణ
ముంద మడచి నిట్టు మల్లిగి మళెగ రెద
మతియ పాలిసొ ఎనగ
శ్రీగణరాయా స్తుతి మాడి ఉణసువెనొ"

అనే పాట 'కిటత కిట' ఆవృత్తాలతో ఖండగతితో నడుస్తున్నది.

"వరసీగి బరవూదు
సరసవ్వ ఎళ్ళా మూసీ కోలణ్ణ కోల
ఏళమంది నెగేణి మక్కు
బెళ్ళ బెళగాన ఏఠ్రికో"

పై పాట లలితరగళకు సమీపంగా ఉంది.

"కసి కసి కొబ్బరి హసనుళ్ళ జిలి చిలి
బిసియ హొరణ గడబ బిళియె బెల్ల
రస బాళె ఖబ్బ సులిదు ముందిట్టర
ఇసమాడి బంద తుత్త తిందేన తాయి"[11]

ఇది కుసుమ షట్పది

కన్నడ జానపద సంగీతాన్ని చెప్పేటప్పుడు కూడా తెలుగు గీతాలతో పోల్చి చెప్పవచ్చు. ఈ పాటలు కూడా కొన్నిటిని తెలుగులో లాగానే పున్నాగవరాళి, నాదనామక్రియ, ఆనంద భైరవి, నీలాంబరి ఇత్యాది రాగాలలో పాడుతారు. ఆది, రూపక, చాపు తాళాలు ఎక్కువగా వాడుకలో ఉన్నాయి. 'హళ్ళియ హాడుగళు' అనే పుస్తకంలో కొన్ని జానపద గేయాలకు రాగాలు ఇవ్వబడి ఉన్నాయి.

"కరియంగీ...........కసూతి
తలెతుంబ............జావూళ
అంగాళదాగ నవిలాట" అనేది కీరవాణి రాగంలో పాడబడే లాలి. మరో విసురురాతి పాట ఖరహర ప్రియరాగంలో ఉంది.

"ఇందు నన్నం............గళ శ్రీగంధనా కావ





బంది దానేన శ్రీహరీ.........."

తెలుగు పాటలను గూర్చి చెప్పేటప్పుడు అవి పంచమ స్వరం కంటె ఎక్కువ పోవని చెప్పాను. అదే కన్నడం పాటలకూ వర్తిస్తుంది. కొన్ని పాటలలో సంగీతశక్తి అధికంగా ఉండవచ్చు. మామూలుగా ఈ శక్తి జానపద గీతాలలో సరళ రూపంలో ఉంటుంది. జానపద గాయకులు శాస్త్రోక్తంగా రాగాలను అభ్యసించిన వారు కారు. తాము అప్పుడప్పుడు విన్న కొన్ని పాటల వరుసలు కలిపి ఉండవచ్చు అంతే.

మార్గ సంగీతానికి భిన్నమైన దేశికి సంబంధించింది జానపద సంగీతం. దేశిలేకుండా మార్గ సంగీతం పుట్ట లేదు. దేశిని సంస్కరించే మార్గసంగీతాన్ని ఏర్పరచి ఉంటారు. మన సంగీత పద్ధతుల అభివృద్ధికి మూలభూతాలు జానపద గీతాలే. జానపద గేయాలలో కూడా కొన్ని పూర్ణరాగాలున్నాయి. అయితే అవి అరుదు. పల్లెల్లో పొద్దున్నే వినిపించే కొన్ని ప్రాతఃకాల గీతాలలో మోహన, భూపాలి, ఆరభి ఇత్యాది రాగాలను గుర్తించవచ్చు. ఈ క్రింది గీతాన్ని మోహన రాగంలో పాడుతారట.[12]

"రంగనాయక రాజీవలోచన
రమణ నీ బెళగాయితేళై
పక్షి జాతిగళ్లల చెలపిలిగుట్టుత్త
సుక్షేమదలి స్మరిసువువు శ్రీహరియ ॥ 1 ॥
సురరు కిన్నరరు కింపురుషరు ఉరగరు
పరి పరియలి బందు హాడువరు హరియె ॥ 2 ॥
అరుణను బందు దయాచలదలి నిందు
కిరణవదోరువ భాస్కరను ॥ 3 ॥

మానవునికి సంగీతానికి ఎంతో సన్నిహిత సంబంధముంది. "No songless people has ever been discovered' says the Oxford companion to Music; and it goes on to tell us that only men and birds sing, not animals. This is not quite true: I myself sang last year to a seal......." అన్నారు. C.Day Lewis.[13]

సంగీతమనేది ప్రతి ప్రాణికీ ఆహ్లాదాన్ని కలిగిస్తుందని ఆయన మతం. జానపద గేయాలలో ఉండేది సంగీత కారులు, లాక్షణికులు చెప్పే సంగీతం, ఛందస్సు కాక పోయినా వాటి అందం వాటి కుంది. వాటి మాధుర్యం వాటి కుంది. శాస్త్రం తెలిసిన వారికి, శిష్టులకు శిష్టుల రచనలు సంతోషాన్నిస్తుండగా, ఏ లక్షణాలకూ లొంగని జానపద గేయాలలోని మాధుర్యం ప్రతి సహృదయుడిని అలరిస్తుంది.

**టిప్పణి**

1. పాటలలో ఛందస్సు, ఋతంభర (పీఠిక)
2. తెలంగాణా పల్లెపాటలు, పు. 3
3. పల్లెపదాలు, పు. 44
4. కోరాడ రామకృష్ణయ్య, దక్షిణ దేశ భాషా సారస్వతములు, పు. 181
5. అదే, పు. 154
6. పల్లె పదాలు, పు. 65
7. గానకళాబోధిని, బాల సరస్వతి బుక్ డిపో
8. క.రా.కృ.(సం) జేనహనిగళు, పు. 15
9. ప్రబుద్ధ కర్ణాటక, సంపు. 53, పు. 64
10. అదే, పు. 77
11. హళ్ళియ హాడుగళు, అరుణోదయ, పు. 15
12. శివరామకారంత, జానపద గీతగళు, పు. 14
13. C.Day Lewis, The Lyric Impulse





# 13. ఉపసంహారం

తెలుగు-కన్నడ జానపద గేయాలను పరిశీలించినప్పుడు కొన్ని పోలికలు, కొన్ని విభేదాలు కనిపిస్తాయి. ఇప్పటి వరకు చెప్పిన విషయాలనే సింహావలోకనం చేసుకొంటే ఆ పోలికలు మొదలైనవి తెలుస్తాయి. తెలుగు కన్నడాలు సోదర భాషలు. భాషా విషయంలోను, సాహిత్య విషయంలోను, నైసర్గికంగారు, సాంస్కృతికంగాను ఇంకా ఎన్నో విధాలుగా ఈ రెండు భాషలకూ సన్నిహిత సంబంధాలున్నాయి. ఈ రెండు భాషలకుండే సంబంధం ఈ నాటిది కాదు అయినా కొన్ని భేదాలు కూడా కన్పడక పోవు. ఒక తెలుగు దేశంలోనే సాగర ప్రాంతం, తెలంగాణా, రాయలసీమలలోని గేయాలను పరిశీలించినపుడు కొన్ని భేదాలు కనిపిస్తాయి. అలాగే తెలుగు కన్నడాలకు ఎన్నో పోలికలున్నా కొన్ని విశ్వాసాలు, మతాచారాలు, వినోదాలు, అలవాట్లు, ఇంకా మరికొన్ని విషయాలలో భేదాలుంటాయి.

Folk-Literature అనే పదానికి తెలుగు కన్నడాలు రెండిట్లో జా(జ)నపద సాహిత్యమనే వాడుతారు. Folk-poetry ని తెలుగులో జానపద కవిత్వమని, కన్నడంలో జానపద కవితె లేక కావ్య అని పిలవవచ్చు. జానపద కవిత్వంలో రెండు విధాలు : 1.జానపద గేయాలు 2. జానపద కథా గేయాలు. తెలుగులో బి.రామరాజుగారు, కన్నడంలో బి.ఎస్.గద్దగిమఠగారు తమ పరిశోధన వ్యాసాలలో జానపద గీతాల శీర్షిక క్రింద కథాగేయాలను కూడా పరిశీలించారు. కాని నేను కథాగేయాలు వదలి వేసి జానపద గేయాలను (విడిగేయాలు) మాత్రం పరిశీలించాను. జానపద కవిత్వంలో విడి గేయాలే ప్రాచీనమైనవి. కథాగేయాలు ఆ తర్వాత పుట్టినవి.

జానపద గేయాలు ఎలా పుట్టాయనేదానికి కొంతవరకు సమాధానం చెప్పవచ్చు. పాటకంటె ముందు నృత్తం పుట్టింది. ఎన్నో రకాల నృత్యాలలో పాద హస్త విన్యాసమే గాని భాష లేక పోవడం పాట అర్వాచీనమని నిరూపిస్తున్నది. "The priority of dance over song is clear from the large number of dances which have no words and are entirely self-sufficient and self-explanatory without them."[1] మనుషులంతా వేట మొదలైన ఉద్యోగాలతో కష్టపడి రాత్రి ఒక్కచోట చేరి ఉల్లాసంగా కాలంగడిపేటప్పుడు నృత్తం లేక నృత్యం పుడుతుంది. క్రమేణ కూనిరాగం, లయాన్వితమైన భాష, పాట వెలువడుతుంది. రెండు రకాలసిద్ధాంతాలున్నాయి. పనులు చేసేటప్పుడు,

అంటే, పడవనడిపేటప్పుడు, బళ్ళులాగేటప్పుడు, వడ్లుదంచేటప్పుడు, పిండి విసరేటప్పుడు, కూనిరాగాలు తీయడం, ఏవో మాటలు లయబద్ధంగా అనడం, అలా కాక మానవాతీత శక్తులకు తమ భావాలను విన్నవించుకునే ప్రయత్నంలో పాట వెలువడిందని మరోమతం. అందరూ వేటాడడానికి వెళ్ళి వస్తారు. అప్పుడుగంతులు వేస్తూ సంతోషంతో తమ ఆవేశాలను, అనుభూతులను అందరూ చెప్పుకునేటప్పుడు లయబద్ధమైన భాష వెలువడుతుంది. ఇంతే కాక నృత్యం లేనిదే పాట లేదనే వారూ ఉన్నారు. "Through dances primitive peoples express their emotions with all the force that dancing allows, and work an enchantment or some pray or show their identity with their totems or illustrate some myth or hold intercourse with their gods. All these things their songs also do, but without the dance the song would hardly exist" [2], అయితే ఇది అతి ప్రాచీన మానవుని పాటలకు సంబంధించిన మాట. ఈనాటి తెలుగు కన్నడ జానపదగీతాలకు ఈ మాటలు వర్తించవు.

తెలుగు కన్నడాలలో జానపదగేయాలెప్పుడు పుట్టాయి మొదలైన వాటికి తగిన సమాధానాలు, ఆధారాలు లేవు. అయితే ఈ రెండు భాషల సాహిత్యాల పుట్టుకకు ఎంతో కాలం ముందుగానే జానపద గేయాలు ప్రచారంలో ఉండేవని చెప్పవచ్చు. విన్నకోట పెద్దన దంపుళ్ళ పాటలు తరువోజలలో ఉంటాయని చెప్పాడు. తెలుగులో దొరికిన పద్యశాసనాలలో మొదటిదైన అద్దంకి శాసనం (క్రీ.శ.848–892) గుణగ విజయాదిత్యుని కాలంనాటిది. దీనిలో తరువోజ పద్యముంది.

'పట్టంబు గట్టిన ప్రథమంబు నేడు
బలగర్వ మొప్పంగ బైలేచి సేన............'

తరువోజ అతి ప్రాచీనమైన తెలుగు ఛందస్సు. ఇది రెండు ద్విపదపాదాల కలయికతో ఏర్పడుతుంది. ద్విపద తరువోజ కంటె ప్రాచీనమైనదంటారు. 9వ శతాబ్ది నాటికే ద్విపదలు, తరువోజలు ప్రచారంలో ఉండేవి. పాల్కురికి సోమన జానపద గీతాలనదగిన 'తుమ్మెద పదములు, ప్రభాత పదములు, శంకరపదములు, నివాళిపదములు, వాలేశుపదములు, గొబ్బిపదములు, వెన్నెలపదములు' మున్నగు వాటిని పేర్కొన్నాడు. ఇవన్నీ మన భాషలో సాహిత్యం సృష్టికాక ముందే జానపద కవిత బాగా ప్రచారంలో ఉండేదని నిరూపిస్తున్నాయి.

కన్నడ గేయాలలో అధికంగా కనిపించే త్రిపదులు కూడా అత్యంత ప్రాచీన కాలంనుంచే శాసనాలలో కనిపిస్తున్నాయి. క్రీ.శ.700లోని బాదామి చాళుక్య





శాసనంలోనే త్రిపదిఉంది. తెలుగులో లాగానే రోకటి పాటలు అత్యంత ప్రాచీనాలని చెప్పడానికి ఆధారముంది. కవిరాజ మార్గాని (9వ శతాబ్ది)కి ముందే ఓవనిగె, ఒనకె హాడు అనేవి ఉన్నాయని తెలుస్తున్నది.

'ఏవేళ్విదొ శివమారమ । హీవళయాధిపన సుభగ కవితా గుణమం
భూవళయదొళ్ గజాష్టక । మోవనిగెయు మొనకె హాడు మాదదె పేళ్గిం'[3]

వీటిని బట్టి కన్నడ సాహిత్యం పుట్టడానికి ముందే కన్నడ జానపద గేయాలు కూడా ప్రచారంలో ఉండేవని తెలుస్తున్నది.

తెలుగులోను కన్నడంలోను రోకటి పాటలే ప్రాచీనమైనవిగా ఇంత వరకు దొరికిన సమాచారాన్ని బట్టి తెలుస్తున్నది. అలాచూస్తే తెలుగు కన్నడాలు రెండిటిలోను పని పాటలే ప్రాచీనమైనవిగా కనిపిస్తున్నాయి. ఈ పనిపాటలలో కర్షక గేయాలు, కార్మిక గేయాలు, తిరుగలి పాటలు, రోకటి పాటలు ఉన్నాయి. కన్నడంలోని కర్షక గేయాల పైనగూడా మత ప్రభావం ఎంతగానో ఉంది. తెలుగులో కర్షక గేయాదులు ఎక్కువగా శృంగార గేయాలై ఉంటాయి. రాముడు, కృష్ణుడు మొదలైన దేవతలను గూర్చినవి కూడా లేక పోలేదు. తిరుగలి పాటలు, రోకటి పాటలు ఎక్కువగా గృహజీవనానికి సంబంధించినవి. కన్నడంలో ఉత్తర కర్నాటకం వైపు కర్షక గేయాలు చాలావరకు శివభక్తి గేయాలే. తెలుగు పల్లె పాటలపైన ఇంతగా మత ప్రభావం కనిపించదు. తెలుగు కన్నడాలు రెండిట్లో కార్మిక గేయాలు తక్కువే. యంత్రాల రాపిడి ధ్వనుల రొదలో వాళ్ళ గొంతులు పూడుకు పోతాయి. నాగరికత పెచ్చు పెరిగింది. ఏవైనా ఉన్నా అవి కొంత కాలం కిందట రంగూను మొదలైన చోట్ల కర్మాగారాలలో పనిచేయడానికి వెళ్ళిన వాళ్ళు, రైల్వే కూలీలు మొదలైన వాళ్ళు పాడేవి. దంపుడు పాటలు, తిరుగలి పాటలు తెలుగు కన్నడాలు రెండిట్లోను ఎక్కువగా గృహజీవనానికి సంబంధించినవే.

పారమార్థిక గీతాలను మూడు రకాలుగా విభజించాను. భక్తి గేయాలు తెలుగులో ఎక్కువగా రాముడిని గురించినవి లభిస్తాయి. రామదాసు పాటలనేకం జానపద గేయాలుగా మారి పోయాయి. త్యాగరాజుకు కూడా జానపదుల్లో అంత ప్రచారం లభించలేదు. 'అంతా రామమయం', 'పలుకే బంగార మాయెనా' మొదలైన రామదాసు పాటలు ఆయనవి అని తెలుసుకోలేనంతగా జానపదులకు చిరపరిచితాలు అయిపోయాయి. త్యాగరాజు నౌకా చరిత్రలో వ్రాసిన 'నీ నామ రూపములకు నిత్యజయ మంగళం' ఇత్యాది కీర్తనలు మాత్రం హరికథలు మొదలగు వాటిలో పాడబడి

జానపదులకు పరిచయమయ్యాయి. కన్నడంలో భక్తిగేయాలలో శివునిదే పైచేయి. దీనికి ఆ దేశంలోని లింగాయత మత ప్రభావమే కారణం. బసవన్న, అక్క మహాదేవి మొదలైన వాళ్ళు జానపదులలో కూడా చొచ్చుకు పోయేట్లు శివ భక్తిని నూరి పోశారు. వ్రతాలు, నోములు, జాతరలకు సంబంధించిన పాటలు, తత్వాలు తెలుగులోను కన్నడంలోను చాలావరకు ఒకే విధంగా కనిపిస్తాయి. జాతరలలో మాత్రం తెలుగు దేశంలో ఇంకా చాలావరకు పాత పద్ధతులే అలవాటులో ఉన్నాయి. కన్నడం వారి జాతరలలో శిష్ట సంప్రదాయాలు కూడా చోటు చేసుకున్నట్లు కనిపిస్తుంది. కన్నడ దేశంలో కరగ సంప్రదాయం మొదలైనవి ఉన్నాయి. పచ్చికుండను పూలు, వేప మండలు మొదలైన వాటితో అలంకరించి ఇంటింటికీ తిప్పుతారు. ఇది మైసూరు దేశానికి దగ్గర ఉన్న పుంగనూరు మొదలైన చోట్లకూడ వాడుకలో ఉన్న సంప్రదాయం. అంతేగాని మిగిలిన చోట్ల కనపడదు. ఇలాంటి కొన్ని సంప్రదాయాలు తెలుగువారి వల్ల కన్నడిగులకు, కన్నడిగులవల్ల తెలుగు వారికీ అలవాటయ్యాయి.

'స్త్రీల పాటలు' అనే పేరుతో తిరుగలి పాటలు, రోకటి పాటలు, కర్మమార్గ గేయాలు, లాలులు, పెళ్లిపాటలు మొదలైనవన్నీ చలామణీ అవుతున్నాయి. తిరుగలి పాటలు మొదలైనవి పని పాటలలోనే చేర్చాను. వ్రతాలు, నోములు మొదలగు వానికి సంబంధించినవి పారమార్థిక గేయాలలో చేరుతాయి. లాలులు, జోలలు, పిల్లల పాటల్లో, పెళ్లి పాటలు వేడుక పాటల్లో చేర్చవచ్చు. ఆయా శీర్షికలలో వాటిని చేర్చడమే సమంజసంగా ఉంటుంది. తల్లి-కూతురు, అన్న-చెల్లెలు, వదిన-మరదలు, అత్తాకోడలు మొదలైన బాంధవ్యాలను గురించిన పాటలను బాంధవ్య గీతాలలో చేర్చాను. ఈ బాంధవ్యాలు తెలుగు వారికీ కన్నడం వారికీ ఒకటే. అలా చూస్తే భారత దేశంలోనే అందరికీ గృహ సంబంధమైన విషయాలలో పోలిక కనిపిస్తుంది.

పిల్లల పాటలలో లాలులను గూడా చేర్చాను. కొందరు దీన్ని అంగీకరించరు. అయినా లాలులు పిల్లలకు అర్థం కానంత మాత్రాన వాటిని వేరు చేయనక్కరలేదు. అవి పిల్లల కోసమే ఉద్దేశింపబడ్డాయి కాబట్టి పిల్లల పాటల్లోనే చేర్చడం తప్పుకాదు. పొడుపు కథలు కొన్నిటిని కూడా పిల్లల పాటలలో చేర్చాను. అయితే అన్నిటినీ చేర్చడానికి వీలులేదు. కొన్ని తెలుగు పిల్లల పాటలలో శాస్త్ర విషయాలు కూడా ప్రవేశించాయి.

జానపద గేయాలలో వేడుక పాటలదొకభాగం. ఇవి జానపదులు తమ వినోదం కోసం కల్పించుకున్నవి. పెళ్లి కర్మగా కాక వేడుకగా చేసుకున్నారు జానపదులు.





అందువల్ల పెళ్లి పాటలను కూడా వేడుక పాటలలోనే చేర్చాను. పెళ్లికి సంబంధించిన కొన్ని విషయాలలో తెలుగువారికి కన్నడం వారికి భేదం కనిపిస్తుంది. అయినా ఎదురుకోల, మంగళ సూత్రధారణం మొదలైనవి ఇద్దరికీ ఉన్నాయి. కొన్ని కొన్ని వేడుకలు ఒక కాలంలో ఉన్నా యీ నాడు అంతరించి పోయాయి. వసంతోత్సవం అలాంటి వాటిలో ఒకటి ఇది ఈ నాటికీ కన్నడ దేశంలో ఆచరింపబడుతున్నది. కాముని పండుగ పేరుతో రాయలసీమ జిల్లాలలో, తెలంగాణాలో ఈ పండుగ ఈ నాటికీ ఆచరింపబడుతూ ఉంది. కాని సాగర ప్రాంతంలో వసంతోత్సవం అంతరించి పోయింది. దసరా వేడుకలు 'నాడహబ్బ' అనే పేరుతో మైసూరు దేశమంతటా అత్యంత వైభవంగా జరుగుతాయి. తెలంగాణాలో ఇవి కాక బ్రతుకమ్మ పాటలని, బొడ్డెమ్మ పాటలని ప్రచారంలో ఉన్నాయి. ఇలాంటివి మిగిలిన ప్రాంతాలలో లేవు. ఇలా ఆయా ప్రాంతాలవారి అభిరుచులకు అలవాట్లకు అనుగుణంగా ఎన్నో సంప్రదాయాలు, వేడుకలు ఏర్పడ్డాయి. శృంగార హాస్యకరుణాదులన్నిట్లోకి శృంగారమే అగ్రస్థానం వహిస్తున్నది. తెలుగు కన్నడాలలో కూడా అంతే.

తెలుగు కన్నడ భాషల వారి ఆచారాలు,విశ్వాసాలు,వర్ణవ్యవస్థ, వేషభూషణాలంకారాలలో కొన్ని పోలికలున్నా కొన్ని భేదాలు కూడా చూపట్టుతాయి. కన్నడ గీతాలపై మత ప్రభావం కనిపిస్తుంది. ఏగంటి, పిడుపర్తి మొదలైన వారు రచించిన శైవ గేయాలున్నాయి గాని వాటిని రచించిన వారు శిష్టులు. కన్నడంలో అలాకాక అసంఖ్యాంకమైన జానపద గేయాలపైన శైవమత ప్రభావం కనిపిస్తుంది,

తెలుగులో జానపద గేయాలు కొన్నిట్లో గ్రాంథికభాష ఛాయలు కనిపిస్తాయి. కన్నడంలో ఎక్కువగా; అంటే తెలుగులో కంటె ఎక్కువగా జానపదభాషే ఉపయోగించబడి ఉంది.

తెలుగులో జానపద గేయాలు చాలావరకు ద్విపదలలోనో, రగడలలోనో అంతర్భూతాలవుతాయి. కొన్ని షట్పదులు మొదలైనవి. గుర్తించలేని ఛందస్సులెన్నో కనిపిస్తాయి. కన్నడంలో అత్యధిక సంఖ్యలో గేయాలు త్రిపదులలోనే ఉన్నాయి. త్రిపదినీ రెండు ద్విపదలాగా పాడుతారు. వరుస గూడా కొంత వరకు పోలిక కలిగి ఉంటుంది. ఇవి మానవునికి సహజమైన వరుసలని, మానవుని నోటి గుండా మాటలు వెలువడేటప్పుడు నిసర్గంగా వెలువడేలయ ఆధారంగా సృష్టి అవుతున్నాయని నిశితంగా పరిశీలిస్తే తెలుస్తుంది.

ఈ రెండు భాషలలోని గేయాలను పరిశీలించినప్పుడు ఒక్క విషయం మాత్రం

మన హృదయాలను ఆకర్షిస్తుంది. ఆకర్షించడమే కాదు; కదిలిస్తుంది. జానపదుల హృదయానికి భాషావధులు లేవు. అవి సర్వ మానవ హృదయావిష్కరణ చేసే అత్యుత్తమ గీతాలు. మానవుడికి కలిగే కష్టాలను, సుఖాలను, ఆవేశాలను, క్రోధాలను, అది ఇది అని కాక మనిషి కుండే సర్వభావాలను వ్యక్తం చేసే సహజ సుందర గీతాలివి. మనిషి పొలంలో పని చేసేటప్పుడు, దంచేటప్పుడు, విసరేటప్పుడు హృదయం లోతులలోంచి స్వచ్ఛందంగా వెలువడే భావగీతాలివి. తనకు శక్తిలేదని తెలిసినప్పుడు తనకంటె అతీత శక్తి ఉందని నమ్మి, తన బాధల్ని, సంతోషాల్ని, కష్టాల్ని మించిన ఆవేశాల్ని మానవుడు భగవంతునికి తెలుపుకునేటప్పుడు వెలువడే పారమార్థిక గేయాలివి. జీవితం మీద రోసి, బాధలతో విసిగి, అన్యాయాలకు బాధపడి పరమాత్మ సాయుజ్యం చేరడానికి పాడుకునే వైరాగ్య గేయాలివి. బిడ్డను లాలించేటప్పుడు, ఆట లాడుకునేటప్పుడు, వేడుకలలో, పండుగలలో పాడుకునే పరమోత్కృష్ట గేయాలివి. జీవితంలో అనుభవించే నవరసాల రుచులను నాలుగే చరణాలలో అనుభవింప జేసే నిసర్గమనోహర గేయాలు జానపద గేయాలు. ఇవి మానవునికి సంబంధించినవి. మానవుని చేష్టలకు సంబంధించినవి. మానవుని హృదయాన్నావిష్కరించేవి. అందువల్ల ఈ గేయాలకు భాషలేదు. వాటిలో అవిచ్ఛిన్నంగా, జ్యోతిలా వెలుగొందే మానవరూపం ఒక్కటే అని నిరూపించడమే నా యీ పరిశోధనా వ్యాసానికి ధ్యేయం. ఇలా ప్రపంచంలోని అన్ని భాషల్లోని జానపద గేయాలను పరిశీలించినా, అనంతాకాశమూ, సూర్యచంద్ర నక్షత్రాదులంతా కొలనులో ప్రతిబింబించినట్లుగా సమస్త మానవుల సుఖదుఃఖాలు, అలవాట్లు, ఆచారాలు, విశ్వాసాలు, సమస్త విశ్వమానవ జీవితమూ ఆ పరిశీలనలో మనకు దృగ్గోచరమవుతుంది. అనంతమైన జానపద సంపద భూగర్భంలోనే నశించిపోకుండా వెలికి తీయవలసిన బాధ్యత అందరి మీదా ఉంది. జానపద గేయాలను మాత్రమే కాక కథలు, పొడుపు కథలు, సామెతలు, నమ్మకాలు, కళలకు సంబంధించినవి, జాతీయములు, నానుడులు, కథాగేయాలు మొదలైన అన్నిటినీ సేకరించాలి.

ఇప్పటికే జానపద సంపదను చాలావరకు పోగొట్టుకున్నాము. అశ్రద్ధవల్ల ఈ రసవద్గంగాజలాలను తిరస్కార దృష్టితో నశింప జేస్తున్నాము. పాశ్చాత్య దేశాలలో జానపద విజ్ఞానానికి సంబంధించి ఎంతో పని జరుగుతున్నది. విశ్వవిద్యాలయాలలో, పరిశోధన సంస్థలలో దీనికి మహత్తరమైన స్థానం లభించింది. ఔత్తరాహులు కూడా ఎంతో సేవ చేస్తున్నారు. దక్షిణాదిని మైసూరు విశ్వవిద్యాలయం వారు ఎంతో కృషి





చేస్తున్నారు. జానపద సాహిత్య సమావేశాలను ఏర్పాటు చేయడం, జానపద సాహిత్యమంతటినీ ప్రచురించడం, ధ్వనిముద్రణ (tape record) చేయడం, జానపద వస్తుప్రదర్శన శాలలను ఏర్పాటు చేయడం, విద్యార్థులకు పాఠ్యభాగాలుగా జానపద సాహిత్యాన్ని నిర్ణయించడం మనం చేయవలసిన కొన్ని పనులు. ఇరుగు పొరుగు వారితోబాటే తెలుగు వాళ్ళు కూడా జానపద విజ్ఞానంలో అభిరుచిని పెంపొందించుకొని, దాని కోసం కృషి చేస్తారని ఆశిస్తూ, చేయవలసిందని సవినయంగా అర్థిస్తూ ఈ పరిశోధన వ్యాసాన్ని ముగిస్తున్నాను.

**టిప్పణి**

1.C.M.Bowra, Primitive song, p.241

2.Ibid, p.242

3.E.C.Vol., N.R.35

# పరిశోధన ఫలితాలు 1

తెలుగు-కన్నడ భాషలలో జానపద గేయాల పరిశీలన తర్వాత ఈ రెండు జానపద విజ్ఞాన క్షేత్రాలూ నికట సంబంధం కలవనే విషయం స్పష్టమవుతుంది. ప్రకృత పరిశోధన ఫలితంగా కొన్ని నిర్ణయాలను చేయవచ్చు. వాటిని ఈ క్రింద పొందు పరచడమైంది.

1.జానపద గేయాలకు సంబంధించినంత వరకు తెలుగు కన్నడాలు అత్యంత సన్నిహితమైనవి. ఈ రెండు భాషలు ఒకే మూల భాషకు చెందిన సోదర భాషలు. జానపద గేయాలు సంస్కృతిలో భాగాలు; ఒక ప్రదేశంలోని సంస్కృతి యొక్క అభివ్యక్తులని చెప్పవచ్చు. అందువల్ల నికట సంబంధముండే తెలుగు-కన్నడ జానపద గేయాలు ఒకే 'మూల సంస్కృతి' నుంచి వికాసం పొందినవని చెప్పవచ్చు. జానపద గీతాల ప్రధానాంశాలు కొన్నిటిని తులనాత్మకంగా పరిశీలించినప్పుడు (చూ.పరిశోధన ఫలితాలు 2) ఈ విషయం స్పష్టమవుతుంది.

2.తెలుగులోను, కన్నడంలోను సంఖ్యావిషయంలోగాని, వైవిధ్యం విషయంలోగాని ముందు చెప్పదగినవి పని పాటలు. వీటిలో కూడా ప్రధానంగా పరిశీలింపదగినవి పొలం పాటలు. మనది వ్యవసాయ ప్రధాన దేశం కాబట్టి నేటికీ జానపద గేయాలలో పొలంపాటలదే అగ్రస్థానం. జానపద గేయాలు, కథాగేయాలు-ఈ రెండూ పొలం పాటలలో ఉన్నాయి. గేయాలలో సామాన్యంగా పదినుంచి ఇరవై పాదాలు ఉంటాయి. కన్నడంలో మూడు మూడు పాదాల త్రిపదులకు ఎక్కువ ప్రాధాన్యం ఉంది. తెలుగులో ద్విపదలయ అధికంగా కనిపిస్తే, కన్నడంలో అదే లయను పోలిన త్రిపదులు అధికంగా ఉన్నాయి. తెలుగులోను, కన్నడంలోను చాలా పొలం పాటలలో పల్లవి కనిపిస్తుంది. వీటిలో బాధనుంచి తప్పించుకోడం, ప్రేమ. నమ్మకాలు, సంతోషం మొదలైనవి ముఖ్యమైన భావాంశాలు.

పని పాటలలో ఇతర వృత్తులకు సంబంధించిన వాటిలో పడవ పాటలు, కార్మికుల పాటలు, కూలివారిగీతాలు మొదలైనవి కనిపిస్తాయి. భౌగోళిక పరిస్థితులు జానపదగేయాల అస్తిత్వంలో ప్రధాన పాత్ర వహిస్తాయనడానికి పడవ పాటలు చక్కని ఉదాహరణలు. తెలుగు దేశానికున్నంత తీర ప్రాంతం కన్నడదేశానికి లేదు. అందువల్లనే కన్నడంలో తెలుగులో ఉన్నన్ని పడవ పాటలు లేవు. వృత్తులకు





సంబంధించిన పాటలలో ఎక్కువగా పురుషులకు సంబంధించినవే కనిపిస్తాయి.

తెలుగు-కన్నడ భాషలలో తిరుగలి పాటలకు, రోకటి పాటలకు ప్రత్యేక స్థానం ఉంది. తెలుగు పాటలలో 12 పాదాల నుంచి 50-60 పాదాల వరకు ఈ పాటలున్నాయి. కన్నడంలో 15-20 త్రిపదులు ఉంటాయి. ఈ పాటలలో పల్లవికి అవకాశం తక్కువ. దంపుళ్ళ పాటలలో 'సువ్వి'లాంటి పల్లవులు కనిపించినా 'ఊహుఁ' అంటూ ఊపిరి విడవడమే పల్లవి అని చెప్పవచ్చు.

3.పారమార్థిక గేయాలలో స్తుతులు, కర్మమార్గ సంబంధ గేయాలు, తత్త్వాలు అని మూడు విధాలున్నాయి. తెలుగు స్తుతులలో రామునికి, కన్నడ స్తుతులలో శివునికి, శివశరణులకు హెచ్చు ప్రాధాన్యం ఉందని చెప్పవచ్చు. ఈ పాటలలో నమ్మకాలకు ప్రముఖ స్థానం ఉంది. స్తుతులను స్త్రీ పురుషులు, ఆచరణాత్మక గేయాలను స్త్రీలు, తత్త్వాలను స్త్రీ పురుషులు పాడుతారు.

4.బాంధవ్య గీతాలు సంస్కృతిలోని ప్రధానాంశమైన కుటుంబ జీవనానికి దర్పణాలు. తెలుగు కన్నడ దేశాలలోని కౌటుంబిక బాంధవ్యాలు ఒకే విధమైనవన్న సత్యాన్ని ఇవి నిరూపిస్తాయి. తల్లి-కూతురు, తండ్రి-కూతురు, అన్న-చెల్లెలు, అక్క-తమ్ముడు, వదిన-మరదలు, అత్త-కోడలు మొదలైన బాంధవ్యాలకు సంబంధించిన పాటలు వివాహ సంప్రదాయాలను, కౌటుంబిక జీవనాన్ని తెలియ పరుస్తాయి. ఇవి ఆంధ్ర కర్ణాటకాలలో చాలావరకు ఒకటిగానే ఉన్నాయని చెప్పవచ్చు.

5.తెలుగులో వలెనే లాలులు, జోలలు, ఉయ్యాల పాటలు, శిశు ప్రాసలు, పొడుపు కథలు, ఎగతాళి పాటలు, ఆటపాటలు కన్నడంలోను ఉన్నాయి. లాలి, జోజో మొదలైన పల్లవులు రెండు భాషలలోను కనిపిస్తాయి. మాతృప్రవృత్తి, సంతోషం, ఉత్సుకత, హాస్యం మొదలైనవి ఈ పాటలలోని భావాంశాలు. తెలుగు కన్నడాలలో పిల్లల ఆటలో-వాటికి సంబంధించిన గీతాలలో పోలిక కనిపిస్తుంది. తెనుగు ఆట పాటలు కొన్నిటిలో వైద్యరహస్యాలు ఇమిడి ఉన్నాయి. ఇది కన్నడంలో కనిపించదు.

6.వేడుక పాటలన్నవి ఒక ప్రదేశపు సంస్కృతిని ప్రతిబింబిస్తాయి. వివాహం కూడా ఒక వేడుకే. తెలుగువారి పెళ్ళిలోని ప్రధానాంశాలు కన్నడిగులలోనూ కనిపిస్తాయి. పెళ్ళిపాటలలో బువ్వపు బంతి వంటివి తెలుగువారి ప్రత్యేకత. పండుగలలో కాముని పండుగవంటివి కన్నడ దేశంలోని అన్ని ప్రదేశాలలోను ఇంకా ఉండగా తెలుగు దేశంలో కొన్ని ప్రదేశాలలో మాత్రం కనిపిస్తాయి. భోగిపళ్ళు పోయడం, బొద్దెమ్మ, బ్రతుకమ్మ వంటివి తెలుగువారి సంప్రదాయాలు, సంక్రాంతి, ఉగాది, దీపావళి,

దసరా వగైరాలు ఇద్దరికీ ప్రీతి పాత్రమైనవే.

కోలాటం ఆంధ్ర కర్ణాటకాలలో ముఖ్యమైన జానపద వినోదం. దీనిలో పల్లవికి ప్రాధాన్యం ఉంది. మేళనాయకునికీ ప్రాముఖ్యం ఉంది. వేడుక పాటలన్నవి స్త్రీ పురుషులిద్దరికీ కావలసినవే. కోలాటాల వంటివి కొన్ని నేడు పురుషులకే పరిమితమై ఉన్నాయి.

7. అత్యంత ప్రాచీన సమాజాలలో వలపు పాటలకు ప్రాధాన్యం లేదు గాని, నేటి సంస్కృతులకు సంబంధించిన జానపద గేయాలలో వలపు పాటలు అత్యధికంగా కనిపిస్తాయి. వలపు పాటలన్నవి ప్రత్యేకంగా లేవు. పని పాటలు, వేడుక పాటలు మొదలైన వాటిలోనే ప్రేమ ప్రాధాన్యం వహిస్తే వాటినే వలపు పాటలనవచ్చు. వీటిలో స్త్రీ పరమైనవి, సంవాదాలు అన్న మూడు విభాగాలు ప్రధానంగా కనిపిస్తాయి తెలుగులో పని పాటలు మొదలైనవి ఎక్కువగా వలపు పాటలే. కాని కన్నడంలో పని పాటలలోను పరమార్థ చింతన కనిపిస్తుంది. అందువల్ల తెలుగుకంటె కన్నడంలో వలపు పాటలు తక్కువగా ఉన్నట్లు అనిపిస్తుంది. కన్నడ జానపద గేయాలలో ఉన్నంత మత ప్రభావం తెలుగులో కనిపించదు.

8. హాస్య గీతాలలో ఎగతాళిగా పాడే పాటలు, వినోద ప్రధానంగా ఉండే పాటలేతప్ప అధిక్షేపగుణం ఉండే ఉత్తమ గీతాలు అరుదు. వియ్యపురాలి పాటలవంటి కొన్నిసార్లు శ్రుతిమించి తిట్టు కవిత్వంగా మారడం కూడా అనుభవ వేద్యమే ఇట్టివే కన్నడంలో జరియువ పదగళు అనే పేరుతో చలామణీ అవుతున్నాయి.

అప్పగింత పాటలు, వీరులను గూర్చిన శోక గీతాలు, మరణ గేయాలు కన్నీటి పాటలకింద చెప్పదగినవి స్త్రీ పురుషులిరువురూ పాడే ఈ గేయాలలో మాతృప్రవృత్తి, కలవరపాటు, భయం, శోకం ప్రధాన భావాంశాలు.

9. జానపద గేయాలలో వ్యక్తమైన సంస్కృతిని పరిశీలించినప్పుడు తెలుగువారికి కన్నడిగులకు ఉన్న దగ్గరి సంబంధం అర్థమవుతుంది. కూతుర్ని అత్తవారింటికి పంపే సంప్రదాయం, పుట్టింటిమీద స్త్రీకి ఉండే మమకారం, అన్నాచెల్లెళ్ళ అనుబంధం, తమ్ముణ్ణి అల్లుడిగా చేసుకోవాలనే ఆకాంక్ష, బావామరదళ్ళ సరసాలు-చివరిగా అత్తాకోడళ్ళ చేదు సంబంధం ఇవన్నీ తెలుగువారికి కన్నడిగులకూ చిరపరిచితాలు. జానపద గేయాల్లో గోచరమయ్యే నమ్మకాలు, ఆచారాలు, సంప్రదాయాలు, ఉల్లేఖింపబడి ఉండే ఆభరణాలు, ఆటలు, వస్త్రాలంకరణలు మొదలైనవన్నీ ఒక ప్రత్యేక సంస్కృతిని అద్దం పట్టి చూపుతాయి. పై విషయాలను తులనాత్మకంగా పరిశీలించినప్పుడు కూడా





తెలుగు సంస్కృతికి, కన్నడ సంస్కృతికి దగ్గరి సంబంధం కనిపిస్తుంది.

10. మొత్తం మీద, తెలుగు-కన్నడ జానపద గేయాల పరిశీలన వల్ల ఈ భాషలమధ్య ఉండే సన్నిహిత సంబంధాన్ని మరింతగా అర్థంచేసుకునేందుకు వీలవుతుంది. అయితే ఇందులో కొన్ని చిక్కులున్నాయి. ఇప్పటి వరకు సేకరింపబడిన గేయాలకన్నా గుప్తంగా ఉండే గేయరత్నాలే అధికం. సమగ్రంగా గేయాలన్నీ సేకరింపబడితేగాని వాటి సంపూర్ణ స్వరూపాన్ని నిర్ణయించడం సాధ్యం కాదు. అది ఒక్కరివల్ల నెరవేరే కార్యం కాదు. అనేక పరిశోధకుల కృషి ఫలితంగా సమగ్రతులనాత్మక అధ్యయనం జరగగలదని, తద్వారా ఇరుగు పొరుగు భాషలలోని జానపద సాహిత్య సంపదతో మనకున్న దగ్గరి సంబంధాన్ని గూర్చిన సంపూర్ణావగాహన ఏర్పడగలదని ఆశిద్దాం.

## పరిశోధన ఫలితాలు 2

జానపద విజ్ఞాన అధ్యయనం నేడు శాస్త్రీయంగా, ఆధునిక కాలానికి తగినట్లు బహుముఖంగా సాగుతున్నది. ఇటీవలి కాలంలో ఈ క్షేత్రంలో జరుగుతున్న అధ్యయనంలోని కొత్త పద్ధతుల పరిచయం కొంతవరకు 'ప్రవేశిక'లో చేయడం జరిగింది.

జానపద విజ్ఞానాన్ని అధ్యయనం చేసేటప్పుడు మొట్టమొదట ఎదురయ్యే సమస్య వర్గీకరణం. ఏ అధ్యయనానికైనా సేకరణ తర్వాత చేయదగింది విషయ విభజన. ప్రస్తుత పరిశోధన గ్రంథంలో విషయ వివరణ కోసం స్థూలవిభజన చేసినా ఆధునిక అధ్యయన పద్ధతులను దృష్టిలో ఉంచుకొని చూచినపుడు పనిపాటలు, పారమార్థిక గేయాలు ఇత్యాదిగా చేసిన విభజన చాలదన్నది స్పష్టమవుతుంది. జానపద గేయాలలో కనిపించే భావాంశాలను దృష్టిలో ఉంచుకొని, ఆధునిక భాషాశాస్త్రంలోని వర్ణ విభజనలాంటి వర్గీకరణాన్ని కూడా సూచించడం జరిగింది. కాని ఈనాడు జానపద విజ్ఞాన అధ్యయనం కంప్యూటరువంటి ఆధునిక ఉపకరణాలను ఉపయోగించుకునేంతవరకు ఎదిగింది. జానపద విజ్ఞానాన్ని అత్యంత శాస్త్రీయంగా వర్గీకరించిన ఆర్.ఎస్. బాగ్స్ మొదలైనవారు ఇలాంటి నూతన అధ్యయన విధానాలను దృష్టిలో ఉంచుకున్నారు.

కంప్యూటర్ వంటి ఆధునిక యంత్రాలను జానపద సాహిత్య ప్రక్రియల

పరిశీలనకు ఉపయోగించుకునేటప్పుడు మొదట సహజ భాషను సంకేతాత్మక భాషకు మార్చుకోవలసి ఉంటుంది. ప్రతి జానపద గేయ రూపానికీ ఒక సంకేతాన్ని ఏర్పరచవలసి ఉంటుంది. జానపద విజ్ఞానంలోని వివిధ శాఖలకు బాగ్స్ సంఖ్యలనేర్పరచినట్లే. జానపద గేయరూపాలను అకారాదిగా కూర్చి ఒక్కొక్క దానికీ ఒక్కొక్క సంఖ్యను సంకేతంగా నిర్ణయించవచ్చు.

జానపద గేయరూపాలకు సంకేతాలను నిర్ణయించిన తర్వాత ఈ పాటలలో కనిపించే ముఖ్యమైన వైదృశ్యాత్మక గుణాలను (distinctive features) పట్టీచేసి వాటి అస్తిత్వాన్ని (presence) లేక అభావాన్ని (absence) '+' '–' అనే గుర్తులతో సూచించవచ్చు. ఉదాహరణకు పురుషులు పాడే పాటలయితే '+' గుర్తుతో, స్త్రీలు పాడే పాటలయితే '–' గుర్తుతో సూచించవచ్చు. ఒక వేళ ఉభయులూ పాడేట్లయితే '0' గుర్తును వాడవచ్చు. ఈ విధమైన సంకేతాలను ఏర్పరచుకున్న తర్వాత కంప్యూటర్ సహాయంతో జానపద గేయాలకు సంబంధించిన అనేక విషయాలను అధ్యయనం చేయవచ్చు. ముఖ్యంగా తులనాత్మక అధ్యయనంలో కంప్యూటర్ సహాయంతో చేయదగిన గణాంక విశ్లేషణ (statistical analysis) చాలా సహాయకారి అవుతుంది.

ప్రస్తుత పరిశీలనలో గమనించిన తెలుగు-కన్నడ జానపద గేయాలలో ముఖ్యమైన గుణాలను ఈ క్రింద పట్టీ చేయడం జరిగింది. జానపద గేయాల గానానికి ఏదైనా సందర్భం (context) ఉన్నాదా లేదా అన్నది మొదటి గుణంగా తీసుకోడం జరిగింది. అలాగే నృత్యం లేని అభినయం (enactment) ఉన్నాదా లేదా, గాయకులు పురుషులా, స్త్రీలా అన్నవి తీసుకోడం జరిగింది. ఆ గేయాన్ని ఒక వ్యక్తి పాడుతాడా లేదా అన్న విషయం కూడా పరిశీలించడం జరిగింది. తెలుగు జానపద గేయాల కిందనే తులనాత్మక పరిశీలనకు వీలయ్యే విధంగా వాటితో పోల్చదగిన కన్నడ గేయాలను ఇవ్వడం జరిగింది. ఇదే పద్ధతిని అనుసరించి, కొన్ని మార్పులతో కంప్యూటర్ సహాయంతో అనేక విషయాలను అధ్యయనం చెయ్యడం సుగమమవుతుంది.





# తెలుగు-కన్నడ జానపద గేయాలు తులనాత్మక పరిశీలన

సంకేతాలు : సం=సందర్భం; గా=గాయకులు (+పురుషులు,-స్త్రీలు, 0 ఉభయులూ); సా=సామూహికం; వా=వాద్యాలు; అ=అభినయం లేక నృత్యం, తెలుగు గేయాల కిందనే కన్నడంలోని సమాన ధర్మాలుగల గేయాలను ఇచ్చాను. ఎక్కడైనా గుణభేదం ఉన్నప్పుడు మాత్రమే దాన్ని '+' తో గాని; '–' తోగాని సూచించడమైంది. లేకుంటే తెలుగు-కన్నడ గేయాలు రెండూ పూర్తిగా ఒకే విధమైన గుణాలను కలిగి ఉన్నాయని అర్థం చేసుకోవాలి. తెలుగులో మృగ్యములై కన్నడంలో కనిపించే గేయాలను, తెలుగు గేయాల పట్టిక పూర్తి అయిన తర్వాత ఇచ్చాను. ఈ పరిశీలనవల్ల తెలిసివచ్చిన కొన్ని విశేషాలను పట్టిక అయిన తర్వాత పొందు పరచడమైంది.

| గేయరూపం | సం | గా | సా | వా | అ |
|---|---|---|---|---|---|
| 1. అప్పగింత పాటలు | | | | | |
| కూనన్ను ఒప్పిసువ హాడు | + | – | + | – | – |
| 2. అవి రేణుల పాటలు | | | | | |
| .......................... | + | – | + | – | – |
| 3. ఆటపాటలు | | | | | |
| ఆటద హాడు | + | 0 | + | – | + |
| 4. ఉయ్యాలపాటలు | | | | | |
| ఉయ్యాలె హాడు | + | – | + | – | – |
| 5. ఏతాం పాటలు | | | | | |
| ఏతద హాడు | + | + | – | – | – |
| 6. ఏరువాక పాటలు | + | + | + | – | – |
| ..................... | | | | | |
| 7. కపిల పదాలు | + | + | – | – | – |
| ........................ | | | | | |
| 8. కలుపు పాటలు | + | – | + | – | – |
| కళె కీళువ పదగళు | | | | | |

| | | | | | |
|---|---|---|---|---|---|
| 9.కార్మిక గేయాలు | + | + | + | – | – |
| కార్మిక గీతె | | | | | |
| 10.కోత పాటలు | + | – | + | – | – |
| కొయ్లు హాడు | | | | | |
| 11.కోలాటాల కోపులు | – | + | + | + | + |
| కోలాటద పద | | | | | |
| 12.గొబ్బిపదాలు | + | – | + | – | + |
| .................. | | | | | |
| 13.చందమామ పదాలు | – | 0 | + | – | – |
| తింగళుమావన పద | | | | | |
| 14.చెట్లు కొట్టు పాటలు | + | + | + | – | – |
| మరకడియువ హాడు | | | | | |
| 15.జట్టిజాము పాటలు | + | – | + | – | + |
| ...................... | | | | | |
| 16.జాజర పాటలు | – | – | + | – | – |
| .................... | | | | | |
| 17.తత్వాలు | – | 0 | 0 | + | – |
| తత్వద పదగళు | | | | | |
| 18.తలపుదగ్గర పాటలు | + | – | + | – | – |
| బాగిలు తడెయువ హాడు | | | | | |
| 19.తిరుగలి పాటలు | | | | | |
| (విసరురాయి) | + | – | – | – | – |
| బీసువ కల్లిన హాడు | | | | | |
| 20.దసరా పద్యాలు | + | 0 | + | – | – |
| దశరా పదగళు | | | | | |
| 21.నాగుల చవితి గీతాలు | + | – | – | – | – |
| నాగర చౌతి పద | | | | | |
| 22.నాట్ల పాటలు | + | – | + | – | – |
| నాటి పదగళు | | | | | |





| | | | | | |
|---|---|---|---|---|---|
| 23.నీళ్ళు కట్టు పాటలు | + | + | + | – | – |
| ........................ | | | | | |
| 24.నోముల పాటలు | + | – | + | – | – |
| నోంపియ హాడు | | | | | |
| 25.పడవ పాటలు | + | + | + | – | – |
| దోణియ హాడు | | | | | |
| 26.పార పదాలు | + | + | + | – | – |
| .................. | | | | | |
| 27.పొలి పదాలు | + | + | + | – | – |
| హొలిపదగళు | | | | | |
| 28.బండి పదాలు | + | + | + | – | – |
| బండి పదగళు | | | | | |
| 29.బంతి పాటలు | + | + | + | – | – |
| హంతియ పదగళు | | | | | |
| 30.బుడబుక్కల వాళ్ళ పాటలు | – | + | – | + | – |
| బుడుబుడుకె (పాటలు లేవు) | | | | | |
| 31.బువ్వపు బంతి | + | – | + | – | – |
| బువ్వద హాడు | | | | | |
| 32.బ్రతుకమ్మ పాటలు | + | – | + | – | + |
| .................... | | | | | |
| 33.భజనలు | – | 0 | + | – | + |
| భజనెగళు | | | | | |
| 34.మరణ గీతాలు | – | + | – | + | – |
| మరణ గీతె | | | | | |
| 35.మేలు కొలుపులు | – | – | – | – | – |
| ప్రభాత పద | | | | | |
| 36.మొహరం గీతాలు | + | 0 | + | – | – |
| కర్బలా పదగళు | | | | | |
| 37.రజక గీతాలు | + | + | + | – | – |
| రజకర గీతె | | | | | |

| | | | | | |
|---|---|---|---|---|---|
| 38.రాళ్ళు కొట్టే పాటలు | + | + | + | – | – |
| కల్లు హొడెయువ పద | | | | | |
| 39.రోకటి పాటలు | | | | | |
| (దంపుడు పాటలు) | + | – | – | – | – |
| ఒనకెయ హాడు (కుట్టువ పద) | | | | | |
| 40.లాలి–జోల | + | – | – | – | – |
| లాలి–జోగుళ | | | | | |
| 41.వరస పాటలు | + | – | + | – | – |
| బాంధవ్య గీతె | | | | | |
| 42.వాన దేవుని పాటలు | + | + | + | – | – |
| మళెరాయన హాడు | | | | | |
| 43.వియ్యపురాలి పాటలు | + | – | + | – | – |
| బీగతియర పద (జరియువ పద) | | | | | |
| 44.శిశుప్రాసలు | – | 0 | + | – | – |
| శిశు ప్రాసగళు | | | | | |
| 45.సమర్త పాటలు | + | – | + | – | – |
| ఒసగెయ పద | | | | | |
| 46.స్తుతులు | – | 0 | 0 | – | – |
| స్తుతి పదగళు | | | | | |
| 47.హారతులు | + | – | + | – | – |
| ఆరతి హాడు | | | | | |
| 48.హొళి పాటలు | + | 0 | + | – | – |
| హొళి పదగళు | | | | | |
| 49.అంటికె పంటికె పద | + | + | + | – | – |
| 50.ఆసాది కుణితద పద | + | + | + | + | + |
| 51.కంబియ హాడు | + | + | + | + | + |
| 52.కొంతి పద | + | – | – | – | – |
| 53.గణె పద | + | + | + | + | – |
| 54.గీగీ పదగళు | – | + | + | + | – |





| | | | | | |
|---|---|---|---|---|---|
| 55.గుర్చిహాడు | + | 0 | + | – | – |
| 56.జోకుమారన పద | + | – | + | – | – |
| 57.బాళొపాట్ హాడు | + | + | + | + | – |
| 58.బింగి పదగళు | + | + | + | + | – |
| 59.బిల్లాట్ పద | + | + | + | + | + |
| 60.మానవమి పద | + | + | + | – | – |
| 61.సోమన కుణితద పద | + | + | + | + | + |
| 62.సోలిగర కుణితద పద | + | + | + | + | + |

పై పట్టిక సమగ్రంకాదు. భావి పరిశీలనలకు ఇది ఒక పూర్వరూపం మాత్రమే. వెలుగులోకి రావలసిన గేయాలన్నీ సేకరింపబడినప్పుడు, ఈ పద్ధతిద్వారా గణాంక విశ్లేషణ చేసినప్పుడు కొన్ని సిద్ధాంతాలు చేయడానికి వీలవుతుంది. పరిమితమైన పై పట్టిక వల్ల తెలియవచ్చే కొన్ని విశేషాలు ఈ క్రింది విధంగా ఉన్నాయి.

తెలుగు–కన్నడాలలోని గేయరూపాలను పరిశీలించినప్పుడు కనీసం ఐదు ముఖ్యగుణాల విషయంలోనైనా అవి ఒకే రకంగా ఉంటాయని తేలింది. తెలుగు–కన్నడాలలో సమానంగా ఉండే 36 గేయరూపాలలో 2–3 తప్ప మిగిలినవన్నీ సమాన ధర్మాలు కలవే. అయితే ఇంకా ఎక్కువగా గేయ గుణాలను పరిశీలిస్తే గాని దీన్ని ఖచ్చితంగా చెప్పడం కష్టం. పల్లవి, పాటల నిడివి, పాడే సమయం, ధార్మికమా లౌకికమా ఇత్యాదులనూ పరిశీలించాలి. అయితే వివరాలన్నీ సమగ్రంగా లభించకపోవడం వల్ల ఈ అన్ని గుణాలనూ పరిశీలించడం సాధ్యంకాలేదు.

తెలుగు–కన్నడ గేయాల లక్షణాలలో కొన్నిటిని ఈ క్రింది విధంగా చెప్పవచ్చు.

1. తెలుగు–కన్నడ జానపద గేయాలలో చాలావరకు సాందర్భికాలు (contextual). మొత్తం పరిశీలించిన 100 గేయాలలో (తెలుగు–కన్నడ గేయాలుకలిపి, 20 మాత్రమే సందర్భంతో నిమిత్తం లేకుండా పాడబడేవి.)

2. గాయకులలో స్త్రీ పురుషులది ఇంచుమించుగా సమాన భాగస్వామ్యం. ఇద్దరూ గాయకులుగా ఉండే పాటలు తక్కువ. అంటే ఏపాట నైనా స్త్రీలో పురుషులో ఎవరోఒకరే పాడడం ఎక్కువగా కనిపిస్తుంది.

3. గేయాలు చాలావరకు సామూహికాలే (group songs) 100 గేయాలలో సుమారు 80 గేయాలు ఇలాంటివే. ఇందువల్ల పాట పుట్టుక సామూహికంగా జరిగిందనే

వాదానికి పుష్టి లభిస్తుంది.

4. జానపద వాద్యాల వాడుక గీతాల విషయంలో చాలా తక్కువనే చెప్పాలి. సుమారు 20 శాతం గీతాలను పాడేటప్పుడు మాత్రమే వాద్యాలను ఉపయోగిస్తారు.

5. జానపద గేయాలను పాడేటప్పుడు నృత్యంగాని, అభినయంగాని తక్కువనే చెప్పాలి. మొదట నృత్యం నుంచే వికాసం పొందిన జానపద గేయాలు, మానవ సంస్కృతి పరిణామం చెందే కొద్దీ నృత్యాభినయాలను వదిలించుకున్నాయని చెప్తే తప్పులేదు. పల్లవిని గురించి కూడా ఇదే మాట చెప్పవచ్చు. ఒకానొకప్పుడు గేయాలలో ముఖ్యంగా ఉండిన పల్లవి నేడు సగానికి సగం పాటలలో కనిపించదు. పదవ పాటలవంటివి మాత్రం అపవాదాలు.

మొత్తం మీద ఈ పరిశీలనవల్ల తేలిందేమిటంటే తెలుగు-కన్నడాలలోని జానపద గేయాలు చాలావరకు సమాన ధర్మాలు కలవని, తెలుగులో కనిపించక కన్నడంలో మాత్రం ప్రత్యేకంగా ఉండే గేయాలు మిగిలిన పాటలకంటె భిన్నంగా ఉన్నాయని పరిశీలన వల్ల తెలుస్తుంది.





# గ్రంథ సూచి


1. ఆంధ్రుల చరిత్ర-సంస్కృతి, ఖండవల్లి లక్ష్మీరంజనం, బాలేందు శేఖరం, 1966
2. ఆధునికాంధ్ర కవిత్వము-సంప్రదాయములు, ప్రయోగములు, సి.నారాయణరెడ్డి, 1967
3. ఆలిచిప్పలు-ఆణిముత్యాలు, ఆర్వీయస్.సుందరం, జి.అశ్వత్థనారాయణ, టి.వి.సుబ్బారావు (సం.),1972
4. కనకవల్లి పాటలు, ఎన్.వి.గోపాల్ అండ్ కో.,1967
5. కావ్యాలంకార సంగ్రహము-వివరణ, సన్నిధానం సూర్యనారాయణ శాస్త్రి (4వ ముద్రణ)
6. గోవిందుని పాటలు, ఎన్.వి.గోపాల్ అండ్ కో., 1967
7. ఘుమఘుమా పాటలు, అదే, 1969
8. చల్‌మోహన రంగ పాటలు, అదే, 1949
9. జానపద కళా సంపద, టి.దొణప్ప, 1975
10. జానపద గేయ వాఙ్మయ పరిచయము, హరిఆదిశేషువు, 1954
11. జానపద గేయ వాఙ్మయ వ్యాసావళి, నేదునూరి గంగాధరం, 1961
12. జానపద సాహిత్య స్వరూపం, ఆర్వీయస్.సుందరం, 1976
13. తెలంగాణా పల్లెపాటలు, బి.రామరాజు, 1968
14. తెలుగు ఛందో వికాసము, కోవెల సంపత్కుమారాచార్య, 1962
15. తెలుగు జానపద గేయ సాహిత్యము, బి.రామరాజు, 1958
16. తెలుగు పల్లెపాటలు, ప్రయాగ నరసింహశాస్త్రి
17. తెలుగు భాషలో ఛందోరీతులు, రావూరి దొరసామిశర్మ, 1962
18. తెలుగు సాహిత్యములో దేశికవిత, ఆర్వీయస్.సుందరం, 1970
19. తెలుగులో కొత్త వెలుగులు (మొదటి సంపుటి), టి.దొణప్ప, 1972
20. త్రివేణి, ఆంధ్ర ప్రదేశ్ సంగీతనాటక అకాడెమీ, 1960
21. దక్షిణ దేశభాషా సారస్వతములు దేశి, కోరాడ రామకృష్ణయ్య, 1954
22. దర్శనములు-మతములు(ద్వితీయ సంపుటం), ఆచంట లక్ష్మీపతి, 1947
23. నూతన కలికాల పాటలు, ఎన్.వి.గోపాల్ అండ్ కో., 1961

24.పల్లెపదాలు, 'కృష్ణశ్రీ' (సం.), ఆంధ్ర సారస్వత పరిషత్తు
25.పాండురంగ భజన కీర్తనలు, ఎన్.వి.గోపాల్ అండ్ కో., 1962
26.పాటలలో ఛందస్సు, పి.రాజగోపాల నాయుడు, 1971
27.ప్రపంచ చిత్రములు, ఎన్.వి.గోపాల్ అండ్ కో., 1964
28.భగవన్నామ సంకీర్తనలు, అదే, 1961
29.భరతరస ప్రకరణము, వావిళ్ళ ప్రచురణలు, 1932
30.మన హాస్యము, మునిమాణిక్యం నరసింహారావు, 1968
31.మాండలిక పదకోశము, ఆంధ్ర ప్రదేశ్ సాహిత్య అకాడెమీ
32.వచన కాలజ్ఞానము, ఎన్.వి.గోపాల్ అండ్ కో., 1956
33.విజ్ఞాన సర్వస్వము, తెలుగు భాషా సమితి
34.విశ్వమీమాంస, వాసిష్ఠ గణపతి ముని, 1960
35.సరాగాలు, ఎల్లోరా (సం.),1961
36.సారస్వత వ్యాసములు (2), పరిష్కర్త, పురిపండా అప్పలస్వామి, ఆం.ప్ర.సాహిత్య అకాడెమి, 1969
37.సాహిత్య శిల్ప సమీక్ష, పింగళి లక్ష్మీకాంతం
38.సాహిత్య సమితి వ్యాసావళి (సం.), తిరుపతి
39.స్త్రీల పాటలు, ఎన్.వి.గోపాల్ అండ్ కో., 1970

**కన్నడం**

40.అది చుంచన గిరి, క.రా.కృష్ణస్వామి (సం.)
41.ఉత్తర దేశద హుబ్బళ్ళి ధారవాడ తత్త్వగళు, 1968
42.ఋగ్వేద సూక్తగళు, కావ్యాలయ, మైసూరు, 1970
43.ఏళు కొళ్ళద ఎల్లమ్మ, మతిఘట్ట కృష్ణమూర్తి, 1965
44.ఐదు శుక్రవారద హాడు, 1969
45.కర్ణాటక జనపద సాహిత్య, మాస్తి వేంకటేశ్వర అయ్యంగార్
46.కన్నడ ఛందస్సిన పరిచయ, కె.శివరామ ఐతాళ, 1971
47.కన్నడ జనపద గీతెగళు, బి.ఎస్.గద్దగిమఠ, 1965
48.కన్నడ సాహిత్యదల్లి హాస్య, ఎం.ఎస్.సుంకాపుర, 1965
49.కలియుగద కాల జ్ఞానపు, 1970
50.కావ్యాస్వాదన, డి.లింగయ్య, 1969





51.కోలు పదగళు, ఎం.సి.వసంతకుమార్ (సం.), 1970
52.కోలు మల్లిగె కోలె, క.రా.కృ. (సం.)
53.గరతియ హాడు, సాహిత్య భండార, హుబ్బళ్ళి, 1931
54.గిరికాణె మూడలగిరి, క.రా.కృ.(సం.)
55.చుంచనగిరి, 1971
56.జనపద గీతెగళు, కరీంఖాన్, (సం.), 1965
57.జనప్రియ జనపద గీతె, 1960
58.జనపద హాస్యలహరి, క.రా.కృ.(సం.)
59.జనపద సాహిత్య సమీక్షె, జీ.శం.పరమశివయ్య
60.జానపద గీతెగళు, కె.శివరామ కారంత, 1971
61.జానపద గీతగళు, ఎం.జీవన
62.జానపద ప్రతిభె, సి.పి.కృష్ణకుమార్, 1969
63.జానపద ప్రేమగీతగళు, క.రా.కృ.(సం.), 1965
64.జానపద స్వరూప, హా.మా.నాయక, 1971
65.జేనహనిగళు, క.రా.కృ (సం.), 1965
66.జోగుళ పదగళు, 1969
67.తుంబే హూవిట్టు శరణెన్ని, కె.నారాయణ, వి.ఎన్.లక్ష్మీనారాయణ, 1969
68.నమ్మ ఒగటుగళు, రా.గౌ.(సం.), 1970
69.నమ్మ జనపద సాహిత్య, జీ.శం.ప.,1967
70.నాడ పదగళు, మతిఘట్ట కృష్ణమూర్తి
71.నాడ మేలెల్ల హరిదాళె, క.రా.కృ.(సం.)
72.నాడు హాడుగళు, క.రా.కృ.(సం.)
73.బళ్ళారి తత్త్వగళు, సిద్దేగౌడ (సం.),1970
74.మల్లిగె దండె, రేవప్ప, (సం.),1948
75.మల్లిగె నగుతావె, క.రా.కృ.(సం.),1965
76.మాస్తియవర పుస్తకగళు, 3 సంపు.
77.శ్రావణ సంపత్ శనివారద హాడు, 1969
78.సంపిగె అరళావె, క.రా.కృ. (సం.)
79.సంపీగె అరళీవె, మహదేవ నాయక్ (సం.), 1961

80. సంస్కృతి, డి.వి.జి.కావ్యాలయ, మైసూరు
81. హంతీ హాడుగళు, సాలిమఠ (సం.), 1969
82. హళ్ళియ బాళు, గొరూరు రామస్వామి అయ్యంగార్
83. హళ్ళియ హాడుగళు, గొరూరు రామస్వామి అయ్యంగార్, 1973
84. హళ్ళియ హాడుగళు, అరుణోదయ ప్రకాశన, బెంగళూరు
85. హెణ్ణు కొట్టేవు, క.రా.కృ.
86. హెణ్ణు మక్కళ పదగళు, తీ.నం.శ్రీకంఠయ్య
87. హెణ్ణు మక్కళ హాడుగళు, కె.ఎస్.దేవనూర
88. హొన్న బిత్తేవు హొలకెల్ల, సాహిత్య సమితి, తరీకెరె, 1967
89. హొలమనియ పదగళు, 1970

**English**

90. A Folklore Reader, Kenneth and Mary clarke (ed.),1966
91. Folklore and Folk life, Richard M.Dorson (ed.),1972
92. Introducing Folklore, Kenneth & Mary clarke (ed.), 1963
93. Marxism and Poetry, George Thomson, People's Publishing house.
94.Primitive song, C.M.Bowra, 1962
95.Standard Dictionary of Folklore Mythology and Legend, Maria Leach (ed.), 1975
96.The Human Body, C.H.Best, N.B.Taylor
97.The Lyric Impulse, C.Day Lewis, 1965
98.The Popular Ballad, Francis B.Gummere, 1907
99.The Study of Folklore, Alan Dundes (ed.), 1965

**పత్రికలు మొదలైనవి :**

తెలుగు : ఆంధ్ర పత్రిక (సంవత్సరాది సంచికలు), ఆంధ్ర ప్రదేశ్, ఆంధ్రజ్యోతి (వార పత్రిక), కిన్నెర ,భారతి, ప్రాచ్యలిఖిత భాండాగారం, మద్రాసు వ్రాత పత్రులు మొ॥వి.

కన్నడం : కన్నడ సాహిత్య పరిషత్పత్రికలు, జానపద (అర్ధవార్షికం), ప్రబుద్ధ కర్ణాటక, పుస్తక ప్రపంచ.

English : Modern Review, Folklore Journal, The Illustrated Weekly of India.





# పారిభాషిక పదాలు

| | |
|---|---|
| అంశాలు | - units |
| అనాగరకస్థితి | - barbarism |
| అనేకోత్పత్తి వాదం | - polygenesis |
| అరణ్య జీవనస్థితి | - savagery |
| ఆచరణాత్మక సిద్ధాంతం | - ritualistic theory |
| ఆట పాటలు (క్రీడా గేయాలు) | - game songs |
| ఉయ్యాల పాటలు | - cradle songs |
| ఏకోత్పత్తి వాదం | - monogenesis |
| ఐతిహ్యం | - legend |
| కథ | - tale |
| కథనం | - narration |
| కథాగేయం | - narrative songs |
| కన్నీటి పాటలు | - sarrowful songs |
| కార్మిక గేయాలు | - labour songs |
| క్రియ | - action |
| గీత నాయకుడు | - song leader |
| చారిత్రకపునర్నిర్మాణ సిద్ధాంతం | - historical reconstructional theory |
| చారిత్రక భౌగోళిక సిద్ధాంతం | - historical geographical theory |
| జానపద కవిత్వం | - folk poetry |
| జానపద గేయం | - folk songs |
| జానపద జీవనం | - folk life |
| జానపద విజ్ఞానం | - folklore |
| జానపద విజ్ఞాని | - folklorist |
| జానపద సంగీతం | - folk music |
| జానపద సంస్కృతి | - folk culture |
| జానపదులు | - folk |

తిరుగలి (విసరురాయి) పాటలు– grinding songs
దంపుడు (రోకటి) పాటలు – pounding songs
నాగరక స్థితి – civilization
నిర్మాణ విశ్లేషణ – structural analysis
నివేదకుడు – informant
నిషిద్ధాలు – taboos
నృత్యం – dance
పడవ పాట – boat song
పని పాట – work song
పల్లవి – refrain
పాత పాట – primitive song
పారమార్థిక గేయం – sacred song
పిల్లల పాటలు – children's song
పునర్నిర్మాణం – reconctruction
పురాణం – myth
పెళ్ళిపాటలు – marriage songs
పొడుపు కథ – riddle
ప్రజ్ఞాహీన స్థితి – unconscious state
ప్రవృత్తులు – motives
ప్రసారం – transmission
బహుప్రదేశ అస్తిత్వం – multiple existence
బాంధవ్య గీతాలు – songs of kinship
భక్తి గేయాలు – devotinal songs
భావాంశం – psycheme
భావావేశం – emotion
మనోవిశ్లేషణ – psycho-analysis
మాదిరి – type
మానవ శాస్త్రం – anthropology
మానవాతీతం – supernatural





మూలాంశం – motif
మౌఖికం – oral
మౌఖిక సంప్రదాయం – oral tradition
రజక గీతాలు – songs of washermen
లాలి – lullaby
లౌకిక గీతాలు – secular songs
వలపు పాటలు – love songs
వాగ్రూపం – verbal
వివేక రాహిత్యం – irrationatity
వీరగాథ – ballad
వేటపాటలు – hunting songs
వేడుక పాటలు – festive songs
వ్యక్త్యతీతం – impersonal
వ్యాపక గుణం – diffusion
శిశుప్రాసలు – children's rhymes
సామూహిక పునఃసృష్టి – commural recreation
సుప్తప్రజ్ఞ – sub-conscions
స్వర సంయోజనం – modulation of voice
హాస్య గీతాలు – humourous songs

***